# సరళీకరణ విధ్వంసం



**కె. బాలగోపాల్**

‘సోషలిజానికీ, కార్మిక రాజ్యానికీ సంబంధించిన ఆశతో
మొదలయిన ఇరవయ్యవ శతాబ్దం కార్మిక వర్గాన్ని
కాంట్రాక్ట్ వ్యవస్థ తాలూకు అభద్రతలో సంపూర్ణంగా
ముంచే పరిణామంతో ముగియడం బాధాకరం.’

# సరళీకరణ - విధ్వంసం



**కె. బాలగోపాల్**

**మానవహక్కుల వేదిక ప్రచురణ**

# సరళీకరణ - విధ్వంసం


మానవహక్కుల వేదిక ప్రచురణ

**Human Rights Forum Publication**

ప్రచురణ సంఖ్య: 40

ప్రచురణ కాలం : సెప్టెంబర్ 2017

కాపీలు : 1000

వెల : 120 రూపాయలు

కవర్ : అనంతు

**ముద్రణ :**
అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ,
126 శాంతినగర్, హైదరాబాద్ - 28
ఫోన్ : 23391364, 233041941
Email: anupamaprinters@yahoo.co.in

**ప్రతులకు:**

ఎస్. జీవన్ కుమార్
ఫోన్: 040-27039519, సెల్ : 9848986286
Email: kumjeevan@gmail.com

వి. వసంతలక్ష్మి
ఫోన్ : 040-23537969
Email: vasantha.aj@gmail.com

**నవోదయ, నవ తెలంగాణ, ప్రజాశక్తి బుక్‌హౌస్‌లు**

మా వెబ్‌సైట్: www.humanrightsforum.org

బాలగోపాల్ రచనల కోసం : www.balagopal.org

# మా మాట

'విధ్వంసం' సిరీస్‌లో ఇది మూడవది. మరో రెండు రావాల్సి ఉన్నాయి. మొదటిది 'అభివృద్ధి – విధ్వంసం' (2015), రెండోది 'విస్థాపన – విధ్వంసం' (2016), మూడోది ఇప్పుడు మీ చేతిలో ఉన్న 'సరళీకరణ – విధ్వంసం'.

రాష్ట్రం విడిపోయిన ఈ మూడేళ్ళలో మనం మన రెండు ప్రభుత్వాల నోటివెంట చాలా ఎక్కువగా విన్న ఒక మాట కొత్త పరిశ్రమల స్థాపనకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామనేది. ఊరికే అనడమే కాదు, నిజంగానే ఎందరో మంత్రులు, అధికారులు – ఆంధ్రప్రదేశ్‌లోనైతే ముఖ్యమంత్రి సహితం – అందుకోసం అనేకానేక దేశాలు చుట్టివచ్చారు కూడ. ఆ తర్వాత కొంతకాలం నోరుతిరగని పేర్లున్న కంపెనీల తాలూకు ప్రతినిధులు కొందరు వచ్చి వెళ్ళడం చూశాం. వాళ్ళందరూ మన రెండు రాష్ట్రాలలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారని, ఎయిర్‌పోర్టులో దిగీ దిగగానే ఏకగవాక్ష విధానం కిందో, ఏకచేత్రాలు పథకం కిందో వారితో ఎం.ఒ.యులు కుదుర్చుకున్నామని కొన్నాళ్ళు హోరెత్తించారు కూడ. వాటిల్లో ఎన్ని నిజంగా వచ్చాయో, ఏ షరతులతో వచ్చాయో, మనం ఎంత లాభపడ్డామో, వాళ్ళెంత లాభపడ్డారో ఇంకా తెలియదు కాని పారిశ్రామిక రంగంలో మన రాష్ట్ర గత చరిత్ర ఏమిటో గుర్తుచేసుకోవడానికి ఇది ఒక మంచి సందర్భం అనుకుంటున్నాం.

గత 30 ఏళ్ళలో మన కళ్ళముందే ఎన్నెన్ని పరిశ్రమలు మూతపడ్డాయో, యజమానులు ఎన్నెన్ని అక్రమాలకు పాల్పడ్డారో, ఒక్కొక్కటిగా కార్మికుల హక్కుల్ని ఎలా నీరుగారుస్తూ వచ్చారో, ప్రభుత్వాలు ఎంత నిర్లక్ష్యంగా నేరపూరితంగా వ్యవహరించాయో, ఆర్థికవేత్తలు ఎల్.పి.జి అని ముద్దుగా పిలుచుకునే సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలు కార్మికులను ఎంతటి అభద్రతలోకి నెట్టివేశాయో ఆ విషయాలన్నిటి గురించి బాలగోపాల్ ఈ వ్యాసాలలో పూసగుచ్చినట్లుగా రాశారు. ఇందులో క్షేత్ర పరిశీలనా ఉంది. విధానపరమైన విమర్శా ఉంది. భవిష్యత్తు గురించి ఆందోళనా ఉంది. హెచ్చరికా ఉంది.

'ఆధునీకరణ దిశలో బలిపీఠాలు సిరిసిల్ల, దుబ్బాక' అనే శీర్షికతో ఇందులో ఒక వ్యాసం ఉంది. అదే పోలికతో 'సరళీకరణ దిశలో బలిపీఠాలు రాయలసీమ పేపర్ మిల్లు, ఆజంజాహీ మిల్లు, నిజాం షుగర్స్, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ'...ఇలా ఎన్నయినా చెప్పుకోవచ్చు. ఏ రహదారి వెంబడి చూసినా, పారిశ్రామికవాడల్లోకి తొంగిచూసినా ఇవాళ ఇటువంటి చిన్నా చితకా బలిపీఠాలెన్నో కనిపిస్తాయి. ఒక పరిశ్రమ మూతపడిందంటే అది కార్మికుల గొంతెమ్మ కోర్కెల వల్లనే అనే అపోహ చాలామందిలో ఉంది. ముఖ్యంగా వామపక్ష వ్యతిరేకులలో ఇది చాలా బలంగా కనిపిస్తుంది. కాని నిజాలేమిటో, సగం జీతానికి పనిచేయడానికి, జీతంలో కొంత ఎదురు ఇచ్చి మరీ పనిచేయడానికి సైతం వాళ్ళు సిద్ధపడిన సందర్భాలెన్ని ఉన్నాయో ఇందులోని 'ఖాయిలా మిల్లులు - కార్మికుల బతుకులు' వ్యాసాలు చదివితే అర్థమవుతుంది. విజన్ 2020, విద్యుత్ సంస్కరణలు చేయబోయే హాని గురించి కూడ బాలగోపాల్ ఈ వ్యాసాలలో చాలా విపులంగా రాశారు.

చివరిగా "మన పాలకులు ఈ రోజు 'భరించక తప్పదు మరి' అంటూ నిస్సహాయత వ్యక్తం చేస్తున్న నిర్ణయాలకు కారణమైన అర్థరహిత విధాన రచనను... ఈ రోజు ప్రజలకు విడమరచి చెప్పేవారు కరువయ్యారు. దేశంలోని మేధావులలో అత్యధిక భాగం ఈ నాటకంలో భాగమైపోయార"ని ఆవేదన వ్యక్తంచేస్తూ "ఈ పరిస్థితిని వ్యతిరేకించే కృషి రాజకీయ కృషి రూపం తీసుకోక తప్పదని" అన్నారు. ఈ పుస్తకం అన్ని విధాలా అందుకు దోహదపడుతుందని నమ్ముతున్నాం.

**మానవహక్కుల వేదిక**

1 సెప్టెంబర్ 2017

# ఇందులో...

## ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ


1. ప్రైవేటీకరణను ఎదిరిద్దాం కార్మికుల హక్కులను కాపాడుకుందాం ......... 7
2. లేబర్ కమిషన్ ముసుగులో జరగబోతున్నది ఏమిటి? ..................... 11
3. కార్మిక సంఘాలు ఏం కోరుకుంటున్నాయి? .............................. 16
4. చాప కింద నీరులా వ్యాపిస్తున్న ముప్పు .................................. 22
5. ఎవరికి కఠినం? ఎవరికి సరళం? ........................................ 27
6. ప్రపంచ ప్రభుత్వం – ప్రపంచ ప్రభువులు ................................. 32
7. కార్పొరేట్ వాదనకు కలిసొచ్చే కరువు ..................................... 37
8. కార్పొరేట్ సేద్యానికేనా జల సంరక్షణ? .................................. 41
9. ఆర్థిక సంఘం సిఫార్సులు అంత అన్యాయంగా లేవు ..................... 45
10. రామగుండం *LEP* 7 ప్రమాదం: దొంగల చేతికే తాళాలు ఇచ్చారా? .... 49
11. ఒక బల్దియా రహస్యం ........................................................ 55
12. ప్రజారోగ్య వ్యవస్థను ప్రజానుకూలంగా మార్చుకుందాం .................. 60
13. రెండవ లేబర్ కమిషన్ రిపోర్టు: కాగల కార్యానికి ముందస్తు ఆశీస్సులు 64
14. న్యాయమూర్తుల అధిక ప్రసంగం, ఉద్యోగ సంఘాల నిర్వ్యాపకత్వం .... 82
15. ఈ అప్పుల అభివృద్ధి ఇంకొద్దు రెడ్డో........................................ 93
16. దొడ్డిదారిన మరో విపత్తు .................................................. 101

**ఖాయిలా మిల్లులు – కార్మికుల బ్రతుకులు**


17. ఖాయిలా మిల్లులకు కారణం ఎవరు? .................................. 105
18. శ్రీరాయలసీమ పేపర్ మిల్లు.............................................. 115
19. నెల్లిమర్ల జూట్ మిల్లు ..................................................... 148
20. ఆజంజాహీ మిల్లు ........................................................... 188
21. నిజామ్ షుగర్స్ ప్రైవేటీకరణను వ్యతిరేకిద్దాం
కార్మికుల ఆందోళనకు మద్దతు ఇద్దాం .................................. 204
22. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని కాపాడుకుందాం ...................... 209
23. ఆధునీకరణ దిశలో బలిపీఠాలు సిరిసిల్ల, దుబ్బాక...................... 213
24. సిరిసిల్ల ఆత్మహత్యలు : నష్టపరిహార రాజకీయాలు ...................... 221
25. కాగజ్‌నగర్ బాటలో బెల్లంపల్లి ........................................... 228


**విజన్ 2020**


26. స్వర్ణాంధ్రమా, సంక్షోభాంధ్రమా
రాష్ట్రాన్ని విజన్ 2020 ఎటు తీసుకెళుతుంది? ......................... 232
27. చంద్రబాబు 'విజన్'లో ఆదివాసులు ...................................... 234
28. 'విజన్'లో బక్క రైతుకు ఏదీ భరోసా? .................................. 238
29. 'విజన్'లో గ్రామీణ పేదలు ............................................... 244
30. 'విజన్'కు ప్రత్యామ్నాయం లేదా? ....................................... 248
31. 'విజన్' చూపులో వివక్ష ................................................... 254
32. విద్యార్థుల నిరసనకు ఆహ్వానం ......................................... 259


**విద్యుత్ సంస్కరణలు**


33. కరెంటు చార్జీల పెంపుదలను ఎందుకు వ్యతిరేకించాలి?................ 263

# ప్రైవేటీకరణను ఎదిరిద్దాం
## కార్మికుల హక్కులను కాపాడుకుందాం

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దాదాపు మూడున్నర దశాబ్దాలపాటు దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వమే అజమాయిషీ చేసింది. కొన్ని రంగాలను తన చేతిలో పెట్టుకొని ఇతర రంగాలలో పెట్టుబడిదారులు పెట్టే పెట్టుబడిపైన అనేక రూపాలలో నియంత్రణ పెట్టింది. కార్మికులకు హక్కులు కల్పించే చట్టాలెన్నో చేసింది. కార్మికులు, వామపక్ష ప్రజాతంత్ర శక్తులు నిర్వహించిన అనేక పోరాటాల ఫలితంగా దేశ ఆర్థిక విధానాలకు ఈ రూపం సంక్రమించింది. ప్రభుత్వానికి సాంఘిక సంక్షేమాన్ని సంరక్షించే బాధ్యత ఉందనే ప్రజాతంత్ర విలువ ఈ పోరాటాల నుండి పుట్టి ప్రభుత్వ విధానాలను బలంగా ప్రభావితం చేసింది.

కానీ గత దశాబ్ద కాలంలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. లైసెన్సు వ్యవస్థను తొలగించి, ధరలపై కంట్రోలు తీసేసి, పెట్టుబడుల మదుపుపై ఆంక్షలను సడలించి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థపై నియంత్రణను వదులుకొన్నది. తాను నిర్వహిస్తూ వచ్చిన కార్యకలాపాలను కూడ తగ్గించుకొని ప్రభుత్వం వాటిని ప్రైవేటు వ్యక్తులకు, సంస్థలకు అప్పగిస్తున్నది. ఈ మార్పునే ప్రైవేటీకరణ అంటారు.

ప్రైవేటీకరణ నూతన ఆర్థిక విధానాలలో అంతర్భాగంగా వచ్చింది. నూతన ఆర్థిక విధానాలు 1980 దశకం ఆరంభంలోనే రూపొందినా రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి పదవిలోకి వచ్చిన తర్వాత వేగంగా అమలయ్యాయి. మార్కెట్ వ్యవస్థపై ప్రభుత్వ కంట్రోల్‌ను పూర్తిగా తగ్గించి, పెట్టుబడి పెట్టి లాభాలను సంపాదించటానికి

ప్రైవేటు  రంగానికి పూర్తి అవకాశాలు కల్పిస్తేనే ఆర్థికాభివృద్ధి సాధ్యమన్న దృక్పథం ఆధారంగానే నూతన ఆర్థిక విధానాలు రూపొందాయి. ఈ దృక్పథాన్ని, దాని వెలుగులో రూపొందిన నూతన ఆర్థిక విధానాలను అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు భారతదేశంపై బలవంతంగా రుద్దాయి. ద్రవ్యనిధి నుంచి భారతదేశం 1981లో మొదటిసారి, 1991లో రెండవసారి అప్పు తీసుకున్నప్పుడు ఆ సంస్థ ఈ నూతన ఆర్థిక విధానాలను పాటించాలని షరతులు విధించింది. అలాంటిది ఏమీ లేదని భారత ప్రభుత్వం నిరాకరించినా ద్రవ్యనిధి షరతులకు ప్రభుత్వం అంగీకరించిందని పత్రికలు సాక్ష్యాలతో సహా వెల్లడించాయి.

ద్రవ్యనిధి ఆలోచనల ప్రకారం ప్రభుత్వ రంగం ఎప్పుడూ అసమర్థంగానే ఉంటుంది. ఆసుపత్రులు నడపటం నుంచి పరిశ్రమలను ఏర్పర్చడం వరకు అన్ని పనులనూ ప్రభుత్వం నెత్తిన వేసుకోవడం వలన వనరులు వృథా అవుతాయి. ధరలు పెరుగుతాయి. సాంఘిక సంక్షేమం పేరిట ప్రభుత్వం చేసే ఖర్చు కూడ దేశ వనరులను వృథా చేస్తుంది. పెట్టుబడి పెట్టి లాభాలు గడించే పరిస్థితి ఉంటే ప్రైవేట్ పెట్టుబడిదారులే ఫ్యాక్టరీలు పెట్టి సమర్థంగా ఉత్పత్తిని పెంచి ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తారు. అందుకని పెట్టుబడి పెట్టడానికి, లాభాలు గడించటానికి ఉన్న అన్ని ఆంక్షలను సడలించడం, అవాంతరాలను తొలగించడమే నూతన ఆర్థిక విధానాల ప్రకారం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఈ ఆంక్షలలో కార్మికుల హక్కులు కూడ ఒక అంశం. ఈ లక్ష్యాన్ని సాధించటానికిగాను ప్రభుత్వం ద్రవ్యనిధి ఆలోచనలను, దృక్పథాన్ని బాగా అర్థం చేసుకున్న మేధావులకు విధాన రూపకల్పన, అమలు బాధ్యతలను అప్పగించింది.

పైన పేర్కొన్న విధానాలలో భాగంగానే ప్రభుత్వం మూడు రకాలైన చర్యలను చేపట్టింది. అందులో మొదటిది – ప్రభుత్వ రంగ సంస్థల్లో తన షేర్లను ప్రభుత్వం ప్రైవేటు రంగానికి అమ్మేయడం; రెండవది – ఇంతవరకు ప్రభుత్వం మాత్రమే నిర్వహిస్తున్న రంగాల్లో ప్రైవేటు సెక్టారును అనుమతించడం; మూడవది – కార్మికులు పోరాడి సాధించుకొన్న హక్కులను క్రమంగా నీరుగార్చడం.

బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా పనిచేయకపోవడం వలన ప్రతి సంవత్సరం పబ్లిక్ రంగ సంస్థలు నష్టపోతున్నాయని, ఆ నష్టాలను పూడ్చటానికి చాలా ఆర్థిక సహాయం చేయవలసి వస్తున్నదని ప్రభుత్వం చెప్తున్నది. అందువలన పబ్లిక్ రంగ సంస్థలు ప్రభుత్వానికి భారంగా తయారయ్యాయట! ఈ సంస్థలు ప్రైవేటు

సంస్థల్లాగా సమర్థవంతంగా లాభాపేక్షతో పనిచేస్తేనే స్వావలంబనను సాధించగలవు, అలా పనిచేయాలంటే వాటిలో జవాబుదారీతనం పెంచాలి, దాన్ని పెంచాలంటే పబ్లిక్ రంగ సంస్థల షేర్లను ప్రైవేటు వ్యక్తులకు అమ్మాలి అని ప్రభుత్వం నిర్ణయించింది. షేర్లను అమ్మటం వలన ప్రభుత్వంపై భారం తగ్గడమే కాక ప్రభుత్వం కొంత ఆదాయాన్ని కూడ సమకూర్చుకోగలుగుతుందని ద్రవ్యనిధి మానసపుత్రులు ప్రభుత్వానికి ఉపదేశించారు. అయితే నష్టాల్లో ఉన్న సంస్థల ఆస్తులను ప్రభుత్వం అమ్మలేకపోయింది. లాభసాటిగా నడుస్తున్న హిందుస్తాన్ జింక్, మహానగర్ టెలిఫోన్ నిగమ్, హిందుస్తాన్ పెట్రోలియం వంటి ప్రభుత్వ రంగ సంస్థల షేర్లనే ప్రభుత్వం అమ్మగలిగింది. వాటిని కూడ సగం ధరకే అమ్మి నష్టపోయిందని పరిశోధకులు అన్నారు. 1991-92 సంవత్సరంలో 31 పబ్లిక్ రంగ సంస్థల్లో అమ్మిన 8 శాతం వాటా నుండి వాస్తవానికి 6,356 కోట్లు సంపాదించవలసింది కాని 3,038 కోట్ల రూపాయలకే విక్రయించింది. ఇలా చౌకగా అమ్మి కూడ ప్రభుత్వం పెట్టుబడిదారులకు మేలు చేసింది.

ప్రభుత్వం ఆర్థిక సహాయం ఆపేయడంతో నష్టాల్లోని పబ్లిక్ రంగ కంపెనీలు కొన్ని మూతపడగా మరికొన్ని కొద్దిరోజుల్లో మూతపడవచ్చు. పర్యవసానంగా గత ఆరేళ్ళకాలంలో 98 వేల మంది కార్మికులు 'స్వచ్ఛంద' పదవీ విరమణ చేశారు. మరికొందరికి ఏ సహాయం ఇవ్వకుండా ఉద్వాసన పలికారు. హైదరాబాద్‌లోని ఎ.పి.స్కూటర్స్ కంపెనీని అందులో పనిచేసే కార్మికులకు ఏ సహాయం ఇవ్వకుండానే ప్రభుత్వం మూసేసింది.

మరోవైపు ప్రభుత్వం ఇంతవరకు ప్రభుత్వానికే పరిమితమైన రంగాలలోకి లేదా పెట్టుబడిదారులు ప్రవేశించటానికి వీలులేని రంగాల్లోకి ప్రైవేటు రంగాన్ని ఆహ్వానిస్తున్నది. ఫలితంగా రైల్వేలు, బ్యాంకులు, ఆసుపత్రులు, విద్యుచ్ఛక్తి, విద్య వంటి ఎన్నో సేవ మరియు ఉత్పత్తి రంగాల్లోకి ప్రైవేటు పెట్టుబడిదారులు ప్రవేశిస్తున్నారు. ప్రభుత్వం తాను నిర్వహిస్తున్న సర్వీసులను కూడ కేవలం లాభార్జన లక్ష్యంగా కొనసాగిస్తున్నది. అయితే ఇక్కడ కూడ లాభాలు తెచ్చే పనులను – ఉదాహరణకు రైల్వేల్లో లాభాలు వచ్చే కేటరింగ్, క్లోక్ రూమ్‌లను ప్రైవేటు వ్యక్తులకు కాంట్రాక్టుకు ఇస్తున్నది. అంతేకాక తాను లీజుకో, కాంట్రాక్టుకో ఇచ్చే రంగాలలో ప్రైవేటు వ్యక్తులకు కనీస లాభాలు వచ్చేటట్టు చూస్తానని ప్రభుత్వం హామీ ఇస్తున్నది. ఉదాహరణకు ప్రైవేటు వ్యక్తులు విద్యుత్తు ఉత్పత్తి చేసినా, సరఫరా చేసినా లాభాలు వచ్చేటట్టు చూస్తానని ప్రభుత్వం పూచీ ఇస్తున్నది.

లాభార్జన ప్రధానం కావడంతో డబ్బిచ్చి కొనుక్కొనే వాళ్లనే దృష్టిలో పెట్టుకొని సంస్థలు పనిచేస్తాయి – స్కూళ్ళు డొనేషన్ ఇచ్చేవాళ్ళకే అడ్మిషన్ ఇచ్చినట్టు. ఆసుపత్రుల విషయం చూస్తే స్వావలంబన పేర ప్రభుత్వ ఆసుపత్రులు డబ్బున్న వాళ్ళకు పే క్లినిక్‌లు నడుపుతున్నాయి. అలా వచ్చిన డబ్బుతో ఆసుపత్రులకు ఆదాయం పెరిగి పేదలకు మంచి సేవ చేయగలవని ప్రభుత్వం చెప్తున్నది. కానీ హైదరాబాద్‌లోని నిమ్స్‌వంటి సంస్థల్లో మాత్రమే తెల్లకార్డున్న కొద్దిమందికి కొన్ని పరిమితులతో వైద్య సదుపాయం ఇస్తున్నారు. పే క్లినిక్స్ నడపని ఇతర ప్రభుత్వ ఆసుపత్రులు ఆపాటి ఉచిత వైద్య సహాయాన్ని కూడ కల్పించలేకపోతున్నాయి. అదే విధంగా బ్యాంకులు కూడ డబ్బు తిరిగి చెల్లించగలిగే శక్తిని బట్టే రుణాలిస్తున్నాయి.

ఇక మూడవది – లాభార్జనకు అవకాశం కల్పించే పేర పెట్టుబడిదారులకు కార్మికులను తొలగించే హక్కులను కల్పిస్తున్నది. పెట్టుబడులను ప్రోత్సహించే పేర ఆదివాసులకు ప్రత్యేక రాయితీలు కల్పించిన ఏజెన్సీ ప్రాంతాల్లోకి సైతం గిరిజనేతరులను అనుమతిస్తున్నది. అదే లక్ష్యంతో సీలింగ్ చట్టాలను కూడ సవరించనున్నది. బీడీ పరిశ్రమను దెబ్బతీసే చిన్న సైజు సిగరెట్ల తయారీపైనున్న ఆంక్షలను సడలించింది. మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసే విధంగా చేపల, రొయ్యల పెంపకంలో పెట్టుబడిదారులను అనుమతించింది. వెనుకబడిన, కరువు వాతబడిన ప్రాంతాల్లో ఆర్థిక సహాయాన్ని తగ్గించింది. బ్యాంకుల లాభాలను పెంచడానికి వెనుకబడిన ప్రాంతాలకు, చిన్న, సన్నకారు రైతులకు విధిగా రుణాలివ్వాలన్న నిబంధనను సడలించింది. అన్నిటి కంటే మించి వివిధ పబ్లిక్ రంగ సంస్థల్లో ఉద్యోగాలను తగ్గించింది. ఒక్క రైల్వేలోనే లక్ష ఉద్యోగాలను భర్తీ చేయకుండా వదిలేసింది.

ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు, కార్మికులకు అండగా నిలబడి సమాజ శ్రేయస్సుకు దోహదపడేందుకు కృషి చేద్దాం. వారి హక్కులను వమ్ము చేసే నూతన ఆర్థిక విధానాలను, అందులో భాగంగా వచ్చిన ప్రైవేటీకరణను ఎదిరిద్దాం.

**ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, ప్రజాస్వామిక**
**హక్కుల పరిరక్షణ సంస్థల సంయుక్త కరపత్రంగా వచ్చింది**
**ఆగస్టు 1995**

# లేబర్ కమిషన్ ముసుగులో జరగబోతున్నది ఏమిటి?

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రెండవసారి జాతీయ లేబర్ కమిషన్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు వాజ్‌పేయి ప్రభుత్వం ప్రకటించింది. 'నెహ్రూ ఆర్థిక విధానాలు'గా పేరుపడిన విధానాలు అమలులో ఉన్న దశలో మొదటి జాతీయ లేబర్ కమిషన్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. వాటిని 'నెహ్రూ ఆర్థిక విధానాలు' అనడం సబబా కాదా అన్నది వేరే ప్రశ్న. కాని ఆ విధానాలపైన జాతీయోద్యమ కాలంలో ముందుకు వచ్చిన ప్రజాతంత్ర విలువల ప్రభావం బలంగా ఉందనేది వాస్తవం. ఇప్పుడు ఆ విధానాలకు కాలం చెల్లిపోయిందని అన్ని పాలక పార్టీలూ ఏక కంఠంతో ప్రకటిస్తున్న నేపథ్యంలో రెండవ జాతీయ లేబర్ కమిషన్‌ను ఏర్పాటు చేయడం జరుగుతున్నది. ఆ మార్పే దీని అజెండాను నిర్ణయిస్తుందా?

ఈ సందేహం కార్మిక సంఘాలలో ఉంది. కాబట్టే ఏ కార్మిక సంఘమూ ప్రభుత్వ ప్రతిపాదనకు పెద్దగా ఉత్సాహంతో స్పందించలేదు. స్పందించిన కొద్దిమంది కార్మిక నాయకులు అనుమానాలే వెలిబుచ్చారు. లేబర్ కమిషన్‌ను ఏర్పాటు చేయబోతున్నామన్న ప్రకటనతో పాటు ఆ కమిషన్ ఏమేం చేయబోతోందో సూచిస్తూ కేంద్ర కార్మిక మంత్రి వివరణ ఇవ్వడం పట్ల వారు అభ్యంతరం తెలిపారు.

నిజానికి జాతీయ లేబర్ కమిషన్‌కు ప్రభుత్వం 'టరమ్స్ ఆఫ్ రెఫరెన్సు' మాత్రమే రూపొందించవలసి ఉంది. ఏయే విషయాలలో ప్రస్తుతం ఉన్న కార్మిక చట్టాలు,

పారిశ్రామిక చట్టాలు సరిపోవని ప్రభుత్వం భావిస్తున్నదో వాటిని సూచించి ఆ విషయాలను పరిశీలించి కొత్త చట్టాలు లేక చట్ట సవరణలకు సంబంధించిన సలహాలు ఇమ్మని ప్రభుత్వం కమిషన్‌ను కోరాలి. అంతే తప్ప ఏ రకమైన సవరణలు కమిషన్ ప్రతిపాదించబోతున్నదో ప్రభుత్వమే ప్రకటించడం భావ్యం కాదు. ప్రభుత్వ ఆలోచనలకు పూర్తిగా భిన్నమైన సూచనలు కమిషన్ నుండి రాకూడదన్న నియమమేమీ లేదు. కమిషన్ సూచనలను ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయాలన్న నియమం కూడ లేదు. కాబట్టి దీనివల్ల నిజానికి ప్రభుత్వానికి పెద్దగా ఇబ్బంది కూడ లేదు.

అయినప్పటికీ రెండవ జాతీయ లేబర్ కమిషన్ ఏం చేయబోతోందో సూచిస్తూ ముందుగానే కార్మిక మంత్రి ప్రకటించడంలో ఒక ఆత్రుత కనిపిస్తుంది. కార్మిక సంఘాలు దానిని కనిపెట్టి విమర్శించినట్టే, పెట్టుబడిదారీ సంస్థలు దానిని కనిపెట్టి సంతోషంగా స్పందించాయి.

దాదాపు ఒక దశాబ్దం కింద కేంద్ర ప్రభుత్వం ఆర్థిక పారిశ్రామిక సరళీకరణ విధానాలు ప్రవేశపెట్టినప్పటి నుంచి దేశీయ ఉత్పత్తులు అంతర్జాతీయ విపణిలో బాగా అమ్ముడు పోవడం, విదేశీ పెట్టుబడి పెద్ద మొత్తంలో దేశంలోకి రావడం రెండు పెద్ద అవసరాలుగా చూపించబడుతున్నాయి. దేశ ఆర్థిక అభివృద్ధిలో వీటి ప్రాముఖ్యం ఎంత అని ఆలోచిస్తున్న వారు రాజకీయ పార్టీలలో, అధికార యంత్రాంగంలోనే కాదు, మేధావి వర్గంలోనూ కరువయ్యారు.

ఈ 'అవసరాలకు' కార్మికుల హక్కులు ఆటంకం అయ్యాయి. ఈ విషయం మన దేశానికి చెందిన పరిశ్రమల యజమానులు, విదేశీ పెట్టుబడిదారులు కూడ పదే పదే స్పష్టం చేస్తున్నారు. ఒక వెనుకబడిన దేశం అంతర్జాతీయ విపణిలో (సరుకులు అమ్ముకోవడం కోసమయినా, పెట్టుబడిని ఆకర్షించడం కోసమైనా) పోటీ పడాలంటే అనేక ఆటుపోట్లు ఎదుర్కోవలసి ఉంటుందనీ, దానికి అనుగుణంగానే దేశ అంతర్గత విధానాలలో మార్పులు చేసుకోవలసి ఉంటుందనీ, లేకపోతే ఈ ప్రయత్నంలో ఘోరంగా దెబ్బతినే ప్రమాదం ఉందనీ దేశ ఆర్థిక విధాన నిర్ణేతలు హెచ్చరిస్తున్నారు. ఎగుమతి-దిగుమతులకు సంబంధించిన సరళీకరణ, ప్రోత్సాహకాలు ఈ విధాన మార్పులలో ఒకటి కాగా కార్మికుల హక్కుల కత్తిరింపు రెండవది.

అంతర్జాతీయ విపణిలో మనతో పోటీపడే అనేక మూడవ ప్రపంచదేశాలలో కార్మికులకు చట్టంలో భద్రతగానీ, హక్కులుగానీ మన దేశంతో పోలిస్తే తక్కువగా ఉన్నాయి. ఆచరణలో ఈ చట్టాలు అన్ని సందర్భాలలోనూ కార్మికులకు ఇవ్వవలసిన రక్షణ ఇవ్వలేకున్నప్పటికీ పరిశ్రమల యాజమాన్యాలు వాటి గురించి సణుగుతూనే ఉన్నాయి. మనబోటి మూడవ ప్రపంచ దేశ ఉత్పత్తులు అంతర్జాతీయ విపణిలో తట్టుకుని నిలవాలంటే పెట్టుబడిదార్లకు ఇచ్చే ఇతర ప్రోత్సాహకాలతోబాటు పారిశ్రామిక చట్టాలూ, కార్మిక చట్టాలూ కూడ కొంత 'ఉదారం'గా ఉండాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇక్కడ 'ఉదారం' అంటే అర్థం యజమానులకు లే ఆఫ్‌ల విషయంలోనూ, రిట్రెంచ్‌మెంట్ల విషయంలోనూ, వేతన ఒప్పందాల విషయంలోనూ 'స్వేచ్ఛ' ఉండాలని, కార్మిక సంక్షేమం పేరిట ప్రభుత్వమూ, న్యాయస్థానాలూ జోక్యం చేసుకోకూడదని.

మరొకవైపు విదేశీ పెట్టుబడిదారీ కంపెనీల్లో కూడ భారతదేశంలో పెట్టుబడులు పెట్టే విషయంలో మన పాలకులు ఆశిస్తున్నంత ఉత్సాహం కనిపించడం లేదు. ఈ సంగతి మన్మోహన్ సింగ్ తొలి బడ్జెట్ నుండి ప్రతి సంవత్సరం బడ్జెట్ ఉపన్యాసంలో కేంద్ర ఆర్థిక మంత్రి చెబుతూనే ఉన్నారు. రేపు యశ్వంత్ సిన్హా కూడ చెప్పబోతారు. ఉత్పత్తి రంగంలో పెట్టుబడులు పెట్టడంలో కంటే షేర్ల మార్కెట్‌లోను, ఫైనాన్స్ మార్కెట్‌లోను పెట్టుబడులు పెట్టడానికి విదేశీ కంపెనీలు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నాయి. దీనికి మన ఆర్థిక విధాన వ్యాఖ్యాతలు చూపిస్తున్న అనేక కారణాలలో ఒకటి భారతదేశంలో కార్మిక చట్టాలూ, పారిశ్రామిక చట్టాలూ మరీ 'కఠినంగా' ఉన్నాయనేది. విదేశీ కంపెనీల భాషలోనే చెప్పాలంటే వారికి 'హైర్ అండ్ ఫైర్' స్వేచ్ఛ కావాలి. అంటే కార్మికులను పనిలోకి తీసుకోవడంలోనూ, ఏ రోజయినా పని లేకపోతే పక్కన పెట్టడంలోనూ, పని నుంచి తీసేయడంలోనూ, కంపెనీని మూసేయడంలోనూ, కార్మికుల వేతనాలు నిర్ణయించడంలోనూ యాజమాన్యానికి స్వేచ్ఛ కావాలి. చట్టమూ, దానిని అమలు చేసే అధికార యంత్రాంగమూ, కోర్టులూ జోక్యం చేసుకోకూడదు. ఈ కోరికను వివరించడానికి ఒక వాక్యం చాలును కానీ అది తీరాలంటే ప్రస్తుతం ఉన్న కార్మిక చట్టాలను, ముఖ్యంగా పారిశ్రామిక వివాదాల చట్టాన్ని మౌలికంగా మార్చవలసి ఉంటుంది. కార్మిక వర్గాన్ని మొత్తంగా 'అసంఘటిత' కార్మికుల స్థాయికి దిగజార్చవలసి ఉంటుంది.

రెండవ జాతీయ లేబర్ కమిషన్ 'అసంఘటిత రంగ' కార్మికుల హక్కుల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెడుతుందన్న కేంద్ర కార్మిక మంత్రి ప్రకటనకు ఈ కోణం కూడ ఉందేమో! ఆయన కొత్త జాతీయ లేబర్ కమిషన్‌కు సూచించిన అజెండాలో రెండు విషయాలు ఉన్నాయి. ఒకటి అసంఘటిత రంగ కార్మికుల హక్కుల గురించి సూచనలు చేయడం, రెండు ఆర్థిక సరళీకరణ విధానాల నేపథ్యంలో కార్మిక చట్టాలను పునః పరిశీలించడం. వీటిలో మొదటిది ఆహ్వానించదగినదీ, రెండవది అనుమానించ వలసినదీ అని వినగానే అనిపిస్తుంది. అసంఘటిత రంగ కార్మికుల హక్కుల గురించి ఆలోచించాలనీ, గట్టి చట్టాలు చేయాలనీ ప్రభుత్వం భావించడం మంచి విషయమనడంలో సందేహం ఏమీ అక్కరలేదు. ఎందుకంటే దేశ కార్మిక వర్గంలో (వ్యవసాయాన్ని లెక్కబెట్టకుంటే కూడ) దాదాపు 90 శాతం అసంఘటిత కార్మికులే. వీరికి వర్తించే చట్టాలు లేకపోలేదుగానీ పని భద్రత అసలే లేకపోవడం అనే ప్రాథమిక బలహీనత వల్ల వాటిని అమలు చేసుకోవడం కష్టంగా ఉంది. ఈ ప్రజానీకానికి ఏ కొంచెం బలం చేకూర్చే చట్టాలనయినా ఆ మేరకు ఆహ్వానించవలసిందే.

కానీ ఇవాళ అకస్మాత్తుగా అసంఘటిత రంగ కార్మికుల ప్రయోజనాలకు పెద్ద పీట వేయాలని ప్రభుత్వం ఆలోచించడాన్ని సరళీకృత ఆర్థిక విధానాలతో ముడిపెట్టకుండా ఉండలేము. ఆర్థిక సరళీకరణ, ప్రపంచీకరణల ఫలితంగా దేశంలో నిరుద్యోగం పెరుగుతుందా లేదా అనేది ఇప్పటికింకా వివాదాస్పదంగానే ఉంది కానీ కార్మికులు మరింతగా 'అసంఘటిత' రంగంలోకి నెట్టబడుతున్నారనేది ఇప్పటికే స్పష్టమవుతున్న వాస్తవం. (పారిశ్రామిక కార్మికుల దాకా ఎందుకు, తెల్ల బట్టల గౌరవం ఉన్న అధ్యాపకులు సైతం విద్య ప్రైవేటీకరణ క్రమంలో అసంఘటిత రంగంలోకి – అంటే ఏ హక్కులూ ఏ భద్రతా లేకుండా యాజమాన్యం దయపైన బతికే స్థితికి – నెట్టబడుతున్నారనేది మనం నిత్యం చూస్తున్న సత్యం.)

అత్యాధునిక సాంకేతిక ప్రక్రియలతో నడిచే పరిశ్రమలలో సైతం క్రమంగా పర్మనెంట్ కార్మికుల సంఖ్య పడిపోయి క్యాజువల్, కాంట్రాక్టు కార్మికుల సంఖ్య పెరిగిపోతున్నది. ('పర్మనెంట్' అంటే శాశ్వతం అనుకునేరు – సాపేక్షంగా కొంత ఉద్యోగ భద్రత ఉన్న వారని మాత్రమే అర్థం.) నిన్నటిదాకా పర్మనెంట్ కార్మికులు చేసిన పనిని ఈ రోజు దినకూలీల చేత చేయించుకోవడం, లేదా కాంట్రాక్టుకు ఇవ్వడం జరుగుతున్నది. ప్రైవేట్ రంగంలోనే కాదు – ఇప్పటికింకా ప్రైవేట్‌పరం కాని 'ప్రతిష్టాత్మకమైన' ప్రభుత్వ రంగ సంస్థలలోనూ ఇదే జరుగుతున్నది.

ఇప్పటిదాకా ఈ పనులు చట్టాలకూ, కోర్టు తీర్పులకూ వ్యతిరేకంగా జరుగుతున్నాయి. అయితే ఇక మీదట ఈ మార్పును చట్టబద్ధం చేయడం (అంటే కార్మిక చట్టాలనూ, పారిశ్రామిక వివాదాల చట్టాన్నీ ఆర్థిక సరళీకరణకు అనుగుణంగా మార్చడం) రెండవ జాతీయ లేబర్ కమిషన్ ముందున్న ఒక కర్తవ్యం అని కేంద్ర కార్మిక మంత్రి ప్రకటన స్పష్టం చేస్తున్నది. దీని ఫలితంగా కార్మిక రంగాన్ని మరింత సంపూర్ణంగా ఆక్రమించబోయే 'అసంఘటిత' స్థితిని దృష్టిలో పెట్టుకుని అసంఘటిత రంగ కార్మికుల హక్కుల గురించి సూచనలు చేయడం ఆయన లేబర్ కమిషన్‌కు నిర్దేశించిన రెండవ కర్తవ్యం.

ఈ రకంగా చూసినప్పుడు రెండు కర్తవ్యాల మూలమూ ఒకటే. ఇప్పటి వరకూ ఉన్న కార్మిక చట్టాలు అసంఘటిత కార్మికుల కష్టాలన్నీ తీర్చకున్నా కనీసం సరయిన కారణం లేకుండా ఒక కంపెనీలో క్యాజువల్, కాంట్రాక్టు కార్మికుల సంఖ్యను పెంచే చర్యల పట్ల కొంత మేరకు వ్యతిరేక ధోరణిని కలిగి ఉన్నాయి. అనునిత్యం జరిగే పనిలో పర్మనెంట్ కార్మికులనే వినియోగించాలనే నియమం ఇప్పటివరకూ చట్టంతో సమానమైన హక్కును కలిగి ఉంది. అలాగే ఏదైనా ఒక పరిశ్రమలో ఒక రకమైన పనిలో కాంట్రాక్ట్ కార్మికులను నియమించడానికి వీలులేదని నిషేధం పెట్టే అధికారం ప్రభుత్వానికి చట్టం ఇచ్చింది. ఈ దిశగా చట్టాలను మరింత ముందుకు తీసుకుపోతూ, అప్పటికీ మిగిలిపోయే అసంఘటిత రంగ కార్మికుల రక్షణ కోసం చేయగల చట్టాలు చేస్తే హర్షించవచ్చు. దానికోసమే ఒక జాతీయ లేబర్ కమిషన్‌ను నియమించినా హర్షించవచ్చు.

కానీ ఒకవైపు ఇప్పుడున్న చట్టాలకు కూడ విరుద్ధంగా కార్మికవర్గాన్ని మొత్తంగా అసంఘటిత స్థితిలోకి నెట్టే ఆర్థిక విధానాలను అనుసరిస్తూ, దానిని 'చట్టబద్ధం' చేసే శాసన సవరణలను జాతీయ లేబర్ కమిషన్ అజెండాలో చేర్చి మరొక వైపు అదే లేబర్ కమిషన్‌ను అసంఘటిత రంగ కార్మికుల కోసం ఏమైనా సూచనలు చేయమని పురమాయించడమంటే మామూలు భాషలో చెప్పాలంటే చంపి చావు ఖర్చులు ఇవ్వడం లాంటిది.

**ఆంధ్రప్రభ దినపత్రిక**
**21 జనవరి 1999**

# కార్మిక సంఘాలు ఏం కోరుకుంటున్నాయి?

రెండవ జాతీయ లేబర్ కమిషన్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వం దేనిని చట్టబద్ధం చేయదలచుకుందో తెలీదుగానీ, కార్మిక చట్టాలలో మార్పులంటూ తీసుకొచ్చేటట్టయితే ఎటువంటి మార్పులొస్తే కార్మికులకు మేలు జరుగుతుందనే విషయంలో కార్మికులకూ, కార్మిక సంఘాలకూ కొన్ని అభిప్రాయాలున్నాయి. ఇవి ఈ రోజు కొత్తగా పుట్టిన అభిప్రాయాలు కావు. కార్మిక సంఘాలు వీటి గురించి చాలా కాలంగా ఆందోళన చేస్తున్నాయి. వీటిలో ఏవైనా రెండవ జాతీయ లేబర్ కమిషన్‌కు ప్రభుత్వం రూపొందించే 'టరమ్స్ ఆఫ్ రెఫరెన్స్' లో చోటు చేసుకుంటాయో లేదో చూడాలి.

ఉదాహరణకు కార్మిక చట్టాలలో కొన్ని చర్యలు నేరాలుగా గుర్తించబడ్డాయి. వాటిని అతిక్రమించిన యజమానులు శిక్షార్హులని చట్టం అంటుంది. అయితే యాజమాన్యం ఆ నేరానికి పాల్పడినప్పుడు వారిపైన కేసు పెట్టే అధికారం కార్మికులకుండదు. కార్మికులు ప్రభుత్వ కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదు చేసుకోవాలి. కేసు పెట్టే అధికారం ఉండేది ఆ ప్రభుత్వ అధికారులకే. లేదా (కొన్ని చట్టాలలో) కార్మిక శాఖ అధికారుల అనుమతి తీసుకుని కార్మికులు కేసు పెట్టవచ్చు.

ఇదెందుకవసరం? నిజానికి ఎవరో ఒకరు కోర్టులో ఫిర్యాదు నమోదు చేయవలసిన అవసరం మాత్రం ఎందుకుండాలి? ఒక దొంగతనం జరిగితే, ఒక హత్య జరిగితే, ఒక రేప్ జరిగితే ఎవరూ కోర్టుకు పోయి ఫిర్యాదు నమోదు

చేయనక్కరలేదు. పోలీసులకు ఏ రూపకంగా సమాచారం తెలిసినా వాళ్ళే కేసు నమోదు చేస్తారు. వీటిని కాగ్నైజబుల్ నేరాలు అంటారు. పరిశ్రమల యజమానులు కార్మిక చట్టాలను అతిక్రమించడం కూడ కాగ్నైజబుల్ నేరం ఎందుకు కాకూడదు? వెయ్యో రెండువేలో దొంగిలిస్తే అది కాగ్నైజబుల్ నేరం అవుతుందిగానీ 5 లక్షల రూపాయల కార్మికుల ప్రావిడెంట్ ఫండ్‌ను ప్రభుత్వం దగ్గర జమ చేయకుండా దిగమింగితే అది కాగ్నైజబుల్ నేరం ఎందుకు కాదు?

పోనీ ఫిర్యాదు మీదనే కోర్టు అటువంటి కేసులు చేపట్టాలన్న నియమం పెట్టినా, ఆ ఫిర్యాదు చేసే అధికారం నేరుగా కార్మికులకే ఎందుకివ్వకూడదు? ప్రభుత్వ కార్మిక శాఖ ద్వారా మాత్రమే ఎందుకు రావాలి? దీని పర్యవసానం ఏమిటంటే కార్మికులు 'అయ్యా కేసు పెట్టండి' అని అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌ను, వారిపై అధికారులనూ అడుక్కోవాలి. లేదా కేసు పెట్టడానికి మాకు కనీసం అనుమతి ఇవ్వండి అని అడుక్కోవాలి. ఆ అధికారులు సులభంగా స్పందించరు. దీనికి అవినీతి ఒక కారణం. కానీ అవినీతి లేని చోట కూడ 'ప్రతి చిన్న విషయానికీ కేసులేం పెడతాం, ఏదో నచ్చజెప్పి సర్దుబాటు చేస్తే సరిపోతుంది' అనే ఉదాసీన వైఖరి ఉంటుంది. నిజానికి అది చిన్న విషయం కాకపోవచ్చు. మన వ్యక్తిగత సమస్యే అయితే అంతకంటే చాలా చిన్న విషయాలలో కూడ మనం పోలీస్ స్టేషన్‌కూ, కోర్టుకూ పోతుండవచ్చు. కానీ ఫ్యాక్టరీల బాగోగులు 'దేశ ప్రగతి'తో సమానం కాబట్టి ఫ్యాక్టరీ యజమానులను ఇబ్బంది పెట్టే చర్యలు చేపట్టాలంటే అధికారులకు సులభంగా మనస్కరించదు. దీనికి అవినీతి కూడ తోడవుతుందని వేరే చెప్పనవసరం లేదు. అధికారులకు ప్రభుత్వం ఇచ్చే జీతాలకూ, కంపెనీల యజమానులు ఇవ్వగల ముడుపులకూ పోలికే లేదు.

అందువల్ల యాజమాన్యాల చట్ట విరుద్ధ చర్యల మీద కేసులు పెట్టడం సులభంగా జరగదు. బలమైన యూనియన్ ఉండి లేబర్ డిపార్ట్‌మెంట్ పైన ఒత్తిడి పెట్టగలిగితే కొంతమేరకు జరుగుతుందిగానీ లేకపోతే పెట్టుబడిదారుల నేరాలు యథేచ్ఛగా సాగుతుంటాయి. దీనిని సవరించి కార్మికులకే కేసు పెట్టే అధికారం నేరుగా ఇవ్వాలని కార్మిక ఉద్యమం చాలా కాలంగా అడుగుతున్నది. దీనికొక లేబర్ కమిషన్ అక్కరలేదు. లేబర్ కమిషన్ సలహాలు అక్కరలేదు. ప్రభుత్వమే చేయొచ్చు.

అయినప్పటికీ ఒక లేబర్ కమిషన్‌ను నెలకొల్పారు కాబట్టి దాని అజెండాలో ఈ అంశాన్ని పరిశీలన కోసం చేరుస్తారా? లేకపోతే కార్మికులు లేబర్ శాఖ అధికారుల

వెంటబడి వెంటబడి కొన్నాళ్ళకు 'లిమిటేషన్' దాటిపోయిందని ఊరుకునే పరిస్థితే ఎప్పటికీ కొనసాగుతుందా?

ఒక మేజిస్ట్రేట్ ఇంట్లో దొంగతనం జరిగితే ఆ కేసు ఆ మేజిస్ట్రేట్ వద్దకే వస్తే 'దొంగతనం జరిగింది మీ ఇంట్లోనే కాబట్టి మీరే కేసు విచారిస్తే నాకు న్యాయం జరగదు' అని ముద్దాయి ఆ కేసును వేరొకరి వద్దకు బదిలీ చేయించుకునే అవకాశం ఉంది. కానీ ఒక ఫ్యాక్టరీలో కార్మికులు క్రమశిక్షణకు వ్యతిరేకంగా వ్యవహరించారన్న ఫిర్యాదు వస్తే దానిపైన ప్రాథమిక విచారణ జరిపేది ఫ్యాక్టరీ యాజమాన్యమే. వారే విచారణ జరిపి వారే క్రమశిక్షణ చర్య తీసుకుంటారు. ఆపైన అది న్యాయమా? అన్యాయమా? అని తేల్చడానికి కార్మికులు లేబర్ కోర్టుకు పోవచ్చు కానీ మొదటి విచారణ జరిపేదీ, చర్య తీసుకునేదీ యాజమాన్యమే. ఇది కేవలం ఫ్యాక్టరీలలోనే కాదు 'క్రమశిక్షణ ఉల్లంఘన' విషయంలో అన్ని సంస్థలలోనూ ఇదే జరుగుతున్నది. దీనికొక స్వతంత్ర యంత్రాంగం ఉండాలని కార్మికులూ, ఉద్యోగులూ చాలా కాలంగా కోరుకుంటున్నారు. న్యాయ నిర్ణేతలకు స్వతంత్ర ప్రతిపత్తి ఉండాలన్న కోరికలో తప్పుపట్టగల విషయమేమీ లేదు. కాబట్టి ఈ విషయాన్ని లేబర్ కమిషన్ పరిశీలన కోసం నివేదిస్తారా?

పరిశ్రమలలో తలెత్తే వివాదాల పరిష్కారం కోసం సమర్థమైన యంత్రాంగం లేకపోవడం వల్ల కార్మికులు చాలా నష్టపోతున్నారు. దీనికి కార్మిక సంఘాలు ఒక పరిష్కారం సూచిస్తున్నాయి. ప్రతి సంస్థలోనూ కార్మికుల తరపున పరిష్కార చర్చలలో పాల్గొనే అర్హత గల 'బార్గెయినింగ్ ఏజెంట్'ను రహస్య బ్యాలెట్ ద్వారా గుర్తించాలనీ, వారితో యాజమాన్యం తప్పనిసరిగా సంప్రదింపు చర్చలలో పాల్గొనాలనీ, యాజమాన్యం అహేతుకంగా చర్చలలో పాల్గొనడానికి నిరాకరించినా, సరయిన కారణం లేకుండా ఒప్పందానికి రావడానికి నిరాకరించినా సమ్మె చేసే హక్కు కార్మికులకు ఉండాలనీ కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే కార్మికుల ప్రతినిధి అహేతుకంగా ఒప్పందానికి రావడానికి నిరాకరిస్తే తమకు లాకౌట్ చేసే అధికారం ఉండాలని కూడ యాజమాన్యాలు అనవచ్చు. బహుశా, ఇరువర్గాల ప్రవర్తనలోని అహేతుకతను, వారి పరిస్థితులలో ఉన్న అసమానతను దృష్టిలో పెట్టుకుని నిర్ణయించడానికి ఒక పారిశ్రామిక న్యాయస్థానం అవసరం అవుతుందేమో!

అదెట్లాగున్నా మెజారిటీ కార్మికుల (రహస్య బ్యాలెట్ ద్వారా నిర్ణయించిన) ప్రతినిధికీ, యాజమాన్యానికీ మధ్య జరిగే సంప్రదింపు చర్చల ద్వారానే పారిశ్రామిక వివాదాలు పరిష్కారం కావాలన్న ఒత్తిడి పెట్టే యంత్రాంగాన్ని రూపొందించి సమ్మె హక్కును అందులో భాగంగా ఒక అవసరమయిన హక్కుగా అర్థం చేసుకున్నప్పుడే పారిశ్రామిక వివాదాలు సత్వరంగానూ, కొంతవరకయినా న్యాయంగానూ పరిష్కారం అయ్యే అవకాశం ఉంటుందని కార్మిక సంఘాలు చాలా కాలంగా అంటున్నాయి.

మన దేశంలో ప్రస్తుతం అటువంటి యంత్రాంగం ఏదీ లేదు. మెజారిటీ కార్మికుల ప్రతినిధిని రహస్య బ్యాలెట్ ద్వారా నిర్ణయించాలన్న ప్రతిపాదనకు ప్రభుత్వం సుముఖంగా లేదు. కొన్నిచోట్ల సభ్యత్వ జాబితాలను బట్టి నిర్ణయిస్తారు. ఎక్కువ భాగం ఏ నిర్ణయమూ చేయరు. యజమానులు ఎవరితో పడితే వారితో ఒప్పందాలు చేసుకుంటారు. అసలు సంప్రదింపుల ద్వారా ఒప్పందాలు చేసుకోవాలన్న నియమం చట్టంలో లేదు కాబట్టి కార్మిక సంఘాలు ఎంతగా మొత్తుకున్నా యజమానులు చర్చలకు రారు. వారు చర్చలకు రాకపోతే సమ్మె చేయడం కార్మికుల హక్కుగా గుర్తింపు పొందలేదు. కార్మికులు ఏం చేయాలంటే కార్మిక శాఖకు ఫిర్యాదు చేసి రాజీ చర్చలు జరిపించమని కోరాలి. ఆ చర్చలు కార్మిక శాఖ అధికారులు నిర్వహిస్తారు. వీటికయినా యాజమాన్యం తప్పనిసరిగా హాజరు కావాలనీ, ఒప్పందం చేసుకోవాలనీ నియమమేదీ లేదు. వాళ్ళకు బుద్ధిపుడితే వస్తారు. లేకపోతే రారు. బుద్ధిపుడితే ఒప్పందం చేసుకుంటారు. లేకపోతే లేదు. కార్మిక శాఖ అధికారులు ఏమీ చేయలేరు. (చేయగలిగి ఉన్నా చేయాలనుకోరనేది వేరే సంగతి.) ఇంకా ఆ తర్వాత ప్రభుత్వం చిత్తగిస్తే వివాదం పారిశ్రామిక న్యాయస్థానాలలో పడుతుంది. అక్కడ సివిల్ వ్యాజ్యం నడిచినట్టు సంవత్సరాల తరబడి నడుస్తుంది. మధ్యమధ్యలో ఏవో సాంకేతిక కారణాలు చూపించి యజమానులు హైకోర్టుకు పోయి 'స్టే' ఆర్డర్లు తెచ్చుకుంటుంటారు. దీనిని ప్రోత్సహించవద్దని సుప్రీంకోర్టు మందలించినప్పటికీ హైకోర్టులు సమన్యాయం పేరిట ప్రోత్సహిస్తూనే ఉన్నాయి.

ఈ పరిస్థితిని ఇప్పటికైనా సవరించి సమర్థమైన వివాదాల పరిష్కార యంత్రాంగాన్ని రూపొందించమని లేబర్ కమిషన్‌ను కోరుతారా? మెజారిటీ కార్మికుల ప్రతినిధిగా గుర్తించిన యూనియన్‌తో లేక కమిటీతో యాజమాన్యాలు తప్పనిసరిగా

సంప్రదింపుల ద్వారా ఒప్పందాలు చేసుకోవాలని నియమం పెట్టి అమలు చేయగల యంత్రాంగాన్ని సూచించమని కోరుతారా?

నష్టాల కారణంగా గానీ, వేరే ఏ కారణంగా గానీ ఒక ఫ్యాక్టరీ మూతపడింది అనుకోండి. అందులో పనిచేసిన కార్మికులకు నష్టపరిహారం, ఇతర బకాయిలు రావలసి ఉంటుంది. యాజమాన్యం చెల్లించలేకపోతే ఫ్యాక్టరీ ఆస్తుల నుండి తీసుకోవలసి ఉంటుంది. కానీ అవే ఆస్తుల కోసం ఫ్యాక్టరీకి అప్పులిచ్చిన బ్యాంకులు, వాణిజ్య సంస్థలు, ఇతర వ్యక్తులు కూడ పోటీపడతారు. న్యాయంగానయితే కార్మికుల బకాయిలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. లేదా కనీసం ఇతరులతో సమానమైన ప్రాధాన్యం అయినా ఇవ్వాలి. కానీ ఎక్కువ భాగం కేసులలో కార్మికులకు అట్టడుగు ప్రాధాన్యం ఇస్తారు. సెక్యూరిటీ లేకుండా చేబదులు ఇచ్చిన అప్పులవాడి బకాయిలతో సమానంగా కార్మికుల బకాయిలను చూస్తారు. బ్యాంకులు, వాణిజ్య సంస్థల బకాయిలకు మొదటి ప్రాధాన్యం ఉంటుంది. దీనికి ఒకే ఒక మినహాయింపు కంపెనీల చట్టంలో ఉంది. ఫ్యాక్టరీ యాజమాన్యం కంపెనీ గనుక అయినట్టయితే, ఆ కంపెనీ చట్టం నిర్దేశించిన పద్ధతిలో మూతపడినట్టయితే అప్పుడు బకాయిల వసూళ్ళలో కార్మికులకు ఇతర బకాయిదార్లతో సమాన ప్రాధాన్యం లభిస్తుంది. అయితే బ్యాంకులు, వాణిజ్య సంస్థల బకాయిల వసూలు కోసం 1993లో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన కొత్త చట్టం కంపెనీల చట్టంలో ఉన్న ఈ సమాన ప్రతిపత్తిని కూడ కార్మికులకు లేకుండా చేసింది.

ఇప్పటికయినా ఈ పరిస్థితిని సవరించి ఒక సంస్థ కార్మికులకు ఇవ్వవలసిన మొత్తం ఇవ్వకుండా మూతపడినట్టయితే, ఆ సంస్థ మిగిలించిన ఆస్తుల మీద ఇతర బకాయిదారులందరి కంటే ప్రధానమైన హక్కు లేదా కనీసం బ్యాంకులు, వాణిజ్య సంస్థలతో సమానమైన హక్కు ఆ సంస్థ కార్మికులకు కల్పించే విధానాన్ని సూచించమని లేబర్ కమిషన్‌ను అడుగుతారా?

ప్రభుత్వం అనుమతి లేకుండా కార్మికులను తొలగించడానికి వీలులేదని చట్టం అంటుంది. కాని అనుమతి లేకుండానే తొలగిస్తారు. తొలగించిన కార్మికులకు నష్టపరిహారం ఇవ్వాలని చట్టం అంటుంది. ఇవ్వరు. కాంట్రాక్టు కార్మికులను నియమించడానికి లైసెన్సు పొందాలని, లైసెన్సు లేకుండా నియమించడానికి వీలులేదని

చట్టం అంటుంది. లైసెన్సు లేకుండానే నియమిస్తారు. ఫలానా పనికి ఫలానా మొత్తం కనీస వేతనం ఇవ్వాలనీ, అంతకంటే తక్కువ ఇస్తే నేరమనీ చట్టం అంటుంది. తక్కువే ఇస్తారు.

ఈ చట్ట విరుద్ధమైన ప్రవర్తనను కార్మిక శాఖ నిరోధించాలి. కానీ నిరోధించలేక పోతున్నది. నిరోధించడానికి కావలసిన అన్ని అధికారాలూ వారికి లేవు. ఉన్న అధికారాలు ఉపయోగించాలన్న ఆసక్తి వారికి తరచుగా ఉండదు. అనేక ఇతర జీవిత రంగాలలో నేరాలనూ, నేరస్థులనూ అరికట్టడానికి అట్టహాసంగా శ్రమించే రాజ్యాంగ యంత్రాంగం ఈ రంగంలో మాత్రం తనకు కావలసిన అధికారాలు సమకూర్చుకోలేదు. సమకూర్చుకున్నవి కూడ వినియోగించదు.

దీనిని సవరించకపోతే ఇన్ని చట్టాలుండీ కార్మికులకు దక్కగల భద్రత, హక్కులు స్వల్పమే. మరి అందుకోసం కావలసిన సూచనలు చేయమని లేబర్ కమిషన్‌ను కేంద్ర ప్రభుత్వం కోరుతుందా?

ఇవీ, ఇటువంటివీ అనేక సవరణలూ, సంస్కరణలూ కార్మిక సంఘాలు చాలా కాలంగా కోరుకుంటున్నాయి. 'ప్రస్తుత పరిస్థితులకు' అనుగుణంగా కార్మిక చట్టాలను మార్చాలన్న ప్రభుత్వ కాంక్ష దీనికి సమాధానం కాకపోగా ఇప్పటికే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మరింత పెంచే ప్రమాదం ఉంది. అందుకే రెండవ జాతీయ లేబర్ కమిషన్ అజెండా రూపకల్పనలోనే కార్మిక సంఘాలకు పాత్ర ఉండడం అవసరం. దానికోసం ఉద్యమించడం అవసరం.

**ఆంధ్రప్రభ దినపత్రిక**
**6 ఫిబ్రవరి 1999**

# చాపకింద నీరులా వ్యాపిస్తున్న ముప్పు

కార్మికరంగంలో ఒక మార్పు చాలా నిశ్శబ్దంగా – చాప కింద నీరులాగ – వస్తున్నది. ఎవరూ లెక్కలు తీయలేదు గానీ, పర్మనెంట్ కార్మికుల స్థానంలో కాంట్రాక్టు కార్మికులను నియమించి, వారిచేత అదే పని చేయించుకుని హక్కులడిగినప్పుడు మాత్రం మీరు కాంట్రాక్టు కార్మికులు పొమ్మని చేతులు దులుపుకుంటున్న కంపెనీలు వేల సంఖ్యలో ఉన్నాయి. ఫలితంగా ఉన్న కొద్దిపాటి ఉద్యోగభద్రత పోగొట్టుకుని ఏ రోజు ఉద్యోగం ఊడుతుందో అని భయపడుతూ బతుకుతున్న కార్మికుల సంఖ్య లక్షలలో ఉంది.

దేశంలో కార్మికోద్యమం బలంగా ఉండి ఉంటే ఇదొక ముఖ్యమైన రాజకీయ సమస్యగా గుర్తింపు పొంది ఉండేది కానీ ఇప్పుడు జరుగుతున్నదేమిటంటే కార్మిక సంఘాలు ఎక్కడికక్కడ చేయగల పోరాటమేమయినా ఉంటే చేసి పక్కకు తప్పుకోవడం మాత్రమే. పోరాటం చేయడానికొక కార్మిక సంఘమే లేనిచోట ఆ మాత్రం కూడ లేదు. చూస్తూ చూస్తుండగానే చిన్న చిన్న కంపెనీలలోనే కాదు, ప్రైవేటు కంపెనీలలోనే కాదు, కండబలంతో పనిచేసే కార్మికరంగంలోనే కాదు మొత్తంగా కార్మిక, ఉద్యోగ రంగాలలో 'కాంట్రాక్ట్' పద్ధతి అతి వేగంగా వ్యాపించిపోతున్నది.

కాంట్రాక్ట్ కార్మికులకు ఏ హక్కులూ ఉండవని కాదు. కానీ అన్నిటికంటె ముఖ్యమైన ఉద్యోగ భద్రత మాత్రం అసలే ఉండదు. పర్మనెంట్ లేక రెగ్యులర్ కార్మికులుగా గుర్తింపు పొందిన వారికేదో పూర్తి ఉద్యోగ భద్రత ఉంటుందని కాదు. పూర్తి ఉద్యోగ భద్రత పెట్టుబడిదారీ ఆర్థిక విధానాల నైజానికే వ్యతిరేకం. కానీ వారిని ఒక్క వేటుతో తొలగించడం సాధ్యం కాదు. ఏమీ ఇవ్వకుండా వదిలించు కోవడమూ సాధ్యం కాదు.

ఈ రెండు హక్కులూ కార్మికులకు లేకుండా చేసేది కాంట్రాక్ట్ కార్మిక వ్యవస్థ. ఇదే పెట్టుబడిదారీ యాజమాన్యాలు ఇష్టపడే వ్యవస్థ. 'ఇష్టమున్నప్పుడు పనిలోకి తీసుకుంటాం. ఇష్టం లేకపోతే తీసేస్తాం. దానికి ప్రభుత్వం అనుమతి, నష్టపరిహారం లాంటివేమీ అడ్డం రాకూడదు' అనే స్వేచ్ఛ వారికి కావాలి. మామూలు కార్మికుల విషయంలో ఇది సాధ్యం కాదు కాబట్టి, కాంట్రాక్ట్ కార్మికుల విషయంలో కాంట్రాక్ట్‌ను ముగించేయడం అనే పేరు మీద ఈ 'స్వేచ్ఛ' తీసుకోవచ్చు. కాబట్టి యాజమాన్యాలు కాంట్రాక్ట్ కార్మిక వ్యవస్థను ఇష్టపడుతున్నాయి. సోషలిజానికీ, కార్మిక రాజ్యానికీ సంబంధించిన ఆశతో మొదలయిన ఇరవయ్యవ శతాబ్దం కార్మిక వర్గాన్ని కాంట్రాక్ట్ వ్యవస్థ తాలూకు అభద్రతలో సంపూర్ణంగా ముంచే పరిణామంతో ముగియడం బాధాకరమే.

ఇది మనకు తెలియకుండా జరిగిపోతున్నదన్నాను. రాష్ట్ర విద్యుత్ బోర్డు ఉద్యోగులంటే పూర్తి ఉద్యోగ భద్రత ఉన్న సిబ్బందేనని, మహా అయితే ఒకటి రెండు శాతం  క్యాజువల్ కార్మికులుండవచ్చునని బహుశా చాలామంది అనుకుంటారు. భద్రత పోతుందన్న భయంతోనే బోర్డు ఉద్యోగులిప్పుడు ట్రాన్స్‌కో, జెన్‌కోల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నారనీ అనుకుంటారు. కానీ పర్మనెంట్  కార్మికుల స్థానంలో అదే పని చేయడానికి కాంట్రాక్ట్ కార్మికులను పెట్టుకోవడం విద్యుత్ బోర్డు మొదలుపెట్టి చాలాకాలం అయింది. ట్రాన్స్‌కో, జెన్‌కోల ఏర్పాటు దాకా ఆగలేదు. ప్రజలకు – అంటే విద్యుత్ వినియోగదారులకు – ప్రత్యక్ష సంబంధం ఉన్న సబ్‌స్టేషన్ ఉద్యోగులలో చాలా చోట్ల 75 శాతం మంది దాకా కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న వారే. హెల్పర్లే కాదు, ఇంజనీర్లు కూడ. ఒకే పనికి పర్మనెంట్ ఉద్యోగులకు ఇచ్చే జీతంలో మూడవవంతు ఇచ్చి పని చేయించుకుంటున్నారు. ఎ.పి.ఎస్.ఇ.బి. ఈ వారసత్వాన్ని ఎ.పి. ట్రాన్స్‌కోకు అప్పగించిందే తప్ప కాంట్రాక్ట్ కార్మికులు కొత్త వ్యవస్థతో పుట్టలేదు.

ఈ మధ్య వార్తలలో ఉన్న (బాగా పని చేస్తున్నందుకు కాదు, మూసేయ బోతున్నందుకు) రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ మరొక ఉదాహరణ. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఈ ఎరువుల ఫ్యాక్టరీలోని కార్మికులలో సగం కంటె ఎక్కువ కాంట్రాక్ట్ కార్మికులే. మిగిలిన కార్మికులకు కంపెనీని మూసేసినప్పుడు కొంత నష్టపరిహారమైనా వస్తుంది. కాంట్రాక్ట్ కార్మికులను తొలగించుకోవడానికి అటువంటి ఖర్చేమీ

ఉండదు. వాళ్ళ ప్రత్యక్ష యజమాని అయిన కాంట్రాక్టర్‌తో 'నీ కాంట్రాక్ట్ ముగిసింది' అని చెప్పి తెగతెంపులు చేసుకుంటే చాలు. వెయ్యిమందికి పైగా ఉన్న కాంట్రాక్ట్ కార్మికులనైనా సరే చాలా సులభంగా వదిలించేసుకోవచ్చు.

ఒక ఫ్యాక్టరీ చేసే ప్రధానమైన పనిని కాంట్రాక్ట్‌కు ఇవ్వడం భావ్యం కాదనీ, దానికి సొంత కార్మికులనే నియమించాలనీ, ఫ్యాక్టరీ చేసే వ్యాపారానికి అవసరమయి ఉండి కూడ ప్రధాన విషయం కాని రంగంలో కాంట్రాక్టర్లను ప్రవేశపెడితే అర్థం ఉందనీ ఒక అభిప్రాయం చాలాకాలం న్యాయస్థానాలు వ్యక్తం చేశాయి. ఆ ప్రాతిపదికన కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయమని ఆర్డర్లు కూడ జారీచేశాయి. ఆ అవకాశం ఇప్పటికీ ఉంటే దొడ్డిదారిన కాంట్రాక్ట్ కార్మికులుగా నియమితులయిన వారిలో అందరూ కాకపోయినా కొందరయినా కోర్టుకు పోయి రెగ్యులరైజేషన్ పొందుదురేమో!

కానీ కేంద్ర ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికుల (నియంత్రణ, నిషేధం) చట్టాన్ని చేసి, ఆ అవకాశాన్ని న్యాయస్థానాల చేతినుండి తీసేసి ప్రభుత్వం చేతిలో పెట్టింది. ఏ పారిశ్రామిక రంగంలోనైనా నిర్ణీత స్వభావం గల పనిలో లేక ఉద్యోగంలో కాంట్రాక్ట్ కార్మికులను నియమించడాన్ని నిషేధిస్తూ ఒక తాఖీదు జారీచేసే అధికారాన్ని ఆ చట్టం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకిచ్చింది. ఆ తరువాత ఈ పనిని న్యాయస్థానాలు ఇంక చేయజాలవని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

చట్టమిచ్చిన ఈ అధికారాన్ని ఆ చట్టం స్ఫూర్తితో ప్రభుత్వాలు ఉపయోగించి ఉంటే ఇప్పుడు కార్మికవర్గం ఇంతటి సమస్యలు ఎదుర్కొనేది కాదు. కానీ ప్రభుత్వాలు ఆ అధికారాన్ని వినియోగించింది చాలా తక్కువ. పైగా తామే అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ తమ సిబ్బందినే కాంట్రాక్టు కార్మికులుగా మారుస్తున్నాయి. ఏ కోవకు చెందిన పనిలో అయితే కాంట్రాక్టు కార్మికులను నియమించడాన్ని నిషేధించే అధికారం ఈ చట్టం ప్రభుత్వాలకు ఇచ్చిందో ఆ కోవకు చెందిన పనిలోనే ప్రభుత్వ సంస్థలయిన (ఒకటి రాష్ట్ర ప్రభుత్వ సంస్థ, ఒకటి కేంద్ర ప్రభుత్వ సంస్థ) విద్యుత్ బోర్డు, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలే కాంట్రాక్ట్ కార్మికులను నియమించి పని చేయించుకుంటున్నా యంటే ప్రభుత్వ వ్యవహారశైలికీ, చట్టం కల్పించిన సంక్షేమ అధికారాల స్ఫూర్తికీ ఎంత తేడా ఉందో అర్థం అవుతుంది.

అయినప్పటికీ న్యాయస్థానాలు కాంట్రాక్టు కార్మికులకు ఉపయోగపడే తీర్పులు అడపా దడపా ఇస్తూనే ఉన్నాయి. నిజంగా వాళ్ళు కాంట్రాక్టు కార్మికులేనా లేక తన పనివాళ్ళనే కాంట్రాక్ట్ కార్మికులుగా చూపించడానికి యాజమాన్యం ఒక కాంట్రాక్టర్‌ను అడ్డం పెట్టుకుందా అని చూసి, రెండవదే నిజమయితే వారిని కంపెనీ సిబ్బందిగానే గుర్తించాలని న్యాయస్థానాలు ప్రకటించవచ్చునని ధ్వనించే తీర్పులు 1960ల నుండి సుప్రీంకోర్టు ఇస్తున్నది. ఈ కోవకు చెందిన అత్యంత స్పష్టమైన తీర్పు జస్టిస్ కృష్ణయ్యర్ ఇరవై ఏళ్ళ క్రితం ఇచ్చారు. దానిని విడమరచి చెపుతూ హర్యానా విద్యుత్ బోర్డు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించే తీర్పు ఈ సంవత్సరమే సుప్రీంకోర్టు ఇచ్చింది.

ఈ తీర్పులు కార్మికులకు ఉపయోగపడతాయి గానీ పోరాటం ప్రధానంగా రాజకీయ రంగంలో చేయవలసి ఉంది. ఇదేదో పిడివాదంగా అంటున్న మాట కాదు. అటువంటి పిడివాదం వల్ల ప్రయోజనం ఉందని కూడ నేను అనుకోవడం లేదు. రాజకీయ పోరాటాల కంటే న్యాయస్థానాలలో జరిగే కృషి వల్లనే మేలు జరిగే సందర్భాలు ఉండగలవు కానీ కార్మికులను కాంట్రాక్ట్ కార్మికులుగా మారుస్తూ పోతున్న ప్రస్తుత పోకడ ప్రపంచంలో ఆధిపత్యం వహిస్తున్న విధాన నిర్ణేతల శాసనం. అది భారత రాజ్యాంగానికీ, భారత ప్రజల ఆకాంక్షలకూ అతీతమైన శాసనం. వీటికి తలవంచని పాలకులు దానికి తలవంచుతారు. అది ఆ విధాన నిర్ణేతల బలానికి మాత్రమే నిదర్శనం కాదు, వారితో మన పాలకులకున్న ఆలోచనల సారూప్యానికి కూడ ఒక సంకేతం. అందువల్ల దీనిని వ్యతిరేకించే కృషి రాజకీయ కృషి రూపం తీసుకోక తప్పదు.

కానీ దానికి కావలసిన రాజకీయ బలం భారతదేశంలో కార్మికవర్గం కోల్పోయింది. ఎక్కడికక్కడ తమ సొంత ప్రయోజనాలు కాపాడుకోవడానికే కార్మికులు అలవాటుపడ్డారు. సొంతాన్ని గురించి ఆలోచన అసలే లేని అద్భుతమైన ఆదర్శవాదమేదో కార్మికులలో తప్పనిసరిగా ఉండితీరాలని కాదు. కానీ ఎవరికి వారు సాధించుకున్న హక్కులకు సూత్రబద్ధమైన సార్వజనీనత కల్పించాలని ప్రయత్నించడం ఆ హక్కుల మనుగడకే అవసరం అన్న గుర్తింపు కార్మిక ఉద్యమంలో చాలా బలహీనంగా ఉండడం బాధాకరమైన విషయం. కాంట్రాక్ట్ కార్మికులనేవారు ఒక వేరే కోవకు చెందిన కార్మికులుగా ఉన్నంతకాలం వారికి ఇతర కార్మికులకున్న మేరకయినా ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రయత్నం చేసిన సంఘాలు చాలా తక్కువే. వాటిమీద


ఒత్తిడి పెట్టిన కార్మికులూ అరుదే. ఇప్పుడొక్కసారిగా అందరూ కాంట్రాక్టు కార్మికులుగా మారిపోయే దశ వచ్చేసరికి ఇన్నాళ్ళూ కట్టుకున్న పేకమేడలు కూలిపోతున్న భావన వస్తున్నదే తప్ప ఏమి చేయాలో కార్మికులకు పాలుపోవడం లేదు.

కార్మిక ఉద్యమంలో రాజకీయ విభేదాలు కూడ ఉన్నాయి. కార్మిక పోరాటాలను కార్మిక రాజ్యస్థాపనలో భాగంగా చూడాలని ఒక సిద్ధాంత దృక్పథం, జాతి ప్రగతిలో భాగంగా చూడాలని మరొక సిద్ధాంత దృక్పథం మొదటి నుండి ఉన్నాయి. ఈ సిద్ధాంతాల మధ్య సంవాదం ఎట్లాగున్నా, ఆచరణలో కార్మిక ఉద్యమం ఆయా రాజకీయ పార్టీల వ్యూహాలకూ, ఎత్తుగడలకూ లోబడి మాత్రమే సాగుతూ వచ్చిందనేది సత్యం. ఈ చరిత్రనంతా ఇప్పుడు ఒక్కసారిగా సంస్కరించడం ఎవరివల్లా అయ్యే పని కాదు గానీ, అన్ని తేడాలనూ తాత్కాలికంగానయినా పక్కన పెట్టి కార్మిక సంఘాలన్నీ ఒక్క డిమాండ్‌తో ఉద్యమించడం ఇవాళ్టి అవసరం. అదేమిటంటే – ఏ సంస్థ అయినా తన ప్రధాన ఉత్పత్తి ప్రక్రియలో కాంట్రాక్ట్ కార్మికులను నియమించడానికి వీలులేదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్ట్ కార్మికుల (నియంత్రణ, నిషేధం) చట్టం ఇచ్చిన అధికారంతో ఆర్డర్ జారీ చేయాలని. ఈ ఒకే ఒక డిమాండ్‌తో కార్మిక సంఘాలన్నీ ఒక్క గొంతుతో ఉద్యమించగలిగితే, కార్మిక ఉద్యమాన్ని వారు సిద్ధాంతపరంగా ఏ విధంగా అర్థం చేసుకున్నా (అది నిజంగా కార్మికుల శ్రేయస్సు కోరే అవగాహనే అయితే) తేడా రాదు. తమ లక్ష్యానికి మేలు చేసినవారే అవుతారు.

**ఆంధ్రప్రభ దినపత్రిక**

**24 జులై 1999**

# ఎవరికి కఠినం? ఎవరికి సరళం?



ఎన్నికల ఫలితాలు ప్రకటించి వారం రోజులు కాలేదు. అప్పుడే ముఖ్యమంత్రి రెండుసార్లు, ప్రధానమంత్రి రెండుసార్లు 'కఠిన నిర్ణయాలు' తీసుకోవడం తప్పనిసరి అనీ, ప్రజలు అందుకు సిద్ధంగా ఉండాలనీ ప్రకటించారు. ఎన్నికల ప్రచారమప్పుడు ఈ మాటలెందుకు చెప్పలేదో! 'కఠిన నిర్ణయాలు తీసుకునేవాళ్లనే ఎన్నుకోండి' అని వోట్లెందుకు అడగలేదో!

'కఠిన నిర్ణయాలు' అంటే ఏమిటో ఇప్పుడు దేశంలో అందరికీ అర్థమయిపోయినట్టుంది. అందుకే 'ఎవరికి కఠినం?' అని ఎవరూ అడగడం లేదు. కఠినమంటే అది పేదలకూ పీడితులకే అని అందరికీ తెలిసిపోయింది.

కఠినానికి విరుద్ధమయిన భావన సరళం. సరళీకరణ అన్న మాట కూడ చాలాకాలంగా వింటున్నాం. దాని గురించి కూడ 'ఎవరికి సరళం?' అని ఎవరూ అడగడం లేదు. డబ్బు, పెత్తనం ఉపయోగించుకొని మరింత సంపాదించుకోవడానికి సంపన్నులకు పరిస్థితులను సరళతరం చేయడమే దాని భావమని అందరికీ తెలుసు.

మామూలు భాషలో ప్రత్యేకమైన దుర్మార్గపు ధ్వని ఏమీ లేని కఠినం, సరళం అనే మాటలకిప్పుడొక రాజకీయ ధ్వని వచ్చింది. భారత రాజ్యం 'కఠినమైన నిర్ణయాలు' తీసుకోలేని 'సాఫ్ట్ స్టేట్' (Soft State) అని గున్నార్ మిర్దాల్ కొన్ని దశాబ్దాల క్రితం విమర్శించారు. అయితే ఆయన పాపం ఇప్పటంత క్రూరమైన అర్థంలో ఆ విమర్శ చేయలేదు. ఆర్థిక విధాన రచన కేంద్ర లక్ష్యంగా పేదరిక నిర్మూలన ఉండాలని నమ్మిన సంక్షేమవాది ఆయన. అయినప్పటికీ భారత రాజ్యం 'కఠినంగా' ఉండలేక

పోతున్నదని ఆయన అనడాన్ని వామపక్షవాదులు తీవ్రంగానే విమర్శించారు. ఆయన కఠినం అనే మాటను నిర్విచక్షణగా వాడాడని అభిశంసించారు.

దేశ దీర్ఘకాల అభివృద్ధినీ సమసమాజ లక్ష్యాన్నీ దృష్టిలో పెట్టుకొని ధనవంతుల విలాసవంతమైన జీవన విధానాన్ని భారత రాజ్యం అదుపు చేయవలసి ఉండిందనీ, అందుకోసం అవసరమైన కఠిన నిర్ణయాలు తీసుకోవలసి ఉండీ తీసుకోలేకపోతున్నదనీ విమర్శించడం ఆయన భావమైతే అది నిజమే కావచ్చును గానీ ప్రజలను అణచి వేయడంలో కఠినమైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నదనుకుంటే మాత్రం తప్పని ఆయనను అభిశంసించిన వారు అన్నారు. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా భారత రాజ్యాన్ని 'సాఫ్ట్ స్టేట్' అనడం వల్ల రాజ్యం ఆయన ఉద్దేశించిన దిశలో కాక వేరే దిశలో మరింత కఠినంగా తయారు కావడానికి సాధికారత కల్గిస్తున్నాడని కూడ విమర్శించారు.

ఇప్పుడటువంటి అర్థాలు, అపార్థాలు, పెడర్థాలకు తావు లేకుండా 'కఠినం' అనే మాటకు రాజకీయార్థిక భావనలో ఒకే ఒక అర్థం మిగిలింది. పేదలకు ఇంక మీదట ప్రభుత్వ భూములు పంచం, వాటిని లాభదాయకంగా – గొర్రెల పెంపకం వ్యాపారం చేపట్టే కార్పొరేషన్లకు పచ్చికబీళ్లుగా, కోళ్లఫారాలకు అవసరమైన మొక్కజొన్న సాగుకు మెట్టభూమిగా – వాడుకోగల వారికి లీజుకు ఇస్తాం. అప్పుడే 'జాతీయ ఆదాయం' పెరుగుతుంది. కరెంటు ఉత్పత్తికయ్యే ఖర్చు చెల్లించలేని చిన్నాచితకా రైతులకు కరెంటు చవగ్గా ఇవ్వం. మొత్తం ఖర్చు చెల్లించగల పెద్ద రైతులకు, అవసరమైతే అంతకంటే ఎక్కువ కూడ చెల్లించగల పారిశ్రామిక పెట్టుబడిదార్లకు లాభదాయకంగా అమ్ముతాం. అప్పుడే 'జాతీయ ఆదాయం' పెరుగుతుంది. ఆ విధంగా పెరిగిన ఆదాయం చుక్కలు చుక్కలుగా జారి కిందనున్న వారి నోరు కూడ ఎప్పుడో ఒకప్పుడు తడుపుతుంది.

ఎప్పుడు తడుపుతుంది? అసలు తడుపుతుందన్న గ్యారంటీ ఏమిటి? ఈ లోపల 'కిందనున్న' వారు గొంతెండి చచ్చిపోతే ఎట్లా? మొదలయిన వెకిలి సందేహాలకు తావు ఇయ్యని వైఖరినే ఇప్పుడు 'కఠినం' అని అభినందనపూర్వకంగా అంటున్నారు. 'కఠిన నిర్ణయాలు' అన్న మాటను చాలా సార్వత్రికమైన అర్థంలో ప్రయోగిస్తున్నట్టు మాట్లాడుతున్నా నిజానికి చాలా ప్రత్యేకమైన అర్థంలో వాడుతున్నారని అర్థం అవుతుంది. ఉదాహరణకు మన విదేశీ చెల్లింపులు లోటులో పడకుండా చూసుకోవడం ఆర్థిక

వ్యవస్థ సుస్థిరతకు చాలా అవసరం. దాని కోసమని చెప్పే ఎగుమతులను ప్రోత్సహించడం, నూరుశాతం ఎగుమతుల కోసమే ఉత్పత్తి చేసే సంస్థలకు అనేక రాయితీలు ఇవ్వడం, ఎక్స్‌పోర్ట్ ప్రాసెసింగ్ జోన్‌లలో కార్మిక చట్టాలు వర్తించవన్న 'రాయితీ'కి సహితం సిద్ధపడడం, ఎగుమతులకు తగిన నాణ్యతగల సరుకులను ఉత్పత్తి చేసే సామర్థ్యంగల విదేశీ కంపెనీల పెట్టుబడుల దిగుమతిని ఆహ్వానించడం మొదలయిన అనేక చర్యలు చేపడుతున్నారు. నిజానికి, వీటికి ప్రత్యామ్నాయంగా వేరే 'కఠిన నిర్ణయాలు' కొన్ని తీసుకోవచ్చు. మన దిగుమతులలో ప్రధానమైనవి పెట్రోలియం ఉత్పత్తులు. వీటిని తగ్గించే నిర్ణయాలు తీసుకోవచ్చు. దేశంలో కార్ల ఉత్పత్తిని కట్టడి చేయవచ్చు. కార్ల పరిశ్రమను రెండో మూడో రకాల కార్లకు పరిమితం చేసి వాటి సంఖ్యను కూడ పరిమితం చేయవచ్చు. లేదా (కొన్ని దేశాలలో ఉన్నట్టు) కారులో నలుగురికి తక్కువ కాకుండా ప్రయాణం చేయాలన్న నియమం పెట్టవచ్చు. అప్పుడు ఇరుగుపొరుగు కలిసి ఒకే కారులో ప్రయాణం చేయకతప్పదు. ఆ మేరకు పెట్రోలు మిగులుతుంది.

ఇది కూడ 'కఠిన' నిర్ణయమే. కాకపోతే పేదలకు కాదు, కార్ల మోజులో ఒళ్ళు మరిచిపోతున్న ధనిక వర్గానికీ, ఎగువ మధ్యతరగతికీ మాత్రమే ఇది 'కఠిన' నిర్ణయమవుతుంది. ఈ నిర్ణయం తీసుకున్నట్లయితే ఎగుమతులకు ప్రోత్సాహమిచ్చే పేరిట పేదలకు వర్తించే కఠినమైన నిర్ణయాలేవైతే తీసుకుంటున్నారో (ఉదాహరణకు ఎక్స్‌పోర్ట్ ప్రాసెసింగ్ జోన్‌లలో కార్మిక చట్టాలు వర్తించవన్న నిర్ణయం) అవి ఒక మేరకైనా అనవసరం కాగలవు.

ఇటువంటి నిర్ణయాలను చాలా ఉదహరించవచ్చు. విదేశీ పెట్టుబడిని పెద్ద మొత్తంలో ఆకర్షించక తప్పదనీ, ఆ పెట్టుబడిని మెప్పించే వాతావరణం కల్పించక తప్పదనీ, అందుకోసం పేదలపైన కొన్ని 'కఠిన నిర్ణయాలు' రుద్దక తప్పదనీ అంటున్నారు. నగరాలను అందంగా తీర్చిదిద్దడం కోసం పేదలను వాళ్ళ పని స్థలాలకు దగ్గరున్న నివాసాల నుండి తొలగించి ఊరిబయట పడేయడం (హైదరాబాద్‌లో మూసీ తీర వాసుల విషయంలో చేస్తున్నట్టు) దీనికొక ఉదాహరణ. దానికి ప్రత్యామ్నాయంగా మన దేశంలోని సంపన్నుల నుండి పెట్టుబడులు సేకరించడానికి 'కఠినమైన' నిర్ణయాలు కొన్ని తీసుకోవచ్చు. ఉదాహరణకు పన్నులెగ్గొట్టే వారిని బుజ్జగించి నలుపును తెలుపు చేసుకునే సదుపాయాలు కల్పించే బదులు రేపిస్టులకూ, బాంబులు పట్టుకుని

తిరిగేవాళ్ళకూ కఠిన శిక్షలు వేస్తామని బెదిరిస్తున్నట్లుగా వీరికి కూడ పదేళ్ళో, పదిహేనేళ్ళో జైలు శిక్ష వేస్తామని హెచ్చరించవచ్చు. అటువంటి చట్టాలు సైతం చేయవచ్చు.

ఈ రూపంలో కాకపోతే వేరే ఏదో ఒక రూపంలో ధనవంతులకు కఠినమైన నిర్ణయాలు తీసుకోవచ్చు. సమాజ సంపద కొద్దిమంది చేతిలో కేంద్రీకృతం కాకుండా సమాజ ఉమ్మడి ప్రయోజనాల సాధనకు ఉపయోగపడాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏ చట్టం చేసినా చెల్లుతుందని మన రాజ్యాంగం (ఆర్టికల్ 31సి) చెపుతుంది. కాబట్టి ఆ లక్ష్యంతో కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి అడ్డమేమీ లేదు. అటువంటి నిర్ణయమేది తీసుకున్నా విదేశీ పెట్టుబడుల కోసం పేద ప్రజలను కష్టపెట్టే కఠినమైన నిర్ణయాలు తీసుకునే అవసరం ఆ మేరకు తగ్గుతుంది.

అందువల్ల చంద్రబాబునాయుడైనా, వాజ్‌పేయి అయినా చాలా గంభీరంగా ముఖం పెట్టి కఠిన నిర్ణయాలకు ప్రజలు సిద్ధంగా ఉండాలన్నప్పుడు అవేవో సార్వత్రికంగా కఠినమైనవని అనుకోనవసరం లేదు.

పెట్రోలియం దిగుమతుల బిల్లు పెరుగుతున్నదని వాపోతూ కూడ లెక్కలేనన్ని కొత్త రకాల కార్ల ఉత్పత్తిని దేశంలో ప్రోత్సహిస్తారు. అంతేకాక ఆ కార్ల కంపెనీలకు మంచి మార్కెట్ ఉండగలందులకుగాను కార్ల కొనుగోలుకు విరివిగా అప్పులిచ్చే విధానాలను కూడ ప్రభుత్వ బ్యాంకులు అనుసరిస్తాయి.

ఒక్క పెట్రోలియం దిగుమతులే కాదు, ధనిక వర్గాల జీవన సౌఖ్యాన్ని పెంచే అనేక దిగుమతులు రోజు రోజుకూ మరింత ఎక్కువ పరిమాణంలో జరుగుతున్నాయి. వాటిని అదుపు చేసే నిర్ణయాలు మన పాలకులు తీసుకోరు. తీసుకున్నా ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పుకోదు. కాబట్టే ఎగుమతులు పెంచే వ్యూహం మన ఆర్థిక విధానాలకు కేంద్రం అవుతుంది. ప్రపంచ మార్కెట్‌లో నాణ్యమైన సరుకులు అమ్మకానికి పెట్టాలంటే అందుకు తగిన సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ నైపుణ్యం కావాలి. కాబట్టి ఆ సామర్థ్యం ఉన్న పెట్టుబడిదారీ కంపెనీలను దేశంలోకి ఆహ్వానించడం అవసరం అవుతుంది. ఇది పెట్టుబడి దిగుమతినీ, దానికి అనుబంధంగా ఇతర వస్తు, సేవా దిగుమతులనూ మరింత పెంచుతుంది. కాబట్టి ఎగుమతులను పెంచే

వ్యూహం దిగుమతులను పెంచి ఎగుమతులను మరింతగా పెంచే అవసరానికి దారితీస్తుంది. ఈ విషవలయం అనేక 'కఠిన నిర్ణయాల'కు దారి తీస్తుంది.

మన పాలకులు ఈ రోజు 'భరించక తప్పదు మరి' అంటూ నిస్సహాయత వ్యక్తం చేస్తున్న నిర్ణయాలకు కారణమైన అర్థరహితమైన విధాన రచనకు ఇదొక మచ్చుతునక మాత్రమే. వేరే కోణాల నుండి వేరే చాలా చెప్పవచ్చు. అయితే ఈ అబద్ధపు నాటకాన్ని ప్రజలకు విడమరిచి చెప్పేవారే కరువయ్యారు. దేశంలోని మేధావులలో అత్యధిక భాగం ఈ నాటకంలో భాగమైపోవడం వల్ల 'పాపం మన పాలకులు ఎన్ని కష్టాలలో ఉన్నారో, దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి కాపాడడానికి ఎంత కష్టమైన నిర్ణయాలు తీసుకుంటున్నారో, మనం మధ్యలో పనులు కావాలనీ తిండి కావాలనీ అల్లరి చేయడం ఏం బాగుంటుంది?' అని ప్రజలు తమ నోళ్ళు తామే నొక్కేసుకునే స్థితి వచ్చింది.

**ఆంధ్రప్రభ దినపత్రిక**
**28 అక్టోబర్ 1999**

# ప్రపంచ ప్రభుత్వం ప్రపంచ ప్రభువులు

అంతర్జాతీయ రాజకీయాలలో భారతదేశం ఏ పాత్ర నిర్వహించాలన్న ప్రశ్న ఇప్పుడు పూర్తిగా పక్కకు పోయినట్టుంది. అసలు మనకొక పాత్ర అంటూ ఉండగలదనే ఆత్మవిశ్వాసమే మనం కోల్పోయినట్టున్నాం. విదేశీ పెట్టుబడిని దేశంలోకి ఆకర్షించడం కోసం, కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్ పట్ల వ్యతిరేకత పెంచడం కోసం తగిన ఎత్తుగడలు అన్వేషించడం తప్ప మనకొక విదేశాంగనీతి అంటూ ఇప్పుడేదీ లేదు.

మన పరిస్థితి ఎప్పుడూ ఈ విధంగా లేదు. భారతదేశానికి అంతర్జాతీయ రాజకీయాలలో ఒక 'పాజిటివ్' పాత్ర ఉండాలని మన నాయకులు నమ్మిన రోజులున్నాయి. నెహ్రూయే కాదు, ఆయనను ప్రతి సందర్భంలోనూ తీవ్రంగా విమర్శించిన రాం మనోహర్ లోహియా కూడ ఈ విషయంలో బలమైన విశ్వాసం గల రాజకీయవేత్త.

క్లింటన్ భారత పర్యటన మీద దేశమంతా దృష్టి పెట్టి ఉండగా లోహియా తొంభయ్యవ జయంతి గడిచిపోయింది. భారతదేశానికి ఆత్మగౌరవంతో కూడిన విదేశాంగనీతి మాత్రమే కాక ప్రపంచ రాజకీయాలలో చురుకైన పాత్ర ఉండాలని నమ్మిన లోహియా ఆలోచనలకూ, ఆత్మగౌరవాన్ని అక్కరకు రాని సెంటిమెంట్‌గా భావించే ఈ నాటి తెలివికి సంకేతంగా సాగిన క్లింటన్ పర్యటనకూ ఏనుగుకూ, దోమకూ మధ్యనున్నంత తేడా ఉంది. మన దేబిరింపులు క్లింటన్‌ను పాకిస్తాన్‌కు పోకుండా ఆపగలిగి ఉంటే అది మన విదేశాంగనీతికొక గొప్ప విజయమని మన

దేశంలోని రాజకీయ వ్యాఖ్యాతలంతా రాసి ఉందురు. ఆపలేకపోయినా, ఆ థర్డ్‌రేట్ అమెరికా అధ్యక్షుడు పాకిస్తాన్‌కు పోయి అక్కడివారికి అతను నాలుగు చురకలేసినా చాలు అది సైతం మనకొక విజయమే. అతను చురకలు వేశాడని మన పత్రికలు మనకు చెప్తున్నాయి. వేరే ఏ దేశాల పత్రికలూ క్లింటన్ మాటలను ఆ విధంగా వ్యాఖ్యానించక పోయినా నమ్మడానికి మనం సిద్ధంగా ఉన్నాం. ప్రపంచవేదిక మీద పాకిస్తాన్‌ను ఒకంగుళం కిందికి లాగి సంతృప్తి చెందడం తప్ప మనకు వేరే ఏ కోరికా ఈ రోజు లేదు.

కానీ భారతదేశం – భారతదేశంలోని సోషలిస్టు ఉద్యమం – ఒక ప్రపంచ ప్రభుత్వం ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని లోహియా నమ్మాడు. ఒక్క లోహియా మాత్రమే కాదు, సకల దేశాల సోషలిస్టులలోనూ 'ప్రపంచ ప్రభుత్వం' అనే భావన బలంగా ఉండింది. ప్రతీ దేశానికీ – చిన్నా పెద్ద తేడా లేకుండా – సమాన ప్రాముఖ్యం ఇచ్చే ప్రపంచ ప్రభుత్వమొక్కటే నిజమైన అర్థంలో ప్రపంచశాంతిని నెలకొల్ప గలుగుతుందని సోషలిస్టులు నమ్మారు. లోహియా విశ్వాసం అందులో భాగమే.

ఆయన నిజానికి కేంద్రీకృత అధికారానికి వ్యతిరేకం. భారత రాజ్యాంగంలోని కేంద్రం – రాష్ట్రం అనే రెండంచెల పాలనా వ్యవస్థ నిజమైన ప్రజాస్వామ్యాన్ని ఇవ్వలేదనీ, కేంద్రం–రాష్ట్రం–జిల్లా–గ్రామం అనే నాలుగంచెల పాలనా వ్యవస్థ ఉండాలనీ, వీటి మధ్య బాధ్యతల విభజన మీది నుండి కిందికి కాక, కింది నుండి మీదికి ఉండాలనీ ఆయన నమ్మాడు. కాబట్టి ఆయనొక ప్రపంచ ప్రభుత్వాన్ని కోరుకోవడం అధికార కేంద్రీకరణ కోసం కాదు. ప్రపంచ దేశాలన్నిటికీ ఒకే మోతాదులో గుర్తింపునిచ్చి, అన్ని దేశాల ఉమ్మడి భావాలకు ప్రతినిధిగా ఉండే ప్రపంచ ప్రభుత్వమే పెద్ద దేశాల బారి నుండి చిన్న దేశాలను కాపాడగలుగుతుందనీ, న్యాయంతో కూడిన ప్రపంచశాంతిని నెలకొల్పగలుగుతుందనీ ఆయన నమ్మాడు.

పెద్ద రాజ్యాల పర్యవేక్షణలో చిన్న రాజ్యాల బాధ్యతారాహిత్యాన్ని అదుపులో ఉంచి, పెద్ద రాజ్యాలు నిర్వచించిన శాంతి నెలకొల్పే యంత్రాంగంగా ఆవిర్భవించిన ఐక్యరాజ్యసమితి పట్ల లోహియాకు గౌరవం లేదు. అది ప్రపంచ ప్రభుత్వానికి తొలిమెట్టుగానీ, తొలిదశగానీ కాజాలదని గట్టిగా అన్నాడు. అయినప్పటికీ – రాజకీయాలలో అతివాది కాదు కాబట్టి – ఏదైనా అంతర్జాతీయ సమస్యను ఐక్యరాజ్య

సమితి న్యాయసమ్మతంగా పరిష్కరించగలిగితే అందుకు సహకరించాలనే లోహియా నమ్మాడు. కానీ దానికి నిజమైన ప్రత్యామ్నాయమైన ప్రపంచ ప్రభుత్వం కోసం కృషి మాత్రం దానికి వెలుపల కొనసాగించాలని నమ్మాడు. భారతదేశం – ప్రత్యేకించి భారతదేశంలోని సోషలిస్టులు – దీని కోసం కృషి చేయాలని భావించాడు.

ఈ రోజు చాలా వింతగా, కాకమ్మ కథలలాగా అనిపించే ఆలోచనలు యాభై ఏళ్ళనాడు చాలామంది విశ్వసించినవే. వలస దేశాలు విముక్తమయి, తమ సొంత అస్తిత్వాన్ని వెతుక్కుంటూ, తమ సొంత అభివృద్ధి నమూనాలను రూపొందించుకుంటున్న రోజులవి. ఆ దేశాలు – అందులో అతి పెద్దది, లోతయిన తాత్విక ఆలోచనకు పేరు పొందినది అయిన భారతదేశం – అగ్రదేశాల మెడలు వంచి ఒక ప్రపంచ ప్రభుత్వాన్ని నెలకొల్పబూనుకోవడం లోహియా వంటి వారికి అసాధ్యమైన అజెండాగా అనిపించలేదు. ఈ అజెండా లేకుండా కేవలం రెండు అగ్రరాజ్య కూటములకూ దూరంగా ఉండడం అనే తటస్థ వైఖరికి పరిమితమయ్యిందనే ఆయన నెహ్రూ ప్రతిపాదించిన అలీనవాదాన్ని విమర్శించాడు.

ఇప్పుడు మన కళ్ళముందొక ప్రపంచ ప్రభుత్వం ఏర్పడటాన్ని మనం చూస్తున్నాం. ఇది లోహియా కలలుగన్న ప్రపంచ దేశాల ప్రజాస్వామిక పాలనా వ్యవస్థ కాదు. ఇది తనను తాను ప్రపంచ పోలీసుగా ప్రకటించుకున్న అమెరికా పెత్తనం. తనను తాను ఏకైక ఆర్థిక విధాన రచయితగా ప్రకటించుకున్న ప్రపంచ బ్యాంకు పాలన. తనను తాను ప్రపంచ దేశాల ద్రవ్యసంస్థల నిర్ణేతగా ప్రకటించుకున్న అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ అజమాయిషీ.

ఈ యాభై ఏళ్లుగా ఎంత అస్తవ్యస్తంగానైనా సరే ప్రపంచ దేశాల మధ్య సమస్యలను సంప్రదింపుల ద్వారా పరిష్కరించి యుద్ధందాకా పోకుండా చూడడానికి కొంత కృషి చేసిన ఐక్యరాజ్య సమితిని సైతం ఈ ప్రపంచ పెత్తందారీ ఎంతమాత్రం గౌరవించదు. తమ నిర్ణయాలను అది తనవిగా ప్రకటించి అమలుచేస్తే సరి. లేకపోతే దానిని కాదని ప్రపంచ శాంతిని నిలబెట్టే 'భారం' ఈ పెత్తందార్లు తమ మీదనే వేసుకుంటున్నారు. అమెరికా నిర్ణయిస్తే చాలు సై అంటూ వెంట రావడానికి ఏ సమయంలోనైనా అరడజను పాశ్చాత్య రాజ్యాలు సిద్ధంగా ఉన్నాయి. ప్రపంచ ప్రభుత్వం ఈ రూపంలో సిద్ధించింది.

ఇది కేవలం సైనికపాలన కాదు. ఆర్థిక విధానాలలో, ద్రవ్య వ్యవహారాలలో, ఎగుమతి దిగుమతుల సమతుల్యాన్ని నిలబెట్టగల విధాన రచనలో – అన్నింటా ఈ రోజు ఒకే ఒక సత్యం ఉంది. స్థల, కాల, వాతావరణ భేదాలు లేకుండా ఆ సత్యమే అందరికీ వర్తిస్తుంది. అది దృక్కోణాలకూ, తాత్విక దృక్పథాలకూ అతీతమైన వస్తుగత సత్యం. దాని నెరిగిన వారు ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థల అధికారులు మాత్రమే. ఆ కుర్చీలలో ఎవరు కూర్చుంటారనేది అమెరికా నిర్ణయిస్తుంది కాబట్టి వారెరిగిన సత్యం అమెరికా మెచ్చినదే కాక తప్పదు.

లోహియా మాత్రమే కాక అన్ని దేశాల సోషలిస్టులు కాంక్షించిన ప్రపంచ ప్రభుత్వం ఈ రూపంలో సిద్ధించింది. అయితే లోహియా వంటి వారు ఊహాత్మకంగా రూపకల్పన చేసిన ప్రపంచ ప్రభుత్వం భావన మనకు కొంచెమైనా జ్ఞాపకం ఉంటే ఇది ఎంత వికృతమైన సృష్టో అర్థమై ఉండేది. భారత ప్రభుత్వం అలీనంగా ఉంటానని ప్రకటించిన రోజులలోనే ఆ అలీన ఉద్యమానికి విశ్వపాలనా వ్యవస్థనొక ప్రత్యామ్నాయంగా నిర్మించే అజెండా ఏమీ లేదనీ, కేవలం రెండు అగ్రరాజ్య కూటములకూ దూరంగా ఉంటూ వాళ్ళు చేసే దౌర్జన్యాలను, దుర్మార్గాలను ఆపలేక, అంతా అయిపోయిన తర్వాత 'ఇది అన్యాయం' అని ఖండించడానికే అది పరిమితమయిందనీ లోహియా విమర్శించాడు. ఇప్పుడు సమదూరం పాటించడానికి రెండవ పక్షం లేదు. తటస్థంగా ఉండడానికి రెండవ సత్యం లేదు. ఆ ఒకే ఒక సత్యాన్ని అబద్ధం అని ప్రకటించే చేవగానీ, దాని కోసం బడుగు దేశాలను కూడగట్టే రాజకీయ లక్ష్యంగానీ భారత్‌తో సహా ఏ 'మూడవ ప్రపంచ' దేశానికీ లేవు. ఏ బడుగు దేశమూ ఈ రోజు ఏ ఇతర బడుగు దేశాన్నీ ప్రపంచ దేశాల కూటమిలో న్యాయాన్ని నిలబెట్టడం కోసం చేరదీయగల మిత్రునిగా భావించడం లేదు. ఏకైక ప్రపంచ పాలకుని చల్లటి చూపుల కోసం పోటీపడే వైరిగానే ఒకరినొకరు చూసుకుంటున్నాయి. అందుకోసం తమను తాము ముస్తాబు చేసుకుంటున్నాయి. పొరుగు వారెంత అందవికారంగా ఉన్నారో ఎత్తి చూపుతున్నాయి.

ప్రజాస్వామ్యం మన ముస్తాబులోని అతి ముఖ్యమైన విషయం. అది లేకపోవడం పాకిస్తాన్ ముఖంలోని స్ఫోటకపు మచ్చ. క్లింటన్ దొరవారు వస్తారని చెప్పిన నాటి నుండి ఆ మచ్చను వేలెత్తి చూపించి ఆయనను పాకిస్తాన్ పోవద్దని హెచ్చరించడంతోనే

మనకు సరిపోయింది. దేశాలు ఎవరి అవసరాలకు తగిన ప్రణాళికా రచన వారు చేసుకుంటారని అనుకునే రోజులలో మనబోటి బడుగు దేశాలు ఒకటిగా నిలబడి అంతర్జాతీయ అగ్రరాజ్య పెత్తనాన్ని వ్యతిరేకించే అవకాశమైనా ఉండిందేమో! కానీ గ్లోబలైజ్ అయిపోయిన ఈ ప్రపంచ కుగ్రామానికి సరిహద్దులు లేవు, సరిహద్దుల లోపల ప్రత్యేకతలు లేవు, ప్రజాకాంక్షలు లేవు, భిన్న ప్రణాళికలు లేవు. ఉండేది ఒక్క విధానమే. అది పాశ్చాత్య పెట్టుబడి చుట్టూనే తిరుగుతుంది కాబట్టి దానిని ఆకర్షించే పోటీలో బడుగుదేశాలు ఒకరికొకరు శత్రువులు కాగలరే తప్ప ప్రపంచ పెత్తనాన్ని వ్యతిరేకించే ఉమ్మడి శక్తి కాజాలరు. ఇప్పుడు ఏర్పడే ప్రపంచ ప్రభుత్వం లోహియా వంటి తత్వవేత్త కలలు కన్నది కాజాలదు. వ్యాపార మెళకువలనూ, వ్యవహార లౌక్యాన్నీ తాత్విక దృక్పథమని సర్దిచెప్పుకునే మూడవ శ్రేణి నాయకుల డాలర్ల కలల కల్పనే కాగలదు.

**ఆంధ్రప్రభ దినపత్రిక**
**30 మార్చి 2000**

# కార్పొరేట్ వాదనకు 'కలిసొచ్చే' కరువు

**త**మిళనాడులో టీ ఆకు పండించే చిన్న రైతులు, కాశ్మీర్‌లో ఊలు అమ్ముకొని బతికే గొర్రెల పెంపకందార్లు, హిమాచల్ ప్రదేశ్‌లో ఆపిల్ పళ్లతోటలు పెట్టుకున్న చిన్న రైతులు తమ భవిష్యత్తు గురించి చెందుతున్న ఆందోళన ఆయా రాష్ట్రాల పత్రికలు ప్రముఖంగానే రాస్తున్నాయి. ఊలుకూ ఆపిల్ పళ్లకూ తేయాకుకూ సంబంధమేమిటా అని ఆశ్చర్యపోవద్దు. ఒక సంబంధం ఉంది. మారుతున్న ప్రపంచ వాణిజ్య నియమాలను అనుసరించి దేశంలోకి పెద్దఎత్తున దిగుమతి అవుతున్న గ్రామీణ ఉత్పత్తులు ఇవి. ఇంకా ఇతర రాష్ట్రాలలో ఇటువంటి సరుకులనేకం ఉన్నాయి.

దిగుమతుల పోటీ వల్ల వీటి ధరలు పడిపోయి రైతులు గతంలో ఎన్నడూ లేనంతగా నష్టపోతున్నారు. ఒకవేళ దిగుమతులతో నాణ్యత విషయంలో మన రైతుల ఉత్పత్తులు పోటీ పడగలిగినా, 'మార్కెటింగ్'లో పోటీ పడలేరు. ఉత్పత్తులు ఎంత నాణ్యమైనవనేది కాదు, ఎంత సమర్థంగా వాటిని 'మార్కెట్' చేయగలరనేది అమ్మకాన్ని నిర్ణయిస్తుంది. ఈ 'మార్కెట్' చేయగలగడం అనేదాన్ని నిర్ణయించే విషయాలలో సరుకు నాణ్యత ఒకటి మాత్రమే.

అందుకే వ్యవసాయ ఉత్పత్తులలో కూడ స్వేచ్ఛా విపణిని ఏర్పాటు చేస్తే అది 'మన రైతులు కూడ ఉపయోగించుకోగల వ్యవస్థ' కాగలదనుకోవడం భ్రమ. కాని వ్యవసాయ ఉత్పత్తుల ప్రపంచీకరణను సమర్థించేవాళ్ల వాదన వేరు. ఆస్ట్రేలియా ఆపిల్ పళ్లు మన మార్కెట్‌లోకి వచ్చి కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ ఆపిల్ తోటలు నష్టపోతే పోవచ్చునుగానీ, పంజాబు ఆలుగడ్డలు ఆస్ట్రేలియాకు ఎగుమతయి వాటిని పండించే

రైతులు బాగా లాభాలు సంపాదించుకోగలరనీ, మొత్తం మీద వ్యవసాయంలో అపారమైన అనుభవం ఉన్న మన రైతులే లాభాలు ఎక్కువ పొందగలరనీ రైతులపట్ల సానుభూతిగలవారు సైతం వాదిస్తున్నారు.

అమ్మకపు మార్కెట్ల మీద ఆధిపత్యం నెలకొల్పే పద్ధతుల గురించి సరైన అవగాహన లేకపోవడం వల్ల కలిగే అభిప్రాయాలివి. వ్యవసాయ ఉత్పత్తుల ప్రపంచీకరణ నుండి మనం కూడ ప్రయోజనం పొందాలంటే ఇతర దేశాల మార్కెట్లలో ఎటువంటి ఉత్పత్తులకు గిరాకీ ఉందో తెలియాలి. అటువంటి ఉత్పత్తులు చేపట్టడానికి అవసరమయిన పెట్టుబడులు పెట్టగలగాలి. ఇతర మార్పులూ చేసుకోగలగాలి. ఉత్పత్తి అయిన సరుకును నిలువ ఉంచే పద్ధతిలో ప్యాకింగ్ చేసి రవాణా చేయగలగాలి. ఆకర్షణీయంగా ప్రచారం చేసి అమ్మగలగాలి. ఒక్కమాటలో చెప్పాలంటే వ్యవసాయంలో మెలకువలు తెలిస్తే చాలదు, 'అగ్రి బిజినెస్' తెలియాలి. పాశ్చాత్యదేశాలు మనం వాడే పురుగుల మందుల పైననో, ఎరువుల పైననో నెపం పెట్టి మన ఎగుమతులను అడ్డుకోకుండా ఉంటారనుకున్నా, అభివృద్ధి చెందిన వ్యవసాయ వ్యాపార వ్యవస్థ లేనిదే మన వ్యవసాయదారులు ఈ ప్రపంచీకరణ వల్ల ప్రయోజనం పొందలేరు.

అది నెమ్మదిగా అభివృద్ధి చెందుతుందనుకోవచ్చు. కానీ అంతవరకు ఆగితే చంద్రబాబు వంటి నాయకులు కోరుకునే విపరీతమైన పెరుగుదల రేట్లు ఎక్కడినుండి వస్తాయి? కాబట్టి ఈ లోపలే మన వ్యవసాయ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లోకి ప్రవేశించాలంటే 'అగ్రి బిజినెస్'లో ఆరితేరిన విదేశీ కార్పొరేషన్లనే మళ్లీ ఆహ్వానించి మన భూములను మన రైతులను వారికి అప్పగించడానికి మన పాలకులు సిద్ధపడుతున్నారు.

అంటే విదేశీ కార్పొరేషన్లు చేసే వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల పోటీకి తట్టుకోలేక మన రైతులు పతనమైతే, ఎగుమతులు మనకు చేతకావు కాబట్టి తిరిగి అవే కార్పొరేషన్లను దేశంలోనికి ఆహ్వానించి వాటిద్వారా ఎగుమతులు చేసి మన రైతులు 'ప్రయోజనం' పొందాలి. రెండు వైపులా బహుళజాతి అగ్రి బిజినెస్ కార్పొరేషన్లకు మేలు చేసే విధానం ఇది.

దీని ఫలితంగా దిగుమతుల వల్ల మన రైతులు నష్టపోవడమే కాక ఎగుమతుల వల్ల వచ్చే లాభం కార్పొరేషన్ల జేబుల్లోకి పోతుందనేది ఒక్కటే మన బాధ కాదు. అగ్రి

బిజినెస్‌తో ముడిపడిన ఎగుమతి  రంగంలోకి ప్రవేశించే రైతుల జీవితాలు చాలా అభద్రంగా ఉంటాయనేది కూడ చాలా ఆందోళన కలిగించే విషయమే. పెట్టుబడి పెట్టిన తరువాత ఆ పంటకు ఆ సంవత్సరం అంతర్జాతీయ మార్కెట్‌లో గిరాకీ లేదని ఆ కంపెనీ కొనుక్కోకపోవచ్చు. రైతుల దగ్గర మిగిలిపోయిన పంటను కొనుగోలు చేసి భద్రపరిచి తిరిగి మార్కెట్‌లో గిరాకీ ఉన్నప్పుడు అమ్ముకునే ప్రభుత్వ మార్కెటింగ్ సంస్థలు ఇకమీదట ఉండబోవని మన పాలకులు స్పష్టం చేస్తున్నారు కాబట్టి ఆ రైతుల గతేం కావాలి?

లేదా ఈ సంవత్సరం లాగ కరువు తీవ్రంగా వచ్చిందనుకోండి. ఈ సంవత్సరం గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలలో జిల్లాలకు జిల్లాలే తరలిపోయిన రైతుల భూములు ఏ అగ్రి బిజినెస్ కంపెనీతోనో ముడిపడిన భూములనుకోండి. మెట్టపంటలకు కూడ ఆ భాగ్యం కలిగిస్తామని మన పాలకులు అంటున్నారు కాబట్టి ఇందులో ఊహకందనిది ఏమీ లేదు. ఈ సంవత్సరం వారు ఆ కంపెనీ నుండి అప్పుచేసి లేదా అడ్వాన్స్ కింద తెచ్చుకున్న పెట్టుబడిని కోల్పోవడమే కాదు, వచ్చే సంవత్సరం వానలు బాగా కురిసినా తిరిగి పంట వేయడానికి వారికి పెట్టుబడి దొరకడం కష్టం. కాబట్టి వారితో వ్యాపార సంబంధమే తప్ప వేరే ఏ సంబంధం లేని కంపెనీ ఇంక వీరితో లాభం లేదని వేరే ఎక్కడో తనకు కావలసిన సరుకు నిచ్చే రైతులను వెతుక్కుంటుంది. వీళ్ల పాత బాకీ ఉండిపోతుంది. గిరాకీ తరలిపోతుంది. తిరిగి మళ్లీ ఒక కొనుగోలుదారును వెతుక్కొని స్థిరపడాలంటే ఒక కరువు కాదు, రెండు కరువులు దాటాలి. 'అగ్రి బిజినెస్'తో వ్యవసాయాన్ని బంధించే ప్రయత్నం మరీ ఇంత దూరం సాగకముందే పత్తి రైతుల ఆత్మహత్యల వార్తలు విరివిగా వింటున్నాం. ఇంక రేపేం కానుందో! ఈ చిత్రం మన పాలకుల ఊహలకు అందకపోలేదు. అందుకే రైతులను అగ్రి బిజినెస్‌తో ముడిపెట్టే ఈ అస్థిరమైన వ్యవస్థ కంటే, కంపెనీలే రైతుల భూములు కొనేసి, లేక లీజుకు తీసుకొని వారిని కూలీలుగా పెట్టుకొని పని చేసుకునే ఏర్పాటు మంచిదని వారు అంటూనే ఉన్నారు.

ఈ 'ముందుచూపు' అందరి కంటే మొదట చంద్రబాబు ప్రదర్శించారు. రెండు మూడెకరాల రైతులను ఉండనిచ్చి, వారి చేతకాని వ్యవసాయాన్ని కార్పొరేషన్లతో ముడిపెట్టడం కంటే వారి భూములను కార్పొరేషన్లకే చేరవేసే ఏర్పాటు చేసేస్తే 'రాష్ట్ర ఆదాయం' మరింత వేగంగా పెరుగుతుంది కదా (అందులో చిన్న రైతుల ఆదాయం

తగ్గితే తగ్గిందిగాక) అని ఆయన 'విజన్ 2020' రాయించిన నాటి నుండి అంటున్నారు. 'చిన్న వ్యవసాయాలు దండగ' అని కూడ చాలా ఉధృతంగా ప్రచారం చేస్తున్నారు. అంతేకాదు, ఈ దండగమారి చిన్న రైతుల కమతాలను వ్యవసాయ వ్యాపారం చేసే పెద్ద రైతులకు, లేక కంపెనీలకు బదలాయించే అవకాశం లేకుండా చేసే భూసంస్కరణల చట్టాలను సవరించాలనీ అంటున్నారు.

నిన్నగాక మొన్న అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ కూడ ఈ మాటే అంది. భారతదేశంలో పేదరికం తొలగకపోవడం విచారకరం అని అంతర్జాతీయ ద్రవ్యనిధి అన్నదని పత్రికలలో చదివి అందరూ ఆశ్చర్యపోయే ఉంటారు. అయితే ఈ వార్తను తరచి చదివితే ఆ సంస్థ దృష్టిలో ప్రధానమైన అభ్యంతరమేమిటో అర్థం అవుతుంది. 'కమతాల పరిమాణంపైన ఉన్న పరిమితులను సడలించలేకపోవడం' ఒక అవరోధమనీ, 'కార్మికుల తొలగింపుపైన ఉన్న నియంత్రణను సడలించలేకపోవడం మరొక అవరోధమనీ' అంతర్జాతీయ ద్రవ్యనిధి అన్నది. మామూలు మాటలలో చెప్పాలంటే భూసంస్కరణ చట్టాలను రద్దు చేయాలి, కార్మిక చట్టాలను 'సరళతరం' చేయాలి.

ఈ సంవత్సరం దాదాపు దేశవ్యాప్తంగా నెలకొన్న కరువును కూడ ఈ సూచనలకు బలం కలిగించడానికి వీరు వాడుకోగలరు. కరువెప్పుడొచ్చినా పేద రైతులు భూములమ్ముకొని పోవడం దానికి గల ఒకానొక ఫలితంగా ఉంటున్నది. ఆ భూమిని మరొక పేద రైతు కొనుక్కుంటే పరిస్థితిలో ఏ మార్పూ రాదనీ, పెద్ద రైతులు కొనుక్కోవడానికి సీలింగ్ చట్టాలు అడ్డమున్నాయనీ, కార్పొరేషన్లే గనక ఊర్లు ఖాళీచేసి పోతున్న దిక్కుమాలిన రైతులందరి భూములనూ కొనేసుకోగలిగితే, సీలింగ్ చట్టం దానికి అడ్డం రాకుండా ఉంటే గుజరాత్‌లోగానీ రాజస్థాన్‌లోగానీ ఇంకొకసారి ఎప్పుడూ కరువు రానంత అభివృద్ధి వచ్చేసేదని ఈ సంవత్సరం తిరిగే లోపల మేధావులు వాపోబోతారని కచ్చితంగా చెప్పగలం. చాలామంది అవుననబోతారని కూడ చెప్పగలం.

**ఆంధ్రప్రభ దినపత్రిక**
**27 ఏప్రిల్ 2000**

# కార్పొరేట్ సేద్యానికేనా జల 'సంరక్షణ'!

మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారికి కొన్ని ప్రాథమిక సత్యాలు కూడ చెప్పవలసి వస్తున్నది.

నీళ్లంటే ఆయన భూగర్భ జలాలేనని ఎందుకు అనుకుంటున్నారు? నీటిని జాగ్రత్త చేయడమంటే భూమిలోకి పంపించడమేనని ఎందుకు అనుకుంటున్నారు? చెరువంటే ఊట చెరువేనని ఎందుకనుకుంటున్నారు? నీళ్లు ఏ కొంచెం ఆవిరైనా ఏ కొంచెం సముద్రంలోకి పోయినా అది 'వృథా'యేనని ఎందుకు అనుకుంటున్నారు?

కురిసిన వర్షం కొంత నేల లోనికి ఇంకుతుంది. కొంత నేల మీద మట్టిలో నిలుస్తుంది. కొంత ఆవిరి అవుతుంది. కొంత సముద్రంలో కలుస్తుంది. సముద్రంలో కలిసినది మళ్లీ ఆవిరి అవుతుంది. ఆవిరి అయినది గాలిలో తేమ అవుతుంది. తిరిగి వర్షమవుతుంది. భూమిలోకి ఇంకినది తిరిగి నేలపైకి (మానవ పరిశ్రమ ఫలితంగా) వచ్చి నేలమీద మట్టిని తడుపుతుంది. మొక్కలకు, మనుషులకు ప్రాణం పోస్తుంది. తిరిగి మట్టి నుండి, మొక్కల నుండి, మనుషుల ఒంటిమీది స్వేద బిందువుల నుండి ఆవిరి అవుతుంది. మళ్ళీ వర్షమవుతుంది.

ఇదొక 'సైకిల్'. దీనిని ఎక్కడో ఒకచోట తెంపేస్తే ఏమవుతుందో చెప్పడం కష్టం. ప్రపంచంలోని మనుషులంతా ఒక్క మనసుతో ప్రతీ వర్షం నీటి చుక్కనూ నేలలోకి తొక్కేసి ఆవిరి కాకుండా, సముద్రంలో కలవకుండా చేసేస్తే సముద్రాలు ఏమవుతాయో, చేపల వంటి సముద్ర జీవులేమవుతాయో, గాలిలో తేమ తగ్గిపోయి ఋతుపవనాలేమవుతాయో చెప్పడం అంత సులభం కాదు. మానవ మనుగడపైన దాని ప్రభావం ఎలా ఉంటుందో కూడ చెప్పడం కష్టం. భగ్నమయిన వాతావరణ

సమతుల్యాన్ని పునరుద్ధరించే ప్రయత్నంలో భాగంగా వాటర్‌షెడ్లకు సంబంధించిన ఆలోచన పుట్టింది. వ్యవసాయాన్ని ప్రకృతిపైన దాడిగా భావించే కార్పొరేట్ పెట్టుబడిదారీ దృక్పథానికి దానిని అనుసంధానం చేయాలని చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నాడు. వాటర్‌షెడ్ల ద్వారా భూగర్భ జలాలను పెంపొందించాలనీ, ఒక్క చుక్కనీరు కూడ ఆవిరి కాకుండా, సముద్రంలోకి పోకుండా భూగర్భ జలాశయంలోకి పోవాలనీ ఒక పక్క అంటాడు. అదే సమయంలో పాశ్చాత్య ఆగ్రోబిజినెస్ కంపెనీలను రాష్ట్రంలోకి ఆహ్వానించి, వారి ఎగుమతి దిగుమతి వ్యాపారానికి రాష్ట్ర వ్యవసాయరంగాన్ని కార్యక్షేత్రంగా మలచే వ్యవసాయ విధానాన్ని ప్రకటిస్తాడు. ఆ ఆగ్రోబిజినెస్ కంపెనీలు ఏం చేస్తాయి? విపరీతంగా నీళ్లు తాగే కొత్త వంగడాలను విస్తారంగా పండించి, లేదా రైతుల చేత పండింపచేసి ఎగుమతి చేస్తాయి. ఇప్పుడు రాష్ట్రంలోని కరువు ప్రాంతాలలో 300 అడుగుల లోతుకు (రాయలసీమలో కొన్ని చోట్ల 500 అడుగులదాకా) బోర్లు వేస్తున్నారు. చంద్రబాబు ఆహ్వానిస్తున్న కార్పొరేషన్లు ఇంకొక 100, 200, 300 అడుగుల లోతుకు బోర్లు వేసి అయిదేళ్లు కష్టపడి కాపాడిన వాటర్‌షెడ్ ఫలితాన్ని ఒక కారు పంట కోసం పీల్చేయగలవు.

అప్పుడేమి చేయాలంటే ఇంకా ఇంకా చెట్లు పెంచాలి. ఎక్కడ ఖాళీ జాగా దొరికితే అక్కడ చెట్లు పెంచి వర్షం ఇంకా బాగా పడేటట్లు చూడాలి. అలా పడిన వర్షమంతా భూగర్భ జలాశయంలోకి పోయేటట్టు చూడాలి. మళ్లీ లోతుగా బోర్లు వేసి ఆ నీటినంతటినీ ఒక రివర్స్ జలపాతంలాగా పైకి లాగేసి, విపరీతంగా నీళ్లు తాగే ఎగుమతి బ్రాండు వ్యవసాయ ఉత్పత్తులు చేపట్టి, కార్పొరేషన్ల ద్వారా ఎగుమతి చేసి...

ఇది ఆధునీకరణ ఉన్మాదం. ఆధునీకరణ వల్ల దెబ్బతిన్న పర్యావరణాన్నీ, నేలకింద ఉన్న నీటి వనరులనూ, నేలమీది మట్టినీ చెట్లనూ కాపాడి ప్రకృతికీ మనిషికీ స్నేహ సంబంధాన్ని పునరుద్ధరించడం కోసం పుట్టిన పర్యావరణ పరిరక్షణ ఉద్యమాన్ని – అందులో భాగమైన జల సంరక్షణ ఉద్యమాన్ని – అదే ఉన్మాదానికి బలిపెట్టే వ్యవసాయ విధానం చంద్రబాబుది.

నీళ్లంటే భూగర్భ జలాలు మాత్రమే కాదు. ఉపరితల జలాలు కూడ. నీటితో మనిషికి స్నేహ సంబంధమున్న రోజులలో రెండింటినీ సమతూకంగా వాడుకున్న సమర్థమైన సాగునీటి వ్యవస్థ ఉండేది. తెలంగాణలోనూ, రాయలసీమలోనూ చక్కటి చెరువుల వ్యవస్థ ఉండేది. చెరువులు ఇప్పటికీ ఉన్నాయిగానీ అవి చాలావరకు

శిథిలమయి ఉన్నాయి. ఉన్నమేరకు 'వ్యవస్థ'గా లేవు. ఒక చెరువు అలుగు పారితే మరో రెండు చెరువులలోనికీ, వాటి అలుగులు పారితే ఇంకొక మూడు చెరువులలోనికీ నీరు చేరే వ్యవస్థ ఉండేది. ఇప్పుడు చెరువులన్నీ పూడిపోయి క్రికెట్ మైదానాలలాగా ఉన్నాయి. కట్టలు పాడయి, నిలిచిన కొద్దినీరు అలుగు మీద నుండే కాక కట్ట కింది నుండి కూడ పలుదిక్కుల ప్రవహిస్తున్నాయి. అలుగు పారిన నీటిని కింది చెరువులోకి చేర్చే కాలువలు పాడవడం వల్ల నీరు అస్తవ్యస్తంగా ప్రవహించి కింది చెరువులలోకి చేరడం లేదు.

యాభై ఏళ్లుగా ఈ చెరువుల గురించి పట్టించుకున్న ప్రభుత్వమేదీ లేదు. జలసంరక్షణ గురించి ఇంత పెద్దఎత్తున ఇప్పుడు ప్రచారం చేస్తున్నారు కదా – ఇప్పుడయినా చెరువుల వ్యవస్థను బాగుచేసే ఆలోచన చేయొచ్చు కదా? పూర్వపు స్థాయికి వాటిని తీసుకువచ్చినట్లయితే కురిసిన ప్రతి వర్షం చుక్కా కాకపోయినా చాలాభాగం చెరువులలో నిలుస్తుంది. భూగర్భ జలాల ఊట పెంచడానికి పనికొస్తుంది. తూముల ద్వారా పారించుకుని పంటలు పండించుకోవడానికీ పనికొస్తుంది.

చెరువు నీళ్లందని ప్రాంతాలుంటాయి. చెరువులే లేని గ్రామాలు కూడ ఉంటాయి. వాటికి బావినీళ్లే శరణ్యం కాబట్టి బావులలో ఊట పెంచే జలసంరక్షణ విధానాలు అక్కడ అవలంబించవచ్చు. శతాబ్దాలుగా చెరువులు, బావుల (ఉపరితల, భూగర్భ జలాల) సమన్వయం ద్వారానే వ్యవసాయం నడిచింది తెలంగాణ, రాయలసీమలలో. ఇప్పుడు అకస్మాత్తుగా నీళ్లంటే భూమి లోపలివే ఎందుకయ్యాయి? నీటిని భద్రపరచడమంటే భూగర్భ జలాశయాలలో భద్రపరచడమే ఎందుకయింది?

చెరువుల కింద ఆగ్రోబిజినెస్ కార్పొరేషన్లు వ్యవసాయ వ్యాపారం చేపట్టడం కష్టం. కొన్ని వందల ఎకరాలు లీజుకు తీసుకుని (దీనికోసం భూమి గరిష్ట పరిమితి చట్టాలను సవరించాలన్నది చంద్రబాబు వ్యవసాయ విధానంలోని ఒక ముఖ్య ప్రతిపాదన), ఎరువులు సమృద్ధిగా వేసి, నీళ్లు సమృద్ధిగా పారించుకుని విదేశాలలో బాగా అమ్ముడుపోయే మేలురకం వ్యవసాయ ఉత్పత్తులను సాగు చేయడం చెరువుల కింది వ్యవసాయంలో సాధ్యం కాదు. కావలసినన్ని చోట్ల బోర్లు వేసుకుని భూగర్భ జలాలను పెద్ద మొత్తంలో పీల్చుకుంటేనే సాధ్యం అవుతుంది. దానికి కాకతీయుల, రాయల కాలం నాటి చెరువుల వ్యవస్థ అక్కరలేదు. చెరువులన్నీ ఊటచెరువులుగా

మారిపోవాలి, బోర్లకు నీళ్లు అందించాలి. వాగులు, వంకలు చెరువులలోకి నీళ్లు చేరవేయనక్కరలేదు. నేలలోకి చేరవేయాలి. బోర్లకు అందివ్వాలి.

చెరువుల వ్యవస్థను లెక్కలోకి తీసుకోకుండా వాటర్‌షెడ్ల కోసం చెక్‌డ్యాంలు కట్టడం వల్ల ఇప్పటికే సగం ఎండిపోయిన చెరువులు పూర్తిగా ఎండిపోతున్నాయన్న ఫిర్యాదు వినవస్తున్నది. మహబూబ్‌నగర్ జిల్లా నాగర్‌కర్నూల్ దగ్గర కేసరి సముద్రం అనే చెరువు ఉంది. అది అయిదు చెరువుల వ్యవస్థలో ఒకటి. విపరీతమైన పూడిక వల్ల, కట్ట పాడు కావడం వల్ల పనికిరాకుండా పోతున్న ఆ చెరువులోకి నీళ్లు చేరవేసే ఒర్రెలు వాటర్‌షెడ్లలో భాగమైపోవడం వల్ల అసలే అందులోకి నీళ్లు రావడం లేదన్న ఫిర్యాదు ఉంది.

చెరువు ఆయకట్టులో ఉన్న రైతులు ఖర్చు లేకుండా సాగునీరు పొందగలరు. కాని బావులు ఖర్చుతో కూడుకున్న పని. నిజానికి బోర్లు వచ్చిన తర్వాత బావులనేవి కేవలం అలంకారప్రాయంగా మిగిలాయి కాబట్టి భూగర్భ జలాలు ఉపయోగించుకోవాలంటే బోర్లు వేసుకోవాలి. మోటార్లు పెట్టుకోవాలి. పెరుగుతున్న కరెంట్ ఛార్జీలు కట్టుకోవాలి. కార్పొరేట్ వ్యవసాయం రంగప్రవేశం చేసిన తర్వాత వాళ్లు వేసినంత లోతుగా వేరెవరూ బోర్లు వేయలేరు. కాబట్టి ఇకపై భూగర్భ జలాలన్నీ వారివే. కరెంట్ ఉత్పత్తికయ్యే ఖర్చు మొత్తం వినియోగదార్లే పెట్టుకోవాలనే ప్రపంచబ్యాంకు నియమాన్ని మన పాలకులే మొట్టమొదటగా అమలు చేస్తున్నారు కాబట్టి కార్పొరేషన్లు, వారి కనుసన్నలలో వ్యవసాయం చేసే ధనిక రైతులు తప్ప వేరే ఎవరూ బోర్లు వేసుకునే స్థితిలో – భూగర్భ జలాశయాలలోని నీటిని వ్యవసాయం కోసం వాడుకునే స్థితిలో – ఉండబోరు. చెరువుల వ్యవస్థను పునరుద్ధరించి, దానికి పోటీగానో, ప్రత్యామ్నాయంగానో కాక అనుబంధంగా భూగర్భ జలసంరక్షణ చేపట్టి లోతయిన బోర్లు ఎవ్వరూ వేయడానికి వీలులేదన్న చట్టం చేసినట్లయితే చాలా భిన్నమైన సామాజిక చిత్రం కనిపిస్తుంది. అయితే అందులో 'విజన్ 2020' నమూనా ఆధునీకరణకు చోటు అంతగా ఉండకపోవచ్చు.

**ఆంధ్రప్రభ దినపత్రిక**
**8 జూన్ 2000**

# ఆర్థిక సంఘం సిఫార్సులు అంత అన్యాయంగా లేవు

ఆర్థిక సంఘం (పదకొండవ ఫైనాన్స్ కమిషన్) సూచనల గురించి చంద్రబాబు చేస్తున్న గొడవ ఉచితమా, అనుచితమా అనేది సాధారణ దినపత్రికల పాఠకులకు అర్థం కాకపోవచ్చు. కష్టపడి అభివృద్ధి సాధిస్తున్న రాష్ట్రాలను చిన్నచూపు చూసి, తమ నిర్లక్ష్యం కారణంగా వెనుకబడి ఉండిపోయిన రాష్ట్రాలకు ఎక్కువ వనరులు కట్టబెట్టడం ద్వారా వెనుకబడి ఉండిపోవడమే ఉత్తమం అన్న సందేశాన్ని పదకొండవ ఫైనాన్స్ కమిషన్ ఇచ్చిందని చంద్రబాబు ఆరోపణ.

ఈ రకమైన వాదన కొత్తది కాదు. చవక బియ్యం కూలివాళ్ళలో సోమరితనాన్ని పెంచుతుందనీ, నిరుద్యోగ భృతి బేవార్సు బతుకులను ప్రోత్సహిస్తుందనీ తరచుగా వింటుంటాం. అయ్యో పాపం అంటూ వెనుకబాటుతనానికి రాయితీలు ఇస్తుంటే, అదే బాగుందని జనం అక్కడే ఉండిపోతారని ఈ రకమైన వాదన వినిపించే వాళ్ళ ఉద్దేశం.

సంక్షేమ వ్యవస్థ కొంతమంది మీద ఈ రకమైన ప్రభావం వేస్తుందని ఒప్పుకోవచ్చు కానీ మెజారిటీ ప్రజలకు ఇది వర్తిస్తుందని నమ్మడానికి ఆధారమేమీ లేకున్నప్పటికీ ఈ రకమైన వ్యాఖ్యల ప్రాచుర్యానికేమీ లోటు లేదు. భూ సంస్కరణలను వ్యతిరేకించేవాళ్ళు, చవక డిపోలను వ్యతిరేకించేవాళ్ళు, ఉద్యోగ భద్రతను వ్యతిరేకించేవాళ్ళు, సబ్సిడీలను వ్యతిరేకించేవాళ్ళు – వీరి నోట ఈ వాదన తరచు వింటుంటాం. చంద్రబాబు ఈ వాదనను ఇప్పుడు ఆర్థిక సంబంధాలకు కూడ వర్తింపజేస్తున్నారు.

మన రాజ్యాంగం దేశ ఆర్థిక వనరులపైన అధికారాన్ని ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం చేతిలో పెట్టింది. ప్రధానమైన పన్నులు కేంద్ర ప్రభుత్వమే వసూలు చేసుకుంటుంది. కొంతభాగం రాష్ట్రాలకు ఇవ్వవలసి ఉంటుంది. ఎంత భాగం అనే విషయం నిర్ణయించడానికి ఒక ఫైనాన్స్ కమిషన్‌ను రాష్ట్రపతి (అంటే కేంద్ర ప్రభుత్వం) ఏర్పాటు చేస్తారు. ఈ కమిషన్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 280 కింద ఏర్పడుతుంది.

ఇప్పటివరకు కేంద్రం సేకరించే వనరులలో రాష్ట్రాల వాటా ఎంత ఉండాలి అనే విషయంపైనే ఫైనాన్స్ కమిషన్లలో ప్రధానంగా చర్చ జరిగేది. దేశ రాజకీయార్థిక వ్యవస్థలో 'ఫెడరలిజం' వర్ధిల్లాలని కోరుకునే పార్టీలన్నీ కూడ రాష్ట్రాలకు మరింత ఎక్కువ వనరులు ఇవ్వాలని డిమాండ్ చేసేవి. ఇప్పుడు మొట్టమొదటిసారిగా రాష్ట్రాల వాటా ఎంత అనే చర్చ వదిలిపెట్టి ఏ రాష్ట్రం వాటా ఎంత అనే అంశాన్ని చంద్రబాబు ముందుకు తీసుకొచ్చారు. 'అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలు', 'వెనుకబడి ఉండిపోయిన రాష్ట్రాలు' అంటూ రాష్ట్రాలను రెండుగా వర్గీకరించి, ఇందులో మొదటి వర్గానికి చెందిన రాష్ట్రాలకు ఎక్కువ వనరులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. చేతకానివాళ్ళు వెనుకబడి ఉంటారనీ, సమర్థులు అభివృద్ధి చెందుతారనీ, సామర్థ్యానికి పారితోషికంగా ఎక్కువ వనరులు వారి చేతిలో పెట్టాలనీ ఆయన సిద్ధాంతం. చేతకానితనమే వెనుకబాటు తనానికి కారణమా? సామర్థ్యం నుండే అభివృద్ధి వస్తుందా? అన్న ప్రశ్నలు వేసుకుంటే ఈ వాదన పునాదులు కదిలిపోతాయి. ఈ ప్రశ్నలు వేసుకోకుండా ఆ అభిప్రాయాలను గుడ్డిగా నమ్ముతూ వాటి చుట్టూ ఆర్థిక సిద్ధాంతాలను తయారుచేసుకుంటే, సమాజంలో వర్గాల మధ్య అసమానతలు పెరిగినట్టే రాష్ట్రాల మధ్య కూడ అసమానతలు పెరుగుతాయి.

నిజానికి పదకొండవ ఫైనాన్స్ కమిషన్ చంద్రబాబు చెబుతున్నంత 'బాధ్యతారహితంగా' వ్యవహరించలేదు. కానీ జనాభా ఎక్కువ ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ వాటా ఇచ్చిందనీ, అందువల్ల కుటుంబ నియంత్రణను ప్రజలకు అలవరచే ప్రయత్నం చేయని ప్రభుత్వాల అలసత్వానికి బహుమానం ఇచ్చినట్టయిందనీ చంద్రబాబు వాదిస్తున్నారు. జనాభా పెరుగుదల కేవలం ప్రభుత్వం అలసత్వం ఫలితం కాదనీ, దానికి అనేక సాంఘిక ఆర్థిక కారణాలున్నాయనీ గుర్తించినట్టయితే, ఆ సాంఘిక ఆర్థిక కారణాలను అధిగమించడానికి అవసరమైన చేయూత ఇవ్వవలసి ఉంటుందని గుర్తించగలుగుతాం. అయినా, చంద్రబాబు వంటి విమర్శకులను దృష్టిలో ఉంచుకునే

కాబోలు పదకొండవ ఫైనాన్స్ కమిషన్ ప్రస్తుత జనాభా లెక్కలు తీసుకోకుండా 1971 జనాభా లెక్కలను ఆధారంగా తీసుకుంది. అప్పటికి జనాభా నియంత్రణను ఒక కార్యక్రమంగా చేపట్టిన రాష్ట్రమేదీ లేదు కాబట్టి ఈ ప్రమాణాన్ని ఎంచుకోవడంలో 'వివక్ష' ఏమీ లేదు.

తలసరి ఆదాయం తక్కువ ఉన్న రాష్ట్రాలకు పదకొండవ ఫైనాన్స్ కమిషన్ కేటాయింపులు ఎక్కువ ఇచ్చిందని మరొక అభియోగం. నిజానికి కేంద్రవనరుల కేటాయింపులో ఫైనాన్స్ కమిషన్లు ఈ ప్రమాణాన్ని ఎప్పుడూ లెక్కలోకి తీసుకుంటూనే ఉన్నాయిగానీ ఈ సారి అది దాని 'వెయిటేజ్'ను కొంచెం పెంచింది. ఇది తప్పనుకుంటే ఏం చేయాలి? ఇప్పటికే తలసరి ఆదాయం సాపేక్షంగా ఎక్కువ ఉన్న రాష్ట్రాలకే ఎక్కువ ఇవ్వాలా? ఇది రాష్ట్రాల మధ్య అసమానతలను పెంచదా? అభివృద్ధిలో ప్రాంతీయ సమతుల్యం ఉండాలన్నది ఒక హేతుబద్ధమైన, ప్రజాస్వామికమైన లక్ష్యం కాదా?

తలసరి ఆదాయం తక్కువ ఉండడానికి నిర్లక్ష్యం, అసమర్థత తప్ప వేరే కారణమేమీ లేదనుకుంటే ఈ నిర్ణయం అసమర్థతను ప్రోత్సహిస్తుందనుకోవచ్చు. ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, బీహార్ వంటి రాష్ట్రాల పాలనలో అసమర్థత పాలు కొంచెం ఎక్కువే ఉన్నప్పటికీ అవి ఆర్థికంగా పురోగమించకపోవడానికి అదొక్కటే కారణం కాదు. పదకొండవ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ ఖుస్రో ఒక దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వేరే రెండు కారణాలను ప్రస్తావించారు. కొండల మధ్య ఉన్న హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాలలోకి ప్రైవేట్ పెట్టుబడి వనరులు ఎక్కువ ప్రవహించడం కష్టం కాబట్టి ప్రభుత్వ వనరులు సాపేక్షంగా ఎక్కువ ఇవ్వవలసి ఉంటుంది కదా అన్నారు. అలాగే మిలిటెన్సీ ప్రభావం ఎక్కువ ఉన్న జమ్ము కాశ్మీర్, అస్సాం, నాగాలాండ్ వంటి రాష్ట్రాలలో కూడ ప్రైవేట్ కంపెనీలు పెట్టుబడి పెట్టడానికి వెనకాడతాయని గుర్తుచేశారు. ఆయన చెప్పని మరొక కారణాన్ని కూడ ప్రస్తావించవచ్చు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, బీహార్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలలో సాంఘిక అసమానతల, అణచివేతల పాలు సాపేక్షంగా ఎక్కువే. ఆ రాష్ట్రాలు ఆర్థికంగా అభివృద్ధి చెందకపోవడానికి, చెందిన మేరకు అది పేదలకు దక్కకపోవడానికి ఇదొక ముఖ్య కారణం. తమ చేతులలో లేని నైసర్గిక, రాజకీయ, సాంఘిక పరిస్థితులకు ప్రజలను బాధ్యులను చేసి శిక్షించవచ్చునా?

'సామర్థ్యానికి' గుర్తింపు ఇవ్వాలని చంద్రబాబు ప్రదర్శిస్తున్న ఆరాటానికి అర్థం తనూ, తన పాలనా చాలా సమర్థమైనవని చెప్పుకోవడం. కానీ రెండు విషయాలలో పదకొండవ ఫైనాన్స్ కమిషన్ 'సామర్థ్యానికి' ఇచ్చిన వెయిటేజ్‌ను చంద్రబాబు ప్రభుత్వం అందుకోలేకపోయింది. వీటిలో ముఖ్యమైనది పన్నుల సేకరణ. సమర్థవంతంగా పన్నులు వసూలు చేసే రాష్ట్రాలకు కేంద్ర వనరులలో కొంచెం ఎక్కువ వాటా ఇవ్వాలని ఫైనాన్స్ కమిషన్ ప్రతిపాదించింది. అయితే ఈ సామర్థ్యం మన రాష్ట్ర ప్రభుత్వంలో లోపించింది కాబట్టి దీని వలన ప్రయోజనం పొందలేకపోయింది. దానికి ఎవరినో నిందించడం ఎందుకు? ఆదాయ వ్యయాల సమతుల్యాన్ని పాటించడంలో క్రమశిక్షణ గల ('ఫిస్కల్ డిసిప్లిన్' గల) రాష్ట్రాలకు కొంత వెయిటేజ్ ఇవ్వాలని కూడ పదకొండవ ఫైనాన్స్ కమిషన్ ప్రతిపాదించింది. అది కూడ చంద్రబాబు ప్రభుత్వం అందుకోలేక పోయింది.

నిజానికి పదకొండవ ఫైనాన్స్ కమిషన్ ఆలోచనా ధోరణి సరళీకరణకూ, ప్రపంచీకరణకూ అనుకూలమైనదే. ఎటొచ్చీ వీటిని అర్థం చేసుకునేటప్పుడు వివిధ రాష్ట్రాలలోనూ, ప్రాంతాలలోనూ ఉన్న భిన్న సమస్యలను కూడ లెక్కలోకి తీసుకోవడం అవసరమని అది భావించింది. ఆ మేరకు హేతుబద్ధంగానే వ్యవహరించింది.

ఈ వివాదంలో యాభై ఏళ్ళుగా చర్చకు వస్తున్న ఒక విషయం ఈ సారి అసలు చర్చకే రాకుండా పోయింది. అదేమిటంటే కేంద్రం చేజిక్కించుకునే వనరులలో రాష్ట్రాలకు ఎంత దక్కాలన్న ప్రశ్న. 10వ ఫైనాన్స్ కమిషన్ 29 శాతం ఇస్తే, 11వ ఫైనాన్స్ కమిషన్ దానిని 29.5 శాతానికి మాత్రమే పెంచింది. అది అంత తక్కువ ఎందుకుండాలన్న చర్చ చేస్తే, దాని గురించి గొడవ పెట్టుకుంటే, అన్ని రాష్ట్రాలకూ, 'ఫెడరలిజం' మూల సూత్రాలకూ మేలు జరిగేది కాదా!

**ఆంధ్రప్రభ దినపత్రిక**
**31 ఆగస్టు 2000**

# రామగుండం 7 ఎల్ఇపి ప్రమాదం: దొంగల చేతికే తాళాలు ఇచ్చారా?

దుర్ఘటనలు ఒక్కొక్కసారి ఒక్కొక్క అర్థంలో మంచి వార్తలే కావడం మానవ జీవితానికి సంబంధించిన ఒక చేదు వాస్తవం.

సింగరేణి గనులలో ప్రతి సంవత్సరం తప్పనిసరిగా 25 నుండి 35 మంది దాకా ప్రమాదాలలో చనిపోతుంటారు. అంతకు కొన్ని రెట్ల సంఖ్యలో గాయపడుతుంటారు. ఈ చావులు ఒక్కొక్కటిగా జరుగుతాయి కాబట్టి వాటిని బయటి ప్రపంచం పట్టించుకోదు. సింగరేణి కార్మికులు, వారి సంఘాలు పట్టించుకున్నా సెటిల్మెంట్లను సహితం 'మేము అమలు చేయం' అని సర్క్యులర్లు జారీ చేసి చేతులు దులుపుకుంటున్న యాజమాన్యాన్ని కదిలించడం వారికి అంత సులభం కాదు. అయితే నిజం చెప్పాలంటే సింగరేణి కార్మిక పోరాటాలలో భద్రత అనేది ఏ రోజూ ప్రధాన అంశం కాదు. ఏ కారణంగానో కార్మిక సంఘాలు దానికి ఇవ్వవలసిన ప్రాముఖ్యం ఇవ్వలేదు.

అందువల్లనే ఒకేసారి 17 మంది కార్మికులు చనిపోయిన 16 జూన్ నాటి దుర్ఘటన గురించి బాధపడుతూనే, ఎట్లాగూ చనిపోతూనే ఉన్నారు కాబట్టి 17 మందీ ఒకేసారి చనిపోవడం మంచిదే అనుకోక తప్పదు. అప్పుడు కనీసం ఆధునీకరణ గురించి, సంస్కరణల గురించి నిరంతరాయంగా మాట్లాడే పాలనలో గనుల భద్రతా వ్యవస్థనెందుకు ఆధునీకరించలేదు? ఎందుకు సంస్కరించలేదు? అన్న ప్రశ్నలు తెలుగు ప్రజానీకం వేసుకోగలుగుతారు. 1990 తరువాత ఉత్పత్తి పెరుగుదలలో సింగరేణి సాధించిన పురోగతి గురించి అడపా దడపా పత్రికలలో ప్రకటనలు చూస్తూనే

ఉన్నాం. ఆ సంస్థ చైర్మన్ల స్వోత్కర్ష టీవీలో వింటూనే ఉన్నాం. 'టార్గెట్' త్వరితగతిన సాధించిన గనుల మేనేజర్లకు యాజమాన్యం, ప్రభుత్వం ఇస్తున్న కితాబుల వార్తలు చదువుతూనే ఉన్నాం. కాని భద్రత మెరుగు పడిందా? గనులలో పనిచేసే సమయంలో కార్మికులు ప్రమాదాలకు గురికావడం, గాయపడటం, చనిపోవడం తగ్గిందా? ఈ ప్రశ్నలెందుకు ఈ ప్రచారంలో వినబడవు అన్న సందేహం ఇంతకు ముందు ఒకవేళ రాకున్నా ఇప్పుడిక రాకుండ ఉండదు.

మొన్న ప్రమాదం జరిగిన 7 ఎల్.ఇ.పి. గని రెండేళ్ల కింద ఉత్పత్తి లక్ష్యాన్ని అన్ని గనుల కన్న ముందుగా అందుకున్న గనిగా అవార్డు పొందిందని తెలిస్తే ఈ సందేహాలు మరింత బలంగా తోస్తాయి. ఉత్పత్తి లక్ష్యాన్ని శరవేగంగా అందుకోవాలన్న ఆరాటమే మొన్నటి ప్రమాదానికి ప్రత్యక్ష కారణం అని నేను అనడం లేదు. అయితే ఉత్పత్తి గణాంకాల పెంపుదలకు సంస్కరణలలో కేంద్ర స్థానం ఇచ్చే వైఖరి దానికి గల ప్రధానమైన కారణాలలో ఒకటని చెప్పక తప్పదు.

రెండవది, చట్టంలో చూస్తే చాలా గొప్పగా కనిపించే గనుల భద్రతా వ్యవస్థ వాస్తవంలో ఎంత బలహీనమైనదో సమాజం తెలుసుకోవడం, చర్చించుకోవడం అవసరం. భద్రత విషయంలో ఫ్యాక్టరీ చట్టం ఒకెత్తయితే గనులకే ప్రత్యేకమైన చట్టాలు, నిబంధనలు ఒకెత్తు. అందులో బొగ్గు గనులకైతే వేరే భద్రతా నియమావళే ఉంది. ఫ్యాక్టరీల భద్రత కార్మికశాఖకు ఉండే అనేక బాధ్యతలలో ఒకటి కాగా, గనుల భద్రతకే ఒక ప్రత్యేకమైన కేంద్రీకృత వ్యవస్థ ఉంది. దాని కేంద్ర కార్యాలయం ధన్‌బాద్‌లో ఉంది. దాని అత్యున్నత అధికారి డైరెక్టరు జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డి.జి.ఎం.ఎస్) దేశానికే గనుల చీఫ్ ఇన్స్‌పెక్టరు. గనులలో ప్రమాదాలు జరిగినప్పుడు డి.జి.ఎం.ఎస్ కార్యాలయం నుండి విచారణ బృందాలు బయలుదేరి రావడం, కొంచెం ధూం ధాం చేయడం, విలేఖరులు వినేటట్టు ప్రమాదానికి గురయిన గని యాజమాన్యాన్ని ఆక్షేపించడం మామూలే. వారి విన్యాసాలను మొదటిసారి చూసినప్పుడు 'ఆహా!' అనిపిస్తుంది. కొందరికి రెండవసారీ మూడవసారీ కూడ అనిపిస్తుంది. కానీ ఎల్లకాలం అనిపించాలంటే వారి వల్ల జరిగే ప్రయోజనమేదైనా కనిపించాలి. అది శూన్యం కాకపోయినా చాలా తక్కువనే చెప్పాలి.

ఈ విషయం గ్రహించడానికి కూడ మొన్నటి 7 ఎల్.ఇ.పి. ఘటన అక్కరకొస్తుందనే చెప్పాలి. ఆ సంగతి వెంటనే అర్థం కాకపోయినా త్వరలోనే అర్థం

అవుతుంది. గనుల చట్టం (1952) కింద, బొగ్గుగనుల నియమావళి (1957) కింద డి.జి.ఎం.ఎస్ కార్యాలయానికి బొగ్గు గనుల నిర్వహణపైన విశేషమైన అధికారాలున్నాయి. అంతా అయిపోయిన తరువాత విచారణ జరిపే అధికారం మాత్రమే కాదు, అడుగడుగునా వారి అనుమతి, పర్యవేక్షణ లేనిదే ఏ పనీ జరగదు, జరగడానికి వీలు లేదు. మరి ఇప్పుడు విచారణ కోసం గోదావరిఖనికి వచ్చిన డి.జి.ఎం.ఎస్ అధికారులు తమ పాపం గురించి కూడ తామే విచారణ జరుపుకుంటారా?

జూన్ 16న ప్రమాదం జరిగిన గని పేరు 7 ఎల్.ఇ.పి. (ఎల్.ఇ.పి అంటే లైఫ్ ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టు.) ఒక దశలో 'ఫాల్ట్' వచ్చి ఆగిపోయిన ప్రాజెక్టును తిరిగి కొనసాగించాలన్న నిర్ణయం నుండి పుట్టింది. ఇందులో ప్రస్తుతం 3 సీమ్‌లో పని నడుస్తున్నది. (సీమ్ అంటే బొగ్గు పొర అని అర్థం చెప్పుకోవచ్చు. ఎటొచ్చీ, పొర అనే మాట వాడడం వల్ల అది పలుచగా ఉంటుందనుకునేరు. ఉండనవసరం లేదు. కొన్ని మీటర్ల మందం ఉండవచ్చును.)

3 సీమ్ కింద 3 సీమ్ బాటమ్ ఉంది (అది ఇంకొక పొర అనుకుంటే సరిపోతుంది). దాని కింద 4 సీమ్ ఉంది. ఆ రెండింటిలోనూ తవ్వకం నిలిపివేసారు. ప్రస్తుతం నడుస్తున్న 3 సీమ్‌లో కూడ రెండేళ్ల పాటు ఉత్పత్తి ఆగిపోయి ఉండింది. ఒక రెండు నెలలు గానే దానిలో ఉత్పత్తి పునరుద్ధరించారు. ఒక కొత్త గనిని ప్రారంభించే ముందు ఏ విధంగానయితే డి.జి.ఎం.ఎస్‌కు నోటీసు ఇయ్యవలసి ఉంటుందో, మూసేసిన గనిని పునరుద్ధరించే ముందు కూడ అదే విధంగా డి.జి.ఎం.ఎస్‌కు నెల రోజుల ముందే నోటీసు ఇవ్వవలసి ఉంటుందని కోల్ మైన్స్ రెగ్యులేషన్‌లోని రెగ్యులేషన్ 7 అంటుంది. నోటీసు పుచ్చుకునేది ఫైలులో భద్రంగా దాచుకోవడానికి కాదు, ప్రతిపాదిత పునరుద్ధరణ, గని బాగోగులు పరిశీలించి తగు సలహాలు ఇవ్వడానికి.

ఒక చోట బొగ్గు కోసం తవ్వకం మొదలు పెట్టినప్పుడు సమీపంలోని వేరే గని లేక పొరలో నిలువ ఉన్న నీరు ఈ తవ్వకంలోకి ప్రవహించే ప్రమాదాన్ని నివారించడానికి కోల్ మైన్స్ రెగ్యులేషన్‌లోని రెగ్యులేషన్ 127 చాలా వివరమైన నియమాలను నిర్దేశించింది. దానిని సమూలంగా అతిక్రమించడమే జూన్ 16 నాటి ప్రమాదానికి కారణమని డి.జి.ఎం.ఎస్ కార్యాలయ అధికారులు ఇప్పటికే నిర్ధారించినట్టు వినికిడి. అయితే దీనికి బాధ్యతంతా 7 ఎల్.ఇ.పి గని మేనేజర్, తదితర స్థానిక అధికార్లదేనా? 7 ఎల్.ఇ.పి పునరుద్ధరణ పథకం సింగరేణి యాజమాన్యం

| గాయపడిన, మృతి చెందిన వారి సంఖ్య | | |
|---|---|---|
| సంవత్సరం | మృతుల సంఖ్య | తీవ్రంగా గాయపడిన వారి సంఖ్య |
| 1990 | 24 | 317 |
| 1991 | 19 | 310 |
| 1992 | 27 | 278 |
| 1993 | 31 | 173 |
| 1994 | 50 | 253 |
| 1995 | 19 | 167 |
| 1996 | 28 | .... |
| 1997 | 36 | 128 |
| 1998 | 34 | 103 |
| 1999 | 26 | 71 |
| 2000 | 36 | 201 |
| 2001 | 24 | 203 |
| 2002 | 23 | 185 |
| 2003 (జూన్ 17 వరకు) | 41 | 10 |

అనుమతి లేకుండా ఆచరణ రూపం తీసుకోలేదు. డి.జి.ఎం.ఎస్‌కు 30 రోజుల నోటీసు లేకుండ అది అమలులోకి రాలేదు. మరి వారంతా ఆ ప్రయోగంలోని ప్రమాదాన్ని గుర్తించలేకపోయారంటే కారణం? ఏ ప్రయత్నమూ చేయకపోవడమే కారణం.

3 సీమ్‌కు దిగువన ఉన్న 3 బాటమ్ సీమ్‌లో నుండి నీళ్ళు పైకి తన్నుకు వచ్చి 3 సీమ్‌లోని 18, 19 లెవెల్స్‌ను ముంచెత్తడమే మొన్నటి ప్రమాదానికి కారణం. గనులు మీది నుండి కిందికి ఏటవాలుగా ఉంటాయి కాబట్టి, విడిచి పెట్టేసిన గనిలో నీళ్లు చేరితే అది మీది నుండి కిందికే ప్రవహిస్తుంది. కింద నీటికి అడ్డుగోడ ఉన్నట్టయితే అక్కడ నిలబడే నీటిపైన ఏటవాలుగా ప్రవహించే నీటి ఒత్తిడి బలంగా ఉంటుంది. అది పైకి తన్నుకొచ్చే అవకాశం ఉంటుంది. 16 జూన్ నాడు జరిగిందిదే.

కిందనున్న 3 బాటమ్ సీమ్‌లోకి నీళ్లెందుకు చేరాయి? ఒక గనిని గానీ పొరను గానీ వదిలి వేయాలని నిర్ణయించుకున్నట్టయితే, ఆ గని లేక పొరలో దట్టంగా ఇసుక నింపుతారు. ఇసుక నిండా నింపితేనే ఆ గనిని క్షేమంగా వదిలేసినట్టవుతుంది. లేకపోతే కాలక్రమంలో అందులో నీళ్లు చేరి ఏదో ఒక రూపంలో ప్రాణ హాని కలిగించగలదు.

3 బాటమ్‌లో ఇసుక సగం కూడ నింపలేదు. నింపినట్టు లెక్కలు మాత్రం రాసుకున్నారని కార్మికులు అంటారు. ఇసుక నింపకపోవడంతో కాలక్రమంలో ఊట నీరు బాగా చేరింది. రెండు నెలల కింద 3 సీమ్‌ను పునరుద్ధరించాలని నిర్ణయించినప్పటికే కిందనున్న 3 బాటమ్ సీమ్‌లో నీరు పెద్ద మొత్తంలోనే ఉండి ఉండాలి. ఆ విషయం 7 ఎల్.ఇ.పి మేనేజర్ నుండి ధన్‌బాద్‌లోని జాతీయ గని కార్మిక సంరక్షకుడు డి.జి.ఎం.ఎస్ దాకా ఎవరూ గమనించకపోవడం వల్ల 3 సీమ్ పునరుద్ధరణ జరిగిపోయింది. రెండు నెలలు తిరిగే సరికి ఘోరమైన ప్రమాదం జరిగిపోయింది.

చంద్రబాబు ప్రమాదం జరిగిన వెంటనే హుటాహుటిన గోదావరిఖనికి పోయి గని ప్రమాదాలలో చనిపోయిన వారికి ఎన్నడూ ఇవ్వని మోతాదులో నష్టపరిహారం ప్రకటించాడు. ఆ పని చేయకపోతే కార్మికులలో 'సింగరేణి సంస్కరణల'పట్ల పేరుకున్న వ్యతిరేకత, అసహనం ఏ రూపం తీసుకునేవో! దానితో పాటు కోల్ మైన్స్ రెగ్యులేషన్ 127ను ఉల్లంఘించినందుకు 7 ఎల్.ఇ.పి గని మేనేజింగ్ స్థాయి సిబ్బంది నలుగురిని సస్పెండ్ చేసారు. 127 రెగ్యులేషన్‌లోని అనేక విషయాలలో ఒక దానిని మాత్రమే లెక్కలోకి తీసుకొని ఈ పని చేసారు. అదేమిటంటే గనిలో తవ్వకం జరిపేటప్పుడు ఇరుగు పొరుగున ఉన్న గనులు లేక తవ్వకాల నుండి నీరు వచ్చి చేరే అవకాశం ఉందో లేదో చూసేందుకు ముందు జాగ్రత్తగా బోర్ ద్వారా నేల మీద, పక్క గోడలకు పొక్కలు చేసుకుంటూ ముందుకు సాగాలి. ఈ పని చేయనందుకు 7 ఎల్.ఇ.పి. మేనేజర్‌ను, ఇంజనీర్‌ను సస్పెండ్ చేసారు. ఈ నియమం 127(6) లో ఉంది. కానీ రెగ్యులేషన్ 127ను మొత్తంగా చదివినట్టయితే 3 సీమ్ పునరుద్ధరణ ప్రక్రియే ప్రశ్నార్థకం అని అర్థం అవుతుంది. ఒక తవ్వకానికీ మరొక తవ్వకానికీ మధ్య 60 మీటర్ల దూరం ఉండాలని (రెండవ తవ్వకంలో నీటి నిలువ లేదని నిర్ధారించబడి ఉంటే

తప్ప) 127(3) అంటుంది. 3 సీమ్ బాటమ్‌లో నీటి నిలువ ఉందో లేదో చూడకుండ 60 మీటర్ల కంటే చాలా తక్కువ నిడివిలో 3 సీమ్‌ను పునరుద్ధరించారు. నీటి నిలువ ఉన్న ప్రాంతానికి సమీపంలో తవ్వకం చేపట్టేటప్పుడు ఆ నిలువకు సంబంధించిన సకల సమాచారాన్నీ సేకరించి పెట్టాలనీ, ఆ నీరు ఈ తవ్వకంలోకి ప్రవేశించకుండా ఉండడానికి తగు జాగ్రత్తలను తవ్వకం నిర్వహణలోనే వ్యవస్థీకరించాలనీ 127 (2) అంటుంది. 3 సీమ్ బాటమ్‌లోను, దాని కిందనున్న 4 సీమ్‌లోను నీటి నిలువ ఉన్న సంగతే తెలుసుకోలేదు. దానికి సంబంధించిన సమాచారం సేకరించలేదు. జాగ్రత్తలేవీ వ్యవస్థీకరించలేదు. అలాగే నీటి నిలువకు సమీపంలో తవ్వకాన్ని చేపట్టాలని గానీ పునరుద్ధరించాలని గానీ ప్రతిపాదించినప్పుడు తగు జాగ్రత్తలతో కూడిన ప్రణాళిక నమూనా రూపొందించి అనుమతి పొందాలని 127 (4) అంటుంది. ఆ ప్రణాళికనూ రూపొందించలేదు, అనుమతి ఇవ్వాల్సిన పెద్దమనుషులు దాని గురించి అడగనూ లేదు.

దీనికి బాధ్యులు ప్రస్తుత 7 ఎల్.ఇ.పి మేనేజర్లు మాత్రమే కాదు. 3 సీమ్ బాటమ్‌లో ఇసుక పూర్తిగా నింపని మాజీ మేనేజర్ నుండి ఏ జాగ్రత్తలూ ఏ నియమాలూ పాటించకుండా 3 సీమ్ పునరుద్ధరణకు అనుమతి ఇచ్చిన సింగరేణి కంపెనీ యాజమాన్యం, డి.జి.ఎం.ఎస్ దాకా అందరూ బాధ్యులే.

కానీ వారే ఇప్పుడు విచారణ నిర్వహిస్తున్నారు, వారే 'న్యాయం' చేయబోతున్నారు!

**ప్రజాపంథా**
**1 జూలై 2003**

# ఒక బల్దియా రహస్యం

హైదరాబాద్ నగర వాసులు అర్ధరాత్రి దాటిన తరువాత వీధిలోకి వచ్చినట్టయితే నగర ప్రధాన రహదార్లలో నీలం రంగు బట్టలు వేసుకున్న స్త్రీలు ఊడుస్తూ, చెత్త తీస్తూ కనిపిస్తారు. నగర రహదార్లను ఊడ్చే పని పగలు పెట్టుకుంటే ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది కాబట్టి సెకండ్ షో తరువాత ఈ పని పెట్టుకోవాలని హైకోర్టు అప్పుడెప్పుడో ఆదేశించిందని అంటారు. కారణం ఏమయితేనేం నగర పారిశుధ్యం రాక్షస వేళలోనే జరుగుతున్నది.

ఈ స్త్రీలంతా యూనిఫారం వేసుకొని పనిచేయడం, మునిసిపల్ అధికారులు అడపాదడపా వారి పనిని పర్యవేక్షించడం, చెత్త తీసి వేయడానికి అవసరమయితే మునిసిపల్ వాహనాలను పంపించడం చూసిన వారెవరయినా ఈ స్త్రీలను మునిసిపల్ కార్పొరేషన్ ఉద్యోగులుగానే భావిస్తారు. అందువల్ల, హైకోర్టు చెప్పినా ఎవరు చెప్పినా ఆడవాళ్లను అర్ధరాత్రి వచ్చి పని చేసి పొమ్మని ఆదేశిస్తే వాళ్లకు ఎన్ని సమస్యలుంటాయో అని ఒకింత సానుభూతి చూపేవారు సహితం, ఏదోలే కష్టమైనా నష్టమైనా మునిసిపల్ కార్పొరేషన్‌లో ఉద్యోగం ఊరికే రాదు కదా అని తమ అంతరాత్మకు తాము సర్దిచెప్పుకుంటారు. పే స్కేలు, ద్రవ్యోల్బణంతో ముడిపడ్డ కరువు భత్యం, వేతనంతో కూడిన సెలవు, ఆస్పత్రి బిల్లుల చెల్లింపు, రిటైరైన తరువాత పింఛను, రిటైరు కాకముందే చస్తే పిల్లలకు ఉద్యోగం – ఇన్ని వచ్చేటప్పుడు అర్ధరాత్రి తరువాత పని చేస్తేనేం, అపరాత్రి తరువాత పని చేస్తేనేం అని సులభంగానే అనుకోగలం.

అయితే ఈ రోడ్లు ఊడ్చే పనివారంతా కాంట్రాక్ట్ కార్మికులే తప్ప మునిసిపల్ కార్పొరేషన్ సిబ్బంది కాదనీ, వారికి కాంట్రాక్ట్ కార్మిక చట్టం ఇచ్చే కనీస రక్షణ

కూడ దక్కకుండ మునిసిపల్ కార్పొరేషన్ సంవత్సరం సంవత్సరం మినహాయింపు పొందుతున్నదనీ ఎంతమందికి తెలుసు ?

ఊడవనిదే తుడవనిదే ఏ ఫ్యాక్టరీ, ఏ సంస్థ పనిచేయదు కాబట్టి, నడవదు కాబట్టి ఆ పనిని కాంట్రాక్టర్లకు అప్పగించడం భావ్యం కాదనీ, సంస్థ కార్మికుల చేతనే పారిశుధ్యం పని చేయించుకోవాలనీ కార్మిక సంఘాలు ఆందోళన చేసిన రోజులు ఒకప్పుడు ఉండేవి. కోర్టులు అవునన్న రోజులూ, కోర్టులు ఆదేశించకుండానే ప్రభుత్వాలు ఆ మేరకు జీవోలు జారీ చేసిన రోజులు కూడ ఉండేవి. అప్పుడప్పుడు అవసరం పడే పనిలో కాంట్రాక్ట్ కార్మికులను పెట్టుకోక తప్పదేమోగానీ నిత్యం అవసరం అయ్యే పనిలో కాంట్రాక్ట్ కార్మికులను నియమించడానికి హేతుబద్ధమైన కారణమేదీ లేదన్న సూత్రం నుండి ఆ వైఖరి పుట్టింది.

కాలక్రమంలో ఖర్చు ఆదా చేయడం, లాభాలు పెంచుకోవడం తప్ప యాజమాన్య నిర్వహణకు వేరే హేతుబద్ధమైన ప్రమాణాలేవీ లేవన్న అభిప్రాయం మొలకెత్తింది. అదే పెరిగి పెద్దదై ఇప్పుడు యాజమాన్య బాధ్యతలను శాసిస్తున్నది. ప్రైవేట్ రంగంలోనే కాక ప్రభుత్వ రంగంలోనూ శాసిస్తున్నది. ఏ చట్టాన్నీ మార్చకుండ, ఏ రాజ్యాంగ సంక్షేమ సూత్రాన్నీ తొలగించకుండ విధానపరమైన మార్పులను మన పాలకులు పెద్దెత్తునే ప్రవేశపెట్టగలిగారు. రాజకీయ పార్టీల నుండి న్యాయవ్యవస్థ దాకా రాజ్యాంగ యంత్రాంగంలోని అన్ని విభాగాలకు ఈ విషయంలో ఏకాభిప్రాయం ఉండడం వల్లనే ఇది సాధ్యం అయింది. ఆర్థిక వ్యవస్థకు 'నిర్వహణ సామర్థ్యం' అని పిలవబడే లాభదృష్టే కాక కొంత భద్రతతో కూడిన ఉపాధి కల్పన అనే సామాజిక లక్ష్యం కూడ ఉందనుకున్న రోజులలో పాలనా వ్యవహారాలను, కోర్టు తీర్పులను ప్రభావితం చేసిన విలువలు వేరు, ఇప్పటి విలువలు వేరు. అందరూ ఈ విషయంలో ఒకటైన తరువాత ఇక చట్టాలను, రాజ్యాంగాన్ని సవరించకుంటే ఏం?

అయితే మన రాష్ట్రం అక్కడితో ఆగిపోలేదు. ఆగిపోతే చంద్రబాబు దేశంలోనే ప్రపంచీకరణ వైతాళికుడిగా గుర్తింపు ఎట్లా పొందుతాడు?

కాంట్రాక్ట్ కార్మికులకు సహితం కొన్ని చట్టాలు వర్తిస్తాయి. కాంట్రాక్ట్ గడువు ముగిసిన రోజున ఉద్యోగం పోతుందన్న ప్రాథమిక వాస్తవానికి మినహాయింపు లేదు

గానీ, కాంట్రాక్ట్ సాగినన్నాళ్లు దాని కోసం నియమించబడ్డ కార్మికుల పట్ల కాంట్రాక్టర్‌కు, అతనికి ఆ పనిని కాంట్రాక్టుకు ఇచ్చిన అసలు యజమానికీ కొన్ని బాధ్యతలుంటాయి. ఈ బాధ్యతలను ఏకరవు పెట్టే ముఖ్యమైన చట్టం కాంట్రాక్ట్ లేబర్ చట్టం.

హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ నగర వీధులు ఊడ్చే పనిని కాంట్రాక్టర్లకు అప్పగించి చేతులు దులిపేసుకుందామని చూసినా చట్టం అంత సంపూర్ణమైన స్వేచ్ఛ వారికి ఇవ్వదు. వారి మీదా, వారి కాంట్రాక్టర్ల మీదా కొన్ని ఆంక్షలు పెడుతుంది.

అయితే హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌కు కాంట్రాక్ట్ లేబర్ చట్టం నుండి మినహాయింపు ఇచ్చే జీవో ఆర్.టి నెం. 3197ను రాష్ట్ర ప్రభుత్వం 2001 డిసెంబర్ 11న జారీ చేసింది. తొలుత ఒక సంవత్సరం కోసం ఇచ్చిన ఈ మినహాయింపును జీవో ఆర్.టి. నెం. 1395 ద్వారా మరొక సంవత్సరం పొడిగించింది.

ఈ మినహాయింపును కోరడానికి నగర మునిసిపల్ కమిషనర్ చూపించిన కారణం ఆసక్తికరమైనది. 'పారిశుధ్యం ప్రైవేటీకరణను సమర్థంగా అమలు చేయడానికి', 'కాంట్రాక్టర్ల, కాంట్రాక్ట్ కార్మికుల పనిని సక్రమంగా పర్యవేక్షించడానికి' ఈ మినహాయింపు అవసరం అని ఆయన కోరాడు. ప్రభుత్వం తన ఆదేశంలో ఆ విషయాన్ని అంగీకార సూచకంగా ఉటంకించింది.

నిజానికి 'కాంట్రాక్టరు, కాంట్రాక్ట్ కార్మికులు చేసే పనిని పర్యవేక్షించడం' కోసమే కాంట్రాక్ట్ లేబర్ చట్టం పుట్టింది. దానిలో ఉన్నదంతా పర్యవేక్షణాధికారమే. అలాంటిది సమర్థంగా పర్యవేక్షించడానికి ఆ చట్టమే అడ్డం వచ్చిందంటే ఏమర్థం? తాము చేయదలచుకున్న పర్యవేక్షణ ఆ చట్టం చెప్పే పర్యవేక్షణ కాదు. ఆ పర్యవేక్షణ లక్ష్యం కార్మికులకు కొంత కనీస భద్రత, హక్కులు ఉండేటట్టు చూడడం. ఇప్పుడు చేయదలచుకున్న పర్యవేక్షణ అది కాదు. అతి తక్కువ ఖర్చుతో అతి ఎక్కువ పని రాబట్టే పర్యవేక్షణ. దీనికి కాంట్రాక్ట్ కార్మిక చట్టం అడ్డం రావచ్చు మరి!

ఇది ఊహిస్తున్న సంగతి కాదు. 2001 డిసెంబర్ 11న ఇచ్చిన మినహాయింపు 2002 డిసెంబర్ 11న అయిపోయేది. అయితే దానిని ఇంకొక సంవత్సరం పొడిగించమని నగర మునిసిపల్ కమిషనర్ 2002 సెప్టెంబర్ 28న రాష్ట్ర ప్రభుత్వానికి

అర్జీ పెట్టుకున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో అనుమతి ఇవ్వలేదు. ఇవ్వనని అననూ లేదు. మునిసిపల్ కమిషనర్ వారికి 'యాద్' చేయనూ లేదు.

అకస్మాత్తుగా 2003 జూలై 24న పొడిగింపు లభించింది. అప్పటికి ఏడు నెలలుగా మినహాయింపు లేకుండానే మునిసిపల్ కార్పొరేషన్ రోడ్లూడ్చే పనిని కాంట్రాక్ట్ కార్మికుల చేత చేయించుకుంటూ ఉంది. జూలై 24న వెనక తేదీ నుండి – అంటే 2002 డిసెంబర్ 12 నుండి – ఒక సంవత్సరం పొడిగింపు లభించింది.

అయిపోయిన కాలానికి మినహాయింపు తెచ్చుకోవడం వెనక ఉన్న రహస్యం ఏమిటి?

కాంట్రాక్ట్ కార్మికులకు కూడ కనీస వేతనాల చట్టం వర్తిస్తుంది. ఒక్కొక్క రంగంలోని కార్మికులకు కనీస వేతనాలు నిర్దేశిస్తూ ప్రభుత్వం జీవోలు జారీ చేసినట్టే కాంట్రాక్ట్ కార్మికులకు కూడ కనీస వేతనాల జీవో ఒకటి అడపాదడపా హెచ్చింపులతో జారీ అవుతుంటుంది. కాంట్రాక్ట్ లేబర్ చట్టం కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చే ఒక ముఖ్యమైన హక్కు ఏమిటంటే, వారి ప్రత్యక్ష యజమాని అయిన కాంట్రాక్టర్ వారికి కనీస వేతనాలు చెల్లించని పక్షంలో, అతనిని నియమించిన అసలు యజమాని (ఈ కథలో హైదరాబాద్ నగర మునిసిపల్ కమిషనర్) చెల్లించవలసి ఉంటుంది.

హైదరాబాద్ నగరంలో రోడ్లు ఊడ్చే కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు దక్కడం లేదు. కాంట్రాక్టర్‌లూ ఇవ్వడం లేదు, అసలు యజమాని అయిన మునిసిపల్ కార్పొరేషనూ ఇవ్వడం లేదు. ఈ సంగతి తెలిసిన జంటనగరాల డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆవేశపడి మనందరి కోసం అర్ధరాత్రి రోడ్లూడ్చే డ్యూటీ చేసే స్త్రీలకు ఇంత అన్యాయం చేస్తారా అంటూ ఒక గట్టి రిపోర్టు తయారు చేసాడంట.

ఇది బహుశా ఈ సంవత్సరం మేలోనో జూన్‌లోనో జరిగినట్టుంది. ఆ రిపోర్టు మీద ప్రభుత్వం చర్య తీసుకున్నట్టయితే భవిష్యత్తులోనే కాదు, మినహాయింపు లేని గత కాలానికి కూడ మునిసిపల్ కార్పొరేషన్ మిగులు జీతం చెల్లించవలసి ఉంటుంది.

అందుకని మునిసిపల్ కమిషనర్ గత సెప్టెంబర్‌లో పెట్టిన అర్జీని తవ్వి తీసి వెనక తేదీతో కాంట్రాక్ట్ లేబర్ చట్టం నుండి కార్పొరేషన్‌కు మినహాయింపును ఈ

సంవత్సరం చివరి దాకా పొడిగించుకున్నాడు. అతను అడిగాడు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది.

అంతటి ఘనులు మన పాలకులు.

ఈ సారి ఎప్పుడయినా మన రాష్ట్ర రాజధానిలో కనీసం ప్రధాన రహదారులు శుభ్రంగా ఉంటాయని బల్దియాను మెచ్చుకోవాలని మీకు అనిపించినప్పుడు ఈ కథ గుర్తొస్తుందని ఆశిస్తాను.

**ప్రజాతంత్ర వారపత్రిక**
**20 అక్టోబరు 2003**

# ప్రజారోగ్య వ్యవస్థను ప్రజానుకూలంగా మలచుకుందాం

సరళీకరణ విధానాల ప్రజా వ్యతిరేక స్వభావాన్ని నలభై దినాలుగా సాగుతున్న జూనియర్ డాక్టర్ల సమ్మె బయట పెట్టినంత సంపూర్ణంగా వేరే ఏ ఘటనా పెట్టలేదు.

అందుకే ఆ సమ్మెకు ఏ విధంగా జవాబు చెప్పాలో తోచక ప్రభుత్వం దబాయింపుకూ, బెదిరింపులకూ దిగింది. తన పాలనా విధానాలన్నిటినీ ప్రపంచ బ్యాంకుతో చర్చించి, వారి ఆమోదం పొందే ముఖ్యమంత్రి 'ప్రభుత్వ విధానాలతో జూనియర్ డాక్టర్లకేం పని' అంటూ మిగిలివున్న పరువు కాస్తా పోగొట్టుకున్నాడు.

ప్రజల ప్రాథమిక అవసరాల కల్పన కోసం ప్రభుత్వం నెలకొల్పిన అన్ని సంస్థల బాధ్యతనూ ఒక్కొక్కటిగా వదిలించుకొని, ప్రభుత్వంతో ఏ ప్రమేయం లేని సొసైటీల చేతిలో పెట్టాలనీ, ఆ సొసైటీలు వినియోగదారులు ఇచ్చే 'యూజర్ చార్జీల' మీదా, దాతలిచ్చే విరాళాల మీదా, తమ అధీనంలో ఉన్న స్థలాలను లీజుకివ్వడం ద్వారా వచ్చే కిరాయి మీదా ఆధారపడి మౌలిక సేవలు కల్పించాలనీ 1997లో ప్రపంచ బ్యాంకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. చెప్పేవాడికి బుద్ధి లేనప్పుడు నాకు మాత్రం ఎందుకు వుండాలని రాష్ట్ర ప్రభుత్వం వారి మాటలు ఆలకించింది. నీటి సరఫరా, రవాణా, వైద్యం ఇందుకు ఉద్దేశించబడిన ప్రధాన సేవారంగాలు.

ప్రపంచ బ్యాంకు ఆదేశానికి తల ఒగ్గిన తరువాత నాలుగయిదు సంవత్సరాలు సేవా వ్యవస్థను మార్చకపోయినా ఆ తర్వాత యూజర్ చార్జీలు నెమ్మదిగా ప్రవేశపెట్టిన ప్రభుత్వం, ఇప్పుడు పూర్తిస్థాయిలో ఆ ఆదేశాన్ని అమలు చేయడానికి నడుం కట్టింది.

2003 ఏప్రిల్ 17న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జారీచేసిన జీవో 90 ఇందులో మొదటి మెట్టు. దీనిని దాటితే మంచినీటి సరఫరా రెండవది కావచ్చు.

వినియోగదారుల వద్ద డబ్బులు వసూలు చేసుకోవడం అనే యూజర్ చార్జీల వ్యవస్థ గురించి మాత్రమే చర్చ జరిగినట్టయితే వినడానికి హేతుబద్ధంగా కనిపించే వాదనలతో తప్పించుకోవడానికి ప్రభుత్వానికొక అవకాశం దొరుకుతుంది. దారిద్ర్య రేఖకు దిగువనున్న తెల్లకార్డు కుటుంబాలకు ఉచితంగానే వైద్య సేవలందిస్తున్నప్పుడు చెల్లించగలవాళ్ల దగ్గర తీసుకుంటే తప్పేముంది? అని ప్రభుత్వ ప్రతినిధులు అడుగుతున్నారు.

తప్పు చాలా ఉంది. ఒకటి, అర్హులయి వుండి కూడ తెల్లకార్డులు లేని కుటుంబాల సంఖ్య ఎప్పుడూ లక్షలలో ఉంటుంది. నిన్న మొన్నటిదాకా రాష్ట్రంలో ఏ గ్రామానికి పోయినా ఈ ఫిర్యాదు వినిపించేది. ఎన్నికలు దగ్గరికొస్తున్నాయని పది సంవత్సరాల తరువాత తెల్లకార్డులు కొత్తగా జారీచేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టడం వల్ల ఈ సమస్య తీవ్రత తాత్కాలికంగా తగ్గింది. కానీ ఇప్పుడు సవరిస్తున్న జాబితాను ఇంకొక దశాబ్దం పాటు సవరించబోరు కాబట్టి సమస్య క్రమంగా మళ్లీ పెరుగుతుంది. గ్రామాలు వదిలి పట్టణాలకు వచ్చే పేద కుటుంబాలకూ, కూలి కోసం వలసపోయే కుటుంబాలకూ కొత్త స్థలంలో తెల్లకార్డులివ్వరు. ఉన్న ఊరిలో సైతం కుటుంబంలో పిల్లలు పెరిగి రెండు కుటుంబాలయినా కార్డులు రెండు కావు, ఒకటే ఉంటుంది.

రెండు, ప్రభుత్వం ఇచ్చే ఏ సేవ అయినా అతి పేదలకు మాత్రమే ఇచ్చేటట్టయితే దాని నాణ్యత ఘోరంగా ఉంటుందనేది విద్యా వైద్య రంగాలలో ప్రైవేటీకరణను అధ్యయనం చేసిన వారంతా ఏకగ్రీవంగా చెప్పే విషయం. ప్రభుత్వ ఆస్పత్రులకూ, ప్రభుత్వ స్కూళ్లకూ పేదలే కాక చదువుకున్న మధ్యతరగతి ప్రజలు కూడ వెళ్లిన రోజులలో అక్కడి సేవలలో నాణ్యత ఒకమేరకు ఉండింది. హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ దవాఖానాల నుంచి విశాఖపట్నంలోని కింగ్ జార్జి ఆస్పత్రి దాకా జనరల్ ఆస్పత్రులు అందరి ఆస్పత్రులుగా ఉన్న రోజులలో కాన్సర్ వంటి రోగాలకు కూడ ధైర్యంగా అక్కడే చికిత్స చేయించుకునేవారు.

చెల్లించగల వాళ్లు ప్రైవేట్ రంగంలో సేవలు పొందితే తప్పేముంది అన్న వాదనతో విద్యా వైద్య రంగాలలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించడం మొదలుపెట్టిన తరువాత మధ్యతరగతి ప్రభుత్వరంగ సంస్థలకు దూరం అయింది. ఆ సంస్థలలో

సేవలు నాణ్యతకు దూరం అయ్యాయి. నోరులేని వర్గాలకు మాత్రమే ఇచ్చే సేవలలో నాణ్యత ఉండవలసిన 'కర్మ' ఏముంటుంది?

యూజర్ చార్జీల పేరు మీద ఒకే సంస్థలో కొందరికి ఉచితంగా సేవలు, కొందరికి ఫీజుకు సేవలు అందియ్యడం మొదలుపెట్టిన తరువాత ఇద్దరికీ సేవలు ఒకేరకంగా అందిస్తారనుకోవడం కల్ల. వనరులు పరిమితంగా ఉన్న సంస్థలు ఉచితంగా ఇచ్చే సేవలను కుదించివేసి ఫీజుకు ఇచ్చేవి పెంచుకుంటాయి. ఇది ఉద్దేశ పూర్వకంగానూ జరుగుతుంది, అసంకల్పితంగానూ జరుగుతుంది.

మూడు, మొదట యూజర్ చార్జీలను వేణ్ణీళ్లకు చన్నీళ్ల చందంగా సమర్థించుకున్న ప్రభుత్వం పోనుపోను సంస్థకు ఏ అవసరమొచ్చినా 'మీరే వసూలు చేసుకోండి, నేనెక్కడి నుంచి తెచ్చివ్వగలను' అనగలదు. 'సెల్ఫ్ ఫైనాన్స్డ్' కోర్సులు మొదలుపెట్టిన తరువాత విద్యా రంగంలో ఇదే జరుగుతున్నది. అప్పుడు ఆ సంస్థలో అభివృద్ధి ఫీజులు వసూలు కాగల దిశగా మాత్రమే జరుగుతుంది. ఫలితంగా మధ్యతరగతికి అవసరమైన వైద్య సేవారంగాలు అభివృద్ధి చెందుతాయే తప్ప మెదడువాపు చికిత్సా రంగం అభివృద్ధి చెందదు. కానీ అత్యధికంగా ప్రాణాలు తీసేది తెల్లకార్డు వర్గాల రోగాలయిన అతిసార, మెదడువాపు వ్యాధులే. ఒక సమాజం అనుసరించే వైద్య విధానం ఆ సమాజంలో ప్రధానంగా తలెత్తే వ్యాధులకు అనుగుణంగా ఉండాలి. మన సమాజంలో అతివేగంగా వ్యాపించి వందల ప్రాణాలు తీసే అంటువ్యాధులు ఇప్పటికీ ప్రబలంగా ఉన్నాయి. వీటిని పటిష్టమైన ప్రభుత్వ వైద్య వ్యవస్థ ఎదుర్కోగలదు తప్ప వైద్య వ్యాపారం ఎదుర్కోలేదు.

కాబట్టి 'యూజర్ చార్జీల' వసూలు ఒక్కటే సమస్య అయి వున్నా అది పైకి కనిపించేంత అమాయకమయిన విషయం కాదు.

అయితే జీవో 90 లో యూజర్ చార్జీలు ఒక అనుబంధ విషయం మాత్రమే, అసలు విషయం కాదు. అసలు విషయం ఆస్పత్రుల నిర్వహణను ప్రభుత్వం చేతి నుంచి తీసేసి స్వయంప్రతిపత్తి గల సొసైటీల చేతిలో పెట్టడం. ఈ సొసైటీలలో సభ్యులుగా ఎవరుంటారంటే స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇతర పెద్దలు, సంఘ సేవకులు, దాతలు వగైరా. వీరికి ఆస్పత్రులు నిర్వహించడానికి వనరులెక్కడి నుంచి వస్తాయంటే విరాళాల నుంచి, యూజర్ చార్జీల నుంచి, అభివృద్ధిని స్పాన్సర్ చేసే దాతల నుంచి, ఆవరణలో అంగళ్లు పెట్టుకునే వర్తకులిచ్చే కిరాయి నుంచి – ఎక్కడి నుండయినా రావచ్చునుగానీ ప్రభుత్వం మాత్రం ఒక్క దమ్మిడీ కూడ ఇవ్వదు.

యూజర్ చార్జీలు వసూలు చేసినా నిర్వహణ ప్రభుత్వం చేతిలో వుంటే బడ్జెట్ కేటాయింపు కొంతయినా ఉండక తప్పదు. ఎన్నికల వంటి ప్రత్యేక సీజన్లలో ప్రజలు అల్లరిచేసి ఆ కేటాయింపులను పెంచుకునే అవకాశమూ ఉంటుంది. కానీ దాతల మీద, ఫీజుల వసూళ్ల మీద పూర్తిగా ఆధారపడే సొసైటీల చేతిలో ఆస్పత్రులను పెట్టేస్తే ఇంక అడగడానికేమీ ఉండదు. సొసైటీల పెద్దలు మనతో కోడెల శివప్రసాదరావు లాగ వాదనకు కూడ దిగరు. 'మీరు చెప్పేదంతా కరెక్టే – కానీ మా దగ్గర డబ్బులు లేవు. ఏం చేయమంటారు?' అని మర్యాదగా చేతులెత్తేస్తారు. మనం మరీ అల్లరి చేస్తే ఏ 'దాత'కో ఆస్పత్రిని అమ్మేసి వెళ్లిపోతారు.

నిజానికి ఈ సొసైటీలు వ్యాపారేతర లక్ష్యాలనే కలిగి వుండాలని అన్నప్పటికీ ఇవి ఆస్పత్రులతో పాటు మెడికల్ కాలేజీలను కూడ భారీ ఫీజులతో నడపబోతాయి కాబట్టి చాలావరకు వ్యాపార సంస్థలుగానే ఉండబోతాయి. ఎవరో ఒక 'దాత' చేపట్టే వ్యాపారానికి ముసుగులుగా ఉండబోతాయి. ప్రభుత్వ ఆస్పత్రులను ఒకేసారి వ్యక్తులకు, లేక సంస్థలకు అమ్మేస్తే గొడవ అవుతుంది కాబట్టి ప్రైవేటీకరణకు తొలిదశగా వ్యాపారేతర సొసైటీలకు అప్పగించడం అనే ఎత్తుగడను ఎంచుకున్నారని అంటే అది కుసంశయం కాబోదు. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రులలో వసూలు చేస్తున్న యూజర్ చార్జీలు మొత్తం లెక్కగడితే సాలీనా 50 కోట్లు ప్రభుత్వానికి వస్తున్నదని సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లు సవివరంగా నిరూపించారు. ప్రభుత్వ బడ్జెట్‌లో ఇదేం పెద్ద వాటా కాదు. ఈ మాత్రం కేటాయించలేక యూజర్ చార్జీలు ప్రవేశపెట్టి సొసైటీలకు ఆస్పత్రులను అప్పగిస్తున్నారంటే నమ్మడం కష్టం. ఊరికొక్క సొసైటీ ఏర్పడిన తరువాత ఒక్కొక్కటీ తన మార్గంలో ప్రైవేట్ ఆస్తిగా మారుతుంటే గమనించడం కష్టం, ఎదుర్కోవడం కష్టం కాబట్టి ఈ మధ్యేమార్గాన్ని ఎంచుకున్నారన్నది స్పష్టమే.

ఇటువంటి వ్యాపారంలో తమ ఆరోగ్యాన్ని వెతుక్కునే దౌర్భాగ్యానికి ప్రజలను వదిలేద్దామా? లేకపోతే జూనియర్ డాక్టర్ల పోరాటాన్ని అందరి పోరాటంగా మలచుకొని ప్రజారోగ్య వ్యవస్థను ప్రజానుకూలంగా దిద్దుకుందామా?

**మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది**

**22 జనవరి 2004**

## రెండవ లేబర్ కమిషన్ రిపోర్టు:

# కాగల కార్యానికి ముందస్తు ఆశీస్సులు

రెండవ లేబర్ కమిషన్ రిపోర్టు మీద ఇప్పటికే చాలామంది చాలా రాశారు, మాట్లాడారు. ఎక్కువభాగం అందులోని కార్మిక వ్యతిరేక అంశాలను ఖండించడమే జరిగింది తప్ప ఆ నివేదిక గురించి సమగ్రమైన సమీక్ష ఇప్పటికెవరూ చేయలేదు. అటువంటి సమీక్ష కేవలం సమగ్రత కోసమే కాక ఇతరత్రా కూడ అవసరం. అవాంఛనీయమైన పరిణామాలను సమూలంగా వ్యతిరేకిస్తూ కూడ దానికి అక్కడక్కడ అడ్డుకట్ట వేయగల చిన్న చిన్న ప్రయత్నాలను ప్రోత్సహించడం ప్రజాతంత్ర కృషిలో ఎప్పుడూ ఉండేదే. అందుకు పనికి వచ్చే అంశాలు రెండవ లేబర్ కమిషన్ రిపోర్టులో లేకపోలేదు.

రెండవ లేబర్ కమిషన్ ఏర్పాటును, దాని 'టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్'నూ ప్రపంచీకరణలో భాగంగా జరిగిన పనులుగా విమర్శకులు సహేతుకంగానే గుర్తించారు. అయితే ఆ కమిషన్ సభ్యులు ప్రపంచీకరణను నిర్విమర్శగా ఆరాధించే వ్యక్తులు కారు. అందువల్ల తమకు అప్పగించిన అజెండా కార్మికులకు అన్యాయం చేయగలదని వారు గుర్తించారు. ముఖ్యమైన విషయాలలో ఆ అజెండాకు తగిన సూచనలు చేస్తూ కూడ కొన్ని విషయాలలో తమనుంచి ప్రభుత్వం ఆశించిన సూచనలు ఇవ్వడానికి నిరాకరించారు. మరికొన్ని విషయాలలో ఆ అజెండా పరిధిలోనే కార్మికులకు కొంత భద్రత కల్పించే ప్రయత్నం చేశారు.

వారి నివేదికను కేంద్ర ప్రభుత్వం ఉన్నదున్నట్టు ఆమోదించవలసిన అగత్యం లేదు. తనకు నచ్చిన విషయాలు స్వీకరించి మిగిలిన వాటిని తిరస్కరించవచ్చు. ఆ పని 'దేశ అభివృద్ధి' పేరుమీదనే జరగబోతుంది కాబట్టి ఆ అభివృద్ధి అసలు లక్షణం ఏమిటో ప్రజలకు వివరించడానికి ప్రభుత్వమే నియమించిన ఈ కమిషన్ అభిప్రాయాలు, వారి సూచనల సమగ్ర పాఠం ఉపయోగపడుతుంది. ఆ విమర్శ రేపు రాబోయే చట్ట సవరణలను కొంతమేరకయినా బలహీనపరచడానికి ఉపయోగపడితే అది కూడ ఒక ప్రయోజనమే.

1) సంఘటిత రంగంలో ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాల క్రమబద్ధీకరణకు సూచనలు చేయడం;

2) అసంఘటిత రంగ కార్మికులకు కనీస రక్షణ కల్పించే ఒక సమగ్ర చట్టాన్ని సూచించడం.

రెండూ కేంద్ర ప్రభుత్వం రెండవ లేబర్ కమిషన్‌కు ఆదేశించిన కర్తవ్యాలు. 'క్రమబద్ధీకరణ' అని తెలుగులోకి మేము అనువాదం చేసిన ఇంగ్లీష్ పదం rationalisation. 'హేతుబద్ధీకరణ' అనే మాట ఎబ్బెట్టుగా లేకపోతే ఆ మాటే వాడి ఉండవచ్చు. ప్రస్తుతం సంఘటిత రంగానికి వర్తించే చట్టాలు అహేతుకంగా ఉన్నాయనీ, వాటిని హేతుబద్ధంగా సవరించడానికి సూచనలిమ్మనీ రెండవ లేబర్ కమిషన్‌ను కేంద్ర ప్రభుత్వం కోరింది.

ఏ కోణం నుంచి చూసినప్పుడు అవి అహేతుకంగా ఉన్నాయి? ఇన్నాళ్ళూ లేనిది అవి అహేతుకంగా ఉన్నాయని ప్రభుత్వం ఈ రోజు ఎందుకనుకుంటున్నది? ఈ ప్రశ్నకు జవాబును దాచిపెట్టే ప్రయత్నం ప్రభుత్వం చేయలేదు. నిర్మొహమాటంగానే చెప్పింది. ప్రపంచీకరణ; వర్తక పారిశ్రామిక సరళీకరణ; వేగంగా వస్తున్న సాంకేతిక మార్పులు; వాటికి పారిశ్రామిక రంగంపైన, ఉత్పత్తి ప్రక్రియపైన, ఉపాధిపైన, ఉపాధిని నిలబెట్టుకోవడానికి అవసరమైన శిక్షణపైన, కార్మికులను ఒకచోటి నుంచి మరొక చోటికి తరలించే అవసరంపైన ఉండగల ప్రభావం; ఆర్థిక సామర్థ్యాన్ని సాధించుకోవడానికీ, నిలబెట్టుకోవడానికీ, అంతర్జాతీయ రంగంలో పోటీకి నిలబడడానికీ అవసరమైన చర్యలు – వీటిని దృష్టిలో పెట్టుకునే ప్రస్తుత కార్మిక

చట్టాలు అహేతుకంగా ఉన్నాయని ప్రభుత్వం భావిస్తున్నది. వాటికి అనుగుణంగానే కార్మిక చట్టాలను తిరగరాయడానికి సూచనలిమ్మని ఏలినవారు కమిషన్‌ను ఆదేశించారు. ఇవి కేంద్ర ప్రభుత్వం కాగితం మీద పెట్టిన విషయాలే. మన ఊహకూ వ్యాఖ్యలకూ ఏమీ విడిచిపెట్టలేదు.

ఇందులో ప్రపంచీకరణ, వర్తక పారిశ్రామిక సరళీకరణ, అంతర్జాతీయ ఆర్థిక రంగంలో పోటీకి నిలబడడం అనేవి ప్రధానమైన విషయాలు. సాంకేతిక మార్పులను వాటి కోణం నుంచి చూసినప్పుడు మాత్రమే ప్రస్తుత కార్మిక చట్టాలు ఆ మార్పులకు అనుగుణంగా లేవని వారికి తోచింది. లేకపోతే సాంకేతిక మార్పులు రావడంలో కొత్త ఏముంది? మన దేశంలోని కార్మిక చట్టాలు చాలావరకు బాగా పాతవి. వాటిని జారీచేసిన తరువాత సాంకేతిక మార్పులు అనేకం వచ్చాయి. అయినా చిన్న చిన్న సవరణలు మినహా చట్టాలలో పెద్ద మార్పులేం అవసరం కాలేదు. సాంకేతిక మార్పులకు కార్మిక చట్టాలు నిజంగానే అవరోధమైన చోట, ఆ మార్పు చట్టానికి అడ్జస్ట్ కావలసిందే తప్ప చట్టాన్ని మార్చేది లేదన్న విధానపరమైన వైఖరి కూడ ఒకప్పుడు ఉండేది. ఇప్పుడు ఆ వైఖరిలో మార్పు రావడం వల్ల సమస్య వచ్చింది.

ఇక్కడ ఒక ఉదాహరణ ఇచ్చుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది. ఒక పరిశ్రమలో కొత్త సాంకేతిక ప్రక్రియను ప్రవేశపెట్టదలచుకున్నారనుకోండి. దానిమీద పనిచేయడానికి అవసరమైన నేర్పు ఇప్పుడున్న కార్మికులందరికీ ఉండదు. పైగా ఇప్పుడున్నంత మంది కార్మికులు అప్పుడు అవసరం ఉండదు. ఆ నేర్పును సంపాదించుకోగల వయసు దాటిపోయిన వారిని తక్కువ ఖర్చుతో ఇంటికి పంపించి మిగిలిన వారికి శిక్షణ ఇచ్చి (లేదా అందరినీ పంపించేసి శిక్షణ పొందిన కొత్తవారిని నియమించి) కొత్త సాంకేతిక ప్రక్రియను ప్రవేశపెట్టే స్వేచ్ఛ తమకు ఉండాలని యజమానులు కోరుకుంటారు. ప్రస్తుతం ఉన్న పారిశ్రామిక వివాదాల చట్ట ప్రకారమయితే తొలగించే వారందరికీ గ్రాట్యుటీయే కాక అదనంగా అంత మొత్తం నష్టపరిహారం ఇవ్వవలసి ఉంటుంది. వంద మంది కంటె ఎక్కువ పనిచేసే కంపెనీ అయితే ఈ తొలగింపుకు ప్రభుత్వం అనుమతి తీసుకోవలసి ఉంటుంది. సీనియారిటీని దృష్టిలో పెట్టుకొని జూనియర్లనే ముందు తొలగించవలసి ఉంటుంది. కాని కొత్త శిక్షణకు సీనియర్లే (వయసు, అలవాట్లరీత్యా) సిద్ధంగా ఉండరు కాబట్టి, వాళ్లను

తొలగించి జూనియర్లను కొనసాగించడాన్ని చట్టం ఆమోదించదు కాబట్టి, సీనియర్లకు అదనంగా నష్టపరిహారం ఇచ్చి తమ హక్కు వదులుకొమ్మని సంజాయించవలసి ఉంటుంది. దీనిని మార్చాలన్నది ప్రభుత్వం లక్ష్యం. సాంకేతిక మార్పులకు చోటు కల్పించడం కోసం శిక్షణ పొందిన, లేక పొందగల వారిని మాత్రం ఉంచుకొని (అది కూడ అవసరం ఉన్న మేరకే) తక్కిన వారిని అతి తక్కువ ఖర్చుతో (అంటే గ్రాట్యుటీ మాత్రం ఇచ్చి) ఎవరి అనుమతీ అక్కర లేకుండా ఇంటికి పంపించే ఏర్పాటు (ఆ మాట అనకుండా 'ఇతర పారిశ్రామిక రంగాలకు తరలిపోయే సౌలభ్యం కల్పించడం' అన్నారు) చట్టానికి ఆమోదనీయం కావాలని ప్రభుత్వం ఆదేశం. విధాన దృక్పథంలో వచ్చిన మార్పు వల్ల ఇది అవసరమయిందే తప్ప 'సాంకేతిక మార్పులకు' కార్మిక చట్టాలు వాటంతటవే ఆటంకం కాలేదు.

సాంకేతిక పురోగమనం సమాజానికి లాభదాయకం కాదా అని ఆవేశ పడబోతారేమో. దీనికి జవాబుగా చెప్పుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి. సాంకేతిక పురోగమనం సమాజానికి లాభదాయకమని యజమానులు దానిని ఎంచుకోరు. తమకు లాభదాయకమని ఎంచుకుంటారు. అయితే అది శ్రామికుల ఉత్పాదన శక్తిని పెంచుతుంది. కాబట్టి స్థూలమైన అర్థంలో సమాజానికి లాభదాయకమే కావచ్చు. కానీ కథ అక్కడితో అయిపోదు. ఆ సాంకేతిక ప్రక్రియ స్వభావాన్ని బట్టి, ఇతర పరిస్థితులను బట్టి దానివల్ల ఈ స్థూలమైన అర్థంలో ప్రయోజనమే కాకుండా నిర్దిష్టమైన అర్థంలో నష్టాలు కూడ ఉండగలవు. అవి ఉపాధి అవకాశాల వినాశనం, ఆర్థిక అంతరాల పెరుగుదల, అభివృద్ధి కేంద్రీకరణ, పర్యావరణ విధ్వంసం మొదలయిన అనేక రూపాలలో ఉండగలవు. అందువల్ల సాంకేతిక మార్పు విషయంలో ఆచితూచి వ్యవహరించడం అవసరం. తమ లాభాలు తప్ప వేరే ఏమీ చూసుకోని పరిశ్రమల యజమానులు ఆ పని చేయరు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో ప్రభుత్వం, కోర్టులు మాత్రమే ఆ పని చేస్తున్నాయి. నిర్దిష్టమైన చట్టాల పరిధిలో చేస్తున్నాయి. ఇంతకంటె మెరుగయిన పర్యవేక్షణను ప్రతిపాదించడం ఆమోదనీయమే అవుతుందిగానీ ఉన్నదానిని తొలగించి యజమానుల లాభదృష్టే సరయిన నిర్ణయం చేస్తుందనడంలో అర్థం లేదు. నిజానికి యజమానుల లాభదృష్టి సామాజికంగా సరయిన నిర్ణయం చేస్తుందని కూడ మన విధానకర్తలు అనడం లేదు. అది ఉత్పాదన సామర్థ్యాన్ని పెంచుతుందని,

అంతర్జాతీయ పోటీలో తట్టుకునే బలాన్ని ఇస్తుందని, పెట్టుబడి దిగుమతులకు అనువయిన వాతావరణాన్ని కల్పిస్తుందని మాత్రమే అంటున్నారు. సామాజిక శ్రేయస్సుకు 'మారోగోలీ' అంటున్నారు.

కాబట్టి రెండవ లేబర్ కమిషన్ టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ మొదటి అంశంలోని అన్ని లక్ష్యాలూ వెరసి ఒకటే: ప్రపంచీకరణకు అనుకూలంగా సంఘటిత రంగంలోని కార్మిక చట్టాలను తిరగరాయాలి. మరి ఈ పని చేస్తే కార్మికులందరూ 'అసంఘటిత' కార్మికుల స్థాయికి దిగజారిపోతారు కదా! అందుకే రెండవ అంశం చేర్చారు. అసంఘటిత రంగ కార్మికులకు 'కనీస రక్షణ' కల్పించే ఒక స్థూలమైన చట్టాన్ని రూపొందించమన్నారు. మన పాలకులు బొత్తిగా దయలేని వారు కారు.

నిజానికి అసంఘటిత రంగంలో చాలా వైవిధ్యం ఉంది. ఆ రంగంలో కార్మికులకు నిజంగా న్యాయం చేయాలంటే ఒక్కొక్కరకమైన అసంఘటిత శ్రమనూ విడిగా తీసుకొని దాని స్వభావానికి అనుగుణ్యమైన చట్టం చేయవలసి ఉంటుంది. రెండవ లేబర్ కమిషన్‌కు ప్రభుత్వం సూచించింది అది కాదు. అసంఘటిత రంగంలోని భిన్నత్వాన్ని లెక్కలోకి తీసుకోకుండ అందరికీ టోకున 'కనీస రక్షణ' కల్పించే ఒక గొడుగులాంటి చట్టాన్ని ('అంబ్రెల్లా లెజిస్లేషన్' అనేది ప్రభుత్వం వాడిన మాటే - మేము కల్పించిన ఉపమానం కాదు) సూచించమనింది. కమిషన్ తన కర్తవ్యాన్ని దానికి అనుగుణంగానే అర్థం చేసుకునింది.

కమిషన్ సమాజంలోని వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలను ఆహ్వానించింది. పరిశ్రమల యజమానులు, కార్మిక సంఘాలు, ప్రభుత్వ ప్రతినిధులు కార్మిక చట్టాల 'క్రమబద్ధీకరణ' గురించి తమ అభిప్రాయాలు తెలియజేశారు. పరిశ్రమల యజమానులు, ప్రభుత్వ ప్రతినిధులు కోరిన మార్పులు ఇవి:

1. ఒక పారిశ్రామిక సంస్థను మూసేసే విషయంలో గానీ, అక్కరలేని కార్మికులను తాత్కాలికంగా 'లే-ఆఫ్' చేసే విషయంలో గానీ, పూర్తిగా తొలగించే విషయంలో గానీ యాజమాన్యానికి పూర్తి స్వేచ్ఛ ఉండాలి. గ్రాట్యుటీ, ప్రావిడెంటు ఫండ్ తప్ప వేరే నష్టపరిహారం ఇయ్యవలసిన అవసరం ఉండకూడదు. ముందు నోటీసు ఇవ్వడం, ప్రభుత్వం అనుమతి తీసుకోవడం వగైరా ఆంక్షలు ఉండకూడదు. కోర్టుల జోక్యం ఉండకూడదు.

2. ఒక పారిశ్రామిక సంస్థ చేపట్టే ఉత్పత్తిలో, దానికి అనుబంధంగా జరిగే పనులలో దేనినయినా ఎప్పుడయినా కాంట్రాక్టుకు ఇచ్చి కాంట్రాక్ట్ కార్మికుల ద్వారా చేయించుకునే స్వేచ్ఛ, లేదా రోజువారీ పనిలోకి తీసుకునే క్యాజువల్ కార్మికుల చేత చేయించుకునే స్వేచ్ఛ యాజమాన్యానికి ఉండాలి. దీనిపైన చట్టం ఏ ఆంక్షలూ పెట్టకూడదు, ప్రభుత్వమూ కోర్టులూ జోక్యం చేసుకోకూడదు.

కమిషన్ ఈ రెండు కోరికలనూ పాక్షికంగా ఆమోదించింది. కార్మికులను లేఆఫ్ చేయడానికి అది ఎంత పెద్ద సంస్థ అయినా సరే ప్రభుత్వం అనుమతి తీసుకోనక్కరలేదనింది. 300 మంది కంటె ఎక్కువ కార్మికులున్న సంస్థ అయితే మాత్రమే మూసివేయడానికి ముందుగా ప్రభుత్వం అనుమతి తీసుకోవాలనింది (ప్రస్తుతమున్న చట్టంలో 100 మంది కంటె ఎక్కువ కార్మికులున్న సంస్థ లేఆఫ్‌కూ, తొలగింపుకూ, మూసివేతకూ కూడ ప్రభుత్వం అనుమతి తీసుకోవాలి). నష్టాలలో ఉన్న సంస్థను బలవంతంగా నడిపించమనడంలో అర్థం లేదు కాబట్టి, అటువంటి సంస్థల మూసివేతను ఒక హక్కుగా గుర్తించడం అవసరమని వాదిస్తూ, అనుమతి కోసం పెట్టుకున్న అర్జీ మీద ప్రభుత్వం 60 రోజుల లోపల జవాబు చెప్పకపోతే అనుమతి ఇచ్చినట్టే భావించాలని కమిషన్ అంటుంది. నిజంగానే యాజమాన్యం ప్రయత్న లోపం లేని కారణాల వల్ల సంస్థ నష్టాలలో పడినట్టయితే దానిని బలవంతంగా కొనసాగించాలనడం ఎవరికీ ప్రయోజనకరం కాదుగానీ, నిజంగా నష్టాలలో ఉందా లేక మూసివేయడం కోసం నష్టాలలో ఉన్నట్టు కృత్రిమంగా చూపించబడుతున్నదా అన్నదే అసలు సమస్య. అందుకోసమే ప్రభుత్వ అజమాయిషీ అనేది కనీసం వంద మంది కంటె ఎక్కువ కార్మికులు ఉన్న సంస్థ విషయంలో సామాజికంగా అవసరం అని భావింపబడింది. ఇప్పుడు 60 రోజులలోగా ఏ సంగతీ తేల్చకపోయినట్టయితే అనుమతి ఇచ్చినట్టేనని అంటే ఆ మాత్రం ఆలస్యాన్ని ప్రభుత్వ అధికారుల వద్ద పొందడం యాజమాన్యాలకు కష్టమేమీ కాదు. కాయితం మీద పెన్ను పెట్టకుండ డబ్బు సంపాదించుకునే మార్గం – ఇంకా చెప్పాలంటే కాయితం మీద పెన్ను పెట్టనందుకు డబ్బు సంపాదించుకునే మార్గం – లభిస్తే మన అధికారగణానికి అంతకంటే ఏం కావాలి?

వెరసి, ఎంత పెద్ద కంపెనీ అయినా సరే ఎంతమంది కార్మికులనయినా సరే లేఆఫ్ చేయడానికీ, తొలగించడానికీ, కంపెనీని మూసివేయడానికీ ప్రభుత్వం అనుమతి

తీసుకోనక్కరలేదని రెండవ లేబర్ కమిషన్ అభిప్రాయపడినట్టే భావించవచ్చు. కోర్టుల జోక్యాన్ని తొలగించడానికి మాత్రం కమిషన్ ఒప్పుకోలేదు. మూసివేత, తొలగింపు, లేఆఫ్‌ల విషయంలో వివాదం లేవదీసి కోర్టుకు ఎక్కే అవకాశాన్ని కార్మికులకు మిగిల్చింది.

యాజమాన్యాలు ఈ చర్యలకు ఎప్పుడూ సహేతుకమైన కారణాల వల్లనే పాల్పడతారని భావించినట్టయితే, ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలో ఇటువంటి ఆంక్షలు పెట్టడం అర్థరహితం అనుకునే అవకాశం ఉంది. కానీ అది నిజం కాదు. ఆ సంగతి రెండవ లేబర్ కమిషన్ సభ్యులకు బాగానే తెలుసును. నైపుణ్యంతో ఉత్పాదన క్రియ నిర్వహించడం ద్వారా మాత్రమే లాభాలు సంపాదించుకోవలసిన అగత్యం పెట్టుబడిదార్లకు లేదు. ఆస్తులను అడ్డుపెట్టుకొని అనేక రూపాలలో డబ్బు సంపాదించుకోవచ్చు. దాని కోసం లేని నష్టాలు ఉన్నట్టు చూపించవచ్చు, ఉన్న మార్కెట్ లేనట్టు చూపించవచ్చు. కార్మిక సంఘాలను దెబ్బతీయడానికి లేఆఫ్‌లు చేపట్టవచ్చు, నోరున్న కార్మికుల నోరు నొక్కేయడానికి రిట్రెంచ్ చేయవచ్చు. ఫ్యాక్టరీ మూసేసి కమర్షియల్ కాంప్లెక్స్ కట్టి అద్దెకిచ్చుకోవచ్చు. ఇలాంటి ఇంకా ఎన్నో కారణాలు ఉండగలవు కాబట్టే యాజమాన్య నిర్ణయాలకు – కనీసం 100 కంటె ఎక్కువ మంది కార్మికులున్న కంపెనీల విషయంలో – ప్రభుత్వం పర్యవేక్షణ ఉండాలని చట్టం భావిస్తుంది. కార్మిక శాఖలో పేరుకుపోయిన అవినీతి కారణంగా ఈ పర్యవేక్షణ అసమర్థంగా ఉంటే ఉండవచ్చుగాక, దానికి సహేతుకమైన కారణం లేదనుకోవడం పొరబాటు.

అయితే తొలగించిన కార్మికులకు నష్టపరిహారం ఇచ్చే విషయంలో కమిషన్ యాజమాన్యాల కోరికను తిరస్కరించడమే కాక, ఇప్పుడున్న దాని కంటే ఎక్కువ ఇవ్వాలని సూచించింది. ఈ సూచనను ప్రభుత్వం పక్కనపెట్టే అవకాశం ఉంది కాబట్టి, కమిషన్ ఈ విషయంలో అనుసరించిన వైఖరిని వివరించడం అవసరం. ప్రపంచీకరణ ఒత్తిడుల నేపథ్యంలో ఇప్పుడున్న పరిమితమైన అర్థంలో సహితం ఉద్యోగ భద్రత సాధ్యం కాదన్న పాలకుల వాదనతో ఏకీభవిస్తూనే, దాని స్థానంలో అర్థవంతమైన సామాజిక భద్రతను (సోషల్ సెక్యూరిటీని) ప్రవేశపెట్టాలని కమిషన్ భావించింది. ఇక్కడ సామాజిక భద్రత అంటే అర్థం, ఉద్యోగం కోల్పోయిన కార్మికుడు తిరిగి ఉద్యోగం సంపాదించుకునే దాకా కనీస ఆదాయం ఉండేటట్టు చూడడం. ప్రభుత్వం

నిరుద్యోగ భృతి ఇవ్వడమో, లేక తొలగించిన యాజమాన్యం తగు మొత్తం నష్టపరిహారం ఇవ్వడమో దీనికి మార్గం అని భావించి, మొదటిది మన దేశంలో లేదు కాబట్టి రెండవది అవసరమని చెప్పి, ప్రస్తుతం చట్టంలో ఉన్న నష్టపరిహారం కన్నా ఎక్కువ మొత్తాన్ని కమిషన్ సూచించింది. ఆ మొత్తాన్ని కార్మికుని చేతిలో ముందుగా పెట్టినట్టయితేనే తొలగింపు చట్టబద్ధం అవుతుందనింది.

కాంట్రాక్ట్ కార్మికులను వినియోగించే 'స్వేచ్ఛ' విషయంలో కూడ కమిషన్ యాజమాన్యాల కోరికకూ కార్మిక సంఘాల అభ్యంతరానికీ మధ్యస్తంగా సూచనలిచ్చింది. ప్రతీ సంస్థలోనూ ఒక కేంద్ర లేక ప్రధాన ఉత్పత్తి (లేక సేవా) రంగం ఉంటుంది. సైకిళ్ల ఫ్యాక్టరీ సైకిళ్లు ఉత్పత్తి చేస్తుంది, బొగ్గుగని బొగ్గు తవ్వి తీస్తుంది, ఆస్పత్రి వైద్య సేవలందిస్తుంది. ఇవి ఆ సంస్థల ప్రధాన ఉత్పత్తులు, లేక సేవలు. ఇవి కాక ఈ ప్రధాన ఉత్పత్తి లేక సేవకు అనుబంధంగా అనేక పనులు జరుగుతుంటాయి. ఊడవడం, తుడవడం, నిత్యం జరిగే లోడింగ్, అన్‌లోడింగ్, మిషన్ల రిపేర్లు, బొగ్గు తవ్వకం కోసం పై మట్టి తొలగించడం, ఆస్పత్రికి అనుబంధంగా మందుల విక్రయం, డయాగ్నొస్టిక్ సేవలు, ఉద్యోగుల కోసం క్యాంటీన్ నడపడం ఇత్యాది అనుబంధ కార్యాలు ఉంటాయి. ఇవన్నీ అనుబంధ కార్యాలే అయినప్పటికీ ఇవి అనునిత్యం జరుగుతాయి. ఇవి జరగనిదే ఆ సంస్థ చేసే ప్రధాన ఉత్పత్తి లేక సేవ జరగదు.

ఇవి కాక అప్పుడప్పుడు మాత్రమే జరిగే పనులు కొన్ని ఉంటాయి – బిల్డింగ్‌కు రంగులు వేయడం, ఏదయినా ముడిసరుకును నెలకొకసారి తెచ్చిపడేయడం వగైరా. ఈ మూడవ కోవకు చెందిన పనులను మాత్రమే కాంట్రాక్ట్‌కు ఇయ్యవచ్చుననీ నిత్యం జరిగే పనులలో – అంటే మొదటి రెండు కోవలకు చెందిన పనులలో – సంస్థ తన కార్మికులనే పెట్టి పని చేయించుకోవాలనీ కార్మిక సంఘాలు చాలాకాలంగా ఆందోళన చేస్తున్నాయి. చట్టం అంత దూరం పోలేదుగానీ, కాంట్రాక్ట్ కార్మిక చట్టంలోని సెక్షన్ 10(1) ద్వారా నిత్యం జరిగే పనిలో కాంట్రాక్ట్ కార్మికుల నియామకాన్ని నిషేధించే అధికారాన్ని మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేతిలో పెట్టింది. ప్రభుత్వాలు ఆ అధికారాన్ని కొంతమేరకు ఉపయోగించుకొని కొన్ని పారిశ్రామిక రంగాలలో కొన్ని రకాల పనులలో ఇప్పటికే కాంట్రాక్ట్ కార్మికుల వినియోగాన్ని నిషేధించి ఉన్నాయి. కోర్టులు దయతలచి ఆ నిషేధాజ్ఞలను కొట్టేయని సందర్భాలలో అవి అమలవుతున్నాయి కూడ.

అయితే ఈ సెక్షన్‌ని పూర్తిగా తొలగించాలనీ, ఏ రంగంలోనయినా కాంట్రాక్ట్ కార్మికులను నియమించడం పైన ఎటువంటి నిషేధం గానీ, నిషేధం పెట్టే అధికారం గానీ చట్టంలో ఉండకూడదనీ యాజమాన్యాల వాదన.

రెండవ లేబర్ కమిషన్ కూడ సెక్షన్ 10(1)ని తొలగించాలన్న సూచనకు అనుకూలంగానే స్పందించింది. అంటే ఒక పారిశ్రామిక రంగంలో లేక సంస్థలో నిత్యం జరిగే పనులలో కాంట్రాక్ట్ కార్మికుల నియామకాన్ని నిషేధించే అధికారం ప్రభుత్వానికి ఉండకూడదనింది. అయితే యాజమాన్యాలు కోరే పూర్తి స్వేచ్ఛ వారికి ఇవ్వకుండా, ఒక సంస్థ చేపట్టే ప్రధాన లేక కేంద్ర ఉత్పత్తి (లేక సేవా) రంగాలలో కాంట్రాక్ట్ కార్మికుల నియామకాన్నే నిషేధించాలని సూచించింది. ప్రధాన లేక కేంద్ర ఉత్పత్తిలో కాంట్రాక్ట్ కార్మికుల నియామకాన్ని నిషేధించడానికీ, నిత్యం తప్పనిసరిగా జరిగే పనిలో నిషేధించడానికీ చాలా తేడా ఉండగలదు. మొదటిది రెండవ దానిలో ఒక భాగం (ఒక్కొక్కసారి అతి చిన్న భాగం) మాత్రమే. ఉదాహరణకు ఒక గనిలో ఖనిజాన్ని తవ్వితీసే పని మాత్రమే ప్రధాన లేక కేంద్ర ప్రక్రియ. దానికి అనుబంధంగా పై మట్టి (ఓవర్ బర్డెన్ అంటారు) తొలగించే పని, ఖనిజాన్ని ముక్కలు చేసి ప్యాక్ చేసే పని, లోడ్ చేసే పని, మెయింటెనెన్స్ పని, నీళ్లు బయటకు తోడే పని, కార్మికుల కోసం క్యాంటీన్ నడిపే పని, ఊడ్చే పని, తుడిచే పని వగైరాలన్నీ అనునిత్యం అవసరమే అయినప్పటికీ అవి ఆ సంస్థ ప్రధాన ఉత్పత్తి ప్రక్రియ కిందికి రావు. ఈ పనులలో కాంట్రాక్ట్ కార్మికులను నియమించడాన్ని చట్టం ఇప్పటిదాకా నిషేధించకున్నా, ఆ నిషేధాన్ని ప్రకటించే అధికారం కాంట్రాక్ట్ కార్మిక చట్టంలోని సెక్షన్ 10(1) ప్రభుత్వానికి ఇచ్చింది. ప్రభుత్వాలు దానిని ఒకమేరకు సద్వినియోగం చేశాయి కూడ. ఇప్పుడు ఆ అధికారాన్ని పూర్తిగా తొలగించి, కేవలం ప్రధాన లేక కేంద్ర ఉత్పత్తి ప్రక్రియలో మాత్రమే కాంట్రాక్ట్ కార్మికుల నియామకాన్ని నిషేధించాలనడం అత్యధిక శాతం కార్మికులను కాంట్రాక్ట్ కార్మికుల బతుకుకు వదిలేయడమే అవుతుంది.

నిజానికి చాలా సంస్థలలో ఇప్పటికే ఈ ధోరణి మొదలయింది. సెక్షన్ 10(1) ఇచ్చిన అధికారాన్ని ప్రభుత్వాలు ఉపయోగించడం దాదాపు మానేశాయి కాబట్టి ఇది నిరాటంకంగా సాగుతున్నది. ఇది కార్మికులను ఏళ్లతరబడి నిత్య అభద్రతలో ఉంచుతుంది. ప్రతీ సంవత్సరమూ కాంట్రాక్టర్ మారుతుంటాడు గానీ కొత్తగా వచ్చిన కాంట్రాక్టరు కొత్త కార్మికులను తెచ్చుకోడు. తెచ్చుకుంటే వాళ్లకు పని నేర్పించడానికే

కొన్ని నెలలు పడుతుంది. పాతవాళ్లను కొనసాగించడం అతనికే ప్రయోజనకరం కాబట్టి వారినే కొనసాగిస్తాడు. అందువల్ల ఈ 'కాంట్రాక్ట్ కార్మికులు' ఏళ్ల తరబడి అదే సంస్థలో అదే పనిలో కొనసాగుతుంటారు. అయితే నిత్య అభద్రతలో – ఏ సంవత్సరం ఏ కాంట్రాక్టరు ఏం చేస్తాడోనన్న భయంలో – బతుకుతుంటారు. వారి జీతాలు కూడ ఒక పద్ధతి ప్రకారం పెరగవు, ఇతర సదుపాయాలేవీ ఉండవు. అన్ని సంస్థలలో ఇప్పటికే నడుస్తున్న ఈ కపట నాటకాన్ని శాశ్వతం చేయడమే కమిషన్ సూచన ఫలితం.

కార్మిక – యాజమాన్య వివాదాల పరిష్కారం విషయంలో కూడ రెండవ లేబర్ కమిషన్ కార్మికుల సంఘటిత శక్తిని పెంపొందించవలసిన అవసరాన్ని ఒక పక్క గుర్తిస్తూనే, వివాదాల పరిష్కారం జటిలంగా తయారు కావడానికి గల ప్రధాన కారణాన్ని గుర్తించకపోవడం వల్ల చివరికి అవాస్తవిక వైఖరినే ప్రదర్శించింది.

పారిశ్రామిక వివాదాలు ద్వైపాక్షిక చర్చల (నెగోషియేషన్) లోనయినా పరిష్కారం కావాలి, కార్మిక శాఖ అధికారుల మధ్యస్తం (కన్సిలియేషన్) లోనయినా పరిష్కారం కావాలి, కోర్టుల (అడ్జుడికేషన్) లోనయినా పరిష్కారం కావాలి. ప్రస్తుతం నడుస్తున్నది ఈ వరుస క్రమమే అయినా ఎక్కువ భాగం వివాదాలు మూడవ దశలోనే పరిష్కారం అవుతున్నాయనీ, అది అవాంఛనీయం అనీ కమిషన్ అంది. కానీ దానికి బాధ్యులెవరన్నది గుర్తించదు. ద్వైపాక్షిక పరిష్కారాలనూ, అధికారుల మధ్యస్తాలనూ యాజమాన్యాలు చులకనగా చూడడం దీనికి ప్రధాన కారణం. లేకపోతే సమస్యలు చర్చలలో పరిష్కారం కాకుండ కోర్టుకెక్కాలని ఏ కార్మికులు కోరుకుంటారు?

కార్మికులు డిమాండ్లు లేవదీసి చర్చిద్దాం రమ్మంటే యాజమాన్యాలు రావు. మధ్యస్తానికి రమ్మని కార్మిక శాఖ అధికారులు పంపే నోటీసులకు జవాబుండదు. ప్రతి తేదీకీ కార్మిక శాఖ కార్యాలయంలో నిష్ఫలంగా హాజరు వేయించుకొని రావడంతో కార్మిక సంఘాల బాధ్యుల బతుకు సగం గడిచిపోతుంది. ఈ రెండు ప్రక్రియలనూ గౌరవించని యాజమాన్యాల మెడలు వంచే ఏర్పాటేదీ ఇప్పుడు లేదు, రెండవ లేబర్ కమిషన్ సూచించనూ లేదు. ద్వైపాక్షిక చర్చలకు కూర్చోవడానికి నిరాకరించినా, మధ్యస్తం నోటీసులను గౌరవించకున్నా అప్పటికప్పుడే భారీగా జుర్మానా వేసి దానిని కార్మికులకు పంచే నియమమేదయినా ఉంటే తప్ప ప్రయోజనం ఉండదు.

లేదా సమ్మె హక్కునయినా బలోపేతం చేయాలి. చర్చలకు రాకపోతే సమ్మె చేస్తారన్న భయం ఉంటే చర్చలకూ, మధ్యస్తాలకూ యజమానులు హాజరవుతారు. పారిశ్రామిక వివాదాలు న్యాయబద్ధంగా పరిష్కారం కావాలంటే కార్మిక సంఘాలు బలంగా ఉండడం అవసరం అని కమిషన్ సైతం గుర్తించింది. అవి రోజురోజుకూ బలహీనపడుతుండడం దురదృష్టకరం అని కూడ బాధపడింది. అంతవరకూ బాగానే ఉంది. కానీ చర్చలకూ మధ్యస్తాలకూ యజమానులు రానప్పుడు సంఘం బలంగా ఉండి ఏం ప్రయోజనం? చిత్తశుద్ధితో ద్వైపాక్షిక చర్చలలో పాల్గొనకపోవడం 'అన్ ఫెయిర్ లేబర్ ప్రాక్టీస్' అనీ, అది శిక్షార్హమైన నేరమనీ చట్టం అంటుంది. కానీ ఆ శిక్ష పడవలసింది క్రిమినల్ కోర్టులో, కేసు పెట్టవలసింది ప్రభుత్వం. అది ఎప్పుడూ జరగదు. యాజమాన్యం చర్చలలో చిత్తశుద్ధితో పాల్గొననప్పుడు కార్మికులకు సమ్మె చేసే హక్కు ఉంటుందని చట్టం గుర్తించినట్టయితే వారికి ప్రయోజనం ఉంటుంది.

ఈ సంగతి రెండవ లేబర్ కమిషన్ సభ్యులకు తెలియకపోలేదనడానికి తార్కాణం వారు బొంబాయి కార్మిక నాయకుడు దత్తా సామంత్ వ్యవహారశైలిని ప్రస్తావించిన వైనం. దత్తా సామంత్ కార్మిక శాఖ అధికారుల మధ్యస్తాలను ఎప్పుడూ ఆహ్వానించేవాడు కాదు. డిమాండ్లు పెట్టేవాడు, యాజమాన్యాలు దిగిరాకపోతే నేరుగా సమ్మె పిలుపు ఇచ్చేవాడు. ఈ ఎత్తుగడ ఫలించిన విషయం కమిషన్ తన నివేదికలో గుర్తించింది.

అయితే ఈ ఎత్తుగడ అన్ని సందర్భాలలోనూ పని చేయదు. పెద్ద సంస్థలలో పని చేసినంత సులభంగా చిన్న సంస్థలలో పని చేయదు. అది పని చేయాలంటే, యాజమాన్యాలు ద్వైపాక్షిక చర్చలలో గానీ, కార్మిక శాఖ మధ్యస్తాలలో గానీ చిత్తశుద్ధితో పాల్గొననప్పుడు (అన్ని డిమాండ్లూ వెంటనే ఒప్పేసుకోవాలని కాదు, నిజాయితీగా పరిష్కార ప్రయత్నంలో భాగం కావాలి) కార్మికులకు సమ్మె చేసే హక్కు ఉంటుందని చట్టమే గుర్తించాలి.

ఈ అవసరాన్ని గ్రహించకుండా పారిశ్రామిక సమస్యలు ద్వైపాక్షికంగానో, మధ్యస్తంలోనో పరిష్కారమయి పోవాలనుకోవడం అవాస్తవికం. అన్నీ తెలిసిన రెండవ లేబర్ కమిషన్ సభ్యులు ఇటువంటి అవాస్తవిక వైఖరిని అనుసరించడం దురదృష్టకరం. ప్రభుత్వ అధికారుల దగ్గరికీ, కోర్టుకూ పోకుండ పారిశ్రామిక వివాదాలు పరిష్కారం

కావడానికి యోగ్యమైనదిగా వారు భావించే ఒక యంత్రాంగాన్ని సూచించారు. ప్రతీ సంస్థలోనూ ఫిర్యాదుల పరిష్కారం కమిటీ ఒకటి ఉంటుంది. అందులో సగం మంది యాజమాన్య ప్రతినిధులూ, సగం మంది కార్మిక ప్రతినిధులూ ఉంటారు. కార్మికుల వ్యక్తిగత సమస్యలన్నీ మొదట ఆ కమిటీ దగ్గరకు పోవాలి. ఈ సమస్యలను గుర్తింపు పొందిన యూనియనే కాక ఏ యూనియనయినా (పది శాతం సభ్యత్వం ఉంటే చాలు) లేవదీయవచ్చు. అక్కడ పరిష్కారం కాని పక్షంలో సమస్య మధ్యవర్తిత్వానికి పోవాలి. ఈ మధ్యవర్తిత్వం కార్మిక శాఖ అధికారుల దగ్గర కాదు. ప్రభుత్వ అధికారులెవ్వరూ మధ్యవర్తిత్వం చేయకూడదని కమిషన్ అభిప్రాయం. దానికి వేరే మధ్యవర్తులు (అర్బిట్రేటర్స్) ఉంటారు. వారు ఆ సంస్థలోని కార్మికులూ యాజమాన్యమూ ఇద్దరూ అంగీకరించిన పెద్దమనుషులు కావచ్చు. లేదా కార్మిక సంబంధాల కమిషన్ ఎంపిక చేసినవారు కావచ్చు. ప్రతి రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కూడ ఒక కార్మిక సంబంధాల కమిషన్ ఉండాలనేది రెండవ లేబర్ కమిషన్ సూచనలలో ఒకటి.

మధ్యవర్తి దగ్గర సమస్య పరిష్కారం కాకపోతే అది కార్మిక సంబంధాల కమిషన్ దగ్గరకు పోతుంది. అక్కడ కూడ పరిష్కారం కాకపోతే లోక్ అదాలత్‌కు పోతుంది. ఎక్కడా కాకపోతేనే కోర్టుకు పోవాలని కమిషన్ అభిప్రాయం.

వ్యక్తిగత సమస్యలను ఏ యూనియన్ అయినా లేవదీయవచ్చునని పైన చెప్పుకున్నాం. కాని సంస్థలోని కార్మికుల ఉమ్మడి సమస్యలను లేవదీసే హక్కు మాత్రం కమిషన్ కొత్త సూచనల ప్రకారం ఒకే ఒక 'సంప్రదింపుల ప్రతినిధి' (నెగోషియేటింగ్ ఏజెంట్)కి ఉంటుంది. సంస్థలో ఏ యూనియన్‌కైనా 66 శాతం మించి సభ్యత్వం ఉన్నట్టయితే ఆ యూనియనే సంప్రదింపుల ప్రతినిధి అవుతుంది. లేనిపక్షంలో 25 శాతం మించి సభ్యత్వం ఉన్న అన్ని యూనియన్ల నుంచి దామాషా పద్ధతిలో ఎంపిక చేసిన కమిటీ సంప్రదింపుల ప్రతినిధి అవుతుంది. ఒకసారి గుర్తింపు పొందిన సంప్రదింపుల ప్రతినిధికి ఆ గుర్తింపు నాలుగు సంవత్సరాలు ఉంటుంది. ఆ నాలుగేళ్లు ఆ కమిటీ తప్ప వేరే ఎవ్వరికీ కార్మికుల ఉమ్మడి సమస్యలపైన వివాదం లేవదీసే అధికారం ఉండదు. సమ్మెకు పిలుపు ఇచ్చే అధికారం కూడ ఈ కమిటీకే ఉంటుంది. అయితే ఆ సమ్మె పిలుపు ఇతరత్రా చట్టబద్ధంగా ఉండడమే కాక మరొక నియమాన్ని కూడ పాటించాలి. కార్మికులలో రహస్య బ్యాలట్ వోటింగ్ పెట్టి సమ్మెకు

51 శాతం అనుకూలత పొందిన తరువాతే సమ్మెకు పిలుపు ఇవ్వాలి. చట్ట విరుద్ధంగా సమ్మెకు పిలుపునిచ్చిన యూనియన్ గుర్తింపును రద్దుచేస్తారు. ఈ తరువాత రెండు సంవత్సరాలు దానికి గుర్తింపు ఇవ్వరు. చట్ట విరుద్ధమైన సమ్మెలో కార్మికులు పాల్గొన్నట్టయితే ఒక రోజుకు మూడు రోజులు జీతం కోసేయాలి.

ఇవి చాలా నష్టకరమయిన సూచనలు. నాలుగు సంవత్సరాల కోసం సంప్రదింపుల ప్రతినిధిగా ఎన్నికయిన యూనియన్, లేక సంఘం అందులో నాలుగోవంతు కాలం గడవకముందే కార్మికుల అభిమానాన్ని కోల్పోయినా, యాజమాన్యానికి అమ్ముడుపోయినా, సమస్యలు చేపట్టడం మానేసినా నాలుగేళ్లూ కార్మికులు ఆ ప్రతినిధి ద్వారానే వివాదాలు లేవదీయాలనడం ఏ విధంగా న్యాయం? సమ్మెకు పిలుపిచ్చే హక్కు కూడ వారికి మాత్రమే ఉంటుందంటే కార్మికులకు అన్ని అన్యమార్గాలూ మూసేయడమే కాదా?

ఈ విధంగా సమ్మె హక్కును అన్నిరకాలుగానూ కట్టుదిట్టం చేసేసి, సంప్రదింపులు, మధ్యవర్తిత్వాలకు మూడు అంచెలు నిర్దేశించి, వాటి ద్వారానే అన్ని వివాదాలూ పరిష్కారం కావాలనీ, ఆఖరుగా మాత్రమే కోర్టుకు పోవాలనీ కమిషన్ అంటుంది. సంప్రదింపులలోనూ, మధ్యవర్తిత్వంలోనూ యాజమాన్యం చిత్తశుద్ధితో వ్యవహరించకపోతే వారిపైన ఒత్తిడిపెట్టే మార్గం కార్మికులకు ఏముంది? మన దేశంలో పారిశ్రామిక వివాదాలు ఎక్కువగా కోర్టుకు పోతున్నాయని కమిషన్ వాపోయిందిగానీ దానికి కారణమేమిటో విశ్లేషించలేదు. కోర్టుల మీద కార్మికులకు మోజు ఉండడం దానికి కారణం కాదు. కోర్టులంటే వకీళ్లకు తప్ప వేరే ఎవ్వరికీ మోజు ఉండే అవకాశం లేదు. సంప్రదింపులు, చర్చలు, మధ్యస్తాలంటే యాజమాన్యాలకు ఉండే తృణీకార భావం వల్లనే వివాదాలు ఎక్కువగా కోర్టుకు పోతున్నాయి. కోర్టుతో ఒక సౌకర్యం ఏమిటంటే ఇరుపక్షాలూ హాజరు కావడం కోసం అది అనంతంగా ఎదురుచూస్తూ కూర్చోదు. కొంత అవకాశం ఇచ్చిన తరువాత ఎక్స్ పార్టీ అవార్డు జారీచేసే అధికారం కోర్టుకు ఉంది. మధ్యస్తంలో అది సాధ్యం కాదు. మధ్యస్తమంటేనే ఇరువురూ ఒప్పుకున్న పరిష్కారానికి అక్షరరూపం ఇవ్వడం అని అర్థం. కాబట్టి దానిలో ఎక్స్‌పార్టీ అవార్డులుండవు. బలవంతులైన పక్షాన్ని రప్పించడానికి బలహీనుల వద్ద గానీ, మధ్యస్తం చేసే అధికారి దగ్గర గానీ ఏ అస్త్రం లేనప్పుడు అది విఫలం కాక తప్పదు. మధ్యస్తాలకూ

కోర్టు కేసుకూ మరొక తేడా కూడ ఉంది. అసమానుల మధ్య మధ్యస్తమంటే అర్థం బలహీనులను రాజీపడమని ఒత్తిడి పెట్టడమే. మధ్యస్తాలలో ఎక్కువ భాగం అదే జరుగుతుంది. ఈ రాజీకి ఏ సూత్రాలూ వర్తించవు. ఒత్తిడే దాని ఏకైక సూత్రం. కోర్టులో వేరే అవలక్షణాలు ఎన్ని ఉన్నా అది రాజీపడమని ఒత్తిడి పెట్టదు. ఆమోదం పొందిన న్యాయసూత్రాల ప్రకారం మంచో చెడో ఒక తీర్పు ఇస్తుంది.

కార్మికులు సంఘటితపడి ద్వైపాక్షిక చర్చలలో తమ సమస్యలు సమర్థంగా పరిష్కరించుకోవాలనీ, బలహీనపడుతున్న కార్మిక సంఘాలను ఇందుకోసం బలోపేతం చేయాలనీ రెండవ లేబర్ కమిషన్ తన నివేదికలో ఒకటికి రెండుచోట్ల అన్నప్పటికీ, వారు పారిశ్రామిక మధ్యస్తాలకు సంబంధించిన ఒక పార్శ్వాన్ని అసలే చూడకపోవడం వల్ల చాలా నష్టకరమయిన వ్యవస్థను సూచించారు.

## అసంఘటిత రంగం

ఇక అసంఘటిత రంగ కార్మికుల కోసం రెండవ లేబర్ కమిషన్ డిజైన్ చేసిన 'గొడుగు'ను పరామర్శిద్దాం.

'సంఘటిత రంగం', 'అసంఘటిత రంగం' అనేవి ఏ చట్టంలోనూ నిర్వచించిన మాటలు కావు. అవి వ్యవహారంలో పుట్టుకొచ్చిన మాటలు. కార్మికుల సంఖ్య కొంచెం ఎక్కువ ఉండి, ఉద్యోగ భద్రత కొంచెం ఉండి, సాంకేతిక స్థాయి ఆధునికంగా ఉండి, యజమాని అనే వాడొకడు స్పష్టంగా ఉండి, జీతాలు కొంత మెరుగ్గా ఉండి, యూనియన్లు ఉండి, కార్మిక సంక్షేమ చట్టాలు ఎప్పుడూ కాకున్నా అప్పుడప్పుడయినా అమలవుతూ ఉండే సంస్థలను 'సంఘటిత రంగం' అనీ, ఈ లక్షణాలు కొన్ని గానీ, అన్నీ గానీ లేని సంస్థలను లేదా ఉపాధి ప్రక్రియలను 'అసంఘటిత రంగం' అనీ వ్యవహరిస్తారని స్థూలంగా చెప్పుకోవచ్చు.

సంఘటిత రంగంలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులనూ క్యాజువల్ కార్మికులనూ అసంఘటిత రంగ కార్మికులుగా లెక్కించడం జరుగుతున్నది. వీరేకాక ఇంకా చాలారకాల శ్రామికులు 'అసంఘటితం' నిర్వచనం కిందికి వస్తారు. ఒక జాబితా తయారు చేయడమే కష్టం. వీరికి యూనియన్లు ఉండవు, ఉద్యోగ భద్రత ఉండదు, కార్మిక సంక్షేమ చట్టాలు కొన్ని వర్తించవు, వర్తించేవి అమలు కావు, అమలు చేయించుకునే మార్గాలు

అందుబాట్లో ఉండవు. జీతాలు (లేక సంపాదన) చాలా తక్కువ స్థాయిలో ఉండడమే కాక వాటిలో క్రమబద్ధమైన పెరుగుదల ఏదీ ఉండదు. తరుగుదల ఉండదన్న భరోసా సైతం ఉండదు. అనారోగ్యం, పనిస్థలంలో ప్రమాదాలు, స్త్రీలయితే కాన్పులు మొదలయిన కారణాల వల్ల వైద్య సహాయం అవసరమయితే వాటిని కల్పించే వ్యవస్థ లేదు. అటువంటి సమయాలలో 'వేతనంతో సెలవు' పొందే అవకాశం లేదు. యజమాని అనే వాడెవడయినా ఉన్నా వాడితో వేతన ఒప్పందాలు ఉండవు, ప్రభుత్వమే దయదలచి ఏవైనా జీవోలు జారీచేసినా అవి అమలు కావు.

అసంఘటిత రంగంలోనైతే కొందరికి యజమాని ఎవడనేది స్పష్టంగా ఉండదు. కొందరికి అసలు యజమానే ఉండడు. కార్మిక సంక్షేమ చట్టాలు చాలావరకు యజమాని – ఉద్యోగి అన్న సంబంధాన్ని ఆశ్రయించి ఉంటాయి కాబట్టి వాటిని అసంఘటిత రంగానికి అన్వయించాలన్నా కష్టమే. సొంత రిక్షా నడుపుకునే రిక్షా కార్మికులు, సొంత షాపు పెట్టుకున్న మంగలులు, పది ఇళ్ళ నుంచి బట్టలు తెచ్చి ఉతికే చాకలులు, సొంత పడవ, వలలు పెట్టుకొని చేపలు పట్టే మత్స్యకారులు, ఊరందరి పశువులు మేపుకొచ్చే పశువుల కాపర్లు, పది ఇళ్ళలో అంట్లుతోమే పనిమనుషులు, ఏ రోజు ఏ రైతు పిలిస్తే ఆ రోజు అతని పొలంలో పనిచేసే వ్యవసాయ కూలీలు, లైసెన్స్ పొందిన చెట్టెక్కి కల్లుతీసి చెట్టుకిందే దానిని అమ్మే గీత కార్మికులు, పట్టణాలలో అడ్డామీద నిలబడి ఏ బిల్డింగ్ కాంట్రాక్టర్ పిలిస్తే అతనితో పోయి తాపీ పనో తట్టలు మోసే పనో చేసే పట్టణ ప్రాంత కూలీలు, కమిషన్ ఏజెంటు దగ్గర బీడీ ఆకు, పొగాకు తీసుకొని బీడీలు చుట్టి కంపెనీకి అప్పగించే బీడీ కార్మికులు, పట్టణాలలో తోపుడు బండ్ల మీద వంద రకాల సరుకులు అమ్ముకుంటూ తిరిగే చిల్లర బేరగాళ్లు, రోడ్డు పక్కన చిత్తుకాగితాలు, పాత సీసాలు, ఇనప తుక్కు ఏరి వర్తకులకు అమ్ముకొని బతికేవారు – వీరంతా యజమాని లేని, లేక యజమాని ఫలాన అని స్పష్టంగా తెలీని అసంఘటిత కార్మికులు. వీళ్లకు జీతం, డిఏ, ప్రావిడెంట్ ఫండ్, ప్రసూతి సెలవు, ఆరోగ్య భద్రత, గ్రాట్యుటీ, వేతనంతో సెలవు మొదలైన హక్కులను అర్థవంతంగా కల్పించాలంటే ఇప్పుడున్న కార్మిక సంక్షేమ చట్టాల స్వరూపమే మార్చవలసి ఉంటుంది.

అయినా అసంఘటిత రంగంలో కొందరికి ఇప్పటికే ప్రత్యేకమైన చట్టాలు రూపొందించారు. బీడీ కార్మికులకు, బిల్డింగ్ కార్మికులకు, హమాలీలకు, కాంట్రాక్ట్

కార్మికులకు వేరు వేరు సంక్షేమ చట్టాలున్నాయి. ఆయా రంగాల నిర్దిష్టతను దృష్టిలో ఉంచుకొని తయారుచేసిన చట్టాలివి. అటువంటి చట్టాలే రిక్షా కార్మికులకు, పనిమనుషులకు, చాకలి, మంగలి తదితర వృత్తుల వారికి, ఇతర అసంఘటిత కార్మికులకు రూపొందించినట్టయితే చాలా ఉపయోగకరంగా ఉండేది. ఆ కోణం నుంచి ప్రభుత్వం మీద కార్మిక ఉద్యమం ఎన్నడూ ఒత్తిడి పెట్టలేదు. పెట్టకపోవడానికి కారణం భారత కార్మికోద్యమంలోని ప్రధాన బలహీనత అది సంఘటిత రంగ కార్మికోద్యమమే తప్ప కార్మికులందరి ఉద్యమం కాదు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వానికి అసంఘటిత కార్మిక వర్గం గుర్తుకు రావడానికి కారణం వారి మీద ప్రేమ కాదు. సంఘటిత రంగాన్ని అసంఘటితం చేసే విధాన మార్పులు ఆ రంగంలోని కార్మికులకు, వారి యూనియన్లకు, సామాజిక ప్రజాభిప్రాయానికి మింగుడు పడాలంటే అసంఘటిత రంగానికి కొంత కనీస భద్రత కల్పించడం అవసరం. అందుకే అసంఘటిత రంగంలోని ఒక్కొక్క వర్గాన్నీ విడిగా పరిశీలించి వారి వారి పరిస్థితులకు తగిన సంక్షేమ చట్టాన్ని రూపొందించమని రెండవ లేబర్ కమిషన్‌ను కోరకుండా, టోకున కొంత కనీస భద్రత కల్పించే సూచనలు ఇమ్మని కోరింది.

కమిషన్ తన నివేదికలో అసంఘటిత రంగ కార్మికుల జీవిత పరిస్థితుల గురించి వివరంగానే చర్చించింది. తమ అవగాహన, సానుభూతి చూపించింది. ఈ మధ్య ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న చర్చలను లెక్కలోకి తీసుకొని సెక్స్ వర్కర్స్‌ను కూడ అసంఘటిత కార్మికులుగా భావించి వారి సమస్యలను ప్రస్తావించింది (అయితే గృహిణులు చేసే ఇంటి పనిని అసంఘటిత శ్రమలో లెక్కించలేదు).

1991 భారతదేశపు జనాభా లెక్కలలో 34 కోట్ల మంది తమను తాము కార్మికులుగా నమోదు చేసుకున్నారని కమిషన్ అంటుంది. వారిలో 90.6 శాతం మంది అసంఘటిత రంగానికి చెందినవారు. వ్యవసాయం, అటవీ ఉత్పత్తులు, తోటలు, చేపల వేటలలో పనిచేసే 19.1 కోట్ల మందిలో 19.0 కోట్ల మంది (అంటే 99.2 శాతం) అసంఘటిత రంగ కార్మికులు. పారిశ్రామిక ఉత్పత్తి రంగంలోని 2.89 కోట్ల కార్మికులలో 2.16 కోట్లు (అంటే 75 శాతం) అసంఘటిత కార్మికులు. బిల్డింగులు, రోడ్లు మొదలయిన కట్టడపు పనులలో ఉన్న కార్మికులలో 78 శాతం, వర్తక వాణిజ్య రంగంలోని కార్మికులలో 98 శాతం, రవాణా ప్రసార రంగాలలోని కార్మికులలో 61.5 శాతం అసంఘటిత కార్మికులు.

ఈ గణాంకాలు సమస్య పరిమాణాన్ని సూచిస్తాయి. కానీ ప్రభుత్వం రెండవ లేబర్ కమిషన్‌ను సూచించమని కోరిన పరిష్కారం పరిధి చాలా చిన్నది. కమిషన్ అసంఘటిత రంగాన్ని విహంగ వీక్షణం చేసి అందులోని కార్మికుల సమస్యలను క్లుప్తంగా ఏకరువు పెట్టి కొంచెం ఆవేశపడి 'రాజ్యాంగాన్ని ప్రకటించిన యాభై ఏళ్ల తరువాత కూడ దేశ శ్రామిక జనాభాలో 90 శాతానికి హామీ ఇచ్చిన హక్కులకు భరోసా కల్పించలేకపోతున్నామంటే మనం చెప్పేదానికీ చేసేదానికీ పొంతన లేదని అనడంలో తప్పు లేదు' అంటుంది.

అయితే తాను మాత్రం చేయమన్న పనికి పరిమితమయిన సూచనలు మాత్రమే చేసింది. టోకున కనీస భద్రత కల్పించడానికి కమిషన్ చేసిన ప్రధాన సూచన అసంఘటిత రంగ శ్రామికులకు సంక్షేమ నిధి లేక నిధులు ఏర్పాటు చేయడం. దీని కోసం అసంఘటిత రంగ శ్రామికులందరూ తమ పేర్లు వగైరా వివరాలను కార్మిక శాఖ వద్ద నమోదు చేసుకుంటారు. అందరికీ గుర్తింపు కార్డులు ఇస్తారు. వారి వేతనం, లేక సంపాదన నుంచి కొంత, యజమాని అనేవాడు ఉంటే వాడి ఆదాయం నుంచి కొంత, ప్రభుత్వ బడ్జెట్ నుంచి కొంత, ఆయా రంగాల వర్తక వాణిజ్య పారిశ్రామికవేత్తల నుంచి పన్ను రూపంలో కొంత సేకరించి ఒక సంక్షేమ నిధి (లేక నిధులు) నెలకొల్పుతారు. అదే అసంఘటిత కార్మిక రంగానికి ప్రభుత్వం అందియ్యబోయే గొడుగు. నిరుద్యోగ భృతి, ప్రసూతి సహాయం, గ్రాట్యుటీ, అనారోగ్య భృతి, వృత్తిలో తగిలే గాయాలకు, కలిగే అనారోగ్యానికి నష్టపరిహారం – అన్నీ కార్మికులు ఈ నిధి నుంచే పొందుతారు.

కేరళ రాష్ట్రం ఇటువంటి నిధులు దాదాపు 30 నిర్వహిస్తున్నది. అసంఘటిత రంగ కార్మికుల సమస్యల మీద దృష్టి పెట్టి తగు చర్యలు చేపట్టిన రాష్ట్రాలలో కేరళ ప్రథమం. (మహారాష్ట్ర హమాలీల హక్కులు, భద్రత విషయంలో మంచి వ్యవస్థను రూపొందించింది. అసంఘటిత రంగ కార్మికులకు ఏమీ చేయని రాష్ట్రాలలో మనది ఒకటి.) అదే స్ఫూర్తితో రెండవ లేబర్ కమిషన్ పై ఆలోచన చేసింది.

దానిని వ్యతిరేకించవలసిన అవసరమేమీ లేదుగానీ, ఈ సంక్షేమ నిధి పరిధిలోకి రాని విషయాలు చాలా ఉన్నాయి. వేతనాలు (లేక ఆదాయం), పని స్థలంలో భద్రత వీటిలో రెండు. యజమాని – ఉద్యోగి సంబంధం ఎక్కడున్నా అక్కడ కనీస వేతనాల

చట్టం అమలవ్వాలి. దానికి సంఘటితం – అసంఘటితం అన్న తేడా ఉండకూడదు. అయితే అసంఘటిత రంగానికి సంబంధించిన కనీస వేతనం జీవోలు అమలు కావడం చాలా కష్టం. వాటిని అమలు చేయించుకునే ప్రయత్నమే కార్మికులకు దుస్సాహసంగా కనిపిస్తుంది. యజమాని అనేవాడు స్పష్టంగా లేని చోట కూడ ఒక కనీస ఆదాయ ప్రమాణాన్ని నిర్వచించి దానిని నిలబెట్టే ప్రయత్నమూ అవసరమే. అది ఒక్కొక్క రంగంలో ఒక్కొక్క రకంగా ఉండవలసి ఉంటుంది. పని స్థలంలో ఆరోగ్యం, భద్రతల విషయమూ అంతే. ప్రస్తుతమున్న చట్టాలు ఫ్యాక్టరీలకూ గనులకూ మాత్రమే వర్తిస్తాయి. అసంఘటిత రంగంలో కూడ శరీర అవయవాలకు అపాయం కలిగించే ప్రమాదాలకు తావు ఉంటుంది. అంతకంటె ఎక్కువగా వృత్తి రోగాలకు (ఆక్యుపేషనల్ డిసీజస్) అవకాశం ఉంటుంది. వాటి గురించి అవగాహన లేదు. జాగ్రత్తలు తెలియవు.

రెండవ లేబర్ కమిషన్ కనీసం ఈ రెండు విషయాలలోనయినా నిర్దిష్టమైన సూచనలు చేసి ఉండవలసింది. ప్రభుత్వం నిర్దేశించిన 'కనీస రక్షణ'లో ఇవి భాగం కాదని ఎందుకు అనుకోవాలి? ఆ కనీస రక్షణను సంక్షేమ నిధికి కుదించి వేయడం ద్వారా, ప్రభుత్వం ఏ కారణంగా అసంఘటిత రంగానికి కొంత రక్షణ కల్పించాలని భావించిందో, దానికే – అంటే సంఘటిత రంగం నుంచి అసంఘటిత రంగంలోకి నెట్టివేస్తున్న కార్మికులకు కొంత ఉపశమనం కలిగించే కర్తవ్యానికే – కమిషన్ తన ప్రయత్నాన్ని పరిమితం చేసినట్టయింది. ఇంకొంచెం విశాలంగా ఆలోచించినట్టయితే అసంఘటిత రంగంలో ముందు నుంచీ ఉన్న సమస్యలకు కొంతమేరకయినా పరిష్కారం దొరికి ఉండేది. కమిషన్ అసంఘటిత రంగ కార్మికుల సమస్యల గురించి చేసిన సవివరమయిన సమీక్షలో ఆ స్పృహ కనిపిస్తుంది గానీ సూచనల దగ్గరికొచ్చేసరికి పాలకుల అవసరాలకే కమిషన్ ఆలోచనలు పరిమితం అయ్యాయి.

**మానవహక్కుల వేదిక బులెటిన్ 6**
**ఫిబ్రవరి 2004**

# న్యాయమూర్తుల అధిక ప్రసంగం ఉద్యోగ సంఘాల నిర్వ్యాపకత్వం

కార్మికులకూ ఉద్యోగులకూ సమ్మె చేసే హక్కు లేదని సుప్రీంకోర్టు తమిళనాడు ఉద్యోగుల సమ్మె కేసులో చెప్పిందని దేశంలో చాలా ఆందోళన చెలరేగుతున్నది. ఆ తీర్పులో సుప్రీంకోర్టు అనవసర ప్రసంగం చాలా చేసిందిగానీ కార్మికులకు సమ్మె హక్కు లేదనలేదు. ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే లేదనింది. అది కూడ సుప్రీంకోర్టు సొంతగా వెలిబుచ్చిన అభిప్రాయం కాదు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళుల లోనే సమ్మెలో పాల్గొనడం శాఖాపరమయిన నేరం అని ఉంది. అలా ఉండడం రాజ్యాంగ విరుద్ధం కాదని – అంటే సమ్మెలో పాల్గొనే ప్రాథమిక హక్కేదీ ఉద్యోగులకు రాజ్యాంగం ఇవ్వలేదని – నలభై ఏళ్ల కిందనే సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం (కాన్‌స్టిట్యూషన్ బెంచి) ప్రకటించింది.

మరయితే తమిళనాడు ఉద్యోగుల కేసు విషయంలో దేశంలో జరుగుతున్న అలజడి అనవసరమయినదా? కాదు. ఒక్కొక్కసారి అపోహల వల్ల కూడ మేలు జరగగలదనడానికి ఈ అలజడి ఒక తార్కాణం. అయితే దాని పూర్వాపరాల గురించి సరయిన అవగాహన అవసరం.

సుప్రీంకోర్టు మొన్న ఇచ్చిన తీర్పులోని అభ్యంతరకర లక్షణాలలో ఒకటేమిటంటే, అసలు తమిళనాడు ఉద్యోగులు ఎందుకోసం సమ్మె చేశారని ఎక్కడా చర్చించకపోవడం. ఆ తీర్పులో సమ్మెకు గల కారణం గురించిన కనీస ప్రస్తావన సహితం లేదు.

తమిళనాడు ఉద్యోగులు ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని కొత్త కోరికలేవీ కోరలేదు. ఆర్థిక భారం వేసే డిమాండ్లేవీ పెట్టలేదు. (ఈ రెండు పనులూ చేయకూడదని కాదు – చేయలేదనేది వాస్తవం) గతంలో చేసుకున్న ఒప్పందాన్ని అమలుచేయమన్నారు, రిటైరయిన ఉద్యోగుల తదనంతర హక్కులపైన పెట్టిన ఆంక్షలను తొలగించమన్నారు. ఈ కోరికలతో కూడ వాళ్లు వెంటనే సమ్మెకు దిగలేదు. చాలా దఫాలు చర్చలూ, సంప్రదింపులూ జరిపారు. ఆ ప్రయత్నం ఫలించకపోయేసరికి సమ్మె నోటీసు ఇచ్చి సమ్మెకు దిగారు.

తమిళనాడు ప్రభుత్వం ఈ సమ్మెను ఎదుర్కొనడానికి 'ఎస్మా' ప్రయోగించింది. అంతేకాదు, రాష్ట్ర ప్రభుత్వంలోని సకల శాఖలనూ 'అత్యవసర సర్వీసులు'గా ప్రకటించి సమ్మెను నిషేధించింది.

అయినప్పటికీ ఉద్యోగులు సమ్మెకు ఉపక్రమించారు. ఒకరూ ఇద్దరూ కాదు, లక్షల సంఖ్యలో సమ్మెకు దిగారు. అప్పుడు తమిళనాడు ప్రభుత్వం ఎస్మాకు ఆర్డినెన్స్ ద్వారా ఒక సవరణ తీసుకొచ్చింది. ఈ సవరణ సారాంశం ఏమిటంటే ఎస్మా కింద నిషేధించిన సమ్మెలో పాల్గొన్న వారిని విచారణ లేకుండా శిక్షించవచ్చునని. దాన్ని ఉపయోగించి జయలలిత ప్రభుత్వం వెంటనే లక్షల మంది ఉద్యోగులను బర్తరఫ్ చేసింది. ఈ చర్య చెల్లుతుందా అన్నదే తమిళనాడు ఉద్యోగులు కోర్టు ముందుకు తెచ్చిన సమస్య. ఏ నేరానికైనా తప్పిదానికైనా విచారణ లేకుండా ఎవ్వరినీ శిక్షించడానికి వీలులేదనేది ప్రాథమిక సహజ న్యాయసూత్రం. దీనికి ఎంతో అరుదుగా తప్ప కోర్టులు మినహాయింపులు ఇవ్వలేదు, ఇవ్వజాలవు. అటువంటప్పుడు నిషిద్ధ సమ్మెలో పాల్గొన్న పాపానికి నిర్విచారణగా లక్షలాది ఉద్యోగులను బర్తరఫ్ చేయొచ్చునని చెప్పే చట్టం చెల్లుతుందా?

ఉద్యోగులకు సమ్మె చేసే హక్కు లేదనే అనుకుందాం. ఎస్మా ప్రయోగించినప్పుడే కాదు, ప్రయోగించనప్పుడు కూడ లేదనుకుందాం. అయినప్పటికీ సమ్మె చేసినట్టయితే ఏ విచారణా జరపకుండా, ఎవరు బుద్ధెరిగి సమ్మెలో పాల్గొన్నారో, ఎవరు నలుగురిలో నారాయణా అంటూ పాల్గొన్నారో, ఎవరు సమ్మెకారులు కొడతారేమోనన్న భయంతో పాల్గొన్నారో, ఎవరు సమ్మె జరగకున్నా ఆ పూట వేరే కారణాల వల్ల డ్యూటీకి పోలేదో – ఇదేదీ విచారించకుండా అందరినీ టోకుగా శిక్షించడం న్యాయ సమ్మతమేనా? అట్లా శిక్షించే అధికారం ఇచ్చే చట్టం రాజ్యాంగ సమ్మతమేనా?

తమిళనాడు ఉద్యోగులు న్యాయస్థానాలను తేల్చమన్నది ఈ ప్రశ్నలను. కానీ న్యాయస్థానాలు చాలా విచిత్రంగా వ్యవహరించాయి. మొదట వారి కేసును విచారణకు తీసుకున్న మద్రాసు హైకోర్టు జడ్జి ఆ ఆర్డినెన్స్‌నూ, దానికింద జరిగిన బర్తరఫ్‌లనూ వెంటనే 'స్టే' చేశాడు. నాగరిక సమాజాలలో అమలులో ఉన్న న్యాయసూత్రాలతో ఏ కొంచెం పరిచయం ఉన్న జడ్జి అయినా చేయవలసిన పని అదే. అయితే ఆ మధ్యాహ్నమే ఆ 'స్టే' మీద తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ జస్టిస్ బెంచి ముందు అప్పీల్ వేసింది. పొద్దున జారీ చేసిన ఆర్డర్ మీద మధ్యాహ్నం అప్పీలు స్వీకరించడం సాధారణంగా జరిగే విషయం కాదు. కానీ, జయలలిత పాలన సాధారణమైనది కాదు కదా!

'ఉద్యోగుల సర్వీస్‌కు సంబంధించిన విషయాలను విచారించవలసింది అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునలే తప్ప హైకోర్టు కాదు' అంటూ చీఫ్ జస్టిస్ సుభాషణ్‌రెడ్డిగారు తమిళనాడు ప్రభుత్వం అప్పీల్‌ను అనుమతించారు. అసలు తమిళనాడు రాష్ట్ర అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో ఒకటి తప్ప అన్ని పోస్టులూ ఖాళీగా ఉన్నాయట. అక్కడ కేసులు విచారించడమూ, తీర్పులు ఇవ్వడమూ జరగడం లేదంట. ఒక వేళ ట్రిబ్యునల్ సక్రమంగా నడుస్తూ ఉండినా, ఉద్యోగుల సర్వీస్‌కు సంబంధించిన కేసులు వినే బాధ్యత దానిదే అయినప్పటికీ అత్యవసర పరిస్థితులలో 'స్టే' ఇచ్చే అధికారాన్ని హైకోర్టు చలాయించకపోలేదు. సుభాషణ్‌రెడ్డిగారు గతంలో మన రాష్ట్ర హైకోర్టు జడ్జిగా ఉన్నప్పుడూ అదే వైఖరి అవలంబించారు. వారికి ముందూ వారి తరువాతా మన హైకోర్టే కాక అన్ని హైకోర్టులూ అదే వైఖరి అవలంబించాయి, అవలంబిస్తున్నాయి. లక్షల మంది ఉద్యోగుల ఆకస్మిక బర్తరఫ్ ఒక అత్యవసర సందర్భం కాదని ఎవ్వరూ అనలేరు.

దీనిమీద తమిళనాడు ఉద్యోగులు సుప్రీంకోర్టుకు అప్పీల్ చేశారు. సుప్రీంకోర్టు వ్యవహరించిన తీరును విచిత్రం అని కాక వేరే ఏమీ అనలేము. ఉద్యోగుల బర్తరఫ్ విషయంలో సుప్రీంకోర్టు ప్రాథమికంగా సరయిన వైఖరే తీసుకుంది. చట్ట విరుద్ధమయిన సమ్మెలో పాల్గొన్న వారందరినీ ఒకే గాటన కట్టడానికి వీలులేదనీ, గుంపులో ఒకరిగా పాల్గొన్న వారిని బర్తరఫ్ చేయడానికి వీలులేదనీ (ఏదయినా చిన్న శిక్ష వేస్తే వేసుకోవచ్చుననీ), సమ్మె చట్టవిరుద్ధం అని తెలిసీ దానిని నిర్వహించిన వారిపై, సమ్మె చేయించడానికి బలప్రయోగం చేసిన వారిపైన మాత్రం కఠిన చర్యలు తీసుకోవచ్చుననీ, అయితే అది కూడ తొలగింపే కానక్కరలేదనీ, ఏ శిక్ష ఉచితం

అనేది పరిస్థితులను బట్టి ఉంటుందనీ కనీసం ఒక డజను కేసులలో సుప్రీంకోర్టు గతంలో ప్రకటించి ఉంది. ఆ అభిప్రాయాన్ని కాదనడం ప్రస్తుత జడ్జిలకు సాధ్యమూ కాదు, వారు ఆ సాహసమూ చేయలేదు. అందువల్ల సమ్మె సందర్భంగా హింసకు పాల్పడినట్టు ఎఫ్ఐఆర్‌లో నమోదయిన వారిని మినహాయించి మిగిలిన వారందరినీ తమిళనాడు ప్రభుత్వం తిరిగి పనిలోకి తీసుకోవాలని సూచించారు. ఎఫ్ఐఆర్ నమోదయిన వారికి ఏ శిక్ష వేయడం ఉచితంగా ఉంటుందో నిర్ణయించడానికి ముగ్గురు రిటైర్డు న్యాయమూర్తులతో ఒక కమిటీ వేసి, వారి నుంచి వివరణ స్వీకరించి నిర్ణయించాలన్నారు.

ఇప్పటివరకు దేశంలో అమలులో ఉన్న న్యాయ సిద్ధాంతానికి ఇది అనుగుణంగానే ఉంది. అయితే సుప్రీంకోర్టు దీనిని తన ఆదేశంగా జారీ చేయకుండా, తమిళనాడు ప్రభుత్వానికి సూచనగా అందజేసి వారి ఒప్పుకోలును నమోదు చేసింది. ఇదెక్కడి న్యాయనిర్ణయం? న్యాయబద్ధమైన తీర్పును ఆదేశంగా జారీ చేయకుండా దానిని దోషికి సూచించి వారి ఒప్పుకోలును ఆదరపూర్వకంగా నమోదు చేయడం ఏ రకమైన ధర్మం? గ్రామాలలో పెత్తందార్ల దురాగతాల మీద పంచాయితీలు చేసే పెద్దమనుషులు పెత్తందారు మనసు నొప్పించే పద్ధతిలో తీర్పు చెప్పకుండ, అనునయంగా నచ్చచెప్పి ఒప్పిస్తుంటారు. సుప్రీంకోర్టు అదే పని చేస్తే ఏమనాలి?

గ్రామాలలో జరిగే పంచాయితీలతో పోలిక అక్కడితో ఆగిపోలేదు. తిరిగి పనిలోకి చేరే సిబ్బంది తమిళనాడు ప్రభుత్వాన్ని క్షమాభిక్ష కోరుతూ ఇంకెప్పుడూ సమ్మెలో పాల్గొనమని చెప్తూ కాగితం మీద రాసిచ్చి పనిలోకి పోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇది చాలా అభ్యంతరకరమైన విషయం. బర్తరఫ్ చట్టబద్ధమయితే కోర్టు ఆ విషయాన్ని ప్రకటించి ఉద్యోగులను ఇంటికి పంపించవచ్చు. చట్ట విరుద్ధమైతే తిరిగి పనిలోకి తీసుకొమ్మని ఆదేశించవచ్చు. అంతే తప్ప 'కాల్మొక్కురా - దొర మంచోడు, నేన్ జెప్తే పనిలోకి దీస్కుంటడు' అనేది ఒక తీర్పా, ఒక న్యాయ నిర్ణయమా, ఒక న్యాయస్థానం అనుసరించదగ్గ వైఖరా?

రెండవది, కోర్టు తీర్పు రూపంలో ప్రకటించినా, రచ్చబండ పంచాయతీ రూపంలో చెప్పినా చట్టవిరుద్ధమైన సమ్మెలో పాల్గొన్న వారినందరినీ డిస్మిస్ చేయడం సరయినది కాదని సుప్రీంకోర్టు భావించిన తరువాత, ఇంక తమిళనాడు ప్రభుత్వ ఆర్డినెన్స్ చెల్లనట్టే కదా? ఆ విషయం ప్రకటించవలసి ఉండింది కదా? సుప్రీంకోర్టు

ఆ పని చేయలేదు. పంచాయతీ చేసి తమిళనాడు ప్రభుత్వాన్ని అనునయంగా ఒప్పించి 'ఆర్డినెన్స్ గురించి మేము ఏమీ చెప్పడం లేదని స్పష్టం చేస్తున్నాం. ఆ విషయం మద్రాసు హైకోర్టుకు వదిలేస్తున్నాం' అనింది. ఒకవేళ రేపు మద్రాసు హైకోర్టు ఆర్డినెన్స్ సక్రమమయినదే అనే నిర్ణయానికి వచ్చిందనుకోండి. అప్పుడు సుప్రీంకోర్టు చేసిన పంచాయతీ చట్ట విరుద్ధం కాదా? ఆ విషయం మద్రాసు హైకోర్టు అనగలదా?

ఇక్కడితో ఆగిపోయినా పోనీలే అనుకుందుమేమో. కానీ సుప్రీంకోర్టు ఇక్కడితో ఆగిపోలేదు. అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పకుండ, అడగని ప్రశ్న గురించి అధిక ప్రసంగం చేసింది. ఇదే ఎక్కువ మందికి కోపం తెప్పించింది. న్యాయస్థానాల తీర్పులు ఆయా కేసులలో లేవదీసిన ప్రశ్నలకు పరిమితం కావాలనేది న్యాయవ్యవస్థ క్రమశిక్షణకు సంబంధించిన ఒక ప్రాథమిక సూత్రం. ఒక మంచి కోసం దానిని కొంచెం అతిక్రమించమని మనమెప్పుడయినా కోరితే న్యాయమూర్తులు ససేమిరా అంటారు. కానీ ప్రజాస్వామ్యానికీ ప్రజాస్వామ్య హక్కులకూ నష్టం చేసేందుకు మాత్రం దానిని అతిక్రమించడానికి వారే ఈ మధ్య కాలంలో ఆరాటం ప్రదర్శిస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు సమ్మె చేసే హక్కు ఉందా లేదా అని కోర్టుకెక్కిన తమిళనాడు ఉద్యోగులు అడగలేదు. చట్టం నిషేధించిన సమ్మెలో పాల్గొన్న వారందరినీ నిర్విచారణగా బర్తరఫ్ చేసే అధికారం ఇచ్చే ఆర్డినెన్స్ చెల్లుతుందా లేదా చెప్పమని మాత్రమే అడిగారు. వాళ్లు అడిగిన ప్రశ్నను మద్రాసు హైకోర్టుకు వదిలేసి, అడగని ప్రశ్న గురించి సుప్రీంకోర్టు సుదీర్ఘంగా వ్యాఖ్యానించింది.

అందులో మొదటిది – సమ్మె హక్కు ఎప్పుడూ దుర్వినియోగం అవుతుందనింది. దీనికి ఆధారాలేమున్నాయి? ఈ దేశంలో గడచిన యాభై సంవత్సరాలలో జరిగిన సమ్మెలన్నింటినీ ఎవరయినా విశ్లేషించి అందులో ఎంత దుర్వినియోగం ఉందో వివరిస్తూ ఒక నివేదిక ఏదయినా సుప్రీంకోర్టుకు సమర్పించారా? అదేం లేదే! అది జడ్జిల అభిప్రాయమే తప్ప ఆధారాలతో వారి ముందు ఎవరూ వాదించిన విషయం కాదు. మనకందరికీ ఉన్నట్టు వారికి కూడ అభిప్రాయాలు ఉండే హక్కు ఉంది గానీ తమ అభిప్రాయాలను రుజువయిన సత్యాలుగా ప్రకటించే అధికారం లేదు. ఈ తీర్పు ఇచ్చిన జస్టిస్ ఎం.బి.షా గారికి బంద్‌లు, సమ్మెలు, ఊరేగింపులు మొదలయిన కార్యకలాపాలంటే ఇష్టం లేదని గ్రహించడానికి చాలా దాఖలాలున్నాయి. బంద్ పిలుపు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధం అంటూ కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును సి.పి.ఐ (ఎం)

సుప్రీంకోర్టులో సవాలుచేస్తూ, బంద్ నిర్వహణ కోసం బలప్రయోగం చేస్తేనూ, బెదిరింపులకు పాల్పడితేనూ తప్పవుతుందిగానీ శాంతియుతంగా నిర్వహించే ఉద్దేశ్యంతో బంద్ పిలుపు ఇచ్చినా రాజ్యాంగ విరుద్ధం ఎట్లా అవుతుందని వాదించగా, 'అవును, అవుతుంది. అదంతే'నని కేరళ హైకోర్టు తీర్పును ఏ వివేచనా లేకుండా ముక్తసరిగా సమర్థిస్తూ సుప్రీంకోర్టు తరఫున తీర్పు జారీచేసిన పెద్దమనిషి ఎం.బి.షా గారు.

లాయర్లు సమ్మె చేయడానికి వీలులేదంటూ అయిదుగురు జడ్జిల సుప్రీంకోర్టు బెంచి ఇచ్చిన తీర్పులో కూడ ఎం.బి.షా గారి భాగస్వామ్యం ఉంది. ఎప్పుడయినా చాలా ప్రత్యేకమైన పరిస్థితులలో చేయవచ్చునన్న చిన్న మినహాయింపు తక్కిన నలుగురూ ఇచ్చారుగానీ, ఏ మినహాయింపూ లేదనీ, ఎట్టి పరిస్థితులలోనూ లాయర్లు సమ్మె చేయడానికి వీలులేదనీ ఎం.బి.షా గారు ఒక్కరే అన్నారు.

కాబట్టి జస్టిస్ ఎం.బి.షా గారికి సమ్మెలు బంద్‌లు ఊరేగింపులు మొదలయిన విషయాలంటే ఇష్టం లేదనేది స్పష్టమే. కానీ దాని నుంచి ఆయన 'సమ్మె హక్కు ఎప్పుడూ దుర్వినియోగం అవుతుంది' అన్న నిర్ధారణకు వస్తే అది మనందరికీ ఎందుకు శిరోధార్యం కావాలి?

తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం పెట్టే ఖర్చులో 90 శాతం ఉద్యోగుల జీతభత్యాలకే పోతున్నది కాబట్టి ఉద్యోగులకు సమ్మె చేసే నైతిక హక్కు లేదని కూడ సుప్రీంకోర్టు అనింది. ఈ మాట అనే ముందు ఆ ఉద్యోగులు దేనికోసం సమ్మె చేశారో ఒకసారి చూడవలసి ఉండింది. వాళ్లు గతకాలపు హక్కులను కాపాడుకోవడానికి తప్ప కొత్త హక్కుల కోసం సమ్మె చేయనప్పుడు ఈ ప్రస్తావన ఎందుకవసరమయింది?

సమస్యల పరిష్కారానికి అందుబాట్లో ఉన్న అన్ని మార్గాలనూ అన్వేషించకుండా సమ్మె చేయకూడదని కూడ సుప్రీంకోర్టు అనింది. సూత్రప్రాయంగా దీనికెవ్వరూ అభ్యంతరం చెప్పరుగానీ ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్ని ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాట్లో ఉన్నాయి? మినిస్టర్ల చుట్టూ తిరిగి న్యాయం చేయమని అడుక్కోవడాన్నీ పైరవీ చేసుకోవడాన్నీ పరిష్కార మార్గాలుగా గుర్తించదలచుకుంటే చెప్పలేము గానీ అవి కాక వేరే ఏ పరిష్కారమార్గాలూ లేవు. ఇక్కడ కూడ సుప్రీంకోర్టు తమిళనాడు ఉద్యోగులు సమ్మెకు దిగక ముందు ఎంతకాలం ఎన్ని రూపాలలో ప్రయత్నం చేశారో తెలుసుకునే ప్రయత్నమేదీ చేయలేదు. ఆ ప్రస్తావన తీర్పులో ఎక్కడా లేదు.

అయినప్పటికీ ప్రత్యామ్నాయ ప్రయత్నాలు చేయకుండ నేరుగా సమ్మెకు దిగుతున్నారు అనే నింద మొత్తంగానే ఉద్యోగ వర్గాల మీద వేసి అసలు సమ్మె హక్కు మీకు లేదు పొమ్మనింది.

హక్కుల గురించీ అధికారాల గురించీ సుప్రీంకోర్టు చేసే వ్యాఖ్యానం చట్టంతో సమానమని రాజ్యాంగం అంటుంది. ఎటొచ్చీ ఆ వ్యాఖ్యానం అప్పుడున్న చట్టాలకూ, రాజ్యాంగానికీ లోబడి ఉండాలి. 1980 తరువాత కొంతకాలం పాటు సుప్రీంకోర్టు ఈ అధికారాన్ని మంచి కోసం – అంటే ప్రజల హక్కులను పెంపొందించడం కోసం – వాడుకునింది. ఈ మధ్య కాలంలో దానికి వ్యతిరేక దిశగా వాడుకోవడం మొదలయింది. సమ్మెల గురించి, బంద్‌ల గురించి ఎం.బి.షా గారు ఇచ్చిన తీర్పులు దీనికొక తార్కాణం.

ఇక సుప్రీంకోర్టు సంగతి కొంచెం సేపు పక్కనపెట్టి ఉద్యోగ సంఘాల గురించి కొంచెం సేపు ముచ్చటించుకుందాం. మొదట్లోనే చెప్పినట్టు ఉద్యోగులకు సమ్మె హక్కు లేదనేది సుప్రీంకోర్టు కొత్తగా చెప్పిన విషయం కాదు. అది ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళిలోనే ఉంది. ఆ ప్రవర్తనా నియమావళులలో సమ్మె హక్కు మీదనే కాదు, భావ ప్రకటనా స్వేచ్ఛ మీద కూడ తీవ్రమయిన ఆంక్షలున్నాయి. అవి– కళ, సాహిత్యం, సంస్కృతుల గురించి తప్ప ఇతర విషయాల గురించి ప్రభుత్వ ఉద్యోగులు తమ పైవారి అనుమతి లేకుండా రాయకూడదు, మాట్లాడకూడదు, ఏ విధమైన బహిరంగ వ్యక్తీకరణకూ పాల్పడకూడదు వగైరా.

ఈ ప్రవర్తనా నియమావళులు (బహువచనం ఎందుకు వాడుతున్నామంటే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకొకటి, ఒక్కొక్క రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకొక్కటీ ఉన్నాయి – అయితే హక్కుల లేమి అన్నిటా సామాన్యమే) రాజ్యాంగం రాసుకున్న తరువాత పుట్టినవి కావు. అప్పుడప్పుడు కొన్ని సవరణలు చేస్తున్నా ఇవి మౌలికంగా వలస పాలన కాలానివి.

రాజ్యాంగ ప్రాథమిక హక్కులకు విరుద్ధమైన చట్టాలు, నియమాలు, నిబంధనలు చెల్లవని రాజ్యాంగం అంటుంది కాబట్టి, ఉద్యోగుల ప్రవర్తనా నియమావళులలోని ఈ నిషేధాలు, నిర్బంధాలు చెల్లవంటూ రాజ్యాంగం అమలులోకి వచ్చిన మొదటి పది సంవత్సరాలలోనే ప్రభుత్వ ఉద్యోగులు కోర్టుకెక్కారు. ఆ సవాలు చివరికి

సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం వద్దకు పోయింది. సుప్రీంకోర్టు ఉద్యోగుల వాదనలో సగభాగాన్ని ఆమోదించి సగభాగాన్ని తిరస్కరించింది. భావప్రకటనా స్వేచ్ఛ రాజ్యాంగ ప్రాథమిక హక్కులలో భాగం కాబట్టి దానిని అహేతుకంగా నిర్బంధించే నియమాలు చెల్లవనీ, దానిపైన హేతుబద్ధమైన పరిమితులు మాత్రమే పెట్టవచ్చుననీ అనింది. అయితే సమ్మె చేసే హక్కు రాజ్యాంగ ప్రాథమిక హక్కు కాదు కాబట్టి దానిని పూర్తిగా నిషేధించే నిబంధనలో తప్పేమీ లేదనింది. ఈ తీర్పు 1962లో అయిదుగురు జడ్జిలు ఇచ్చారు. ఆ కేసు పేరు కామేశ్వర్ ప్రసాద్ వర్సస్ స్టేట్ ఆఫ్ బీహార్.

అందువల్లనే, మొన్నటి తీర్పులో సుప్రీంకోర్టు కొత్తగా అన్నదేమీ లేదన్నాము (అధిక ప్రసంగాన్ని పక్కనపెడితే). అయినప్పటికీ రెండు విషయాలు చెప్పుకోవాలి. 40 ఏళ్ల కింద ఇదే అభిప్రాయం ప్రకటించినప్పుడు కోర్టు సమ్మె హక్కును తేలికగా తీసిపారేయలేదు. దానినొక అర్థవంతమైన హక్కుగా గుర్తిస్తూ, ఉద్యోగుల వాదనలను సవివరంగా ఉటంకిస్తూ, ఏది ఏమయినా రాజ్యాంగంలో ఆ హక్కు ఇవ్వనప్పుడు దానిని పూర్తిగా నిషేధించే చట్టాలు చేసినా, నియమ నిబంధనలు ప్రకటించినా మేమేం చేయలేం అని తమ అవగాహన మేరకు అన్నారు. ఇప్పటి తీర్పు ధ్వనే వేరు.

రెండవది, 40 ఏళ్ల నాటికీ నేటికీ సుప్రీంకోర్టు తన పర్యవేక్షణాధికారాన్ని అర్థం చేసుకున్న తీరులో మార్పు వచ్చింది. రాజ్యాంగం ఇచ్చిన అధికారంతో చట్ట సభలు, ప్రభుత్వము ఏ చట్టాన్నయినా ఏ నియమాన్నైనా రూపొందించవచ్చుననీ, అది రాజ్యాంగంలోని ఏదయినా నిర్దిష్టమైన అంశానికి వ్యతిరేకమయితే తప్ప కోర్టులు జోక్యం చేసుకోజాలవనీ అప్పట్లో సుప్రీంకోర్టు భావించేది. 1970ల తరువాత ఈ అవగాహనలో మార్పు వచ్చింది. రాజ్యాంగంలోని నిర్దిష్టమైన అంశాలే కాక మరికొన్ని ప్రమాణాల ఆధారంగా కూడ చట్టాలనూ చట్ట సంబంధమైన నియమాలనూ న్యాయస్థానాలు చెల్లవని ప్రకటించవచ్చునని ఇప్పుడు కోర్టులు భావిస్తున్నాయి. సహజ న్యాయసూత్రాల వంటి మౌలిక విలువలకు వ్యతిరేకమైనా, చెప్పుకున్న లక్ష్యానికీ చేసిన చట్టానికీ (లేక నియమానికీ) అసలే పొంతన లేకున్నా, ప్రాథమిక సహేతుకత లోపించినా ఆ చట్టాన్నీ లేక చట్ట సంబంధమైన నియమాన్నీ కొట్టేయవచ్చునని ఇప్పుడు కోర్టులు భావిస్తున్నాయి. అందువల్ల ప్రభుత్వ ఉద్యోగులెవ్వరూ ఏ పరిస్థితులలోనూ సమ్మె చేయడానికి వీలులేదని చెప్పే నియమం క్రమశిక్షణ అనే లక్ష్యంతో రూపొందిన పొంతనలేని శాసనం అనీ, ప్రాథమిక సహేతుకత లోపించిన నిబంధన అనీ వాదించే

అవకాశం ఇప్పుడు ఉంది. అంతేకాక భారత ప్రభుత్వం సంతకం చేసిన అంతర్జాతీయ ఒడంబడికలనూ, ప్రకటనలనూ కూడ కోర్టులు ఒక మేరకు లెక్కలోకి తీసుకోవచ్చునని 1990 తరువాత కోర్టులు భావిస్తున్నాయి. (అంతకు ముందు పార్లమెంటు వాటికి శాసన రూపం ఇస్తే తప్ప అవి కోర్టుల పరిగణనలోకి రావని భావించేవారు.) భారత దేశానికి కూడ సభ్యత్వం ఉన్న అంతర్జాతీయ కార్మిక సంస్థ తీర్మానాలలో కార్మికులకు, ఉద్యోగులకు హేతుబద్ధమైన పరిమితులకు లోబడి సమ్మె హక్కు ఉండాలన్నది కూడ ఒకటి. ఈ మార్పులను సుప్రీంకోర్టు లెక్కలోకి తీసుకుని ఉంటే నలభై ఏళ్లనాటి తీర్పును సమీక్షించే ప్రక్రియ మొదలయి ఉండవచ్చు. అయితే ఆ పని చేయలేదు సరికదా, నలభై ఏళ్లనాడు సమ్మె అనే హక్కుకు ఇచ్చిన గౌరవం సహితం వీళ్లు ఇవ్వలేదు.

అదట్లాగుంచి, ఈ నలభై ఏళ్లలో ఆనాటి తీర్పును మార్చుకునేందుకు ఉద్యోగ నియమాలను సవరించాలన్న డిమాండుతో ఉద్యోగ సంఘాలు ఏనాడూ ఉద్యమించక పోవడం విశేషం. ఒక చట్టం, లేక రూలు రాజ్యాంగ విరుద్ధం కాదనీ, సక్రమమైనదేననీ సుప్రీంకోర్టు ప్రకటించిన తరువాత, దానిని తొలగించుకోవాలంటే మళ్లీ శాసనాధికారాన్ని ఆశ్రయించవలసిందే. ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళిని సవరించి, ఉద్యోగులకు సమ్మె హక్కు ఇమ్మన్న డిమాండుతో (సహేతుకమైన పరిమితులు పెట్టుకుంటే పెట్టుకోవచ్చు) ఒక్క ఆందోళన కూడ ఇన్నేళ్లుగా ఉద్యోగ సంఘాలు చేపట్టలేదు. సుప్రీంకోర్టు మొన్న చేసిన అధిక ప్రసంగం ఆ విషయాన్ని గుర్తుచేసినందుకా వాళ్లు ఇప్పుడింతగా గగ్గోలు పెడుతున్నారు?

సుప్రీంకోర్టు నిరాకరించిన సమ్మె హక్కు విషయంలోనే కాదు, సుప్రీంకోర్టు ఆమోదించిన భావప్రకటనా స్వేచ్ఛ విషయంలోనూ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళు లను తదనుగుణంగా సవరింపజేసే ప్రయత్నమేదీ ఉద్యోగ సంఘాలు చేయలేదు. 1962లో సుప్రీంకోర్టు చెల్లవని ప్రకటించిన నిషేధాలన్నీ చెక్కుచెదరకుండా ఉద్యోగుల ప్రవర్తనా నియమావళులలో అట్లాగే కొనసాగుతున్నాయి. వాటిని సవరించే ప్రయత్నం ప్రభుత్వాలూ చేయలేదు, సవరించాలన్న ఒత్తిడి ఉద్యోగ సంఘాలూ పెట్టలేదు. అవి చెల్లవని సుప్రీంకోర్టు చెప్పింది కదా, అవి కాయితాల మీద కొనసాగడం వల్ల వచ్చిన నష్టమేమిటని అడుగుతారేమో! నష్టమేమిటంటే అవి కాయితాలు మీద ఉన్నంత కాలం వాటిని వాడుకొని ఉద్యోగులను అధికారులు సతాయించే అవకాశం ఉంటుంది. సతాయింపుకు గురయిన ఒక్కొక్క ఉద్యోగి కోర్టుకు పోయి సుప్రీంకోర్టు తీర్పును

ఉటంకించి న్యాయం పొందవచ్చునుగానీ ఈ లోపల ఏ మూడేళ్లో నాలుగేళ్లో సస్పెన్షన్‌లోనో, పూర్తి నిరుద్యోగంలోనో గడపవలసి ఉంటుంది. సుప్రీంకోర్టు తీర్పుననుసరించి కనీసం భావప్రకటనా స్వేచ్ఛ మేరకయినా ఉద్యోగుల ప్రవర్తనా నియమావళిని తిరగరాయించుకొని ఉంటే ఈ అవస్థ ఉండదు కదా! ఉద్యోగ సంఘాలు ఈ ప్రయత్నం సహితం ఎందుకు చేయలేదు?

ఆసక్తి లేదు కనుక.

సమ్మె హక్కు, భావప్రకటనా స్వేచ్ఛలు ఉద్యమాలు చేయదలచుకున్న వారికి కావాలి. ఎం.ఎల్.ఏతో చెప్పించి, మంత్రితో ఫోన్ చేయించి, ముఖ్యమంత్రికి నచ్చిన మనిషిని సంఘం అధ్యక్షునిగా పెట్టుకొని – ఏదీ నడవకపోతే పైసలిచ్చి – పనులు చేయించుకునే సంస్కృతికి అలవాటు పడ్డ వారికి భావప్రకటనా స్వేచ్ఛ ఎందుకు, సమ్మె హక్కు ఎందుకు?

ఇప్పుడేమయిందంటే ఈ పైరవీలు కూడ హక్కులను కాపాడలేకపోతున్నాయి. ప్రభుత్వమే అక్కరలేదని ప్రపంచ బ్యాంకు అంటుంటే ఇంక ప్రభుత్వ ఉద్యోగుల గోడు, వారి హక్కుల గోడు వినేవారెవరు? పైరవీ సాగకపోతే ఉద్యమాలు అవసరం కాబట్టి ఉద్యోగ సంఘాలిప్పుడు సమ్మె హక్కో అంటూ గగ్గోలు పెడుతున్నాయి. అయితే ఇప్పుడు కూడ ఉద్యమించి ప్రవర్తనా నియమావళులను సవరించుకుంటామనడం లేదు. ముగ్గురు జడ్జిలో అయిదుగురు జడ్జిలో ఏడుగురు జడ్జిలో కూర్చొని ఉద్యోగులకు సమ్మె హక్కు లేదన్న ఇద్దరు జడ్జిల తీర్పు తప్పని ప్రకటించాలని మాత్రమే కోరుకుంటున్నారు. మళ్లీ ఉద్యోగ సంఘాలన్నీ వామపక్ష దృక్పథమున్న సంఘాలే – మార్క్సిస్టు వామపక్షం, కాకపోతే నెహ్రూవాద వామపక్షం.

నిజానికి సమ్మె హక్కు గురించి మొన్నటి తీర్పులో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తాయని అందరికీ అర్థం అయివుంటే ఇంత అలజడి, ఆందోళన జరిగి ఉండేవి కావు. అవి ప్రభుత్వ ఉద్యోగులకే కాక పారిశ్రామిక కార్మికులకు కూడ వర్తిస్తాయనుకోవడం వల్ల ఇంత స్పందన వచ్చింది. కార్మిక సంఘాలకు సహితం ఈ విషయంలో స్పష్టత లేదు కాబట్టి ఆ తీర్పు పారిశ్రామిక కార్మికులకు వర్తించదని చెప్పడం అవసరం. పారిశ్రామిక కార్మికులకు ఐ.డి చట్టం (పారిశ్రామిక వివాదాల చట్టం) ఒక పరిమితమైన సమ్మె హక్కు కల్పించింది. అది

పరిమితమైన హక్కే అయినప్పటికీ అది చట్టం గుర్తించిన హక్కే. దానికి భిన్నంగా తీర్పు జారీచేసే అధికారం సుప్రీంకోర్టుకు లేదు, చేసినా అది చెల్లదు.

ప్రభుత్వ ఉద్యోగాలలోనూ కొందరు పారిశ్రామిక కార్మికుల నిర్వచనం కిందికి వస్తారు. వారి సమ్మె హక్కును కూడ ఈ తీర్పు తీసేయదు. పోస్టల్, టెలికాం, రైల్వే, పోర్టు, బ్యాంకుల సిబ్బందిలోని కార్మికులు ఈ కోవకు చెందుతారు. పారిశ్రామిక కార్మికులు కాని ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే ఈ తీర్పు వర్తిస్తుంది.

ఈ వర్గమంటే ప్రజలలో ఎవ్వరికీ పెద్దగా సానుభూతి లేదు. లేకపోవడానికి ప్రజల కారణాలు ప్రజలకున్నాయి. అయితే వారి పట్ల ప్రజలలో ఉన్న వ్యతిరేకత కారణంగా సమ్మె హక్కును మొత్తంగా తీసేసే నిబంధనలను, వాటిని ఆమోదించే కోర్టు తీర్పులను ఉపేక్షిస్తే చాలా నష్టం జరగగలదు. రేపు ఐ.డి చట్టం పారిశ్రామిక కార్మికులకిచ్చే పరిమితమైన సమ్మె హక్కును సహితం పార్లమెంటు తీసేస్తే దానిని కోర్టులో సవాలు చేయడానికి ఈ తీర్పులు అడ్డం రాగలవు. అంతేకాక, ప్రభుత్వ అధికారులలోనూ గుమాస్తాలలోనూ ఎన్ని లోపాలున్నా వారికి సమస్యలు లేవనలేము, ఆ సమస్యల పరిష్కారానికి సమ్మె చేసే పరిస్థితి రాదనలేము.

అపోహ వల్లనయితేనేం, ఎందువల్లనయితేనేం పారిశ్రామిక కార్మికులు, గని కార్మికులు, సాధారణ ప్రజలు అనేకమంది ఈ తీర్పుకు వ్యతిరేకంగా స్పందించడంలో ఉన్న ఔదార్యాన్ని ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించి తామూ ఇతరుల హక్కుల విషయంలో అంతే ఉదారంగా స్పందించడం ఇప్పుడయినా నేర్చుకుంటారా? ఉద్యమాలలోనే కాక నిత్య జీవితంలో ప్రజలతో వ్యవహరించేటప్పుడు కూడ ఈ వైఖరిని ప్రభుత్వ ఉద్యోగులు ప్రదర్శించడం దానంతటది అవసరమే కాక, ప్రపంచీకరణలో భాగంగా అందరి హక్కులు మీదా ఉమ్మడిగా జరుగుతున్న దాడిని ఎదుర్కొనడానికి కూడ ఇది చాలా ఉపయోగపడుతుంది. ఇంకా ఎక్కువమంది జడ్జిలతో కూడిన ధర్మాసనం కూర్చొని తమకు సమ్మె హక్కు ప్రసాదిస్తుందన్న ఆశకు ఇస్తున్న విలువ ఉద్యోగ సంఘాలు ఈ అవసరానికి ఇస్తే బాగుండేది.

**మానవహక్కుల వేదిక బులెటిన్ 6**
**ఫిబ్రవరి 2004**

# ఈ అప్పుల అభివృద్ధి ఇంకొద్దు రెడ్డో...

ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎ.డి.బి) అత్యున్నత మండలి అయిన గవర్నర్ల 39వ వార్షిక సమావేశం మే నెల 3–6 తేదీలలో హైదరాబాద్‌లో జరగనుంది. ఆ సందర్భంగా ఎ.డి.బి. గురించి, దాని అజెండా వల్ల ప్రజల మనుగడ హక్కులకు వస్తున్న, రాగల ప్రమాదాన్ని గురించి తెలియజేయడం మా కర్తవ్యం అని మేము భావిస్తున్నాం.

ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎ.డి.బి. నుంచి పెద్దగా అప్పులు తీసుకోలేదు. మనం ప్రధానంగా ప్రపంచ బ్యాంకు బకాయిదార్లం. అయినప్పుడు ఎ.డి.బి. గురించి మనకెందుకు అనుకోకండి. మనం దీని గురించి తెలుసుకోవడానికి మూడు కారణాలున్నాయి. ఒకటి, ఎ.డి.బికీ ప్రపంచబ్యాంకుకూ అజెండాలోనూ ఆలోచనా రీతిలోనూ పెద్దగా తేడా లేదు. రెండు, మనం కాకున్నా మన దేశంలోని అనేక ఇతర రాష్ట్రాలు ఎ.డి.బికి 'రుణపడి' ఉన్నాయి. వాటిలో మన పొరుగు రాష్ట్రం అయిన కర్ణాటక ఒకటి. మూడు, ఎ.డి.బితో మనకు ఇప్పటిదాకా పెద్దగా లావాదేవీలు లేకున్నా, మన రాష్ట్ర ప్రభుత్వం పిలిచి మరీ వారి వార్షిక సమావేశానికి హైదరాబాద్‌ను అప్పగించిందంటే ఇకమీదట వారికి సహితం రుణపడే ఆలోచన మన పాలకులకు ఉందన్నట్టే.

ప్రపంచబ్యాంకు లాగే ఎ.డి.బిలో కూడ వాటాదారులు వ్యక్తులు కాదు, ప్రభుత్వాలు. పేరులో 'ఏషియన్' అని ఉన్నప్పటికీ ఎ.డి.బి. వాటాదారులు కేవలం ఆసియా దేశాల ప్రభుత్వాలు కావు. అమెరికాకూ, ఇతర పాశ్చాత్య దేశాలకూ కూడ ఎ.డి.బిలో వాటా వుంది. జపాన్ తరువాత అమెరికాదే పెద్దవాటా. వాటా ఉన్న (సభ్య దేశాల)

ప్రభుత్వాలలోని ఆర్థిక లేక వాణిజ్యశాఖల మంత్రులు ఎ.డి.బి. బోర్డు ఆఫ్ గవర్నర్లలో ఉంటారు. ఈ దఫా దాని ఛైర్మన్ మన చిదంబరం గారే.

అన్ని బ్యాంకుల లాగే ఎ.డి.బి. కూడ అప్పులిస్తుంది, వడ్డీతో సహా వసూలు చేసుకుంటుంది. ప్రపంచ బ్యాంకయినా అంతే. వాటి కథ ఇంతే అయితే వాటి గురించి ఇంత ఆందోళన అక్కరలేదు. వాటిపట్ల ఇంత వ్యతిరేకత అక్కరలేదు. వడ్డీ చెల్లించగలమనుకున్న ప్రభుత్వాలు అప్పు తీసుకుంటాయి, లేదనుకున్నవి మానుకుంటాయి. కానీ ఈ బ్యాంకులు అప్పులిచ్చే క్రమంలో దేశాల విధాన నిర్ణయాల మీద బలమైన ఒత్తిళ్ళు పెడతాయి. ఆ నిర్ణయాలను ప్రస్తుతం అంతర్జాతీయంగా రాజ్యమేలుతున్న 'నయా ఉదారవాద' నమూనాలో తిరగరాయడానికి శతవిధాలా ప్రయత్నం చేస్తాయి. అదే వాటి అసలు అజెండా – వడ్డీ వ్యాపారం కాదు.

'నయా ఉదారవాద' విధానాలు మంచివి కావనుకుంటే ఎ.డి.బి. నుంచి అప్పు తీసుకోకుండా ఉండవచ్చు కదా, తీసుకోవడం ఎందుకు, ఆ ఒత్తిళ్ళు కొనితెచ్చుకోవడం ఎందుకు అంటారేమో! కానీ మన పాలకులకు కూడ ఈ 'నయా ఉదారవాద' ఆలోచనా రీతి నచ్చుతోంది. అదే సరయిన విధానమని మన చిదంబరాలూ మన్మోహన్‌లూ అనుకుంటున్నారు కాబట్టి ఆ 'ఒత్తిడి'తోబాటు వచ్చే అప్పులు వారికి చేదు కాదు – ప్రజలు అడ్డం రాకుంటే.

ఇంతకూ ఎ.డి.బి. అప్పులివ్వడం ద్వారా అమలు చేయించాలని చూసే అభివృద్ధి విధానం ఏమిటి?

1. వేగవంతమైన ఆర్థిక పెరుగుదలే అభివృద్ధికి మార్గం. అన్ని వనరులనూ దానికి, దాని అనుబంధమైన చర్యలకు మాత్రమే కేటాయించాలి. అక్షరాస్యత పెంపుదల అనీ, ఆరోగ్య ప్రమాణాల మెరుగుదల అనీ, సామాజిక అసమానతల తగ్గుదల అనీ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి అనీ విడివిడిగా వనరుల కేటాయింపు చేసుకుంటూ పోతే ఆర్థిక పెరుగుదల కుంటుపడుతుంది. అభివృద్ధి రాదు. ఆర్థిక పెరుగుదల వేగంగా వస్తే ఇవన్నీ తరువాత వస్తాయి (రాకపోయినా ఫరవాలేదు).

2. వనరులను సరయిన రీతిలో కేటాయించడానికి ప్రభుత్వ నిర్ణయాల కంటే మార్కెట్ శక్తులే ఉచితమైనవి. వేగవంతమైన పెరుగుదల రేటు సాధించడానికి ప్రభుత్వం

చౌరవ కంటే ప్రైవేటు పెట్టుబడే ఉత్తమమయినది. పెట్టుబడి మీద, మార్కెట్ల మీద ఆంక్షలు తొలగించి స్వేచ్ఛగా విస్తరించనివ్వాలి. ప్రభుత్వం ఆర్థిక రంగం నుంచి పక్కకు తప్పుకోవాలి.

3. ప్రభుత్వం తాను సహితం తగుదునమ్మా అని ఆర్థిక రంగంలోకి దిగకుండా, ఆర్థిక పెరుగుదల సాధించడానికి ప్రైవేటు పెట్టుబడికి అనుకూల వాతావరణం కల్పించే పనిలో నిమగ్నం కావాలి. వారికి అవసరమైన భూమి, నీళ్ళు, కరెంటు, రవాణా సౌకర్యాలు మొదలయినవి అనువయినచోట, అనువయిన రూపంలో చవకగా కల్పించాలి. పాలనా విధానాలు, కార్మిక చట్టాలు మొదలయినవి ప్రైవేటు పెట్టుబడి వ్యాప్తికి ఆటంకం కాకుండా ఉండేటట్లు రూపొందించాలి.

1980ల తరువాత మూడవ ప్రపంచ దేశాలలో ఒక్కొక్క ప్రభుత్వమూ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనింది. అప్పులు పెరిగాయి, వడ్డీలకే ఆదాయంలో పెద్ద భాగం సరిపోతున్నది, ఆర్థిక పెరుగుదల పెద్దగా లేదు. అట్లాగని ఇతర సామాజిక ఆర్థిక లక్ష్యాలూ ఒనగూడడం లేదు.

ఇవి పరిష్కారం దొరకని సమస్యలేం కావు. అవినీతిని అదుపుచేసి, పాలనా రంగంలో క్రమశిక్షణను పెంచి, పన్నులు సమగ్రంగా వసూలుచేసి, ఖర్చులో వృథానూ, దళారుల ప్రభావాన్నీ కట్టడి చేసినట్టయితే బహుముఖమైన అభివృద్ధి లక్ష్యాన్ని పట్టాలెక్కించి ఉండవచ్చు. అయితే దీనివల్ల దెబ్బతినగల ప్రయోజనాలను కాపాడడమే ప్రధానమై పోవడం వలన మూడవ ప్రపంచ దేశాల పాలకులు ఈ సంస్కరణలకు సిద్ధంగా లేరు. సరిగ్గా ఆ సమయంలో ప్రపంచ బ్యాంకు, ఎ.డి.బి. వంటి సంస్థలు తమ పెట్టుబడి వనరులతోనూ, నయా ఉదారవాద అభివృద్ధి సిద్ధాంతంతోనూ ముందుకొచ్చాయి.

## ఎ.డి.బి. ఏం చేస్తుంది?

ప్రాజెక్టులకు అప్పులిస్తుంది. ఆ ప్రాజెక్టుకు సంబంధించి ఏ పాలనా సంస్కరణలు, విధాన సంస్కరణలు చేపట్టాలో నిర్దేశిస్తుంది. నిర్దేశించి ఊరుకోదు, పక్కనుండి అమలు చేయిస్తుంది. దానికి అవసరమయిన సంస్థలకు రూపకల్పన చేయిస్తుంది. అప్పు మొత్తం ఒకేసారి ఇచ్చేస్తే తాను సూచించే 'సంస్కరణలు'

చేపట్టకుండా ఉండే ప్రమాదం ఉంది కాబట్టి అప్పును కంతుల వారీగా ఇస్తుంది. పావలా వంతు ఇచ్చి, దానిని వినియోగించే క్రమంలో చేపట్టవలసిన సంస్కరణలు చేపట్టారని సంతృప్తి చెందినట్టయితేనే ఇంకొక పావలా వంతు ఇస్తుంది.

ఈ పాలనా సంస్కరణలు, విధాన సంస్కరణలు స్వభావరీత్యా ప్రజల హక్కులను హరించేవి కాగా, వాటి అమలును ఎ.డి.బి. పర్యవేక్షించే తీరు పూర్తిగా అప్రజాస్వామిక మైనది. ఎ.డి.బి. చేపట్టే పర్యవేక్షణలో పారదర్శకత వుండదు. ఆయా దేశాల పాలనా వ్యవస్థలలో ఉండే ప్రజాస్వామ్య ప్రక్రియలకు అందులో చోటు ఉండదు. వాటిని పక్కనపెట్టి ప్రాజెక్టు అమలుకొక కమిటీ ఏర్పాటు చేయించి దాని ద్వారా ఎ.డి.బి. వ్యవహరిస్తుంది. పోనీ ఈ కమిటీతోనయినా సక్రమంగా వ్యవహరిస్తుందా అంటే అదీ లేదు. నిర్ణయాలు వారివి, అమలు బాధ్యత వీరిది. అంతేకాక, ఆయా దేశాల స్థానిక చట్టాలకు, కోర్టులకు ఎ.డి.బి.పైన అదుపు ఉండదు. చట్టంతో – ఆ మాటకొస్తే ప్రజలతోనైనా – ఏ సమస్య వచ్చినా స్థానిక ప్రభుత్వం చూసుకోవలసిందే. ఎ.డి.బిని కోర్టులకు లాగడానికి వీలులేదు. కానీ అంతిమ నిర్ణయాధికారం మాత్రం వారిదే.

ఎ.డి.బి. నుండి అప్పులు తీసుకుంటున్న రాష్ట్రాలలో కర్ణాటక ఒకటి. ప్రధానంగా తీరప్రాంత అభివృద్ధికీ, పట్టణాల అభివృద్ధికీ కర్ణాటక ఈ అప్పులు తీసుకుంటూ వుంది. ఈ అభివృద్ధి వల్ల లక్షలాది ప్రజానీకం జీవితాలు ప్రభావితం అవుతాయి. అయినప్పటికీ వాటికి సంబంధించిన సమాచారం ప్రజలకు తెలీదు. విధాన నిర్ణయాలు చేసే ఎ.డి.బి. ప్రజలతో కాదు సరికదా, స్థానిక సంస్థలతో సహితం సంభాషించదు. తాను రూపొందించే అభివృద్ధి పథకాల కోసం వివిధ సంస్థలను ఏర్పాటు చేయమని ఎ.డి.బి. ఆదేశించగా కర్ణాటక ప్రభుత్వం కె.యు.ఐ.డి.ఎఫ్.సి. అనే కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ సంస్థ ఎవరికీ జవాబుదారు కాదు. మంగుళూరు నివాసులు తమ నగరం అభివృద్ధి పేరిట అమలవుతున్న పథకం వివరాలు ఎ.డి.బి ని కోరగా ఎ.డి.బి. ఆ కార్పొరేషన్‌ను అడగమంది. ఆ కార్పొరేషన్‌ను అడిగితే మంగుళూరు మునిసిపల్ కార్పొరేషన్‌ను అడగమన్నారు. వారిని అడిగితే ఎ.డి.బి. నుంచి తమకు లభించిన కాగితాలు చూపించారు తప్ప దాని గురించి ఏ వివరాలూ ఇవ్వలేకపోయారు. దేశ పార్లమెంటు ఈ సంవత్సరం సమాచార హక్కు చట్టం జారీ చేయకముందే 2000 సంవత్సరంలోనే కర్ణాటక రాష్ట్ర అసెంబ్లీ సమాచార హక్కు చట్టం చేసింది. అయితే ఎ.డి.బి. దాని పరిధిలోకి రాదు. ఆ మాటకొస్తే పార్లమెంటు

ఈ సంవత్సరం జారీచేసిన చట్టం సహితం నేరుగా ప్రపంచ బ్యాంకుకు గానీ, ఎ.డి.బికి గానీ వర్తించదు. వారినుండి ప్రభుత్వానికి లభించిన సమాచారం మాత్రమే మనం ప్రభుత్వం నుంచి పొందగలుగుతాం. వాళ్ళు ఇవ్వకపోయినా, ఇద్దరూ కలిసి దాచిపెట్టినా మనం చేయగలిగింది కొంచెమే.

అయినా సమాచారం పొందడంతో సరిపోదు. ఆ అభివృద్ధిని ప్రభావితం చేసే అవకాశం, హక్కు ప్రజలకు కావాలి. కర్ణాటకలో ఉద్యమకారులు ఇవ్వాళ అదే ప్రశ్న అడుగుతున్నారు. పార్లమెంటు 74వ రాజ్యాంగ సవరణ చేసినప్పుడు పట్టణ అభివృద్ధికి సంబంధించిన అనేక అధికారాలు రాష్ట్ర ప్రభుత్వం చేతినుంచి తీసేసి మునిసిపాలిటీ చేతిలో పెట్టే ఆలోచన చేసింది. దానికి పూర్తిగా కార్యరూపం ఇవ్వకపోయినప్పటికీ ఇప్పుడు కాలచక్రాన్ని వెనక్కి తిప్పి ప్రజలకు గానీ చట్టానికి గానీ జవాబుదారు కానటువంటి ఎ.డి.బి. చేతిలో నిర్ణయాధికారం పెడుతున్నది కర్ణాటక ప్రభుత్వం.

అభివృద్ధి పథకాలు వనరుల వినియోగంపైన తీవ్ర ప్రభావం వేస్తాయి కాబట్టే వాటి రూపురేఖలు నిర్ణయించడంలో ప్రజలకు పాత్ర అవసరం. ఇవాళ్టిదాకా సాగుభూమిగా వున్న దానిని లేదా ఊరుమ్మడి భూమిగా ఉన్నదానిని హఠాత్తుగా ఒక ప్రాజెక్టుకు అప్పగిస్తారు. ఇవాళ్టిదాకా ప్రజలకు తాగునీటికి, సాగునీటికి ఉపయోగపడుతున్న ఒక నీటి వనరును హఠాత్తుగా ఆ ప్రాజెక్టు అవసరాల కోసం కేటాయిస్తారు. ఆ ప్రాజెక్టు నెలకొల్పడం వల్ల గానీ దానినుంచి వెలువడే కాలుష్యం వల్ల గానీ కొంత భూమి, నీరు నిరుపయోగమయి పోవచ్చు. వీటిలో ఏది జరిగినా ప్రజల జీవనం దెబ్బతింటుంది. ప్రాజెక్టు పరిమాణాన్ని బట్టి గణనీయంగా కూడ దెబ్బతినగలదు. అందువల్లనే 'అభివృద్ధి'కి సంబంధించిన నిర్ణయాధికారాన్ని ప్రజలకూ, దేశంలోని చట్టాలకూ, న్యాయవ్యవస్థకూ జవాబుదారు కాని ఎ.డి.బి. వంటి సంస్థల చేతిలో పెట్టడం అభ్యంతరకరం.

ఎ.డి.బి కి ఉండే విధాన దృక్పథం కారణంగా – ఆ దృక్పథమేమిటో పైన వివరించాము – ఇది ప్రమాదకరం కూడ. ఎ.డి.బి.పెత్తనం చాలా లోతుగా నెలకొన్న తూర్పు ఆసియా దేశాలలో ఇప్పటికే దీనికి ఉదాహరణలున్నాయి. ఎ.డి.బి. పెత్తనానికి వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్నాయి కూడ.

మీకాంగ్ ఆరు దేశాల మీదుగా ప్రవహించే నది. ఆ దేశాలు చైనా, లావోస్, థాయిలాండ్, కంబోడియా (కంపూచియా), మయన్మార్ (బర్మా)లు. చేపల వేటకు, సరుకులు, మనుష్యుల రవాణాకు, సాగునీటికి, తాగునీటికి మీకాంగ్ నది తన పరీవాహక ప్రాంతంలో ఒక ముఖ్య వనరు. లక్షలాది ప్రజలు దానిపైన ఆధారపడి బతుకుతారు. అయితే ఇప్పుడొక దశాబ్దం పైగా అక్కడ మీకాంగ్ పరీవాహక ప్రాంత అభివృద్ధి ప్రణాళిక ఒకటి అమలులో వుంది. ఈ ఆరు దేశాల ప్రభుత్వాలూ ఆ ప్రాంత అభివృద్ధికి పథకాన్ని రూపొందించి ఆర్థిక సహాయం చేయమని ఎ.డి.బి ని కోరాయి. ఎ.డి.బి. ఆ నది వనరుల మీద ప్రస్తుతం బతుకుతున్న ప్రజల అవసరాలనూ, హక్కులనూ పక్కనపెట్టి నది పరీవాహక ప్రాంత అభివృద్ధి కోసం ఒక ప్రణాళిక తయారు చేసింది. నది మీద, దాని ఉపనదుల మీద, చిన్నవీ పెద్దవీ 54 ప్రాజెక్టులు ప్రతిపాదించింది. అందులో 12 భారీ విద్యుదుత్పత్తి ప్రాజెక్టులు.

ఇవన్నీ అమలులోకి వస్తే ఆ నది నీటి ప్రస్తుత వాడకం తీవ్రంగా దెబ్బ తింటుంది. ఆరు దేశాలలోని లక్షలాది ప్రజానీకం బతుకులు దెబ్బతినగలవు. విద్యుదుత్పత్తి ప్రాజెక్టుల వల్ల కూడ నష్టం ఎక్కువే ఉండగలదు గానీ నిరసన తెలిపే హక్కు నామమాత్రంగా కూడ లేని చైనా, మయన్మార్, లావోస్‌లలో వాటిని నిర్మిస్తున్నారు. అయినప్పటికీ వివిధ స్థాయిలలో ప్రజలు, సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రవాసంలో ఉన్న అసమ్మతివాదులు ఆందోళన చేస్తూనే వున్నారు. వాటిని ఖాతరు చేయకుండా ఆ ఆరు దేశాల ప్రభుత్వాలు, ఎ.డి.బి. తమ ప్రణాళికను అమలు చేసుకుంటూ పోతున్నాయి.

కంబోడియా (కంపూచియా)లోని చాంగ్‌నియాస్ వద్దనున్న తోన్లెసాప్ చెరువు ఆగ్నేయాసియాలోని అతిపెద్ద మంచినీటి సరస్సు. ఎండాకాలంలో దాని విస్తీర్ణం 3 లక్షల హెక్టార్లు కాగా వర్షాకాలంలో 16 లక్షల హెక్టార్ల దాకా వుంటుంది. సారవంతమయిన మట్టి కలిగి వుంటుంది  కాబట్టి నీళ్లు తగ్గినప్పుడు పుష్కలంగా పంటలు పండిస్తారు. ఆ భూమిలో రకరకాల వృక్ష జాతుల వనాలూ వున్నాయి.  ఈ సరస్సులో చేపల వేట ఎంత ముఖ్యమంటే, కంబోడియా దేశ ప్రజలు మాంసాహారం ద్వారా పొందే పోషక పదార్థాలలో సగంపైగా ఈ చెరువు చేపల నుండే వస్తుందని అంచనా.

దాదాపు 12 లక్షల జనాభా ఈ సరస్సులో చేపలు పడుతూ, నీళ్ళు తక్కువగా వున్న కాలంలో సరస్సు వరద భూమిలో సేద్యం చేస్తూ, అందులోని వనాల ఫలాన్ని సేకరించి అమ్ముతూ ప్రత్యక్షంగా పరోక్షంగా దానిపైన ఆధారపడి బతుకుతారని అంచనా. కొన్ని వేల కుటుంబాలు సరస్సులోనే పడవలలో సంసారం చేస్తారు. ఈ పడవల సముదాయాన్ని 'పడవ గ్రామాలు' అంటారు. అయితే కాలక్రమంలో ఈ సరస్సు కలుషితమయింది. 'పడవ గ్రామాల' నుండి, చుట్టుపక్కలనున్న గ్రామాల నుండి వచ్చే మానవ కాలుష్యం దీనికి ఒక కారణం. దానితో బాటు సరస్సు వరద భూమిలోని వనాలు అతి వినియోగం వల్ల వట్టిపోయే స్థితికి చేరుకున్నాయి.

తోన్లెసాప్ సరస్సును పునరుద్ధరించేందుకు కంబోడియా ప్రభుత్వం ఎ.డి.బిని అప్పు కోరింది. అంతేకాదు, పునరుద్ధరణ కార్యక్రమాన్ని ఎ.డి.బి. చేతిలో పెట్టింది. వారు రూపొందించిన ప్రణాళికలోని మొదటి అంశం సరస్సులోని పడవ గ్రామాలను, సరస్సును కలుషితం చేస్తున్న పరిసర ఆవాసాలను అక్కడినుంచి తొలగించి వారికి వేరేచోట పునరావాసం కల్పించడం. ఇది అనివార్యమనే అనుకున్నా ఆ సరస్సే వారి జీవనాధారం కాబట్టి తిరిగి చేపలు పట్టుకోవడానికీ, వరద భూములలో సాగు మీద, వృక్షసంపద మీద ఆధారపడి బతకడానికీ వారికి వసతి కల్పించి, అదే సమయంలో సరస్సు జీవావరణం దెబ్బతినకుండా ఉండే నియమాలను, వ్యవస్థను రూపొందించి ఉంటే ఉచితంగా ఉండేది. దాని బదులు ఎ.డి.బి. ఏం ప్రతిపాదించిందంటే వీరందరినీ తొలగించి, సరస్సు ఒడ్డున పెద్ద పడవల రేవు నిర్మించాలని. ఓడరేవు కడితే ఏం వస్తుంది? మరపడవలు, పెద్ద పడవలు వస్తాయి. చేపల వేట సరస్సులో భారీగా జరగుతుంది. అంటే 'అభివృద్ధి' వస్తుంది. ఇప్పటిదాకా ఆ సరస్సులో చేపలు పడుతున్న స్థానిక ప్రజలు తాము తినడం కోసం, చిన్నస్థాయిలో వ్యాపారం చేసుకోవడం కోసం మాత్రమే చేపల వేట చేపడుతున్నారు. దానిని కొనసాగించడం 'అభివృద్ధి'కి తోడ్పడదు. మరి పెద్ద రేవు వస్తే డీజల్ కాలుష్యం రాదా? ఇప్పుడు తొలగించిన తీరప్రాంత ఆవాసాల స్థానంలో పెరగబోయే వర్తకానికి అనుబంధంగా షాపులు, హోటళ్లు, మెకానిక్ షెడ్లు, కొత్త నివాసాలు రావా? అసలు మొదలుపెట్టింది కాలుష్య నివారణ కోసమయితే దాని సంగతి విడిచి పెట్టి సరస్సును 'అభివృద్ధి'కి వనరును చేసి ఇప్పటిదాకా దానిపైన ఆధారపడి బతుకుతున్న లక్షలాది ప్రజల జీవనాన్ని ప్రశ్నార్థకం చేసింది ఎ.డి.బి.

నిర్వాసితులయ్యే వారిలో కొందరు కొత్తగా రాబోయే మరబోట్ల చేపల వేటలో జీవనం పొందబోతారేమో గానీ అందరికీ భరోసా లేదు. పైగా అసలు సమస్య పరిష్కారం కాదు.

దీనిని ఎ.డి.బి. చేసే 'అభివృద్ధి'కి ఒక మచ్చుతునకగా భావించవచ్చు. ఇది మనకెందుకు? వారి గవర్నర్ల సమావేశానికి మన హైదరాబాద్‌లో సదుపాయాలు కల్పించడం ఎందుకు? ప్రపంచ బ్యాంకుకు గులాంలమైంది చాలక ఎ.డి.బి కి కూడ కావాలన్న నికృష్టపు కోరిక ఎందుకు?

**మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది**
**28 ఏప్రిల్ 2006**

# దొడ్డిదారిన మరో విపత్తు

ప్రకృతి బీభత్సం మనల్ని నిస్సహాయుల్ని చేస్తుంది కదూ! బాధితులు ఏడుస్తుంటే, దిక్కుతోచక విలవిలలాడుతుంటే చూస్తూండడం తప్ప ఏమీ చేయలేని నిస్సహాయత చాలా బాధాకరమైనది. అయితే 'ప్రకృతి బీభత్సం' అంటున్నాం గానీ నిన్నమొన్నటి వరదలో ప్రకృతి పాలెంత ఉందో మానవ స్వయంకృతం పాలూ అంత ఉంది. గేట్లు సకాలంలో ఎత్తారా, షట్టర్లు సకాలంలో మూశారా వగైరాలే కాదు. మానవ నాగరికత ప్రకృతితో ఆడుకుంటున్న ఆట ప్రాణాంతకంగా మారినట్లు మనకు లభిస్తున్న అనేక సూచికలలో ఇటువంటి అకాల విపత్తులను కూడ లెక్కపెట్టక తప్పని రోజులొచ్చాయి.

మనల్ని నిస్సహాయంగా పక్కకు నెట్టి మన జీవితాలను వినాశనం వైపు తీసుకుపోతున్న విపత్తులింకా చాలా ఉన్నాయి. వీటిని వర్తమాన కాలపు గుణంగా ప్రకటించవచ్చునేమో! నిజానికి 'ఇంకా ఉన్నాయి' అంటున్నాం గానీ అంతిమంగా అన్నిటి మూలమూ ఒకటే. అది విపరీతరూపం తీసుకున్న పెట్టుబడి దాహం.

ప్రపంచ వాణిజ్యసంస్థ (డబ్ల్యుటిఓ) ను దీని ప్రధాన సాధనంగా చాలా కాలంగా భావిస్తూ వస్తున్నాము గానీ దానిని దాటిపోయేవి మన ప్రభుత్వం దాదాపు 30 దేశాలతో చేసుకున్న, చేసుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టిఏలు). వీటి ఫలితాలు మన మీద వచ్చి పడకముందే వీటి గురించి కొంచెమైనా తెలుసుకొని ప్రపంచీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న ఆందోళనల్లో వీటిని వ్యతిరేకించే కార్యక్రమాన్ని కూడ చేర్చితే ఈ విపత్తును కొంతయినా వెనక్కి నెట్టగలుగుతామేమో!

సంస్కరణ, సరళం, స్వేచ్ఛ మొదలైనవి మామూలుగా మంచి భావం గల మాటలు. వినాశనాన్ని అందంగా అలంకరించే కార్పొరేట్ పెట్టుబడి తత్వం వీటిని

చెడ్డ మాటలు చేసింది. అందుకే ఆర్థిక సంస్కరణలు, సరళీకరణ, స్వేచ్ఛా వాణిజ్యం మన భాషలో భయం గొలిపే మాటలయ్యాయి. స్వేచ్ఛా వాణిజ్యం అంటే వాణిజ్యాన్ని అన్ని రంగాలలోకీ యథేచ్ఛగా విస్తరించి లాభాలు పోగుచేసుకునే స్వేచ్ఛ ఉండడం అని ఈ పాటికి అందరికీ బోధపడి ఉండాలి. ఆ వాణిజ్యం వాడకపు వస్తువుల నుంచి పెట్టుబడి రంగానికీ, సేవా రంగానికీ, మానవ మేధో ఉత్పత్తులకూ విస్తరించడంతో 'గాట్' పోయి 'డబ్ల్యుటిఓ' వచ్చిందని కూడ ఈ పాటికి చాలామందికి తెలిసి ఉండాలి. ఈ ప్రపంచ వాణిజ్యసంస్థ లక్ష్యం ఏమిటంటే పెట్టుబడి గల వాడికి వస్తువులు అమ్ముకునే విషయంలోనే కాదు బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, విద్యా వైద్యరంగాలలో సైతం ఎల్లలు ఎరుగని వ్యాపార స్వేచ్ఛ ఉండాలి. దాని కోసం ఎక్కడికయినా పోయి పెట్టుబడులు పెట్టే స్వేచ్ఛ ఉండాలి. మళ్లీ తాను చేసే సాంకేతిక ఆవిష్కరణలతో వ్యాపారం చేసుకునే స్వేచ్ఛ మాత్రం తనకొక్కడికే ఉండాలి. అటువంటి ప్రపంచాన్ని సాధించడం దాని లక్ష్యం. అయితే ప్రపంచ వాణిజ్య సంస్థ గాట్‌కు వారసురాలిగా పుట్టడం వల్ల అది బహుళ దేశాల ఉమ్మడి వేదికగా ఉండక తప్పలేదు. అందులో పెద్ద దేశాల పెత్తనం స్పష్టంగానే ఉన్నప్పటికీ వెనుకబడిన దేశాలు అప్పుడప్పుడు గుంపుకట్టి తమ ప్రయోజనాలను కాపాడుకోగలిగాయి. పెట్టుబడికి అంత స్వేచ్ఛ ఇస్తే చిన్న వృత్తులూ వ్యాపారాలూ వ్యవసాయమూ చేసుకొని బతికే ప్రజలు తట్టుకోలేరన్న ఆందోళన ఈ దేశాల ప్రభుత్వాలను నిజంగా ఎంతగా కదిలించిందో చెప్పలేము గానీ, ఆ తట్టుకోలేని పరిస్థితి తమ పాలనను అభద్రం చేస్తుందన్న ఆందోళన మాత్రం వారిని నిస్సందేహంగా కదిలించి ఉంటుంది.

అందువల్లే 'ఉరుగ్వే రౌండ్'తో మొదలయిన ఈ 15 సంవత్సరాల కాలంలో ప్రపంచ వాణిజ్య సంస్థ తన లక్ష్యాన్ని చాలా మేరకు సాధించింది గానీ పూర్తిగా సాధించలేకపోయింది. పెట్టుబడికి ఎల్లలెరుగని స్వేచ్ఛ ఇవ్వడానికి వెనుకబడిన దేశాలు పూర్తిగా సిద్ధంగా లేవు. ఎక్కువ భాగం ఇచ్చాయి, కొంత నిరాకరిస్తున్నాయి. సేవారంగంలో స్వేచ్ఛా విపణిని ఆవిష్కరించడానికి కూడ అదే రకంగా సంశయిస్తున్నాయి. వ్యవసాయరంగానికీ ఆరోగ్యానికీ సంబంధించినంత వరకు పేటెంట్ హక్కులు పూర్తిగా ఇవ్వడానికి కూడ తటపటాయిస్తునాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ సమావేశాలలో గుంపుగా వ్యవహరించి కొన్ని మినహాయింపులు సాధించుకున్నాయి. ఈ దేశాల ప్రజల ప్రయోజనాలను లెక్కించినప్పుడు ఈ సంశయాలూ తటపటాయింపులూ

మినహాయింపులూ చిన్నవే అయినప్పటికీ, 1980ల మధ్య భాగం నుంచి మాంద్యం దిశగా నడుస్తున్న అంతర్జాతీయ పెట్టుబడికి ఈ పరిస్థితి సంతృప్తి నివ్వలేదు.

ఫలితంగా దాని దృష్టి ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వైపు మళ్లింది. ద్వైపాక్షిక ఒప్పందాలలో బలవంతులు బలహీనులను దబాయించి తమ అవసరాలు సాధించుకునే అవకాశం ఎక్కువ ఉంటుంది. బలహీన దేశం కూడ ఇదేదో ఒక దేశంతో చేసుకుంటున్న చిన్న ఒప్పందం లెమ్మని తన ప్రజలను బుకాయించ గలుగుతుంది. ఈ ఒప్పందాలు ఒక దానికొకటి కలిసి పూర్తిస్థాయిలో 'స్వేచ్ఛావిపణి'ని ఆవిష్కరించే దాకా ప్రజలకు ఏం జరుగుతున్నదీ తెలియదు. ఇటువంటి ఒప్పందాలకు కొంతకాలంగా మన పాలకులూ ఒడిగడుతున్నారు. వీటి గురించి పార్లమెంటులో గానీ ఏ ప్రాతినిధ్య వ్యవస్థలోగానీ చర్చ జరగదు. అసలు ఏం చేస్తున్నదీ అంతా అయిపోయేదాకా తెలీదు. 2007 నుంచి ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ప్రయోగాలు జరుగుతుండగా, కొంతమంది పట్టుదల గల విమర్శకులు తమ శక్తి యుక్తులన్నీ వినియోగించి ఈ మధ్యకాలంలోనే ఈ ఒప్పందాల స్వరూపాన్ని బయట పెట్టగలుగు తున్నారు.

భారత్ 30 ఒప్పందాలు చేసుకుంటున్నదని చెప్పుకున్నాం. అందులో అన్నింటికంటే ఎక్కువ దుష్ప్రభావం వేయగలిగింది యూరోపియన్ యూనియన్ (ఇ.యు)తో చేసుకుంటున్న ఒప్పందం. ఈ ఒప్పందం ఇంకా తుదిరూపం తీసుకోలేదు గానీ, ప్రపంచ వాణిజ్య సంస్థ సమావేశాలలో భారత్ వ్యతిరేకించిన అనేక విషయాలు ఈ ఒప్పందంలో ఉన్నాయనేది స్పష్టం అవుతున్నది. వ్యవసాయ పేటెంట్ల విషయంలో ప్రపంచ వాణిజ్య సంస్థను కొంత మేరకు రాజీకి ఒప్పించి భారత్ చేసిన చట్టం ప్రకారం, ఒక కంపెనీ పేటెంట్ తీసుకుని ఉత్పత్తి చేసిన విత్తనాన్ని కొనుక్కున్న రైతు దానితో పంట పండించుకోవడమే కాక విత్తనం మిగిలించుకోవచ్చు. మళ్ళీ పంట పెట్టుకోవచ్చు. ఇరుగుపొరుగుతో ఆ విత్తనాన్ని పంచుకోవచ్చు. అమ్ముకోవడానికి మాత్రం వీలు లేదు. ఇప్పుడు ఇ.యు.తో చేసుకుంటున్న ఒప్పందం ప్రకారం రైతు విత్తనాన్ని మిగుల్చుకొని మళ్లీ విత్తడానికి కూడ కంపెనీ అనుమతి తీసుకోవాలి. అప్పుడు కూడ తన పొలంలో మాత్రమే విత్తాలి. పక్కవారికి అరువియ్యడానికి వీలు లేదు.

దీని ప్రకారం వాణిజ్యరంగంలో దిగుమతి సుంకాలను సహితం భారత్ ఇంకా భారీగా తగ్గించవలసి ఉంటుంది. 1990 నాటికి దిగుమతి సుంకాలు సగటున 78

శాతం ఉండేవి. ప్రపంచ వాణిజ్య సంస్థ ఒత్తిడి మేరకు 2005 నాటికి 17 శాతానికి పడిపోయాయి. ఇ.యు.తో చేసుకున్న ఒప్పందం ఫలితంగా దిగుమతి సుంకాలు శూన్యాన్ని చేరుకోవలసి వస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థలో ఏ రంగాన్నీ వారు వదులుకోదలచుకోలేదు. మన దేశంలో ప్రభుత్వం తన పాలనా బాధ్యతల నిమిత్తం కొన్ని కొనుగోళ్లు చేస్తుంది, టెండర్ ద్వారా కొన్ని పనులు చేయిస్తుంది. లెవీ ధాన్యం సేకరణ, లెవీ సిమెంటు సేకరణ, రోడ్లు, బ్రిడ్జిలు వగైరా నిర్మించడం మొదలయినవి ఈ కోవకు చెందినవి. ఇది దేశ జాతీయాదాయంలో 13 శాతం ఉంటుందని అంచనా. ఈ రంగంలో కూడ విదేశీ కంపెనీలకు చోటివ్వాలని – అంటే ఉదాహరణకు రోడ్డు పనులు, కల్వర్టు పనులు విదేశీ కంపెనీలు చేపట్టే అవకాశం ఇవ్వాలని – ప్రపంచ వాణిజ్య సంస్థలో ప్రతిపాదన వచ్చినప్పుడు ఇండియా వంటి దేశాలు గట్టిగా వ్యతిరేకించాయి గానీ ఇ.యు.తో చేసుకుంటున్న ఒప్పందంలో అది ఉంది.

చిల్లర వ్యాపారం (రిటైల్ మార్కెట్) మరొకటి. భారత ఆర్థిక రంగంలో ఇదొక పెద్ద వ్యవస్థ. దేశంలోని మొత్తం ఆర్థిక సంస్థలలో 85 శాతం ఇవేననీ, వాటిలో దాదాపు 9 కోట్ల మంది పనిచేస్తారని అయిదవ ఆర్థిక సెన్సస్ లెక్కలు తెలుపుతున్నాయి. ఈ రిటైల్ మార్కెట్ వ్యవస్థ తలుపులు విదేశీ పెట్టుబడికి తెరవాలని ప్రపంచ వాణిజ్య సంస్థలో వచ్చిన ప్రతిపాదనను భారత్ వంటి బడుగు దేశాలు వ్యతిరేకించాయి. కానీ ఇ.యు.తో భారత్ చేసుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో ఇది సహితం ఉంది. ఆరోగ్యం విషయమూ అంతే. మందులకు పూర్తిస్థాయిలో పేటెంట్ హక్కులు ఉండాలని ప్రపంచ వాణిజ్య సంస్థ అంటుండగా, భారత్ వంటి దేశాలు ప్రజారోగ్యానికి సంబంధించినంతవరకు కొంత మినహాయింపు పొందాయి. ఇప్పుడు భారత్ ఇ.యు.తో చేసుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలో ఇది లేదు. ఇది మందుల ధరలు విపరీతంగా పెరగగలవనడానికి సూచి.

ఈ ఒప్పందాలు చేసుకుంటున్నది 30 దేశాలతోనే కదా అనుకోవద్దు. ప్రపంచ వాణిజ్య సంస్థ వ్యవస్థాపక నియమాలలో ఒకటేమిటంటే ఒక సభ్యదేశం ఇతర సభ్య దేశాల మధ్య వివక్ష పాటించడానికి వీలు లేదు. అంటే ఒకరికి ఇచ్చిన వాణిజ్య స్వేచ్ఛ ఇంకొకరికి నిరాకరించడానికి వీలు లేదు. దీనికి భారత్ ఏ మినహాయింపూ కోరలేదు కాబట్టి జరుగుతున్నదేమిటంటే ప్రపంచ వాణిజ్య సంస్థ చర్చలలో తిరస్కరించినట్టు కనిపించిన వినాశకరమైన సూత్రాలను ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల రూపంలో భారత్ తిరిగి తెచ్చుకోవడం!

**ఆంధ్రజ్యోతి దినపత్రిక**

# ఖాయిలా మిల్లులకు కారణం ఎవరు?

మిల్లుల మూసివేత, లాకౌట్, కార్మికుల తొలగింపు మనకు తరచుగా వార్తలలో కనిపించే సంగతులు. ఇన్ని దశాబ్దాల పారిశ్రామిక ప్రగతి తరువాత కూడ మనది వ్యవసాయ ప్రధాన దేశమే. ఆంధ్రప్రదేశ్ దేశ సగటు కంటే మరింత ఎక్కువగా వ్యవసాయాధారమైన ప్రాంతం. ఇక్కడున్న ఫ్యాక్టరీలే తక్కువ. అందువల్ల శ్రామిక జనాభాలో ఫ్యాక్టరీ కార్మికుల సంఖ్య కూడ తక్కువే. ఆ కొద్ది రాశిలోనూ మిల్లులు తరచూ మూతపడడం, 'ఖాయిలా' పడి కార్మికులను తొలగించి ఇంటికి పంపించడం, కార్మికులకు పని చూపించలేక లేఆఫ్ చేయడం సహజంగానే ఆందోళన కలిగించే విషయాలు.

పరిశ్రమలు అనేవి వ్యవసాయం కన్నా చేతివృత్తుల కన్నా భిన్నమైన ఉత్పత్తి ప్రక్రియ మాత్రమే కాదు, సాంకేతికంగా వాటికన్నా ఉన్నతమైన ప్రక్రియ. ఒక మనిషి ఒక గంటసేపు పనిచేస్తే వచ్చే ఉత్పాదన సంప్రదాయక ఆర్థిక రంగం కంటే ఆధునిక రంగంలో రెండు రెట్లు, అయిదు రెట్లు, పది రెట్లు, వంద రెట్లు ఎక్కువ ఉండగలదు. అందుకే పేద దేశాలలో ప్రజలను ఫ్యాక్టరీలు అంతగా ఆకర్షిస్తాయి. అవి మొత్తం సమాజం జీవన ప్రమాణాలను పెంచుతాయి. జీవన వైవిధ్యాన్ని పెంచుతాయి. వాటిలో పనిచేసే కార్మికులు పొలంలో కూలి చేసే తమ తల్లిదండ్రుల కంటే అనేక రెట్లు ఎక్కువ వేతనం సంపాదిస్తారు. వారి జీవన ప్రమాణమే కాదు, వారి ఉత్పాదన శక్తి కూడ పెరుగుతుంది. వారి సాంకేతిక సామర్థ్యం, విజ్ఞానం కూడ పెరుగుతాయి.

అందుకే పరిశ్రమల వల్ల ఎన్ని ఇబ్బందులున్నా 'మాకు పరిశ్రమలు కావాలి' అని పేద ప్రజలు కోరుకుంటూనే ఉంటారు. పరిశ్రమల వల్ల పర్యావరణ కాలుష్యం,

అనారోగ్యం, జనావాసాల తరలింపు తదితర సమస్యలనేకం ఉన్నాయి. వాటిని పారిశ్రామిక ప్రపంచం ఇప్పుడిప్పుడే గుర్తిస్తూ ఉంది. అయినప్పటికీ తమ జీవన ప్రమాణాన్నీ ఉత్పాదన శక్తినీ పెంచుకొని ఇతోధికంగా మెరుగయిన జీవితాన్ని పొందవచ్చుననే హేతుబద్ధమైన, న్యాయమయిన ఆకాంక్షతో వ్యవసాయక దేశాలు పారిశ్రామిక అభివృద్ధిని కాంక్షిస్తాయి.

ప్రజల జీవన స్థాయిలోను, శ్రమజీవుల ఉత్పాదన సామర్థ్యంలోను, సాంకేతిక నైపుణ్యంలోనూ పారిశ్రామిక ప్రగతి తీసుకురాగల మార్పును ప్రమాణంగా పెట్టుకొని చూసినప్పుడే పారిశ్రామీకరణ అనే దాని పట్ల ఒక ప్రజాస్వామిక దృక్పథాన్ని పెంపొందించుకోగలుగుతాము. పారిశ్రామిక ప్రగతితో పెట్టుబడిదారులు, ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు ఆటలాడుకోవడం ప్రజల ఇతోధిక అభివృద్ధికి హానికరం అవుతుందని గుర్తించగలుగుతాము. మిల్లులను నెలకొల్పడం, మూసివేయడం; కార్మికులను పనిలోకి తీసుకోవడం, తొలగించివేయడం పెట్టుబడిదార్ల లాభాల వేటలో ఎత్తుగడలు మాత్రమే కావడానికి వీలులేదనీ, ఆ వైఖరి అప్రజాస్వామికమనీ అనగలుగుతాం.

పారిశ్రామిక అభివృద్ధిని ప్రజల భౌతిక, సాంకేతిక, వైజ్ఞానిక అభివృద్ధికి సంబంధించిన విషయంగా కాక పెట్టుబడిదార్ల లాభాలకు సంబంధించిన విషయంగా చూసే పెట్టుబడిదారీ సంస్కృతే మొదటి నుండి భారత ప్రభుత్వ పారిశ్రామిక విధానాలను తీర్చిదిద్దింది. అయితే ఒక దశ వరకు కార్మికుల ఐక్యపోరాటాలు, ప్రజలలోని ప్రజాస్వామిక, సమసమాజ ఆకాంక్షలు దానికి కొన్ని పరిమితులు పెట్టాయి. లాభాలతోపాటు 'కార్మిక సంక్షేమం', 'సోషలిస్టు తరహా వ్యవస్థ', 'సామాజిక పురోభివృద్ధి' మొదలయిన విషయాలు కూడ మా దృష్టిలో ఉంటాయని పాలకులు అన్నారు. ఆచరణలో మాత్రం వాటి మధ్య సంఘర్షణ వచ్చినప్పుడు లాభాలదే తరచుగా పైచేయి అయింది.

'నాకు నష్టాలు వస్తున్నాయి' అనే నెపంతో కంపెనీ యజమాని ఏం చేసినా చెల్లుబాటవుతుంది. ఉత్పత్తిని తగ్గించడం, కార్మికులను లేఆఫ్ చేయడం, తొలగించడం, మిల్లు మూసేసి పోవడం, ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొట్టడం, ప్రావిడెంట్ ఫండ్, ఇ.ఎస్.ఐ. చెల్లింపులు ఎగవేయడం, బ్యాంకుల రుణాలను తిరిగి చెల్లించక పోవడం

– అన్నీ చెల్లుబాటు అవుతుంటాయి. వీటిని నిరోధించే చట్టాలు లేనే లేవని కాదు. పారిశ్రామిక వివాదాల చట్టం నుంచి ఇండియన్ పీనల్ కోడ్ దాకా అనేక చట్టాలున్నాయి. కానీ కంపెనీల యజమాన్లు ఆ చట్టాలను ఒక జోక్‌గా భావిస్తారు. ఎగవేతకు శిక్షవేసే చట్టాలు కోటీశ్వరులయిన మిల్లు యజమానులకు చీమకుట్టినంత ఇబ్బంది కూడ కల్గించవు. కార్మికుల తొలగింపును, మిల్లు మూసివేతను నియంత్రించే చట్టాలు కూడ అంతే. చట్టాలకే పదును లేదనుకుంటే, మిల్లు యజమానుల దుష్ప్రవర్తనను నియంత్రించాలన్న సంకల్పం ప్రభుత్వాలకు అసలే లేదు. కంపెనీ లాభదాయకంగా నడిస్తేనే కార్మికుల హక్కులు, సామాజిక బాధ్యత, చట్టం, రాజ్యాంగం ఇవన్నీ లెక్కలోకి వస్తాయి.

ఇది పైకి హేతుబద్ధంగా కూడ కనిపిస్తుంది. నష్టాలలో ఉన్న కంపెనీని బలవంతపెట్టి తన బాధ్యతలన్నీ నిర్వర్తించాలనడం, కార్మికులకూ ప్రభుత్వానికీ బ్యాంకులకూ అన్ని చెల్లింపులూ చేయాలనడం ఆచరణ సాధ్యం కాని విషయమని ఎవరయినా ఒప్పుకుంటారు. కానీ ఈ 'నష్టం' అనేది ఎందుకు వచ్చింది, కంపెనీ నడవలేని పరిస్థితి ఏ కారణంగా దాపురించింది, అది తన బాధ్యతలన్నీ సక్రమంగా నిర్వర్తించలేని స్థితికి ఎందుకు దిగజారింది అనే విషయాలను సమగ్రంగా విచారించి ఈ స్థితికి బాధ్యులయిన వారందరినీ తగురీతిలో శిక్షించేటట్టయితేనే ఇది హేతుబద్ధమైన వాదన కాగలదు. కానీ అటువంటి ఏర్పాటేదీ లేదు. కోట్ల రూపాయల నష్టాన్ని చూపించిన మిల్లు యజమాని 'మార్కెట్ స్తబ్ధంగా ఉంది', 'కార్మికులలో అరాచకం ప్రబలింది', 'అసలు పరిశ్రమలోనే మాంద్యం నెలకొనింది', 'ముడిసరుకు సరిగ్గా దొరకడం లేదు' అంటూ ఏదో ఒక కారణం చూపించి తన బాధ్యతల నుంచి తప్పించుకోగలుగుతున్నాడు. అతనిని నిలదీసే సంకల్పం వ్యవస్థకు లేదు. తమ వేతనాలు, ప్రావిడెంట్ ఫండు కోల్పోయిన కార్మికులు, అసలు ఉద్యోగాలే పోగొట్టుకున్న కార్మికులు కడుపు మాడ్చుకొని ఏడవవలసిందే. ఆ బాధకు కారణమెవరు అని విచారించే వ్యవస్థ లేదు. మిల్లు కార్మికులే కాదు, ఒక పెద్ద మిల్లు ఒక ప్రాంతంలో నెలకొనిందంటే దానిని ఆశ్రయించి అనేక కొత్త ఉపాధి అవకాశాలు పుట్టుకొస్తాయి. మిల్లు గేటు బయట టీ కొట్టు పెట్టుకునే వారి దగ్గరి నుండి మిల్లు చేసే అమ్మకం, కొనుగోళ్ళలో డీలర్లుగా వ్యవహరించే వర్తకుల దాకా చాలామందికి మిల్లు వల్ల నూతన

ఆదాయం వస్తుంది. వీళ్ళలో ధనవంతులు ఈ ఆదాయం నుండి కొంత మిగుల్చుకొని మిల్లు మూతపడిన తరువాత వేరే ఆదాయ మార్గాలు వెతుక్కోగలరు. కానీ మిల్లు వల్ల దైనందిన ఉపాధి అవకాశం మాత్రమే పొందిన వాళ్ళు వీధిన పడక  తప్పదు.

ఈ ప్రభావం కార్మికుల, ఇతర ఆశ్రిత ప్రజల జీవన విధానంపైన బలంగా పడుతుంది. అంతవరకు పిల్లలను స్కూలుకు పంపించి బాగా చదివించుకుందామని అనుకున్న వాళ్ళు ఇంక పంపించలేరు. అంతవరకు తలకు నీడనిచ్చే పక్కా యింట్లో ఉన్న వాళ్ళు తిరిగి పూరిపాకలోకి పోవాలి. మొత్తంగా పేద జీవన సరళి నుండి ఒక మెట్టుపైకి పోయామనుకున్న వాళ్ళు తిరిగి పాత జీవన సరళిలోకి పోవాలి. ఈ ప్రభావం ఉపాధి కోల్పోయిన వారి మీదనే కాదు, మొత్తంగా వారి కుటుంబాల మీద పడుతుంది. ఈ దుస్థితికి బాధ్యులెవరు అని విచారించే అవసరం లేదా? ఇది  ఏ మేరకు ఎవరి చేతిలోనూ లేని పరిణామాల వల్ల జరిగింది అని నిర్ధారించనవసరం లేదా? 'నష్టాలు వస్తున్నాయి కాబట్టి చేసేదేమీ లేదు' అంటే సరిపోతుందా?

మార్కెట్‌లో సంక్షోభం, పరిశ్రమలో మాంద్యం అనేవే నష్టాలకు కారణమైనా అవి ప్రభుత్వ విధానాలతో, లేకపోతే విధాన రాహిత్యంతో ముడిపడి ఉన్న విషయాలు. కార్మికుల క్రమశిక్షణా లోపం పారిశ్రామిక రుగ్మతకు అతి స్వల్ప కారణం అని అధికార గణాంకాలే చెప్తాయి. 'యాజమాన్య వైఫల్యం' అనే దాన్ని విశ్లేషిస్తే అందులో అసమర్థత, నిర్లక్ష్యం, చేతకానితనం, ముందుచూపు లేకపోవడం మొదలయిన అవలక్షణాలే కాక మిల్లును గుల్లచేసే ద్రోహబుద్ధి కూడ ఒక అంశంగా కనిపిస్తుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థకు సహజమైన సంక్షోభాలు, ప్రభుత్వ విధానాలలోని లోపాలు, యజమానుల అసమర్థత, దగాకోరుతనం తదితర అనేక కారణాలు పారిశ్రామిక రుగ్మతకు దారితీస్తాయి. కానీ దీనిలోని ఏ ఒక్క అంశానికీ ఎవ్వరినీ బాధ్యులను చేసే వ్యవస్థ లేదు. ఒక వెయ్యి రూపాయల దొంగతనం జరిగితే ఆ దొంగతనం చేసిందెవరు, చేయించిందెవరు, ప్రోత్సహించింది ఎవరు, సహాయం చేసింది ఎవరు, దొంగిలించిన వస్తువును కొనుక్కున్నది ఎవరు అంటూ ఒక్కొక్క విషయం విచారణ జరిపి ఒక్కొక్కరి మీద ఒక్కొక్క కేసుపెట్టే నేరస్మృతి మనకు ఉంది. కానీ నష్టాలు వస్తున్నాయంటూ దేశం మొత్తంమీద 2.2 లక్షల (చిన్న, పెద్ద) మిల్లులను మూసివేసి 7892 కోట్ల రూపాయలు బకాయిపెట్టి లక్షలాది కార్మికులను ఇంటికి

పంపించేస్తే ఆ ఘోరానికి ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు, మిల్లు యజమానులు, ఎవరు ఏ మేరకు బాధ్యులని విచారించే నేరస్మృతి మాత్రం లేదు. ఈ నేరాల ఫలితాన్ని మట్టుకు లక్షలాది కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, పారిశ్రామిక ప్రగతిని ఆశ్రయించి ఉపాధి పొందే చిన్న చిన్న వృత్తుల, వ్యాపారాల వాళ్ళు, దినకూలీలు ఇంకా అనేక రకాల ప్రజలు భరించాలి. మిల్లు నడపలేనంటున్నప్పుడు బలవంతమెట్లా చేస్తాం అనే వాదన పైకి కనిపించేటంత హేతుబద్ధమైనదీ కాదు, అమాయకమైనదీ కాదు. దాని వెనుక అపారమైన సామాజిక నేరాలు, విద్రోహం దాగి ఉండవచ్చు.

## బి.ఐ.ఎఫ్.ఆర్

భారతదేశ ప్రజలలో ఉన్న ప్రజాతంత్ర చైతన్యం దృష్ట్యా తన సామాజిక బాధ్యతను పూర్తిగా విస్మరించడం ప్రభుత్వానికి సాధ్యం కాదు కాబట్టి పరిశ్రమలను పూర్తిగా యాజమాన్య ఇష్టాయిష్టాలకు వదిలేయకుండా సాంఘిక ప్రయోజనాలను, కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నియంత్రించే కొన్ని చట్టాలను (ప్రధానంగా పారిశ్రామిక వివాదాల చట్టం - 1947) ప్రభుత్వం చేసింది. అయితే పైన చెప్పినట్టు ఈ చట్టాలు స్వభావరీత్యా బలహీనమైనవే కాక వాటిని పట్టుదలగా అమలుచేసే సంకల్పం సహితం ప్రభుత్వానికి లేదు.

పారిశ్రామిక రంగం కంపెనీ యజమానుల రాజ్యం. వాళ్ళు ప్రభుత్వం నుండి కోట్ల రూపాయలు విలువగల సదుపాయాలు పొంది, ప్రభుత్వ ద్రవ్య సంస్థల నుంచి వందలకోట్ల రూపాయల పెట్టుబడి పొంది కూడ పూర్తిగా బాధ్యతారహితంగా వ్యవహరించి అంతా నాశనం చేసి బయటపడగలరు. కార్మికులు ఆందోళనకు దిగితే తొలగించగలరు, పోలీస్ కేసులు పెట్టించి లాకప్పులో కొట్టించగలరు. పని లేదని చెప్పి లేఆఫ్ చేయగలరు, సిబ్బంది ఎక్కువయిపోయారని చెప్పి రిట్రెంచ్ చేయగలరు. మిల్లు నడవడం సాధ్యం కాదని చెప్పి లాకౌట్ చేయగలరు. ఈ చట్టబద్ధమైన కక్షసాధింపు చాలకపోతే కిరాయి గుండాలచేత తన్నించగలరు. కార్మికులకు మాత్రం సమ్మె తప్ప వేరే సాధనం లేదు. దానికి కూడ చట్టంలో అనేక పరిమితులు పెట్టారు. పైగా కార్మిక సంఘం పెట్టుకుంటేనే పోలీస్ స్టేషన్‌కు పిలిచి తన్ని రాజీనామా చేయించే సంస్కృతి ప్రబలుతున్న ప్రస్తుత పరిస్థితిలో సమ్మె హక్కు అనేది గొంతెమ్మ కోరికే.

పారిశ్రామిక సంక్షోభానికీ, మిల్లుల నష్టాలకూ ఉన్న కారణాలు అన్వేషించి ఎవరి బాధ్యత ఎంతో గుర్తించే ఏర్పాటులేని ప్రస్తుత పరిస్థితిలో మిల్లులు అలవోకగా 'ఖాయిలా' పడుతుంటాయి. అంటే నష్టాలు విపరీతంగా పెరిగిపోయి తిరిగి పుంజుకోలేని స్థితి ఏర్పడుతుంటుంది. లక్షలాది కార్మికులు, ఇతర ప్రజలు ఉపాధి కోల్పోతుంటారు. కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతుంటుంది. దేశంలోని ఖాయిలా మిల్లుల సంఖ్యను, వాటి బకాయిలను చూస్తే ఈ నష్టం ఎంత పెద్దఎత్తున జరుగుతున్నదో తెలుస్తుంది.

**ఖాయిలా పడిన పారిశ్రామిక సంస్థలు, వాటి బకాయిలు**

(1991 మార్చి)

I. **మధ్యతరహా, పెద్దతరహా పరిశ్రమలు**

| | మిల్లుల సంఖ్య | బకాయిలు (కోట్ల రూ॥లలో) |
|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 135 | 409.27 |
| భారతదేశం | 1461 | 5105.50 |

II. **చిన్నతరహా పరిశ్రమలు**

| | మిల్లుల సంఖ్య | బకాయిలు (కోట్ల రూ॥లలో) |
|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 29487 | 237 |
| భారతదేశం | 221472 | 2787 |

*(ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ, 2.2.1994)*

దేశం మొత్తంమీద 1991 మార్చి నాటికి 1461 మధ్యతరహా, పెద్దతరహా మిల్లులు, 2,21,472 చిన్నతరహా మిల్లులు ఖాయిలా పడి మూతపడ్డాయి. వాటి బకాయిలు మొత్తం 7892.50 కోట్ల రూపాయలు. ఈ 'ఖాయిలా' వల్ల ఎన్ని లక్షల, లేక కోట్ల జనాభా తమ ఉపాధిని కోల్పోయారో, ఏ మేరకు వాళ్ళ జీవన ప్రమాణం దెబ్బతినిందో లెక్కబెట్టినవారు లేరు.

మితిమీరిపోతున్న ఈ నష్టాన్ని నివారించలేకపోయినా, దానికి బాధ్యులెవరు అని గుర్తించి నిలదీయలేకపోయినా కనీసం అవసాన దశలోనైనా ఈ ఖాయిలా

మిల్లులకు పునర్జీవం కలిగించి నిలబెట్టే ఉద్దేశ్యంతో కేంద్ర పార్లమెంటు 1985లో బోర్డ్ ఫర్ ఇండస్ట్రియల్ అండ్ ఫైనాన్షియల్ రీకన్‌స్ట్రక్షన్ (బి.ఐ.ఎఫ్.ఆర్) అనే సంస్థను నెలకొల్పింది. ఈ సంస్థ ఒక చట్టం ద్వారా ఏర్పడింది. ఆ చట్టం పేరు సిక్ ఇండస్ట్రియల్ కంపెనీస్ (స్పెషల్ ప్రొవిజన్స్) ఏక్ట్, 1985. ఒక మిల్లు ఖాయిలా పడింది లేక పడబోతూ ఉంది అనుకున్నప్పుడు దాని పరిస్థితిని సమీక్షించి పునర్జీవనం కల్గించడానికి అవసరమైన చర్యలను సూచించడం బి.ఐ.ఎఫ్.ఆర్ లక్ష్యం. అంతకు ముందు ఈ అవసరం కోసం వేరే కొన్ని సంస్థలు, ఏర్పాట్లు ఉండేవి. అవి అసంతృప్తికరంగా ఉన్నాయని చెప్పి కేంద్రప్రభుత్వం ఈ చట్టాన్ని చేసింది.

ఒక పారిశ్రామిక కంపెనీ ఖాయిలాపడే స్థితి వచ్చినప్పుడు రెండు నెలల లోపల కంపెనీ బోర్డు ఆ విషయాన్ని బి.ఐ.ఎఫ్.ఆర్‌కు తెలియజేయాలి. లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మిల్లుకు పెట్టుబడి పెట్టిన బ్యాంకులు, లేక ఇతర ద్రవ్య సంస్థలైనా బి.ఐ.ఎఫ్.ఆర్‌కు ఈ సంగతి తెలియజేయవచ్చు. దానిపై విచారణ జరిపి, ప్రస్తుత యాజమాన్యం సహేతుకమైన కాలవ్యవధిలో కంపెనీని బాగుచేయగలుగుతుందని అనుకుంటే బి.ఐ.ఎఫ్.ఆర్ కంపెనీకి తగు సమయం ఇస్తుంది. లేదనుకుంటే మిల్లు పునర్జీవానికి అవసరమైన ఇతర చర్యలు చేపడుతుంది. బ్యాంకులు, ఇతర ద్రవ్య సంస్థలు, ప్రభుత్వ శాఖల సహకారంతో ఇప్పుడున్న యాజమాన్యానికే రాయితీలు ఇచ్చి కంపెనీ నిర్మాణంలో షరతులు పెట్టి పునర్జీవన ప్రయత్నం చేయవచ్చు. లేదా కొత్త యాజమాన్యానికి కంపెనీని అప్పగించవచ్చు. లేదా వేరే కంపెనీతో దీనిని విలీనం చేయవచ్చు. కంపెనీలో కొంత వాటా వేరొకరికి ఇప్పించవచ్చు. వేరే ఏదయినా తగిన చర్య తీసుకోవచ్చు. ఈ ప్రత్యామ్నాయ అవకాశాలను పరిశీలించడానికి బి.ఐ.ఎఫ్.ఆర్ ఒక ఆపరేటింగ్ ఏజెన్సీని నియమిస్తుంది.

పునర్జీవం సాధ్యం కాదనుకున్నప్పుడు మాత్రమే కంపెనీని మూసివేయ వలసిందిగా కంపెనీ చట్టం కింద బి.ఐ.ఎఫ్.ఆర్ సంబంధిత హైకోర్టుకు నివేదిస్తుంది. బి.ఐ.ఎఫ్.ఆర్ నిర్ణయాలపై అప్పీల్ స్వీకరించే సంస్థ ఎ.ఎ.ఐ.ఎఫ్.ఆర్.

బి.ఐ.ఎఫ్.ఆర్‌లో సభ్యులుగా, ఛైర్మన్‌గా ఉండే వ్యక్తులు హైకోర్టు న్యాయమూర్తుల స్థాయివారై ఉంటారు. లేదా న్యాయ, సాంకేతిక, వాణిజ్య, ఆర్థిక రంగాలకు సంబంధించిన ఉన్నతస్థాయి నిపుణులై ఉంటారు.

1991 చివరి నాటికి బి.ఐ.ఎఫ్.ఆర్ 474 ఖాయిలా కంపెనీలపైన విచారణ పూర్తిచేసి తుది నిర్ణయం చేసింది. ఈ 474 కేసులలోకి 239 కేసులలో కంపెనీ ఖాయిలా పడడానికి యాజమాన్య లోపాలే కారణం అని బి.ఐ.ఎఫ్.ఆర్ నిర్ణయించింది. 114 కేసులలో ప్రభుత్వ విధానాలు కారణం అని నిర్ణయించింది. 69 కేసులలో మిల్లు స్థాపనకు అనుకున్న దానికన్నా ఎక్కువ కాలం, వ్యయం అవసరం కావడం కారణమని గ్రహించింది. 52 కేసులలో మాత్రమే కార్మికులను తప్పు పట్టింది.

ఖాయిలాకు ప్రభుత్వ విధానాలది బాధ్యత అయితే బి.ఐ.ఎఫ్.ఆర్ ఎట్లాగూ ఏమీ చేయలేదు. వ్యవస్థాగతమయిన సంక్షోభం కారణమైనా ఏం చేయలేదు. కానీ యాజమాన్య వైఫల్యాలు, లేక దగాకోరుతనం మిల్లు పతనానికి కారణమైన (ఆ కోవకు చెందిన కారణాలే ప్రధానమైనవని పైన వివరించాము) చోట బి.ఐ.ఎఫ్.ఆర్ ఆ యాజమాన్యాన్ని సెక్షన్ 24 కింద దండించగలదు, కాని దండించదు. కంపెనీని 'ఖాయిలా' స్థితి నుండి బయట పడేయటం బి.ఐ.ఎఫ్.ఆర్ లక్ష్యం. కంపెనీ రోగగ్రస్తమయి ఉంది కాబట్టి బి.ఐ.ఎఫ్.ఆర్ సున్నితంగా వ్యవహరిస్తుంది. బలవంతపు బకాయిల వసూళ్ళ వంటి చర్యలను అనుమతించదు. యాజమాన్యాన్ని శిక్షించే ప్రయత్నం చేయదు. తన వైఫల్యం వల్లనే మిల్లును కాటికి పంపించిన యజమాన్యానికి ఇది బాగా ఉపకరిస్తుంది. బి.ఐ.ఎఫ్.ఆర్‌ను అడ్డం పెట్టుకొని దగాకోరు యజమానులు ఆడే ఆటలకు కొన్ని ఉదాహరణలు దీని తర్వాతి వ్యాసాలలో చూస్తారు.

ఏమయినా బి.ఐ.ఎఫ్.ఆర్ వల్ల కొంత ప్రయోజనం కలిగిన మాట వాస్తవం. కొన్ని మిల్లులయినా నిలదొక్కుకొని బాగుపడగలిగాయి. ఇంకొంత కాలం ఈ సంస్థ సజీవంగా ఉంటే రోగిని బాగుచేసే కర్తవ్యంతోబాటు రోగానికి బాధ్యులయినవారిని శిక్షించే కర్తవ్యం కూడ ఈ సంస్థకు ఇప్పించడం కోసం ప్రజాతంత్రశక్తులు కృషి చేయవచ్చు. అయితే బి.ఐ.ఎఫ్.ఆర్ ఎన్నాళ్ళు సజీవంగా ఉంటుందో తెలీదు. ఎందుకంటే ప్రస్తుతం దేశంలో రాజ్యమేలుతున్న నూతన ఆర్థిక విధానాల దృక్పథం రోగులను నయం చేసే వైద్యుని దృక్పథం కాదు. రోగిని చంపి పూడ్చిపెట్టి బతికి ఉన్నవాళ్ళు జల్సా చేసుకుందాం అనే దృక్పథం.

'ఎగ్జిట్ పాలసీ' అనేది దీనికి టోకుగా ప్రాతినిధ్యం వహించే మాట. ఎక్కువయిపోయిన కార్మికులను ఇంటికి పంపించేయ్. నష్టాలొచ్చే మిల్లులను మూసెయ్.

పాతబడిపోయిన పరిశ్రమలను మొత్తంగానే పూడ్చిపెట్టేయ్. దీనికి పారిశ్రామిక వివాదాల చట్టం అడ్డమైతే దానిని మార్చెయ్. సంక్షేమ రాజ్యం, ప్రజాస్వామ్యం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి మొదలయిన విలువలు, ఆదర్శాలు దీనికి అడ్డమొస్తే వాటిని విడిచి పెట్టేయ్. వెరసి కంపెనీల లాభార్జనకు, లాభార్జన ఇంక సాగదనుకున్న కంపెనీల మూసివేతకు ఏ ఆటంకాలు ఉండకూడదు. కార్మిక చట్టాలు, సంక్షేమ చట్టాలు ఏవీ అడ్డం రాకూడదు.

ఇప్పటికే దేశంలోకి వేగంగా ప్రవేశిస్తున్న విదేశీ పెట్టుబడిదారులు ఈ రకమైన మార్పులు చట్టంలో చేయాలని ఒత్తిడి పెడుతున్నారు. రాబోయే ఎన్నికల పర్వం ముగిసిన తరువాత కేంద్ర ప్రభుత్వం ఆ మార్పులు చేయనే చేస్తుంది. ఈ వాతావరణంలో బి.ఐ.ఎఫ్.ఆర్ ఎందుకు? కాటికాపరి కావాలి గానీ వైద్యుడెందుకు?

ఖాయిలా మిల్లుల పునరుజ్జీవన వ్యవహారాన్ని పరిశీలించడానికి 1993 మే నెలలో కేంద్ర ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ బి.ఐ.ఎఫ్.ఆర్ పనితీరును సమీక్షించి భారీ మార్పులు సూచించింది. ఖాయిలాపడిన కంపెనీ తప్పనిసరిగా బిఐఎఫ్ఆర్‌కు తెలియచేయాలన్న నియమాన్ని తీసేసి, ఇష్టముంటే తెలియజేయవచ్చునని మార్చాలన్నారు. బి.ఐ.ఎఫ్.ఆర్ ప్రధానంగా పునరుజ్జీవన సంస్థగా కాక 'ఖాయిలా' కంపెనీలను త్వరితగతిన మూసివేసే సంస్థగా పనిచేయాలన్నారు. అనవసరమైన కాలవ్యయం లేకుండా రోగగ్రస్తమయిన మిల్లులను చకచకా మూసేసుకుంటూ పోయే సంస్థగా బి.ఐ.ఎఫ్.ఆర్‌ను మార్చేయాలన్నారు. అంటే ఎగ్జిట్ పాలసీ గేట్లు తెరిచి పట్టుకునే గేట్ కీపర్‌గా బి.ఐ.ఎఫ్.ఆర్ పనిచేయాలన్నారు.

ఎగ్జిట్ పాలసీకి చెందిన ఏ అంశానికీ ప్రభుత్వం ఇప్పటివరకు చట్టరూపం ఇవ్వలేదు. దీనికీ ఇవ్వలేదు. ఐ.ఎం.ఎఫ్, ప్రపంచబ్యాంకు తదితర అంతర్జాతీయ ద్రవ్య సంస్థల ఒత్తిడిని బట్టి ఆ పనిని ఏ రోజయినా చేయవచ్చు. ఆ తరువాత కోట్లాది ప్రజల జీవన్మరణాలకూ, ఉపాధికీ, జీవన ప్రమాణాలకూ సంబంధించిన విషయాలన్నీ కొందరు పెట్టుబడిదారుల ఇష్టాయిష్టాలపైన ఆధారపడి ఉంటాయి. ఆ రోజు రాకుండా చూడడం, ప్రతిఘటించడం ప్రజాతంత్ర శక్తుల కర్తవ్యం.

అందులో భాగంగానే మన రాష్ట్రంలోని గుంతకల్ స్పిన్నింగ్ మిల్లు, శ్రీరాయలసీమ పేపర్ మిల్లు, నెల్లిమర్ల జూట్ మిల్లు, ఆజంజాహీ మిల్లు ఏ క్రమంలో,

ఎందువల్ల ఖాయిలా పడ్డాయో విశ్లేషించే నివేదికలను ఈ పుస్తకంలో పొందుపరిచాం. ఈ నాలుగు మిల్లులలో కలిపి దాదాపు 20 వేల మంది కార్మికులు పనిచేసేవారు. వారి కుటుంబ సభ్యులను కలుపుకుంటే ఈ మిల్లుల రుగ్మత వల్ల ఉపాధి కోల్పోయిన ప్రజానీకం ఒక లక్ష దాకా ఉంటారు. మిల్లుల వల్ల పరోక్షంగా ఉపాధి పొందిన వారినీ, వారి కుటుంబ సభ్యులనూ కూడ కలుపుకుంటే ఈ సంఖ్య ఎంత అవుతుందో తెలీదు. ఇంతమంది జీవితాలతో ఈ మిల్లుల యజమానులూ, ప్రభుత్వ అధికారులూ, రాజకీయ నాయకులూ, ప్రభుత్వాలూ, కోర్టులూ చెలగాటమాడిన వైనాన్ని నివేదికలలో చూడవచ్చు.

ఈ నివేదికలు తయారు చేయడంలో మాకు చాలామంది సహకరించారు. ఆ మిల్లులలో పనిచేసిన కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, ఆఫీసు సిబ్బంది, ప్రభుత్వ అధికారులు, న్యాయవాదులు తమ అభిప్రాయాలనూ అనుభవాలనూ తమకు అందుబాట్లో ఉన్న సమాచారాన్నీ మాతో పంచుకున్నారు. వాళ్ళందరికీ మా ధన్యవాదాలు.

*'ఖాయిలా మిల్లులు – కార్మికుల బతుకులు' పేరుతో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఎపిసిఎల్‌సి) ప్రచురించిన నివేదికకు ముందుమాటగా రాసింది. గుంతకల్ స్పిన్నింగ్ మిల్లు నివేదిక మినహా మిగిలిన మూడు నివేదికలను బాలగోపాల్‌గారే రాశారు. దీని తర్వాత వచ్చే వ్యాసాలు అవే.*

**25 సెప్టెంబరు 1994**

# శ్రీరాయలసీమ పేపర్ మిల్లు

ఏ పరిస్థితులలో ఒక మిల్లు ఖాయిలా పడిందనేది మామూలుగా వేసుకునే ప్రశ్న. అయితే రాయలసీమ పేపర్ మిల్లు విషయంలో దానితోబాటు ఇంకొక ప్రశ్న కూడ అడగవలసి ఉంటుంది. ఈ పేపర్ మిల్లును 'సిక్' మిల్లుగా బి.ఐ.ఎఫ్.ఆర్ 1989లోనే గుర్తించింది. మిల్లు రోగగ్రస్తమయినా కాగితం పరిశ్రమకొచ్చిన రోగమేమీ లేదు కాబట్టి దీనికి పునర్జీవం కలిగించే అవకాశం ఉందని చెప్పి, ఆ నాటి నుండి మిల్లు పునర్జీవానికి బి.ఐ.ఎఫ్.ఆర్ ప్రయత్నాలు చేస్తూనే ఉంది. బి.ఐ.ఎఫ్.ఆర్‌కు ఈ విషయంలో సర్వాధికారాలూ లేకున్నా అధికారం దండిగానే ఉంది. అయినప్పటికీ 5 సంవత్సరాలు గడచినా మిల్లు ఇంకా ఎందుకు మూతపడే ఉందన్న ప్రశ్న కూడ వేసుకోవాలి.

'ఖాయిలా పడిన పరిశ్రమలను చూశాను గానీ ఖాయిలా పడిన పరిశ్రమాధిపతులను చూడలేదు' అని బి.ఐ.ఎఫ్.ఆర్‌లో కొంతకాలం సభ్యునిగా పనిచేసిన ఒక పరిశీలకుడు అంటాడు. రాయలసీమ పేపర్ మిల్లు దీనికొక చక్కటి ఉదాహరణ. ఆదోనిలో నూనె మిల్లు యజమానులుగాను, దలాలి వర్తకులుగాను ఉన్న టి.జి. కుటుంబం 1970లలో రాయలసీమ పేపర్ మిల్లు ద్వారా పెద్ద పరిశ్రమలలోకీ, ఆధునిక పరిశ్రమల రంగంలోకీ అడుగుపెట్టారు. ఒక దశాబ్దం తరువాత మిల్లు నష్టాలలో కూరుకొని మూతపడిపోయింది కాని టి.జి. కుటుంబం మట్టుకు కోటీశ్వరులయ్యారు.

## కర్నూలు జిల్లా

రాయలసీమ పేపరు మిల్లు కర్నూలు పట్టణాన్ని ఆనుకొని, తుంగభద్రా నదికి ఆవల ఉంది. ఇది తెలంగాణ, రాయలసీమల సరిహద్దు. దక్షిణాన కర్నూలు జిల్లా, ఉత్తరాన మహబూబ్‌నగర్ జిల్లా ఉన్నాయి. రెండువైపులా కరువు కాటకాలతో,

నిరుద్యోగంతో, దుర్భర దారిద్ర్యంతో తల్లడిల్లుతున్న గ్రామాలున్నాయి. వ్యవసాయానికి సాగునీరు లభించే సేద్యపు భూమి రాష్ట్రం మొత్తంలో 39.3 శాతం కాగా కర్నూలు జిల్లాలో 17.2 శాతం, మహబూబ్‌నగర్ జిల్లాలో 19.6 శాతం మాత్రమే. ఈనాటికీ రాష్ట్రంలో వరి కన్నా జొన్న పంట ఎక్కువ వేసే నాలుగు జిల్లాలలో కర్నూలు, మహబూబ్‌నగర్ ఉన్నాయి. కర్నూలులో జొన్న ప్రధాన పంట కాగా దాని తరువాతది వేరుశెనగ (కర్నూలు జిల్లా భాషలో దీనిని 'బుడ్డలు' అంటారు). మూడవస్థానం పొద్దుతిరుగుడు పువ్వుది. ఆ తరువాతే వరిపంట.

వెనుకబాటుతనం, పేదరికం కర్నూలు జిల్లాలో కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. తలసరి ఆహార ధాన్యాల ఉత్పత్తి రాష్ట్రంలో సంవత్సరానికి సగటున 150 కిలోలుంటే కర్నూలు జిల్లాలో 104 కిలోలు మాత్రమే. వ్యవసాయ వెనుకబాటుతనం ఫలితంగా జిల్లాలో పంట దిగుబడి (అది జొన్నలయినా, బుడ్డలయినా, వరి అయినా) రాష్ట్ర సగటు కంటే 40 శాతం తక్కువ. అయితే కర్నూలు జిల్లాలో ఖనిజ సంపద బాగానే ఉంది. సున్నపురాయి, నాపరాయి, వాణిజ్య విలువ ఉన్న ఇతర రాళ్ళు దండిగా దొరుకుతాయి. ఈ ఖనిజ సంపదను ఆధారం చేసుకున్న పరిశ్రమ ఉంది. అందులో సిమెంట్‌నగర్‌లో ఉన్న పాణ్యం సిమెంట్స్ ఒక్కటే పెద్ద, లేక మధ్యతరహా మిల్లుల కోవలోకి వస్తుంది. మిగిలినవన్నీ చిన్న తరహా మిల్లులు.

మొత్తంగా జిల్లాలో పెద్ద లేక మధ్యతరహా మిల్లులు 19, చిన్న తరహా మిల్లులు 1744 ఉన్నాయి (ఖాయిలాపడి మూలుగుతున్న వాటిని కూడ కలుపుకొని). వీటిలోని దినసరి కార్మికులు సంఖ్య 23,451. జిల్లాలోని మొత్తం శ్రామిక జనాభాలో ఇది 1.7 శాతం మాత్రమే. వెయ్యి మందికి పైగా ప్రతిరోజు పని కల్పించే మిల్లులు జిల్లాలో నాలుగే ఉన్నాయి. వాటిలో మూడు ఎమ్మిగనూరు, ఆదోనిలలోని నూలు, బట్టల మిల్లులు కాగా, నాలుగోదీ, అన్నిటికంటె పెద్దదీ కర్నూలులోని శ్రీరాయలసీమ పేపర్ మిల్లు.

అంటే కర్నూలు జిల్లాలోని పారిశ్రామిక రంగానికి రాయలసీమ పేపర్ మిల్లు తలమానికం అని (పెట్టుబడిలోనూ, కార్మికుల సంఖ్యలోనూ) కవితాత్మకంగా చెప్పుకోవచ్చును. ఈ మాణిక్యం అయిదేళ్ళుగా మసిబారి ఉంది. ఇది కాగితం పరిశ్రమకు పట్టిన సామాన్య రుగ్మత కాదు. ఆ పరిశ్రమ (కొన్ని ఒడిదుడుకులతో)

దినదినాభివృద్ధి చెందుతూనే ఉంది. 1978-79 నుండి 1988-89 వరకు (అంటే రాయలసీమ పేపర్ మిల్లు ఉత్పత్తి మొదలుపెట్టి ఖాయిలాపడి మూతపడే వరకు) దేశంలోని కాగితం మిల్లుల సంఖ్య 68 శాతం (500 మిల్లుల నుండి 844కు) పెరిగింది. కాగితం పరిశ్రమలో పెట్టుబడి దాదాపు ఐదున్నర రెట్లు పెరిగింది. దేశంలో ఉత్పత్తి అయిన కాగితం విలువ కూడ దాదాపు 5 రెట్లు పెరిగింది. ఈ పెరుగుదలలో కొంత భాగం సాధారణ ద్రవ్యోల్బణం వల్ల వచ్చిన వాపు అయినప్పటికీ, ద్రవ్యోల్బణం ప్రభావాన్ని తొలగించి వాస్తవ ఉత్పత్తి విలువ పెరుగుదల రేటును తీసుకున్నా, అది 1978-79 నుండి 83-84 దాకా సాలీనా 6.77 శాతం, 83-84 నుండి 88-89 దాకా సాలీనా 9.49 శాతం పెరిగింది. రాసుకునే కాగితానికి, అచ్చువేసే కాగితానికి, అట్టలకు, అందమయిన ఆర్ట్ ప్రింటింగ్ చేసే నాణ్యమయిన కాగితానికి, ప్యాకేజింగ్ కాగితానికి - అన్నిటికీ గిరాకీ పెరుగుతూనే ఉంది. రాయలసీమ పేపర్ మిల్లు మాత్రం 'సిక్' అయింది.

రాయలసీమ పేపర్ మిల్లులో దినసరి పనిచేసే కార్మికుల సంఖ్య 1577. బదిలీలను, కాజువల్ వర్కర్స్‌ను కలుపుకుంటే 3000 మంది అవుతారు. అడవి కూపులలో వెదురు, కలప కొట్టే కూలీలను, ఆ ముడిసరుకును మిల్లుకు సరఫరా చేసే పనిలో నియుక్తులయిన వారిని లెక్కపెట్టుకుంటే మొత్తం 5000 మంది కార్మికులు ఈ పేపర్ మిల్లుపై ఆధారపడి బ్రతికేవారు. వీళ్ళ కుటుంబాల జనాభా లెక్క పెడితే 25 వేల నుండి 30 వేల మంది జీవులవుతారు. అడవిలో కట్టెకొట్టి లాట్లు పెట్టి లోడ్ చేసేవారి వేతనం ఎక్కువ లేకున్నా, ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు మాత్రం నెలకు 2000 రూపాయల దాకా సంపాదించేవారు. ఈ జనమంతా అయిదేళ్ళుగా ఆకలినీ నిరుద్యోగాన్నీ అనారోగ్యాన్నీ ఎదుర్కొని బ్రతుకు ఈడుస్తున్నారు. ఈడ్వలేని వాళ్ళు చస్తున్నారు. కార్మికులలో 54 మంది ఇప్పటికే మిల్లు రుగ్మతకు బలయి చనిపోయారనీ, వారిలో 10 మంది ఆత్మహత్య చేసుకున్నారనీ మిల్లు యూనియన్ నాయకులయిన సి.ఐ.టి.యు నాయకులు అంటారు.

అతి స్వల్ప వాటాతో మిల్లు మేనేజ్‌మెంట్‌ను చేజిక్కించుకున్న టి.జి కుటుంబం మిల్లు ప్రయోజనాల కంటే తమ స్వప్రయోజనాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చి మిల్లును నష్టాల బాటలో పెట్టింది. 'సోదర సంస్థలు'గా తామే స్థాపించిన ఇతర మిల్లులకూ

వర్తక సంస్థలకూ అక్రమ లాభాలు సంపాదించి పెట్టడానికి ఈ మిల్లును వాడుకుంది. సకాలంలో సహాయంచేసి మిల్లును ఆదుకునే అవకాశం ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం ఈ మిల్లు యాజమాన్యం కాంగ్రెస్ వారన్న కక్షతో, ఎందరు ఎన్నిసార్లు ప్రాధేయపడినా చిన్న వేలు కూడ కదపలేదు. భద్రాచలంలోని గుత్తపెట్టుబడిదారీ కంపెనీకి చెందిన పేపర్ మిల్లుకు ఇచ్చిన రాయితీ సైతం ఈ 'తెలుగు సోదరుడి' మిల్లుకు ఇవ్వలేదు. ఫలితంగా తెలుగుదేశం పాలన చివరి దశలో రాయలసీమ పేపర్ మిల్లు బి.ఐ.ఎఫ్.ఆర్ చేత 'ఖాయిలా' అని ముద్ర వేయించుకుంది. అయితే ఆ తరువాత కూడ బ్యూరోక్రాటిక్ జాప్యం వల్ల, కాంగ్రెస్ ప్రభుత్వం అలసత్వం వల్ల, ప్రభుత్వరంగ ద్రవ్య సంస్థల అనాసక్తి వల్ల, బి.ఐ.ఎఫ్.ఆర్ చాదస్తం వల్ల, మిల్లు యజమాని జిత్తులమారి ఎత్తుగడల వల్ల మిల్లు పునరుద్ధరణ అనంతంగా వాయిదా పడుతూనే ఉంది. ఆకలితో కడుపులు మాడ్చుకుంటున్న కార్మికుల కుటుంబాలు ఆశగా మిల్లు గేట్లు ఎప్పుడు తెరుచుకుంటాయా అని ఎదురుచూస్తూ ఉన్నారు. యూనియన్ ఎప్పుడు పిలుపు ఇచ్చినా ధర్నాలలో, పాదయాత్రలలో, ఊరేగింపులలో, ఇతర ఆందోళనలలో పాల్గొంటూనే ఉన్నారు.

ఇదీ క్లుప్తంగా, రాయలసీమ పేపరు మిల్లు రోగగ్రస్త చరిత్ర. ఇంక వివరాలు చూద్దాం.

## మిల్లు పుట్టుక - పతనం

రాయలసీమ పేపర్ మిల్లు జాయింట్ సెక్టర్ పరిశ్రమ. ప్రధాన వాటాదారులు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎ.పి.ఐ.డి.సి), ఆదోనికి చెందిన టి.జి గ్రూపు. కంపెనీని 1974లో రిజిస్టర్ చేశారు. 1979 నుండి ఉత్పత్తి ప్రారంభం అయింది. మొత్తం ప్రారంభ పెట్టుబడి 45.41 కోట్ల రూపాయలు. అందులో ఎ.పి.ఐ.డి.సి, టి.జి. గ్రూపుల వాటా చెరి 1.5 కోట్ల రూపాయలు మాత్రమే. బ్యాంకు రుణాలు (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సిండికేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, ఆంధ్రా బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కార్పొరేషన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, దేనా బ్యాంక్, వైశ్యా బ్యాంక్, యూకో బ్యాంక్) 10.45 కోట్లు. కేంద్ర ప్రభుత్వ ద్రవ్య సంస్థల రుణాలు (లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, జనరల్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండస్ట్రియల్ ఫైనాన్స్

కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) 19.5 కోట్ల రూపాయలు, పబ్లిక్ షేర్లు 8 కోట్లు, మిగిలినది ఇతర రుణాలు.

మొదట్లో మిల్లు ఉత్పాదన సామర్థ్యం సంవత్సరానికి 42,000 టన్నుల కాగితం. 1983-84లో 7.25 కోట్ల రూపాయల ఖర్చుతో ఇంకొక యంత్రం కొనుక్కొచ్చారు. దానితో మిల్లు సామర్థ్యం 61,800 టన్నులకు పెరిగింది. 45.41 కోట్ల రూపాయల మూల ధనంలో టి.జి. గ్రూపుది కేవలం 1.5 కోట్లే అయినా మేనేజ్‌మెంట్‌లో ముఖ్యస్థానం వారిదే. దాని మేనేజింగ్ డైరెక్టర్ టి.జి. వసంతగుప్తా, కమర్షియల్ మేనేజర్ టి.జి. వెంకటేష్ గుప్తా. వీళ్ళిద్దరూ అన్నదమ్ముల కొడుకులు. వీరి తాతగారయిన టి.జి. లక్ష్మయ్య ఆదోనికి చెందిన వర్తకుడు. అక్కడ వారికి నూనె మిల్లులు, దలాలి వర్తకం ఉండేవి. రాయలసీమ పేపర్ మిల్లుతోనే ఆ కుటుంబం పెద్ద పరిశ్రమలోకి ఆధునిక పరిశ్రమలోకి అడుగుపెట్టింది. టి.జి. లక్ష్మయ్య మనవలు ఇప్పుడు కోటీశ్వరులయ్యారు. వాళ్ళకు ఆదోనిలోను, కర్నూలులోనే కాక మద్రాసులో, కాకినాడలో, ఇతర ప్రాంతాలలో వివిధ రకాల పరిశ్రమలు, వ్యాపారాలు (సిమెంటు, రసాయన పదార్థాలు, సున్నపురాయి, నాపరాయి, యంత్ర పరికరాలు, రవాణా వగైరా), సినిమా టాకీసులు, ఆస్పత్రులు ఉన్నాయి. కానీ వాళ్ళ యాజమాన్యంలో వున్న పేపరు మిల్లు మాత్రం 1985 దాకా బాగానే నడిచి, ఇంధనం పొదుపుకు ఒక అవార్డు, కాలుష్య నివారణకు ఒక అవార్డు, అధిక ఉత్పత్తి సాధించినందుకు ఒక అవార్డు పొంది, 1986తో మొదలుపెట్టి నష్టాలలో కూరుకొనిపోయి 1989 నాటికి ఖాయిలాపడి మూతపడింది. దాంతో మిల్లు నడపడంలోను, ముడిసరుకు సేకరణలోను పనిచేసిన 5000 కార్మికుల కుటుంబాలు వీధిపాలయ్యాయి.

మేనేజ్‌మెంట్ స్వంత ఆస్తులు పెరుగుతుండగా మిల్లు మూతపడిన ఉదంతం ఇదే మొదటిది కాదు. ఆ ఆస్తులు పెరిగిన క్రమంలోనే ఈ మిల్లు మూతపడిందన్న అభియోగం ఉన్న మొదటి యాజమాన్యమూ ఇదే కాదు. రాయలసీమ పేపరు మిల్లు కథ ఖాయిలా మిల్లుల చరిత్రలో ఒక ఒరవడికి చెందినది.

ఖమ్మం జిల్లా భద్రాచలంలోని భద్రాచలం పేపర్ అండ్ బోర్డ్స్ లిమిటెడ్ అనే కాగితం మిల్లు దీనితోబాటే ఏర్పడింది. రెండు మిల్లులకూ అనుమతి (లెటర్ ఆఫ్ ఇంటెంట్) 1974లోనే ఇచ్చారు. కొద్ది హెచ్చుతగ్గులతో రెండిటి పరిమాణం ఒక్కటే.

కార్మికుల సంఖ్య కూడ దాదాపు ఒక్కటే. ఆ మిల్లు ఆనాటి నుండి ఈనాటి దాకా లాభాలతో నడుస్తుండగా రాయలసీమ పేపర్ మిల్లు బాలారిష్టాల నుండి గట్టెక్కవలసిన సమయంలో ఖాయిలాపడి చివరికి మూతపడింది. 1989 మార్చి 31 నాటికి (అంటే మిల్లు స్థాపనకు రుణ పెట్టుబడి పెద్దఎత్తున పెట్టిన బ్యాంకులు, ద్రవ్య సంస్థలు బి.ఐ.ఎఫ్.ఆర్‌కు అర్జీ పెట్టేనాటికి) రాయలసీమ పేపర్ మిల్లు పోగుచేసుకున్న నష్టాలు 42.3 కోట్ల రూపాయలు. ఇతర లయబిలిటీస్ లెక్కగడితే నికర నష్టం 54.43 కోట్ల రూపాయలని తేలింది. ఇందులో 20 కోట్ల నష్టం 1987-89 సంవత్సరాల కాలంలోనే వచ్చింది. మిల్లు బకాయిలు అప్పటికి ఈ విధంగా ఉన్నాయి. బ్యాంకులకు ఇయ్యవలసింది 33.58 కోట్లు, కేంద్ర ద్రవ్య సంస్థలకు ఇయ్యవలసింది 47.73 కోట్లు, వెదురు, కలప రాయల్టీ బకాయిలు 4.49 కోట్లు (కరెంటు, అమ్మకం పన్ను బకాయిలు కూడ ఉన్నాయి కానీ అవి లక్షలలోనే ఉన్నాయి). 1989 సెప్టెంబర్ నుండి కంపెనీ కార్మికులకు జీతాలు ఇవ్వడం మానేసింది. ఆఫీసు సిబ్బందికి అంతకంటే ఒక నెల ముందు నుండే జీతాలు ఇవ్వడం మానేసింది. 1987-88 సంవత్సరానికి కార్మికులకు ఇయ్యవలసిన బోనస్ బాకీ పెట్టింది. ముడిసరుకు సరఫరా చేసిన వర్తకులకు కూడ పెద్దఎత్తున బాకీలు పెట్టింది. 1989 చివరి నాటికి మిల్లు నష్టాలు 71 కోట్ల రూపాయలకు చేరాయి. ప్రావిడెంట్ ఫండ్ బకాయి (1989 మే నుండి ఆ సంవత్సరం ఆఖరుదాకా) 15.93 లక్షలు, ఇ.ఎస్.ఐ. బకాయి (1987 ఆగస్ట్ నుండి 1989 ఆఖరు దాకా) 26.7 లక్షలు అయింది.

ఇదే సమయంలో రాయలసీమ పేపర్ మిల్లుతో చాలా పోలికలున్న భద్రాచలం పేపర్ అండ్ బోర్డ్స్ తన షేర్‌హోల్డర్లకు 30 శాతం డివిడెండ్ ప్రకటించగలిగింది. కార్మికులకు 34 శాతం బోనస్ ఇవ్వగలిగింది. నిజానికి 1983లో భద్రాచలం మిల్లు కంటే రాయలసీమ పేపర్ మిల్లే ఎక్కువ ఉత్పత్తి చేసింది, ఎక్కువ అమ్మింది, ఎక్కువ లాభం పొందింది. ఆరేళ్ళకే పరిస్థితి తలక్రిందులయింది.

రుణం రూపంలో మిల్లులో భారీ ఎత్తున పెట్టుబడి పెట్టిన బ్యాంకులు, కేంద్ర ద్రవ్య సంస్థల తరఫున స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా చొరవ తీసుకొని రాయలసీమ పేపర్ మిల్లు ఖాయిలా పడిపోయిందంటూ 1989 మార్చి 31న బి.ఐ.ఎఫ్.ఆర్‌కు అర్జీ పెట్టింది. బి.ఐ.ఎఫ్.ఆర్ ఆ అర్జీపైన జరిపిన విచారణకు బ్యాంకుల ప్రతినిధులు,

కేంద్ర ద్రవ్య సంస్థల ప్రతినిధులు, మిల్లు కార్మిక యూనియన్ ప్రతినిధులైన సి.ఐ.టి.యు నాయకులు హాజరయ్యారు. మిల్లు ఖాయిలా పడడానికి ప్రధాన లేక ముఖ్య కారణం మేనేజ్‌మెంట్ వైఫల్యం అని అందరూ బి.ఐ.ఎఫ్.ఆర్‌కు వివరించారు. అయితే మేనేజ్‌మెంట్ వైఫల్యం అనేది చాలా రకాలుగా ఉంటుంది. పెట్టుబడి దుర్వినియోగం ఉండవచ్చు. మార్కెట్‌ను సరిగ్గా అంచనా వేయలేక పోవడం కావచ్చు. అంచనా వేసినా తదనుగుణంగా ఉత్పత్తిని నిర్వహించడంలో వైఫల్యం ఉండవచ్చు. ముడిసరుకు, లేక ఇతర అవసరాల కొనుగోలులో నాణ్యత గురించి తగు జాగ్రత్త తీసుకోకపోవడం కావచ్చు. అనవసర వ్యయం ఉండవచ్చు. ఇవన్నీ కాక, మిల్లు ప్రయోజనాలను వేరే అవసరాలకు తాకట్టుపెట్టే దగాకోరుతనం ఉండవచ్చు.

రాయలసీమ పేపర్ మిల్లు యాజమాన్యం ద్రోహపూరిత చర్యలే మిల్లు 'సిక్' కావడానికి కారణమని బి.ఐ.ఎఫ్.ఆర్ ఎదుట యూనియన్ నాయకులు వాదించారు. రాయలసీమ పేపర్ మిల్లు స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ తొలినాటి నుండి సి.ఐ.టి.యు నాయకత్వంలో ఉంది. యూనియన్ అధ్యక్షులు ప్రహ్లాదరెడ్డి, కార్యదర్శి రాజేశ్వరరెడ్డి కాగా గౌరవ అధ్యక్షులు సి.పి.ఐ(ఎం) నాయకులు గఫూర్.

మిల్లు నిర్మాణం దగ్గరి నుండి నిర్వహణ వరకు అన్ని దశలలోనూ మిల్లు ప్రయోజనాలకు కాక తమ స్వంత ప్రయోజనాలకు యాజమాన్యం ప్రాముఖ్యం ఇచ్చిందని కార్మిక నాయకులు సోదాహరణంగా వాదించారు. కేవలం 1.5 కోట్ల రూపాయల పెట్టుబడితో 45 కోట్ల మూలధనం గల మిల్లుపైన పెత్తనం చేజిక్కించుకున్న టి.జి. గ్రూపు మిల్లు బాగోగులను పట్టించుకోకుండా తమ ఇతర ఆస్తులు పెంచుకోవడానికి దీనిని పణంగా పెట్టారన్నారు. పేపర్ మిల్లుకు సంబంధించిన కొనుగోలు, అమ్మకం, రవాణా యావత్తు తమ కుటుంబానికే చెందిన ఇతర కంపెనీల ద్వారా చేసేవారనీ, ఎక్కువ ధరకు నాసిరకం వస్తువులను కొనుగోలు చేసి, అనవసరమైన కమిషన్‌లు, బోగస్ డిస్కౌంట్లు ఇచ్చి ఈ మిల్లు పెట్టుబడినీ, ఉత్పత్తి నాణ్యతనూ దెబ్బదీసి తమ ఇతర ఆస్తులను పెంచుకున్నారనీ యూనియన్ నాయకులు అన్నారు. అంటే టి.జి. కుటుంబానికి చెందిన ఇతర మిల్లులు, వ్యాపారాలు పరాన్నభుక్కులుగా (పారసైట్ యూనిట్స్) పేపర్ మిల్లు రక్తమాంసాలు పీల్చి ఎదిగాయని అర్థం.

ఉదాహరణకు కాగితాన్ని బ్లీచ్ చేయడానికి అవసరమైన రసాయనిక పదార్థాలను వారు తమ గ్రూపుకే చెందిన ద్రోణాచలం లైమ్ అండ్ మినరల్స్ అనే కంపెనీ దగ్గర కొనేవారు. దానికి తక్కువ సాంద్రత ఉన్నా ఎక్కువ ఉందని సర్టిఫై చేసి కొనుగోలు చేసి వాడడం వల్ల కాగితం బ్లీచింగ్ సరిగ్గా జరగక నాణ్యత తగ్గిపోయేది. '1984లో కాబోలు ఒకసారి దాదాపు 10 కోట్ల విలువగల తెల్లకాగితం మార్కెట్లో తిరస్కరించబడింది' అని ఒక యూనియన్ నాయకుడు జ్ఞాపకం చేసుకుంటాడు. అదే విధంగా పేపర్ మిల్లుకు కావలసిన యంత్ర పరికరాలను, విడిభాగాలను తమలో ఒకడైన టి.జి. వీరప్రసాద్ యాజమాన్యంలో వున్న తుంగభద్ర మిషనరీ అండ్ టూల్స్ కంపెనీ వద్ద కొనేవారు. మార్కెట్ ధర కంటే ఎక్కువ చెల్లించి కొనేవారు. మిల్లుకు ముడిసరుకు సరఫరా చేయడానికి, ఉత్పత్తయిన సరుకును రవాణా చేయడానికి తమ కుటుంబానికే చెందిన నీతూ ట్రాన్స్‌పోర్ట్స్ తదితర లారీ కంపెనీలను వినియోగించేవారు. ఈ కంపెనీలు వసూలు చేసే లారీ బాడుగ మార్కెట్ రేటు కంటే 50 లేదా 75 శాతం ఎక్కువ కూడ ఉండేదని కార్మిక నాయకులంటారు.

ఈ విధంగా టి.జి. కుటుంబం పేపర్ మిల్లుకు సంబంధించిన అన్ని లావాదేవీలు తమ వ్యాపార సంస్థల చేతులమీదుగా జరిపించి ఆ సంస్థలకు విపరీతంగా లాభాలు సమకూర్చుకున్నారు. పేపర్ మిల్లు అతి స్వల్ప పెట్టుబడితో తమ యాజమాన్యంలోకి వచ్చింది కాబట్టి తమకు పోయిందేమీ లేదనుకున్నారు. ఈ దుర్మార్గం ప్రధానంగా మిల్లు కమర్షియల్ మేనేజర్ అయిన టి.జి. వెంకటేశ్ గుప్తా చేతుల మీదుగా జరిగింది. అతనితో మేనేజింగ్ డైరెక్టర్ వసంత గుప్తాకు తేడాలు వచ్చి 1986లో వెంకటేశ్ గుప్తా మిల్లు నుండి బయటకుపోయాడు. అప్పటికే అతను ఒక ధనిక పారిశ్రామికవేత్త అయ్యే బాటలో పడ్డాడు. అతనికున్న అనేక సంస్థలలో పెద్దది, ప్రతిష్టాత్మకమైనది రాయలసీమ పేపర్ మిల్లుకు పొరుగునే ఉన్న రాయలసీమ ఆల్కలీస్ అండ్ అలైడ్ కెమికల్స్ లిమిటెడ్. ఆ మిల్లు నెలకొల్పే పనిలో అతను పేపర్ మిల్లు కార్మికులనూ సిబ్బందినీ విరివిగా వాడుకున్నాడని కార్మికులంటారు. 'ఆ మిల్లు పూర్తి అవుతున్నదంటేనే ఇది ఇంక మూతపడుతుందని మేము ఊహించాము' అని కార్మికులు అంటారు.

అసలు పేపర్ మిల్లు నెలకొల్పడం కోసం భూమి కొనుగోలు చేసినప్పుడే మోసం మొదలైందని సి.ఐ.టి.యు. నాయకులు అంటారు. ఎకరం భూమి 1000,

లేక 1200 రూపాయలకు కొని 5,000 రూ॥లకు రిజిస్టర్ చేశారంటారు. పేపర్ అమ్మకంలో తమ కుటుంబానికే చెందిన డీలర్లను పెట్టుకొని అనవసరమైన కమిషన్లు, డిస్కౌంట్లు ఇచ్చేవారంటారు. చివరి దశలో మిల్లు నిర్వహణకు పెట్టుబడి కరువైనప్పుడు కొనుగోలుదారుల నుండి పెద్ద మొత్తంలో అడ్వాన్సులు తీసుకుందనీ, అయితే టి.జి. గ్రూపుకే చెందిన శిరీష్ ఎక్స్‌పోర్ట్స్, స్వస్తిక్ కార్పొరేషన్, ప్రతాప్ సప్లయర్స్ తదితర వర్తక సంస్థల ద్వారా తీసుకున్న ఈ అడ్వాన్సులు మిల్లుకు చెందకుండా వేరే ప్రయోజనాలకు మళ్ళించబడ్డాయని అంటారు.

పేపర్ మిల్లును ముంచడంలో టి.జి. గ్రూపుకు మోసపూరితమైన దురుద్దేశ్యం వుందని మిల్లు కార్మిక సంఘం అంటూండగా, మిల్లులో వాటాదారు అయిన ఎ.పి.ఐ.డి.సి, మిల్లుకు రుణం రూపంలో అపారంగా పెట్టుబడి పెట్టి నష్టపోయిన బ్యాంకులు, కేంద్ర ద్రవ్య సంస్థలు మిల్లు మేనేజ్‌మెంట్‌ను ఇంకొంచెం మర్యాద పూర్వకంగా అభిశంసించాయి. యాజమాన్య వైఫల్యం మిల్లు రుగ్మతకు ఒక ముఖ్య కారణం అని వారంతా బి.ఐ.ఎఫ్.ఆర్. ఎదుట ప్రకటించారు. ఒక అవసరం కోసమని చెప్పి తమ దగ్గర పెద్ద మొత్తం అప్పు తీసుకొని వేరొక ప్రయోజనానికి దానిని వినియోగించిన ఉదంతాలు రెండు బ్యాంకులు ఉదహరించాయి. తమ బ్యాంకు వద్ద అటవీ పునరుద్ధరణ కోసమని చెప్పి మిల్లు యాజమాన్యం 65 లక్షల రుణం తీసుకొని దానిని అందుకోసం ఉపయోగించకుండా పాత బాకీలు తీర్చడానికి, ఇతర ఖర్చులకు వినియోగించారని సిండికేట్ బ్యాంక్ ప్రతినిధి బి.ఐ.ఎఫ్.ఆర్‌కు చెప్పారు. కెనరా బ్యాంకు నుండి కూడ అదే పేరుమీద 40 లక్షల రుణం తీసుకుని వేరే అవసరాలకు ఉపయోగించారని ఆ బ్యాంకు ప్రతినిధి కూడ తెలియజేశాడు. అటవీ పునరుద్ధరణను ఈ రకంగా వేరే ప్రయోజనాల కోసం నిర్లక్ష్యం చేస్తే ముడిసరుకు నిరంతరాయంగా దొరకడం కష్టం అవుతుంది.

మిల్లు మేనేజ్‌మెంట్ మాత్రం మిల్లు రుగ్మతకు వేరే కారణాలు చూపించింది. ప్రాథమిక సాంకేతిక సమస్యల నుండి మిల్లు బయటపడలేకపోయిందని, కాగితం పరిశ్రమలో మాంద్యం నెలకొందని, ముడిపదార్థాల కొరత ఏర్పడిందని, మార్కెట్‌లో పోటీ పెరిగిందని, వినియోగ వస్తువుల ధరలు పెరగడం వలన ఖర్చు పెరిగిందని చెప్పింది. సాంకేతిక సమస్యల నుండి బయటపడలేకపోవడం, పోటీకి తట్టుకోలేక

పోవడం యాజమాన్య వైఫల్యాల కిందికే వస్తాయి. ఎందుకంటే రాయలసీమ పేపర్ మిల్లుతో సమాంతరంగా ఉనికిలోకి వచ్చిన భద్రాచలం పేపర్ అండ్ బోర్డ్స్ ఈ సమస్యలను ఎదుర్కొని ఎదగగలిగింది. చీడ పురుగులను ప్రతిఘటించగల కొత్తరకం యూకలిఫ్టస్ మొక్కను భద్రాచలం కంపెనీ కనుగొని ప్లాంటేషన్లు వేసి పెంచసాగింది. ఆ కంపెనీ యజమానులు సిగరెట్ పరిశ్రమలో గుత్తాధిపత్యం గల ఐ.టి.సి గ్రూపు. అటువంటి మేనేజ్‌మెంట్‌కు వుండే అవకాశాలు కర్నూలుకు చెందిన ఒక చిన్న పెట్టుబడిదారుకు వుండవని వాదించవచ్చు. కాని దానికి కావలసిన వైఖరి ఈ మేనేజ్‌మెంట్‌కు వుందా అనేది అసలు ప్రశ్న. ఆదోనిలో దలాలి వర్తకం చేసినట్టే పేపర్ మిల్లును నడపవచ్చుననే వైఖరి యాజమాన్యంలో వున్నప్పుడు ఇతర అవకాశాల గురించి మాట్లాడడం అనవసరం కాకున్నా అప్రధానం అవుతుంది.

కాగితం పరిశ్రమలో మాంద్యం వుందనేది అవాస్తవం, లేదా అతిశయోక్తి అనాలి. ప్రధాన కాగితం ఉత్పత్తులలో ఒక్క న్యూస్‌ప్రింట్ ఉత్పత్తి మాత్రమే 1985 నుండి 1989 వరకు (అంటే రాయలసీమ పేపర్ మిల్లు రోగగ్రస్తమయిన కాలంలో) కొంత మాంద్యానికి గురి అయింది. అయితే 1985కు ముందు న్యూస్‌ప్రింట్ ఉత్పత్తి అతి వేగంగా పెరిగింది. 1989 తర్వాత కూడ బాగానే పెరిగింది.

**భారతదేశంలో న్యూస్ ప్రింట్ ఉత్పత్తి**

(లక్షల టన్నులు)

| 1982 | 83 | 84 | 85 | 86 | 87 | 88 | 89 | 90 | 91 |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1.01 | 1.6 | 1.99 | 2.58 | 2.69 | 2.58 | 2.77 | 2.68 | 2.86 | 2.93 |

*(ఎనకామిక్ టైమ్స్, 17. 8. 1994)*

రాయలసీమ పేపర్ మిల్లు మొత్తంగా గాని, ప్రధానంగా గాని న్యూస్‌ప్రింట్ ఉత్పత్తి మీదే ఆధారపడి వుంటే 1985-89 కాలంలో న్యూస్‌ప్రింట్ ఉత్పత్తిలో వచ్చిన మాంద్యానికీ ఈ మిల్లు రుగ్మతకూ సంబంధం చూడవచ్చు. కాని ఈ మిల్లు న్యూస్‌ప్రింటే కాక ఇతర ప్రింటింగ్ పేపర్, బాండు పేపర్, ఇన్‌లాండు లెటర్ పేపర్, పాకేజింగ్ పేపర్ మొదలైన అన్ని రకాల కాగితం ఉత్పత్తి చేసేది. మొత్తం కాగితం పరిశ్రమలో 1980లలో మాంద్యమేమీ లేదు. పెరిగిన మిల్లుల సంఖ్యను, ఉత్పత్తి విలువను,

పెట్టుబడులను పైన ఉదహరించాము. కాగితం పరిశ్రమ ఉత్పత్తికి సంబంధించిన గణాంకాలు ఈ విషయాన్ని ఇంకా స్పష్టం చేస్తాయి.

| భారతదేశంలో కాగితం పరిశ్రమ ఉత్పత్తి (లక్షల టన్నులు) | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1950-51 | | 1960-61 | | 1970-71 | 1980-81 | 1985-86 |
| 1.16 | | 3.49 | | 7.55 | 11.49 | 15.17 |
| 1986-87 | 1987-88 | 1988-89 | 1989-90 | 1990-91 | 1991-92 | 1992-93 |
| 15.69 | 16.62 | 17.26 | 18.23 | 20.88 | 21.22 | 21.52 |
| *(ఎకనామిక్ సర్వే, 1993-94)* | | | | | | |

ఖర్చులు పెరిగాయి, ముడిసరుకు కొరత ఏర్పడింది అని మేనేజ్‌మెంట్ చెప్పిన కారణాల్లో కొంత నిజం ఉంది. అయితే ఇది కూడ సహజ సిద్ధంగా ఏర్పడిన పరిస్థితి కాదు. మేనేజ్‌మెంట్ అసమర్థతకు, అవినీతికి కొన్ని రాజకీయ కారణాలు తోడయి ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ రాజకీయ కారణాలకు కార్మిక సంఘం కాని, మేనేజ్‌మెంట్ కాని ఏ కారణంగానో బి.ఐ.ఎఫ్.ఆర్ ఎదుట వాదించేటప్పుడు ప్రాముఖ్యం ఇవ్వలేదు. బయట మాత్రం వాటి గురించి బాహాటంగానే మాట్లాడారు. మిల్లు కార్మిక సంఘం 1988 ఫిబ్రవరి 10న వేసిన ఒక కరపత్రంలో, "మిల్లు నష్టాలకు యాజమాన్యం స్వార్థపూరిత చర్యలు, అక్రమ నిధుల మళ్ళింపు కారణంగా కాగా ప్రస్తుతం ఏర్పడిన సంక్షోభానికి మాత్రం రాష్ట్ర ప్రభుత్వమే కారణమనేది నిర్వివాదాంశం" అన్నారు. అదే సంవత్సరం అదే నెల ఆరవ తేదీన మిల్లు యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక కార్యదర్శికి రాసిన లేఖలో కూడ భద్రాచలం కంపెనీకీ, ఎ.పి. రేయాన్స్ కంపెనీకీ చూపించిన ఔదార్యం తనకు ప్రభుత్వం చూపించకపోవడం పట్ల ఆక్షేపణ తెలియజేసింది. అయినా 1989లో ప్రారంభమైన బి.ఐ.ఎఫ్.ఆర్. విచారణలో ఏ కారణంగానో ఇరుపక్షాలు ఈ విషయానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. అది దురదృష్టకరమైన విషయం. మన దేశ అధికార రాజకీయాలు ముఠా కొట్లాటల స్థాయికి దిగజారడం వల్ల జనజీవనంలోని అన్ని రంగాలు దెబ్బతిన్నట్లే పారిశ్రామిక రంగం కూడ దెబ్బతినింది. సహజంగానే ముఠా సంస్కృతికి నిలయమైన రాయలసీమ జిల్లాలలో ఇది మరీ ఎక్కువగా జరిగింది. ఇదే కర్నూలు పట్టణంలోని ఎ.పి. కార్బైడ్స్ లిమిటెడ్

అనే కంపెనీ కేవలం వై.యస్.రాజశేఖరరెడ్డి దాని యజమాని అయినందువల్ల పునరుద్ధరణకు నోచుకోలేకపోయింది. రాయలసీమ పేపర్ మిల్లు విషయంలో కూడ యజమానుల దగాకోరు ప్రవర్తనకు తెలుగుదేశం నేత ఎన్.టి. రామారావు కుళ్ళుబోతుతనం తోడయింది. రెండూ కలిసి మిల్లును కాటికి పంపించాయి. యాజమాన్యం పైన చర్య తీసుకొని (ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎ.పి.ఐ.డి.సి పెట్టుబడి, బ్యాంకుల పెట్టుబడి, ద్రవ్య సంస్థల పెట్టుబడి మిల్లులో చాలా వుంది. కాబట్టి ఇది అసాధ్యం కాదు) మిల్లును కాపాడే బదులు, యాజమాన్యంపై కక్షతో తెలుగుదేశం ప్రభుత్వం మిల్లు పతనానికి దోహదపడింది. ఐదువేల కార్మిక కుటుంబాల జీవనం విషయంలో రాజకీయ పక్షపాతంతో వ్యవహరించే నేతను క్షమించి ఉపేక్షించకూడదు.

వెనుకబడిన ప్రాంతాలలో నెలకొల్పే పరిశ్రమలకు రాయితీలిచ్చే అలవాటు మన దేశ ప్రభుత్వాలకు ఉంది. అలాగే రాయలసీమ పేపర్ మిల్లు నెలకొల్పినప్పుడు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని రాయితీలు ప్రకటించింది. మిల్లు అడవి నుంచి తెచ్చుకునే వెదురు, కలపలకు ప్రభుత్వానికి చెల్లించే రాయల్టీలో 50 శాతాన్ని 10 ఏళ్ళు మినహాయిస్తామన్నారు. 5 ఏళ్ళు కరెంటు బిల్లులో 25 శాతం మినహాయిస్తామన్నారు. పరిశ్రమ నెలకొల్పడానికి అయ్యే ప్రాజెక్టు ఖర్చులో 10 శాతాన్ని వడ్డీలేని అమ్మకం పన్ను రుణంగా ఇస్తామన్నారు. ఈ మినహాయింపులు రాయలసీమ పేపర్ మిల్లుకే కాక, ఖమ్మం జిల్లాలోని భద్రాచలం పేపర్ మిల్లుకు, వరంగల్ జిల్లా కమలాపురం గ్రామం దగ్గరున్న ఎ.పి. రేయాన్స్ కంపెనీకి కూడ ఇస్తామన్నారు.

అయితే అమ్మకం పన్ను రుణం ఇయ్యకపోగా, మిగిలిన రెండు మినహాయింపులు తెలుగుదేశం ప్రభుత్వం రాగానే రద్దయ్యాయి. కొత్తగా నెలకొని, ఇంకా బాలారిష్టాలు తీరని ఈ కంపెనీలు దీనితో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనవలసి వచ్చింది. రాయితీలు పునరుద్ధరించమని మూడు కంపెనీలూ తెలుగుదేశం ప్రభుత్వంతో మొరపెట్టుకున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వం మిగిలిన రెండు మిల్లులతోను రాజీకి వచ్చి రాయల్టీ మినహాయింపు, కరెంటు ఛార్జీల మినహాయింపు మళ్ళీ కల్పిస్తూ 1986లో జీవోయం.ఎస్. 482 (తేదీ 9-9-86) జారీచేసింది. కానీ రాయలసీమ పేపర్ మిల్లుకు మాత్రం రాయితీలు పునరుద్ధరించలేదు.

దీనికి రాజకీయాలు తప్ప వేరే కారణం లేదు. పేపర్ మిల్లు మేనేజింగ్ డైరెక్టర్ వసంతగుప్తా కాంగ్రెసు మనిషి. కర్నూలు జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవి నిర్వహించారు.

అతని పట్ల ఎన్.టి.ఆర్.కు వ్యతిరేకత ఉండడానికి ఇది ఒక కారణం. అంతేకాక ఎన్.టి.ఆర్. ప్రారంభించిన 'తెలుగు సమాచారం' పత్రికకు చవకగా పేపర్ సరఫరా చేయడానికి వసంతగుప్తా నిరాకరించాడనీ, అది కూడ వైషమ్యానికి కారణం అయిందనీ అంటారు. ఈ కారణాలను మనసులో పెట్టుకొని ఎన్.టి.ఆర్. ఇతర మిల్లులకు ఇచ్చిన జీవోయం.యస్. 482 సదుపాయాన్ని ఈ మిల్లుకు ఇవ్వలేదు. ఎన్నిసార్లు మిల్లు యాజమాన్యం, కార్మిక సంఘం, మిత్రపక్షమైన సి.పి.ఐ(యం) నాయకులు విజ్ఞప్తి చేసినా ఇవ్వలేదు. 1988 ఫిబ్రవరి 10వ తేదీన మిల్లు కార్మిక సంఘం ప్రచురించిన కరపత్రంలో ఈ విధంగా అన్నారు.

"మిగతా మిల్లులకు ఇచ్చి రాయలసీమ పేపర్ మిల్లుకు మాత్రమే ఆ రాయితీలు ఇవ్వకపోవడం తీవ్రమైన అన్యాయం తప్ప వేరు కాదు. రాజకీయ కారణాలతో పరిశ్రమలను వేధించడం ఏ ప్రభుత్వం చేసినా అది నేరమే అవుతుంది. ఫలితాలు ఆలోచించక రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఈ దాగుడుమూతల వల్ల 5 వేల కుటుంబాలు ఉపాధిని కోల్పోయి బజారుపాలయ్యే ప్రమాదం వున్నది. ఇప్పటికే మన పట్టణంలోని ఎ.పి. కార్బైడ్స్ రాష్ట్ర ప్రభుత్వం యొక్క రాజకీయ పగసాధింపుకు బలియై మూడు సంవత్సరాల నుంచి మూతపడి వుంది. మేనేజ్‌మెంట్‌ను మార్చడానికి, ఆర్థిక ఆంక్షలు విధించడానికి, కొత్త డైరెక్టర్‌ను నియమించి అదుపు చేయడానికి, ప్రత్యేక ఆడిటింగ్‌ల ద్వారా అక్రమాలను వెలికి తీయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని అవకాశాలు వున్నాయి. అయినా అటువంటి చర్యలేమీ తీసుకోకుండా మేనేజ్‌మెంట్‌పైన కోపంతో ముడిసరుకు కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న వివక్ష రాయలసీమ పేపర్ మిల్లు మూతకు కారణం అవుతున్నది."

1988లోనే ఒకసారి సి.ఐ.టి.యు, సి.పి.ఐ(ఎం) నాయకులు ఎన్టీఆర్‌ను కలిసి రాయితీల పునరుద్ధరణ విషయమై అడగగా, 'శెట్టిగారు దోపిడీ చేసేశాడు. ఇచ్చే సమస్య లేదు' అన్నాడంట. మేనేజ్‌మెంట్ మిల్లును దోచేస్తే మేనేజ్‌మెంట్‌పైన తగు చర్య తీసుకోవాలి. ఆ ప్రయత్నాలను తెలుగుదేశం ప్రభుత్వం చేసిన దాఖలాలు లేవు. మిల్లు పూర్తిగా వసంతగుప్తా స్వంత ఆస్తే అయివున్నా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా జోక్యం చేసుకునే అవకాశం ప్రభుత్వానికి ఉంటుంది. అయితే రాయలసీమ పేపర్ మిల్లు అతని స్వంత ఆస్తి కాదు. దానిలో వివిధ ప్రభుత్వ సంస్థల పెట్టుబడి చాలా

ఉంది. ఆ సంస్థల ప్రతినిధులు మిల్లు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లోనూ ఉన్నారు. 'వీళ్ళు సకాలంలో కంపెనీ వ్యవహారాలను, నిర్వహణలోని అవకతవకలను సమీక్షించి తగుచర్యలు తీసుకొని ఉంటే ఈ సంక్షోభాన్ని నివారించి ఉండవచ్చును' అని 1989లో బి.ఐ.ఎఫ్.ఆర్ మిల్లును 'సిక్' అని ప్రకటించిన ఆర్డర్‌లో అనింది. ప్రభుత్వ పెట్టుబడి అపారంగా ఉండే కంపెనీల నిర్వహణను స్వల్ప వాటాదారులయిన ప్రైవేట్ పెట్టుబడిదార్లకు అప్పగించి, వాళ్ళు దానిని స్వంత ఆస్తి అయినట్టు దుర్వినియోగం చేస్తుంటే చూస్తూ ఊరుకోవడం మన 'సోషలిస్టు తరహా సమాజం' పారిశ్రామిక సంస్కృతిలోని ఒక ప్రముఖమైన దురలవాటు. అయితే కంపెనీలో పెట్టుబడి పెట్టిన ప్రభుత్వ సంస్థలు తమంతట తాము చొరవ తీసుకోకపోయినా రాష్ట్ర ప్రభుత్వం అదిలిస్తే తీసుకునేవే. కానీ అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం దానికి బదులు వెనుకబడిన ప్రాంతంలో ఏర్పడిన పరిశ్రమలకు న్యాయసమ్మతంగా ఇవ్వవలసిన రాయితీలను తొక్కిపెట్టింది. మేనేజ్‌మెంట్ మారినా ఆ రాయితీలు ఇయ్యవలసినవే. వాటిని తొక్కిపెట్టడం మిల్లును దోచేసిన 'శెట్టిగారిని' శిక్షించే చర్య కాదు. అతనిపై కక్షతో మిల్లును మూయించే చర్య. 5 వేల మంది కార్మిక కుటుంబాల కడుపుకొట్టే చర్య. ఒక వెనుకబడిన ప్రాంతం పొట్టగొట్టే చర్య.

అందుకే ఈ చర్యకు బి.ఐ.ఎఫ్.ఆర్ ఎదుట జరిగిన చర్చలలో ప్రాధాన్యం లభించి ఉంటే బాగుండేది.

మేనేజ్‌మెంట్ అశ్రద్ధ, పెట్టుబడిని దుర్వినియోగం చేసే అసమర్థత, కంపెనీని గుల్లచేసి స్వంత ఆస్తులు పెంచుకునే మోసపూరిత దృష్టి లేకుండా ఉండి ఉంటే ఎన్టీఆర్ కక్షసాధింపును కూడ మిల్లు అధిగమించి ఉండేదేమో కానీ అదీ ఇదీ కలిసి మిల్లును వేగంగా నష్టాలపాలు చేశాయి. అటవీ కూపుల నుండి మిల్లు తీసుకున్న వెదురుకూ కలపకూ సకాలంలో మొత్తం రాయల్టీ చెల్లించలేక మిల్లు బకాయిపడే పరిస్థితి వచ్చింది. దానితో రాయలసీమ పేపర్ మిల్లు కోసం రాష్ట్ర ప్రభుత్వం అటవీ కూపులు కేటాయించడం మానుకుంది. (మిల్లు నెలకొల్పిన కొత్తలో ఈ మిల్లు అవసరాలు తీరిన తరువాతే నల్లమల అడవులలో వేరే ఎవరికయినా కేటాయింపులు ఇస్తామన్న ప్రభుత్వ హామీ ఉండింది!) ప్రైవేట్ వెదురు, కలప వ్యాపారస్తులు అప్పుపెడతారు కాబట్టి వాళ్ళ దగ్గర నుండి మిల్లు ముడిసరుకును ఉద్దరకు తెచ్చుకోవడం

మొదలుపెట్టింది. అయితే నిర్వహణ సామర్థ్యం లోపం వల్ల సరయినంత డబ్బులు లేక నాసిరకం సరుకు కొనుక్కొని ఉత్పత్తి నాణ్యతను దెబ్బతీయడం, లేకపోతే అక్కడ కూడ దీర్ఘకాలం బకాయిపెట్టి ముడిసరుకు అరువిచ్చే వారు కూడ లేని స్థితి కల్పించుకోవడం జరిగింది.

1986 నుండే ముడిసరుకు సమస్య ప్రారంభం అయింది. కరెంటుకోత సమస్య కూడ గోరుచుట్టు మీద రోకటి పోటులాగ వచ్చి పడింది. బ్యాంకులకు, కేంద్ర ద్రవ్య సంస్థలకు మిల్లు బాకీలు పెరగనారంభించాయి. 1988 వచ్చేసరికి మిల్లు నిరంతరాయంగా నడవలేని పరిస్థితి ఉత్పన్నం అయింది. నెలకు 6000 నుండి 7000 టన్నుల కాగితం ఉత్పత్తి కావలసి ఉండింది కాని 1988 జనవరిలో 800 టన్నులు మాత్రమే ఉత్పత్తి అయింది. అప్పటికి 6 నెలలుగా కార్మికుల ప్రావిడెంట్ ఫండ్, ఇ.ఎస్.ఐ చెల్లింపులు నిలిచిపోయాయి.

1988 ఫిబ్రవరి నెలలో యాజమాన్యం, కార్మిక సంఘం విడివిడిగా రాష్ట్ర ప్రభుత్వానికి విన్నపాలు సమర్పించాయి. ముడిసరుకు సరఫరా పునరుద్ధరించాలని, రాయల్టీ మినహాయింపు, కరెంటు ఛార్జి మినహాయింపు, అమ్మకం పన్ను రుణం పునరుద్ధరించాలని యిద్దరూ కోరారు. 1988 సెప్టెంబరు నెలలో కార్మిక సంఘం ప్రభుత్వానికి సమర్పించిన మరొక వినతి పత్రంలో ముడిసరుకు లేక మిల్లు వెలవెల పోతూ వుందని చెప్పారు. యార్డులో వెదురు కుప్పలు కుప్పలుగా వుండేదని, ఇప్పుడు యార్డు ఖాళీ అయిందని అన్నారు. దీని ఫలితంగా అప్పటికే అయిదువందల మంది కార్మికులు (200 మంది దినకూలీలు, 300 మంది కాంట్రాక్ట్ కూలీలు) నిరుద్యోగులయ్యారన్నారు. 1984లో జరిగిన వేతన ఒప్పందం గడువు 1987లో తీరిపోయిందని, అయినా కొత్త ఒప్పందానికి రమ్మంటే మేనేజ్‌మెంట్ రావడం లేదని అన్నారు. ప్రావిడెంట్ ఫండ్, ఇ.ఎస్.ఐ చెల్లింపులు యాజమాన్యం ఎగ్గొడుతున్నదని, 1986-87 సంవత్సర కాలపు బోనస్ ఇప్పటికీ ఇవ్వలేదని అన్నారు. మిల్లు నెలకొల్పినప్పుడు ఇస్తామని ఒప్పుకున్న మినహాయింపులు, రాయితీలు ఇప్పటికైనా ప్రభుత్వం పునరుద్ధరించాలని, ఎ.పి.ఐ.డి.సి, ప్రభుత్వం జోక్యం చేసుకొని మిల్లు ఆర్థిక వ్యవహారాలను చక్కబెట్టాలని మరొకసారి కోరారు. ఈ విన్నపాలేమీ తెలుగుదేశం ప్రభుత్వం పట్టించుకోలేదు.

1989 వేసవి కాలంలో మిల్లుకు నీటి సమస్య వచ్చింది. నీటి సరఫరా ఏర్పాటు చేసుకోలేక మిల్లు రెండు నెలలు మూతపడింది. సెప్టెంబరు వచ్చేసరికి ముడిసరుకు లేక ఉత్పత్తి బాగాపడిపోయి కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి వచ్చింది.

## బి.ఐ.ఎఫ్.ఆర్‌కు

1989 మార్చి 31 నాటికి రాయలసీమ పేపరు మిల్లు బ్యాంకులకు 33.58 కోట్లు, కేంద్ర ద్రవ్య సంస్థలకు 47.73 కోట్లు రుణపడి వుందని చూశాం. బ్యాంకులు, ద్రవ్య సంస్థల తరఫున స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ మిల్లును ఖాయిలా మిల్లుగా ప్రకటించమని బి.ఐ.ఎఫ్.ఆర్‌కు అర్జీ పెట్టుకుందని చూశాం. బి.ఐ.ఎఫ్.ఆర్ అక్టోబరు 26న విచారణ జరిపింది. ఈ విచారణ సందర్భంగా మిల్లు కార్మిక సంఘం మేనేజ్‌మెంట్ అనుసరించిన ద్రోహపూరిత వైఖరిని మిల్లు రుగ్మతకు ప్రధాన కారణంగా పేర్కొన్న విషయాన్ని కూడ పైన వివరించాం. మిల్లు పునరుద్ధరణ కోసం కార్మికులు త్యాగాలు చెయ్యడానికి సిద్ధమే కాని, ముందు యాజమాన్యం మారాలని కార్మిక సంఘం కోరింది. బ్యాంకులు, కేంద్ర ద్రవ్య సంస్థలు ఇన్ని వివరాలలోకి పోనప్పటికీ మార్కెట్ సమస్య, పారిశ్రామిక మాంద్యం, ముడిసరుకు కొరత, కరెంటుకోత మొదలైన కారణాలు ఎన్ని చెప్పుకున్నా మిల్లు ఖాయిలా పడడానికి యాజమాన్యం నిర్వహణ లోపం ఒక ముఖ్య కారణమని పేర్కొన్నాయని కూడ చెప్పాం. యాజమాన్య లోపమనేది అశ్రద్ధను, చేతకానితనాన్ని, నిర్లక్ష్యాన్ని సూచించే విమర్శ కావచ్చు. లేకపోతే ఉద్దేశపూర్వకమైన ద్రోహానికి మర్యాదపూర్వకమైన అభిశంసనం కావచ్చు. ఏమైనా బ్యాంకుల, కేంద్ర ద్రవ్య సంస్థల సహకారం లేకుండా మిల్లు పునరుద్ధరణ సాధ్యం కాదు కాబట్టి బ్యాంకులకు పూర్తి విశ్వాసమున్న యాజమాన్యం అవసరమని బి.ఐ.ఎఫ్.ఆర్ గ్రహించింది.

రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి కూడ (అప్పటికి ఇంకా తెలుగుదేశం ప్రభుత్వం తొలగిపోలేదు) ప్రస్తుత యాజమాన్యం మారనిదే రాష్ట్ర ప్రభుత్వం ఏ సహాయం చేయదని బి.ఐ.ఎఫ్.ఆర్ ఎదుట స్పష్టం చేశాడు. మిల్లు రుగ్మతకు యాజమాన్యానిదే బాధ్యత అన్నాడు. అది వాస్తవమే. అయితే వసంతగుప్తా కాంగ్రెసువాడు కాక, తెలుగు దేశం వాడు అయివుంటే, రాష్ట్ర ప్రభుత్వానికి క్షమార్హమైన ఇతర కారణాలు కనిపించేవి

అనేది కూడ వాస్తవమే. యాజమాన్యం మారితే ఈ కింది రాయితీలు ఇవ్వడానికి సిద్ధమేనని రాష్ట్ర ప్రభుత్వం అనింది.

(1) ఏడున్నర సంవత్సరాల దాకా వెదురు, కలపల కొనుగోలుపై చెల్లించే రాయల్టీలో 50% మినహాయింపు.

(2) ఒక కోటి రూపాయల మేరకు వడ్డీ లేకుండా అమ్మకం పన్ను రుణం.

(3) డబ్బు ఎప్పటికప్పుడు చెల్లించేటట్టయితే ఒప్పందం మేరకు ముడిసరుకు సరఫరా.

1988 ఆగస్టులోనే తాము మిల్లు పునరుద్ధరణ కోసం ఒక ప్రణాళిక తయారు చేసినట్టు ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐ.డి.బి.ఐ) ప్రతినిధులు బి.ఐ.ఎఫ్.ఆర్‌తో చెప్పారు. అయితే ప్రస్తుత యాజమాన్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి తీవ్ర అభ్యంతరాలు ఉండడం వల్ల అవి అమలు కాలేదన్నారు. భద్రాచలం పేపర్ అండ్ బోర్డ్సుకు, ఎ.పి రేయాన్స్‌కు ఇచ్చిన మినహాయింపులు తమకు మాత్రం నిష్కారణంగా నిరాకరించారని రాయలసీమ పేపరు మిల్లు యాజమాన్యం చేసిన వాదనకు మీ జవాబు ఏమిటని బి.ఐ.ఎఫ్.ఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించగా 'వాటి పరిస్థితులు వేరు' అని రాష్ట్ర ప్రభుత్వం జవాబు చెప్పింది. మిల్లు మూసివేత విషయంలో తెలుగుదేశం ప్రభుత్వం నిర్వాకం బి.ఐ.ఎఫ్.ఆర్ ఎదుట ఇంతకంటే లోతుగా చర్చకు రాలేదు.

పై వాదనలు విన్న బి.ఐ.ఎఫ్.ఆర్ రాయలసీమ పేపర్ మిల్లును ఖాయిలా యూనిట్‌గా ప్రకటించి దాని బాగోగులు చూసుకోవడానికి ఒక స్పెషల్ డైరెక్టర్‌ను నియమించింది. మిల్లు సహేతుకమైన కాల వ్యవధిలో తన నికర విలువను రుణరాశి నుండి ధనరాశికి గట్టెక్కించే అవకాశం లేదని బి.ఐ.ఎఫ్.ఆర్ భావించింది. అయితే మిల్లు చేసే ఉత్పత్తికి చాలా ఉపయోగం వున్న కారణంగాను, చాలామంది కార్మికుల జీవితాలు మిల్లుతో ముడిపడి వున్న కారణంగాను, కంపెనీని పునరుజ్జీవింపజేసే ప్రయత్నం అవసరమని బి.ఐ.ఎఫ్.ఆర్ భావించి ఆ ప్రయత్నం చేయడం కోసం ఐ.డి.బి.ఐని ఆపరేటింగ్ ఏజెన్సీగా నియమించింది. ఐ.డి.బి.ఐ తన పునరుద్ధరణ రిపోర్టును 1989 డిసెంబరు 31 లోపల అందజేయాలని ఆదేశించింది. మిల్లు యాజమాన్యం ఎ.పి.ఐ.డి.సి, రాష్ట్ర ప్రభుత్వం, ఐ.డి.బి.ఐకి అవసరమైన

సమాచారమంతా నవంబర్ 15 లోపల సమర్పించాలని ఆదేశించింది. ప్రస్తుత యాజమాన్యం మీద ప్రభుత్వానికి, కార్మికులకు విశ్వాసం లేకపోవడమే కాక, బ్యాంకులకు కూడ కొన్ని అనుమానాలు ఉన్నాయి కాబట్టి కొత్త యాజమాన్యాన్ని తీసుకొచ్చే అవకాశం ఉందేమో ఐ.డి.బి.ఐ పరిశీలించాలని సూచించింది. అయితే కొత్తగా ముందుకు వచ్చే ప్రమోటర్ ఎవరైనా మొత్తం పునరుజ్జీవనం ఖర్చులో కనీసం 20% పెట్టుకోవడానికి సిద్ధంగా వుండాలనింది.

ఈ లెక్కన ఎంత ఆలస్యమైనా 1990 గడిచిపోయే లోపల మిల్లు పునరుద్ధరణ జరిగి వుండవలసింది. కాని 1994 సెప్టెంబరు వచ్చినా ఇంకా జరగలేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం, బి.ఐ.ఎఫ్.ఆర్ పద్ధతులలోని జాప్యం, వసంతగుప్తా ఎత్తుగడలు, మారుతున్న ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు, కార్మికుల అగచాట్ల పట్ల ఎవరికీ పట్టింపు లేకపోవడం దీనికి కారణాలు. రాయలసీమ పేపరు మిల్లు బి.ఐ.ఎఫ్.ఆర్ చేతిలోకి పోయిన కొద్ది కాలానికే రాష్ట్రంలో తెలుగుదేశం పాలన పోయి కాంగ్రెసు పాలన వచ్చింది. కాని తెలుగుదేశం ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉండిందో కాంగ్రెసు పాలకులు కూడ అంతే నిర్లక్ష్యంగా వ్యవహరించారు. వాళ్ళ కారణాలు వాళ్ళకుంటే వీళ్ళ కారణాలు వీళ్ళకున్నాయి.

మిల్లు కార్మిక సంఘం 1989 నవంబరు నెలలో ఒక మధ్యంతర ఏర్పాటును ఎ.పి.ఐ.డి.సికి సూచించింది. కొత్త యాజమాన్యాన్ని ఎంపిక చేసే కార్యక్రమం కాల వ్యయంతో కూడుకున్న పని కాబట్టి ఆ లోపల వసంతగుప్తా స్థానంలో ఒక నిపుణుడిని మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమిస్తే, బ్యాంకులకు, డీలర్లకు ముడి సరుకు సరఫరాదార్లకు విశ్వాసం పెరిగి మిల్లు తెరవడం సాధ్యమవుతుందని సూచన చేసింది. ఈ నిపుణుడు ఎవరనేది ఎ.పి.ఐ.డి.సి, ఐ.డి.బి.ఐ నిర్ణయించాలని, లేదా తాము ప్రతిపాదించే పేర్లలో ఒకటి ఎంపిక చేయవచ్చునని కార్మిక సంఘం తన సూచనలలో చెప్పింది. వసంతగుప్తా తన షేర్లు మొత్తం ఎ.పి.ఐ.డి.సికి అమ్మడానికి 1988లోనే సంసిద్ధత వ్యక్తం చేశాడు కాబట్టి ఎ.పి.ఐ.డి.సి అతని షేర్లు మొత్తం కొనేసి నూతన యాజమాన్యం రాకకు మార్గం సుగమం చేయాలని కూడ సలహా యిచ్చింది. ఎ.పి.ఐ.డి.సి ఈ ఆఖరి సూచనను అమలుచేసి వుంటే తర్వాత వచ్చిన కష్టాలలో సగం వచ్చేవి కావు. మిల్లు 1992లోనే తెరుచుకొనేది.

ఈ సూచనలు ఏవీ అమలు కాకపోగా, మేనేజ్‌మెంట్ తానే ఒక మధ్యంతర ఏర్పాటును కాంగ్రెసు ప్రభుత్వం వచ్చిన తర్వాత సూచించింది. ఈ సూచన ప్రకారం తాను మరో 1.5 కోట్ల రూపాయల పెట్టుబడి తీసుకువస్తుంది. బ్యాంకులు ఇంకొక 2.5 కోట్లు అప్పు ఇవ్వాలి. ప్రభుత్వం తగిన రాయితీలు ఇవ్వాలి. అప్పుడు తాను మిల్లు తెరిచి బి.ఐ.ఎఫ్.ఆర్ ద్వారా పునర్వ్యవస్థీకరణ జరిగేదాకా నడుపుతుంది. ఈ ప్రతిపాదనకు బ్యాంకులు, ప్రభుత్వం ఒప్పుకున్నాయి. 1990 జనవరి 18 నుండి మిల్లు తిరిగి పనిచేస్తుందని ప్రభుత్వం ప్రకటించింది కూడ. కాని మేనేజ్‌మెంట్ తాను తీసుకు వస్తానన్న 1.5 కోట్లు తీసుకురాకపోవడం వల్ల ఈ మధ్యంతర ఏర్పాటు అమలుకాలేదు. మిల్లు మూతపడే ఉంది.

ఐ.డి.బి.ఐ మీద బి.ఐ.ఎఫ్.ఆర్ పెట్టిన పునరుద్ధరణ కర్తవ్యం చాలా తీరికగా సాగింది. మిల్లును 'సిక్' అని ప్రకటించి పునరుద్ధరించాలని బి.ఐ.ఎఫ్.ఆర్ తీర్మానించినది 1989 అక్టోబరు 26 నాడు. మళ్ళీ బి.ఐ.ఎఫ్.ఆర్ బెంచి మీదికి రాయలసీమ పేపరు మిల్లు వ్యవహారం 1991 మార్చి 11 దాకా రాలేదు. అంటే ఒకటిన్నర సంవత్సరం కాలయాపన జరిగింది. మిల్లు మీద ఉపాధి కోసం ఆధారపడిన 5 వేల కార్మిక కుటుంబాలు ఆ కాలంలో ఏమి తిన్నాయో, ఎట్లా బ్రతికాయో అడిగినవాడు లేడు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెసు ప్రభుత్వం తాను ఏ రాయితీలు ఇవ్వడానికి సిద్ధంగా వుందో చెప్పడానికి చాలా కాలం తీసుకుంది. ఒక సంవత్సరం పైగా ప్రభుత్వం నుండి స్పందన లేదు. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే మిల్లు కార్మిక సంఘం ముఖ్యమంత్రి చెన్నారెడ్డికి, కార్మికమంత్రి చిత్తరంజన్‌దాస్‌కు, కర్నూలు ఎం.పి. విజయభాస్కర్‌రెడ్డికి వివరమైన వినతిపత్రాలు ఇచ్చి సమస్యను త్వరగా పరిష్కరించవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పినప్పటికీ స్పందనలో ఏ మాత్రం తొందర లేదు. చివరికి 14 నెలలు గడిచిన తరువాత 1991 జనవరి 8న రాష్ట్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలియజేసింది. 'సి.పి.ఎంకు ఓట్లువేసే కార్మికులకు మేమెందుకు సహాయం చేయాలి' అని కాంగ్రెసు ప్రభుత్వం కావాలని జాప్యం చేసిందని కార్మికులు భావిస్తున్నారంటే వాళ్ళను తప్పు పట్టలేము.

కొత్త యాజమాన్యం కోసం ఐ.డి.బి.ఐ ప్రతిపాదనలు ఆహ్వానించింది. టి.జి. గ్రూపు షేర్లు, ఎ.పి.ఐ.డి.సి షేర్లు కొనుక్కొని మిల్లు నడుపుతామని థాపర్ గ్రూపుకు

చెందిన బల్లార్‌పూర్ ఇండస్ట్రీస్, గోయెంకా గ్రూపుకు చెందిన డంకన్ ఆగ్రో ఇండస్ట్రీస్, సింఘానియా గ్రూపుకు చెందిన స్ట్రా ప్రొడక్ట్స్ ముందుకు వచ్చాయి. తాము ఎంత పెట్టుబడి తెచ్చేది, ఎంత వేగంగా పాత బకాయిలు కట్టేది, ప్రభుత్వం నుండి ఏ రాయితీలు కోరేది, బ్యాంకుల నుండి ఎంత రుణ సహాయం కోరేది మూడు గ్రూపులూ చెప్పాయి. బ్యాంకులు, కేంద్ర ద్రవ్య సంస్థలు పాత బాకీల చెల్లింపుకు సంబంధించి కొన్ని రాయితీలు ప్రకటించి అంతకుమించి ఏమీ ఇవ్వబోయేది లేదని, పునరుద్ధరణకు పెట్టుబడి పెట్టబోయేది లేదని, పాత బాకీలను సెటిల్ చేసుకొని తాము మిల్లు నుండి నిష్క్రమిస్తామని అన్నాయి.

ఇతర విషయాలు సమంగా ఉన్నట్టయితే ఎవరైతే తాము ఎక్కువ ఖర్చుపెట్టి ప్రభుత్వం నుండి తక్కువ రాయితీలు కోరతారో వారికే మిల్లు ఇస్తాం అని బి.ఐ.ఎఫ్.ఆర్ చెప్పేసరికి థాపర్, గోయెంకా గ్రూపులు తమ ప్రతిపాదనలను పోటాపోటీగా మార్చుకుంటూ వచ్చాయి. పాత బకాయిల చెల్లింపుకు 12 వాయిదాలు చాలని గోయెంకా గ్రూపు అంటే, తమకు 10 చాలని థాపర్ గ్రూపు అనింది. ఎ.పి.ఐ.డి.సి షేర్లు రెండు లేక మూడు ఏళ్ళలో కొనేస్తామని గోయెంకా ప్రతినిధి అంటే తాము ఇప్పుడు కావాలంటే ఇప్పుడే కొనేస్తామని థాపర్ ప్రతినిధి అన్నారు. కరెంటు, ముడిసరుకు నిరంతరాయంగా సరఫరా చేస్తామన్న హామీ తప్ప ప్రభుత్వం నుండి వేరే ఏ రాయితీ మేము కోరమని థాపర్ గ్రూపు అంటే మాక్కూడా అంతే చాలని గోయెంకా గ్రూపు అనింది.

ఈలోగా వసంతగుప్తా మిల్లును తనకే అప్పగించవలసిందని మరొకసారి అర్జీ పెట్టుకున్నాడు. కానీ బ్యాంకులకు, ప్రభుత్వానికి, కార్మికులకు అతని మీద విశ్వాసం లేనప్పుడు అతని ప్రతిపాదనలు లెక్కలోనికి తీసుకోవడం వృథా అని బి.ఐ.ఎఫ్.ఆర్ తిరస్కరించింది. అయితే వసంతగుప్తా పేపర్ మిల్లు అనే ఈ పాడిగోవును అంత సులువుగా విడిచిపెట్టదలుచుకోలేదు.

థాపర్ గ్రూపు, గోయెంకా గ్రూపు పోటాపోటీగా తమ డిమాండ్లను తగ్గించుకుంటూ వచ్చాయని చెప్పాం కదా! ఇద్దరిలో థాపర్ గ్రూపు ప్రతిపాదనలే మెరుగుగా ఉండడమే కాక ఇద్దరిలోకి కాగితం పరిశ్రమలో అనుభవం వున్నది థాపర్ గ్రూపుకే. రాయలసీమ పేపరు మిల్లు కోసం అర్జీ పెట్టిన బల్లార్‌పూర్ మిల్లే కాక, మహారాష్ట్రలో ఇతర కాగితం

మిల్లులు కూడ వారి యాజమాన్యంలో వున్నాయి కాబట్టి ఈ మిల్లు కూడ వారికే ఇస్తే గుత్తాధిపత్యానికి దారితీస్తుందనే వాదనతో బి.ఐ.ఎఫ్.ఆర్ చివరికి థాపర్ గ్రూపుకు కాక గోయెంకా గ్రూపుకే మిల్లును అప్పగిస్తూ 1991 ఏప్రిల్ 12న ఆర్డర్ జారీ చేసింది.

సదుద్దేశ్యాలతో హాని చేయడం అంటే ఇదే. ఆర్డరు తీసుకున్న గోయెంకా గ్రూపువారు కర్నూలుకు వచ్చి మిల్లు చూసుకొన్నాక పునరాలోచనలో పడ్డారు. తమ ప్రతిపాదనలో తాము కోరిన దానికి అదనంగా బ్యాంకులు 20 కోట్ల రుణం ఇవ్వాలని అన్నారు. మామూలుగా ఆర్డరు జారీచేసిన తరువాత రెండు నెలలు టైము ఇచ్చి బి.ఐ.ఎఫ్.ఆర్ మళ్ళీ సమావేశం జరుపుతుంది. ఈ సమావేశం 1991 జూన్ 18న జరిగింది. అప్పుడు గోయెంకా గ్రూపు ప్రతినిధి తమ కొత్త కోరికను వ్యక్తం చేయగా బ్యాంకులు ఒప్పుకోలేదు. తమ పాత రుణం బకాయిలు సెటిల్ చేసుకొని వెళ్ళిపోతామనీ, మిల్లు పునరుద్ధరణకు పెట్టుబడి పెట్టబోయేది లేదని బ్యాంకులు మరొకసారి అన్నాయి. గత్యంతరం లేక గోయెంకాకు ఇచ్చిన ఆర్డరును బి.ఐ.ఎఫ్.ఆర్ రద్దుచేసింది. అప్పటికీ థాపర్‌కు ఇవ్వడానికి ఇష్టపడక కొత్త ప్రతిపాదనలను పిలిపించి పరిశీలించమని ఐ.డి.బి.ఐని ఆదేశించింది.

## బి.ఐ.ఎఫ్.ఆర్ రెండవ ప్రయత్నం

ఆ విధంగా 1991 గడిచిపోయింది. "త్వరపడకపోతే ఆకలి చావులు జరుగుతాయి జాగ్రత్త" అని మిల్లు కార్మిక సంఘం 1990లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ అధినేతలకు చేసిన విన్నపం నిజమయ్యే రోజు వచ్చింది. థాపర్ గ్రూపుతో ఈసారి జె.కె. సింఘానియా గ్రూపు పోటీపడింది. ఈసారి జె.కె. సింఘానియా గ్రూపు ప్రతిపాదనే మెరుగ్గా వున్నప్పటికీ ఆ గ్రూపు ఆ మధ్యనే బి.ఐ.ఎఫ్.ఆర్ ద్వారా గుజరాత్‌లో ఒక మిల్లు పొంది వుంది కాబట్టి రాయలసీమ పేపర్ మిల్లును వాళ్ళకు ఇవ్వకుండా ఒకప్పుడు గుత్త పెట్టుబడిదారు అని తిరస్కరించిన థాపర్ గ్రూపుకే ఈసారి బి.ఐ.ఎఫ్.ఆర్ ఇచ్చింది. 1992 మార్చి 23వ తేదీన ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. బ్యాంకులు, కేంద్ర ద్రవ్య సంస్థలు కూడ ఈ నిర్ణయాన్ని ఆమోదించాయి. వసంతగుప్తా మళ్ళీ తానే నడుపుతానని ప్రతిపాదించాడు కాని బ్యాంకులు, కేంద్ర ద్రవ్యసంస్థలు, మిల్లు కార్మిక సంఘం అతని మీద తమకు విశ్వాసం లేదని పునరుద్ఘాటించడంతో బి.ఐ.ఎఫ్.ఆర్ అతని

ప్రతిపాదనలను లెక్కలోకి తీసుకోలేదు. తన షేర్లన్నిటినీ అతను 10 రూపాయల షేరును రూ॥ 4.45 పైసలకు లెక్కగట్టి థాపర్ గ్రూపుకు అమ్మాలనీ, ఎ.పి.ఐ.డి.సి కూడ వెంటనే కాకుండా భవిష్యత్తులోనైనా తన షేర్లను థాపర్ గ్రూపుకే అమ్మాలనీ బి.ఐ.ఎఫ్.ఆర్ తీర్పునిచ్చింది.

థాపర్ గ్రూపు ప్రతినిధులు కర్నూలుకు వచ్చి కార్మిక సంఘంతో అన్ని విషయాలు మాట్లాడుకున్నారు. మిల్లు మూసివేసిన కాలానికి మూడున్నర నెలల జీతం ఇస్తామని, అంతకుముందు 1989 జూన్ నుండి 1989 నవంబర్ దాకా ఇవ్వని జీతంలో రెండు నెలల జీతం వెంటనే ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. కార్మికుల నందరినీ వెంటనే పనిలోకి తీసుకోలేకపోయినా ఒక సంవత్సరంలోగా అందరినీ తీసుకుంటామన్నారు. పనిలోకి తీసుకునేంతవరకు 25 శాతం జీతం ఇస్తామన్నారు. మొదట్లో పాత రేటులో వేతనం చెల్లించలేమనీ, సగం వేతనం మాత్రమే ఇస్తామనీ అయితే ఒక సంవత్సరంలోగా పాత వేతనం రేటు పూర్తిగా ఇస్తామనీ ఒప్పందం చేసుకున్నారు. కార్మికులు చాలా సంతోషించారు. ఇంక తమ కష్టాలు గట్టెక్కాయని అనుకున్నారు.

బ్యాంకులు, కేంద్ర ద్రవ్య సంస్థలు ఒకే రకమయిన రాయితీలను ప్రకటించాయి. 1992 మార్చి నెలాఖరుదాకా చెల్లించవలసిన పాత బాకీల వడ్డీలో 25% మాఫీ చేస్తామన్నారు. ఇంకొక 25% వడ్డీ మూడు ఏళ్ళ తరువాత కట్టవచ్చన్నారు. మిగిలిన వడ్డీలోను, అసలులోను 25% ప్రతిపాదన ఒప్పుకున్న తర్వాత మూడు నెలలలోగా కొత్త యాజమాన్యం తీర్చాలని, తక్కిన 75% మూడు వాయిదాలలో తీసుకుంటామని అన్నారు. వాయిదాల ప్రకారం చెల్లించే దానికి 19% వడ్డీ కట్టివ్వాలన్నారు.

ప్రభుత్వం సాలీనా టన్ను 595 రూపాయలకు 25,000 టన్నుల ముడిసరుకు సరఫరా చేసేటట్టు, కరెంటు కోత రాబోయే మూడు సంవత్సరాలలో 25 శాతం మించకుండా ఉండేటట్టు, పాత రాయల్టీ బాకీలలో మూడేండ్ల బాకీ మాఫీచేసి మిగిలినది ఏడు సంవత్సరాల తర్వాత వడ్డీ లేకుండా తీసుకునేటట్లు, అమ్మకం పన్ను బకాయిలకు కూడ అదే ఏర్పాటు వర్తించేటట్టు, 80 లక్షల రూపాయల కరెంటు బిల్లు బకాయిలో 25 శాతం వెంటనే తీసుకొని, మిగిలినది 12 వాయిదాలలో తీసుకొనేటట్టు, రాబోయే

మూడు సంవత్సరాల అమ్మకం పన్ను సేకరణను వాయిదావేసి, మూడేండ్ల తరువాత 8 అర్ధ సంవత్సరం కిస్తులలో సేకరించేట్టు, మరికొన్ని ఇటువంటి రాయితీలు ఇచ్చేటట్టు ఒప్పుకుంది.

కథ అక్కడితో సుఖాంతం కావలసింది. కాని వసంతగుప్తా ఊరుకోదలచుకో లేదు. బంగారు గుడ్లు పెట్టే బాతును వేరొకరి చేతుల్లోకి పోనివ్వదలచుకోలేదు. "బి.ఐ.ఎఫ్.ఆర్ ఎదుట కనీసం నా వాదనను వినిపించుకొనే అవకాశం ఇవ్వలేదు కాబట్టి థాపర్‌కు నా మిల్లును కట్టబెడుతూ మార్చి 23వ తేదీన బి.ఐ.ఎఫ్.ఆర్ జారీ చేసిన ఆర్డరును స్టే చెయ్యవలసింది" అంటూ ఎ.ఎ.ఐ.ఎఫ్.ఆర్‌కు అప్పీల్ చేసుకున్నాడు. అతను బి.ఐ.ఎఫ్.ఆర్ ఆర్డరు కాపీ సహితం సమర్పించనప్పటికీ అతని పిటిషన్ మీద మార్చి 27న ఎ.ఎ.ఐ.ఎఫ్.ఆర్ స్టే ఇచ్చింది. దాదాపు ఒక సంవత్సరం (1993 ఫిబ్రవరి 16 దాకా) మిల్లు పునరుద్ధరణ వ్యవహారం ఈ స్టే ఆర్డరుతో స్తంభించిపోయింది.

ఇక్కడ ఒక పిట్ట కథ చెప్పుకోవాలి. వసంతగుప్తా ఎ.ఎ.ఐ.ఎఫ్.ఆర్‌లో అప్పీల్ వేసినప్పుడు బి.ఐ.ఎఫ్.ఆర్ వినడానికి నిరాకరించిన తన కొత్త ప్రతిపాదన ఏమిటో చెప్పాడు. విదేశాలలో వున్న తెలుగు ఎన్ఆర్ఐల సహాయంతో తానే మిల్లును పునరుద్ధ రించదలచుకున్నానని చెప్పాడు. అంతేకాక తన విషయంలో వున్న దురభిప్రాయాన్ని ఎ.పి.ఐ.డి.సి మార్చుకుందనీ, ఆ విషయం టెలిగ్రాం ద్వారా తెలిపిందనీ అన్నాడు. అయితే తన అఫిడవిట్ తప్ప వేరే కాగితాలు ఏవీ అతను ఎ.ఎ.ఐ.ఎఫ్.ఆర్ దగ్గర దాఖలు చేయలేదు. మామూలు జనం విషయానికి వచ్చేసరికి అన్ని పత్రాలూ సక్రమంగా లేకపోతే పిటిషన్లు వినం అని కోర్టులు అంటాయి కాని ఈ కోటీశ్వరుడి విషయంలో "ఇప్పుడు కాని స్టే ఇవ్వకపోతే రేపు అన్నీ విన్న తర్వాత ఇతనికే అనుకూలంగా తీర్పువస్తే పరిస్థితి ఇరకాటంగా తయారవుతుంది. కాబట్టి స్టే ఇవ్వక తప్పదని" ఎ.ఎ.ఐ.ఎఫ్.ఆర్ నిర్ణయించింది. పిటిషనర్ బి.ఐ.ఎఫ్.ఆర్‌కు తాను తీసుకువస్తున్న ఎన్ఆర్ఐల పేర్లు, ఊర్లు, వాళ్ళు తేగల సొమ్ము తెలియజేస్తూ కచ్చితమైన ప్రతిపాదనలను సమర్పించవలసి వుండిందనీ, ఎ.పి.ఐ.డి.సి తన అభిప్రాయం మార్చుకుందన్న సంగతి తెలియజేసే డాక్యుమెంట్లు కూడ సమర్పించి వుండవలసిందనీ హితవు చెపుతూనే అయినప్పటికీ 'సహజ న్యాయసూత్రాలకు, ధర్మానికి అనుగుణంగా స్టే ఇస్తున్నాం' అని చెప్పి ఏప్రిల్ 14న మళ్ళీ కలుద్దాం అనింది.

అయితే ఈలోగా ఎ.ఎ.ఐ.ఎఫ్.ఆర్ ఛైర్మన్ రిటైరయ్యారు. వెంటనే కొత్త ఛైర్మన్ రాకపోవడంతో ఇంకొంచెం కాలయాపన జరిగింది. ఈ లోపల వసంతగుప్తా ఎందువలననో మనసు మార్చుకున్నాడు. థాపర్ గ్రూపు అతనికి కొన్ని షేర్లు అమ్ముతానని హామీ ఇచ్చారో, లేకపోతే రాయలసీమ సంప్రదాయాన్ని గుర్తించి అతనికి రౌడీ మాములు చెల్లిస్తామని ఒప్పుకున్నారో తెలియదు. మొత్తానికి మనసు మార్చుకుని ఎ.ఎ.ఐ.ఎఫ్.ఆర్‌లోని తన అప్పీలును ఉపసంహరించుకున్నాడు. అయినా కథ సుఖాంతం కాలేదు. వసంతగుప్తా తెలుగు ఎన్ఆర్ఐల వేటలో సత్యసాయిప్రసాద్ అసోసియేట్స్ అనే స్థానిక సంస్థ సహాయం తీసుకున్నాడు. దాని యజమాని ప్రసాద్ కర్నూలుకు చెందినవాడు. తెలిసినవారు అతనిని 'కరాటే ప్రసాద్' అంటారు. ఎ.పి కార్బైడ్స్ బతికి బాగున్న రోజులలో ఇతను దానికి బొగ్గు సరఫరా చేసేవాడు. అయితే అయ్యపురెడ్డి ద్వారా రాజకీయ సంబంధాలు పెంచుకొని తెలుగుదేశం హయాంలో అయ్యపురెడ్డి పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్‌గా వున్న రోజులలో ఇతను హైదరాబాదు పోయి సత్యసాయి ప్రసాద్ అసోసియేట్స్ అనే సంస్థను నెలకొల్పి పబ్లిక్ అకౌంట్స్ కమిటీతో పనులున్న వ్యాపారవేత్తలకూ, ఆ కమిటీ ఛైర్మన్‌కూ మధ్య అనుసంధానకర్తగా స్థిరపడి పరపతి బాగా సంపాదించుకున్నాడు. ఈ క్రమంలోనే విదేశాలలో వున్న తెలుగు పెట్టుబడిదార్లతో సంబంధాలు ఏర్పరుచుకున్నాడు. ఇతని ద్వారా తెలుగు విదేశీ పెట్టుబడి తీసుకురావాలని వసంతగుప్తా ప్రయత్నం. ఈ ప్రసాద్‌కు తోడుగా మళ్ళీ టి.జి. కుటుంబానికే చెందిన టి.జి. వీరప్రసాద్ (తుంగభద్ర మిషనరీ అండ్ టూల్స్ మేనేజింగ్ డైరెక్టర్) కూడ ఈ ప్రయత్నంలో భాగమయ్యాడు.

వీరిద్దరికీ చెప్పకుండా 1992 జూన్ 25న ఎ.ఎ.ఐ.ఎఫ్.ఆర్‌లో జరిగిన సమావేశంలో వసంతగుప్తా తన స్టే పిటిషన్‌ను ఉపసంహరించుకున్నాడు. ఈ చర్య ప్రసాద్‌కు, వీరప్రసాద్‌కు నచ్చలేదు. వీళ్ళతో వసంతగుప్తా చేసుకున్న ఒప్పందంలో ఒకరికి చెప్పకుండా ఒకరు ఇలాంటి పనులు చేయకూడదన్న అంగీకారం ఉన్నప్పటికీ దానిని అతిక్రమించి వసంతగుప్తా ఈ పనిచేశాడు.

అందువల్ల అతని ఉపసంహరణ పిటిషన్‌ను స్టే చెయ్యమని ప్రసాద్, టి.జి. వీరప్రసాద్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ వేసి స్టే తెచ్చుకున్నారు. ఆ పని ఎందుకు చేశారనేదానికి జవాబు టి.జి. వీరప్రసాద్ మాటల్లోనే చెప్పుకుంటే బాగుంటుంది.

"స్థానిక వ్యాపారవేత్తలను ప్రోత్సహించే స్పష్టమైన ఉద్దేశ్యంతోనే రాయలసీమ అభివృద్ధి బోర్డు రాయలసీమ పేపరు మిల్లుకు నిధులు ఇచ్చింది. అందువల్లనే సత్యసాయి ప్రసాద్ చాలామంది తెలుగు ఎన్‌ఆర్‌ఐలను పట్టుకొని మిల్లు పునరుద్ధరణకు ఒప్పించాడు. ఇటువంటి పరిస్థితులలో స్టే పిటిషన్‌ను వసంతగుప్తా ఉపసంహరించు కోవడం మా వ్యాపార ప్రతిష్టకు భంగకరం. తెలుగు ఎన్‌ఆర్‌ఐలను తీసుకువచ్చి సమర్థవంతమైన యాజమాన్యాన్ని ప్రవేశపెట్టే ఉద్దేశ్యంతోనే మేము హైకోర్టుకు పోయి వసంత గుప్తా చర్యపైన స్టే కోరాము" అంటాడాయన. (1992 ఆగస్టు 5న విడుదల చేసిన పత్రికా ప్రకటన.)

తెలుగుతనం ఉట్టిపడే ఈ చర్యను రాయలసీమ పేపర్ మిల్లు కార్మికులు ఎందుచేతనో హర్షించలేకపోయారు. అంతటి సంస్కారం లేకపోవడం వల్ల కావచ్చు. హర్షించకపోగా తీవ్ర నిరసనతో టి.జి. వీరప్రసాద్ గారి తుంగభద్ర మిషనరీ టూల్స్ ఫ్యాక్టరీ మీద మూడు వందల మంది పేపర్ మిల్లు కార్మికులు దాడిచేసి విస్తృతంగా విధ్వంసానికి పాల్పడ్డారు.

"మూర్ఖులు పాపం వాళ్ళు" అన్నారు వీరప్రసాద్ తన పత్రికా ప్రకటనలో. "వాళ్ళ నిజమైన ప్రయోజనాలేవిటో వాళ్ళకు తెలిస్తే మా చర్యను హర్షించేవారు. వాళ్ళను కొంతమంది అసంతృప్త వ్యక్తులు రెచ్చగొడుతున్నారు" అన్నాడు. "తుంగభద్ర మిషనరీ అండ్ టూల్స్ అప్రతిహతంగా సాగుతుంది" అని కష్టమర్లకు హామీ ఇచ్చాడు.

ఈ విధంగా టి.జి. కుటుంబం ఒక కోర్టు తరువాత ఇంకొక కోర్టుతో ఆటలాడుతూ కథను 1993లోకి తీసుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాను ఇచ్చిన స్టే ఆర్డరును రెండు నెలల తర్వాత ఎత్తివేస్తూ వసంతగుప్తా ఉపసంహరణ పిటిషన్‌ను ఆమోదించే ముందు ఈ ఇద్దరి వాదనలు కూడ ఎ.ఎ.ఐ.ఎఫ్.ఆర్ వినాలని ఆర్డరు జారీ చేసింది. మళ్ళీ రాయలసీమ పేపరు మిల్లు వ్యవహారం ఎ.ఎ.ఐ.ఎఫ్.ఆర్ లిస్టులోకి వచ్చి, వారు అందరి వాదనలు విని, వసంతగుప్తా ఉపసంహరణ పిటిషన్‌ను ఆమోదించి, బి.ఐ.ఎఫ్.ఆర్ ఆర్డరుపై తాము ఇచ్చిన స్టేను ఎత్తివేసేసరికి 1993 ఫిబ్రవరి 16వ తేదీ వచ్చింది. ఇప్పటికైనా కథ అయిపోతుందని కార్మికులు ఆశించారు కాని అదీ అడియాసే అయింది. స్టే ఆర్డరులు తొలగిపోయాయి కాబట్టి ఇంక మిల్లును మీరు ఏలుకోండని థాపర్ గ్రూపుతో బి.ఐ.ఎఫ్.ఆర్ అనింది.

అయితే ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయని థాపర్ గ్రూపువారన్నారు. అప్పట్లో తాము 108 కోట్ల పెట్టుబడి తెస్తే సరిపోతుందని అనుకున్నాము కాని ఇప్పుడు 181 కోట్లు తేవలసి ఉంటుందన్నారు. అప్పటి తమ ఒప్పుకోలు చెల్లదనీ, తమకు ఇంకొన్ని రాయితీలు కావాలనీ అన్నారు. ఎందుకంటే ఈ మధ్యలో మన్మోహన్‌సింగ్‌గారు కాగితం దిగుమతి మీద ఆంక్షలు బాగా సడలించారు. దానితో నాణ్యమైన విదేశీ కాగితం చవకగా దేశంలోకి వస్తున్నది. పోటీ పెరిగింది. ధరలు పడిపోయాయి. అంతేకాక హర్షద్‌మెహతా ఉదంతం వల్ల సామాన్య ప్రజలలో షేర్ల కొనుగోలు పట్ల ఉత్సాహం తగ్గిపోయింది. కంపెనీల పబ్లిక్ ఇష్యూలు ఈ మధ్య కాలంలో వేగంగా నడవడం లేదు. ఇంకా ఇట్లాంటి చాలా కారణాలు థాపర్ గ్రూపు చెప్పింది. 1992లో ఆమోదించిన ప్రతిపాదనలో సెంట్రల్ ఎక్సైజ్ రుణం ఉంది. ఎక్సైజ్ పన్ను చెల్లింపుకు ఈ స్కీమ్ కింద ఐదు సంవత్సరాల గడువు ఇస్తారు. అయితే నూతన బడ్జెట్ విధానాలలో భాగంగా అటువంటి స్కీములన్నీ రద్దయ్యాయి. కాబట్టి 1992 మార్చిలో ఒప్పుకున్న ప్రతిపాదన ఇప్పుడు ఆమోదయోగ్యం కాదని థాపర్ గ్రూపు అనింది. కొత్త ప్రతిపాదన ఏదైనా వుంటే 1993 జూలై 26 లోపల ఐ.డి.బి.ఐకి తెలియజేయమని బి.ఐ.ఎఫ్.ఆర్ థాపర్ గ్రూపును కోరింది. వాళ్ళు 1993 ఆగస్టులో కొత్త ప్రతిపాదన సమర్పించారు. దానిని ఐ.డి.బి.ఐ పరిశీలించి అది ఆమోదనీయం కాదనీ, మళ్ళీ ఆలోచించుకొని అక్టోబర్‌లోగా చెప్పమనీ అడిగింది. ఇంక ఆలోచించేదేమీ లేదని డిసెంబర్ నెలలో థాపర్ గ్రూపు పునరుద్ఘాటించింది. దీనితో తలెత్తిన పరిస్థితిని పరిశీలించడానికి బి.ఐ.ఎఫ్.ఆర్ 1994 మార్చి 3న మరో సమావేశం జరిపారు. వసంతగుప్తా మళ్ళీ వచ్చి, ఇప్పుడెవరూ ముందుకు రావడం లేదు కాబట్టి తన ప్రతిపాదన వినమన్నాడు. థాపర్ గ్రూపుకు ఇస్తామన్న రాయితీలు, సదుపాయాలు తనకూ ఇవ్వాలని, అదనంగా బ్యాంకులు పాత బకాయిలపైన వడ్డీ మొత్తం మాఫీ చేయాలని, ముడిసరుకును ప్రభుత్వం నిరంతరాయంగా సరఫరా చెయ్యాలని కోరాడు. బి.ఐ.ఎఫ్.ఆర్. బ్యాంకుల అభిప్రాయం అడగగా థాపర్ గ్రూపుకు ఇస్తామన్న రాయితీలు తప్ప వేరే ఏమీ ఇవ్వమన్నారు. వడ్డీలో మహా అయితే 25 శాతం మాత్రం మాఫీ చేస్తామన్నారు. కేంద్ర ద్రవ్య సంస్థల మాటకొస్తే, వసంతగుప్తా చెల్లించవలసిన బకాయిలకు రాష్ట్ర ప్రభుత్వం, ఎ.పి.ఐ.డి.సి గ్యారంటీ ఇచ్చేటట్టయితేనే అతని ప్రతిపాదనలు ఒప్పుకుంటాం అని ఐ.డి.బి.ఐ అన్నది. 'మేము అటువంటి గ్యారంటీ ఇవ్వలేమని' ఎ.పి.ఐ.డి.సి, రాష్ట్ర ప్రభుత్వం అన్నాయి.

ఈ విధంగా కథ మళ్ళీ మొదటికి వచ్చింది. దానిని మళ్ళీ మళ్ళీ మొదటికి రప్పించుకోవడం కోసమే వసంతగుప్తా కథను ఇంతగా సాగదీశాడు. కొత్త ప్రతిపాదనలు ఆహ్వానించి పరిశీలించమని బి.ఐ.ఎఫ్.ఆర్ మళ్ళీ ఐ.డి.బి.ఐని ఆదేశించింది. మే 31లోగా తనకు రిపోర్ట్ ఇమ్మనింది. ఈసారి ఐ.డి.బి.ఐకి రెండే రెండు ప్రతిపాదనలు వచ్చాయి. ఒకటి పాత మేనేజింగ్ డైరెక్టర్ వసంతగుప్తాది. రెండవది అతనితో కలిసి ఎ.ఎ.ఐ.ఎఫ్.ఆర్‌లో స్టే పిటిషన్ వేసి ఆ తరువాత వేరుపడిన సత్యసాయి ప్రసాద్ అసోసియేట్స్‌ది. వీటి మీద విచారణ ఇప్పటికింకా పూర్తికాలేదు.

ఈ లోపల కార్మికులు ఏమయ్యారంటే ముడిసరుకు సేకరణలో పనిచేసిన వారి సంగతి తెలీదు కానీ మిల్లులో పనిచేసిన కార్మికులు ఇక్కడా అక్కడా కూలి చేసుకొని బ్రతుకుతున్నారు. కొందరు దూర ప్రాంతాలలోని బల్లార్‌పూర్, సాత్పురా, భూసావల్ పేపర్ మిల్లులలో పనిచేస్తున్నారు. అధిక భాగం కర్నూలులోనే దినకూలి చేసుకొని బ్రతుకుతున్నారు. మిల్లు కార్మికులు అత్యధికంగా మగవాళ్ళు. మగవాళ్ళకు దినకూలి రేటు 30 రూ॥లు లేక 35 రూ॥లు ఉంటుంది. కాని రెండు రోజులలో ఒక రోజు కూలీ దొరికితే ఎక్కువ. అంటే నెలకు 1500 నుండి 2000 జీతం సంపాదించిన వాళ్ళు ఇప్పుడు నెలకు 450 లేక 500 మాత్రమే తెచ్చుకోగలుగుతున్నారు. ఎప్పటికప్పుడు మిల్లు తెరుచుకుంటుందని ఎదురుచూస్తూ వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. ధర్నాలు చేశారు. పాదయాత్రలు చేశారు. ఊరేగింపులు తీశారు. సభలు నిర్వహించారు.

అందరికీ బతుకు ఒకే రకంగా గడవడం లేదు. తిండి సరిగ్గా దొరకక, ఆరోగ్యం దెబ్బతిని చాలామంది చనిపోయారు. దీనిని ఆకలిచావు అనాలో, అనారోగ్యం చావు అనాలో తెలీదు. అది సహజ మరణం మట్టుకు కాదు. ఈ అనుమానానికి కూడ తావు ఇవ్వకుండా కొందరు ఆత్మహత్య చేసుకొని చనిపోయారు. 1993 డిసెంబర్ 27న ముగ్గురు పిల్లలను వదిలి వేణుగోపాలరావు అనే కార్మికుడు, అతని భార్య పార్వతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చాలా సంచలనం కలిగించింది. ఈ అయిదేళ్ళలో 10 మంది కార్మికులు లేక వారి భార్యలు ఆత్మహత్య చేసుకున్నారనీ, 44 మంది ఆకలి, అనారోగ్యాల వల్ల చనిపోయారనీ మిల్లు కార్మిక సంఘం అంటుంది.

మృతుల జాబితాను చివర్లో ఇచ్చాం. ఈ 54 మందిలో 41 మంది వయసు 25 నుండి 45 లోపల ఉంది. అది మనుషులు సహజంగా చనిపోయే వయసు కాదు. ఆ వయసువారు అంతమంది చనిపోయారంటేనే పెట్టుబడిదారుల ఆటలు కార్మికులకు ఎంతగా ప్రాణసంకటంగా తయారవుతాయో అర్థం అవుతుంది. ఈ జాబితా కూడ ప్రధానంగా కార్మికులకు మాత్రమే సంబంధించినది. వాళ్ళ కుటుంబ సభ్యులలో ఎంతమంది ఈ అయిదేళ్ళలో అకాల మరణం పాలయ్యారో తెలీదు.

ఒక కుటుంబం ఆదాయం అకస్మాత్తుగా గణనీయంగా పడిపోతే ఆ ప్రభావం సంపాదనపరులయిన మగవాళ్ళ కంటే ఇంట్లోని ఆడవాళ్ళ మీద, ముసలివాళ్ళ మీద ఎక్కువ పడుతుందనేది జగమెరిగిన సత్యం.

మిల్లు పునరుద్ధరణ విషయానికొస్తే బ్యాంకులు, కేంద్ర ద్రవ్య సంస్థలు ఇంకొంచెం ఎక్కువ బాధ్యత తీసుకోనిదే అది సాధ్యం కాదన్న యూనియన్ నాయకుల అభిప్రాయంలో వాస్తవికత ఉంది. పాత బాకీల వడ్డీలో 25 శాతం మినహాయింపు మాత్రమే ఇచ్చి, మూడేళ్ళలో పాత బాకీని, మిగిలిన వడ్డీని వసూలు చేసుకొని చేతులు దులుపుకొని పోతామన్న ప్రతిపాదనను బ్యాంకులు వదిలిపెట్టి మిల్లు పునరుద్ధరణలో భాగం కావాలని యూనియన్ కోరుతూ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం కూడ ముడిసరుకు తక్కువ రేటుకు నిరంతరాయంగా సరఫరా చేయాలని కోరుతూ ఉంది. కేంద్ర ద్రవ్య సంస్థలు పాత బాకీలపైన వడ్డీ మొత్తం వదులుకోవడానికి సిద్ధపడాలనీ, ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని ఆ సంస్థలను ఒప్పించాలని కూడ యూనియన్ కోరుతూ ఉంది.

1991లో గోయెంకా, థాపర్ గ్రూపులు ఈ మిల్లు కోసం పోటీపడిన రోజుల సంగతేమో కానీ ఇప్పుడు పైన పేర్కొన్న యూనియన్ సూచనల వంటివి అమలు కాకపోతే మిల్లు పునరుద్ధరణ కష్టం. ఇప్పుడు మిల్లుకు గుడ్‌విల్ అనేదేమీ లేదు. యంత్రాలు ఆలనా పాలనా లేక తుప్పుపట్టి ఉన్నాయి. అప్పటికీ ఇప్పటికీ కార్మికులు మాత్రమే - చనిపోయిన 54 మంది పోగా - మిగిలారు.

## రాయలసీమ పేపరు మిల్లు మూసివేసిన కాలంలో చనిపోయిన కార్మికులు

| నెం. | పేరు | వయసు | కారణం |
|---|---|---|---|
| 1. | సంగంనాథ్ గౌడ్ | 34 | ఆత్మహత్య |
| 2. | రామకృష్ణమూర్తి | 40 | ఆత్మహత్య |
| 3. | వీరన్న | 35 | ఆకలిచావు |
| 4. | పద్మనాభశెట్టి | 32 | ఆకలిచావు |
| 5. | మైఖెల్ జాన్ | 40 | అనారోగ్యం |
| 6. | రామచంద్రప్ప | 45 | అనారోగ్యం |
| 7. | కాశయ్యశెట్టి | 50 | అనారోగ్యం |
| 8. | దొడ్డన్న | 40 | ఆకలిచావు |
| 9. | గఫూర్ ఖాన్ | 55 | అనారోగ్యం |
| 10. | షేక్ సాహెబ్ | 50 | అనారోగ్యం |
| 11. | పాపయ్య | 45 | అనారోగ్యం |
| 12. | కలాం | 35 | అనారోగ్యం |
| 13. | గురురాజాచారి | 33 | ఆత్మహత్య |
| 14. | తెలుగు రాముడు | 25 | ఆకలిచావు |
| 15. | ఈశ్వరయ్య | 30 | ఆకలిచావు |
| 16. | గురప్ప | 50 | ఆకలిచావు |
| 17. | త్యాగరాజు | 35 | ఆకలిచావు |
| 18. | చాకలి తిమ్మప్ప | 40 | ఆకలిచావు |
| 19. | చాకలి చిన తిమ్మప్ప | 35 | ఆకలిచావు |
| 20. | జేమ్స్ | 50 | ఆకలిచావు |
| 21. | దత్తాత్రేయులు | 35 | ఆత్మహత్య |
| 22. | నరసింహులు భార్య | 32 | ఆత్మహత్య |

| | | | |
|---|---|---|---|
| 23. | వెంకటేశ్వరరెడ్డి భార్య | – | ఆత్మహత్య |
| 24. | బిసుపల్లి | 35 | అనారోగ్యం |
| 25. | విద్యాసాగర్‌రెడ్డి | 30 | అనారోగ్యం |
| 26. | బి.టి. మద్దులేటి | 27 | ఆకలిచావు |
| 27. | బి. రాముడు | 25 | ఆకలిచావు |
| 28. | బీసన్న | 40 | ఆకలిచావు |
| 29. | బాలీశ్వర్ | 25 | ఆకలిచావు |
| 30. | సోమన్న | 50 | ఆకలిచావు |
| 31. | రామచంద్రుడు | 30 | ఆకలిచావు |
| 32. | టి. రామయ్య | 28 | ఆత్మహత్య |
| 33. | ఎం. వెంకటస్వామి | 45 | అనారోగ్యం |
| 34. | బి. వెంకటస్వామి | 25 | అనారోగ్యం |
| 35. | టి. హుసేనయ్య | 30 | అనారోగ్యం |
| 36. | లక్ష్మన్న | 20 | అనారోగ్యం |
| 37. | పెద్దయ్య | 45 | ఆత్మహత్య |
| 38. | టి. మాదయ్య | 26 | అనారోగ్యం |
| 39. | మద్దమ్మ | 25 | ఆకలిచావు |
| 40. | ఇక్బాల్ | 35 | ఆకలిచావు |
| 41. | వేణుగోపాలరావు | 42 | ఆత్మహత్య |
| 42. | పార్వతి | 38 | ఆత్మహత్య |
| 43. | నర్సింహులు | 45 | ఆకలిచావు |
| 44. | జేమ్స్ | 25 | ఆకలిచావు |
| 45. | టి. మద్దులేటి | 55 | అనారోగ్యం |
| 46. | జీవరత్నం | – | అనారోగ్యం |
| 47. | హుసేనప్ప | 52 | అనారోగ్యం |

| | | | |
|---|---|---|---|
| 48. | తిక్కన్న | 48 | అనారోగ్యం |
| 49. | వెంకటస్వామిరెడ్డి | 29 | అనారోగ్యం |
| 50. | టి.ఎల్. పుల్లయ్య | 38 | అనారోగ్యం |
| 51. | ఇమాం ఖాసిం | 45 | అనారోగ్యం |
| 52. | నారాయణరెడ్డి | 50 | అనారోగ్యం |
| 53. | ఇ. వెంకటేశ్వరగౌడ్ | 32 | అనారోగ్యం |
| 54. | గోపాలరెడ్డి | – | అనారోగ్యం |

(గమనిక : ఆకలి చావుకూ అనారోగ్య కారణంగా సంభవించే మరణానికీ తేడా చెప్పడం ఒక్కొక్కసారి కష్టం. మిల్లు కార్మిక సంఘం ఇచ్చిన వివరాలనే ఇక్కడ యథాతథంగా ప్రచురించాము.)

**సెప్టెంబర్ 1994**

## ఇప్పటి పరిస్థితి

ఈ వ్యాసం రాసి 23 ఏళ్ళయింది కాబట్టి ఇప్పటి పరిస్థితి గురించి కూడ తెలుసుకోవడం సముచితంగా ఉంటుంది. ఇది రాసిన కొద్దికాలానికే అంటే 1994లోనే అప్పటి రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ (ఇప్పుడు వై.ఎస్.ఆర్. పార్టీలో ఉన్నారు) సమక్షంలో ఈ మిల్లు గురించి ఒక పంచాయతీ జరిగింది. ఆ పంచాయతీలో మిల్లును సత్యసాయి ప్రసాద్‌కు అప్పజెప్పడంతోపాటు టి.జి. వసంత గుప్తాకు, టి.జి. వెంకటేష్ గుప్తాకు మిల్లు నుంచి తప్పుకోవడానికి గుడ్‌విల్ కింద ఎంతెంత ఇవ్వాలో నిర్ణయం జరిగింది. వసంత గుప్తాకు ఎంత ఇచ్చారో తెలియదు కాని వెంకటేష్ గుప్తాకు మాత్రం బి.ఐ.ఎఫ్.ఆర్‌లో, ఎ.ఐ.ఎఫ్.ఆర్‌లో ఆయన వేసిన కేసులను వెనక్కి తీసుకోవడానికి, మిల్లులోని తన షేర్లను వదులుకోవడానికి మిల్లు వెనక ఉన్న 82 ఎకరాల స్థలం అప్పజెప్పాలని నిర్ణయించారు. దానితోపాటు షేర్ల వేరియేషన్‌ను సరిచేసేందుకు పదికోట్ల రూపాయలు ఇవ్వడానికి కూడ ఒప్పందం కుదిరింది. ఈ తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం ఆమోదంతో బి.ఐ.ఎఫ్.ఆర్ మిల్లును సత్యసాయి ప్రసాద్‌కు ఇచ్చేందుకు 1995 మార్చి నెలలో ఒప్పందం చేసుకుంది.

అయితే యాజమాన్యం మారినా మిల్లు పరిస్థితిలో మార్పు రాలేదు. ఈ 22 ఏళ్ళలో సత్యసాయి ప్రసాద్ మిల్లును నడిపిన దానికంటే మూసేసిందే ఎక్కువ. నడిపినప్పుడు కూడ ఏ రోజూ పూర్తి సామర్థ్యంతో పేపర్ ఉత్పత్తి చేసింది లేదు. 1996లో ఉత్పత్తి ప్రారంభించాడు కాని రెండేళ్ళకే 1998 మార్చిలో మూసివేశాడు. ఆ తర్వాత ఆరేళ్ళపాటు మిల్లు మూతబడే ఉంది. తనకున్న రాజకీయ పలుకుబడితో కార్పొరేషన్ బ్యాంకు, ఓరియంటల్ బ్యాంకుల నుండి 60 కోట్ల రూపాయల రుణం తీసుకుని 2004 సంవత్సరంలో మిల్లును తిరిగి తెరిచాడు. కాని 2009లో కృష్ణా నదికి వరదలు వచ్చి కర్నూలు పట్టణం మునిగిపోయినప్పుడు ఆ సాకుతో మళ్ళీ మూసివేశాడు. వరదల కారణంగా మిషనరీ కాలిపోయిందని, తయారైన పేపర్ తడిసి ముద్దయిందని అబద్ధాలు చెప్పి ఇన్స్యూరెన్స్ కంపెనీల నుండి 60-70 కోట్ల రూపాయల దాకా క్లైం చేశాడు. నిజానికి వరద సమయంలో పేపర్ మిల్లులోని పంప్‌హౌస్‌లోకి మాత్రమే నీళ్ళొచ్చాయి.

మిల్లు తెరిస్తే పని దొరుకుతుందన్న ఉద్దేశంతో కార్మికులు, వారి తరపున యూనియన్ నాయకులు యాజమాన్యం ఎన్ని ఆంక్షలు పెట్టినా అన్నిటికీ అంగీకరిస్తూ వచ్చారు. ఈ బేరసారాల్లో భాగంగా కార్మికులు సగం జీతానికి పనిచేయడానికి కూడ

ఒప్పుకోవడంతో యాజమాన్యం 2011 సంవత్సరంలో మిల్లును తిరిగి తెరిచింది. సత్యసాయి ప్రసాద్ మిల్లును తీసుకునే నాటికి రెగ్యులర్ కార్మికులు 1050 మంది, కాంట్రాక్ట్ కార్మికులు 500 మంది ఉండేవారు. పదిహేనేళ్ళ తర్వాత 2011 నాటికి వారి మొత్తం సంఖ్య 800కి పడిపోయింది. వీరిలో దాదాపు 500 మంది ఆ తర్వాత తమకు రావాల్సిన బకాయిలు (నాలుగు నెలల జీతంతోపాటు పి.ఎఫ్., గ్రాట్యుటీ) తీసుకుని వెళ్ళిపోయారు. పేపర్ మిల్లు నడపడంలో యాజమాన్యానికి అనుభవం లేకపోవడం వలన అనేక పొరపాట్లు కూడ జరిగాయి. బ్రాయిలర్‌లకు బొగ్గు వాడవలసి ఉండగా దానికి బదులు పొట్టు వాడడంతో అవి పనిచేయకుండా పోయాయి. విద్యుత్ శాఖకు బకాయిలు కట్టకపోవడంతో వారు విద్యుత్‌ను నిలిపివేశారు. ఆఫీసు సిబ్బంది సైతం ఇక జీతాలు రావని అర్థం చేసుకుని వెళ్ళిపోయారు. బ్యాంకులు బకాయిలకు ఒత్తిడి పెట్టడం ప్రారంభించాయి. ఈ దశలో సత్యసాయి ప్రసాద్ 2013 జూలై 10వ తేదీనాడు రాత్రి షిఫ్ట్ నడుస్తుండగా అక్రమంగా లాకౌట్ ప్రకటించి మిల్లును మూసివేశాడు.

నాలుగేళ్ళు గడిచినా మిల్లు ఇంకా మూతబడే ఉంది. సి.ఐ.టి.యు చొరవతో రాష్ట్ర ప్రభుత్వం సుమోటోగా అనంతపురం ట్రిబ్యునల్ కోర్టులో కేసు వేసింది. కాని ఇంతవరకు ఏ రకమైన పరిష్కారం లభించలేదు. ఒకటిన్నర సంవత్సరంపాటు ఆ కోర్టుకు జడ్జి సైతం లేదు. ఈలోగా ఐడిల్ మిషనరీ(వాడకుండా ఉన్న యంత్ర సామగ్రి)ని అమ్మి యాజమాన్యం 110 మంది కార్మికులకు నాలుగు నెలల జీతంతోపాటు గ్రాట్యుటీ చెల్లించింది. అయితే ఆ యంత్ర సామగ్రిని అమ్మగా వచ్చిన డబ్బులో దాదాపు 2 కోట్ల రూపాయలు యాజమాన్యం స్వాహా చేసిందన్న ఆరోపణలు రావడంతో బ్యాంకులు, పి.ఎఫ్, సెంట్రల్ ఎక్సైజ్, సేల్స్‌టాక్స్, ఫారెస్ట్ లాంటి శాఖలన్నీ కోర్టుకెళ్ళి మిల్లు మిషనరీ మీద, మిల్లుకు సంబంధించిన 650 ఎకరాల స్థలం మీద అటాచ్‌మెంట్ తీసుకొచ్చారు. దాన్ని వెనక్కి తీసుకుంటే రన్నింగ్ మిషనరీని అమ్మి మిల్లులో మిగిలిన 160 మంది కార్మికులకు చెల్లించాల్సిన ఐదుకోట్ల రూపాయల బకాయిలతోపాటు అన్ని సంస్థలకూ వారి వారి బకాయిలు చెల్లిస్తానని సత్యసాయి ప్రసాద్ చెబుతున్నాడు. కార్మికులు మాత్రం తాము బ్రతికి ఉండగానే ట్రిబ్యునల్ కోర్టులో కేసు పరిష్కారమయ్యే విధంగా రాష్ట్రప్రభుత్వం చొరవ తీసుకోవాలని, తమకు రావాల్సిన బకాయిలు ఇప్పించాలని కోరుతున్నారు.

**యు.జి. శ్రీనివాసులు**
**మానవహక్కుల కార్యకర్త, ఆదోని**

# నెల్లిమర్ల జూట్ మిల్లు

**లా**కౌట్ల మిల్లుగా పేరుపొందింది విజయనగరం జిల్లాలోని నెల్లిమర్ల జూట్ మిల్లు. 1989-90లో 10 నెలలు, 1991లో దాదాపు నాలుగు నెలలు, 1992లో మూడు నెలలు, 1993,1994లలో ఇప్పటివరకు14 నెలలు మిల్లు లాకౌట్‌లో ఉంది. 'రేపు తెరిపిస్తాం, ఎల్లుండి తెరిపిస్తాం' అని మంత్రులు అంటున్నారు కానీ తెరిపించడంలో చిత్తశుద్ధి మాత్రం కనిపించడం లేదు. కార్మికులను పూర్తిగా లోబరచుకోకుండా తెరిచే ఉద్దేశ్యం యాజమాన్యానికి లేదు. యాజమాన్యాన్ని తొందరపెట్టే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదు.

విజయనగరం కోస్తా ఆంధ్రాలోని 9 జిల్లాలలోనికీ బాగా వెనుకబడిన జిల్లా. రాష్ట్ర సగటు గ్రామీణ జనాభా 73.1 శాతం కాగా విజయనగరం జిల్లాలో అది 82.8 శాతం. గ్రామీణ జనాభాలో ఎక్కడయినా బీదవారి సంఖ్యే ఎక్కువ కానీ విజయనగరం జిల్లాలో ఇది మరీ ఎక్కువ. తలసరి ఆహార ధాన్యాల ఉత్పత్తి రాష్ట్రంలో సంవత్సరానికి 150 కిలోలు కాగా విజయనగరంలో 107 కిలోలు మాత్రమే. జిల్లాలోని వ్యవసాయ క్షేత్రాలలో అత్యధిక భాగం చాలా చిన్నవి. రాష్ట్రంలో సగటు వ్యవసాయ కమతం వైశాల్యం 4.3 ఎకరాలు కాగా విజయనగరం జిల్లాలో ఇది 2.5 ఎకరాలు మాత్రమే. అక్కడి మొత్తం వ్యవసాయ క్షేత్రాలలో 73.5 శాతం రెండున్నర ఎకరాల లోపు వైశాల్యం కలిగినవి. సాగునీరు సమృద్ధిగా ఉన్న మధ్య కోస్తా జిల్లాలలోనూ సగటు వ్యవసాయ కమతం తెలంగాణ, రాయలసీమ జిల్లాల కంటే చిన్నదే అయినా అది పేదరికాన్ని సూచించదు. కానీ విజయనగరం జిల్లాలో సాగునీటి సమృద్ధి లేదు. ఆ విషయంలో రాష్ట్ర సగటు ఎంతో విజయనగరం అంతే. ఈ స్థితిలో 73.5 శాతం వ్యవసాయ కమతాలు 2.5 ఎకరం కంటే చిన్నవి కావడం గ్రామీణ పేదరికాన్నే సూచిస్తుంది.

ఈ సేద్యపు నీటిలో అధికభాగం (60 శాతం) చెరువుల నుండి రావాలి. చెరువుల ఆయకట్టుకూ, నిజంగా చెరువుల వల్ల తడిసే నేల విస్తీర్ణానికీ చాలా తేడా ఉన్న సంగతి చెరువుల మీద అధికంగా ఆధారపడే రాయలసీమ, తెలంగాణ వాసులకు బాగా తెలుసు. సరయిన నిర్వహణ లేక రాష్ట్రంలో చాలా చెరువులు చుట్టూ ఉన్న మైదానాలలో కలిసిపోతున్నాయి. అందువల్ల చెరువులపై ఆధారపడే సాగునీటి లెక్కల్లో అధిక భాగం కాగితాల లెక్కలే. సాగునీరు లభించే సేద్యపు భూమి విజయనగరం జిల్లాలో 40 శాతం దాకా ఉందని గణాంకాలు చెప్పినా నిజానికి అంతమేరకు సాగునీరు లభించడం లేదు.

అధికంగా మెట్ట సాగుపైన ఆధారపడే చిన్న రైతుల సముదాయంగా విజయనగరం జిల్లాను వర్ణించవచ్చునని పై వివరాలు తెలియజేస్తాయి. ఈ చిత్రానికి పార్వతీపురం, సాలూరు ఏజెన్సీ ప్రాంతాలను కూడ కలుపుకుంటే జిల్లా ముఖచిత్రం పూర్తి అవుతుంది. విజయనగరం జిల్లాలో గిరిజన జనాభా రాష్ట్ర సగటు కంటే 50 శాతం ఎక్కువ. ఈ గిరిజన ప్రజల జీవిత స్థితిగతుల గురించి కొత్తగా ఏమీ చెప్పనవసరం లేదు.

ఇటువంటి గ్రామీణ ముఖచిత్రం వున్న జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి గణనీయంగా జరిగితే అది ప్రజలకు పేదరికం నుండి కొంతయినా ఉపశమనం కలిగిస్తుంది. ఫ్యాక్టరీలలో వేతనాలు ఎంత తక్కువ ఉన్నా వ్యవసాయ కూలిరేట్ల కంటే ఎక్కువ ఉంటాయి. చేతివృత్తుల ఆదాయం కంటే, చిన్న రైతుల ఆదాయం కంటే ఎక్కువే ఉంటాయి. పైగా ఫ్యాక్టరీలు ఉంటే వాటి ప్రభావం గ్రామాలపైన పడి వ్యవసాయ కూలీ రేట్లు కూడ పెరుగుతాయి. పారిశ్రామిక ప్రాంతాలలో అనేక రూపాలలో ఉపాధి, జీవనాధారం దొరుకుతాయి.

కానీ విజయనగరం జిల్లా పారిశ్రామిక ముఖచిత్రం ఏమంత ఆశాజనకంగా లేదు. జిల్లాలోని రిజిస్టర్డ్ ఫ్యాక్టరీలలో దినసరి వేతనాలపై పనిచేసే కార్మికుల సంఖ్య 14,836. ఇది జిల్లాలోని శ్రామిక జనాభాలో 1.4 శాతం మాత్రమే. వ్యవసాయేతర శ్రామికులలో ఫ్యాక్టరీ కార్మికుల నిష్పత్తి 4 శాతం. అంటే ఫ్యాక్టరీ రంగం విజయనగరం జిల్లాలో గ్రామీణ పేదరికాన్నీ, భూమిపైన జనాభా ఒత్తిడినీ తొలగించే మోతాదులో లేదు.

అయితే ఆ మాత్రమయినా ఫ్యాక్టరీ రంగం విజయనగరం జిల్లాలో ఉందంటే అది ప్రధానంగా నెల్లిమర్ల చలవే. ప్రతిరోజూ జిల్లాలో యంత్రాలు తిప్పే 14,836 మంది కార్మికులలో నాలుగవ వంతు (3700 మంది) నెల్లిమర్ల జూట్ మిల్లు కార్మికులు. దినసరి పనిచేసే ఈ 3700 మంది కాక మిల్లు కార్మికుల సంఖ్య 6000.

ఈ 6000 మంది గత అయిదు సంవత్సరాలుగా పదే పదే ఇంటి ముఖం పట్టిపోతున్నారు. ఇప్పుడు 14 నెలలుగా మిల్లు గేట్లు మూసి ఉన్నాయి.

## నెల్లిమర్ల జూట్ మిల్లు

నెల్లిమర్ల గ్రామం విజయనగరం పట్టణానికి అతి సమీపంలో, చీపురుపల్లి మీదుగా శ్రీకాకుళం వెళ్ళే రహదారి మీద ఉంది. 18 వేల చిల్లర జనాభా ఉన్న ఈ గ్రామ జీవితం జూట్ మిల్లు చుట్టూనే పరిభ్రమిస్తుంది. మిల్లు కార్మికులలో 3000 మంది నెల్లిమర్ల వాసులే. గ్రామంలోని వ్యాపారాలు, హోటళ్ళు, టీ దుకాణాలు, బ్యాంకులు, స్కూళ్ళు, డాక్టర్ క్లినిక్‌లు అన్నిటి అస్తిత్వం జూట్ మిల్లు మీదనే ఆధారపడి ఉంటుంది. మిల్లు శాశ్వతంగా మూతపడితే నెల్లిమర్ల భూతాలగృహం లాగ తయారవుతుంది. ఆదిలాబాద్ జిల్లాలోని 'సర్‌సిల్క్' మూసివేత వల్ల కాగజ్‌నగర్ పట్టణంలోని సగభాగం బీడు పడిపోయిన హృదయ విదారక దృశ్యాన్ని చూసినవారికి ఈ బొమ్మ గీసి చూపించవలసిన అవసరం లేదు.

6000 మంది మిల్లు కార్మికుల కుటుంబ సభ్యుల సంఖ్య 25 నుండి 30 వేల దాకా ఉంటుంది. పరోక్షంగా ఈ మిల్లుపైన ఆధారపడిన చిన్న వ్యాపారస్తులను, ఇతర వృత్తులవాళ్ళను కలుపుకుంటే మిల్లు మూసివేత వల్ల ఉపాధి తీవ్రంగా దెబ్బతినే జీవుల సంఖ్య ఎన్ని వేలుంటుందో!

ఈ 6000 మంది కార్మికులు దాదాపు 40 గ్రామాలకు చెందినవారు. అధికంగా వ్యవసాయ కూలీ కుటుంబాలకు, కొద్దిమంది పేద రైతు కుటుంబాలకు, అందరూ దళిత వెనుకబడిన కులాలకు చెందినవారు. ఈ గ్రామాలన్నీ నెల్లిమర్ల, గుర్ల మండలాలలో ఉన్నాయి. జరజాపుపేట, మొయిద, నారాయణపట్నం, కొండగుంపాం, గరిగిపేట, సారిపల్లి, ఉప్పరపేట, చింతలపేట, వెలగాడ వంటి గ్రామాలలో వందల సంఖ్యలో జూట్ మిల్లు కార్మికులు ఉన్నారు. ఒక్క జరజాపు పేటలోనే 1467 మంది

ఉన్నారు. ఈ గ్రామాలన్నింటి ఆర్థిక వ్యవస్థ మిల్లు మూసివేత వల్ల తీవ్రంగా దెబ్బతింటుంది.

కాబట్టి ప్రత్యక్షంగానే నెల్లిమర్ల జూట్‌మిల్లు మూసివేత అనేది ఇన్ని గ్రామాలకు చెందిన కొన్ని వేలమంది ప్రజల జీవనానికి సంబంధించిన సమస్య. ఈ సమస్య స్వరూపాన్ని వివరించడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం. క్లుప్తంగా చెప్పాలంటే 1980ల మధ్య కాలంలో జూట్ పరిశ్రమ ఎదుర్కొన్న సంక్షోభాన్ని అడ్డం పెట్టుకొని నెల్లిమర్ల జూట్ మిల్లు యజమాని జె.పి. కనోరియా మిల్లు డబ్బులను పెద్ద మొత్తంలో తన జేబులోకి తరలించి, దానినంతా నష్టంలో కలిపి చూపించి, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకూ ప్రభుత్వ శాఖలకూ బకాయిలు పెట్టి వాళ్ళు వసూలు చేసుకునే ప్రయత్నం మొదలుపెట్టగానే "నా మిల్లు ఖాయిలా పడింద"ంటూ బి.ఐ.ఎఫ్.ఆర్‌కు అప్లికేషన్ పెట్టి మిల్లు గోవింద్ శారడా అనే కలకత్తా బ్రోకర్‌కు లీజుకిచ్చి పక్కకు తప్పుకున్నాడు. లీజుకు తీసుకున్న ఈ మహానుభావుడికి మిల్లును సమర్థంగా నడిపే ఉద్దేశ్యం, సామర్థ్యం, ఆకాంక్ష లేనే లేవు. అడ్డంకులు లేకుండా మిల్లు నడపగలిగేటట్టయితే పిండుకొని పోదామని తన సహజ బ్రోకర్ దృష్టితో చూశాడు. అయితే పట్టుదలగా కార్మికులను ఆర్గనైజ్ చేసే యూనియన్ నాయకత్వం అతనికి ఆటంకం అయింది. యూనియన్‌తో హేతుబద్ధంగా చర్చించి ఒప్పందాలు చేసుకొని మిల్లు నడిపించుకునే శ్రద్ధ ఉండడానికి అతను మిల్లు స్వంతదారుడు కాడు కదా! అందువల్ల అతను యూనియన్‌ను ప్రధాన సమస్య చేసి చీటికీ మాటికీ లాకౌట్ చేయసాగాడు. కనోరియా బి.ఐ.ఎఫ్.ఆర్‌కు తానే పెట్టిన పిటిషన్‌ను తానే అడ్డదారిలో 'స్టే' చేయించి (తన అవసరం తీరదని అర్థం అయ్యేసరికి), గోవింద్ శారడాను తప్పించి వేరొకరికి మిల్లును అప్పగించాడు. ఈ వేరొకరు నిజంగా వేరొకరో లేకపోతే కనోరియా తృతీయ అవతారమో అనుమానమే. ఈ కొత్త ప్రభువులు కార్మికులు ఇచ్చింది తీసుకొని, చెప్పింది చేసేటట్టయితేనే మిల్లు తెరుస్తాం, లేకపోతే లేదంటున్నారు.

అంటే – మిల్లు యజమాని నష్టానికి తన 'ఫ్రాడ్'ను జోడించి మిల్లును తానే 'సిక్' చేస్తాడు. ఇంకొకరు లీజుకు తీసుకొని కార్మికులలో క్రమశిక్షణ లోపించిందని చెప్పి మూసేస్తాడు. మూడవవాడు మిల్లు తెరిపిస్తానంటూ యజమాని చేతులమీదుగానే రంగ ప్రవేశంచేసి కార్మికులు హక్కులు అడగకుండ ఉంటేనే (మిల్లు ఖాయిలా పడడానికి

వాళ్ళు బాధ్యులయినట్టు) తాళాలు తీసి నడుపుతానంటాడు. ఈ ప్రహసనానికి ప్రభుత్వం డైరెక్షన్ వహించి నడుపుతుంది. పోలీసులు విలన్ పాత్ర వహించి నిషేధాజ్ఞలు, కాల్పులు, లాఠీఛార్జీలు అంటూ బీభత్సం సృష్టిస్తారు.

నెల్లిమర్ల జూట్ మిల్లు ఈనాటిది కాదు. ఈ మిల్లును 1920లో బకింగ్‌హాం అండ్ కర్నాటక్ (బిసి) మిల్స్ వాళ్ళు నెలకొల్పారు. కాలక్రమంలో నష్టాలు రాగా 1939లో దీని యాజమాన్యం మెక్లియాడ్ కంపెనీ అనే మేనేజింగ్ ఏజెన్సీ చేతిలోకి పోయింది. ఈ మేనేజింగ్ ఏజెన్సీలు అనేవి వలసపాలన కాలం నాటి ఒక వింత వ్యవస్థ. ఈ ఏజెన్సీలకు సొంత పరిశ్రమలుండవు. ఇతరుల పరిశ్రమలను తీసుకొని నడుపుతారు. ఒకే రంగంలో అనేక మిల్లులను తీసుకోవడం ద్వారా ఈ ఏజెన్సీలు గుత్తాధిపత్యాన్ని నెలకొల్పగలిగేవి. విస్తృతమయిన లావాదేవీలు, బ్రిటిష్ ప్రభుత్వంతో సంబంధాలు ఉండడం వల్ల మామూలు యాజమాన్యం కంటే ఈ ఏజెన్సీలు లాభసాటిగా మిల్లులను నడపగలిగేవి. నెల్లిమర్ల జూట్ మిల్లును తీసుకున్న మెక్లియాడ్ ఏజెన్సీకి అప్పటికే జూట్ రంగానికి చెందిన 9 మిల్లులపైన యాజమాన్యం ఉండిందని పాత ఉద్యోగులు అంటారు.

ఈ మేనేజింగ్ ఏజెన్సీల వ్యవస్థ వల్ల పారిశ్రామిక సంస్కృతి లేని బ్రోకర్లు, కమిషన్ ఏజెంట్లు, దళారులు కేవలం బ్రిటిష్ ప్రభుత్వంతోను, వర్తక వర్గాలతోను తమకు ఉన్న సంబంధ బాంధవ్యాల వల్ల పారిశ్రామిక రంగానికి అధినేతలవుతున్నారన్న విమర్శ జాతీయోద్యమ సమయంలోనే తీవ్రస్థాయిలో ముందుకు వచ్చింది. ఒక ఆధునిక పెట్టుబడిదారీ దేశంగా భారతదేశం ఎదగాలంటే పారిశ్రామిక సంస్కృతి ఉన్న పెట్టుబడిదారీ వర్గం ఎదగాలనీ, అలా కాకుండా దాని స్థానంలో బ్రోకర్లు, దళారులు, పారిశ్రామిక పెట్టుబడికి స్వంత యజమానులు కానివాళ్ళు మేనేజింగ్ ఏజెన్సీల ద్వారా పారిశ్రామిక రంగానికి అధిపతులవుతున్నారని జాతీయవాదులు విమర్శించారు. ఇది గుత్త పెట్టుబడికి మార్గం సుగమం చేస్తున్నదని కూడ విమర్శించారు.

కంపెనీ ఆక్ట్ (1956) వచ్చాక ఈ మేనేజింగ్ ఏజెన్సీలు కొనసాగడం అసాధ్యం అయింది. దానితో నెల్లిమర్ల జూట్‌మిల్లు మెక్లియాడ్ కంపెనీ చేతి నుండి జనార్దన్ ప్రసాద్ కనోరియా చేతిలోకి వచ్చింది. (అయితే ఆ కంపెనీలో కనోరియా ఒక ముఖ్య భాగస్వామి అనీ, ఈ బదలాయింపు వల్ల ఏజెన్సీ పేరు పోయి కనోరియా పేరు

రావడం తప్ప జరిగిందేమీ లేదని ఒక రిటైర్డు మిల్లు గుమాస్తా పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ అన్నాడు.)

## నష్టాలు

1980ల దాకా కనోరియా నెల్లిమర్ల జూట్‌మిల్లును ముంచకుండానే నడిపి నట్టున్నాడు. 'ఖర్చు' ఖాతాలో చూపించిన దానిలో కొంత భాగం జేబులో వేసుకునే దురలవాటు మేనేజింగ్ డైరెక్టర్ కనోరియాకే కాక అతను తెచ్చి పెట్టుకున్న మార్వాడీ అధికారులందరికీ ముందు నుండి ఉండిందని పాత కార్మిక నాయకులు అంటారు. అంతేకాకుండ పెట్టుబడిని అస్తవ్యస్తంగా వినియోగించి వర్కింగ్ కాపిటల్‌ను వృథా చేసే అలవాటు కూడ అతనికి ఉండిందనేది మిల్లు వ్యవహారాలు చూస్తే స్పష్టం అవుతుంది. అయితే జూట్ పరిశ్రమ బాగున్నన్నాళ్ళూ ఇది మిల్లుకు ప్రాణాంతకంగా పరిణమించ లేదు. 1980ల మధ్య కాలంలో జూట్ పరిశ్రమ సంక్షోభంలో పడడంతో దీని ప్రభావం మిల్లు మీద బలంగా పడింది. పారిశ్రామిక సంక్షోభం (మార్కెట్ తరుగుదల) వల్ల వచ్చిన నష్టం ఎంత, యాజమాన్య నిర్వహణ లోపాల వల్ల వచ్చిన నష్టం ఎంత, యజమాని తానే మిల్లును దోచుకోవడం వల్ల వచ్చిన నష్టం ఎంత అని వేరుచేసి కచ్చితంగా చెప్పడం కష్టం కానీ మొదటి కారణానికి రెండవదీ, అంతకంటె ముఖ్యంగా మూడవదీ తోడుకావడం వల్లనే మిల్లు మునిగిందని నెల్లిమర్ల మిల్లుతో పరిచయం ఉన్నవాళ్ళందరూ కింది నుండి మీది దాకా ముక్తకంఠంతో చెప్తారు.

ప్రభుత్వ సంస్థలకూ ప్రభుత్వ శాఖలకూ కనోరియా పెట్టిన బకాయిలు చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. 1985 డిసెంబర్ – 1990 నవంబర్‌ల మధ్య ప్రావిడెంట్ ఫండ్ శాఖకు పెట్టిన బకాయి 2.32 కోట్ల రూపాయలు. ఇందులో యాజమాన్యం కంట్రిబ్యూషన్ బకాయి 1.6 కోట్లు, కార్మికుల వాటాగా వాళ్ళ జీతాల నుండి కోతపెట్టి పి.ఎఫ్‌కు జమచేయకుండ మిల్లు ఖర్చులలో కలుపుకున్నది దాదాపు 70 లక్షలు. 1986 ఏప్రిల్ నుండి 1990 నవంబర్ దాకా ఇ.ఎస్.ఐకి మిల్లు బకాయి 1.58 కోట్ల రూపాయలు. కరెంటు బిల్లు బకాయి 30 లక్షల 28 వేలు. అమ్మకం పన్ను బకాయి (1987–91 మధ్య కాలానికి సంబంధించినది) జనరల్ సేల్స్‌టాక్స్ ఖాతాలో 1.25 కోట్లు, సెంట్రల్ సేల్స్‌టాక్స్ ఖాతాలో 91 లక్షలు.

ఇవన్నీ కలిపితే నాలుగు ప్రభుత్వ డిపార్ట్‌మెంట్‌లకూ, సంస్థలకూ 1980 మధ్య కాలం నుండి ఆ దశాబ్దం చివరిదాకా కనోరియా ఎగ్గొట్టిన మొత్తం 6 కోట్ల 36 లక్షల రూపాయలు. ఇది కాక గోగునార అమ్మిన రైతుల దగ్గర నుంచి ప్రతీ చిల్లర వ్యాపారస్తుడి దాకా అందరికీ కనోరియా బకాయిలు పెట్టాడు. విజయనగరంలో ఈ మిల్లుతో వ్యాపారం చేసిన అతి చిన్న వ్యక్తిని కదిలించినా 'కనోరియా నాకు ఇంత బాకీ' అని చెప్తాడు.

మిల్లు నష్టాలకు మార్కెట్ సంబంధమయిన కారణాలు ఎన్ని ఉన్నప్పటికీ, కనోరియా మిల్లును ఎంతగా గుల్ల చేశాడంటే బి.ఐ.ఎఫ్.ఆర్ సభ్యులయిన పెద్దలు సహితం అతనిని 'యూ ఆర్ ఎ ఫ్రాడ్' (నువ్వొక దగాకోరువు) అని విచారణ సందర్భంగా అందరి ముందూ తిట్టారు.

దీని నేపథ్యం ఏమిటి?

## జూట్ పరిశ్రమలో సంక్షోభం

జూట్ మిల్లులో రెండు రకాలు. ట్వైన్ దారం మాత్రమే తయారుచేసే ట్వైన్ మిల్లులు, దారమే కాక గోనెపట్టా (హెస్సియన్) కూడ తయారు చేసే కాంపోసిట్ మిల్లులు. మన రాష్ట్రంలో ఏలూరు, చిట్టివలస, గుంటూరు, నెల్లిమర్లలలో ఉన్నవి కాంపోసిట్ మిల్లులు (గుంటూరులోని బజ్రంగ్ జూట్ మిల్లు ఖాయిలాపడి శాశ్వతంగా కన్నుమూసింది. నెల్లిమర్ల మిల్లు నిరంతర లాకౌట్లలో ఉంది). ట్వైన్ మిల్లులు విజయనగరం పట్టణంలో రెండు, రాజాం (శ్రీకాకుళం జిల్లా)లో రెండు, సాలూరు (విజయనగరం జిల్లా), బొబ్బిలి (విజయనగరం జిల్లా), కొత్తవలస (విజయనగరం జిల్లా), ఆముదాల వలస (శ్రీకాకుళం జిల్లా), రేవిడి (శ్రీకాకుళం జిల్లా), కోడూరుపాడు (కృష్ణా జిల్లా)లలో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి.

ట్వైన్ దారం కాక గోనెసంచులు జూట్ పరిశ్రమ చేసే ప్రధాన ఉత్పత్తి. ఖరీదయిన కార్పెట్లు పాడు కాకుండ ఉండడానికి కింది భాగంలో గోనెపట్టా వేసి కుట్టేవారు. దీనిని కార్పెట్ బాకింగ్ అంటారు. దీనికి మంచి విదేశీ మార్కెట్ ఉండింది కానీ ఈ మధ్యకాలంలో అది పోయింది.

గోనెసంచులకు పోటీ లేనంత కాలం జూట్ పరిశ్రమ కళకళలాడుతూ ఉండింది. 1970-80 మధ్య కాలంలో పరిశ్రమగా బాగా ఎదిగింది కూడ. ఆ

దశాబ్ద కాలంలో ఉత్పత్తి బాగా పెరిగింది. అయితే 1984 లో పాలిథీన్ సంచులు మార్కెట్‌లోకి రావడంతో జూట్ పరిశ్రమ దెబ్బతినింది. అప్పటివరకు సిమెంట్ పరిశ్రమే గోనెసంచుల ప్రధాన కొనుగోలుదారుగా ఉండింది. కాని పాలిథీన్ సంచులు మార్కెట్‌లోకి రాగానే ఆ పరిశ్రమ దాదాపు మొత్తంగా గోనెసంచుల వాడకం మానేసి పాలిథీన్ సంచులకు తన గిరాకీని బదలాయించింది. గోనెసంచులు ఉపయోగిస్తే సిమెంట్ కొంత పడిపోవడమే కాక తేమ అంటుతుంది. అందువల్ల పాలిథీన్ సంచులే మేలని సిమెంట్ పరిశ్రమ భావించింది.

ఈ దెబ్బ దేశవ్యాపితంగా తగిలింది. మన దేశంలో జూట్ పరిశ్రమకు ప్రధాన కేంద్రం పశ్చిమ బెంగాల్. పశ్చిమ బెంగాల్‌లో అప్పటికి ఉన్న 59 మిల్లులలో 20 మిల్లులు 1984లో మూతపడ్డాయి. ఆ దశలో జనపనార కొనుగోలులో బ్రోకర్లుగా ఉన్న కొందరు సేఠ్‌లు ముందుకొచ్చి సంక్షోభంలో ఉన్న మిల్లులను లీజుకు తీసుకున్నారు. అవి పూర్తిగా మూతపడిపోయే లోపల వాటి నుండి పిండుకోగల లాభం పిండుకొని కళేబరాన్ని పెంటకుప్ప మీద పారేసిపోదామని వాళ్ళ ఆలోచన. ఈ బ్రోకర్లలో ప్రముఖులు బజోరియా, నేమాని, శారడా, పసారి, జైన్, పొద్దార్ అనేవాళ్ళు (ఈ శారడాయే 1988లో నెల్లిమర్ల మిల్లును లీజుకు తీసుకున్నాడు. అతను అప్పటికే బెంగాల్‌లో 5 మిల్లులు లీజుకు తీసుకొని ఉన్నాడు).

అయితే ఆ దశాబ్దం చివరి నాటికి (అంటే 1989 నాటికి) పరిశ్రమ ఒక మేరకు కోలుకొని స్థిరపడడంతో ఈ బ్రోకర్లకు తమ లీజును పొడిగించకుండ తిరిగి పాత యాజమాన్యమే వాటిని స్వాధీనం చేసుకోవడం, లేకపోతే కొత్త యాజమాన్యం మిల్లులను కొనుక్కోవడం జరిగింది. పరిశ్రమ కోలుకోవడానికి అనేక కారణాలు దోహదం చేశాయి. సిమెంట్ పరిశ్రమ అకస్మాత్తుగా పాలిథీన్ సంచులకు తన గిరాకీని బదలాయించడం ఈ సంక్షోభానికి ప్రధాన కారణం కాబట్టి జూట్ పరిశ్రమను కాపాడడానికి ప్రభుత్వం ఒక చట్టం చేసింది. జూట్ ప్యాకేజింగ్ మెటీరియల్స్ ఆక్ట్ (1987) అనే ఈ చట్టం ప్రకారం సిమెంట్ పరిశ్రమ ఉపయోగించే సంచులలో 40 శాతం గోనెసంచులే వాడాలి. యూరియా పరిశ్రమ కూడ గోనెసంచుల వాడకం విషయంలో రిజర్వేషన్ పాటించాలి. ఈ చట్టాన్ని సిమెంట్ కంపెనీల యాజమానులు వెంటనే సుప్రీంకోర్టు ద్వారా స్టే చేయించినప్పటికీ, 1988 మే నెలలో సుప్రీంకోర్టు

స్టేని తొలగించి చట్టం అమలుకు మార్గం సుగమం చేసింది. అయినప్పటికీ ఆ రిజర్వేషన్ ఈనాటికీ అరకొరగానే అమలు అవుతున్నది. స్పిన్నింగ్ మిల్లులు తాము ఉత్పత్తిచేసే నూలులో కొంత భాగం చేనేత మగ్గాలు ఉపయోగించే నూలునే ఉత్పత్తి చేయాలన్న నియమం ఏ మాత్రం అమలు అవుతున్నదో ఇదీ ఆ మాత్రమే అవుతున్నది. అయితే సిమెంట్ పరిశ్రమ ఉపయోగించే సంచులలో గోనెసంచుల నిష్పత్తి బాగా పడిపోయినా, ఈ మధ్య కాలంలో సిమెంట్ కంపెనీల సంఖ్య బాగా పెరిగింది కాబట్టి మొత్తంగా సిమెంట్ రంగం కొనే గోనెసంచుల సంఖ్య మొదట్లో భయపడిన రాశిలో పడిపోలేదు.

అంతేకాక ఈ లోపల ఇతర రూపాలలో గోనెసంచులకు డిమాండ్ పెరిగింది. ధాన్యం, పప్పు, చక్కెర మొదలయిన వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు గోనెసంచులే ఉపయోగిస్తారు. లోగడ వెదురు బుట్టలలో రవాణా చేసే పూలు, పండ్లు, బీడీ ఆకు మొదలయిన వస్తువుల రవాణాకు కూడ ఈ మధ్య కాలంలో గోనెసంచులు ఎక్కువగా వాడుతున్నారు. ఈ రకమయిన వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటీకరణ గత దశాబ్దకాలంలో బాగా పెరిగింది. దానితో గోనెసంచులకూ గిరాకీ పెరిగింది. 'గాట్' సూత్రాలు అమలులోకి వచ్చే కొద్దీ వ్యవసాయ సంబంధమైన మార్కెటీకరణ ఇతోధికంగా పెరిగేదే తప్ప తరిగేది కాదు. పైగా ఈ రంగంలో గోనెసంచులకు ప్రత్యామ్నాయం ఏదీ లేదు. ఈ ఉత్పత్తులకు పాలిథీన్ సంచులు ఉపయోగిస్తే లోపలి సరుకు గాలి తగలక పాడవుతుందనీ, ఆరోగ్యరీత్యా వ్యవసాయ సంబంధమైన, ఆహార సంబంధమైన ఉత్పత్తుల ప్యాకేజింగ్‌కు గోనెసంచుల్నే ఉపయోగించాలనీ ప్రపంచ ఆరోగ్య సంస్థ 1990లో తీర్మానించింది. యూరోపియన్ ఎకనమిక్ కమ్యూనిటీలోని 12 దేశాలు కూడ ఇదే తీర్మానం చేశాయి. వాటిలో 9 దేశాలు ఈ తీర్మానాన్ని కచ్చితంగా అమలు చేస్తున్నాయి కూడ. పాశ్చాత్య దేశాలలో 'పర్యావరణం' గురించి ఆందోళన పెరిగేకొద్దీ పాలిథీన్ బదులు జూట్ ఉత్పత్తుల వాడకం పెరుగుతున్నది. పారిశ్రామిక వస్తువులను పర్యావరణ అనుకూలం, పర్యావరణ వ్యతిరేకం అని వర్గీకరించి, మొదటి రకాల ఉత్పత్తినీ వాడకాన్నీ పాశ్చాత్య దేశాలలో బాగా ప్రోత్సహిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ (FAO) గోనెసంచులను పర్యావరణ అనుకూలంగాను, పాలిథీన్‌ను పర్యావరణ వ్యతిరేకంగానూ అధికారికంగా

ప్రకటించింది. గోనెసంచులే కాక జూట్ పరిశ్రమ ఉత్పత్తి చేయగల చేతిసంచులు, మిశ్రమ వస్త్రాలు మొదలయిన వాటికి కూడ పాశ్చాత్య దేశాలలో ఇప్పుడు మార్కెట్ బాగుంది.

ఈ కారణాల వల్ల జూట్ ఎగుమతులు వర్థిల్లుతున్నాయి. 1980ల మధ్యకాలం నుండి ఏటా 2 లక్షల టన్నులను మించి జూట్ ఉత్పత్తులు భారతదేశం నుండి ఎగుమతి అవుతున్నాయి. 1989లో సోవియట్ రష్యా, తూర్పు యూరప్ దేశాలలో వచ్చిన రాజకీయ మార్పులు నిజానికి మన జూట్ ఎగుమతులకు పెద్ద దెబ్బ. ఎందుకంటే అంతకు ముందు మన దేశపు జూట్ ఎగుమతులలో 60 శాతం ఆ దేశాలకే ఆర్థిక ఒప్పందాల ప్రాతిపదికన పోయేవి. 1989 తరువాత ఆ దేశాలకు ఎగుమతులు మార్కెట్ లావాదేవీల ప్రాతిపదికన కొంత జరుగుతూనే ఉన్నా పాత ఒప్పందాల వల్ల ఉన్న భరోసా ఇప్పుడు లేదు. అయినప్పటికీ మన జూట్ ఎగుమతులు బాగానే ఉన్నాయి. రూపాయి విదేశీ మారకం విలువ తగ్గించిన అనంతరం 1991-92 సంవత్సరం తొలి అర్ధ భాగంలో జూట్ ఎగుమతులు ఎంత బాగా జరిగాయంటే 'ది హిందూ' దినపత్రిక దానిని జూట్ పరిశ్రమకు 'సువర్ణ సంవత్సరం' అని వర్ణించింది. ఒకప్పుడు భారత, బంగ్లాదేశ్‌లు మాత్రమే పోటీపడిన ఈ పరిశ్రమలో ఇప్పుడు చైనా, థాయిలాండ్, ఫిలిప్పీన్స్, ఇండోనేషియాలు కూడ (ముఖ్యంగా చైనా) పోటీదారులుగా ఉన్నారు. అయినా ఎగుమతుల పరిస్థితి ఆశాజనకంగానే ఉంది.

సంప్రదాయకమైన ట్వైన్ దారం, గోనెపట్టాల ఉత్పత్తికి పరిమితం కాకుండా కొత్తరకం ఉత్పత్తులు చేపట్టాలనే ఆలోచన జూట్ పరిశ్రమలో 1980ల మధ్యకాలం నుంచి మొదలయింది. కేంద్ర ప్రభుత్వం ఈ అవకాశాలను పరిశీలించడానికి కేంద్ర జౌళిశాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమించడమే కాక, 250 కోట్ల రూపాయలు కేటాయించి రెండు నిధులను నెలకొల్పింది. ఆధునీకరణ నిధికి 150 కోట్లు, అభివృద్ధి నిధికి 100 కోట్లు మంజూరు చేసింది. జూట్ పరిశ్రమ ఉపయోగించే యంత్రాల దిగుమతులపైన సుంకాలు తొలగించింది. జూట్ ఎగుమతులను ప్రోత్సహించడం కోసం నగదు రాయితీ స్కీంను ప్రవేశపెట్టింది.

మొత్తంమీద 1980 ల మధ్యకాలం నాటి సంక్షోభం నుండి ప్రస్తుత దశాబ్దం తొలి సంవత్సరాల నాటికి జూట్ పరిశ్రమ నెమ్మదిగా కోలుకొని స్థిమితపడిందని

చెప్పవచ్చు. 'మార్కెట్ సమస్య' పూర్తిగా తొలగిపోలేదు కానీ పరిశ్రమ మరణశయ్య మీద ఉందనీ, అస్తమయ దిశగా ఉందని ('సన్‌సెట్' ఇండస్ట్రీ అని) జూట్ మిల్లుల అధిపతులు చేస్తున్న గోల సమంజసమైనది కాదు. జూట్ పరిశ్రమ ఉత్పత్తి గణాంకాలు చూస్తే ఈ సంగతి అర్థం అవుతుంది.

| దేశంలో జూట్ పరిశ్రమ (గోనెపట్టాల) ఉత్పత్తి (లక్షల టన్నులలో) | | | | |
|---|---|---|---|---|
| 1970-71<br>10.6 | 1975-76<br>13.02 | 1980-81<br>13.92 | 1983-84<br>10.89 | 1984-85<br>13.70 |
| 1985-86<br>13.52 | 1986-87<br>13.02 | 1987-88<br>13.92 | 1988-89<br>10.89 | 1989-90<br>13.70 |
| 1990-91<br>14.3 | 1991-92<br>13.78 | 1992-93<br>13.10 | | |
| *(ఎకనమిక్ సర్వే, 1993-94)* | | | | |

1983-84లో అకస్మాత్తుగా 25% పడిపోయిన ఉత్పత్తి ఆ తరువాత వెంటనే పుంజుకుంది. మళ్ళీ 87-88లో బాగా పడిపోయింది. తిరిగి 88-89లో పుంజుకుంది దానికి కారణం 1988 మే నెలలో జూట్ రిజర్వేషన్ పైన స్టేని సుప్రీంకోర్టు తొలగించడం అని ఒక పరిశీలకుడు అంటాడు. అయినప్పటికీ 1983-89 మధ్యకాలంలో సాలీనా జూట్ ఉత్పత్తి పెరుగుదల రేటు స్వల్ప రుణాంకంగానే ఉంది (-0.2 శాతం). ప్రస్తుత దశాబ్దంలో ఉత్పత్తి మొదట్లో పెరిగి మళ్ళీ తగ్గింది. 1991లో రూపాయి విదేశీ మారకం విలువ తగ్గించడం వల్ల ఎగుమతుల మార్కెట్ ఆశాజనకంగా మారడంతో కొన్ని మిల్లులు కొత్త రకం ఉత్పత్తులు చేపట్టాయి. నెల్లిమర్లకు సమీపంలో ఉన్న చిట్టివలస జూట్‌మిల్లు గోగునారనూ పత్తి నూలునూ మిశ్రమం చేసి ఒక కొత్త నూలు రూపొందించే ప్రయత్నం చేస్తూ ఉంది. ఈ నూలుతో నేసే బట్ట ఉన్ని వలె వెచ్చగా ఉంటుంది. అయితే ఉన్ని కంటే చవకగా ఉంటుంది. అదే విధంగా చవక అయిన, మన్నిక అయిన చేతి సంచులు, కార్పెట్‌లను జూట్‌తో తయారు చేయవచ్చు.

కానీ కొత్తరకం ఉత్పత్తులు చేపట్టి, వైవిధ్యాన్ని సాధించి, మారుతున్న మార్కెట్ అవకాశాలకు అనుగుణంగా ఉత్పత్తి క్రియలో కూడ మార్పులు చేసి, యంత్రాలను ఆధునీకరించి నిలదొక్కుకునే దృక్పథం జూట్ యాజమాన్యాలకుందా అనేది ప్రధాన సమస్య. పారిశ్రామిక, సాంకేతిక సంస్కృతి కొరవడిన దళారీ, లేక బ్రోకర్ స్వభావం గల యాజమాన్యాలు ఉండడం జూట్ పరిశ్రమను దేశవ్యాపితంగా పీడిస్తున్న సమస్య. 1980ల మధ్య కాలం నాటి సంక్షోభం నుండి జూట్ పరిశ్రమను బయటపడేయడానికి కేంద్ర ప్రభుత్వం 150 కోట్ల ఆధునీకరణ నిధినీ, 100 కోట్ల అభివృద్ధి నిధినీ 1987లో నెలకొల్పిందని చెప్పాము. ఈ నిధుల వినియోగాన్ని 1992లో రిజర్వ్ బ్యాంకు సమీక్షిస్తూ తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేసింది. 1991 మార్చి నాటికి ఆధునీకరణ నిధికి 37 అర్జీలు మాత్రమే వచ్చాయనీ, వాటిలో 19 ఆమోదం పొందాయనీ, వాటికి ఆధునీకరణ నిధి నుండి 73 కోట్ల రుణం మంజూరు అయిందనీ రిజర్వ్ బ్యాంక్ అనింది. అంటే నాలుగు సంవత్సరాల అనంతరం నిధిలో సగం కూడ వినియోగం కాలేదు. అభివృద్ధి నిధిలోనైతే నాలుగవ వంతు మాత్రమే వినియోగం అయింది. 1991 మార్చి నాటికి 25.5 కోట్లు మాత్రమే ఈ నిధి నుండి మంజూరయ్యాయి. పరిశ్రమలో నష్టాలు వస్తున్నాయని గగ్గోలు పెట్టే యాజమాన్యాలు పరిశ్రమ ఆధునీకరణ కోసం, అభివృద్ధి కోసం ప్రభుత్వం ఉదారంగా నెలకొల్పిన నిధులను వినియోగించు కోవడంలో ఇంత అలసత్వం, స్తబ్ధత చూపించడానికి వేరే ఎన్ని కారణాలున్నా జూట్ పరిశ్రమ యజమానులది ప్రధానంగా దళారీ సంస్కృతి కావడం ఒక ముఖ్య కారణం.

నెల్లిమర్ల సేఠు కనోరియా మాటకొస్తే ఆయన ఈ నిధులకు అప్లికేషన్ పెట్టుకుందామన్న ఆలోచన సహితం చేసినట్టు లేదు. సంక్షోభాన్ని అడ్డం పెట్టుకొని నల్ల డబ్బుతో జేబులు నింపుకొని దీనినంతా నష్టంగా చూపించి ఊరందరికీ బకాయిలు పెట్టి చివరన బి.ఐ.ఎఫ్.ఆర్‌కు అర్జీ పెట్టి మిల్లును ఒక బ్రోకర్‌కు లీజుకు ఇచ్చి వెళ్ళి పోదామని చూశాడు. 1984 నాటి సంక్షోభం నుండి జూట్ పరిశ్రమ మొత్తంగా గట్టెక్కిందని చెప్పుకోవచ్చును కానీ నెల్లిమర్ల జూట్ మిల్లు మాత్రం గట్టెక్కలేదు.

1983-84లో ప్రారంభమయిన సంక్షోభంలో పశ్చిమ బెంగాల్‌లో చాలా మిల్లులు బ్రోకర్ల చేతిలోకి పోయాయని చెప్పాము. నెల్లిమర్ల జూట్ మిల్లు చరిత్ర

కొంచెం భిన్నంగా సాగింది. కనోరియా మిల్లును ఏ బ్రోకర్‌కూ అప్పగించలేదు. అట్లాగని అనేక ఇతర మిల్లుల యజమానులలాగ మిల్లును జాగ్రత్తగా గట్టెక్కించే ప్రయత్నమూ చేయలేదు. ఇది ఇంకొకరి మిల్లు అయినట్టూ, తాను దానిని లీజుకు తీసుకున్నట్టూ తానే మిల్లును పిండుకొని ఎండబెట్టి, తన స్వార్థంతో అశ్రద్ధతో దివాలా తీయించి, 1988లో రాష్ట్ర ప్రభుత్వం కమర్షియల్ టాక్స్ శాఖ అమ్మకం పన్నుల బకాయిల వసూలు కోసం కంపెనీ ఆస్తుల జప్తుకై కోర్టుకెక్కగా బి.ఐ.ఎఫ్.ఆర్‌కు 'సిక్' అని అర్జీ పెట్టి, అప్పటికి 5 జూట్ మిల్లులు లీజుకు తీసుకున్న గోవింద్ శారడా అనే బ్రోకర్‌కు మిల్లును లీజుకు ఇచ్చి పక్కకు తప్పుకున్నాడు. జూట్ పరిశ్రమలోని సంక్షోభం కనోరియాకు 'ఫ్రాడ్' చేయడానికి ఈ విధంగా ఉపకరించింది. పరిశ్రమలో ఎంత సంక్షోభం ఉన్నప్పటికీ ప్రధానంగా అతని దగాకోరుతనం వల్లనే నెల్లిమర్ల మిల్లు 'సిక్' అయిందనేది మిల్లు కార్మికుల, కార్మిక నాయకుల అభిప్రాయం మాత్రమే కాదు. నెల్లిమర్ల మిల్లు యాజమాన్యంతో లావాదేవీలు పెట్టుకున్న అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నత అధికారులు, నెల్లిమర్ల మిల్లులో రెండు మూడు దశాబ్దాలపాటు ఉద్యోగం చేసిన కార్మికేతర (తెల్లబట్టల) సిబ్బంది కూడ 'ఆఫ్ ది రికార్డ్' చెప్తున్నామని హెచ్చరిస్తూ ఈ మాటే చెప్తారు.

## కనోరియా లీలలు

యజమాని దగాకోరుతనం కాకుండ వేరే ఏదయినా కారణం ప్రధానం కావచ్చునా అని అడిగితే అందరూ ఒకే ఎదురు ప్రశ్న వేస్తారు. నెల్లిమర్లకు 30 కి.మీ.లలోపు దూరంలో విశాఖపట్నం జిల్లాలో చిట్టివలస జూట్‌మిల్లు ఉంది. ఈ రెండు మిల్లులకూ చాలా పోలికలున్నాయి. రెండూ దాదాపు ఒకే సమయంలో ఏర్పడ్డాయి. రెండింటిలోనూ దినసరి కార్మికుల సంఖ్య దాదాపు ఒకటే (3700-4000 మంది). దినసరి సగటు ఉత్పత్తి (టార్గెట్) రెండింటిలోనూ 90 లేక 100 టన్నులు. రెండు మిల్లులూ ముడిసరుకును కొనుగోలు చేసేది ఒకే మార్కెట్‌లో, అమ్మేది ఒకే మార్కెట్‌లో. రెండిటి సాంకేతిక స్థాయీ ఒకటే. దీని యజమాని కనోరియా అనే కలకత్తా మార్వాడీ కాగా దాని యజమాని బజోరియా అనే మరొక కలకత్తా మార్వాడీ. రెండు మిల్లుల కార్మిక సంఘాల నాయకుడూ సంక్షోభ దశాబ్దంలో ఒకరే (ఎ.ఐ.సి.టి.యు నాయకులు గంగాధర రెడ్డి).

కానీ చిట్టివలస జూట్ మిల్లు మార్కెట్‌లోని అన్ని సంక్షోభాలకూ తట్టుకొని మొత్తంమీద సాఫీగానే నడుస్తూ ఉంది. సంప్రదాయక ఉత్పత్తులతో తృప్తి చెందకుండా కొత్తరకం (జూట్, కాటన్ సంకర) ఉత్పత్తి చేయాలన్న ఆలోచనలో ఉంది. నెల్లిమర్ల మిల్లు మాత్రం 9 సంవత్సరాలుగా బకాయిపడి, 5 సంవత్సరాలుగా మూర్ఛపోతూ లేస్తూ ఉంది. దీనికి ఆ మిల్లు యాజమాన్యం అసమర్థత, లేదా మోసం తప్ప వేరే ఏ కారణం ఉంటుంది?

కనోరియా అసమర్థత, నిర్లక్ష్యం, మోసం, దగాకోరుతనం అన్నీ దీనికి కారణం అని నెల్లిమర్ల మిల్లులో చాలా కాలం యూనియన్ నాయకునిగా ఉండి, బి.ఐ.ఎఫ్.ఆర్ ఎదుట కూడ మిల్లు కార్మికుల తరఫున హాజరయిన గంగాధరరెడ్డి అంటారు. దీనికి ఆయన చాలా తార్కాణాలు ఇస్తారు. మిల్లు వ్యవహారాలతో చాలా ఏళ్ళుగా పరిచయం ఉన్న ఇతర వ్యక్తులు కూడ ఇటువంటి ఉదాహరణలు చాలా ఇస్తారు. అంతేకాదు, యజమాని పెద్ద స్థాయిలో ఈ రకమైన మోసాలకు పాల్పడుతుంటే క్రిందిస్థాయిలోని చీఫ్ ఎగ్జిక్యూటివ్, పర్సనల్ మేనేజర్, కమర్షియల్ మేనేజర్, ఇతర ఆఫీసు సిబ్బంది ఎవరి జేబులు వారు నింపుకోసాగారు. ఆఫీస్ సిబ్బందిలో ఎక్కువ భాగం మార్వాడీలే ఉంటారు. వాళ్ళంతా కలిసికట్టుగా ఉండి మిల్లు వ్యవహారాలు స్థానికులయిన ఆఫీస్ సిబ్బందికి, కార్మికుల తెలియకుండా దాచిపెట్టేవారు.

నెల్లిమర్ల జూట్‌మిల్లు వాడే ప్రధానమయిన ముడిసరుకు గోగునార (జనపనార వాడకం తగ్గిపోయి గోగునార దానిస్థానం ఆక్రమించింది). ఈ నారలో ఎక్కువ భాగం కలకత్తా నుండి, ఒరిస్సా నుండి దిగుమతి అవుతుంది. అయితే స్థానిక రైతాంగం కూడ (విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో) గోగునార పండిస్తారు. ఈ రైతుల దగ్గర నార కొనుక్కోవడానికి మిల్లు యాజమాన్యం విజయనగరంలోనూ రాజాంలోనూ కొనుగోలు కేంద్రాలు నెలకొల్పింది. ఇతర రీటైల్, హోల్‌సేల్ డీలర్ల ద్వారా కూడ కొనుక్కునేది. కొనుక్కునేది రైతాంగం నుండే కాబట్టి తక్కువ ధరకు కొని ఎక్కువ ధర చూపించడం సులభం. ఈ విధంగా నెల్లిమర్ల మిల్లు కొనుగోలు చేసే ముడిసరుకు ధర ఎక్కువచేసి చూపించేవారనీ, 6 రూ॥లకు కొని 10 రూ॥లు చూపించడం సాధారణమేననీ అంటారు. ఖర్చు ఎక్కువ చూపించి, మిల్లు సొమ్మును స్వంతం చేసుకోడానికి ఇదొక మార్గం. పరిశ్రమ మొత్తంగా నష్టాలలో ఉన్నప్పుడు ఈ నష్టం ఆ నష్టంలో కలిసిపోతుంది.

కొనుగోలులో ఈ రకమైన మోసమే కాక అసమర్థత, నిర్లక్ష్యం కూడ ఉండేవని కార్మిక నాయకులు అంటారు. గోగుపంట మార్కెట్‌లోకి వచ్చిన కొత్తలో నార ధర తక్కువ ఉంటుంది. అప్పుడు కొనుక్కుంటే చవకగా దొరుకుతుంది. అయితే మిల్లు ఆర్థిక వ్యవహారాలను సక్రమంగా నిర్వహించలేకపోవడం వల్ల (అంటే వర్కింగ్ కాపిటల్‌ను సరిగ్గా కాపాడుకోకపోవడం వల్ల) సరయిన సమయానికి కావలసిన మొత్తం చేతిలో లేకపోవడం, అరువుకు కొనుక్కొని తరువాత వడ్డీతో సహా చెల్లించడం, లేదా అరువు ఇవ్వడానికి అమ్మకందార్లు నిరాకరిస్తే కాలాతీతమయిన తరువాత ఎక్కువ ధర పెట్టి కొనుక్కోవడం – దీనివల్ల ఖర్చు పెరిగి మిల్లు నష్టపోవడం జరిగేది.

సామర్థ్యం గల యాజమాన్యం తక్కువ ధరకు ముడిసరుకు కొనుక్కుని లాభసాటిగా ఉత్పత్తి చేయాలని చూస్తుంది. అయితే పారిశ్రామిక సంస్కృతి కంటే వర్తక సంస్కృతి ఎక్కువ ఉన్న యాజమాన్యం చవగ్గా కొనుక్కున్న ముడిసరుకును కూడ ఉత్పత్తి కోసం వినియోగించకుండా ముడిసరుకు ధర పెరిగినప్పుడు తిరిగి అమ్మివేసి వర్తక లాభాలు గడించే ప్రలోభానికి లోనవుతుంది. 1984–89 మధ్య కాలంలో పశ్చిమ బెంగాల్‌లో జూట్ మిల్లులను లీజుకు తీసుకున్న బ్రోకర్లు ఉత్పత్తి మీద దృష్టి పెట్టకుండ, గోగునార, జనపనారలను చవక సీజన్‌లో కొని స్టాక్‌చేసి ధర పెరిగినాక అమ్మే దళారీ వ్యాపారం మీద ఎక్కువ దృష్టి పెట్టారని బెంగాల్ జూట్ పరిశ్రమను విశ్లేషించినవారు చెప్తారు. ఇక్కడ కనోరియా ఆ మోతాదులో కాకున్నా యథాశక్తి మొదటి నుండి ఈ పని చేసేవాడు. ఎందుకంటే ఆ వ్యాపారంలో వచ్చిన లాభాలు యజమాని స్వంత ఖాతాలోకి పోతాయి. మిల్లు ఉత్పత్తికి ముడిసరుకు కావలసి వచ్చినప్పుడు గోడౌన్లలో తగిన మోతాదులో నార ఉండకపోవచ్చు. అప్పుడు ఎక్కువ ధరకైనా మార్కెట్లో కొని ఉత్పత్తి చేయాలి. ఈ నష్టం మట్టుకు మిల్లు ఖాతాకే చెందుతుంది. పైగా అడ్డగోలుగా చేసే ఈ కొనుగోలులో కనోరియా చాలామందికి పెద్ద మొత్తాలు ఎగ్గొట్టాడు. రైతులు, మధ్యదళారీలకే కాక, జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జె.సి.ఐ) వద్ద కూడ 1 కోటి రూపాయల సరుకు కొనుక్కొని బకాయి పెట్టాడంటారు. జె.సి.ఐ అధికారులు గోడౌన్లలో ఉన్న నార పాడయిపోతున్నదనే కారణం చూపించి క్రెడిట్ మీద, లేకపోతే తక్కువ ధరకు నార అమ్మేస్తుంటారనీ, ఇది ఒక్కొక్కసారి మిల్లు యాజమాన్యంతో లాలూచీపడి చేస్తుంటారనీ ఒక విశ్వసనీయమైన ఆరోపణ వుంది.

ఈ క్రమంలోనే కనోరియా జె.సి.ఐకి 1 కోటి రూపాయలు టోపీ పెట్టినట్టున్నాడు. దీని గురించి జె.సి.ఐ అధికారులను అడిగినప్పుడు వాళ్ళు తేలుకుట్టిన దొంగల లాగ స్పందించడాన్ని బట్టి చూస్తే ఇందులో కొంతయినా సత్యం ఉందనిపిస్తుంది.

దగా ఒక్క ముడిసరుకు విషయంలోనే జరగలేదు. నెల్లిమర్ల మిల్లులో మేనేజర్లుగా ఉన్న వాళ్ళు మెషినరీ స్పేర్‌పార్ట్స్ షాపులు, రిపేరు షాపులు తామే బినామీగా పెట్టి మిల్లుకు సెకండ్ హాండ్ స్పేర్ పార్ట్‌లు సరఫరా చేసి అధిక ధర తీసుకునేవారనీ, యంత్రాల సర్వీసింగ్‌కు 10 వేల రూపాయల కంటే ఎక్కువ ఖర్చు కాకపోయినప్పటికీ 25 వేలు బిల్లు వేసి జేబులు నింపుకునేవారనీ కార్మిక నాయకులు అంటారు.

కార్మికులలో క్రమశిక్షణ లోపించడం, దినసరి ఉత్పత్తి ఇవ్వవలసినంత ఇవ్వక పోవడం మిల్లు నష్టాలలో ఉండడానికి కారణం అని యాజమాన్యం అంటుంది. కనోరియా వాదనా అదే, గోవింద్ శారదా వాదనా అదే. క్రమశిక్షణ, ఉత్పత్తి విషయాలలో యాజమాన్యం ఆశించే దానికీ, కార్మికులు సంసిద్ధమయ్యేదానికీ ఎప్పుడూ తేడా ఉంటుంది. కార్మికులు యంత్రాలలాగ పనిచేసుకుంటూ పోవాలనీ, అజమాయిషీ పేరుమీద అవమానపరిచినా, అన్యాయం చేసినా అడగకూడదనీ యాజమాన్యాలు ఆశిస్తాయి. ఇది కార్మికులకు సాధ్యం కాదు. ప్రజాస్వామిక దృక్పథంలో వాంఛనీయమూ కాదు. ఉత్పత్తి పరిమాణం మాటకొస్తే, ఎంత ఉత్పత్తి ఇవ్వాలి అనే దానికి ఒక హేతుబద్ధమైన ప్రమాణం, ఇరువర్గాలకూ ఆమోదనీయమైన ప్రమాణం ఉండాలి.

నెల్లిమర్ల మిల్లు యాజమాన్యం గత నాలుగేళ్ళుగా రోజుకు 95 టన్నులు ఉత్పత్తి (ట్వైన్‌దారం, గోనెసంచులు కలిపి) జరగాలని డిమాండ్ చేస్తున్నది. కార్మికులు 80 లేక 85 టన్నులు ఇవ్వగలుగుతున్నారు. ఇప్పుడు యూనియన్‌తో చర్చలు జరుపుతున్న కొత్త యాజమాన్యం 100 టన్నులు కావాలంటున్నది.

ఎంత ఉత్పత్తి సాధ్యం అనేది కేవలం కార్మికుల క్రమశిక్షణ మీదనే కాక యంత్రాల స్థితి మీద, ముడిసరుకు నాణ్యత మీద ఇంకా అనేక ఇతర విషయాల మీద ఆధారపడి ఉంటుంది. ఈ రెండు విషయాలలోనూ నెల్లిమర్ల మిల్లు యాజమాన్యం నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వకుండా నాసిరకం సరుకును, సరయిన మెయింటెనెన్స్ లేని యంత్రాలను ఇచ్చి కార్మికులు ఎక్కువ పనిచేయాలని డిమాండ్ చేస్తున్నదన్న సంగతి కార్మికులే కాక యాజమాన్యం పట్ల సానుభూతి వైఖరి ఉన్న ఆఫీసు సిబ్బంది

కూడ చెప్తారు. యంత్రాల నట్‌లు ఊడిపోతే దారం కట్టి, మేకులు కొట్టి నడిపించిన రోజులున్నాయని కార్మికులు అంటారు. యంత్రాలకు నూనెపెట్టడానికి మేలురకం నూనె సహితం ఇవ్వడంటారు.

ముడిసరుకు విషయంలోనూ అంతే. నెల్లిమర్ల మిల్లులో ఉపయోగించే గోగు నారలో మూడు రకాలున్నాయి. అతి తక్కువ రకం స్థానికంగా (అంటే విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో) పండే 'భీంలీ' రకం నార. దీనికంటే మేలు రకం ఒరిస్సాలో పండే 'కటక్' నార. అన్నిటికంటే మేలు రకం పశ్చిమ బెంగాల్‌లో, అస్సాంలో పండే తెల్ల నార (టి.డి.నార లేక 'టాస్సా' నార).

స్థానికంగా దొరికే భీంలీ నార నాసిరకం నార కావడం వల్ల బలంగా ఉండదు. మగ్గంమీద తెగిపోవడం, ఊక అయిపోవడం జరుగుతుంది. దీని వల్ల ఉత్పత్తి నాణ్యత తగ్గిపోవడమే కాక మగ్గానికి తరచు అంతరాయం కలిగి సమయం చాలా వృథా అవుతుంది. భీంలీ నారను మేలురకం (టి.డి లేక తెల్ల) నారతో కలిపి ఉపయోగించవలసి వుంటుంది. 2/3వ వంతు తెల్లనార, 1/3వ వంతు భీంలీ నార కలిపితే ఉత్పత్తి బాగానే జరుగుతుంది. బెంగాల్‌లో మొత్తం తెల్లనారనే ఉపయోగించే మిల్లులున్నాయి. నెల్లిమర్లలో 1/3 వంతు తెల్లనార, మిగిలినది భీంలీ, కటక్ నారల మిశ్రమం వాడడం అలవాటు.

అయితే తరచుగా ఇందులో కూడ మోసం జరిగేది. తెల్లనార తగ్గించడం, లేదా తెల్లనార అసలే లేకుండ చేసి భీంలీ, కటక్ నారల మిశ్రమాన్ని ఇవ్వడం జరిగేది. భీంలీ నార తెల్లనార ధర కంటే 20 శాతం నుండి 50 శాతం తక్కువ ఉంటుంది. కటక్ నార ధర రెండింటికీ మధ్యస్తంగా ఉంటుంది. కాబట్టి మిశ్రమం చేయడంలో మోసం చేయడమంటే అక్రమంగా ఖర్చు ఆదా చేసే మార్గం. సకాలంలో చేతిలో వర్కింగ్ క్యాపిటల్ ఉంచుకోలేని నిర్వహణాలోపం దీనికి కారణం కావచ్చు. లేదా ఈ రకంగా ఆదా చేసే డబ్బు మిల్లు అకౌంట్లలో కనిపించకుండా పోయి నల్లడబ్బు రూపంలో కనోరియా ఖాతాలో, లేక ఏదో ఒక యాజమాన్య వ్యక్తి ఖాతాలో జమ కావచ్చు. కానీ ఉత్పత్తి మీద దీని ప్రభావం బలంగా ఉంటుంది. ఉత్పత్తి నాణ్యత తగ్గిపోతుంది. అంతేకాక, తరచుగా నార తెగి ఉత్పత్తికి అంతరాయం కలగడం వల్ల

ఉత్పత్తి రాశి కూడ తగ్గిపోతుంది. నార బాగాలేకపోతే ఉత్పత్తి రోజుకు 70 టన్నులు రావడం కష్టం. మంచినార ఇచ్చి, యంత్రాలను సకాలంలో రిపేరు చేసి ఉంచితే దినానికి 100 కాదు 110 టన్నుల ఉత్పత్తి ఇచ్చిన రోజులు ఉన్నాయని కార్మికులు అంటారు. మిల్లును యజమానులు లాకౌట్ చేయదలచుకున్నప్పుడు నాసిరకం నార ఇచ్చి, ఉత్పత్తి సరిగ్గా రావడం లేదన్న కారణం చూపించి లాకౌట్ ప్రకటించేవారని కూడ కార్మిక నాయకులు అంటారు.

నారను కలపడంలో నెల్లిమర్ల యాజమాన్యం పిసినారితనం ప్రదర్శించే మాట సత్యమేనని యాజమాన్యానికి అనుకూలంగా ఉండే ఆఫీస్ సిబ్బంది సహితం అంటారు. అసలు కటక్ నార కూడ కలపకుండ వట్టి భీంలీ నార తమ చేతుల మీదుగా కార్మికులకు ఇచ్చిన రోజులు కూడ లేకపోలేదంటారు (అనేసి నాలుక కరుచుకుంటారు). ఇదంతా అడ్డదారులు తొక్కి నల్లడబ్బు పోగుచేసుకునే ఆరాటంలో భాగంగాను, అసమర్థ యాజమాన్య పద్ధతుల ఫలితంగాను జరిగింది.

## బకాయిలు – ప్రభుత్వ వైఖరి

ముడిసరుకు కొనుగోలు ఖర్చు ఎక్కువ చూపించి, నాణ్యత లేని నార సరఫరా చేసి, యంత్రాలకు మరమ్మత్తు లేకుండా చేసి, లేదా యాజమాన్యంలోని వ్యక్తులు బినామీగా నడిపే వర్క్‌షాపులలో అధిక ఖర్చుకు రిపేరు చేయించి, చవకగా కొన్న ముడిసరుకును ఉత్పత్తి కోసం ఉంచకుండా ధర పెరిగినప్పుడు అమ్మివేసి, ఉత్పత్తి కోసం ముడిసరుకు అవసరమైనప్పుడు అధిక ధరకు కొని, లేకపోతే ఉద్దరకు కొని వడ్డీతో సహా చెల్లించి – ఈ రకంగా అనేక రూపాలలో మిల్లును ఆర్థికంగా ముంచి మేనేజింగ్ డైరెక్టర్ కనోరియాతో పాటు ఇతర మేనేజ్‌మెంట్ వ్యక్తులు కూడ బాగా లాభపడ్డారు. పైగా మార్కెట్‌లో నార వర్తకులకు, ఇతర వ్యాపారస్తులకు నిరంతరం బకాయిలు పెట్టారు. వారికే కాక ప్రభుత్వ వాణిజ్య పన్నుల శాఖకు, ప్రావిడెంటు ఫండ్ శాఖకు, ఎలక్ట్రిసిటీ బోర్డుకు, ఇ.ఎస్.ఐకీ కూడ బకాయిలు పెట్టారు. పాలిథీన్ సంచులు మార్కెట్‌లోకి రావడం దీనికి మూలం అని కనోరియా వాదించాడు. ఆ నష్టం ఒక్క నెల్లిమర్ల మిల్లుకే కాక పొరుగున ఉన్న చిట్టివలస మిల్లుకూ, దూరాన ఉన్న ఇంకా అనేక మిల్లులకూ వచ్చింది. ఆ మిల్లులన్నీ 'సిక్' కాలేదు. కొన్ని

ఖాయిలాపడ్డా కోలుకొని బాగుపడ్డాయి. వాటిల్లో కొన్ని కేవలం మార్కెట్ దెబ్బతినడం వల్ల రోగగ్రస్తం అయి ఉండవచ్చును. కానీ నెల్లిమర్ల మిల్లు కేవలం అందువల్ల రోగగ్రస్తం కాలేదు. "నీ అవినీతి వల్లనే అయింది" అని సాక్షాత్తూ బి.ఐ.ఎఫ్.ఆరే నెల్లిమర్ల మిల్లు మేనేజింగ్ డైరెక్టర్ కనోరియాను తిట్టింది.

ప్రభుత్వ శాఖలకు కనోరియా పెట్టిన బకాయిలను పైన వివరించాము. ఈ విధంగా కోట్ల మొత్తంలో ఒక మిల్లు యజమాని కమర్షియల్ టాక్స్ వారికి, ప్రావిడెండ్ ఫండ్ వారికి, ఎలక్ట్రిసిటీ రెవెన్యూ శాఖలకు, ఇ.ఎస్.ఐకి బకాయిలు పెడుతుంటే ఆయా శాఖల అధికారులు, ప్రభుత్వం ఏం చేస్తున్నాయన్న అనుమానం ఎవరికైనా సహజంగా వస్తుంది.

వారికి సకాలంలో చెల్లింపులు చేయకుండా బకాయి పెట్టడం వివిధ చట్టాల కింద నేరం. ఆ నేరాల గురించి విచారణ జరపడానికి కొన్ని ప్రత్యేకమయిన కోర్టులున్నాయి. కొన్ని రకాల ఎగవేత మామూలు నేరస్మృతి కింద నేరమైతే ఇ.ఎస్.ఐకి మిల్లు యాజమాన్యం చెల్లించవలసింది చెల్లించకపోతే ఇ.ఎస్.ఐ చట్టం సెక్షన్ 85(ఎ) కింద నేరం. దానికి గరిష్ఠ జైలుశిక్ష 6 నెలలు. అలాగే సిబ్బంది ప్రావిడెంట్ ఫండ్ నిమిత్తం చెల్లించవలసిన యాజమాన్యం వాటా చెల్లించకపోవడం పి.ఎఫ్. చట్టం సెక్షన్ 14(1-ఎ) కింద నేరం. దానికి గరిష్ఠ జైలు శిక్ష 3 సంవత్సరాలు. ప్రావిడెంట్ ఫండ్ నిమిత్తం సిబ్బంది జీతాల నుండి కోతపెట్టిన మొత్తాన్ని జమచేయకపోవడం భారత శిక్షాస్మృతి (ఐపిసి) సెక్షన్ 406 కింద నేరం. దానికి గరిష్ఠ జైలు శిక్ష 3 సంవత్సరాలు.

నెల్లిమర్ల మిల్లు యాజమాన్యం వివిధ ప్రభుత్వ శాఖలకూ, సంస్థలకూ 5 సంవత్సరాలుగా 6.36 కోట్ల రూపాయలు చెల్లించవలసి ఉండి చెల్లించలేదని చెప్పాము. ఇందులో ప్రతీ ఒక్క చెల్లింపుకూ గడువు తీరిపోయిన తక్షణమే యాజమాన్యం ఒక నేరానికి పాల్పడినట్టవుతుంది. వారిపైన సంబంధిత చట్టం కింద కేసుపెట్టే అధికారమే కాదు, బాధ్యత కూడ ఆయా ప్రభుత్వ శాఖల మీద ఉంటుంది. అంతే కాక తమకు రావలసిన బకాయిలు రాబట్టుకోవడానికి సివిల్ చట్టం కింద తీసుకోవలసిన చర్యలు తీసుకునే అధికారము, బాధ్యత కూడ ఉంటాయి.

మరి వాళ్ళంతా ఏం చేస్తున్నారు? ఇ.ఎస్.ఐకి మిల్లు యాజమాన్యం 1985 నవంబర్ నుండి బకాయిలు పెడుతూ ఉంది. మొత్తం 1.58 కోట్లు బకాయి పెట్టింది.

కానీ ఇ.ఎస్.ఐ అధికారులు 1988 దాకా మిల్లు యాజమాన్యం మీద కేసులు పెట్టలేదు. 1988లో పాత బకాయిలన్నిటికి గాను రెండు కేసులు ఇ.ఎస్.ఐ సెక్షన్ 85(ఎ) కింద రిజిస్టర్ అయ్యాయి. అప్పుడు కూడ మిల్లు మేనేజర్లు, మేనేజింగ్ డైరెక్టరు కోర్టుకు రాలేదు. సమన్స్ తీసుకోలేదు. నాన్‌బెయిలబుల్ వారంట్లు జారీ అయ్యాయి. కాని అమలు కాలేదు. నెల్లిమర్ల జూట్ మిల్లు మేనేజిమెంట్ "తప్పించుకు తిరుగుతున్న నేరస్తులు" అని 1991 ఫిబ్రవరి 20న ప్రొక్లమేషన్ అచ్చయింది. అయినప్పటికీ ఏం కాలేదు. బకాయిల నిమిత్తం మిల్లు ఆస్తులను జప్తు చేస్తూ 1990 డిసెంబర్ 31 నాడు ఎంప్లాయీస్ ఇన్స్యూరెన్సు కోర్టు ఆర్డర్ జారీ చేసింది. అది కూడ అమలు కాలేదు.

ప్రావిడెంట్ ఫండ్‌కు యాజమాన్యం వాటా, సిబ్బంది వాటా రెండూ కూడ నెల్లిమర్ల మిల్లు దొరలు 1985 డిసెంబర్ నుండి ఎగ్గొడుతున్నారు. మొత్తం 2.32 కోట్లు ఎగ్గొట్టారు. అయినా ప్రావిడెంట్ ఫండ్ శాఖ అధికారులు కూడ 1988 దాకా నెల్లిమర్ల మేనేజ్‌మెంట్‌పైన కేసులు పెట్టలేదు. అప్పుడు కేసులు పెట్టడం మొదలుపెట్టి వరసగా (మూడు నెలల బకాయికి ఒక కేసు చొప్పున) యాజమాన్యం వాటా ఎగ్గొట్టినందుకు పి.ఎఫ్. చట్టం సెక్షన్ 14(1-ఎ) కింద 61 కేసులు, కార్మికుల వాటా ఎగ్గొట్టినందుకు ఐ.పి.సి సెక్షన్ 406 కింద 7 కేసులు పెట్టారు. ఈ కేసులపైన విచారణ ఇప్పటికీ జరగలేదు.

ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్‌కు చట్టంలో ఇంకొక అధికారం కూడ ఉంది. పి.ఎఫ్. బకాయిలు వసూలు చేసుకోవడానికి అవసరమైన చర్యలన్నీ (సివిల్ కోర్టు ఆర్డర్ అవసరం లేకుండానే) ఆ అధికారి చేపట్టవచ్చునని పి.ఎఫ్. చట్టం సెక్షన్ 14-బి అంటుంది. ఈ అధికారాన్ని కూడ ప్రావిడెంట్ ఫండ్ అధికారులు 1991 దాకా వినియోగించుకోలేదు.

ఒక ఘరానా నేరస్తుడి విషయంలో ప్రభుత్వానికి ఇంత అలసత్వం ఎందుకు? కనోరియా ప్రభుత్వానికి చెల్లించవలసిన మొత్తాలను ఎగ్గొట్టకుండా మొదట్లోనే కట్టుదిట్టం చేసి వుంటే, లేదా అతను ఎగ్గొట్టడం మొదలు పెట్టగానే చట్టపరమయిన చర్యలు తీసుకొని ఉంటే నెల్లిమర్ల మిల్లును పిండుకొని వదిలిపెట్టిపోయే అవకాశం అతనికి కలిగేది కాదు. 1990 తరువాత ఈ జాగ్రత్తలు తీసుకున్నారు కాబట్టే ఆ తరువాతి కాలంలో మిల్లు బకాయిలు బాగా తగ్గాయి. మిల్లును లీజుకు తీసుకున్న గోవింద్

శారదాకు మిల్లును నడపడంలో ఆసక్తి లేకపోవడానికి ఇది కూడ ఒక కారణం కావచ్చు. కానీ 1985 చివరి భాగంలో కనోరియా ఎగవేత మొదలుపెట్టినప్పటి నుండి ప్రతీ ప్రభుత్వ శాఖా అతని మోసాన్ని దాదాపు 3 సంవత్సరాలు చూస్తూ ఉపేక్షించింది. ఆ తరువాత ఒకరి తర్వాత ఒకరు మేలుకొని చర్యలు చేపట్టేటప్పటికి అతను బి.ఐ.ఎఫ్.ఆర్‌లో అర్జీ పడేసి పక్కకు తప్పుకునే ఎత్తుగడ ఆశ్రయించాడు.

ఒక మామూలు జేబుదొంగకు ఇందులో నూరవ వంతు ఔదార్యం కూడ వ్యవస్థ చూపించదు. కానీ ఈ పెట్టుబడిదారీ క్రిమినల్ తమ కళ్ళముందే మిల్లును నష్టాలలో పడేసి పనిలో పనిగా తన జేబులు నింపుకుంటూ ఉంటే అధికారులంతా ఉదాసీనంగా చూస్తూ ఉండిపోగలరు. ఎందుకు అనే ప్రశ్నకు ఈ మిల్లు విషయంలో నిర్దిష్ట సమాధానం చెప్పడానికి కావలసిన సమాచారం లభ్యం కావడం కష్టం కానీ 'కార్పొరేట్ క్రిమినల్స్' పట్ల మామూలుగా ఉండే ఈ మెతక వైఖరికి అనేక సాధారణ కారణాలున్నాయి. వాటినిక్కడ ప్రస్తావించడం అసందర్భం కాజాలదు.

అధికార యంత్రాంగంలోనూ రాజకీయ నాయకులలోనూ ఉన్న అవినీతి దీనికొక ముఖ్య కారణం. స్థానిక అధికారులు, ఎంఎల్ఏల నుండి హైదరాబాద్‌లోని ఉన్నత అధికారులు, మంత్రుల దాకా ఒకరు కాకపోతే ఒకరు అవినీతిపరులుంటారు. వాళ్ళ చేతిలో వందలు పెడితే వేలు మిగుల్చుకోవచ్చు, లక్షలు పెడితే కోట్లు మిగుల్చుకోవచ్చు. కొంప మొత్తం కూలే దాకా వాళ్ళు ఉదాసీనంగా చూస్తూ ఊరుకుంటారు.

అవినీతి అటుంచి, పెట్టుబడిదారులు పాల్పడే ఈ ఆర్థిక నేరాలను నేరాలుగా చూసే దృక్పథమే అసలు లేదు. తన యింట్లో ఒక దొంగ కన్నం వేసి వేయి రూపాయల విలువగల వస్తువులు ఎత్తుకుపోతే గగ్గోలు పెట్టే వాణిజ్య పన్నుల అధికారి లక్షల రూపాయల పన్నుల ఎగవేతను ఆ దొంగతనం కన్నా పెద్ద నేరంగా చూడడు. చిన్న నేరంగానూ చూడడు, అసలు ఆవేశపడడు, 'దొంగ వెధవను పట్టుకోండి' అంటూ చిందులు వేయడు.

పెట్టుబడిదార్ల లాభాలు, బాగోగులు 'దేశ అభివృద్ధి'తో ముడిపడి ఉండడం కనోరియా వంటి వాళ్ళకు ఉన్న మరొక సౌకర్యం. పన్నులు ఎగ్గొట్టాడనీ, పి.ఎఫ్, ఇ.ఎస్.ఐలకు బకాయిపడ్డాడనీ కంపెనీ ఆస్తి మీదికి పోతే మిల్లే మూతపడుతుందేమో! అసలే జూట్ పరిశ్రమ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఉంది. బెంగాల్‌లో ఒకదాని

వెంబడి ఒకటి జూట్ మిల్లులు మూతపడుతూ ఉన్నాయి. డబ్బు ఎప్పటికప్పుడు చెల్లించమంటే వర్కింగ్ కాపిటల్ దెబ్బతింటుందేమో! ఉత్పత్తి నిలిచిపోతుందేమో! ఈ రకమైన ప్రమాదం నిజంగా ఉన్నా లేకున్నా ఉందని కనోరియా వంటి మిల్లు యజమాని బెదిరించగలడు. ఉందని అవినీతిపరులయిన అధికారులు, మంత్రులు నటించగలరు. లేదా ఉన్నదానికంటే ఎక్కువ ప్రమాదం ఇరువర్గాలు కలిసి చూపించగలవు. మిల్లు నడుస్తుండడం దేశసౌభాగ్యానికీ కార్మికుల సంక్షేమానికీ విజయనగరం జిల్లా ప్రగతికీ అవశ్యం కాబట్టి వాళ్ళంతా నటిస్తుంటే ప్రజలు నోరు మూసుకొని ఆమోదించాలి.

మళ్ళీ కనోరియా కథలోకి వద్దాం.

ఇ.ఎస్.ఐ, ప్రావిడెంట్ ఫండ్ బకాయిలను మూడు సంవత్సరాలు ఉపేక్షించిన తరువాత 1988లో ఆ రెండు శాఖల అధికారులూ చట్టపరమయిన చర్యలు మొదలు పెట్టారని చెప్పాము కదా! రాష్ట్ర ప్రభుత్వ వాణిజ్య పన్నుల శాఖ కూడ 1987 నుండి మిల్లు ఎగవేస్తున్న సేల్స్‌టాక్స్ బకాయిల వసూలుకై చట్టపరమైన చర్యలు చేపట్టే ప్రయత్నం 1988 చివర భాగంలో మొదలుపెట్టింది. 1987-91 కాలంలో మిల్లుకున్న సేల్స్‌టాక్స్ బకాయిలను ఈ పట్టికలో చూడవచ్చు.

**నెల్లిమర్ల మిల్లు వాణిజ్య పన్నుల బకాయిలు**

(రూపాయలు)

| సం॥ | జనరల్ సేల్స్‌టాక్స్ | సెంట్రల్ సేల్స్ టాక్స్ |
|---|---|---|
| 1987-88 | 4,33,156 | 82,370 |
| 1988-89 | 32,42,036 | 21,77,525 |
| 1989-90 | 13,87,236 | 18,92,708 |
| 1990-91 | 74,41,151 | 49,55,420 |
| | 1,25,03,579 | 91,08,023 |

మొత్తం 2,16,11,602 రూపాయలు

వాణిజ్య పన్నుల శాఖ పన్ను బకాయిల వసూలుకై ఉపక్రమించగానే కనోరియా రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటిషన్ వేసి తన కంపెనీ ఖాయిలా పడిందనీ, బి.ఐ.ఎఫ్.ఆర్ దానిపైన విచారణ చేపట్టిందనీ, అందువల్ల పన్ను బకాయిల వసూలుకై బలవంతపు

చర్యలేవీ చేపట్టకుండా హైకోర్టు 'స్టే' ఇవ్వాలనీ కోరాడు. హైకోర్టు స్టే ఇచ్చింది. నిజానికి బి.ఐ.ఎఫ్.ఆర్‌కు అర్జీ కూడ హైకోర్టు పిటిషన్‌తోబాటే పెట్టినట్టున్నాడు. లేకపోతే హైకోర్టు స్టే ఇచ్చిన తరువాత పెట్టాడో! మొత్తానికి అప్పటికి అతను చెప్పినట్టుగా బి.ఐ.ఎఫ్.ఆర్ విచారణ ఏమీ మొదలు కాలేదు. ఆ సంగతి బి.ఐ.ఎఫ్.ఆర్ హైకోర్టుకు స్పష్టం చేసింది. తానింకా విచారణ చేపట్టలేదు కాబట్టి సిక్ ఇండస్ట్రియల్ కంపెనీస్ ఆక్ట్ సెక్షన్ 22 కింద బలవంతపు జప్తు నుండి రక్షణ పొందే అవకాశం నెల్లిమర్ల యాజమాన్యానికి లేదని బి.ఐ.ఎఫ్.ఆర్ చెప్పడంతో హైకోర్టు తానిచ్చిన స్టేను తొలగించింది. దీని మీద కనోరియా సుప్రీంకోర్టులో స్పెషల్ లీవు పిటిషన్ వేశాడు.

ఇది జరుగుతున్న తరుణంలోనే (ఏది ముందు ఏది వెనుక అనేది స్పష్టంగా తెలియదు) కనోరియా నెల్లిమర్ల మిల్లును గోవింద్ శారడాకు లీజుకు ఇచ్చాడు. అయితే బి.ఐ.ఎఫ్.ఆర్ ముందు తానే హాజరయ్యాడు. శారడాకు ఇచ్చిన లీజు కాగితాలు సమర్పించమని బి.ఐ.ఎఫ్.ఆర్ అడిగినా సమర్పించలేదు. అందువల్ల లీజుకు సంబంధించిన వివరాలు వారిద్దరికీ తప్ప ఎవరికీ తెలియవు.

వాణిజ్య పన్నుల వసూలుకు సంబంధించి హైకోర్టు తానిచ్చిన 'స్టే'ని తొలగించినా, స్పెషల్ లీవు పిటిషన్‌లో సుప్రీంకోర్టు ఆ 'స్టే'ని పునరుద్ధరించకపోయినా రాష్ట్ర ప్రభుత్వం పన్ను వసూలుకు ఉపక్రమించలేదు. చట్టపరమయిన జప్తు చర్యలు కూడ చేపట్టలేదు. పైపెచ్చు ఒకదానిమీద ఒకటి మిల్లు యాజమాన్యానికి పలు రాయితీలు ఇచ్చింది. ఈ విషయం తరువాత చూద్దాం.

## లాకౌట్ల పరంపర

గత అయిదు సంవత్సరాలుగా సాగుతున్న లాకౌట్ల పరంపరలోని మొదటి ఘట్టం ఈ దశలో ప్రారంభం అయింది. 1989 మే నెలలో మిల్లు మొదటిసారి లాకౌట్ అయింది. కార్మికులలో క్రమశిక్షణ లోపించిందనీ, వారు సక్రమంగా ఉత్పత్తి చేయడం లేదనీ, అందువల్ల మిల్లు నడపలేననీ గోవింద్ శారడా లాకౌట్ ప్రకటించాడు. అతని ఆధ్వర్యంలో ఐదేళ్లలో జరిగిన అన్ని లాకౌట్లకూ కారణాలు రెండే – క్రమశిక్షణ లేకపోవడం, రోజుకు 95 టన్నులు ఉత్పత్తి చేయకపోవడం. అతను మిల్లును కనోరియా నుండి కొనుక్కోలేదు. లీజుకు తీసుకున్నాడు. మిల్లును శ్రద్ధగా నడిపి బాగుచేసే

ఉద్దేశ్యం అతనికి లేదు. కార్మికులతో న్యాయ సమ్మతంగా వ్యవహరించి ఉత్పత్తి చేయించుకునే దృష్టి లేదు. ప్రభుత్వం నుండి, మిల్లు కార్మికుల నుండి రాయితీలు లభిస్తేనే మిల్లు నడపదలుచుకున్నాడు. రాయితీలు పొందడం కోసం మిల్లుకు తాళాలు వేసి లాకౌట్ అని చెప్పి వెళ్ళిపోతాడు. తాను కోరింది దక్కితేనే తిరిగి వస్తాడు.

నెలల తరబడి మిల్లు మూతబడిన కారణంగా కార్మికులలో అలజడి పెరిగిందన్న కారణం చూపించి రాష్ట్ర ప్రభుత్వం అతని ఒత్తిడికి సులభంగానే లొంగింది. వాణిజ్య పన్నుల బకాయిల నిర్బంధ వసూలును నిలువరిస్తూ హైకోర్టు ఇచ్చిన స్టే తొలగిపోయినా ఏ చర్యలూ తీసుకోని ప్రభుత్వం, మిల్లు లాకౌట్ ఏడవ నెలలోకి వచ్చేటప్పటికి యాజమాన్యాన్ని బుజ్జగించడానికి ఒక జీవో జారీ చేసింది. 1990 జనవరి 11న జారీచేసిన జీవోఎంఎస్ 52 ఏమంటుందంటే – ఈ ప్రభుత్వం నెల్లిమర్ల మిల్లుకు వాణిజ్య పన్ను బకాయిల వసూలు విషయంలో కొన్ని రాయితీలు ఇవ్వదలుచుకుంది. ఆ రాయితీలకు పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ తుది రూపం ఇచ్చేదాకా కంపెనీ పైన స్థానిక వాణిజ్య పన్ను శాఖ అధికారులు ఎటువంటి నిర్బంధ చర్యలు తీసుకోరాదు. అంతేకాదు, ప్రస్తుత లాకౌట్ ముగిసి మిల్లు తెరిచిన తరువాత మొదటి నాలుగు నెలల అమ్మకం పన్ను 5వ నెలదాకా చెల్లించనవసరం లేదు. ఆ తరువాత కూడ ఆ నాలుగు నెలల అమ్మకం పన్నును 8 వాయిదాలలో చెల్లించవచ్చు. నిష్కారణమైన లాకౌట్ ఇంకా కొనసాగుతుండగానే లాకౌట్ ఎత్తివేసిన తరువాత ఇవ్వబోయే రాయితీని ప్రభుత్వం ఈ జీవోఎంఎస్ 52 ద్వారా ప్రకటించింది.

అయినా గోవింద్ శారదాకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలు సరిపోలేదు. అతనికి కార్మికుల నుండి కూడ రాయితీలు కావాలి. మిల్లు తెరవాలంటే కార్మికులు 95 టన్నుల దినసరి ఉత్పత్తి ఇవ్వాలనీ లేదా తమ జీతాల నుండి కంపెనీకి నెలకు (ఒక్కొక్క కార్మికుడు) 200 రూ॥లు వడ్డీలేని రుణం ఇవ్వాలనీ షరతు పెట్టాడు. ఈ రకంగా కార్మికుల జీతాలలో కొంత భాగం చెల్లింపును భవిష్యత్తుకు వాయిదావేసి, దానిని వడ్డీ లేని అప్పుగా యాజమాన్యం పెట్టుబడిలో కలుపుకునే విచిత్రమైన ఒప్పందాలు పశ్చిమ బెంగాల్ జూట్ మిల్లులలో 1985 తరువాత మొదలయ్యాయి. అక్కడ 5 మిల్లులు లీజుకు తీసుకొని నడుపుతున్న గోవింద్ శారదా ఆ అలవాటును నెల్లిమర్లలోనూ ప్రవేశపెట్టాడు. ఒక పక్క ప్రభుత్వం నుండి పాతబాకీల చెల్లింపుకు

రాయితీలు పొంది పెట్టుబడిలో కలుపుకోవడం, మరొక పక్క కార్మికుల జీతాలు వడ్డీ లేకుండా బాకీ పెట్టి పెట్టుబడిలో కలుపుకోవడం 'సిక్' అయిపోయిన కంపెనీలకు వర్కింగ్ కాపిటల్ సమకూర్చే అతి చవక మార్గం అయింది. దేశం పేరిట ప్రభుత్వం, కాలే తమ కడుపుల కోసం కార్మికులు దీనికి ఒప్పుకోవాలి. మరోసారి అతను ఇద్దరి పెట్టుబడినీ వృథాచేసి దగాచేసి మిల్లు మూసేసిపోతే ఇద్దరూ అడగలేరు.

నెల్లిమర్ల కార్మికులు మొదట్లో ఈ షరతులకు ఒప్పుకోలేదు. దీర్ఘకాలం మిల్లు మూతపడడం వల్ల విసిగిపోయి 1990 జనవరి నెలలో కార్మికులు దాదాపు ఒక డజను ఆర్.టి.సి బస్సులను తగలబెట్టారు. చివరికి ఫిబ్రవరి నెలలో ఒప్పందం జరిగింది. ప్రతీ కార్మికుడూ తన దినసరి వేతనంలో 5 రూపాయలు వడ్డీలేని అప్పుగా యాజమాన్యానికి ఇచ్చేటట్టు, ఈ ఏర్పాటు 1991 డిసెంబర్ దాకా సాగేటట్టు, కార్మికులు రోజుకు 95 టన్నుల ఉత్పత్తి ఇవ్వడానికి ప్రయత్నించేటట్టు ఒప్పందం జరిగాక 1990 ఫిబ్రవరిలో మిల్లు గేట్లు తెరుచుకున్నాయి. 1990 ఫిబ్రవరి నుండి 1991 డిసెంబర్ దాకా ప్రతి రోజూ ప్రతి కార్మికుడూ 5 రూపాయలు వడ్డీలేని అప్పుగా ఇవ్వడం అంటే మొత్తం 1.32 కోట్ల రూపాయల ఇంటరెస్ట్ ఫ్రీ లోన్ అని అర్థం.

దీని రుచి మరిగిన గోవింద్ శారదా ఇంకా ఎక్కువ కావాలని కోరుకున్నాడు. 1991 డిసెంబర్ నెల రాకముందే జూన్ నెలలోనే మళ్ళీ లాకౌట్ ప్రకటించాడు. కార్మికులు ఇస్తామని ఒప్పుకున్న 95 టన్నుల ఉత్పత్తి ఇవ్వడం లేదని అతని ఆరోపణ. ఇకమీదట రోజుకు 5 రూపాయలు కాక ప్రతీ కార్మికుడూ 10 రూపాయల వడ్డీలేని రుణం ఇవ్వాలనీ, దానికి ఒప్పుకుంటేనే మిల్లు గేట్లు తెరుస్తాననీ అన్నాడు. కార్మికులు దీనికి ఒప్పుకోలేదు. చివరికి, రోజు కూలీలో 5 రూపాయలు ఇచ్చే ఒప్పందం 1991 డిసెంబర్‌తో ఆగిపోకుండా 1993 డిసెంబర్ దాకా కొనసాగేటట్టు (అంటే ఇంకొక 1.35 కోట్లు అదనంగా కార్మికులు యజమానికి వడ్డీ లేకుండా అప్పు పెట్టేట్టు) ఒప్పందం జరిగి 1991 సెప్టెంబర్‌లో మిల్లు తెరుచుకుంది. నిజానికి కార్మికుల నుండి మరికొంత పెట్టుబడి పిండుకోవడం కోసం తప్ప ఈ లాకౌట్‌కు వేరే కారణమేమీ లేదనేది స్పష్టమే.

ఇంతలో బి.ఐ.ఎఫ్.ఆర్‌లో కనోరియా కొంప మునిగే పరిస్థితి ఏర్పడింది. 'సిక్' చేసి అందరికీ బకాయిలు పెట్టి బి.ఐ.ఎఫ్.ఆర్ శరణు వేడితే అప్పులవాళ్ళ కారణంగా కంపెనీ ఆస్తులకూ తన ఆస్తులకూ నష్టం రాకుండా మిల్లు పునరుజ్జీవం

జరుగుతుంది కదా అని కనోరియా ఆశించాడు. కాని బి.ఐ.ఎఫ్.ఆర్ మిల్లు వ్యవహారాలను బాగానే అర్థం చేసుకుంది. ఇది ఖాయిలాపడిన కంపెనీ కాదు, ఖాయిలా చేయబడిన కంపెనీ అని గుర్తించింది. కాబట్టి మిల్లు రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు పెట్టిన బకాయిల వసూలుకు గాను నిర్బంధ చర్యలు చేపట్టే అవకాశం ఆయా ప్రభుత్వ శాఖలకు ఇవ్వడానికి సిద్ధం అయింది. విశాఖపట్నంలోని రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్‌కు ఇటువంటి అనుమతి ఇవ్వడానికి బి.ఐ.ఎఫ్.ఆర్ తయారయిన రోజునే సినిమా ఫక్కీలో కనోరియా ఇంకొక 'స్టే' ఆర్డర్ కలకత్తా హైకోర్టు నుండి తీసుకొచ్చాడు. తనకు కనోరియా కొంత మొత్తం బాకీ ఉన్నాడనీ, తన ప్రయోజనాలకు నష్టకరమయిన చర్య ఏదీ బి.ఐ.ఎఫ్.ఆర్ చేపట్టకుండా హైకోర్టు నిరోధించాలనీ కలకత్తాకు చెందిన ఒక అనామకుడు పిటిషన్ వేశాడు. దీనిపై కలకత్తా హైకోర్టు 1991 సెప్టెంబర్ 30న 'స్టే' మంజూరుచేసి బి.ఐ.ఎఫ్.ఆర్‌ను నివారించింది. ఆ 'స్టే' ఇన్ని ఏళ్ళు గడిచినా ఇంకా కొనసాగుతూనే ఉంది. దానిని తొలగించి కంపెనీ బకాయిల కోసం నిర్బంధ చర్యలు చేపట్టాలన్న ఆసక్తి మన రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటే కదా!

1992 జూన్ 1వ తేదీన మిల్లు మళ్ళీ లాకౌట్ అయింది. ఉత్పత్తి 95 టన్నులు ఇవ్వడం లేదనీ, కార్మికులలో క్రమశిక్షణ లేదనీ మళ్ళీ నెపం పెట్టారు. అప్పటికి మిల్లు యూనియన్‌కు కొత్త నాయకత్వం వచ్చింది. గత రెండు లాకౌట్ల సందర్భంగా చేసుకున్న ఒప్పందాల విషయంలో అసంతృప్తిగా ఉన్న కార్మికులు నాయకత్వ మార్పును కోరుకున్నారు. అప్పటికి ఒక దశాబ్దం పైగా అధ్యక్షునిగా ఉన్న గంగాధరరెడ్డి స్థానంలో ఏలూరు శ్రీకృష్ణ జూట్ మిల్లు యూనియన్ అధ్యక్షుడు అయిన ప్రసాద్ (ఐ.ఎఫ్.టి.యు) అధ్యక్షుడయ్యాడు. ఈ మార్పు గత లాకౌట్ తొలగించిన కొద్ది కాలానికి 1991 నవంబర్‌లో జరిగింది. 1992 జూన్‌లో లాకౌట్ ప్రకటించిన అనంతరం ఐ.ఎఫ్.టి.యు ఆధ్వర్యంలో లాకౌట్‌కు వ్యతిరేకంగా కొత్త రూపాలలో విస్తృతమయిన కార్మిక ఆందోళన జరిగింది. ప్రభుత్వం లాకౌట్ కొనసాగింపును నిషేధించింది. మూడు నెలల తరువాత యాజమాన్యం కొత్త రాయితీలేవీ పొందకుండానే లాకౌట్ ఎత్తివేసింది.

ఈ లోపల మిల్లు యాజమాన్యానికి ప్రభుత్వం నుండి వచ్చే రాయితీలు వస్తూనే ఉన్నాయి. పాత అమ్మకం పన్ను బకాయిల వసూలుకు నిర్బంధ చర్యలు చేపట్టవద్దనీ, 1990లో లాకౌట్ ఎత్తివేసి మిల్లు తెరిచిన తరువాత మొదటి నాలుగు నెలల అమ్మకం

పన్ను ఎప్పటికప్పుడు చెల్లించనక్కరలేదనీ, 5వ నెలలో మొదలుపెట్టి 8 వాయిదాలలో చెల్లించవచ్చుననీ రాష్ట్ర ప్రభుత్వం 1990 జనవరి 11న జారీ చేసిన జీవోఎంఎస్ 52 గురించి పైన చెప్పాము. 27 ఫిబ్రవరిన మిల్లు తెరిచిన యాజమాన్యం నాలుగు నెలల తరువాత అమ్మకం పన్ను ఒక వాయిదా మాత్రం చెల్లించి జూలై నెలలో హైకోర్టుకు పోయి పన్ను వసూలు ఆపించమని రిట్ పిటిషన్ వేసింది. వెంటనే హైకోర్టు ఫిబ్రవరి నుండి జూలై వరకు కట్టవలసిన అమ్మకం పన్ను వసూలును తాత్కాలికంగా నిలిపివేస్తూ సెప్టెంబర్ నెలలో స్టే మంజూరు చేసింది. అయినా వడ్డించే వాడు నీ వాడయినప్పుడు పరమాన్నం కోసం రిట్ పిటిషన్లు ఎందుకని రాష్ట్ర ప్రభుత్వం 1990 డిసెంబర్ 14న జీవోఎంఎస్ 1007 జారీ చేసి, అమ్మకం పన్ను చెల్లింపు 'సెలవు'ను 1991 మార్చిదాకా పొడిగించింది. అంటే 1991 మార్చిదాకా అమ్మకం పన్ను చెల్లించవలసిన అవసరం లేదనీ, ఆ తరువాత బకాయిని 8 వాయిదాలలో చెల్లించవచ్చుననీ అర్థం. అయినా నెల్లిమర్ల యాజమాన్యం ఆశ తీరలేదు. ఈ వాయిదా సౌలభ్యం 1990 ఫిబ్రవరి తరువాత కట్టవలసిన పన్నులకే కాక మొత్తంగా 1987 నుండి కంపెనీ బకాయిపడిన అమ్మకం పన్ను అంతటికీ వర్తించాలనీ కోరుతూ హైకోర్టులో మరొక రిట్ పిటిషన్ వేసింది. అటువంటి ఆదేశాలు జారీచేసే అధికారం తనకు లేదంటూ హైకోర్టు తిరస్కరించింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం పాత బకాయిల వసూలుకై నిర్బంధ చర్యలకు పూనుకునే సూచనలేవీ కనపడడం లేదన్న భరోసాతో కాబోలు కంపెనీ సుప్రీంకోర్టులో వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను 19 ఆగస్టున ఉపసంహరించుకుంది. 1987 నుండి 1991 దాకా నెల్లిమర్ల మిల్లు వాణిజ్య పన్నుల శాఖకు పెట్టిన 2.16 కోట్ల రూపాయల బకాయి ఈనాటికీ సజీవంగా వుంది.

రాష్ట్ర ప్రభుత్వంతో సరసాలు, న్యాయస్థానాలతో సల్లాపాలు ఈ విధంగా సాగుతుండగా మరొక వైపు మిల్లును మాత్రం సంవత్సరానికొకసారి లాకౌట్ చేయడం, ముడిసరుకు నాణ్యతతోనూ, యంత్ర పరికరాల సామర్థ్యంతోనూ సంబంధం లేకుండా కార్మికులు రోజుకు 95 టన్నులు ఉత్పత్తి ఇవ్వాలని డిమాండ్ చేయడం, తమ వేతనాల నుండి రోజుకు కొంత వడ్డీలేని అప్పుగా యాజమాన్యానికి అర్పించి వర్కింగ్ కాపిటల్ సమకూర్చి పెట్టాలని కార్మికులపై ఒత్తిడి పెట్టడం కంపెనీ యాజమాన్యానికి పరిపాటి అయింది.

కడుపుకొట్టి కార్మికులను లొంగదీసుకోవడం కోసం మిల్లును ఈ విధంగా పదే పదే లాకౌట్ చేస్తుంటే ప్రభుత్వం ఏం చేయలేదా? పారిశ్రామిక వివాదాల చట్టం (ఐ.డి చట్టం) కింద ప్రభుత్వానికి ఈ విషయంలో కొన్ని అధికారాలు ఉన్నాయి. లాకౌట్ చేయడానికి కంపెనీ యాజమాన్యం ప్రభుత్వం అనుమతి తీసుకోనవసరం లేదు కానీ సమాజం శ్రేయస్సును, కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని పారిశ్రామిక వివాదాలలో జోక్యం చేసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంది. అధికారం ఉందంటే జోక్యం చేసుకునే బాధ్యత కూడ ఉందని అర్థం. ప్రభుత్వానికి ఉండే సంక్షేమ అధికారాలన్నీ నిజానికి బాధ్యతలే. పారిశ్రామిక వివాదంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని ఐ.డి చట్టం సెక్షన్ 10 కింద వివాదాన్ని ఒక బోర్డుకు, లేదా ట్రిబ్యునల్‌కు, లేదా కోర్టుకు నివేదించి సెక్షన్ 10(3) కింద లాకౌట్ కొనసాగింపును నిషేధించవచ్చును. కార్మిక సంఘం ప్రభుత్వానికి అర్జీ పెట్టుకోకపోయినా స్వంత చొరవతో ప్రభుత్వం సెక్షన్ 10 కింద జోక్యం చేసుకోవచ్చు. లాకౌట్‌ను నిషేధించిన తరువాత ఆ నిషేధాన్ని కంపెనీ ఉల్లంఘిస్తే (అంటే లాకౌట్‌ను కొనసాగిస్తే) అది ఐ.డి చట్టం సెక్షన్ 26(2) కింద నేరం అవుతుంది. 1992 జూన్ నెలలో నెల్లిమర్ల యాజమాన్యం ప్రకటించిన లాకౌట్ కొనసాగింపును జూలై 23న రాష్ట్ర ప్రభుత్వం నిషేధించినప్పటికీ యాజమాన్యం వెంటనే లాకౌట్ ఎత్తివేయకుండా కొంతకాలం కొనసాగించింది. మరి కార్మికశాఖ సెక్షన్ 26(2) కింద కేసు పెట్టిందా అని అడిగితే 'కేసు పెట్టినట్టే ఉన్నాం. ఫైలు చూడాలి' అని విజయనగరంలోని కార్మికశాఖ అధికారులు ఒకరి ముఖం ఒకరు చూసుకుంటారు! కానీ 1989లోను, 1991లోను లాకౌట్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోలేదు. నిరుద్యోగాన్ని, ఆకలిని కార్మికులపైన ఒక ఒత్తిడిగా ప్రయోగించి లాభం పొందే అవకాశం యాజమాన్యానికి కల్పించింది.

## కార్మిక సంఘం

1993 జూలై 5న మళ్ళీ నెల్లిమర్ల యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. ఆ లాకౌట్ ఈనాటికీ కొనసాగుతూ ఉంది.

ఈ ఘట్టాన్ని వివరించే ముందు మిల్లు యూనియన్ చరిత్ర కొంచెం చెప్పుకోవాలి. పూర్తి వివరాలలోకి పోవడం ఈ నివేదిక లక్ష్యానికి అవసరం కాదు. నెల్లిమర్ల జూట్ మిల్లు కార్మిక సంఘం చాలా పాతది. 1931 మార్చి నెలలో కొంతమంది కార్మికులు

రహస్యంగా సమావేశమై యూనియన్ నెలకొల్పారు. తొలుత సభ్యత్వం రహస్యంగానే చేయించారు. అప్పట్లో రోజుకు 10 గంటలు పని చేయించుకొని నాలుగు అణాలు (పావలా) కూలి ఇచ్చేవారు. అదనపు వేతనాలేవీ లేవు. యూనియన్ పెట్టుకుంటే ఉద్యోగాలు పోతాయేమోనని రహస్యంగా పెట్టుకున్నారు. కానీ 1932లో బోనస్ కోసం రెండు నెలలు సమ్మె చేసినప్పుడు యూనియన్ బహిరంగమైంది. సమ్మెకు మిల్లులో ఇంజన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న పెమ్మరాజు వెంకటరావు నాయకత్వం వహించారు. ఈ సమ్మె వల్ల బోనస్ రాలేదు. ఆరుగురు కార్మికుల ఉద్యోగాలు కూడ పోయాయి. కానీ యూనియన్ వచ్చింది. ఉద్యమించే సంప్రదాయం వచ్చింది. యూనియన్‌ను రిజిస్టరు చేయించుకొని పెమ్మరాజు వెంకట్రావును కార్యదర్శిగాను, ప్రముఖ కాంగ్రెసు కార్మికోద్యమ నాయకుడు పి. శివరావును అధ్యక్షునిగాను ఎన్నుకొన్నారు. ఇంకొక ప్రముఖ కాంగ్రెసు కార్మిక నాయకుడు వి.వి. గిరి కొంతకాలం ఉపాధ్యక్షునిగా ఉన్నారు. శివరావు నాలుగు సంవత్సరాలు అధ్యక్షునిగా ఉన్న తరువాత పెమ్మరాజు వెంకట్రావు అధ్యక్షుడయ్యాడు.

కాంగ్రెస్ ప్రముఖులు నెల్లిమర్ల యూనియన్‌కు నాయకులుగా ఉండటం, లేదా యూనియన్ నాయకత్వం కోసం పోటీపడడం ఈనాటికీ కొనసాగుతూనే వుంది. ప్రస్తుత స్థానిక ఎమ్ఎల్ఏ, రాష్ట్ర ప్రభుత్వ చక్కెరశాఖ మంత్రి అయిన సాంబశివరాజు 1968 నుండి 1976 దాకా నెల్లిమర్ల యూనియన్ గౌరవాధ్యక్షుడు. పేరుకు గౌరవాధ్యక్షుడే అయినా అధ్యక్షపాత్రే నిర్వహించాడంటారు. ఆ తరువాత కూడ మేనేజ్‌మెంట్‌కు యూనియన్‌కు మధ్య రాయబారాలలో అతని పాత్ర కొనసాగింది. ప్రస్తుతం మెజారిటీ కార్మికుల మద్దతు ఉన్న ఐ.ఎఫ్.టి.యు నాయకత్వానికి వ్యతిరేకంగా అతను కార్మికులలో ఒక వర్గాన్ని కూడగట్టే ప్రయత్నంలో ఉన్నాడు.

కాంగ్రెస్ పార్టీ నాయకులకు యూనియన్ వ్యవహారాలలో పాత్ర ఉండడం వల్ల మంచి జరిగిందా చెడు జరిగిందా అనేది పరిస్థితులను బట్టి మారింది. కాంగ్రెసు పార్టీలో జాతీయోద్యమ స్ఫూర్తి ఉన్నన్నాళ్ళు అది పెద్దగా నష్టం చేయలేదు. మొదటి నాలుగు సంవత్సరాలలో కార్యదర్శిగా, ఆ తరువాత అధ్యక్షునిగా మొత్తం 30 సంవత్సరాలకు పైగా యూనియన్ నాయకునిగా ఉన్న పెమ్మరాజు వెంకట్రావును పాతతరం కార్మికులు ఇప్పటికీ గౌరవంగా తలచుకుంటారు. అయితే 1960ల మధ్య కాలం నుండి కాంగ్రెస్‌లో ముఠా తగాదాలు ప్రబలం అయ్యాయి. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ముఠాలు ఏర్పడడమే కాక, మొత్తంగానే అధికార రాజకీయాలకు ముఠా

కొట్లాటల స్వభావం హెచ్చు అయింది. వీటి ఫలితం యూనియన్ మీద పడింది. ఉదాహరణకు 1961 చివరి భాగం నుండి 1968 దాకా యూనియన్ అధ్యక్షునిగా ఉన్న వేదుల జగన్నాథరావు, ప్రస్తుత మంత్రి సాంబశివరాజు కాంగ్రెస్‌లో భిన్న వర్గాలకు చెందినవారు. 1967లో సాంబశివరాజు అనధికార కాంగ్రెసు అభ్యర్థిగా గజపతినగరం నుండి పోటీచేసి ఎంఎల్ఏగా గెలిచాడు. దాని ఫలితం నెల్లిమర్ల జూట్ మిల్లు యూనియన్‌పైన పడింది. వేదుల జగన్నాథరావు నాయకత్వం నుండి తొలగిపోయి సాంబశివరాజు గౌరవ అధ్యక్షునిగా, నరసింహమూర్తి రాజు అధ్యక్షునిగా ఉన్న కొత్త నాయకత్వం వచ్చింది. తరువాతి కాలంలో కూడ అధికార రాజకీయాల ఎత్తులు, పైఎత్తుల ప్రభావం యూనియన్‌పైన పడుతూనే ఉంది.

సాంబశివరాజు, నరసింహమూర్తి రాజులు నాయకులుగా వున్న యూనియన్ 1974లో యాజమాన్యంతో చేసుకున్న ఒక ఒప్పందం కార్మికులలో చాలా అలజడికి దారి తీసింది. కార్మికులపైన పోలీసు కాల్పులు జరిగి ఐదుగురు చనిపోయారు. ఫలితంగా కార్మికులు మరింత రెచ్చిపోయి అక్కడే వున్న ఒక కార్మికశాఖ అధికారిపైన దాడిచేసి కొట్టి చంపారు. 50 మంది కార్మికులు ఈ ఘటన ఫలితంగా జైలుకు పోయారు. 192 మంది ఉద్యోగం నుంచి తొలగించబడ్డారు.

1974 జూన్ 10వ తేదీన జరిగిన ఈ దారుణానికి కారణమైన ఒప్పందంలోని విషయాలు ఇవి :

(1) పీస్‌రేట్ ప్రకారం వేతనాలు చెల్లించే శాఖలలో ఉత్పత్తి సామర్థ్యం పెరిగిన కారణంగా ఎప్పుడో నిర్ణయించిన రేట్లు చెల్లవనీ, తగ్గించాలనీ యాజమాన్యం ప్రతిపాదించగా యూనియన్ ఒప్పుకుంది. అయితే దీనివల్ల నెలసరి వేతనం 100 రూపాయలు తక్కువ వస్తుందని చెప్పి కార్మికులు ఆగ్రహించారు.

(2) 1952లో ఇ.ఎస్.ఐ చట్టం రాకముందు నెల్లిమర్ల మిల్లులో ఆనారోగ్య కారణం వల్ల కార్మికులు సెలవు పెడితే సగం రోజులకు జీతం ఇచ్చే ఒప్పందం ఉండింది. ఇ.ఎస్.ఐ చట్టం వచ్చిన తరువాత కూడ ఇ.ఎస్.ఐ సదుపాయానికి అదనంగా ఇది కూడ కొనసాగేటట్టు అప్పటి యూనియన్ ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు దానిని తొలగించాలన్న మేనేజ్‌మెంట్ ప్రతిపాదనకు యూనియన్ ఒప్పుకుంది.

(3) 1972లో గ్రాట్యుటీ చట్టం రాకముందు కార్మికుడు ఒక సంవత్సరంలో 192 రోజులు పనిచేస్తే ఆ సంవత్సరం అతను సర్వీసులో ఉన్నట్టేనని నెల్లిమర్ల మిల్లులో

| 1974 జూన్ 10వ తేదీన జరిగిన పోలీసు కాల్పులలో చనిపోయిన కార్మికులు | | | |
|---|---|---|---|
| పేరు | ఊరు | ఆర్థిక పరిస్థితి | కుటుంబం |
| 1. మొయిద సీతారాం (40) | కొండగుంపాం | భూమిలేదు | భార్య, ఒక కొడుకు ఇద్దరు కూతుళ్ళు |
| 2. బోని రాములు (42) | జరజాపుపేట | భూమిలేదు | భార్య, ముగ్గురు కూతుళ్ళు, ఒక కొడుకు |
| 3. సిడగల నారాయణ (50) | మొయిద | భూమిలేదు | భార్య, ఒకకూతురు, ఒక కొడుకు (పిల్లలిద్దరికీ బుద్ధిమాంద్యం వుంది) |
| 4. నల్లా సన్యాసిరావు (28) | మొయిద | భూమిలేదు | భార్య, ఒక పెంచుకున్న కొడుకు |
| 5. ఇతను వెలగాడకు చెందినవాడు. పేరు, ఇతర వివరాలు తెలీవు. | | | |
| (ఈ ఐదు కుటుంబాలకు ఎటువంటి నష్టపరిహారం లభించలేదు) | | | |

ఒప్పందం ఉండింది. గ్రాట్యుటీ దాని ప్రకారం నిర్ణయం అయ్యేది. అయితే గ్రాట్యుటీ చట్టం ప్రకారం 240 రోజులు పనిచేస్తేనే ఆ సంవత్సరం సర్వీసులో ఉన్నట్లు లెక్క. కార్మికుల హక్కులకు సంబంధించి కొత్త చట్టం ఏదైనా వచ్చినప్పుడు అంతకుముందు ఒక మిల్లులో ఉన్న ఒప్పందం కొత్త చట్టం కన్నా ఎక్కువ అనుకూలంగా ఉంటే అదే కొనసాగడం పరిపాటి. కాని యూనియన్ నాయకత్వం పాత ఒప్పందాన్ని వదిలిపెట్టి గ్రాట్యుటీ చట్టాన్ని అనుసరించడానికి ఈ ఒప్పందంలో అంగీకరించింది.

ఇటువంటి మరికొన్ని అంశాలు కూడ ఆ ఒప్పందంలో ఉన్నాయి. ఒప్పందం గురించి తెలుసుకున్న కార్మికులు కోపంగా గుమికూడారు. వాళ్ళను శాంతింపజేయడం యూనియన్ గౌరవ అధ్యక్షుడైన సాంబశివరాజుకు సాధ్యం కాలేదు. అతను వెళ్ళి పోయాడు. ఆ తరువాత జరిగిన పోలీసు కాల్పులలో ఐదుగురు చనిపోయారు. కోపోద్రిక్తులైన కార్మికులు తిరగబడి అక్కడే వున్న లేబర్ ఆఫీసర్‌ను చంపారు.

ఈ ఘటన వల్ల ఆ తరువాత మిల్లులోను, మిల్లు బయట పోలీసుల చేతిలోను కార్మికులు అనుభవించిన నిర్బంధం వల్ల యూనియన్ నాయకత్వంపైన కార్మికులలో విశ్వాసం పోయింది. కొంతకాలం యూనియన్‌లో అనిశ్చిత పరిస్థితి ఏర్పడింది. పెమ్మరాజు వెంకట్రావు తిరిగి వచ్చాడు కాని వయసు మీరినందువల్ల నిలదొక్కుకోలేక

పోయాడు. చివరికి చిట్టివలస జూట్ మిల్లు యూనియన్‌కు అధ్యక్షునిగా వున్న గంగాధరరెడ్డిని (ఎ.ఐ.సి.టి.యు) 1979లో నెల్లిమర్ల కార్మికులు తమ యూనియన్ అధ్యక్షునిగా ఎన్నుకొన్నారు. ఆ తరువాత దాదాపు 12 సంవత్సరాలు రెండు మిల్లుల యూనియన్‌ల అధ్యక్షునిగా ఆయనే ఉన్నాడు. నెల్లిమర్ల మిల్లులో 1981లో పీస్‌రేట్ వేతనాల గురించి, 1984లో టైంరేట్ వేతనాల గురించి కార్మికుల మెప్పు పొందే ఒప్పందాలు చేశాడు. 1979లోనే నెల్లిమర్ల కార్మికులు దీర్ఘమయిన సమ్మెచేసి 'సిక్‌లీవ్'కు సంబంధించిన హక్కును తిరిగి పొందారు.

అయితే గోవింద్ శారడా మిల్లును లీజుకు తీసుకున్న తరువాత 1989-90లో 10 నెలలు, 1991లో దాదాపు 4 నెలలు మిల్లును లాకౌట్ చేసినపుడు కార్మికులు తమ వేతనం నుండి ప్రతిరోజూ 5 రూపాయల వడ్డీలేని అప్పు యాజమాన్యానికి ఇవ్వాలని ఒప్పందం చేసుకోవడంతో కార్మికులలో అసంతృప్తి పెరిగింది. ఈ నేపథ్యంలో ఏలూరులోని శ్రీకృష్ణ జూట్ మిల్లు యూనియన్ నడుపుతున్న ఐ.ఎఫ్.టి.యు నెల్లిమర్ల జూట్ మిల్లు యూనియన్‌ను కూడ తన చేతిలోకి తీసుకుంది. అధ్యక్షునిగా ప్రసాద్, కార్యదర్శిగా సురేష్ యూనియన్ ప్రధాన బాధ్యులుగా వున్నారు. 1992 జూన్-ఆగస్టు నెలలలో మళ్ళీ లాకౌట్ జరిగినప్పుడు యూనియన్ కొత్త నాయకత్వం కార్మికులను, వారి కుటుంబాలను కదిలించి రకరకాల రూపాలలో ప్రజాందోళనలు నడిపింది. స్త్రీలను మొట్టమొదటిసారిగా పెద్దఎత్తున ఉద్యమంలోకి తీసుకొచ్చారన్న గుర్తింపు ఐ.ఎఫ్.టి.యు నాయకులు పొందారు. కార్మికులను చైతన్యవంతులను చేసే పద్ధతిలో యూనియన్ నడుపుతారన్న గుర్తింపు కూడా పొందారు.

## చివరి ఘట్టం

1993 జూలై 5న మిల్లు మళ్ళీ లాకౌట్ అయింది. లాకౌట్ అంటే చీఫ్ ఎగ్జిక్యూటివ్, మేనేజర్లు చెప్పా చెయ్యకుండా కలకత్తాకు వెళ్ళిపోవడమే. కనీసం సూపర్‌వైజర్ల స్థాయిలోని సిబ్బందికి కూడ ముందుగా చెప్పరు. తాము విశ్వసించే మార్వాడీలకు చెప్తారు తప్ప తెలుగువాళ్ళకు చెప్పరు. పోలీసులకు మాత్రం 'మిల్లు ఆస్తులు జాగ్రత్త' అని చెప్పిపోతారు. 'పొద్దున్న డ్యూటీలోకి పోతే పర్సనల్ మేనేజర్, కమర్షియల్ మేనేజర్ కనిపించరు. ఏమయ్యారంటే కలకత్తాకు పోయారంటారు. లాకౌట్ అని అప్పుడు తెలుస్తుంది' అని ఒక గుమాస్తా వాపోతాడు.

ఈ లాకౌట్‌కు ఒక నేపథ్యం వుంది. గ్రాట్యుటీ చెల్లింపు విషయంలో మేనేజ్‌మెంట్‌కు, యూనియన్‌కు వివాదం నడుస్తూ ఉండింది. అలవాటు ప్రకారం లాకౌట్ చేసి పోతారేమోనని యూనియన్ ఆందోళన చెందింది. దానికి తగ్గట్టే ప్రతినెలా 340 లారీల ముడినార రావలసింది, అలాంటిది జూన్ నెలలో 140 లారీలే వచ్చాయి. లాకౌట్ చేసే ఎత్తుగడలో భాగంగా నార తెప్పించడం లేదని తాము అనుమాన పడుతున్నట్టు యూనియన్ మేనేజ్‌మెంట్‌తో అనింది. అనుమాన నివృత్తికిగాను ఇద్దరూ ఒక అంగీకారానికి వచ్చారు. రెండు లారీ లోడ్ల నార వస్తే ఒక లారీ లోడు ఉత్పత్తి బయటకి పోవచ్చుననీ, మిగిలిన సరుకు మిల్లులోనే ఉండాలనీ ఒప్పందం. ఈ ఒప్పందం జూలై 3న జరిగింది. రెండు రోజులకే జూలై 5న లాకౌట్ మొదలైంది. ఉత్పత్తి అయిన సరుకును యూనియన్ బయటికి తీసుకుపోనివ్వడం లేదని, కార్మికులకు సంబంధం లేని మిల్లు యాజమాన్య వ్యవహారాలలో యూనియన్ జోక్యం చేసుకుంటూ ఉందని మేనేజ్‌మెంట్ ఆరోపించింది.

ఇది ఏ విధంగా చూసినా చాలా చిన్న సంగతే. అయినా ఇంత చిన్న కారణంగా చేసిన లాకౌట్ ఒక సంవత్సరం రెండు నెలలు గడిచినా తొలగిపోలేదంటే కార్మికులను లొంగదీసుకోవడం మేనేజ్‌మెంట్ ప్రధాన ఉద్దేశం అని స్పష్టంగా అర్థం అవుతుంది. కార్మికులు పని విషయంలో క్రమశిక్షణా రహితంగా ఉండడాన్ని తమ యూనియన్ ప్రోత్సహించదని, నిజానికి తాము వచ్చిన తరువాతే పని విషయంలో క్రమశిక్షణ పెరిగి దినసరి ఉత్పత్తి పెరిగిందని ఐ.ఎఫ్.టి.యు నాయకులు అంటారు. అయితే మిల్లు నిర్వహణ విషయంలో, కార్మికుల న్యాయమైన హక్కుల విషయంలో వారు పట్టుదలగా ఉంటారు. అటువంటి యూనియన్‌తో ప్రజాస్వామికంగా నడుచుకోవడం నేర్చుకొని మిల్లును నడిపేటంతటి శ్రద్ధాసక్తులు గోవింద్ శారడాకు లేవు.

లాకౌట్ జరిగిన వెంటనే విశాఖపట్నంలోని జాయింట్ లేబర్ కమిషనర్ (జె.సి.ఎల్) కన్సిలియేషన్ (రాజీ) మీటింగులు ఏర్పాటు చేశారు. జూలై 7వ తేదీ మీటింగుకి యాజమాన్యం హాజరు కాలేదు. యూనియన్ ప్రతినిధులు మాత్రం వచ్చారు. 16వ తేదీన ఇద్దరూ హాజరయ్యారు. జె.సి.ఎల్ నాలుగు సూత్రాల ప్రతిపాదన పెట్టాడు. యాజమాన్యం లాకౌట్ ఎత్తివేయాలి. మిల్లును నిరవధికంగా నడపాలి. కార్మికులు సమ్మె లేదా గో స్లో చేయకూడదు. సరుకు బయటకు పోకుండా అడ్డుకోకూడదు. యూనియన్ ఈ ప్రతిపాదనకు వెంటనే ఒప్పుకుంది కానీ మేనేజ్‌మెంట్ వాయిదా

అడిగింది. 17వ తేదీ సమావేశానికి మేనేజ్‌మెంట్ గైరు హాజరయ్యింది. 'సరుకు నిరాటంకంగా బయటకు పోనియ్యాలి' అనేదే కోరిక అయితే యూనియన్ అందుకు అంగీకరించగానే లాకౌట్ ఎత్తివేయాలి. కానీ అసలు సమస్య అది కాదు కాబట్టి మేనేజ్‌మెంట్ చర్చలకు గైర్హాజరయింది.

ఈసారి రాష్ట్ర ప్రభుత్వం సకాలంలోనే స్పందించి నెల్లిమర్ల మిల్లు పారిశ్రామిక వివాదాన్ని జూలై 27నే ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్‌కు నివేదించింది. లాకౌట్ కొనసాగింపును నిషేధించింది. ఈ తరువాత లాకౌట్ కొనసాగడం శిక్షార్హమైన నేరం అయినప్పటికీ అది ఇంకా కొనసాగుతూనే వుంది. చట్ట విరుద్ధమైన లాకౌట్‌ను ఎత్తివేసి మిల్లు తెరవాలనీ, కార్మికులకు జీతాలు చెల్లించాలనీ డిమాండు చేస్తూ కార్మికులు, వారి కుటుంబాలు, ఇతర ప్రజలు వేల సంఖ్యలో ఊరేగింపులు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. సెప్టెంబర్ 13న జరిగిన ఒక కార్యక్రమంలో యాజమాన్యాన్ని ప్రాసిక్యూట్ చేసి కంపెనీ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని కార్మికులకు జీతాలు ఇవ్వాలని యూనియన్ నాయకులు ప్రతిపాదించగా జిల్లా కలెక్టర్ దానిని చట్టసమ్మతమైన ప్రతిపాదనగా అంగీకరించారు. ప్రభుత్వం దానిని అమలు చేస్తుందని హామీ ఇచ్చారు. కాని ఏమీ జరగలేదని వేరే చెప్పనవసరం లేదు.

చట్టం చేతులు ముడుచుకొని కూర్చుంటే నేరస్తుడు ఇంకింత అహంకారంగా ప్రవర్తించక ఏమి చేస్తాడు? మిల్లు మూసివేతకు తమదే బాధ్యత అని యూనియన్ క్షమాపణ చెప్పిన తర్వాతే తాము చర్చలకు వస్తామని నేరగాడయిన యాజమాన్య ప్రతినిధి కార్మిక మంత్రి కన్నా లక్ష్మినారాయణతో అంతకు ముందే ప్రకటించాడు. లాకౌట్‌ను చట్ట విరుద్ధం అని ప్రభుత్వం అప్పటికే ప్రకటించినప్పటికీ ప్రభుత్వ ప్రతినిధి అయిన కార్మిక మంత్రి కిమ్మనలేదు.

ఇప్పుడిక మంత్రి సాంబశివరాజు సహాయంతో కార్మికుల దగ్గర ఒప్పుకోలు పత్రాలు విడివిడిగా తీసుకునే కార్యక్రమం మొదలైంది. రెండున్నర దశాబ్దాలుగా నెల్లిమర్ల మిల్లు యూనియన్‌కు సంబంధించి ఒక పెద్దమనిషి పాత్ర నిర్వహిస్తున్న సాంబశివరాజు వ్యవహారశైలి గురించి విభిన్న అభిప్రాయాలు వున్నాయి. వాటి సత్యాసత్యాలను తేల్చడం ఈ నివేదిక లక్ష్యం కాదు. అయితే ప్రస్తుత లాకౌట్ సందర్భంగా అతను నిర్వహిస్తున్న పాత్ర నిర్ద్వందంగా శోచనీయమైనదని చెప్పవచ్చు. పారిశ్రామిక వివాదాల పరిష్కారానికి చట్టం ఒక పద్ధతిని నిర్దేశించింది. దానిని కార్మికులు అతిక్రమిస్తే వాళ్ళకిక ఏ హక్కులూ వుండవని వెలివేస్తారు. యాజమాన్యం

ఆ చట్టాన్ని గౌరవించ నిరాకరించి దొడ్డిదారిన కార్మికులను లోబరుచుకొనే ప్రయత్నం చేస్తే ప్రభుత్వంలో మంత్రిగా వున్న వ్యక్తి ఏం చేయాలి? యాజమాన్యాన్ని ఎట్లాగైనా చట్టానికి లోబడేటట్లు చేయాలి. దాని బదులు యాజమాన్యం చేస్తున్న దొడ్డిదారి ప్రయత్నాలకు సహకరించే మంత్రిని ఏమనాలి?

లాకౌట్‌కు యూనియన్‌దే బాధ్యత అనీ, చట్ట విరుద్ధమైన లాకౌట్ కాలానికి జీతాలు అడగబోమనీ సంతకం చేసిన కార్మికులను మాత్రమే పనిలోకి తీసుకునే ప్రాతిపదికన మిల్లు తెరుస్తామని యాజమాన్యం నవంబర్ 11న నోటీసు పెట్టింది. మంత్రి సాంబశివరాజు 1700 మంది కార్మికుల చేత సంతకాలు చేయించాడు. ఈ 1700 మందితో నవంబర్ 15న మిల్లు మళ్ళీ తెరుచుకుంది.

అయితే యూనియన్ నాయకత్వం ఈ ఒప్పుకోలు పత్రాలు చెల్లవంటూ హైకోర్టులో రిట్ పిటిషన్ వేయగా హైకోర్టు మిల్లు యాజమాన్యాన్ని అభిశంసిస్తూ తీర్పు ఇచ్చింది. వివాదం ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ ముందు ఉండగా చట్ట విరుద్ధంగా లాకౌట్ కొనసాగించి, కార్మికుల కడుపులు మాడ్చి లొంగదీసుకొని పూచీకత్తులు రాయించుకుంటే అది చెల్లకపోవడమే కాదు, ఆ విధంగా రాయించుకోవడం పారిశ్రామిక వివాదాల చట్టం సెక్షన్ 25 కింద నేరం అని హైకోర్టు అనింది. ప్రభుత్వంలో మంత్రిగా ఉంటూ, చట్ట విరుద్ధంగా లాకౌట్ కొనసాగిస్తున్న యాజమాన్యానికి మరొక చట్ట విరుద్ధమయిన చర్యకు పాల్పడడానికి సహకరించిన మంత్రి సాంబశివరాజు కూడ హైకోర్టు నోట అభిశంసనకు గురి అయ్యాడు. హైకోర్టు తాత్కాలిక ఆదేశం నవంబర్ 24న, తుదితీర్పు 1994 మార్చి 30న వచ్చాయి. తాత్కాలిక ఆదేశం రాగానే మిల్లు మళ్ళీ మూతపడింది.

నేరాలకు పాల్పడే పెట్టుబడిదారుల మెడలు వంచడానికి చట్టాలలో ఉన్న అవకాశాలే తక్కువైతే, చట్టాలు కల్పించిన ఆ కొద్దిపాటి అవకాశాన్ని సహితం వినియోగించుకునే ఉద్దేశం ప్రభుత్వాలకు లేదు కాబట్టి గోవింద్ శారడా డి.సి.ఎల్ చర్చలకు హాజరు కాకుండా, మిల్లు తెరవకుండా, అరెస్టు కాకుండా, ఆవగింజంత ఆస్తి కూడ జప్తు కాకుండా దొరబాబుగా తిరుగుతూనే వున్నాడు. కడుపు కాలిన కార్మికులు మాత్రం మళ్ళీ మళ్ళీ ఆందోళనకు దిగి దెబ్బలు తింటూనే ఉన్నారు.

1994 జనవరి 29వ తేదీన కార్మికులు, కార్మికుల కుటుంబ సభ్యులు నెల్లిమర్లలో రైల్‌రోకో చేపట్టారు. మద్రాసు – హౌరా రైలు మార్గం మీద లెవెల్ క్రాసింగ్ గేటు దగ్గర పెద్ద సంఖ్యలో బైఠాయించారు. చట్ట విరుద్ధమని ప్రభుత్వమే ప్రకటించిన లాకౌట్ ఎత్తివేయించి మిల్లు తెరిపించాలని వాళ్ళ డిమాండు. ప్రభుత్వం జిల్లా కలెక్టర్ ద్వారా కచ్చితమైన హామీ ఇచ్చి మిల్లు తెరిపించే తేదీ ప్రకటించాలని వాళ్ళు పట్టుపట్టారు. ఆ పని చేయడానికి సిద్ధంగా లేని ప్రభుత్వం కార్మికులపైన దాడికి పూనుకుంది. మొదట బాష్పవాయువు ప్రయోగించారు. కార్మికులు ఉల్లిపాయలతో సిద్ధంగా వుండడం వలన అది ఫలించలేదు. తరువాత పోలీసులు లాఠీలు చేతపట్టుకొని పట్టాలపైన కూర్చున్న స్త్రీలపైనబడి చితకబాదారు. రైలు పట్టాలపైనున్న జనం మధ్యలో ఉన్న యూనియన్ అధ్యక్షుడు ప్రసాద్‌ను బలప్రయోగంతో అరెస్టుచేసి ఈడ్చుకుపోయారు. కావాలని అతని బట్టలు ఊడదీసి కొడుతూ డ్రాయరు మీద తీసుకుపోయారు. ప్రసాద్‌ను పోలీసులు చంపేస్తారేమోనని కార్మికులు తీవ్రంగా ఆందోళన చెంది ప్రసాద్‌ను తీసుకుపోనీయకుండా అడ్డుపడే ప్రయత్నం చేశారు. అతనిని తీసుకుపోతుండగానే పోలీసులు జనం మీద కాల్పులు జరిపారు. ఐదుగురు చనిపోయారు.

**1994 జనవరి 29వ తేదీన జరిగిన కాల్పులలో చనిపోయిన కార్మికులు**

| పేరు | ఊరు | ఆర్థిక పరిస్థితి | కుటుంబం |
|---|---|---|---|
| కాళ్ళ అప్పల సత్యనారాయణ (40) | జరజాపుపేట | భూమిలేదు | భార్య, ఇద్దరు కొడుకులు |
| కోల అచ్చప్పడు (45) | నెల్లిమర్ల | భూమిలేదు | భార్య, ముగ్గురు కొడుకులు ఒక కూతురు |
| నల్లి ముత్యాలనాయుడు (38) | జరజాపుపేట | భూమిలేదు | భార్య, ముగ్గురు కూతుళ్ళు ఒక కొడుకు |
| దువ్వారపు చిన్న (41) | జరజాపుపేట | భూమిలేదు | భార్య, ఇద్దరు కొడుకులు ఒక కూతురు |
| కల్లూరి రాంబాబు (25) | మన్యపురిపేట | | అవివాహితుడైన నిరుద్యోగి |

## ఎనిమిది నెలల తర్వాత

లాకౌట్ కొనసాగుతూనే వుంది. కనోరియా ఈ మధ్య గోవింద్ శారడా లీజు రద్దు చేసినట్టున్నాడు. (స్పష్టంగా ఎందుకు తెలీదంటే ఆ లీజు ఎట్లాంటిదో ఎవ్వరికీ తెలీదు. దాని కాపీ ఇమ్మని బి.ఐ.ఎఫ్.ఆర్ అడిగినా కనోరియా ఇవ్వలేదని పైన చెప్పాము.) కాంతి పుగాలియా అనే వ్యక్తికి ఇప్పుడు మిల్లును అమ్మినట్లు కనోరియా చెప్తున్నాడు. ఈ కొత్త యాజమాన్యం మిల్లు తెరిచే నిమిత్తం యూనియన్‌తో చర్చలు మొదలుపెట్టింది. "పాత యాజమాన్యానికి తెరిచే ఉద్దేశం లేదు. కొత్తవాళ్ళకు చిత్తశుద్ధి ఉందనుకున్నాము కాని ఇప్పుడు అనుమానం వస్తున్నది." ఇవి యూనియన్ నాయకుల మాటలు కావు. విజయనగరంకు చెందిన ఒక కార్మిక శాఖ అధికారి మాటలు.

వాళ్ళు పెడుతున్న షరతులు అట్లా ఉన్నాయి. అమ్మకం పన్ను బకాయిలు, కరెంటు బిల్లు బకాయిలు చెల్లించడానికి ఇంకొంత కాలం గడువు ఇవ్వాలి. ప్రావిడెంట్ ఫండ్, ఇ.ఎస్.ఐ బకాయిల చెల్లింపు సులభవాయిదాల మీద ఉండాలి. ఇవి ప్రభుత్వానికి షరతులు. ఈ షరతులను అర్థం చేసుకోవచ్చు.

కానీ కార్మికులపైన కొన్ని పెద్ద షరతులు పెట్టారు. 5 సంవత్సరాలు జీతాలు పెంచమని అడగకూడదు. జీతాలు ఎట్లాగూ చాలా కాలంగా పెరగలేదు. 1988 తరువాత జూట్ వేతన కమిటీ ఏర్పాటు కాలేదు. 1992లో ఏర్పరచవలసిన నాలుగవ జూట్ వేతన కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పరచనేలేదు. పశ్చిమ బెంగాల్‌లో 1992లో జూట్ పరిశ్రమలో త్రైపాక్షిక వేతన ఒప్పందాలు జరిగాయి కాని ఆంధ్రప్రదేశ్‌లో జరగలేదు. కొత్త యాజమాన్యం జీతాలే కాదు, డి.ఎ. కూడ ఐదేళ్ళు ఎక్కడున్నది అక్కడే వుండాలంది. మన్మోహన్‌సింగ్ పుణ్యాన ద్రవ్యోల్బణం డబుల్ డిజిట్స్‌లో వుంటుండగా కార్మికులు ఈ షరతులకు ఎట్లా ఒప్పుకుంటారు?

అంతేకాదు మిల్లులో కార్మికులయిన యూనియన్ బాధ్యులు తప్ప 'బయటి వారైన' యూనియన్ నాయకులు మిల్లు గేట్లు దాటి లోపలికి రాకూడదనీ వాళ్ళతో మాట్లాడేదేమైనా వుంటే వేరే ఎక్కడైనా మాట్లాడతామనీ అంటున్నారు. అంటే కార్మికులకు మేనేజ్‌మెంట్‌తో వచ్చే దైనందిన సమస్యల పరిష్కారంలో యూనియన్ నాయకుల

పాత్ర వుండకూడదు. ఎటువంటి సమ్మెలు, గో స్లోలు చేయకూడదు. నార నాణ్యతతో, యంత్రాల స్థితిగతులతో సంబంధం లేకుండా రోజుకు 100 టన్నుల ఉత్పత్తి ఇవ్వాలి.

ఎట్లాగైనా మిల్లు తెరిచి ఉత్పత్తిలో వైవిధ్యం సాధించి మారుతున్న మార్కెట్ పరిస్థితులను ఆసరా చేసుకొని మిల్లును అభివృద్ధి చేసే ఉద్దేశ్యం కొత్త మేనేజ్‌మెంట్‌కు నిజంగా వుంటే ఈ చర్చలు ఎక్కడో ఒకచోట తెగుతాయి. కాని ఆ ఉద్దేశ్యం వారికి వుందా అని ప్రభుత్వ అధికారులు సహితం అనుమానిస్తున్నారు.

ఈ లోపల 6000 మంది కార్మికులు, వారి కుటుంబాలు ఎక్కడ కూలి దొరుకు తుందా అని వెతుక్కుంటూ జీవిస్తున్నారు. మిల్లు కార్మికులలో కొన్ని వందలమందిని మినహాయిస్తే అందరూ మగవాళ్ళే. ఎక్కువమందికి భూమి లేదు. ఉదాహరణకు జరజాపుపేటలోని 1467 మంది కార్మికులలో కేవలం 16 మందికి కొంత భూమి ఉంది. మిల్లు కార్మికుల భార్యలు, ఇతర కుటుంబ సభ్యులు బయట కూలీ చేసుకొనేవారు. కార్మికులకు నెలకు 1200 రూ॥ నుండి 1500 రూ॥ల దాకా వేతనం దొరికేది. అకస్మాత్తుగా 6000 మందిని అదే స్తోమతలో వేరేచోట ఇముడ్చుకోగల సామర్థ్యం విజయనగరం జిల్లా ఆర్థిక వ్యవస్థకు లేదు. అసలు అంతమందికి ఒక్కసారిగా ఏ రకమైన పనైనా చూపించే సామర్థ్యం లేదు. కొందరు మూటలు మోస్తున్నారు. కొందరు తాపీపని చేస్తున్నారు. కొందరు వలసపోయారు. ఎక్కడో ఒక చోట కూలీ సంపాదించుకొని తిన్నంత తింటూ పస్తులు వుంటూ ఆందోళనలలో పాల్గొంటూ మిల్లు గేట్లు తెరుచుకుంటాయని ఎదురు చూస్తున్నారు.

**సెప్టెంబర్ 1994**

## ఇప్పటి పరిస్థితి

ప్రస్తుతం నెల్లిమర్ల జూట్ మిల్లు పనిచేస్తోంది కాని పని పరిస్థితులలోను, ఇతరత్రా కూడ చాలా మార్పులు వచ్చాయి. జూట్ పరిశ్రమలో నెలకొన్న సంక్షోభం కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వాలు గోగునార పండించే రైతులకు ఎలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వకపోగా సింథటిక్ సంచుల ఉత్పత్తిని ప్రోత్సహించే చర్యలు తీసుకుంటున్నాయి. ఈ కారణంగా గత పదేళ్ళలో కొత్త జూట్ మిల్లుల స్థాపన లేకపోగా ఉన్న జూట్ మిల్లులే సంక్షోభంలోకి నెట్టబడ్డాయి. జూట్ పరిశ్రమకు ప్రధాన కేంద్రమైన పశ్చిమ బెంగాల్‌లోను, రెండో కేంద్రమైన ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోనైతే గుంటూరులోని భజరంగ్ జూట్ మిల్లు, కృష్ణా జిల్లాలోని సర్కారు ఫైబర్స్ జూట్ మిల్లు శాశ్వతంగా మూతబడ్డాయి. చిట్టివలస (విశాఖ జిల్లా); బొబ్బిలి, అరుణ, ఈస్ట్‌కోస్ట్ (విజయనగరం జిల్లా) జూట్ మిల్లులు దీర్ఘకాలిక లాకౌట్లలో ఉన్నాయి. నడుస్తున్న కొన్ని జూట్ మిల్లులు కూడ తమ ఉత్పాదక సామర్థ్యాన్ని తగ్గించుకున్నాయి. షిఫ్టుల కోత, పర్మనెంటు కార్మికులకు మాత్రమే పని ఉండడం, ఏడు రోజుల పనివారాన్ని ఆరు రోజుల పనివారంగా కుదించడం వంటి చర్యలతో ఉత్పత్తిని తగ్గించేశారు. నెల్లిమర్ల జూట్ మిల్లులో కూడ ఇదే పరిస్థితి.

1994 తర్వాత నెల్లిమర్ల జూట్ మిల్లు మూడుసార్లు దీర్ఘకాలిక లాకౌట్లు లేదా లేఆఫ్‌లకు గురైంది. 2009 తర్వాత లాకౌట్లు లేకపోయినా సగం మిల్లు (half run mill) గా నడుస్తున్నది. కాల్పుల నాటికి 5500 మంది కార్మికులుంటే నేడు వారి సంఖ్య 2000 కి తగ్గిపోయింది. పెరిగిన జీవన వ్యయంతో సమంగా వారి జీతభత్యాలు పెరగడం లేదు. పి.ఎఫ్., గ్రాట్యుటీ బకాయిల చెల్లింపు ఇప్పటికీ సకాలంలో జరగడం లేదు. ప్రభుత్వ యంత్రాంగం వత్తాసుతో, రాజకీయ నాయకుల ప్రత్యక్ష అండతో యాజమాన్యం యధేచ్ఛగా కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నది. అయితే కొత్త ఉపాధులు ఉనికిలోకి రావడంతో మిల్లు కార్మికుల పిల్లలు చదువుకుని ఇతర ఉద్యోగ, ఉపాధి పనులవైపు మళ్ళుతున్నారు.

ఈ అన్ని కారణాలవల్ల ఆ ప్రాంత యువత ఇప్పుడు నెల్లిమర్ల జూట్ మిల్లులో పనిచేయడానికి ఇష్టపడడం లేదు కూడ. ఈ పరిస్థితి నెల్లిమర్ల ప్రాంత పారిశ్రామిక వాతావరణాన్ని మౌలికంగానే మార్చివేసింది.

కాల్పుల నాటి పరిస్థితి స్థూలంగా ఇలా ఉండేది. అప్పుడు నెల్లిమర్ల జూట్ మిల్లు చుట్టుపక్కల సుమారు 20 గ్రామాలకు ప్రధాన జీవనాధార కేంద్రంగా ఉండేది. మరో 15 గ్రామాలకు వ్యవసాయం తర్వాత రెండవ జీవనాధార కేంద్రంగా ఉండేది. కాని నేడు నెల్లిమర్ల గ్రామంతో సహా ఏ ఒక్క గ్రామానికి కూడ జూట్ మిల్లు ప్రధాన జీవనాధార కేంద్రంగా లేదు. అంతేకాదు అనేక గ్రామాలకు మిల్లు రెండో జీవనాధార కేంద్రంగా కూడ లేకుండా పోయింది. అలాగని అక్కడి ప్రజలు తిరిగి వ్యవసాయానికి కూడా వెళ్ళలేదు. ఎక్కువమంది విజయనగరం, విశాఖపట్నం పట్టణాలలో పనులో, ఉద్యోగాలో వెతుక్కుంటూ వెళ్ళిపోయారు.

పాతికేళ్ళ క్రితం వరకూ జూట్ మిల్లు పని కోసం పోటీపడ్డ పరిస్థితికీ, నేడు మిల్లు పనికి ససేమిరా అంటున్న కొత్త పరిస్థితికీ మధ్య పోలికే లేదు. చాలీచాలని జీతాలవల్ల నేడు రిటైర్‌మెంట్ కాకముందే మిల్లు పనికి రాజీనామా చేసి వందలాదిమంది ఇతర పనులకు తరలిపోయారు. నాడు లాఠీలతో, తూటాలతో, రక్తపాతంతో జూట్ మిల్లు కార్మికవర్గాన్నీ, వారి జీవనోపాధినీ రాజ్యం అణచివేస్తే, నేడు సింథటిక్ బడా పారిశ్రామిక వర్గాలతో కుమ్మక్కయిన ప్రభుత్వ విధానాలు తూటాలను ప్రయోగించకుండానే వారిని అణచివేస్తున్నాయి. ప్రభుత్వాల సరళీకరణ విధానాలు జూట్ పరిశ్రమకు మరణ శాసన పత్రాలుగా మారాయి.

**పి. ప్రసాద్, ఇఫ్టూ**

# ఆజంజాహీ మిల్లు

నేత పరిశ్రమకు భారతదేశంలో పురాతన చరిత్ర వుంది. ఈ దేశపు చేనేత వస్త్రాలు ప్రపంచమంతటా ఎగుమతి అయ్యాయి. బ్రిటిష్ పాలన కాలంలో దేశంలోకి ఒక వరదగా మాంచెస్టర్ మిల్లు ఉత్పత్తులు దిగుమతి అయి దేశీయ చేనేత పరిశ్రమను ముంచెత్తాయి. అయితే అదే క్రమంలోనే భారతదేశంలో ఆధునిక నూలు మిల్లులు, బట్టల మిల్లులు పుట్టుకొచ్చాయి. భారతదేశంలోని మొట్టమొదటి ఆధునిక పరిశ్రమ బట్టల పరిశ్రమే. ఈ దేశానికి చెందిన ప్రముఖ పెట్టుబడిదారీ కుటుంబాలలో అధిక భాగం జౌళి పరిశ్రమలోనే మొదట అడుగుపెట్టాయి.

అయితే 1960ల మధ్యకాలం నుండి ఈ సంప్రదాయక బట్టల మిల్లులు సంక్షోభంలో పడ్డాయి. ఒకవైపు సింథటిక్ బట్టలతో పోటీపడలేక, ఇంకొకవైపు యంత్రాలను ఆధునీకరించలేక నష్టాలలో పడ్డాయి. అతి పేద వర్గాలను మినహాయించి తక్కిన అన్ని వర్గాల ప్రజలనూ సింథటిక్–కాటన్ మిశ్రమ వస్త్రాలు ఆకట్టుకోగలుగుతున్నాయి. పేద వర్గాలు ఉపయోగించే ముతక బట్టలను మాత్రమే ఉత్పత్తిచేసి మార్కెట్‌లో లాభదాయకంగా నిలదొక్కుకోవడం కాటన్ మిల్లులకు కష్టం అయింది. పోనీ ఉత్పత్తిలో కొత్త ప్రయోగాలు చేసి మార్కెట్‌ను పెంచుకోవాలంటే ఉత్పత్తి విధానాలను, సాంకేతిక ప్రక్రియలను, మార్కెటింగ్ వ్యూహాలను ఆధునీకరించాలి. దీనికి నైపుణ్యం కావాలి, పెట్టుబడి కావాలి.

1970ల మధ్య కాలం నుండి జౌళి పరిశ్రమలో సింథటిక్–కాటన్ మిశ్రమ వస్త్రాల ఉత్పత్తిదే పైచేయి కాసాగింది. 1985లో ప్రభుత్వం ప్రకటించిన నూతన

జౌళి విధానం దీనిని మరింత ప్రోత్సహించింది. సింథటిక్ నూలు దిగుమతిపైన, మిశ్రమ నూలు వస్త్రాల ఉత్పత్తికి ఉపయోగించే యంత్రాలపైన సుంకాలు తగ్గించటం, ఇతర రూపాలలో ప్రోత్సాహం ఇవ్వడం మొదలయింది. ఈ మధ్య కాలంలో బహుళ జాతి గుత్త పెట్టుబడి కంపెనీలు కూడ ఈ రంగంలోకి ప్రవేశించాయి.

సంప్రదాయక బట్టల మిల్లులు ఈ నేపథ్యంలో వేగంగా పతనం అయ్యాయి. మొత్తం మీద కాటన్ బట్టల ఉత్పత్తి పెరుగుతూనే ఉన్నా ఆ పెరుగుదల అంతా కరెంటు మగ్గాల ద్వారా (పవర్ లూమ్స్) వస్తూ ఉంది. కరెంటు మగ్గాలు నెలకొల్పడానికీ నిర్వహించడానికీ అవసరమయ్యే పెట్టుబడి తక్కువ. అంతేకాక ప్రభుత్వం కరెంటు మగ్గాలను ప్రోత్సహించే రాయితీలు కొన్ని కల్పించింది. దానితో కాటన్ బట్టల మిల్లులు సింథటిక్‌తో పోటీ పడలేక, ఆధునీకరణ ప్రయత్నాలలో విజయం సాధించలేక మూత పడుతున్నాయి. కాటన్ వస్త్రాల ఉత్పత్తికి సంబంధించిన గణాంకాలు ఈ విషయాన్ని కళ్ళకు గట్టినట్టు చూపిస్తాయి.

ఈ స్థితిలో మిల్లులను ఆధునీకరించి కాపాడుకోవడం తప్ప వేరే ఉపాయం లేదు. అసలే నష్టాలలో కూరుకొని పోయినందువల్ల అవి స్వతహాగా ఆధునీకరణ చేపట్టడం కష్టం కాబట్టి ప్రభుత్వ సహాయం కావాలి. ఈ సంప్రదాయక పరిశ్రమలో ఒక్కొక్క మిల్లులో కార్మికులు వేల సంఖ్యలో ఉంటారు కాబట్టి ఈ బాధ్యత ప్రభుత్వం మీద ఇతోధికంగా ఉంటుంది. 'ఆధునీకరణ' అంటే కాటన్ వస్త్రాల ఉత్పత్తికే పరిమితమవుతూ అధిక ఉత్పాదన ఇచ్చే యంత్రాలను కొనుక్కొని వినియోగించడం కావచ్చు. కాటన్ వస్త్రాల ఉత్పత్తిలోనే కొత్త ప్రయోగం కావచ్చు. లేదా కాటన్‌కు పరిమితం కాకుండా మిశ్రమ వస్త్రాల ఉత్పత్తి చేపట్టడం కావచ్చు. వీటిల్లో ఏదైనా ప్రభుత్వ ఆర్థిక సహాయం లేకుండా సాధ్యం కాదు. ఆ సహాయం 'ఇప్పుడిస్తాం, అప్పుడిస్తాం' అంటూ ఇయ్యకనే ప్రభుత్వం ముంచిన మిల్లు వరంగల్‌లోని ఆజంజాహీ మిల్లు.

రాష్ట్ర రాజధానిని మినహాయిస్తే తెలంగాణలోని అతి పెద్ద పట్టణం వరంగల్లు. ఈ సంవత్సరమే వరంగల్ మునిసిపాలిటీకి కార్పొరేషన్ హోదా కూడ వచ్చింది. అయితే జిల్లా కేంద్రానికి ఈ హోదా రావడం వెనుక మామూలుగా చెప్పుకునే వ్యవసాయ

### భారతదేశంలో కాటన్ వస్త్రాల ఉత్పత్తి

(కోట్ల చదరపు మీటర్లు)

| సం॥ | 50–51 | 60–61 | 70–71 | 80–81 | 85–86 | 86–87 | 87–88 | 88–89 | 89–90 |
|---|---|---|---|---|---|---|---|---|---|
| మిల్లులు | 340.1 | 464.9 | 405.5 | 343.4 | 271.6 | 259.4 | 23.6 | 210.0 | 185.9 |
| కరెంటు మగ్గాలు | 81.4 | 208.9 | 354.7 | 493.4 | 975.1 | 1013.3 | 1028.0 | 1158.8 | 1357.2 |
| మొత్తం | 421.5 | 673.8 | 760.2 | 836.8 | 1246.7 | 1272.7 | 1262.6 | 1365.8 | 1543.1 |

అభివృద్ధి లేదు. పారిశ్రామిక అభివృద్ధి లేదు. వ్యవసాయకంగా వరంగల్‌ను సగటు తెలంగాణ జిల్లాగా చెప్పుకోవచ్చు. పారిశ్రామికంగా చెప్పుకోవాలంటే ఒక రేయాన్ మిల్లు, ఒక రంగుల మిల్లు, ఒక రసాయనిక పదార్థాల మిల్లు ఉన్నాయి. జవసత్వాలతో ఉంటే ఆజంజాహీ మిల్లును కూడ గర్వంగా చెప్పుకొని ఉండవచ్చును. కానీ అది 30 ఏళ్ళుగా క్షయరోగి క్షీణించినట్టు కొద్ది కొద్దిగా క్షీణించి ఇప్పుడు మరణశయ్య మీద ఉంది. ఈ మధ్యకాలంలో వరంగల్ పట్టణం ఒక విద్యాకేంద్రంగా గుర్తింపు పొందింది. ఈ దశకు ముందు వరంగల్ పట్టణంలో జన జీవితానికి ఒక ముఖ్యకేంద్రంగా, ఊరి గుండెకాయగా ఆజంజాహీ మిల్లును చెప్పుకోవచ్చు. ఆ గుండె నుండి రక్తం బొట్టు బొట్టుగా కారి అది నీరసించి పోయింది. త్వరలో అది వేయిస్తంభాల గుడి వంటి చారిత్రక అవశేషం కావచ్చు. 1974లో 8000 మంది కార్మికులకు (బదిలీలను కలుపుకొని) పని కల్పించిన ఈ మిల్లులో 1992 నాటికి సరిగ్గా 711 మంది కార్మికులు ఉన్నారు. ఈ సంవత్సరం ఆ సంఖ్య 400 చిల్లరకు దిగిపోయింది. వరంగల్ శ్రామిక ప్రజల ఒక ముఖ్య ఉపాధి కేంద్రం పతనమయి పోయింది. దాని స్థానంలో వేరే ఏదీ రాలేదు.

## ఆజంజాహీ మిల్లు

ఆజంజాహీ మిల్లు నిజాంపాలన కాలంలో 1931లో ఒక జాయింట్ స్టాక్ కంపెనీగా రిజిస్టర్ అయింది. 1934లో ఉత్పత్తి ప్రారంభం అయింది. అప్పుడూ ఇప్పుడూ ఇది ఆంధ్రప్రదేశ్‌లోని ఏకైక కాంపోసిట్ మిల్లు. అంటే నూలు, వస్త్రాలు రెండిటినీ ఉత్పత్తి చేసే ఒకే ఒక మిల్లు.

1930ల తొలి సంవత్సరాలలో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం ఫలితంగా బొంబాయి ప్రెసిడెన్సీలో జౌళి పరిశ్రమ దెబ్బతినింది. ఆ దశలో హైదరాబాదు సంస్థానాధిపతులు స్థానిక ముడిసరుకును, రవాణా సౌకర్యాన్ని వినియోగించుకొని నూలు, వస్త్రాలు రెండింటినీ ఉత్పత్తి చేయగల ఆజంజాహీ మిల్లును వరంగల్‌లో నెలకొల్పారు.

వరంగల్ పట్టణానికి ఒక మూలన 200 ఎకరాల స్థలంలో ఈ మిల్లు నెలకొని వుంది. ఈ మిల్లుపైన స్థానిక ప్రజలు చాలా ఆశలు పెట్టుకున్నారు. దానికి తగినట్టే

మిల్లు వరంగల్ పట్టణం అభివృద్ధికి చాలా దోహదం చేసింది. మిల్లును ఆధారం చేసుకొని అనుబంధ ఆర్థిక సంస్థలెన్నో ఏర్పడ్డాయి. మిల్లులో ప్రత్యక్షంగా ఎంతమంది కార్మికులు పనిచేశారో అంతకు ఐదురెట్ల మందికి మిల్లు పరోక్షంగా ఉపాధి కల్పించింది. మిల్లు తన అవసరాలకు తానే విద్యుత్ ఉత్పత్తి చేసుకునేది. దానితోపాటు కొంత విద్యుత్తు వరంగల్ పట్టణ అవసరాలకు కూడ సరఫరా చేసేది. ఆ విధంగా తన జీవితాన్ని మొదలుపెట్టిన ఆజంజాహీ మిల్లు ఈ రోజు దేశ ఆర్థిక విధానాల ఫలితంగా ఖాయిలా మిల్లుల జాబితాలో చేరింది. ఈ రోజో రేపో మూసేస్తారన్న పరిస్థితి వచ్చింది.

1934లో ఉత్పత్తి మొదలు పెట్టినప్పటి నుండి 1965-66 వరకు అది తన ఉత్పాదన శక్తిని పెంచుకుంటూ ఎదిగింది. దానితోబాటే కార్మికుల సంఖ్య కూడ పెరిగింది. 30 సంవత్సరాలలో మిల్లు ఉత్పాదన శక్తి రెండు రెట్లు కంటే ఎక్కువే పెరిగింది. కార్మికుల సంఖ్య కూడ 2, 3 రెట్లయింది.

**ఆజంజాహీ మిల్లు ఉత్పాదనశక్తి, కార్మికుల సంఖ్య**

| సంవత్సరం (స్పిండిల్స్) | కదుళ్ళు (లూమ్స్) | మగ్గాలు | కార్మికులు |
|---|---|---|---|
| 1934 | 19,944 | 430 | 3000 |
| 1954 | 36,136 | 726 | 6000 |
| 1966 | 42,000 | 726 | 7000 |

మిల్లు సాలీనా సాధించిన ఉత్పత్తినీ వాణిజ్య లాభాలనూ పరిశీలించినా మిల్లు ఒక దశలో దినదిన ప్రవర్ధమానంగా విలసిల్లిన సంగతి అర్థమవుతుంది.

ఈ మిల్లు ఎక్కువగా సామాన్య ప్రజలు, బలహీన వర్గాలు ఉపయోగించే ముతక రకం ఉత్పత్తుల మీద దృష్టిపెట్టింది. ఎక్కువ భాగం 20 కౌంట్ల కంటే తక్కువ ఉన్న ముతక బట్టనే ఉత్పత్తి చేసింది. చలువ, ఆరబెట్టిన నూలు, డ్రిల్లు బట్ట, లాంగ్ క్లాత్, ధోవతులు, టవళ్ళు, దోమతెరలు, చేతిరుమాళ్ళు, దేరా బట్టలు, బెడ్‌షీట్లు ఉత్పత్తి చేసేది. అంతే కాక పూర్తి స్థాయిలో జిన్నింగ్, ప్రెస్సింగ్, చలువ చేయడం, రంగులు అద్దడం, ప్రింటింగ్ మొదలైన సమస్త ప్రక్రియలు నిర్వహించగల సామర్థ్యం కలిగి ఉండింది.

| ఆజంజాహీ మిల్లులో నూలు అమ్మకం, వర్తక లాభాలు (లక్షల రూ॥లు) | | |
|---|---|---|
| సంవత్సరం | నూలు అమ్మకం + స్టాక్ | లాభాలు |
| 1934-35 | 7.75 | 2.10 |
| 1935-36 | 19.28 | 1.56 |
| 1936-37 | 10.94 | 4.44 |
| 1937-38 | 9.17 | 4.33 |
| 1938-39 | 9.54 | 4.39 |
| 1939-40 | 9.89 | 3.11 |
| 1940-41 | 11.28 | 4.03 |
| 1941-42 | 22.84 | 19.70 |
| 1942-43 | 35.49 | 52.13 |
| 1943-44 | 21.93 | 41.49 |
| 1944-45 | 14.14 | 37.36 |
| 1945-46 | 15.72 | 22.67 |
| 1946-47 | 12.75 | 10.14 |
| 1947-48 | 14.28 | 40.65 |
| 1948-49 | 13.33 | 9.67 |
| 1949-50 | 12.37 | 4.12 |

(పట్టికలోని రెండవ కాలమ్‌లో ఉన్నది నూలు అమ్మకాలకు సంబంధించిన గణాంకాలు. మూడవ కాలమ్‌లోని లాభాలు మొత్తంగా మిల్లుచేసిన వర్తకానికి సంబంధించినవి)

కంపెనీ చట్టం (1956) వచ్చిన తరువాత మిల్లుకు మేనేజింగ్ డైరెక్టర్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ వచ్చారు. 1962లో ఒకసారి మిల్లు లోటు బడ్జెట్‌లో పడగా ఒక ఐ.ఎ.ఎస్

ఆఫీసర్‌ను ప్రభుత్వం మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించింది. అతను మిల్లును పూర్వస్థితికి తీసుకురాగలిగాడు కూడ. 1965 దాకా మిల్లు లాభాలలో నడిచింది. 1966 నుండి నష్టాల బాటలో పడింది. అప్పటి నుండి ప్రతి సంవత్సరం నష్టాలు వస్తూనే వున్నాయి. వెనక్కి మళ్ళించడం ఎవరి తరం కాలేదు. మొదటి ఐదు సంవత్సరాల నష్టమే దాదాపు రెండు కోట్ల రూపాయలుండింది.

| మిల్లు నష్టాలు (లక్షల్లో) | |
|---|---|
| సంవత్సరం | నష్టం |
| 1966-67 | 14.96 |
| 1967-68 | 26.34 |
| 1968-69 | 49.98 |
| 1969-70 | 48.12 |
| 1970-71 | 56.21 |

1971 వచ్చేసరికి మిల్లు మూతపడే పరిస్థితి దాపురించింది. ఆ స్థితిలో దానిని జాతీయం చేసే ప్రయత్నంలో తొలి మెట్టుగా ప్రభుత్వం ఒక నియంత్రణాధికారిని (కంట్రోలర్) 1971 ఏప్రిల్ 30న నియమించింది. కంపెనీని నష్టాల బాట నుండి మళ్ళించడానికి కొన్ని చర్యలు కూడ చేపట్టింది. ఈ నియంత్రణాధికారి ఆధ్వర్యంలో తొలి రెండు సంవత్సరాలలో నష్టాలు కొంత తగ్గుముఖం పట్టాయి. 1971-72లో 9.75 లక్షలు, 1972-73లో 2.19 లక్షల నష్టం మాత్రమే వచ్చింది. అయితే 1973-74 సంవత్సరం ప్రథమార్థంలోనే మళ్ళీ 15.9 లక్షల నష్టం వచ్చింది. దానితో ప్రభుత్వం 1974లో మిల్లును ఖాయిలా మిల్లుగా గుర్తించి, జాతీయం చేసి, ఖాయిలా పడిన మిల్లులను చేతిలోకి తీసుకొని పునరుద్ధరించడం కోసం ఏర్పాటు చేసిన నేషనల్ టెక్స్‌టైల్ కార్పొరేషన్ (ఎన్.టి.సి)కు స్వాధీనపరిచింది. పునరుద్ధరణ కోసమే మిల్లును జాతీయం చేశారు కాబట్టి ఇంక కోలుకుంటుందని కార్మికులు, ప్రజలు భావించారు. మిల్లు పూర్తిస్థాయి ఆధునీకరణ కోసం, విస్తరణ కోసం ఎన్.టి.సి ఒక ప్రణాళికను కూడ రచించింది. ఇక దానికి అవసరమైన నిధులకు కొరత ఉండదని అంతా భావించారు. కాని అది అడియాసే అయింది. ఆధునీకరణ జరగలేదు. విస్తరణా జరగలేదు. కార్మికుల రిట్రెంచ్‌మెంట్ మాత్రం వేగంగా జరిగింది. నష్టాలు సాలీనా అపారంగా పెరుగుతూ పోయాయి.

| ఆజంజాహీ మిల్లు నష్టాలు (లక్షల్లో) | |
|---|---|
| సంవత్సరం | నష్టం |
| 1974-75 | 38.3 |
| 1975-76 | 45.64 |
| 1976-77 | 74.38 |
| 1977-78 | 71.89 |
| 1978-79 | 59.02 |
| 1979-80 | 15.99 |
| 1980-81 | 107.00 |
| 1981-82 | 174.77 |
| 1982-83 | 196.16 |
| 1983-84 | 192.96 |
| 1984-85 | 379.79 |
| 1985-86 | 209.99 |
| 1986-87 | 292.04 |
| 1987-88 | 340.78 |
| 1988-89 | 355.20 |
| 1989-90 | 345.34 |
| 1990-91 | 265.67 |
| 1991-92 | 174.54 |

1974లో కంపెనీలో 8000 మంది కార్మికులు ఉంటే ఆ తరువాత వేగంగా తగ్గి 1994 మార్చి నాటికి 411 మందే మిగిలారు. 1974-84 మధ్య 3,545 మంది తొలగించబడి 1984 నాటికి 4455 మంది మిగిలారు. ఆ తరువాత ప్రతీ సంవత్సరం ఈ సంఖ్య తగ్గుతూ వచ్చింది. 1992 మార్చి 31న 711 మంది మిగిలారు.

ఆ సంవత్సరం మామూలు రిట్రెంచ్‌మెంట్‌కు వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీం కూడ తోడైంది. ఈ సంవత్సరం (1994) మార్చి నాటికి కార్మికుల సంఖ్య 411కు పడిపోయింది.

## నష్టాలకు నేపథ్యం ఏమిటి?

1966 నుండి నష్టాలు రావడానికి ప్రత్యక్షంగా కనిపించే కారణాలను చెప్పుకుంటే అవి మూడు రకాలుగా కనిపిస్తాయి. రెండవ వేతన సంఘం సిఫారసులు అమలు వల్ల, కార్మికులకు ఇచ్చే డి.ఎ. పెరుగుదల వల్ల మిల్లు ఖర్చులలో వేతనాల వాటా పెరిగింది. ఇది ఒక కారణంగా కనిపిస్తుంది. సింథటిక్ ఫైబర్‌తోను, మిశ్రమ నూలుతోను తయారుచేసే బట్టల పోటీకి సంప్రదాయక బట్టల పరిశ్రమ తట్టుకోలేక పోవడం, మారుతున్న వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా ఉత్పత్తి చేయలేక పోవడం రెండో కారణంగా కనిపిస్తుంది. దేశంలో ప్రజల ఆదాయ ప్రమాణాలు స్తంభించడం లేదా అతి స్వల్పంగా పెరగడం అనే అంశాన్ని కూడ దీనికి అనుబంధంగా తీసుకోవలసి ఉంటుంది. ముఖ్యంగా నూలు వస్త్రాలను ఎక్కువగా కొనే పేద, దిగువ మధ్యతరగతి ఆదాయాలలో ప్రతిష్టంభన వచ్చింది. ఈ అన్ని కారణాల ఫలితంగా సంప్రదాయక వస్త్ర పరిశ్రమ మార్కెట్ స్తంభించింది. దానివల్ల మిల్లులో నిలువలు కూడ పెరిగి నిర్వహణ పెట్టుబడి (వర్కింగ్ కాపిటల్) మీద భారమూ పెరిగింది. ఇక మూడవ కారణం, వివిధ దేశీయ అంతర్జాతీయ కారణాల వల్ల పత్తి ధర, ఇతర ముడిసరుకుల ధర, యంత్ర విడిభాగాల ధర పెరిగిపోవడం. మరొక చెప్పుకోవాల్సిన విషయమేమిటంటే ద్రవ్యోల్బణం అనేది 1960ల మధ్య భాగం నుండి భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ఒక ముఖ్య సమస్యగా ముందుకు రావడం.

వీటిలో మొదటి కారణాన్ని మిల్లు నష్టాలకు కారణంగా భావించడానికి వీలు లేదు. పెరుగుతున్న ధరలను బట్టి కార్మికుల డి.ఎ. పెరగడం, మెరుగైన జీవన ప్రమాణాలను ఆశించి వారు అధిక వేతనాలు కోరుకోవడం సహజమైన విషయాలు.

ప్రభుత్వం సంప్రదాయక బట్టల ఉత్పత్తుల పట్ల అనుసరిస్తున్న ప్రతికూల విధానమే ఈ నష్టాలకు ముఖ్యమైన కారణం. దీని వల్ల ఆజంజాహీ మిల్లు వంటి కంపెనీలు ఉత్పత్తిచేసే వాటికంటే ఆకర్షణీయమైన ఉత్పత్తులు మార్కెట్‌లోకి రావడం,

వీటి మార్కెట్ పడిపోవడం, మొత్తంగా పరిశ్రమ స్తబ్ధతకు గురికావడం, తత్ఫలితంగా నిర్వహణ ఖర్చులు, ముడిసరుకు కొనుగోలు ఖర్చులు పెరగడం, ప్రభుత్వ ఆర్థిక విధానాల కారణంగా ద్రవ్యోల్బణం పెరిగి ఉత్పత్తి వ్యయం పెరగడం, దాని ఫలితంగా తప్పనిసరై వేతనాలు పెరగడం – ఇవన్నీ కలసి నష్టాలకు దారితీశాయి. అంతే తప్ప కార్మికులు కారణం కాదు. వాళ్ళకిచ్చిన జీతాలు కారణం కాదు. అయినా మిల్లులో కార్మికుల సంఖ్య ఎక్కువైపోయిందంటూ పదే పదే రిట్రెంచ్‌మెంట్ వేటు వేసి వేల సంఖ్యలో కార్మికులను తొలగించడమే జరిగింది.

మేనేజ్‌మెంట్ అక్రమ సంపాదన గురించి చెప్పుకోకుండా ఏ మిల్లు రుగ్మత గురించీ మాట్లాడలేము. కొన్నింటిలో అదే ప్రధాన కారణం కావచ్చు. కొన్నిటిలో కేవలం అనుబంధ కారణం కావచ్చు. ఆజంజాహీ మిల్లు ప్రారంభం నుండి పనిచేసి మూడేళ్ళ కింద రిటైరైన ఒక సీనియర్ కార్మికుడు ఈ విధంగా అంటారు. "నిజాం కాలంలోను, ఆ తరువాత రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చిన తరువాత కూడ 1960–61 వరకు లాభాలు వస్తూనే వున్నా, లాభాలరేటు పడిపోతూ వచ్చింది. దీనికి ఒక కారణం మిల్లులో నిర్వహణ సిబ్బంది (సూపర్‌వైజింగ్ స్టాఫ్) పెరిగిపోవడం, వారి అక్రమ సంపాదన పెరిగిపోవడం. యంత్రభాగాల కొనుగోలు, ముడిసరుకు కొనుగోలు, ఇతర మార్కెట్ ఖర్చులలో వ్యయం ఎక్కువగా చూపించి అక్రమ సంపాదనకు పాల్పడి అధికారులు లక్షలు సంపాదించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 1956 కంపెనీ చట్టం ఆధారంగా మేనేజింగ్ డైరెక్టరును, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లను నియమించిన తరువాత ఆ అధికారుల అక్రమ సంపాదన వల్ల మిల్లు లాభాల రేటు 1960ల తరువాత మరింత పడిపోయి 1966 నుండి మిల్లు నష్టాల బాటలో నడవడానికి దోహదం చేసింది."

నిర్వహణలో అసమర్థత గురించి కూడ కొన్ని ఉదాహరణలు చెప్పుకోవచ్చు. 1959–60లో మొట్టమొదటిసారిగా ఆధునీకరణ పేరిట బ్యాంకుల నుండి అప్పు తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం సహాయంతో 6000 నూలు కదుళ్ళు కొనుక్కొచ్చారు. ఇది మిల్లును మెరుగుపరచడానికి దోహదపడింది. అయితే అదే సమయంలో మార్కెట్ విస్తరణ కోసం, కొత్త యంత్రాల కొనుగోలు కోసం, కొన్ని ముడిపదార్థాల కోసం పెద్ద మొత్తాలు ఖర్చుపెట్టారు. బట్ట నాణ్యతను పెంచే ఒక ప్రాసెసింగ్ యంత్రాన్ని

కొన్నారు. ఈ యంత్రాన్నీ, ఇతర ఆధునీకరణ వ్యయాన్నీ సద్వినియోగం చేయక పోవడం వల్ల చాలా వృథా అయింది. ఖర్చంతా ఒక వ్యక్తి అక్రమ సంపాదన కోసం జరిగిందన్న అభియోగం ఉంది.

మిల్లు నష్టాల బాటలో పడిన తొలినాడే దానిని కాపాడే ప్రతిపాదన ఒకటి మిల్లు యాజమాన్యం చేసింది. 50 లక్షల రూపాయల వ్యయంతో కొత్తగా 2000 నూలు కదుళ్ళు, 150 మగ్గాలు కొనాలని ప్రతిపాదించారు. దాని కోసం రాష్ట్ర ప్రభుత్వం తనకు అప్పుపెట్టాలనీ, గతంలో ప్రభుత్వం ఇచ్చిన రుణాలను మిల్లులో వాటా పెట్టుబడిగా మార్చడానికి తాము సిద్ధమనీ మేనేజ్‌మెంట్ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన అమలు కాలేదు. నష్టాలు పెరుగుతూపోయి 1971లో మిల్లు దివాలా తీసే దశ వచ్చింది. అప్పుడు జాతీయకరణలో తొలిమెట్టుగా ప్రభుత్వం ఒక అధికారిక నియంత్రణాధికారిని నియమించింది. ఇతని ఆధ్వర్యంలో మిల్లు నష్టాలు రెండేళ్ళు కొద్దిగా తగ్గుముఖం పట్టి మళ్ళీ యధాస్థితి వచ్చేసరికి 1974లో ఆజంజాహీ మిల్లును ప్రభుత్వం జాతీయం చేసి నేషనల్ టెక్స్‌టైల్ కార్పొరేషన్ (ఎన్.టి.సి)కి అప్పగించింది. అక్కడితో గట్టెక్కుతుందనుకున్న మిల్లు ఆ తరువాత సంపూర్ణంగా మునిగిపోయింది. 1974లో ప్రారంభమయిన కార్మికుల తొలగింపు ఎంత దూరం పోయిందంటే ప్రతి 20 మందిలో ఒక కార్మికుడు మాత్రమే ఇప్పుడు మిగిలాడు.

జాతీయం చేసినప్పుడు మిల్లు 'ఖాయిలా' పడడానికి గల కారణాలు ఏమిటంటే అప్పటి యాజమాన్యం 'పురాతన యంత్రాలుండడం, కార్మికులు అధికంగా ఉండడం, నిర్వహణ స్థాయి సక్రమంగా ఉండకపోవడం, విద్యుచ్ఛక్తి సరఫరాలో లోపం, సిబ్బంది తక్కువగా ఉండడం, నిధుల కొరత, పటిష్టమైన అమ్మకపు యంత్రాంగం లేకపోవడం' కారణాలనింది.

## జాతీయం చేసిన తరువాత

మిల్లు ఎన్.టి.సి చేతిలోకి పోయిన తరువాత పూర్తిస్థాయి ఆధునీకరణ కోసం ప్రణాళికలు రచించారు. నిధులకు కొరత ఉండదని భావించారు కానీ ఏదీ అమలు కాలేదు. మిల్లు నష్టాల బాటలో పరుగులు తీస్తూ ముందుకు సాగింది.

ఎన్.టి.సికి దేశంలో 9 కేంద్రాలున్నాయి. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, మాహె ద్వీపాలకు సంబంధించిన కేంద్రం బెంగుళూరులో ఉంది. ఈ బెంగుళూరు

కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్న "5 మిల్లులలో 4 మిల్లులు పోటీ పరిస్థితులకు అనుగుణంగా ఆధునీకరణ చేపట్టి ఉత్పత్తి సాగించడం లేదు. కార్మికుల గైరుహాజరు వల్ల ఉత్పత్తులు పడిపోయి నష్టాలు వస్తున్నాయి. ఈ కారణంగా ఆజంజాహీ మిల్లును మూసివేయక తప్పదు" అని 'ది హిందూ' దినపత్రిక 4-5-1992 సంచికలో రాసింది. కార్మికుల గైరుహాజరు అంటూ తప్పు కార్మికులపైన పెట్టే ప్రయత్నం చేస్తున్నారు కానీ మిల్లు సక్రమంగా నడవాలంటే అమలు కావలసినవి వేరే కొన్ని ఉన్నాయి.

1. పురాతన పనికిరాని యంత్రాలను మార్చాలి.
2. పోటీ పరిస్థితులకు అనుగుణంగా ఉత్పత్తిని, నాణ్యతను పెంచాలి.
3. విద్యుచ్ఛక్తి, నీరు నిరంతరాయంగా సరఫరా కావాలి.
4. నిర్వహణ పెట్టుబడికి కొరత రాకుండా చూడాలి.

ఇవి ప్రధానంగా ప్రభుత్వం బాధ్యతలు, మిల్లు యాజమాన్యం బాధ్యతలు. కాని ప్రభుత్వం, ఎన్.టి.సి ఈ చర్యలు చేపట్టకపోగా కార్మికుల సంఖ్య, గైరుహాజరు, వేతన బిల్లు - అవే మిల్లుకుండే సర్వ సమస్యలు అయినట్టు చూపించారు. కంపెనీకి నష్టాలు రావడం మొదలయినప్పటి నుండి ఇవే కారణాలు చూపుతూ, ఆధునీకరణ చేయడం వల్లనే లాభాలు పొందగలుగుతామంటూ, మళ్లీ ఆధునీకరణ ఏమీ చేపట్టకుండా కార్మికులను మాత్రం గెంటివేస్తూ మిల్లును కొద్దికొద్దిగా మూసివేయసాగారు. కార్మికుల తొలగింపు ఎంత వేగంగా నిరంతరాయంగా జరిగిందో ఇదివరకే చూశాము. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో డిమాండ్ పెరిగినప్పుడు అదనపు కార్మిక బలం కావాలని ఎంతమందినయితే రిలీవర్స్‌గా మిల్లు నియమించిందో, 1992 నాటికి మొత్తం కార్మికుల సంఖ్య అంతకు పడిపోయింది.

మిల్లును పరిరక్షించడానికీ, రేషనలైజ్ చేయడానికీ, ఆధునీకరించడానికీ కార్మికులను తగ్గించడమే ఏకైక మార్గం అని కార్మికులను తగ్గించిన ప్రతిసారీ చెప్పి మోసం చేశారు. ఎందుకంటే, పైన చెప్పినట్టు 1959-60లో మొదటిసారిగా ఆధునీకరణ చర్యలు చేపట్టే పేరిట నెలకొల్పిన ప్రాసెసింగ్ మెషిన్‌ను సద్వినియోగం చేయక వృథా చేసింది అధికారులే. 1985-86లో ఈ మిల్లు విషయం పార్లమెంటులో చర్చకు వచ్చినప్పుడు కూడ ఆధునీకరణ తప్పనిసరిగా చేపడతామని హామీ ఇచ్చి

అందులో భాగంగా మరి కొందరు కార్మికులను మాత్రం తొలగించారు. వేరే ఆధునీకరణ జాడలేవీ కనిపించలేదు. 1987లో హన్మకొండ పార్లమెంటు సభ్యుడు జంగారెడ్డి మిల్లు మేనేజింగ్ డైరెక్టర్‌తో చర్చించి మిల్లు వ్యవహారాలు పరిశీలించి 100 కోట్ల రూపాయల ఆధునీకరణ ప్రతిపాదనలు చేశారు. వీటి ఆనుపానులు కనిపించడం లేదు.

మిల్లును రేషనలైజ్ చేసే మరొక ప్రతిపాదన 1989-90లో జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.టి.సి అధికార యంత్రాంగంతో చర్చించి కొన్ని ప్రతిపాదనలు ఆమోదించారు. ఆ ప్రతిపాదనలను 17-4-90 నాడు ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటించారు.

1. ఎన్.టి.సి తన అజమాయిషీలో ఉన్న మూడు మిల్లుల మీద రాబోయే 3 సంవత్సరాల కాలంలో 100 కోట్ల రూ॥లు ఖర్చుచేస్తుంది. వాటిలో ఆజంజాహీ మిల్లు ఒకటి.
2. రాష్ట్ర ప్రభుత్వం మిల్లుకు అవసరమైన ధన సహాయం చేస్తుంది.
3. కరెంటు, నీటి సరఫరా సక్రమంగా చేస్తుంది.
4. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్ను మినహాయింపు ఇస్తాయి.
5. మిల్లు స్థానికంగా పండే పత్తినే కొనుగోలు చేస్తుంది.
6. మిల్లుకు చెందిన భూమిలో కొంత భాగం విక్రయించేందుకు అనుమతి కంపెనీకి లభిస్తుంది.

భూమి అమ్మకంద్వారా ఆధునీకరణ కోసం అవసరం అయిన పెట్టుబడిలో 25% సమీకరించాలని; ఇంకొక 25% రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుందని; మిగతా 50% ఎన్.టి.సి సమకూర్చాలని. కేంద్ర ద్రవ్య సంస్థలయిన ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐ.డి.బి.ఐ), ఇండస్ట్రియల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఐ.ఎఫ్.సి.ఐ) లు ఎన్.టి.సికి తేలిక రుణాలు ఇవ్వాలని కూడ నిర్ణయించారు.

కానీ విచిత్రం ఏమిటంటే ఇందులో ఏ ఒక్క ప్రతిపాదన అమలు కాలేదు. అసెంబ్లీలో ప్రకటించని కార్మికుల తొలగింపు మాత్రం అమలు చేశారు. ఆధునీకరణ అనే ప్రక్రియలో చాలా విషయాలు ఇమిడి ఉంటాయి. కానీ ఆజంజాహీ మిల్లు చరిత్రలో దానికి ఒకటే అర్థం ఉంది. పడిపోతున్న మార్కెట్‌కు తగ్గట్టు ఉత్పత్తిని తగ్గించడం, ఉత్పాదకశక్తిని కోత పెట్టడం, కొన్ని డిపార్ట్‌మెంట్లు మూసివేయడం, కొన్ని రకాల ఉత్పత్తి పూర్తిగా మానుకోవడం, వీటన్నిటికీ తగినట్టుగా పెద్దఎత్తున రిట్రెంచ్‌మెంట్‌కు పాల్పడడం.

కార్మికులు గైరుహాజరు కావడం మిల్లు ఖాయిలా పడడానికి ఒక కారణం అని మేనేజ్‌మెంట్ వాదన. కానీ కార్మికులు పనిలోకి రాకపోవడానికి ముఖ్య కారణం లేఆఫ్. లేఆఫ్‌కు కారణం మిల్లుకు విద్యుచ్ఛక్తి, నీరు సక్రమంగా సరఫరా కాకపోవడం, నాణ్యమైన ముడిసరుకు లేకపోవడం, యంత్రాల విడిభాగాలు లభించక పోవడం. అంతే తప్ప సమ్మెలు, పని ఎగవేత ప్రధాన కారణం కాదు. నిర్వహణ పెట్టుబడి లేకపోవడం అనేది ప్రభుత్వ జౌళి విధానంతో ముడిపడి ఉంది. ద్రవోల్బణాన్ని పెంచే ప్రభుత్వ ఆర్థిక విధానాలతో ముడిపడి ఉంది. నగదు నిల్వల తరుగుదల మిల్లు అధికారుల అవినీతితో ముడిపడి ఉంది. 1960ల నుండి ఇచ్చిన హామీల ప్రకారమైనా (కార్మికులకు నష్టం చేకూర్చేవైనా) ఆధునీకరణ చేపట్టి ఉంటే ప్రభుత్వం మాట్లాడే మాటలలో చిత్తశుద్ధి ఉందనుకోవచ్చు. ఆ చిత్తశుద్ధిలేమి వల్లనే మిల్లు దివాలా తీసింది.

ప్రస్తుత ప్రభుత్వ విధానాలు కనీసం ఒకప్పటి మిశ్రమ ఆర్థిక విధానానికి, సంక్షేమ రాజ్యానికి సైతం అనుకూలంగా లేవు. 'ఖాయిలా' మిల్లులను కాపాడడానికి ప్రభుత్వం ఇప్పుడు ప్రాముఖ్యం ఇవ్వడం లేదు. ఐ.ఎం.ఎఫ్ సలహాలలో ఒకటైన 'ఎక్కువయి పోయిన' కార్మికులను తొలగించే 'ఎగ్జిట్ పాలసీ'ని భారత ప్రభుత్వం ఆదరిస్తున్నది. నడవలేని మిల్లులను కాపాడే బదులు, పునరుజ్జీవింపజేసే బదులు మూసివేయడమే ఉత్తమమని భావిస్తున్నది. ఎన్.టి.సి వైఖరిని ఈ నేపథ్యంలో చూడవలసి ఉంటుంది.

తీసివేసే ముందు కార్మికుల మీదే తప్పుపెట్టి వారి క్రమశిక్షణా రాహిత్యం వల్ల, గైరుహాజరు వల్ల మిల్లు ఖాయిలా పడిందనీ, లేకపోతే మిల్లుకు అవసరమయిన దాని కంటే కార్మికులు ఎక్కువైపోయారు కాబట్టి కార్మికులను తొలగించక తప్పదనీ

వాదించి తప్పంతా కార్మికుల సంఖ్యమీద, నడవడిక మీద నెట్టేసి వాళ్ళను బెదిరించి బయటకు గెంటేయొచ్చు. నష్టపోయేది కార్మికులే కదా, వేరే ఎవరు నష్టపోతారు? కడుపు మాడ్చుకునేది, జీవిత నడిమి భాగంలో ఉపాధి కోసం కొత్తగా అన్వేషించే దుస్థితిని ఎదుర్కునేది, కొత్తగా ఉపాధి దొరకకపోతే దిగజారిన జీవన పరిస్థితిలో బ్రతకలేక, తమవారిని బ్రతికించలేక కడగండ్ల పాలయ్యేది కార్మికులే కదా! అన్నిటికీ బాధ్యులు వాళ్ళే మరి! ఈ తర్కాన్ని చూస్తే వరంగల్ జిల్లా గ్రామీణ ప్రాంతాలలో పిల్లలు పాడుకునే ఒక పాట జ్ఞాపకం వస్తుంది. ఆ పాటతో ఈ అధ్యాయాన్ని ముగిద్దాం.

దున్నపోతు దున్నపోతు దుక్కిలెందుకు పన్నవు[1]
పసులోడు కాయంది నన్నేమన్నవు?
పసులోడ పసులోడ ఎందుకు కాయలేదు
దొరజీతమియ్యంది నన్నేమన్నవు?
దొరదొర జీతమెందుకివ్వలేవు
సోల[2] లేంది నన్నేమన్నవు?
సోలసోల ఎందుకు లేవు
వడ్లోడు[3] చెయ్యంది నన్నేమన్నవు?
వడ్లోడ వడ్లోడ ఎందుకు చెయ్యలేదు
బాడిసె చెక్కంది నన్నేమన్నవు?
బాడిసె[4] బాడిసె ఎందుకు చెక్కలేదు
కమ్మరోడు సరవంది[5] నన్నేమన్నవు?
కమ్మరోడ కమ్మరోడ ఎందుకు సరవలేదు
తిత్తి ఊదంది నన్నేమన్నవు?
తిత్తీ తిత్తీ ఎందుకు ఊదలేదు
దున్నపోతు చావంది నన్నేమన్నవు?

**సెప్టెంబర్ 1994**

---

1. పండుకున్నావు 2. ధాన్యం కొలిచే చెక్కపాత్ర 3. వడ్రంగి 4. వడ్రంగి ఉపయోగించే ఇనుప పనిముట్టు
5. పదును పెట్టడం

## ఇప్పటి పరిస్థితి

23 ఏళ్ళ క్రితం పరిస్థితి ఇది. ఇప్పుడు ఆజంజాహీ మిల్లే లేదు. చాలా ఏళ్ళపాటు ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ అన్ని రాజకీయ పార్టీలూ మిల్లును తెరిపిస్తామనే హామీలు ఇచ్చాయి. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలోనూ ఇది ఒక ముఖ్య విషయంగా ప్రచారమైంది. ఈ మిల్లు మీద కథలు, కవితలు కూడ ఎన్నో వచ్చాయి కాని మిల్లు మాత్రం మళ్లీ తెరుచుకోలేదు. దానిలోని యంత్రాలను నేషనల్ టెక్స్‌టైల్ కార్పొరేషన్ ఇనప తుక్కు లేదా రద్దీగా అమ్మేసింది. 1994లో స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన కొందరు కార్మికులకు 17 ఏళ్ళ తర్వాత 2011లో బకాయిలు చెల్లించారు. మిల్లుకు చెందిన కొంత భూమిని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (KUDA వరంగల్)కు అమ్మగా వాళ్ల దగ్గర ప్లాట్లు కొనుక్కొని చాలామంది ఇళ్లు కట్టుకున్నారు. 'రాంకీ' సంస్థ 76 ఎకరాలు కొనుక్కుంది.

కార్మికులలో 132 మందికి మాత్రం మిల్లు భూమిలో ప్లాట్లు ఇచ్చారు. ఇంకా 10 ఎకరాల స్థలం ఎన్.టి.సి అధీనంలో ఉంది. మిల్లు క్వార్టర్స్‌లో నివసించని, ఇంకా సజీవంగా ఉన్న కార్మికులకు ఆ భూమిలో ప్లాట్లు కేటాయించాలని కోరుతూ కొందరు కార్మికులు కోర్టుకెళ్లారు. హైకోర్టులోను, సుప్రీంకోర్టులోను కూడ ఆ కేసులు నడుస్తున్నాయి. ఈ విధంగా నిజాం 1934లో ప్రారంభించిన మిల్లు ఇప్పుడు నామరూపాలు లేకుండా మాయమైంది.

**ఎస్. జీవన్ కుమార్**
***మానవహక్కుల కార్యకర్త, హైదరాబాద్***

# నిజాం షుగర్స్ ప్రైవేటీకరణను వ్యతిరేకిద్దాం కార్మికుల ఆందోళనకు మద్దతు ఇద్దాం

నిజాం షుగర్స్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న ఆందోళనకు మేము పూర్తి మద్దతు ఇస్తున్నాం. అది మోయలేని బరువయింది కాబట్టి దించుకుంటున్నాం అని ప్రభుత్వమంటుంది. కాని మోయలేని బరువెందుకయిందో మాత్రం చెప్పదు. చక్కెరకు మార్కెటేమైనా తగ్గిపోయిందా? రైతులు చెరుకు పండించడం తగ్గించేశారా? లేదే.

ఎగుమతుల మీద అధిక దృష్టి పెట్టడం వర్తమాన ఆర్థికనీతి మూలసూత్రాలలో ఒకటి. మరి మన దేశం ఎగుమతి చేసే సరుకులలో చక్కెర ఒకటి. చక్కెర ఎగుమతులకు చాలా మంచి అవకాశం ఉందనీ, రాబోయే రోజులలో ఎగుమతులు ఇంకా పెరగగలవనీ భారత చక్కెర మిల్లుల సంఘం 1999 డిసెంబర్ నెలలో జరిగిన తన సమావేశంలో తీర్మానించింది కూడ. పోనీ దేశం లోపల చక్కెరకు డిమాండేమైనా తగ్గిందా అంటే, అత్యవసర వస్తువుగా మారిన చక్కెరకు ఎప్పుడైనా డిమాండు పెరిగేదే తప్ప తగ్గేది కాదని చెప్పవలసి ఉంటుంది. ప్రపంచ వాణిజ్య సంస్థ ఒత్తిడి వల్ల మన ప్రభుత్వం చక్కెర దిగుమతులను ప్రోత్సహించడమొక్కటే ఇప్పుడు కొత్తగా వచ్చిన సమస్య.

రైతులు చెరుకు పండించడం తగ్గించారా అంటే సాగునీరు ఉన్నంతకాలం అది జరగదు. పైగా తిండిగింజలు పండించడం తగ్గించి వ్యాపార పంటలు పండించమనే కదా మన ముఖ్యమంత్రి రోజూ ఘోషిస్తున్నాడు. నిన్నటి రైతు జన్మభూమిలో కూడ అదే మాట పదే పదే అన్నాడు. వ్యాపార పంటలను ప్రోత్సహించడం ప్రభుత్వ విధానమని

ఒక పక్క ప్రకటించుకుంటూ, వ్యాపారపంటలలో ఒకటయిన చెరుకు మీద ఆధారపడిన ప్రభుత్వరంగ చక్కెర మిల్లులకు భవిష్యత్తు లేదనడంలో అర్థమేముంది?

పోనీ ప్రైవేట్ రంగంలోని చక్కెర మిల్లులు కూడ నష్టాలలో నడుస్తున్నాయా? చక్కెర పరిశ్రమే లాభదాయకంగా నడవలేని పరిస్థితేమైనా ఏర్పడిందా?

లేదని ప్రభుత్వమే ఒప్పుకుంటున్నది. 1999 డిసెంబర్ 30 నాడు రాష్ట్ర అసెంబ్లీలో 304 ఎ నియమం కింద ప్రతిపక్ష నాయకుడు అడిగిన ప్రశ్నకు జవాబు చెప్తూ, 'నిజాం షుగర్ ఫ్యాక్టరీ లిమిటెడ్ నిరంతరం నష్టాలలో నడుస్తుండగా ప్రైవేటు రంగంలోని అనేక చక్కెర ఫ్యాక్టరీలు లాభాలతో నడుస్తున్నాయి' అని ముఖ్యమంత్రి స్వయంగా అన్నాడు. అంటే నిజాం షుగర్స్ లాగే చెరకుకు కనీస మద్దతు ధర చెల్లిస్తున్న ప్రైవేటు కంపెనీలు మాత్రం లాభాలలోనే నడుస్తున్నాయని. అయితే దాని నుండి ఆయన స్వీకరించిన పాఠం – ప్రభుత్వ రంగ చక్కెర మిల్లులను కూడ లాభదాయకంగా నడపవచ్చునని కాదు. వాటిని ప్రైవేటు రంగానికి అప్పగించాలని! 'సవివరమైన సమాలోచనలు చేసిన తర్వాత, మంత్రిమండలి ఉపసంఘం సిఫారసులను అంగీకరించాలని, ప్రైవేటీకరణ ప్రక్రియను చేపట్టాలని (ప్రభుత్వం) నిర్ణయించింది' అని ముఖ్యమంత్రి అదే ప్రకటనలో అన్నాడు. నిజానికి అప్పటికే (1998 ఆగస్ట్ 24న) హిందూపురంలోని నిజాం షుగర్స్ చక్కెర ఫ్యాక్టరీని అమ్మేశారు. అదే సంవత్సరం మిర్యాలగూడెంలోని చక్కెర మిల్లును మూసేశారు. ఆ తరువాత 2000 సంవత్సరంలో, లచ్చయ్యపేట (బొబ్బిలి) లోని చక్కెర మిల్లునూ, చాగల్లులోని డిస్టిలరీనీ అమ్మకానికి పెట్టారు.

చక్కెర మిల్లులు ప్రైవేట్ రంగంలో ఉంటే ఏమయింది, ప్రభుత్వ రంగంలో ఉంటే ఏమయింది? మానవహక్కులకు ఏం తేడా వచ్చిందని అడగవచ్చు.

రైతులకూ కార్మికులకూ కూడ దీనివల్ల తేడా వస్తుంది. కాబట్టే మేము ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నాం.

ప్రభుత్వరంగ సంస్థలన్నీ బ్రహ్మాండంగా నడుస్తున్నాయని గానీ అన్ని రకాలుగా ప్రజానుకూలంగా ఉన్నాయని గానీ మా అభిమతం కాదు. అయితే ప్రభుత్వరంగంపైన రాజకీయ అజమాయిషీ ఉంటుంది. కోర్టుల అజమాయిషీ కూడ ఉంటుంది. ఈ

రెండు కారణాలగానూ అవి ప్రజావసరాలకు అనుగుణంగా ఉండాలని ఒత్తిడి పెట్టడం ప్రజలకు సాధ్యమవుతుంది. ఎంతవరకు ఆ ప్రయత్నం సఫలం అవుతుందనేది పరిస్థితులను బట్టి ఉంటుంది గానీ కనీసం ఆ ప్రయత్నం చేయడం సాధ్యమవుతుంది. ప్రైవేట్‌రంగం ఒట్టి వ్యాపారరంగం. దానిని ప్రజావసరాలకు అనుగుణంగా రూపొందించుకునే అవకాశం ప్రజలకు శూన్యం.

ఇక కార్మికుల ఉద్యోగభద్రత, వేతనాల ప్రమాణాల విషయంలో ప్రభుత్వ రంగానికీ ప్రైవేట్ రంగానికీ మధ్య చాలా తేడా ఉంటుందని విడమరచి చెప్పనవసరం లేదు. అంతేకాదు. మిల్లుకు చెరుకు సరఫరా చేసే రైతాంగం విషయంలో కూడ ఈ తేడా ఉంటుంది. నిజాం షుగర్స్‌కు 1998 దాకా 7 చక్కెర మిల్లులు, మూడు డిస్టిలరీలు, ఒక మెషినరీ యూనిట్ ఉండేవి. ఒక చక్కెర మిల్లు ఉందంటే అది కల్పించే డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని పరిసరగ్రామాల రైతులు చెరుకుపంటకు అనుకూలంగా తమ భూములను, పంట విధానాన్ని మలచుకుంటారు. దాని కోసం అవసరమైన ఖర్చు పెట్టుకుంటారు. ఆ చక్కెర మిల్లు అకస్మాత్తుగా వారి దగ్గర పంట కొనడం మానేసి వేరే ఎక్కడయినా కొనుక్కోవడం మొదలుపెట్టినా, వారికి గిట్టుబాటుగాని ధరకు అమ్మేటట్టయితేనే కొనుక్కుంటానని మొరాయించినా, మిల్లు మూసేసుకుని వెళ్లిపోయినా పరిసర రైతాంగానికి చాలా నష్టమవుతుంది. మిల్లు ప్రభుత్వరంగంలో ఉన్నట్టయితే ఉద్యమం ద్వారాగానీ, ప్రతిపక్షపార్టీల సహకారంతోగానీ, కోర్టును ఆశ్రయించడం ద్వారాగానీ ఇటువంటి పరిణామాలను ఎదుర్కొనగలరు. ఉదాహరణకు నిజాం షుగర్స్ మిల్లులు రైతులకు కనీసధర చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నియమం పెట్టి ఇప్పిస్తున్నది. ఈ సబ్సిడీలో 150 కోట్లను ప్రభుత్వం భర్తీ చేయకపోవడం వల్ల అది నిజాం షుగర్స్‌కు నష్టంగా పరిణమించింది కూడ.

రేపు ఈ మిల్లులన్నీ ప్రైవేట్ యాజమాన్యాల చేతిలోకి పోతే చుట్టుపక్కల ఉన్న రైతాంగానికి ఈ సదుపాయం ఉంటుందా? 'అమ్మితే అమ్ము. లేకపోతే పో. నాకు బయటి మార్కెట్లలో ఇంతకంటే చవకగా చెరుకు దొరుకుతుంది' అని దబాయిస్తే రైతులేం చేయగలరు? లేదా నాలుగేళ్లు చక్కెర మిల్లు నడిపి అకస్మాత్తుగా చెప్పా పెట్టకుండా మిల్లు విడిభాగాలు, భూమి అమ్మేసి హైటెక్ సిటీలో సాఫ్ట్‌వేర్ కంపెనీ పెట్టుకుంటానని మిల్లు యజమాని వెళ్లిపోతే, వేసిన చెరుకు పంటకు మార్కెట్ దొరకక, అకస్మాత్తుగా పంటమార్పిడి చేసుకోలేక రైతులెంత సతమతం కావాలి?

అందుకే ఇది కేవలం కార్మికుల సమస్య కాదు, రైతాంగం సమస్య కూడ. అంటే ప్రజలందరి సమస్య కూడ అని మేము అంటున్నాం.

చివరిగా, నిజాం షుగర్స్‌కు వచ్చిన నష్టాలకు ప్రభుత్వం చెప్తున్న కారణాలేమిటో కొంచెం చూద్దాం. అసెంబ్లీలో 1999 డిసెంబర్ 30 నాడు ముఖ్యమంత్రి చేసిన ప్రసంగంలోనే వాటిని ఏకరువు పెట్టాడు. హిందూపురంలోనూ మిర్యాలగూడెంలోనూ చక్కెర మిల్లులు ఏర్పాటు చేయడమే పొరబాటయిందన్నాడు. బొబ్బిలి, సీతానగరంలలో ఖాయిలాపడి ఉన్న ప్రైవేట్ మిల్లులను స్వాధీనం చేసుకొని నిజాం షుగర్స్‌లో కలపడం పొరబాటయిందన్నాడు. జహీరాబాద్, మెట్‌పల్లి మిల్లుల విస్తరణ చేపట్టడం తప్పయిందన్నాడు. మిల్లులతో పాటు వ్యవసాయక్షేత్రాలను కూడ నెలకొల్పే ప్రయత్నం చేసి తామే చెరుకు పండించాలని నిర్ణయించడం తప్పయిందన్నాడు. కొత్త ప్రాజెక్టులకు మెషినరీ సరఫరాదారుగా బిన్నీ కంపెనీని ఎంపిక చేయడం దోషపూరితమైన నిర్ణయమన్నాడు. వర్కింగ్ కాపిటల్‌ను కొత్త ప్రాజెక్టుల నిర్మాణానికి తరలించడం వల్ల చెరుకు సరఫరా చేసిన రైతులకు ఎప్పటికప్పుడు కంపెనీ బిల్లులు చెల్లించలేక పోయిందనీ అదొక పొరబాటు నిర్ణయమనీ అన్నాడు. అధిక వడ్డీ వసూలు చేసే విదేశీ అప్పుల మీద ఆధారపడడం తప్పయిందన్నాడు. కార్మికులను అవసరమైన దాని కంటే ఎక్కువ సంఖ్యలో రిక్రూట్ చేసుకోవడం పొరబాటయిందన్నాడు. రెండేళ్లుగా చక్కెర దిగుమతిని సరళీకరించడం వల్ల దేశీయ మార్కెట్‌లో చక్కెర ధర పడిపోయిందన్నాడు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరను (ఎస్.ఎ.సి.పి) కంపెనీయే (ప్రభుత్వ సహాయం లేకుండా) భరించవలసి రావడం వల్ల రూ. 133 కోట్ల నష్టం వచ్చిందన్నాడు. (ఇది ప్రస్తుతం 150 కోట్లు దాటింది.)

అంతేగానీ రైతులు నాసిరకం చెరుకు పండించారని గానీ కార్మికులు సరిగ్గా పనిచేయలేదని గానీ ఎక్కడా అనలేదు. ముఖ్యమంత్రి చెప్పిన కారణాలన్నీ సరయినవేనని వాదన కోసం అనుకున్నా, వాటికి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది, కంపెనీ యాజమాన్యానిది, కేంద్ర ప్రభుత్వానిది. కంపెనీని నష్టాలపాలు చేసిన ఈ నిర్ణయాలు తీసుకున్న ఏ ఒక్క అధికారికి గానీ రాజకీయ నాయకుడికి గానీ ఏ నష్టమూ రాదుగానీ ఏ తప్పు చేయని కార్మికులూ రైతాంగమూ మాత్రం నష్టపోవాలా?

ఇది ఒక్క నిజాం షుగర్స్ కథ మాత్రమే కాదు. మూసివేస్తున్న, ప్రైవేటీకరిస్తున్న ప్రతీ ప్రభుత్వరంగ సంస్థ కథా, సహకార రంగ సంస్థ కథా ఇదే. ఇంతకంటే మోసం వేరే ఏమైనా ఉంటుందా?

తప్పుడు నిర్ణయాలకు బాధ్యులైన రాజకీయ నాయకులను ఆరేళ్లు ఎన్నికలకు అనర్హులు చేయాలనీ, తప్పుడు నిర్ణయాలు తీసుకున్న అధికారులకు ప్రమోషన్లో ఇంక్రిమెంట్లో పెన్షనో కోతపెట్టాలనీ మనమెందుకు ఆందోళన చేయకూడదు? అప్పుడు ఈ ప్రైవేటీకరణ పరంపరను ఆపేసి ఖాయిలా పడిన ప్రభుత్వ, సహకార రంగాల సంస్థలను నయం చేసే ప్రయత్నం చేస్తారేమో!

**మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది**
**10 జనవరి 2001**

# రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని కాపాడుకుందాం

రామగుండం ఎరువుల కర్మాగారానికి తుది ఘడియలు దగ్గరికొచ్చాయని బి.ఐ.ఎఫ్.ఆర్ కొన్నాళ్ల క్రితం ప్రకటించడంతో తెలంగాణ బాగుకోరేవారి గుండెల్లో రాయి పడింది.

వెయ్యి మందికి పైగా రెగ్యులర్ కార్మికులకూ మరో అంతమంది కాంట్రాక్ట్ కార్మికులకూ ఉపాధి కల్పించిన ఈ ఫ్యాక్టరీ రామగుండంను తెలంగాణలోని ప్రధాన పారిశ్రామిక కేంద్రాలలో ఒకటిగా మలచడానికి తోడ్పడింది. తెలంగాణలోని అన్ని పారిశ్రామిక కేంద్రాలలాగ దీనిలో కూడ తెల్లబట్టల ఉద్యోగాలు అత్యధికంగా బయటివారికే దక్కినప్పటికీ స్థానికులకు కొంతమేరకు ఉపాధి, అంతకు మించిన ఆశ కల్పించింది.

రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన 'ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' (ఎఫ్.సి.ఐ) యాజమాన్యంలోని సంస్థ. ఎఫ్.సి.ఐ యాజమాన్యంలో రామగుండంలోనే కాక సింద్రి, తాల్చేర్, గోరఖ్‌పూర్‌లలోనూ ఎరువుల ఫ్యాక్టరీలున్నాయి. ఒక్క రామగుండం ఫ్యాక్టరీకే కాక మొత్తంగాఎఫ్.సి.ఐకే ఇప్పుడు తుదిఘడియలు దగ్గరకు వచ్చాయి.

ఎందువల్ల? కేంద్ర ప్రభుత్వం ఎఫ్.సి.ఐని కాపాడడానికి చేయగల ప్రయత్నాలన్నీ చేసినప్పటికీ దానిని బతికించడం సాధ్యం కాకపోయినట్టయితే ప్రభుత్వాన్ని మనమేమీ అనలేకపోవచ్చు. పెట్టుబడిదారీ వ్యవస్థలో పారిశ్రామిక సంస్థలు

శాశ్వతంగా ఉండవు. అయితే సంక్షోభంలో పడ్డప్పుడు సంస్థను కాపాడడానికి ప్రయత్నం సహితం చేయని యజమాని పెట్టుబడిదారీ మార్కెట్‌ను నిందించడం సబబు కాదు.

ఎఫ్.సి.ఐని 1992 నవంబర్ 6వ తేదీన 'ఖాయిలా పరిశ్రమ'గా బి.ఐ.ఎఫ్.ఆర్ గుర్తించింది. అప్పటినుండి తొమ్మిది సంవత్సరాలుగా ఎఫ్.సి.ఐ చావుబతుకులు బి.ఐ.ఎఫ్.ఆర్ చేతిలో వున్నాయి. బి.ఐ.ఎఫ్.ఆర్ అంటే ఖయిలాపడ్డ పారిశ్రామిక సంస్థలను పునరుద్ధరించడానికీ, అందుకోసం వాటిని పునర్వ్యవస్థీకరించడానికీ అధికారాలు వున్న సంస్థ. మరి పునరుద్ధరించమని ఎఫ్.సి.ఐను బి.ఐ.ఎఫ్.ఆర్ ముందు పెడితే తొమ్మిదేళ్లు ఆ పని చేయకుండా ఇప్పుడు మూసేస్తామని నిర్ణయించడంలో అర్థమేమిటి? తొమ్మిదేళ్లుగా ఆ సంస్థ వుంటుందో పోతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ బతుకుతున్న కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల గతేమిటి? ఆ సంస్థ నెలకొల్పిన ఫ్యాక్టరీల పరిసరాలలో చిన్నాచితక వ్యాపారాలు పెట్టుకుని అది బాగుంటే తామూ బాగుంటామని ఆశలు పెంచుకున్న జనం సంగతేమిటి? అక్కడొక ఫ్యాక్టరీ వుందన్న ధీమాతో కష్టపడి చదువుకొని అందులో ఉద్యోగం సంపాదించుకుందామని ఆశలు పెట్టుకున్న విద్యార్థుల సంగతేమిటి?

బి.ఐ.ఎఫ్.ఆర్ రికార్డులు చూస్తే ఎఫ్.సి.ఐ విషయంలో ఎవరిని తప్పుపట్టాలో అర్థం అవుతుంది. రామగుండం ఫ్యాక్టరీ గురించే మాట్లాడుకుంటే, ఈ తొమ్మిది సంవత్సరాలలో ఏ రోజూ కూడ ఆ ఫ్యాక్టరీని పునరుద్ధరించడం సాధ్యం కాదని బి.ఐ.ఎఫ్.ఆర్ అనలేదు. పునరుద్ధరణ ప్రతిపాదనలు పెట్టమని బి.ఐ.ఎఫ్.ఆర్ నియమించిన ఆపరేటింగ్ ఏజెన్సీ కూడ ఆ మాట ఏరోజూ అనలేదు. ఆ ఫ్యాక్టరీకి సాంకేతిక సమస్యలు లేకపోలేదుకానీ వాటికి అసలే పరిష్కారం లేదని ఎవరూ అభిప్రాయపడడం లేదు.

అయినప్పటికీ మూసేసే పరిస్థితి ఎందుకొచ్చిందంటే కేంద్ర ప్రభుత్వానికే అందులో ఆసక్తి లేదు. ఈ తొమ్మిది సంవత్సరాలలో ఏ ఒక్క రోజూ కేంద్ర ప్రభుత్వం ఎఫ్.సి.ఐ కేసు విచారణలో ఆసక్తి తీసుకోలేదు. ఆపరేటింగ్ ఏజెన్సీ పెట్టిన ప్రతిపాదనలకు స్పందించలేదు. కనీసం తన అభిప్రాయాన్ని బి.ఐ.ఎఫ్.ఆర్‌కు వివరించి చెప్పనూ లేదు. బి.ఐ.ఎఫ్.ఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని మందలించింది. విసుక్కునింది. తిట్టింది కూడ. అయినప్పటికీ వారి అనాసక్తి చెక్కు చెదరలేదు.

బిడ్డ బతికేదేగానీ కన్నవారికి ఆసక్తి లేదు కాబట్టి గొంతు నులిమేస్తున్నానని చివరికి బి.ఐ.ఎఫ్.ఆర్ ప్రకటించింది.

పారిశ్రామిక అభివృద్ధిలో ప్రభుత్వం కీలకపాత్ర నిర్వహించాలని భావించిన రోజులలో ఎఫ్.సి.ఐ వంటి సంస్థలు పుట్టాయి. దేశ అభివృద్ధికి వ్యవసాయ అభివృద్ధి కీలకమనీ, వ్యవసాయ అభివృద్ధికి ఎరువుల ఉత్పత్తిని పెంచడం అవసరమనీ గుర్తించి, ఆయా ప్రాంతాలలో అందుబాట్లో వున్న ముడిసరుకులను ఆధారం చేసుకుని కేంద్ర ప్రభుత్వం ఎరువుల కర్మాగారాలు నెలకొల్పింది. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ సమీపంలోని గోదావరిఖనిలో ఉత్పత్తి అయ్యే బొగ్గును ఆధారం చేసుకున్న ప్రయోగాత్మక ఎరువుల కర్మాగారం. ఆనాడు ఈ ఫ్యాక్టరీలను కేవలం లాభాల దృష్టితో చూడలేదు. అంటే అవి శాశ్వతంగా నష్టాలలో ఉండాలని కోరుకున్నారని కాదుగానీ, స్థానిక వనరుల వినియోగం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, గ్రామీణ నిరుద్యోగులకు ఉపాధి కల్పన, కొత్త సాంకేతిక ప్రయోగాలు, ఆదర్శవంతమైన కార్మిక యాజమాన్య సంబంధాలు మొదలయిన అనేక ఆదర్శాలను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రభుత్వరంగ సంస్థలను నెలకొల్పారు. ఆ ఆదర్శాల వెలుగులో నడుపుతూ అదే సమయంలో తగు మాత్రం లాభాలు పొందితే చాలుననుకున్నారు. ఈ సంస్థల పెట్టుబడి వ్యాప్తికి కావలసిన మూలధనం లాభాల నుండి రాకపోతే ప్రభుత్వ బడ్జెట్ నుండి ఇవ్వడంలో తప్పేమీ లేదనుకున్నారు.

ఈ విధానం కొంత సత్ఫలితాన్ని ఇచ్చింది. అవినీతి, బాధ్యతారాహిత్యం అడ్డం రాకుంటే ఇంకా కొంత ఇచ్చేదే. అయితే అంతలో మన పాలకులకు ఈ బాధ్యత పట్లనే ఆసక్తి పోయింది. 'ప్రభుత్వం పారిశ్రామిక సంస్థలు నెలకొల్పడమెందుకు? వాటిని కేవలం ఆర్థికంగా లాభదాయకంగానే కాక సామాజికంగా ఆదర్శవంతంగా కూడ నడపడమెందుకు? వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, రిజర్వేషన్లు, కార్మికులకు వేతన స్కేళ్లు, ఈ బాదరబందీ అంతా ఎందుకు? ఈ బరువు దించేసుకొని ప్రైవేట్ రంగానికి అప్పగించేసి హాయిగా పోలీస్ స్టేషన్లు మాత్రం నడుపుకుంటే సరిపోదా?' అని ఒక దశాబ్దం పైగా ప్రభుత్వాలు అనుకుంటున్నాయి. ప్రపంచ బ్యాంకు వారికి ఆ సలహాయే ఇస్తున్నది.

కాబట్టి, ప్రభుత్వరంగ సంస్థలు నెలకొల్పినప్పుడు పెట్టుకోని ప్రమాణాలను ఇప్పుడు తీసుకొచ్చి వాటిని పనికిరానివిగా నిందిస్తున్నారు. 'ఇవి లాభాలు

సంపాదించడం లేదు, పెట్టుబడి కోసం బడ్జెట్ మీద ఆధారపడుతున్నాయి, కార్మికులకు మరీ ఎక్కువ జీతాలిస్తున్నాయి' అని నిందలు వేస్తూ మూసేస్తున్నారు. వాటిని నెలకొల్పినప్పుడు ఉద్దేశించిన ప్రమాణాలు ఇవి కావే, ఇప్పుడు మూసేయడానికి ఈ ప్రమాణాలు అరువు తెచ్చుకోవడం ఏం న్యాయం? అన్న ప్రశ్నకు ప్రభుత్వం దగ్గర జవాబు లేదు. ఎఫ్.సి.ఐని కాపాడుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి పట్టింపు లేకపోవడానికి గల కారణం ఇదే. అందుకే వారు బి.ఐ.ఎఫ్.ఆర్ ఎదుట సక్రమంగా హాజరు కారు, ఆపరేటింగ్ ఏజెన్సీ ప్రతిపాదనలకు స్పందించరు. తమవైపు నుండి ఏ ప్రతిపాదనలూ – మూసివేయడం తప్ప – పెట్టరు.

ప్రభుత్వరంగ సంస్థలన్నీ చాలా బాగున్నాయనీ, వాటిమీద ఈగవాలినా సహించకూడదనీ చెప్పడం మా ఉద్దేశ్యం కాదు. వాటిలో అవినీతి, బాధ్యతారాహిత్యం మీది నుండి కింది దాకా ఆవరించి ఉన్నాయి. కార్మికులకు సహితం అందులో భాగం లేకపోలేదు. అయినప్పటికీ, సమగ్రమైన సామాజిక ఆర్థిక అభివృద్ధిలో అంతర్భాగంగా పారిశ్రామిక అభివృద్ధిని చూడాలనే అవగాహన సూత్రప్రాయంగా సరైనదనీ, దానిని కాపాడుకోవాలనీ అనుకుంటున్నాము. పారిశ్రామిక అభివృద్ధి కేవలం యాజమాన్యాల లాభాలను ప్రమాణంగా పెట్టుకొని నడిచేటట్టయితే అది సమాజంలో సంపద కేంద్రీకరణకూ, అన్ని రకాల అసమానతలు పెరగడానికీ దోహదపడుతుందని ప్రజలు గుర్తించాలని కోరుతున్నాము.

కేంద్ర ప్రభుత్వ నిర్వాకం ఇట్లా వుండగా మన బాబుగారి సంగతేమిటి? ఆయన ఇప్పటిదాకా ఒక్కసారి కూడ రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ గురించి మాట్లాడలేదు. ఒక పక్క దానిని మూసేయొద్దన్న ఆందోళన జరుగుతుండగా ఆయన నెల్లూరులో ప్రైవేట్ రంగంలో ఎరువుల ఫ్యాక్టరీకి అనుమతి ఇవ్వబోతున్నట్లు ప్రకటించాడు. దాని బదులు కేంద్రం నుండి రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని బాగుచేసి నడపొచ్చుగదా?

పాలకులకే వదిలేస్తే ఆ కర్మాగారం త్వరలో మూతబడుతుంది కాబట్టి ప్రజలే దానిని కాపాడే విషయంలో చొరవ తీసుకోవాలని కోరుతున్నాం.

**మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది**

**27 జూలై 2001**

# ఆధునీకరణ దిశలో బలిపీఠాలు సిరిసిల్ల, దుబ్బాక....

**మూ**డేళ్ళ కింద వరంగల్ జిల్లాలో జరిగిన రైతుల ఆత్మహత్యలకూ ఇప్పుడు కొంతకాలంగా వార్తలకెక్కుతున్న నేత కార్మికుల ఆత్మహత్యలకూ ఒక ముఖ్యమైన విషయంలో సారూప్యం ఉంది. చిన్న ఉత్పత్తిదారులను పెట్టుబడిదారీ మార్కెట్‌లో పడేసి అందులోని సంక్షోభాలకు తట్టుకోవటానికి కావలసిన బలమేదీ వారికి కల్పించకపోతే వారిని సమస్యల సుడిగుండంలోకి నెట్టేయడమే అవుతుంది. అది అనివార్యంగా ఆత్మహత్యలకే దారితీయనక్కరలేదు గానీ ఆ సుడిగుండంలో చిక్కుకున్న వారు ఆత్మహత్యనే పరిష్కారంగా ఎంచుకుంటే ఆశ్చర్యపోవలసిన పని లేదు.

దుబ్బాకలో రెండు సంవత్సరాలుగా ఆత్మహత్యలు చేసుకుంటున్న చేనేత కార్మికులు చిన్న ఉత్పత్తిదారులని వివరించి చెప్పనవసరం లేదు. సిరిసిల్లలో ఆత్మహత్య చేసుకున్న మరమగ్గాల కార్మికులు కూడ పెద్ద మాస్టర్ వీవర్ల దగ్గర పనిచేసిన వారు కారు. తమ కంటే కొంచెం మాత్రమే బాగున్న చిన్న ఉత్పత్తిదారుల దగ్గర పనిచేసిన వారు. రెండు జతల మగ్గాలు, లేక నాలుగు జతల మగ్గాలు పెట్టుకొని ఒకరిని లేక ఇద్దరిని కూలీకి నియమించుకున్న చిన్న యజమానులే సిరిసిల్ల పవర్‌లూం రంగంలో మెజారిటీ. ఆత్మహత్యలు చేసుకున్న వారంతా ఇటువంటి యాజమాన్యం దగ్గర పనిచేసిన కార్మికులే.

మూడేళ్ళ కింద ఆత్మహత్యలు చేసుకున్న రైతులు కూడ వ్యాపార పంటలు పండించిన చిన్న ఉత్పత్తిదారులే. ఒకటి నుండి అయిదు ఎకరాల భూమిగలవారే.

పెట్టుబడిదారీ మార్కెట్‌లో చిన్న ఉత్పత్తిదారులకు సమస్యలు ఎక్కువ ఉంటాయా అంటే ఏమోగానీ వాటిని తట్టుకొని బయటపడే సామర్థ్యం మాత్రం తక్కువ ఉంటుంది.

జొన్నలు పండించే రైతులు వర్షాభావం వల్ల గానీ వేరే ఏ కారణంగానయినా గానీ పంట కోల్పోతే తమ శ్రమ మాత్రమే పోగొట్టుకుంటారు. పత్తి పండించే రైతులు పెట్టుబడి కూడ పోగొట్టుకుంటారు. పెద్ద రైతులయితే రెండేళ్ళు పెట్టుబడి పోగొట్టుకున్నా మూడవ సంవత్సరం పరిస్థితులు బాగుంటే ఆ నష్టాన్నంతా పూడ్చుకుని ఇంకా మిగుల్చుకోగలరు. వ్యవసాయంతో బాటు వారికి వ్యాపారం కూడ ఉంటే వ్యవసాయంలో నష్టపోయిన కాలంలో వ్యాపారంలో లాభాలు పొందగలరు. చిన్న రైతులు రెండు సంవత్సరాలు వరుసగా పెట్టుబడి పోగొట్టుకుంటే ఇక ఆ తరువాత కోలుకోవడం చాలా కష్టం. మూడవ సంవత్సరం కాలం బాగున్నా దాని వల్ల పూర్తి ప్రయోజనం పొందజాలరు. అప్పు పెరుగుతుందే తప్ప తగ్గదు. ఏదో ఒకరోజు ఒక పెద్ద ఖర్చు వచ్చి మీదపడిన నాడు – ఒక బిడ్డ పెళ్లి, ఒక ఆపరేషన్, ఒక కొడుకు కాలేజీ ఫీజు – దానిని భరించలేక, భరించలేకపోయామన్న అవమానానికి తట్టుకోలేక జీవితానికి ముగింపు పలుకుదామన్న ఆలోచన వారిలో రావడం అసహజమేమీ కాదు. నేత రంగాన్ని కూడ దీనితో పోల్చి చెప్పుకోవచ్చు.

'ప్రపంచీకరణ' విధానాల తొలిమెట్టు అయిన 1991 బడ్జెట్‌తో దేశంలో నుండి పత్తి, నూలు ఎగుమతి కాసాగాయి. దేశం లోపల నూలు ధర పెరగడం మొదలయింది. రంగుల ధరలు కూడ పెరిగాయి. అప్పటినుండే నేత రంగంలో సంక్షోభం తీవ్రరూపం తీసుకుంది. పెట్టుబడులు పెరిగాయి. తయారుచేసే వస్త్రాల ధర దానికి తగినట్టుగా పెరగకపోగా అసలే పెరగని సందర్భాలూ ఎక్కువే కాబట్టి నేతరంగం ఈ పెరుగుదలకు తట్టుకోలేక విలవిలలాడింది. పైపెచ్చు ప్రభుత్వం తన అండను ఉపసంహరించు కోవడంతో అది ఆకలి చావులకూ, ఆత్మహత్యలకూ దారి తీసింది. 'అందుకే మిమ్మల్ని కూపస్థమండూకాలంటున్నాం' అని ప్రపంచీకరణ మద్దతుదారులు అంటారు. రాష్ట్ర చేనేత, జౌళి కమీషనర్ శ్రీలక్ష్మిగారు మొన్న సిరిసిల్లలో ఆ మాటే అన్నారు. వారి కోపానికి కారణం లేకపోలేదు. ఎగుమతి, దిగుమతులకు ద్వారాలు మనం మాత్రమే తెరవలేదు. ప్రపంచదేశాలన్నీ తెరిచాయి. ప్రత్యేకించి మన నేతరంగం ఉత్పత్తి చేసే వస్త్రాలను విదేశాలలో విక్రయించి ఎక్కువ లాభాలు సంపాదించుకునే అవకాశం ఇప్పుడు పెరిగింది. తాతతండ్రుల నాడు ఉత్పత్తి చేసిన బట్టనే ఇప్పుడు కూడ నేస్తూ

'నూలు ధరలు పెరిగాయి గానీ నా మగ్గం మీద తయారయ్యే బట్ట ధర పెరగలేదు' అని ప్రభుత్వాన్ని తిట్టుకోవడంలో అర్థం లేదు.

ఇది నిజమే గానీ దీని భావమేమిటి? ఎవరయితే ఎప్పటికప్పుడు అంతర్జాతీయ మార్కెట్ గురించి సమాచారం సేకరించి అక్కడి డిమాండ్‌ను బట్టి తమ ప్రస్తుత ఉత్పత్తులను నిల్వ ఉంచుకోవడం, మార్చుకోవడం, ఒకచోట అమ్ముడుపోకపోతే మరొక చోటికి బదలాయించడం - ఇవన్నీ చేయగలరో వారు మాత్రమే ప్రపంచీకరణను తట్టుకొని లాభాలు పొందగలరని దీని భావం. దీనికి కావలసింది కేవలం 'బావిలోని కప్ప' వైఖరిని విడనాడడం కాదు. ఆ మాటకొస్తే తమకు సరయిన సలహాలు ఇచ్చే మార్కెటింగ్ వ్యవస్థ ఉన్నట్టయితే ఏ రకమైన వస్త్రాలయినా నేయగలమన్న విశ్వాసాన్ని సిరిసిల్ల పవర్‌లూం కార్మికులు, దుబ్బాక చేనేత కార్మికులు కూడ వ్యక్తం చేస్తున్నారు.

మార్కెటింగ్ వ్యవస్థే కాదు, ఆటుపోట్లకు తట్టుకునే పెట్టుబడి దన్ను కూడ కావాలి. కొన్ని విషయాలలో మనది పెద్ద దేశమే కావచ్చునుగానీ అంతర్జాతీయ విపణిలో మనది చీమలాంటి, దోమలాంటి అతి చిన్న దేశం. ఆ విపణిలోని ఆటుపోట్లను మనం స్వీకరించి తట్టుకోవలసిందే గానీ వాటిని ఎదుర్కొని వాటి గతిని మనం మార్చలేము. వరుసగా మూడు నాలుగేళ్లు అది మనకు అననుకూలంగా ఉన్నా దానికి తట్టుకొని పరిస్థితులు అనుకూలంగా మారినప్పుడు ఆ ఊపును అందుకోగల స్తోమత ఉన్న వారే ప్రపంచీకరణ వల్ల ప్రయోజనం పొందగలరు. ప్రపంచీకరణ వల్ల దేశంలో ఎవ్వరికీ ప్రయోజనం లేదని ఎవరూ అనడం లేదు. చెప్పుకోదగ్గ మోతాదులో పెట్టుబడి దన్ను, ఇతర మార్కెటింగ్ హంగులూ ఉన్న వారికి దానివల్ల ప్రయోజనం ఉండగలదు.

ఆ బలం లేని వారినే చిన్న ఉత్పత్తిదారులు అంటున్నాం. అయితే భారతదేశంలో అదొక ఆర్థిక వర్గం మాత్రమే కాదు. చేనేత కార్మికులు, మరమగ్గాలపైన కూలిచేసేవారు ప్రధానంగా పద్మశాలీలు. మూడేళ్ల కింద ఆత్మహత్యలు చేసుకున్న రైతులలో అత్యధికులు ఎస్.సి., బి.సి. కులాలకు చెందిన సన్నకారు వ్యవసాయదారులు. కులమూ, ఆస్తి ఒకటే కాకపోయినా మొత్తం మీద కుల సంబంధమైన హోదా పెరిగేకొద్దీ సగటున ఆస్తి కూడ ఎక్కువ ఉంటుందనేది దీనికొక కారణం కాగా పెట్టుబడిదారీ మార్కెట్ సంక్షోభాన్ని తట్టుకోవడానికి కావలసిన సామాజిక, ఆర్థిక బలం కూడ కులంతో సన్నిహితంగా ముడిపడి ఉంటుంది.

సహకార రంగం ఈ ఖాళీని పూరించడం కోసమే ఒకనాడు ఉనికిలోకి వచ్చింది. అప్పుడు చేనేత సహకార సంఘాలు ఊరూరా ఏర్పడ్డాయి. వాటికి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అప్పులిచ్చేది. అవి నూలు కొని తమ సభ్యులకు ఇచ్చి మార్కెట్ స్వభావాన్ని అనుసరించి ఏ బట్ట నేయాలో వారికి సూచించి వారు నేసిన బట్టను కొనుగోలు చేసి అమ్మకాన్ని చేపట్టేవి. ఈ గ్రామస్థాయి సహకార సంఘాల గొడుగు సంఘాలు – ఆప్కో వంటివి – మార్కెటింగ్‌కు సంబంధించిన పటిష్టమైన వ్యవస్థను రూపొందించడం కోసమే ఉనికిలోకి వచ్చాయి.

ఒకప్పటి కంటే నిజానికి ఈ ప్రపంచీకరణ దశలోనే సహకార వ్యవస్థ అవసరం ఎక్కువ వుంది. పెట్టుబడిదారీ మార్కెట్ ఆటుపోట్లను ఒంటరిగా తట్టుకోలేని చిన్న ఉత్పత్తిదారులు వీటి సహాయంతోనైనా వాటిని కొంతమేరకయినా తట్టుకోగలుగుతారు. కానీ ప్రపంచీకరణ వచ్చేనాటికి నేత సహకార సంఘాలు కుప్పకూలిపోయాయి. మొత్తంగానే 'సహకార ఉద్యమం' అనుకున్న లక్ష్యాలలో ఒక చిన్న భాగం మాత్రమే సాధించగలిగిందని చెప్పవచ్చును. అయితే అందులోనూ మరీ ఘోరంగా విఫలమయింది చేనేత సహకార ఉద్యమం. గీత కార్మికుల సహకార సంఘాలు, బెస్తవారి సహకార సంఘాలు కొన్ని చోట్లనయినా కొంత సమర్థంగా పనిచేశాయి గానీ చేనేత సహకార సంఘాలు సంపూర్ణంగా మునిగాయి. ఇది నిజానికి కొంత ఆశ్చర్యం కలిగించే విషయమే. ఎందుకంటే గౌండ్ల (ఈడిగ) కులస్తుల కన్నా బెస్తవారి కన్నా, పద్మశాలీలలో చదువుకున్నవారి సంఖ్య ఎక్కువ. వెనుకబడిన కులాలలో అందరికన్నా పై భాగాన ఉన్నది నేతపని వారు. అయినప్పటికీ రాజకీయ నాయకులూ కులం పెద్దలూ అధికార గణమూ కలిసి నేత సహకార సంఘాలను నిండుగా ముంచారు. నేతపనివారు బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా ఎవరి ఇంట్లో వారు వృత్తే కుటుంబ జీవితంగా బతకడం వల్ల వచ్చిన 'అమాయకత్వం' వారిని అశక్తులు చేసిందనుకోవాలేమో!

పాలకులు నేత కార్మికుల మేలు కోరినట్లయితే ప్రపంచీకరణ మార్గం చేపట్టేముందే ఛిద్రమైన ఈ సహకార వ్యవస్థను పూర్తి స్థాయిలో పునరుద్ధరించడం ఒక ముఖ్య కర్తవ్యంగా పెట్టుకొని ఉండవలసింది. కానీ ఉత్పత్తిదారులందరినీ ఆధునీకరించుకొమ్మని దబాయించడం తప్ప దానికి ఏ రకమైన ఆలంబన అవసరం అని ఆలోచించడం తమ బాధ్యత కాదనుకున్నారు మన పాలకులు. ఈ విషయం మీద వారు ఎంత మాత్రం దృష్టి పెట్టలేదు. అయితే కరెంటు షాక్ తగిలినప్పుడు అసంకల్పితంగా చెయ్యి వెనక్కి లాక్కున్నట్టు 'చేనేత కార్మికుల ఆత్మహత్యలు' అని

పత్రికలలో వార్తలు రాగానే 'ఆప్కో బకాయిలు త్వరలో చెల్లించేస్తాం' అని ప్రకటిస్తుంటారు. బకాయిలు చెల్లించవలసిందే కానీ అది ఇప్పటికింకా బతికి ఉన్న చేనేత సహకార సంఘాలకూ వాటి సభ్యులకూ మాత్రమే ఉపకరిస్తుంది. ఎప్పుడో చచ్చిపోయి ఏ బకాయిలూ లేని చేనేత సహకార సంఘాలు చాలానే ఉన్నాయి. దుబ్బాక దీనికొక ఉదాహరణ. గడిచిన రెండేళ్లలో 20 మందికి పైగా చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్న దుబ్బాకలో ఒకనాడు 2447 మంది సభ్యులున్న సహకార సంఘం ఉండేది. కాని 1991లోనే అది మరణశయ్య పైకెక్కింది. 1993 లో కొన్ని రోజులు పనిచేసి మళ్లీ శాశ్వతంగా ప్రాణాలు విడిచింది. ఆ సంఘానికి ఆప్కో నుండి రావలసిన బకాయిలేమీ లేవు. ప్రభుత్వం ఆప్కో బకాయిలు మొత్తం తీర్చేసినా ఆ సంఘానికి జరగగల మేలు లేదు. అయినప్పటికీ దుబ్బాక ఆత్మహత్యల గురించి పత్రికలలో వార్తలు రాగానే దానికి పరిష్కారం చూపిస్తున్నట్టు 'ఆప్కో బకాయిలు మొత్తం త్వరలో చెల్లించేస్తాం' అని ముఖ్యమంత్రి పూర్తి అసందర్భంగా ప్రకటించడం జరిగింది. ఆయన ఏదో పరిష్కారం చూపించారని దినపత్రికల పాఠకులు నమ్మడమూ జరిగింది.

అసందర్భమైన ఆ హామీని పక్కన పెడితే దుబ్బాక చేనేత కార్మికులకు ప్రభుత్వం చెప్పేది ఏముంది? 'ఆధునీకరించుకోండి' అన్న ఆదేశం ఒక్కటే. అంటే ఏం చేయాలి? చేనేత మగ్గాల స్థానంలో మరమగ్గాలు తెచ్చి పెట్టుకోవాలా? ఆధునీకరణకు వేరే అర్థం ఏముంది? కానీ దాని అర్థం దుబ్బాక సిరిసిల్లగా మారడమే కదా! స్వంత మగ్గాలున్న చేనేత కార్మికులుగా చావకుండా మరమగ్గాల యాజమాన్యాల దగ్గర కూలి చేసుకునే కార్మికులుగా వారిని చావమనే కదా!

ఎవ్వరి సలహాలూ, ఆదేశాలూ లేకుండానే తమ స్వంత చొరవతో సిరిసిల్ల నేత కార్మికులు 35 ఏళ్ళ కింద రిస్క్ తీసుకొని మరమగ్గాలు తెచ్చుకొని తమ వృత్తిని తామే ఆధునీకరించుకున్నారు. ఒకప్పుడు 8 వేల చేతి మగ్గాలున్న చోట కాలక్రమంలో 12 వేల మరమగ్గాలు తయారయ్యాయి. (ఇప్పుడందులో 4 వేలు మూతపడిపోయాయి.) పని వెతుక్కుంటూ బొంబాయి సమీపంలోని భివాండీకి వలసపోయిన సిరిసిల్ల చేనేత కార్మికులు అక్కడ మరమగ్గాలు చూసారు. వాటి మీద బట్ట చవగ్గా తయారవుతుందని గ్రహించారు. కొంచెం పెట్టుబడి సమీకరించగలిగిన వారు ధైర్యం చేసి మరమగ్గాలు కొని సిరిసిల్లకు తెచ్చారు. ఈ మరమగ్గాల పోటీకి తట్టుకోలేక వృత్తి కోల్పోయిన చేనేత కార్మికులు అదే మరమగ్గాలపైన కూలీలుగా మారారు. లేదా భివాండీకీ సూరత్‌కూ పోయి పవర్‌లూం కార్మికులుగా స్థిరపడ్డారు.

యంత్రాలు ప్రవేశించిన చోట తక్కువ సమయంలో తక్కువ మానవ శ్రమతో ఎక్కువ ఉత్పత్తి జరుగుతుంది కాబట్టి దానికి తరచుగా రెండు పర్యవసానాలుంటాయి. ఉత్పత్తి అయిన వస్తువు ధర పడిపోతుంది కనుక అదే వస్తువును చేతితో తయారు చేసేవారు వృత్తి నుండి బయటికి నెట్టబడతారు. రెండు యంత్రీకరణతో పాటు ఉత్పత్తి పరిమాణం చాలా పెరిగితే తప్ప ఆ విధంగా నిరుద్యోగులయిన వారందరికీ యంత్రాలతో నడిచే ఉత్పత్తి రంగంలో ఉపాధి దొరకదు.

మరమగ్గాల రాకతో మొదట పని కోల్పోయింది స్త్రీలు. చేతి మగ్గంపైన ఇంట్లో అందరూ పని చేస్తారు. స్త్రీలు ఇంటి పనితో పాటు మగ్గం పని కూడ చూసుకుంటారు. కాని మరమగ్గాలు ప్రవేశించిన తరువాత ఒకే మనిషి నాలుగు నుండి ఎనిమిది మగ్గాలు నడపగలడు కాబట్టి స్త్రీల శ్రమ అనవసరం అయిపోయింది. అయితే వెంటనే కాకపోయినా కొంత కాలానికి కరీంనగర్ జిల్లాలో వ్యాపించిన బీడీ పరిశ్రమ స్త్రీలందరినీ తనలో ఇముడ్చుకుంది. నిరుద్యోగులైన మగవాళ్ళు భివాండీకీ, సూరత్‌కూ పోయి పవర్‌లూం రంగంలో కార్మికులుగా పని సంపాదించుకున్నారు. మొత్తం మీద నేత కుటుంబాల ఆదాయాలు పెరిగాయి. అంటే మొదటి దశ ఆధునీకరణ సిరిసిల్లలో విధ్వంసక రూపం తీసుకోలేదు. ఆర్థికంగా వర్ధిల్లిందని కూడ చెప్పుకోవచ్చు. కానీ 1991 తరువాత పెరిగిన నూలు ధరలు ఆ అభివృద్ధికి బ్రేక్ వేసాయి. ఆ ధరల పెరుగుదల సరళీకరణలో భాగంగా మొదలైన పత్తి, నూలు ఎగుమతుల ఫలితమని చూశాం. కిందటి సంవత్సరం అమలులోకి వచ్చిన విద్యుత్ సంస్కరణల ఫలితంగా మరమగ్గాల కరెంటు బిల్లు రెండు రెట్లు కావడం వారికి పెద్ద దెబ్బే అయింది. ఈ విధంగా ఖర్చు పెరిగి ఆదాయం మాత్రం పెరగకపోగా తగ్గిపోసాగింది. దీనికి తోడు పవర్‌లూంల పైన ఎక్సైజ్ పన్ను కిందటి సంవత్సరం దాదాపు రెండు రెట్లయింది (5.5 శాతం నుండి 9 శాతానికి పెరిగింది). అమ్మకపు పన్ను ఇతర రాష్ట్రాలలో 2 శాతం ఉండగా మన దగ్గర రెండేళ్ళుగా 4 శాతం అయింది. యజమానులు ఈ భారాన్ని వీలయిన మేరకు కార్మికుల పైకి నెట్టివేశారు. వివరాలలోకి పోకుండా స్థూలంగా చెప్పాలంటే కూలి రేటు 20 నుండి 30 శాతం (నిజవేతనం కాదు, రొక్కపు వేతనమే!) దాకా పడిపోయింది. ఘోరంగా పడిపోయిన ఈ జీవన ప్రమాణం ఆత్మహత్యలకు దారి తీసింది.

సిరిసిల్ల దుస్థితి ఈ విధంగా ఉండగా దుబ్బాకను సిరిసిల్ల కమ్మంటుంది మన ప్రభుత్వం. మరి సిరిసిల్లకు వారిచ్చే సలహా ఏమిటి? ఆధునీకరణ దిశలో మరొక పెద్ద అడుగు ముందుకు వెయ్యమని కేంద్ర జౌళి శాఖామాత్యులు ధనుంజయ్ కుమార్‌గారు సిరిసిల్లలో నేత కార్మికులనూ, యాజమాన్యాలనూ ఉద్దేశించి ప్రసంగిస్తూ అన్నారు. ఏమిటీ ముందడుగు? ఒక కార్మికుడు నాలుగు నుండి (కష్టం మీద) ఎనిమిది మగ్గాలు నడిపే పాతరకం మరమగ్గాల స్థానంలో ఒక కార్మికుడు 40 నుండి 50 పవర్‌లూంలు నడిపే జెట్‌లూంలు తెచ్చి పెట్టుకోవడం. వీటి కొనుగోలుకు చాలా పెట్టుబడి కావాలి. పైగా వాటిపైన భారీ ఎత్తున ఉత్పత్తి చేస్తే తప్ప ఆ ఖర్చు గిట్టుబాటు కాదు కాబట్టి వర్కింగ్ కాపిటల్ కూడ చాలా కావాలి. అయితే అసలే వస్త్రాల ధర పెరగడం లేదని ఆందోళన చెందుతున్న ఈ దశలో ప్రపంచ వాణిజ్య సంస్థ నియమాల పుణ్యాన తూర్పు ఆసియా నుండి చవకగా వస్త్రాలు దిగుమతి అయ్యేటట్టయితే జెట్‌లూంలు ఆదిలోనే మూతపడే ప్రమాదం ఉంది. అందువల్ల ఏ రకంగా చూసినా ఈ రోజు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న చిన్న పవర్‌లూం యజమానులకు ఇది ఆచరణ యోగ్యమైన పరిష్కారం కాదు.

ఒకవేళ జెట్‌లూంలు సిరిసిల్లకు వస్తే నేత కార్మికులలో నిరుద్యోగం ఇంకా పెరుగుతుంది తప్ప తగ్గదు. తొలిదశ ఆధునీకరణలో ఉపాధి కోల్పోయిన వారిని భివాండీ, బీడీ పరిశ్రమా ఆదుకున్నాయి. ఇప్పుడు భివాండీ నుండి తిరుగు వలస మొదలయింది. కాబట్టి అక్కడ కొత్తగా ఉపాధి దొరకబోయేది లేదు. బీడీ మాటకొస్తే ఆ పరిశ్రమలో అదనంగా పనులు పుట్టడం లేదు. పుట్టినా స్త్రీల చేత చవకగా పనిచేయించుకోవడానికి అలవాటు పడిన బీడీ యజమానులు మగవాళ్లకు అక్కడ పని ఇవ్వబోరు.

ఒక ఆధునిక తారకమంత్రం లాగా ఆధునీకరణ జపం చేయడం మానేసి నిర్దిష్టమైన పరిష్కారాలు వెతకడం సాధ్యం కాదా? ఎక్సైజ్ పన్ను తగ్గించమనీ, అమ్మకపు పన్ను పొరుగు రాష్ట్రాల స్థాయికి దించమనీ, కరెంటు ఛార్జీలు తగ్గించమనీ, నూలు ఎగుమతులను నిషేధించి ప్రపంచ వాణిజ్య సంస్థ ఆగ్రహానికి గురి కావడం అసాధ్యమైతే కనీసం చేనేత రంగానికీ, సంక్షోభంలో ఉన్న మరమగ్గాలకూ సబ్సిడీపైన నూలు సరఫరా చేయమనీ, సిరిసిల్ల మరమగ్గాలలో సగభాగం ఉత్పత్తి చేసే 20 కౌంట్ల ముతకబట్టను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆస్పత్రులు, జైళ్ళు, హాస్టళ్లలో వాడాలనీ,

మిగిలిన సగం మరమగ్గాలపైన నేసే పాలియెస్టర్ బట్ట అమ్మకానికి ఆప్కో సహకారం అందించాలనీ, మరమగ్గాల యాజమాన్యాలకు, కార్మికులకు చవక రుణాలు ఇవ్వాలనీ – ఇత్యాది డిమాండ్లు సిరిసిల్ల పవర్‌లూం యజమానులూ, కార్మికులూ పెడుతున్నారు. వీటిలో దేనికీ జవాబు చెప్పకుండా ఆధునీకరణ మంత్ర జపం చేసుకుంటూ పోయే పాలకులను ఏమనాలి?

దుబ్బాక విషయానికొస్తే, మృతప్రాయంగా ఉన్న ఆ ఊరి చేనేత సహకార సంఘానికి తిరిగి ప్రాణం పోయడం మొదట జరగవలసిన పని. కానీ దాని గురించి మన ప్రభుత్వ విధాన నిర్ణేతలెవ్వరూ మాట్లాడడం లేదు. దుబ్బాక చేనేత కార్మికులు ముతక టవళ్ళూ, లంగాలూ ఉత్పత్తి చేస్తున్నట్లు భావిస్తూ మార్కెట్‌కు తగినట్టు ఆకర్షణీయమైన ఉత్పత్తులు చేపట్టండి అని వారికి హితవు చెప్తున్నారు. నిజానికి దుబ్బాకలో ఉత్పత్తి చేస్తున్నది అందమైన డిజైన్లున్న పల్చటి చీరలు. అయితే అవి ఇప్పుడు అమ్ముడుపోవటం లేదు. దానికి ఒక కారణం, అదే డిజైను ప్రింట్ చేసిన పవర్‌లూం ఉత్పత్తులు మార్కెట్‌లోకి రావడం అని దుబ్బాక నేత కార్మికులు అంటున్నారు. మరి ప్రభుత్వం ఆశిస్తున్నట్టు రేపు పవర్‌లూంలన్నీ జెట్‌లూంలుగా మారి మరింత చవకగా బట్ట తయారయితేను, ప్రపంచ వాణిజ్య సంస్థ చలవ వల్ల తూర్పు ఆసియా నుండి ఇంకా చవకగా ఇంకా అందమయిన ప్రింట్‌లున్న చీరలు దిగుమతి అయితేను దుబ్బాక ఏమవుతుంది?

అయితే దుబ్బాకకు – అంటే చేనేత రంగానికి పరిష్కారం మన వాళ్ళెప్పుడో ఆలోచించి పెట్టారు. ఏ ఆలంబన లేకుండా స్వంతంగా మార్కెట్‌లో (ప్రధానంగా ఎగుమతి మార్కెట్‌లోనూ, ధనిక వర్గాల మార్కెట్‌లోనూ) నిలదొక్కుకోగల అత్యంత నాణ్యమైన ఉత్పత్తికి తప్ప ఇతర చేనేత ఉత్పత్తులను పవర్‌లూంల పోటీ నుండి కాపాడడానికి రిజర్వేషన్లు, సబ్సిడీలు ఇక మీదట ఇచ్చేది లేదు. ఆ చేనేత పవర్‌లూంగా మారి, ఆ పైన జెట్‌లూంగా మారి ఇంకా ఏయే మార్పులొస్తే అన్నిటినీ ఈదుకుంటూ ఎక్కడికక్కడ అక్కర లేకుండాపోయే మనుషులనూ వారి శ్రమనూ నిర్మొహమాటంగా విసర్జించుకుంటూ పురోగమించాలి.

ఇది ఆత్మహత్యలను నివారించే ఆలోచన మాత్రం కాదు.

**బి.సి. గర్జన**

**ఆగస్టు 2001**

# సిరిసిల్ల ఆత్మహత్యలు నష్టపరిహార రాజకీయాలు

**సి**రిసిల్ల మహానగరం కాదు. ఈ మధ్యనే మునిసిపాలిటీగా గుర్తింపు పొందిన పెద్ద గ్రామం. నేత మగ్గాలు, బీడీ పరిశ్రమ ఆ ఊరికి ఆయువు పట్టయిన వ్యాపకాలు.

గడచిన 10 సంవత్సరాలలో ఆ ఊరిలో 209 మంది నేత కార్మికులు బతుకు గడవక ఆత్మహత్య చేసుకున్నారని ప్రభుత్వం అంటుంది. (300 దాకా చేసుకున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం వల్ల మిగిలినవి బయటకు రాలేదని ఆ ఊరి జనం అంటారు.) 209 మాత్రమే జరిగాయనుకున్నా ఒకే ఊరిలో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు సగటున సంవత్సరానికి 20 మంది ఆత్మహత్యకు పాల్పడడం చిన్న విషయం కాదు.

వీళ్ళంతా ఎందుకు చనిపోతున్నారు?

పేదరికం వల్ల, అప్పుల భారం వల్ల, అప్పు తీర్చలేమన్న అవిశ్వాసం వల్ల ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇవి ఒక పద్ధతి ప్రకారం ప్రతి సంవత్సరం జరుగుతున్నాయంటే దానికి గల కారణాలు కాకతాళీయం కాదనీ, ఇప్పుడున్న నేత మగ్గాల వ్యవస్థే ప్రస్తుత పరిస్థితులలో ఈ చావులకు దారి తీస్తున్నదనీ అర్థం అవుతుంది. ఈ పరిస్థితుల మూలాలను మొత్తంగా వెలికి తీయలేకపోయినా దాని స్వరూపాన్నయినా అర్థం చేసుకునే ప్రయత్నం ఈ రిపోర్టు.

చనిపోతున్న వాళ్లు చేనేత కార్మికులు కారు. మరమగ్గాల్లో (పవర్‌లూం) పని చేసే కార్మికులు. ఒక దశలో – ఇప్పటికే చాలా ప్రాంతాలలో – మరమగ్గాల పోటీకి

తట్టుకోలేక చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు, ఆకలికి చనిపోయారు. కాలక్రమంలో చాలా ప్రాంతాలలో చేనేత మగ్గాల స్థానంలో మరమగ్గాలు వచ్చాయి. మరమగ్గాల యజమానుల సంగతి ఎట్లాగున్నా, వాటి పైన పనిచేసే కార్మికుల స్థితి మాత్రం చేనేత కార్మికుల కన్నా మెరుగ్గా లేదు.

సిరిసిల్ల పట్టణంలో 25 వేల మరమగ్గాలు ఉన్నాయి. ఇందులో మూడింట రెండు వంతుల మగ్గాల మీద పాలియెస్టర్ బట్ట నేస్తారు. మిగిలిన ఒక వంతు మీద నూలు వస్త్రాలు నేస్తారు. పాలియెస్టర్ పైన పనిచేసే కార్మికుడు ఒక్కొక్కడు 12 మగ్గాలు నడపగలడు. నూలు బట్టనేసే కార్మికుడు 4 మగ్గాలు నడపగలడు. ('డు' అనడానికి కారణం, చేనేత మీదనైతే భార్యాభర్తా ఇద్దరూ పనిచేసేవారు గానీ మరమగ్గాలు కేవలం మగవాళ్ళవి.) ఇప్పుడు నూలు బట్టలు నేసే కార్మికులే ప్రధానంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వాళ్ళు వారానికి 500 రూపాయలు సంపాదించగలరని అనగా వింటున్నాము గానీ ఆత్మహత్య చేసుకున్న కార్మికుల కుటుంబాలతో మాట్లాడితే వారు 300 నుంచి 400 రూపాయల దాకా మాత్రమే సంపాదిస్తున్నారని తెలుస్తున్నది. దీనికి తోడుగా ఆ కార్మికుడి భార్య బీడీలు చుట్టి వారానికి 150 నుంచి 200 రూపాయలు సంపాదిస్తున్నది. వెరసి నెలసరి కుటుంబ ఆదాయం 2,000 రూపాయలు దాటదు.

క్రమంగా పట్టణంగా మారుతున్న సిరిసిల్లలో నెలకు రెండు వేల రూపాయల ఆదాయంతో ఒక కుటుంబం బతకడం కష్టం. నెలకు 500 రూపాయల కంటే తక్కువ అద్దెకు ఇల్లు దొరకదు. పిల్లలకు ఏమైనా చదువు అబ్బాలంటే ప్రైవేటు స్కూలుకు ఫీజులు కట్టి పంపించవలసిందేనన్న ఆలోచనను జయించడం సాధారణ మానవులకు సాధ్యం కాదు. కాబట్టి ఆ ఖర్చు భరించవలసిందే. నేత కార్మికులు మినహాయింపు లేకుండా పద్మశాలీ కులానికి చెందిన వారు కావడం కూడ సమస్యను పెంచింది. ఆ కులం బి.సి జాబితాలో ఉన్నప్పటికీ దానికి బ్రాహ్మణీయ సాంస్కృతిక లక్షణాలు, సామాజిక స్వభావమూ ఎక్కువ. అందువల్ల సులభంగా అన్ని రకాల కూలికి పోరు. నేత వృత్తిని వదిలిపెడితే ఉద్యోగాలో, వ్యాపారమో చేసుకోవాలి తప్ప వేరే ప్రత్యామ్నాయాన్ని సులభంగా ఎంచుకోరు. అవి అందుబాట్లో లేకపోతే చావునైనా ఎంచుకోవడానికి సిద్ధపడతారు. ఆచార వ్యవహారాల ఖర్చులూ అధికమే. కట్నాలు ఇతర బలహీన వర్గాలలో కంటే ఎక్కువే.

నూలు బట్టలు నేసే వారికి ధూళి కాలుష్యం సమస్య తీవ్రంగా ఉంటుంది. క్షయతో సహా శ్వాసకోశ వ్యాధులు నేత కార్మికులలో సగటు కంటే ఎక్కువగా ఉన్నాయని స్థానిక వైద్యులు అంటున్నారు. చనిపోయిన నేత కార్మికులొక్కొక్కరికీ 40 వేల రూపాయలకు తక్కువ కాకుండా అప్పులున్నాయి. నేత కార్మికులకు బతకడానికి అప్పులిచ్చే బ్యాంకు ఏదీ దేశంలో లేదు కాబట్టి నెలకు వందకు 3 నుంచి 5 రూపాయల దాకా వడ్డీ చెల్లించే ఒప్పందం మీద ప్రైవేటు వ్యక్తుల నుంచి, ఫైనాన్స్ కంపెనీల నుంచి అప్పు తెచ్చుకుంటున్నారు.

విషాదమేమిటంటే, ఇతర జిల్లాల నుంచి కూడ బతుకుతెరువు కొరవడిన చేనేత కార్మికులు మరమగ్గాల మీద పని చేద్దామన్న ఆశతో సిరిసిల్లకు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. ఎన్నో ఏళ్ళ కింద భివాండీకీ సూరత్‌కూ మరమగ్గాల పైన పని చేయడానికి పోయిన సిరిసిల్లవాసులు అక్కడ నేత మగ్గాల వ్యవస్థ సంక్షోభంలో పడడంతో వెనక్కి వచ్చి ఇక్కడే మరమగ్గాలలో పని సంపాదించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఒక దశలో దీని వల్ల పని దొరకని పరిస్థితి ఏర్పడింది గానీ ఇప్పుడు సమస్య పని దొరకకపోవడం కాదు. పని చాలామందికే దొరుకుతున్నది. సిరిసిల్లలోని 25 వేల మగ్గాలు ఎప్పుడైనా నిలిచిపోతే అది పనిలేకపోవడం కంటే కరెంటు కోత వల్లనే ఎక్కువగా జరుగుతున్నది. అయితే పని విరివిగానే దొరికినా చేసిన పనికి లభించే ఆదాయం – భార్య బీడీ పనిలో సంపాదించే దానితో కలుపుకున్నా – బతకడానికి సరిపోక అప్పు మీద అప్పయి ప్రాణాలు తీసుకుంటున్నారు.

ప్రభుత్వ అధికారులను అడిగితే వేరే కారణం చెప్తారు. మగ్గాల కార్మికులు కల్తీ కల్లుకు అలవాటు పడ్డారనీ, దానితో ఆరోగ్యం క్షీణించి పని చేయలేక ఆదాయం కోల్పోతున్నారనీ, అందువల్ల ఆత్మహత్య చేసుకుంటున్నారనీ వారంటారు. ఇది నిజమనుకున్నా కల్తీ కల్లును నిరోధించే బాధ్యత తమపైన లేనట్టుగా ప్రభుత్వ అధికారులు మాట్లాడడం దుర్మార్గం. పైగా అది నిజం కూడ కాదు. వారు అత్యధికంగా – అంటే ఏ వ్యసనానికీ బానిస కాకుండా – పనిచేసినా వారానికి 500 రూపాయలు మాత్రమే సంపాదించగలరనేది అందరూ ఒప్పుకుంటున్న విషయం. అయితే వ్యసనాల వల్ల కానీయండి, నూలు నుంచి వచ్చే ధూళివల్ల వచ్చే క్షయరోగం వల్ల కానీయండి, కరెంటు కోత వల్ల కానీయండి వారిలో ఎక్కువమంది వారానికి 300 లేక 400 మాత్రమే సంపాదించగలుగుతున్నారు. ఒకవేళ 500 సంపాదించినా అవసరాలు తీరుతాయా?

చట్టాన్ని గురించి మాట్లాడుకుంటే, మరమగ్గాల కార్మికులకు కనీస వేతనాల చట్టం ప్రకారం ఒక మీటర్ బట్ట నేస్తే 2.80 రూపాయలు ఇవ్వాలి. కానీ అందులో నాలుగవ వంతు కూడ ఇవ్వడం లేదు. అలాగని కనీస వేతనాలు ఇవ్వాలి అన్న డిమాండ్ కూడ ప్రస్తుత పరిస్థితులలో సమస్యను పరిష్కరించదు. అంచెలంచెలుగా ఉన్న మరమగ్గాల వస్త్ర ఉత్పత్తిలో వాటాదారులు చాలా ఎక్కువ. పైన మాస్టర్ వీవర్స్ ఉంటారు. వాళ్ళు నూలు కొని 'బీం' తయారుచేసి మగ్గాల యజమానులయిన జాబ్ వర్కర్లకు ఇస్తారు. ఈ జాబ్ వర్కర్ల దగ్గర 4 నుంచి 10 దాకా మగ్గాలు ఉంటాయి. వాళ్ళు కరెంటు ఖర్చు, షెడ్ కిరాయి వగైరా పెట్టుకొని కార్మికుల చేత పని చేయిస్తారు. ఈ జాబ్ వర్కర్లే నేత కార్మికుల యజమానులు. ఖర్చులన్నీ పోను వాళ్ళకు కార్మికులకిచ్చే దానికంటే ఏమంత ఎక్కువ మిగలదు. పెద్ద సంఖ్యలో మగ్గాలుంటే వేరే సంగతి కానీ సగటు యజమానులను కూలి పెంచమంటే మగ్గాలు అమ్ముకొని పోతారే తప్ప పెంచి వ్యాపారం కొనసాగించడానికి ఇష్టపడరు.

నూలు కొనుక్కునే మాస్టర్ వీవర్లు కూడ ఈ గొలుసులో ఒక 'లింక్' మాత్రమే. ఆపైన నూలు అమ్మేవాళ్ళు, ఆపైన పత్తి జిన్నింగ్ చేసే మిల్లులు, నూలు ఉత్పత్తి చేసే మిల్లులు ఉంటాయి. అది ఒక చివర అయితే ఈ చివర బట్ట ఉత్పత్తి అయిన తరువాత అద్దకానికీ, అమ్మకానికీ పోవాలి. ఒక్కొక్క దశలోనూ చివరి ఉత్పాదకం విలువను పంచుకునే వాళ్ళుంటారు. ఈ దొంతరను ఛేదించి జిన్నింగ్ నుంచి బట్ట ఉత్పత్తి, అమ్మకాల దాకా అన్నీ ఒకే కప్పుకింద జరిగితే తప్ప నేత కార్మికులకు ఇప్పుడున్న మార్కెట్‌లో తగిన వేతనం ఇవ్వడం కష్టం. ప్రభుత్వం టెక్స్‌టైల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, నూలు సరఫరా చేసి, బట్ట తానే కొనుక్కొని లాభాలకు అతీతంగా నడిపితే చాలని అనుభవజ్ఞులైన స్థానిక కార్మిక సంఘాల నాయకుల అభిప్రాయం. ఇటువంటి ప్రయత్నం ఏదైనా ప్రభుత్వం తన మీద వేసుకోవడానికి సిద్ధపడితే తప్ప ఈ ఆత్మహత్యల పరంపర ఆగేటట్టు లేదు.

సిరిసిల్లలో ఆత్మహత్యలు 1997 లో మొదలై 2000 సంవత్సరం తరువాత పెరిగాయి. ఆ ఒక్క సంవత్సరంలోనే 56 మంది ఆత్మహత్య చేసుకున్నారు. అప్పట్లో చాలా గొడవే జరిగింది. నేత కార్మికులకు పని దొరకక పోవడం అనే సమస్య ఆ దశలో చాలా ఉంది కాబట్టి పని కల్పించాలన్న డిమాండ్ ప్రధానంగా ముందుకొచ్చింది. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరమగ్గాల కార్మికులకు పని కల్పించడానికి సిరిసిల్ల సమీపంలో ఒక టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుచేస్తానని హామీ

ఇచ్చాడు. కొన్నేళ్ళ తరువాత అది ఏర్పాటయింది గానీ, దానిలో నెలకొల్పిన మగ్గాలు జెట్ మగ్గాలు. 70 మగ్గాలను ఇద్దరు నడపగలరు. అవి ఎంతమందికి పని కల్పించగలవు?

తరువాత ప్రభుత్వ ప్రయత్నంతో ప్రమేయం లేని కారణాల వల్ల పని బాగానే దొరకసాగింది. కానీ వేతనం చాలక సంక్షోభం కొనసాగింది. ఆత్మహత్యలూ కొనసాగాయి. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు ఇచ్చినట్టే నేత కార్మికుల విషయంలోనూ నష్టపరిహారం ఇవ్వాలన్న డిమాండ్‌కు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నష్టపరిహారానికి సంబంధించిన ఆదేశాలను జీవో నెం. 46 రూపంలో 13-2-2006 నాడు జారీ చేసింది. ఏ మాటకామాటే చెప్పుకోవాలి. ఈ జీవో రైతుల నష్టపరిహారం జీవో నెం. 421 కంటే మెరుగైనదే. ఒక నేత కార్మికుని ఆత్మహత్య నష్టపరిహారానికి ఎప్పుడు అర్హమవుతుందనే విషయాన్ని డొంక తిరుగుడుగా కాకుండా స్పష్టంగానే సూచించింది. వృత్తి సంబంధమైన వేదనతో, అంటే తక్కువ వేతనం లేక నిరుద్యోగం కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదురై తత్ఫలితమైన మానసిక ఒత్తిడి వల్ల ఆత్మహత్య చేసుకునే నేత కార్మికుని కుటుంబానికి లక్ష రూపాయల నష్ట పరిహారం, బాకీలు తీర్చడానికి 50 వేలు వెరసి లక్షన్నర ఇవ్వాలని చెప్పింది ఈ జీవో. సిరిసిల్లకు సంబంధించినంత వరకు దీనిని అమలు చేయవలసిన ఆర్.డి.ఓ నేత కూలీల సమస్యల పట్ల సానుభూతి గల అధికారి కూడ. అయినప్పటికీ సరిగ్గా సగం కేసులు అనర్హమైనవిగా గుర్తించబడ్డాయంటే జీవిత వాస్తవాలకూ, ప్రభుత్వ విధానాలకు అధికారులు ఇచ్చే వ్యాఖ్యానాలకూ మధ్య ఎడం ఎంత ఉందో అర్థం అవుతుంది. 1997 నుంచి 2006 దాకా 209 ఆత్మహత్యలు జరిగినట్టు ప్రభుత్వం ఒప్పుకుంటున్నదని చెప్పాం కదా! అందులో 105 ఘటనలు ఈ జీవో పరిధిలోకి రానివని నిర్ణయించారు.

2003 జూన్ 3వ తేదీన ఆత్మహత్య చేసుకున్న వేముల మనోహర్ కుటుంబానికి స్వంత మగ్గాలు ఆరు ఉండేవి. కుటుంబ ఆస్తి పంపకాలలో మగ్గాలన్నీ అతని తమ్ముడు తీసుకున్నాడు. మనోహర్ మరమగ్గాల మీద పని చేయడానికి భివాండీకి పోయి రెండు మూడేళ్ళు అక్కడ పనిచేశాడు. అక్కడ పని తగినంత దొరకని పరిస్థితి వచ్చేసరికి వెనక్కి సిరిసిల్లకు వచ్చాడు. ఇక్కడ ఏ యజమాని దగ్గరా వెంటనే పని దొరకలేదు. ఎవరిదో ఎస్.టి.డి బూత్ నడిపే పని సంపాదించుకున్నాడు. ఆ పనిలో లభించిన జీతం తక్కువ. అప్పటికి అప్పు 40 వేలు చేరుకుంది. వస్తున్న జీతం కుటుంబ పోషణకూ నెలనెలా కట్టవలసిన వడ్డీకే సరిపోక ఆత్మహత్య చేసుకున్నాడు. అతని ఆత్మహత్యకు దారితీసిన కారణాలన్నీ నేత రంగంలో ఆదాయం లేమితో ముడిపడి

ఉన్నప్పటికీ చనిపోయే నాటికి అతను నేతకూలీ కాదు, ఎస్.టి.డి బూత్ నడుపుతున్నాడని చెప్పి అతని భార్య సుగుణకు నష్టపరిహారం ఇవ్వలేదు. బహుశా అతను నేత కార్మికుడిగా పనిచేసింది (చివరి దశలో) భివాండీలో గాని సిరిసిల్లలో కాదన్నది కూడ అధికారుల దృష్టిలో ఒక కారణం అయి ఉండవచ్చు. ఎందుకంటే స్వర్గం రవీందర్ అనే వ్యక్తి నేత కార్మికుడే, సిరిసిల్ల వాస్తవ్యుడే, అప్పుల భారానికే ఆత్మహత్య చేసుకున్నాడు అని అంగీకరిస్తూ కూడ అతను పనిచేసింది సిరిసిల్లలో కాదన్న కారణంగా జీవో 46 అతని కుటుంబానికి వర్తించదన్నారు.

2006 జూలై 26న ఆత్మహత్య చేసుకున్న చిలుక లింగయ్య 50 ఏళ్ళవాడు. మరమగ్గం మీద పనిచేసి వారానికి 400 రూపాయలు సంపాదించేవాడు. భార్య బీడీలు చుట్టి వారానికి 100 రూపాయలు సంపాదించేది. ముగ్గురు పిల్లలున్నారు. లింగయ్యకు రేడియో రిపేరింగ్ పని కూడ వచ్చు. ఆ పని కూడ తీరిక వేళల్లో చేసేవాడు. టీవీలు వచ్చిన తరువాత రేడియోలు తగ్గిపోయినా అప్పుడప్పుడు చేస్తూనే ఉండేవాడు. ఆ ఆదాయం ఈ ఆదాయం కలుపుకున్నా చాలక 60, 70 వేల రూపాయల అప్పయింది. పైగా కడుపులో అల్సర్ కూడ బాధపెట్టేది. అతను రేడియో మెకానిక్ అని తీర్మానించి జీవో 46ను అతని కుటుంబానికి వర్తింపచేయలేదు.

2006 మార్చి 6న తేదీన ఆత్మహత్య చేసుకున్న కోడెం రాజేశంకు నలుగురు పిల్లలు. ఇద్దరు బిడ్డలకు పెళ్ళి చేశాడు. తను వారానికి 400 రూపాయలు, భార్య నర్సమ్మ బీడీ పనిలో వారానికి 140 రూపాయలు సంపాదించేవారు. చనిపోయే నాటికి 80,000 అప్పయింది. అతను నేత కార్మికుడే. భారీగా అప్పుల పాలైన మాట వాస్తవమే. ఆత్మహత్య చేసుకున్న మాటా వాస్తవమే. అయినప్పటికీ నర్సమ్మకు జీవో 46 కింద నష్టపరిహారం ఇవ్వలేదు. ఎందుకని? అతను అతిగా తాగి ఆత్మహత్య చేసుకున్నాడని. మరొక నలుగురి విషయంలో కూడ (గాజుల రమేశ్, వెంగోళ్ల రఘునాథం, దూసారం చంద్రం, దేవన్‌పల్లి దేవరాజు) తాగుడు పర్యవసానంగా ఆత్మహత్య చేసుకున్నారని నష్టపరిహారం నిరాకరించారు. ఇద్దరి విషయంలో (బండి సిద్ధిరాములు, కొక్కుల రాజమల్లు) మానసిక స్థిమితం లేకపోవటం వల్ల ఆత్మహత్య చేసుకున్నారని నిర్ధారించి నష్టపరిహారం నిరాకరించారు. మరో 18 కేసులలో ఆత్మహత్యకు వ్యక్తిగత సమస్యలు, కుటుంబ తగాదాలు, భార్యతో తగాదాలు కారణమని చెప్పి నష్టపరిహారం నిరాకరించారు. 14 కేసులలో అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకున్నారని చెప్పి నష్టపరిహారం నిరాకరించారు.

తాగుడు, మనఃస్థిమితం కోల్పోవడం, కుటుంబ తగాదాలు, అనారోగ్యం - ఇవన్నీ పేదరికంతో, తీర్చలేని అప్పుల భారంతో ముడిపడి ఉండకూడదా? కనీసం పైకి కనిపించే ఈ కారణాల వెనక్కిపోయి ఏముందో చూసే ప్రయత్నం చేయకపోవడం ఏ విధంగా సబబు? ద్యావనపల్లి వీరయ్య అనే వ్యక్తి విషయంలో అతని రోగం ఆస్తమా (ఉబ్బసం) అని కూడ గుర్తించారు. దూది నుంచి రేగే ధూళివల్ల రాగల రోగాలలో అదొకటి. ఉబ్బసం వచ్చి, దానిని నయం చేసుకోవడానికి ఆదాయం చాలక, రోగం వల్ల ఎక్కువ పనిచేయలేని కారణంగా ఆదాయం ఇంకా తగ్గి, అప్పు భారం ఇంకా పెరిగి ఆత్మహత్య చేసుకుంటే అది జీవో 46 పరిధిలోకి ఎందుకు రాదు? వేతనం చాలక తీర్చలేని అప్పుల పాలైన నేత కార్మికుడు ఏ తాగుడుకూ అలవాటు పడకుండా, ఇంటి వాళ్ళతో వారి ఖర్చుల గురించో తన అసమర్థత గురించో తగాదా పడకుండా, మనఃస్థిమితం కోల్పోకుండా, ఆరోగ్యం పాడు కాకుండా శుద్ధ అప్పుల భారానికి ఆత్మహత్య చేసుకుంటేనే అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందనడం ఏం తర్కం? నిరుద్యోగం, లేక తక్కువ వేతనం కారణంగా తలెత్తిన ఆర్థిక దుస్థితి ఫలితంగా మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్య చేసుకున్న నేత కూలీల కుటుంబాల గురించి జీవో 46 ప్రస్తావిస్తుంది. ఈ పరిస్థితి ఉన్నప్పుడు దానికి వేరే అనేకం తోడు కావచ్చు. అవి మానసిక ఒత్తిడిని పెంచవచ్చు, లేక బతకాలన్న సంకల్పాన్ని నీరసింపచేయవచ్చు. అసలు అప్పు భారమే లేదంటేనో, ఆ వ్యక్తి ఎన్నడూ నేత కూలీ కాదంటేనో వేరే సంగతి. అవి రెండూ ఉన్నప్పుడు జీవిత సహజ క్రమంలో వాటికి తోడయ్యే విషయాలను కారణాలుగా చూపించి మినహాయించడం ఏం న్యాయం?

జీవితంలో ఉండగల వైవిధ్యమంతా ప్రభుత్వ ఆదేశాలలో వ్యక్తం కావడం అసాధ్యం. అటువంటప్పుడు ఆ ఆదేశాలను విశాలమైన పరిధిలో అర్థం చేసుకోవడం, వాటి స్ఫూర్తికి తగిన రీతిలో వాటిని జీవిత పరిస్థితులకు ఉదారంగా అన్వయించడం ఉచితంగా ఉంటుంది. ఈ పనిచేసే అధికారులు స్వభావరీత్యా ప్రజల పట్ల సానుభూతి గలవారు అయినా ప్రభుత్వానికి 'ఆర్థిక భారం'గా భావించబడే నిర్ణయాలు తీసుకునే దగ్గర వెనకాడతారు. 'పాలనా సంస్కరణలు', 'సత్పరిపాలన' అంటూ మనం పదే పదే వింటున్న ప్రక్రియలలో ఈ వైఖరిని వదిలించే ప్రయత్నమేదైనా జరిగితే మంచిది.

**మానవహక్కుల వేదిక బులెటిన్ 8**
**మే 2007**

# కాగజ్‌నగర్ బాటలో బెల్లంపల్లి?

'సర్‌సిల్క్' మూతపడక ముందు కాగజ్‌నగర్‌ను చూసారా? చూసిన వాళ్లు ఆ ఊరి కళ మరచిపోలేమంటారు. ఆ తరువాత శ్మశానం కళ వచ్చింది. రేపు బెల్లంపల్లికీ అదే గతి పట్టబోతుందా? పోనుపోను మందమర్రికీ, మంచిర్యాలకూ కూడ పడుతుందా? తూర్పు ఆదిలాబాద్‌ను ఒక జిల్లా చేయాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉంది. రాజకీయ పార్టీలు ఇప్పటికే తూర్పు ఆదిలాబాద్‌కు వేరు కమిటీలు పెట్టుకున్నాయి. కానీ ఇప్పుడు తూర్పు ఆదిలాబాద్‌ను వల్లకాడు చేయకుంటే అదే పదివేలు అనే స్థితి వచ్చింది.

సింగరేణి కంపెనీ విస్తరణ ఈ విపత్తు వెనక ఉన్న శక్తి. అక్కడ బొగ్గు ఉంది. దానిని వేగంగా తవ్వితీసి ఉత్పత్తి పెంచి సక్సెస్ అనిపించుకోవాలన్న సంకల్పం ఉంది. ఉత్పత్తి వృద్ధిరేటు తప్ప వేరే ఏదీ కనిపించని విధాన దృక్పథం ఉంది. వనరులున్న భూమి వల్లకాడెందుకు కాదు?

సింగరేణికి వంద సంవత్సరాలు పైబడిన చరిత్ర ఉంది. అండర్‌గ్రౌండ్ మైనింగ్ పద్ధతిలో బొగ్గును విశేషంగా ఉత్పత్తి చేసింది. వేరే ఉపాధి వనరు అందుబాటులో లేని ఉత్తర తెలంగాణ జిల్లాల గ్రామీణ యువకులకు లక్షల సంఖ్యలో ఉద్యోగాలు కల్పించింది.

ఇప్పుడు అండర్‌గ్రౌండ్ పద్ధతిలో సులభంగా తీయగల బొగ్గంతా తీసేసామని సింగరేణి దొరలంటున్నారు. ఇంకా అండర్‌గ్రౌండ్ పద్ధతిలో బొగ్గు తీసుకుంటూ పోవాలంటే విపరీతమైన ఖర్చయినా అవుతుంది. లేదా అధిగమించలేని భౌతిక

అవరోధాలయినా ఎదురవుతాయి. బొగ్గు తీయాలంటే ఓపెన్‌కాస్ట్ పద్ధతిలో భూమిని దున్నేయడం ఒక్కటే మార్గం అంటున్నారు.

ఇది సగం సత్యం. అంటే సగం అసత్యం కూడ. అండర్‌గ్రౌండ్ గనులను ఇంకా నడపడం భౌతికంగా, లేక ఆర్థికంగా కష్టసాధ్యం అనుకుని మూసేసిన ఉదంతాలున్నాయి. అక్కడ ఇంకా మిగిలి ఉన్న బొగ్గును తీయాలంటే ఓపెన్‌కాస్ట్ పద్ధతొక్కటే ఆచరణ యోగ్యమంటే కొంత సత్యం ఉంది. కానీ అసలే తవ్వకం జరగని చోట కూడ నేరుగా ఓపెన్‌కాస్ట్ తవ్వకాలు చేపడుతున్నారు.

రెండవది, ఈ సత్యం ఇవాళ కొత్తగా కనుగొన్నది కాదు. ఓపెన్ కాస్ట్ తవ్వకం ఇవ్వాళ పుట్టింది కాదు. గతంలో ఆ వైపు పోకుండ అండర్‌గ్రౌండ్ గనులను మూసేసి ఊరుకున్నారంటే ఓపెన్‌కాస్ట్ పద్ధతి వల్ల రాగల ఇతర సమస్యలను లెక్కలోకి తీసుకోవడమూ ఒక కారణమే.

ఇప్పుడవేవీ పట్టడం లేదు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు వేగంగా పెరగాలి. దానికి విద్యుత్తు చాలా కావాలి. కాబట్టి ఉన్న బొగ్గంతా తవ్వి తీసేయాలి. మరైతే ఇరవై ఏళ్లకో ముప్పై ఏళ్లకో బొగ్గంతా అయిపోయి సొరంగాలూ మట్టిగుట్టలూ మిగిలి ఉంటాయని అంటారా? ఆ భూములలో అప్పుడు బొగ్గూ దొరకదు, పంటలూ పండవని అంటున్నారా? ఫరవాలేదు. అప్పటికి మనం అణు విద్యుదుత్పత్తిలో సామర్థ్యం సాధించి ఉంటాము కాబట్టి ఆ రకంగా కరెంటు ఉత్పత్తి చేసుకుంటాం. అప్పటికి వృద్ధిరేటు నిరంతరాయంగా రెండంకెలలో ఉంటుంది కాబట్టి తిండి తక్కువయితే థాయ్‌లాండ్ నుండి దిగుమతి చేసుకుంటాం; అక్కడ వరిమళ్లలో సంవత్సరానికి నాలుగు పంటలు తీస్తారంట. యాభై ఏళ్ల తరువాత అణు వ్యర్థాన్ని దాచిన కుంటలతో దేశమంతా నిండిపోయి నివాసయోగ్యం కాకుండ పోతుందంటున్నారా? ఫరవాలేదు. సంచులు సర్దుకొని అందరమూ కుజగ్రహానికి వెళ్లిపోతాము. అప్పటికి ఆ సామర్థ్యం సాధించి ఉంటాము. ఎట్లాగూ మానవకల్పిత ప్రళయం రాబోతున్నదని పర్యావరణవాదులు బెదిరిస్తున్నారు కదా! అప్పుడు ఎట్లాగూ ఈ గ్రహాన్ని విడచిపెట్టి వెళ్లిపోవాలి కదా!

కాబట్టి ఇంకా మిగిలి ఉన్న బొగ్గంతా వేగంగా వెలికి తీయవలసిందే. ఎక్కువ ఉత్పాదకత ఇచ్చేది ఓపెన్‌కాస్ట్ పద్ధతే కాబట్టి దానిని అనుసరించవలసిందే.

జనావాసాలు ఏమయిపోతాయంటారా, ఆ పాటి అనుబంధ నష్టం (ఇంగ్లీష్‌లో 'కొలాటరల్ డామేజ్' అంటారు) ఉంటుంది మరి.

అండర్‌గ్రౌండ్ బొగ్గు తవ్వకంలో వ్యర్థం చాలా తక్కువ. నేరుగా బొగ్గు పొరలోకి దిగి దానిని పేల్చి వెలికి తీస్తారు. గని భూగర్భంలో ఉంటుండగా పైన నేల దానిపాటికది ఉంటుంది. మొక్కలు పెరుగుతాయి, పంటలు పండుతాయి. బావులు, బోర్లు తవ్వలేకపోవచ్చును గానీ ప్రకృతి సిద్ధమైన ఫలసాయానికీ, సేద్యానికీ లోటేమీ ఉండదు. కొన్ని చోట్ల బావుల్లో నీళ్ళు ఇంకిపోవడం తప్ప వేరే పర్యావరణ ప్రభావమేమీ ఉండదు.

ఓపెన్‌కాస్ట్ అట్లా కాదు. పై మట్టి తవ్వి గుట్టలు పోసి బొగ్గును వెలికి తీస్తారు. ఈ మట్టి గుట్టలను ఎప్పటికప్పుడు తడుపుతుంటామని గనుల నిర్వాహకులు అంటారు గానీ అవి ఎండకు ఎండీ వానకు తడిసీ చుట్టుపక్కల కాలుష్యాన్ని పెంచుతాయి. ఓపెన్‌కాస్ట్ విస్తరించే కొద్దీ ఈ మట్టి గుట్టలూ విస్తరిస్తాయి. ఈ ప్రాంతమంతా క్రమంగా వట్టిపోతుంది. అంతా అయ్యేసరికి మట్టి గుట్టలూ, గనులుండిన చోట బొందలూ మాత్రమే మిగులుతాయి. సింగరేణి తన పథకాన్ని అమలు చేసుకుంటూ పోతే మూడు మునిసిపాలిటీలూ, అనేక పెద్ద గ్రామాలూ ఉన్న తూర్పు ఆదిలాబాద్ ప్రాంతం యుద్ధం వల్ల బీడయిన భూమిలాగ ఉండబోతుంది. ఎప్పుడో సుదూర భవిష్యత్తులో కాదు – ఇంకొక పది పదిహేను సంవత్సరాలలోనే.

సింగరేణి యాజమాన్యం చాలా తెలివైనది. ఇవన్నీ చెప్పి చేయదు. ఒక్కొక్క అడుగూ ఏమీ ఎరగనట్టు వేసుకుంటూ పోతుంది. అయితే సింగరేణి కార్మికులూ చాలా తెలివైనవారే. అధికారంలో ఉండే వారి చర్యలను నిశితంగా పరిశీలించి నిర్మొహమాటంగా తప్పులెన్నే రాజకీయాలు వారిని ఇరవై ఏళ్లుగా తీర్చిదిద్దాయి. యాజమాన్యం వేసే ఒక్కొక్క అడుగూ ఎటువైపు పోతున్నదో ఊహించే నేర్పు వారికి అబ్బింది. బెల్లంపల్లి – ఒక లక్షకు పైగా జనాభా ఉన్న ఊరు – కొద్ది కొద్దిగా కాగజ్‌నగర్‌గా మారుతున్న వైనాన్ని వారు పసిగట్టారు. కంపెనీ ఆస్పత్రులూ స్కూళ్లూ ఒక్కొక్కటిగా మూతపడడం గమనించారు. ఏరియా వర్క్‌షాపు, టింబర్ యార్డ్, ఆటోగారేజీ మూతపడడం చూసారు. బెల్లంపల్లి పరిసరాలలోని గనులలో పనిచేస్తూ బెల్లంపల్లిలోని సింగరేణి క్వార్టర్స్‌లో నివసిస్తున్న కార్మికులొక్కొక్కరికీ వారు పనిచేసే

చోట క్వార్టర్స్ ఉన్నా లేకపోయినా అక్కడికే వెళ్లిపొమ్మని యాజమాన్యం ఒత్తిడి పెట్టడం చూసారు. ఖాళీ అయిన క్వార్టర్స్ ఎవరికీ ఇవ్వకపోవడం, పాడయిన వాటిని బాగుచేయకపోవడం చూసారు. ప్రతీరోజూ నీటి సరఫరా ఉండే స్థితి పోయి వారానికి రెండు రోజులో మూడు రోజులో నీళ్లొచ్చే స్థితి చూసారు. కళకళలాడుతూ ఉన్న ఊరిని కొద్దికొద్దిగా చంపేయడం చూసారు.


యాజమాన్యం మాత్రం పైకి ఏమీ లేదనే అంటుంది. ఒక్కొక్క మూసివేతకూ విడివిడిగా ఒక్కొక్క కారణం చెప్తుంది. కానీ కార్యాలయాలలో విడిగా కలిసిన వారితో 'బెల్లంపల్లి ఎప్పటికైనా పోయేదే' అని అధికారులు అంటారు. కార్మికులు మాట్లాడరు. మాట్లాడితే భూపాలపల్లికో మణుగూరుకో బదిలీ చేస్తారని భయం. గుర్తింపు పొందిన యూనియన్లు మాట్లాడకపోగా, యాజమాన్యం మాటనే మోస్తాయి. మళ్లీ గెలవాలంటే తమ దగ్గరికొచ్చిన కార్మికుల 'పనులు జరగాలి' అని వారికి తెలుసు. 'పనులు జరగాల'ంటే ఎట్లా నడుచుకోవాలో కూడ తెలుసు.

అయినా మాట్లాడేవాళ్లు లేకపోలేదు గానీ ఆపే మార్గం ఏదయినా ఉందా అనేది గడ్డు ప్రశ్న. ఆర్థిక సంస్కరణల 'సక్సెస్ స్టోరీ' అయిన సింగరేణి యాజమాన్యం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల ముద్దుబిడ్డడు. వారి పాలసీలను ఆపడం ఎవరి తరం?

**ప్రజాతంత్ర వారపత్రిక**
**10 ఫిబ్రవరి 2008**

# స్వర్ణాంధ్రమా, సంక్షోభాంధ్రమా

## రాష్ట్రాన్ని విజన్ 2020 ఎటు తీసుకెళుతుంది?



ఇరవై సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్‌ను మలేసియా, ఇండోనేసియా, చైనాలకు దీటుగా స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుస్తామని చంద్రబాబు ప్రభుత్వం 'విజన్ 2020' లో వాగ్దానం చేసింది. క్రీ.శ 2020 నాటికి ఆంధ్రప్రదేశ్ ఆర్థికరంగం 10 శాతం పెరుగుదల రేటును సాధిస్తుందని, తలసరి ఆదాయం తొమ్మిదిరెట్లు పెరుగుతుందని, దాంతో ఆంధ్రప్రదేశ్‌లో పేదరికం పూర్తిగా పోయి అసమానతలు సంపూర్ణంగా మాసిపోతాయని విజన్ మన కళ్ళముందు ఒక సుందరస్వప్నాన్ని ఆవిష్కరించింది.

అయితే ఈ స్వప్నాన్ని నిజం చేయటానికి 'విజన్' ప్రతిపాదించిన విధానాలను వివరంగా చదివితే క్రీ.శ 2020 నాటికి ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారదనే అనుమానం బలంగా కలుగుతుంది. 'విజన్' సాధించదల్చిన రాష్ట్రాభివృద్ధికి ప్రైవేటు పెట్టుబడులే మూలం. ప్రైవేటు (విదేశీ) పెట్టుబడులను పెద్దఎత్తున ఆహ్వానించి తద్వారా 10 శాతం పెరుగుదల రేటును సాధించాలని 'విజన్' ఆలోచన. రాష్ట్ర ఉత్పత్తులను పెంచి వాటిని పెద్దఎత్తున ఎగుమతి చెయ్యటం కూడ 'విజన్' వ్యూహంలో భాగమే. దీనికి అవసరమయిన మౌలిక సదుపాయాలను కూడ ప్రైవేటు పెట్టుబడులతోనే సాధించాలని 'విజన్' యోచన. వీటి ద్వారా ఆటోమాటిక్‌గా ప్రజలందరి జీవన ప్రమాణాలు పెరుగుతాయని 'విజన్' ప్రతిపాదన.

ఈ రకమైన ప్రతిపాదనలతో, వ్యూహాలతో, లక్ష్యాలతో వచ్చిన 'విజన్ 2020' మనలో సహజంగానే చాలా ప్రశ్నలను లేవనెత్తుతుంది. విదేశీ పెట్టుబడులను కేంద్రంగా

చేసుకున్న అభివృద్ధి పంథా ప్రజల్లో వున్న అసమానతలను ఎంతవరకు తొలగించ గలుగుతుంది? ఈ పెట్టుబడులు ఏ రకమైన షరతులతో రాష్ట్రంలోకి అడుగు పెడుతున్నాయి? అసలు పెరుగుదల రేటును 10 శాతానికి పెంచటం సాధ్యమేనా? అవసరమేనా? ఇటువంటి అభివృద్ధి ఎవరికి ప్రయోజనకరం? దీనివల్ల ప్రజల జీవన ప్రమాణాలు మరింత పడిపోవని గ్యారంటీ ఏమిటి? అసలు ఆయావర్గాల, కులాల ప్రజల అవసరాలకు, ఆశలకు ఈ అభివృద్ధిలో చోటుందా? లేనప్పుడు ఇప్పటికే ఉన్న అసమానతలెట్లా తొలగిపోతాయి? ఈ 'విజన్' చంద్రబాబు ఆలోచనా ఫలితమా లేక సరళీకృత యుగంలో మనమీద మోపబడుతున్న ఆర్థిక వ్యూహంలో భాగమా?

ఈ ప్రశ్నల్ని చర్చించటం ప్రస్తుత పరిస్థితుల్లో చాలా అవసరం. ఎందుకంటే 'విజన్'లో ఉన్న ఆర్థిక విధానాలు చంద్రబాబు ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో ఓడిపోయినా కొనసాగుతాయి. ఈ చర్చలో పాల్గొనటానికి మానవహక్కుల వేదిక అందర్నీ ఆహ్వానిస్తోంది.

**మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది**
**20 మే 1999**

# చంద్రబాబు 'విజన్'లో ఆదివాసులు

పారదర్శక పరిపాలన అందించాలన్నది చంద్రబాబునాయుడు రూపొందించిన 'విజన్ 2020'లోని అంశాలలో ఒకటి. ప్రజలకు సమాచార స్వేచ్ఛ కల్పించే చట్టాలు చేస్తానని కూడ హామీ ఇచ్చాడు.

కానీ వేరే సమాచారం సంగతి దేవుడెరుగు, ఈ 'విజన్ 2020' సహితం ప్రజలకు అందుబాట్లో లేదు. నేను ఖరీదు సంగతి మాట్లాడడం లేదు. ఆ గ్రంథాన్ని విస్తృతంగా అచ్చువేసి బజార్లో అమ్మినా చాలామంది కొనుక్కోలేరనేది వాస్తవమే. అది అంత 'షోగ్గా' ఉంది. కానీ ప్రభుత్వం దానిని అసలు మార్కెట్లో పెట్టలేదు. కొద్దిమంది పాత్రికేయులకూ, బ్యూరోక్రాట్లకూ మాత్రమే అది అందుబాట్లో ఉంది.

'పారదర్శకత' ఈ విధంగానే ఉంటుంది కాబోలు.

'విజన్'లో అనేక విషయాలు ఉన్నాయి. అప్పుడెప్పుడో ఏదో స్వర్ణయుగంలో నదులెల్లప్పుడూ ప్రవహించేవనీ, చెట్లెప్పుడూ కాసేవనీ, పంటలెల్లప్పుడూ పండేవనీ, ప్రజలు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో కళకళలాడేవారనీ చిన్నప్పుడు స్కూలు పుస్తకాలలో చదివాము. ఆ వయసులో కూడ ఆ కథలు నమ్మినట్టు జ్ఞాపకం లేదు.

ఇప్పుడింకొక 20 ఏళ్లకు ఆంధ్రప్రదేశ్‌లో అటువంటి స్వర్ణయుగం రాబోతుందని 'విజన్ 2020' అంటోంది. మన ముఖ్యమంత్రి గానీ, ఈ పత్రం లిఖించడంలో భాగం పంచుకున్న ఐఎఎస్ అధికారులు గానీ, ఆస్ట్రేలియా నుండి దీనిని తయారు చేయడానికి వేంచేసిన మెకిన్సీ కంపెనీవారు గానీ కళ్లలో ఆశాజ్యోతులు వెలిగే లోకం తెలియని లేలేత యువకులయి వుంటే 'ఛ... మరీ ఇంత ఇదిగా మాట్లాడొద్దు' అని

మందలించి ఉందుము. లేతదనాన్ని ఎప్పుడో వదిలేసుకొని కళ్లలో జ్యోతులు ఆర్పేసుకొని ముదిరి మొద్దుబారిన మన ముఖ్యమంత్రి, ఆయన అధికారగణం, ఆస్ట్రేలియా కంపెనీవారు ఇవన్నీ నమ్ముతున్నారంటే మనం నమ్మలేము.

కాబట్టి వారు హామీ ఇచ్చే స్వర్ణయుగంలోకి కొంచెం జాగ్రత్తగా తొంగిచూడడం అవసరం. చూస్తే చాలా విషయాలు కనిపిస్తాయి గానీ ఆదివాసులకు సంబంధించిన రెండు ముఖ్య విషయాలను మాత్రం ఇక్కడ ప్రస్తావించదలచుకున్నాను.

ఆదివాసీ ప్రాంతాలలో ఖనిజ పరిశ్రమ నిర్వహించడానికి ప్రైవేటు కంపెనీలకు హక్కు ఉండేటట్టు చట్టంలో మార్పులు తీసుకురావాలి అనేది ఒక ప్రతిపాదన.

రెండవది ప్రతిపాదన కాదు వివరణ. 'ఏజెన్సీ ప్రాంతం' అంటే ఆదివాసులు 50 శాతం కంటే ఎక్కువ ఉండే ప్రాంతం అని 'విజన్' ఒకచోట వ్యాఖ్యానిస్తుంది.

ఈ వ్యాఖ్యనే ముందు తీసుకుందాం. ఇది భారత రాజ్యాంగంలో ఈ రోజు ఉన్న నిర్వచనం కాదు. ఏజెన్సీలో మాటువేసిన ఆదివాసీయేతరులు చాలాకాలంగా పెడుతున్న డిమాండ్ ఇది. ఆదివాసుల జనాభా 50 శాతం కంటే కిందికి పడిపోయిన ప్రాంతాలను షెడ్యూల్డు ప్రాంతాల జాబితా నుండి తొలగించాలని వాళ్లు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటివరకు రాష్ట్రపతి అంగీకరించలేదు కాబట్టి అది చట్టం కాలేదు. కానీ చంద్రబాబు 'విజన్' అప్పుడే ఆ నిర్వచనాన్ని స్వీకరించేసింది. బహుశా 2020 నాటికి గిరిజనేతరుల ఈ ప్రతిపాదన చట్టమవుతుందని చంద్రబాబు అభిమతమేమో!

రాజ్యాంగంలోని అయిదవ షెడ్యూలులోని 6వ పేరాలో, రాష్ట్రపతి దేనిని షెడ్యూల్డు ప్రాంతంగా ప్రకటిస్తారో అదే షెడ్యూల్డు ప్రాంతం అని రాజ్యాంగకర్తలు అన్నారు. షెడ్యూల్డు ప్రాంతంగా గుర్తించడానికి అక్కడ ఆదివాసులు 50 శాతం ఉండాలని రాజ్యాంగం అనలేదు. ఆదివాసుల జనాభా 50 శాతానికి తగ్గితే అది ఏజెన్సీ కాకుండా పోతుందని కూడ రాజ్యాంగం అనలేదు. ఏదైనా ఒక ప్రాంతాన్ని షెడ్యూల్డు ప్రాంతాల జాబితా నుండి రాష్ట్రపతి తొలగిస్తేనే అది తొలగిపోతుందని రాజ్యాంగం అనింది.

ఆదివాసీ ప్రాంతాలలోకి బయటి వాళ్లు ప్రవేశించి స్థిరపడే కొద్దీ అక్కడ వారి జనాభా శాతం క్రమంగా తగ్గిపోతూ ఉంటుంది (ఆదివాసులు అక్కడ ఉంటుండగానే, వారి జనాభా ఎప్పటిలాగ పెరుగుతూండగానే). కాబట్టి ఏ వలస నుండయితే ఆదివాసులను కాపాడడానికి 'షెడ్యూల్డు ప్రాంతం' అన్న భావన పుట్టిందో, ఆ వలస వల్లనే షెడ్యూల్డు ప్రాంతంలో ఆదివాసుల జనాభా నిష్పత్తి పడిపోయి కాలక్రమంలో 50 శాతం కంటే తక్కువ అయిపోవచ్చు. అప్పుడు ఆ ప్రాంతాన్ని షెడ్యూల్డు ప్రాంతాల జాబితా నుండి తీసేయాలని అనడం వికృతమైన తర్కం. ఆదివాసీయేతరుల ఈ కుతర్కాన్ని 'విజన్ 2020' షెడ్యూల్డు ప్రాంతానికి నిర్వచనంగా మార్చేసింది.

ఆదివాసీ ప్రాంతాలలో ప్రైవేటు రంగంలో ఖనిజ ఉత్పత్తి అనుమతించాలనడం కూడ ఆదివాసులకు చాలా హానికరమైన ప్రతిపాదనే. అది ప్రైవేటురంగమైనా, ప్రభుత్వ రంగమైనా ఆదివాసీ ప్రాంతంలో గనుల తవ్వకం మొదలుపెడితే ఆదివాసులు జీవనం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది. దీనికి ఆదిలాబాద్ జిల్లానే ఉదాహరణగా తీసుకోవచ్చు. ఈ రోజు ఆదిలాబాద్ జిల్లాలో బొగ్గు గనులు మంచిర్యాల సమీపంలో మొదలయి దాదాపు 40 కిలోమీటర్ల పొడవున చందా రహదారికి రెండువైపులా విస్తరించి ఉన్నాయి. ఇదంతా ఒకప్పుడు ఆదివాసులు నివసించిన అడవిప్రాంతమే. ఇప్పుడక్కడ ఆదివాసులు ఒక్కరు కూడ కనిపించరు. సింగరేణి గని కార్మికులలోను బహుశా ఒక్క ఆదివాసీ కూడ లేరనుకుంటాను. ఉన్నా బయటి నుండి వచ్చిన లంబాడాలుంటారు తప్ప గోండులు, కొలాంలు, నాయకపోళ్లు ఒక్కరు కూడ ఉండరు. మరి వారంతా ఏమయ్యారంటే ఆ అడవిని సింగరేణి కంపెనీకి వదిలేసి ఇంకా లోపలికి వెళ్లిపోయారు. ఈ బలవంతపు వలస వల్ల వాళ్ల జీవనం ఎంతగా దెబ్బతినిందో అంచనా వేసినవారు లేరు.

ప్రభుత్వరంగ గని అయిన సింగరేణి ప్రభావమే ఈ విధంగా ఉంటే, ఇంక చంద్రబాబు 'విజన్' ప్రతిపాదిస్తున్న ప్రైవేట్ మైనింగ్ ప్రభావం ఏ విధంగా ఉంటుందో ఊహించడం కష్టం కాదు.

ఇప్పుడున్న ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ప్రాంతాల భూమి బదలాయింపు (నియంత్రణ) చట్టం (క్లుప్తంగా 1 ఆఫ్ 70 చట్టం) షెడ్యూల్డు ప్రాంతాలలో భూమిని ప్రైవేట్ (గిరిజనేతర) వక్తులకు గానీ కంపెనీలకు గానీ లీజుకు ఇవ్వడాన్ని

అనుమతించదు. ఆదివాసులే ఒక మైనింగ్ కంపెనీ ఏర్పరచుకొని ఒక సొసైటీగా దానిని నడిపేటట్టయితే వారికి ఇయ్యవచ్చును. చంద్రబాబుకు, వారి సలహాదారులయిన దేశీయ విదేశీయ వ్యాపారవేత్తలకు కావలసింది అది కాదు. పెట్టుబడి అడవులలోకి ప్రవహించే స్వేచ్ఛ. దానికి '1 ఆఫ్ 70'ని సవరించవలసి ఉంటుందని చంద్రబాబుకు తెలుసును. అందుకే విజన్ 2020లో ఈ ప్రతిపాదన. బహుశా 2020 నాటికి ఈ చట్టాన్ని సవరించి రాష్ట్రపతి ఆమోదం పొందదలచుకున్నాడేమో!

కాబట్టి వేరే వాళ్ల సంగతి ఎట్లాగున్నా విజన్ 2020 గురించి ఆదివాసులు అప్రమత్తంగా ఉండడం అవసరం. వాళ్ల జనాభా నిష్పత్తి 50 కంటే తక్కువకు పడిపోయిన ప్రాంతాలను ఏజెన్సీ నుండే తీసేస్తారంట. మిగిలిన ప్రాంతంలో ఖనిజ ఉత్పత్తిని ప్రైవేట్ కంపెనీలకు యథేచ్ఛగా అనుమతిస్తారట. అడవి ఎక్కడుంటే అక్కడ ఖనిజాలు తప్పనిసరిగా విస్తారంగా ఉంటాయి కాబట్టి ఇది ఏజెన్సీలోకి గిరిజనేతరుల వలసను విపరీతంగా పెంచుతుంది. ఆదివాసుల జీవితాన్నీ, జీవనాన్నీ నాశనం చేస్తుంది.

**ప్రజాతంత్ర వారపత్రిక**
**7 మార్చి 1999**

# ‘విజన్’ లో బక్క రైతుకు ఏదీ భరోసా?

ఈమధ్య మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఎవరు ఏ సమస్యల గురించి అడిగినా ‘విజన్ 2020 లో ఉంది చూడండి’ అని జవాబు చెపుతున్నారట. కానీ అది అందుబాటులో లేదు కాబట్టి దాన్ని సంపాదించి చదవడం సామాన్యులెవరికీ సాధ్యమయ్యే పని కాదు. ఇంకో తొమ్మిది నెలల తర్వాత నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఉంటుందో లేదో ఇప్పుడే ఎవ్వరూ చెప్పలేరు కాబట్టి ‘విజన్ 2020’ లో ఏముందో తెలుసుకోకపోతే మాత్రం ఏం అని అనుకోవడం పొరపాటవుతుంది.

ఈ ‘విజన్’లోని విధానాలను చంద్రబాబునాయుడు ఆవేశంగా భుజానికి ఎత్తుకుని ప్రచారం చేస్తున్నారు కానీ అందులో నిజానికి అతని ఆలోచనలకు ప్రత్యేకమైన విషయాలేవీ లేవు. ఏవైనా ఉంటే అవి కేవలం వివరణకూ, వివరాలకూ సంబంధించినవి. ఈ విధాన దృష్టి సమకాలీన మూడవ ప్రపంచ దేశాల పాలకుల సామాన్య ‘విజన్’. చొరవను బట్టి హెచ్చుతగ్గులుంటే ఉండవచ్చు కాక. ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ వాణిజ్య సంస్థల వంటివి నిర్దేశిస్తున్న దృక్కోణం కూడ ఇదే.

రేపు రాబోయే ఎన్నికలలో ఈ ప్రభుత్వం పోయి వేరేది వచ్చినా ఇంతకంటే మౌలికంగా భిన్నమైన దృష్టితో మనలను పరిపాలించబోదు. (కాబట్టి ఈ ప్రభుత్వాన్నే మళ్ళీ ఎన్నుకుందామని చెప్పడం నా ఉద్దేశం కాదు. పార్టీలను దాటి కొంచెం లోతుగా ఆలోచించడం అవసరమని చెప్పడం మాత్రమే.)

‘విజన్ 2020’ లో ఎవరికి ఏముందో తెలుసుకోవడం సామాన్యులెవ్వరికీ సాధ్యం కాదు కాబట్టి ఒక మామూలు రైతును ఉదాహరణగా తీసుకుని అందులో ఆ

వర్గానికి ఏముందో చూద్దాం. అంతకంటే నికృష్టంగా బతికే వాళ్ళను (అంటే రైతు అనిపించుకొనడానికి కావలసిన భూమి సైతం లేని వాళ్ళను) ఉదాహరణగా తీసుకుని ప్రయోజనం లేదు. ఎందుకంటే 'విజన్'లో వాళ్ళకు ఏమీ లేదు (రోడ్డు పని, మట్టి పని కల్పిస్తామన్న హామీ తప్ప). రైతులకు ఏదో ఉందన్న అభిప్రాయం ఉంది కాబట్టి రెండుమూడు ఎకరాలతో, నీటి వసతి ఉండీ లేక వ్యవసాయం చేసే రైతును (అంటే మన ముఖ్యమంత్రి చిన్ననాటి పరిస్థితి అని చెప్పుకుంటే సరిపోతుంది) ప్రమాణంగా తీసుకుని పరిశీలిద్దాం.

ఈ రైతులు పెట్టుబడిదారీ విధానంలో భాగంగా అభివృద్ధి చెందాలని 'విజన్ 2020' కోరుకుంటుంది. చిన్న రైతులు సైతం పెట్టుబడిదారీ పద్ధతిలో బాగుపడాలని ఆశ పడుతున్నారనడానికి సందేహించనవసరం లేదు. పెట్టుబడిదారీ వ్యవస్థను సూత్రప్రాయంగా వ్యతిరేకించే మాబోటి వారు సైతం ఈ వాస్తవాన్ని ఒప్పుకోక తప్పదు. ఒప్పుకోకపోవడం ఆత్మవంచన అవుతుంది.

కానీ పెట్టుబడిదారీ 'ఆధునీకరణ' ద్వారా జీవితాలు బాగుపరచుకోవాలని ప్రయత్నం చేసిన చిన్న, మధ్యతరగతి రైతులందరూ తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు. గత సంవత్సరం పెద్ద సంఖ్యలో ఆత్మహత్య చేసుకున్న రైతుల కథ ఇదే. ఆ ఆత్మహత్యలు ఈ సంవత్సరం కూడ కొనసాగుతున్నాయి. 'విజన్ 2020' ఈ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు ఏ జవాబూ చెప్పకుండా అదే మార్గంలో మరింత వేగంగా ముందుకు పోవాలంటుంది.

అవసరానికి తగ్గ రుణాలు అందుబాటులో లేకపోవడం పత్తి రైతులు ఎదుర్కొన్న ముఖ్యమైన సమస్యలలో ఒకటి. వ్యవసాయ పరపతి సంఘాలు, గ్రామీణ బ్యాంకులు, పెద్ద బ్యాంకుల గ్రామీణ శాఖలు వీరికి రుణాలు ఇవ్వాలి. ఒకప్పుడు వ్యవసాయాన్ని ప్రాధాన్యతారంగంగా భావించి అప్పులివ్వాలన్న నియమం ఈ రుణ సంస్థలకు ఉండేది. కానీ 'విజన్ 2020' ఆమోదించే ఆర్థిక పునర్వ్యవస్థీకరణలో భాగంగా వాణిజ్య సంస్థలకు ఈ దశాబ్దకాలంలో కఠినమైన నియమాలు పెట్టారు. సెక్యూరిటీ లేకుండా అప్పులివ్వకూడదని, గత సంవత్సరం తీసుకున్న రుణం తీర్చని వారికి అప్పులివ్వకూడదని, ఇతర వాణిజ్య సంస్థలకు బకాయిలున్న వారికి సైతం ఇవ్వకూడదని, ఒక్క మాటలో చెప్పాలంటే 'కమర్షియల్ వయబులిటీ'ని బట్టి రుణాలు

ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దానికి అనుగుణంగానే వ్యవసాయ పరపతి సంఘాలకు కల్పించే పెట్టుబడి వనరులను దారుణంగా తగ్గించేశారు. 'ఆధునీకరణ' లోనూ 'అభివృద్ధి' లోనూ భాగం కాదలచుకున్న రైతులకు అవసరమైన రుణాలలో రూపాయిలో ఇరవై పైసలు సైతం ఈ బ్యాంకులు, పరపతి సంఘాలు ఇవ్వలేక పోతున్నాయి. పత్తి రైతుల ఆత్మహత్యలకు నేరుగా దారితీసిన కారణాలలో ఇదొకటి.

దీనికి రెండేళ్ళుగా ఏ జవాబూ చెప్పలేకుండా ఉన్న చంద్రబాబు ప్రభుత్వం 'విజన్ 2020' లో ఇదే ఆధునీకరణ విధానాన్ని మరింత పెద్దఎత్తున ప్రతిపాదిస్తున్నది. ఆ నమూనాలో ఆంధ్రప్రదేశ్ 2020 నాటికి అత్యాధునిక ఆర్థిక వ్యవస్థగా రూపొందుతుందని 'విజన్' హామీ ఇస్తుంది. ఇది కేవలం కొద్దిమంది రైతులు పత్తి వంటి వాణిజ్య పంటలు వేయడం ద్వారా చేపట్టే ఆధునీకరణ కాదు. క్రీ.శ. 2020 నాటికి ఒక లక్షా 60 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో పళ్ళు, పూలు, కూరగాయల ఎగుమతితోనూ, పాడి పరిశ్రమ, కోళ్ళ పరిశ్రమలతోనూ, వీటన్నింటికీ కావలసిన రోడ్లు, రైళ్ళు, టెలిఫోన్లు, ప్రత్యేక కార్గో ప్లేన్లు, కోల్డ్‌స్టోరేజ్ వ్యవస్థతోనూ సాధించే విస్తృతమైన వ్యవసాయ వ్యాపారీకరణ. ఇప్పటికే వ్యవసాయంలో వ్యాపారీకరణ చెప్పుకోదగ్గ మోతాదులో ప్రవేశించింది గానీ వ్యవసాయాన్ని వట్టి వ్యాపారంగా నిర్వహిస్తున్న వ్యవసాయదారులు కొద్దిమందే. ఇంటికి అవసరమైన తిండి గింజలు కొద్దిగా పండించుకుంటూ దానితో పాటు వ్యాపార పంటలు కూడ చేపట్టే రైతులే ఎక్కువ. కాని ఇప్పుడు వ్యవసాయాన్ని పూర్తిగా వ్యాపారీకరించాలని 'విజన్' భావిస్తుంది. నీటి వాడకం ఉన్న కోస్తా జిల్లాలు ఒక రకమైన వ్యాపార పంటలు చేపట్టాలని, నీళ్ళు తక్కువ ఉన్న తెలంగాణ, రాయలసీమ జిల్లాలు ఆహార పంటల సేద్యాన్ని మొత్తంగా పక్కనపెట్టి, పళ్ళ తోటలు, కోళ్ళ మేతకు అవసరమైన మొక్కజొన్న సాగు, గొర్రెల పెంపకానికి అవసరమైన పచ్చికబీళ్ళ నిర్వహణ చేపట్టాలని 'విజన్' అంటున్నది.

దేశీయ విదేశీయ కార్పొరేషన్ల కొనుగోలుతో ముడిపడి ఉన్న 'అభివృద్ధి' లో భాగంగా ఉంటూ ప్రయోజనం పొందాలని పెద్దరైతులే కాదు, చిన్నరైతులు కూడ ఆశపడవచ్చు. కానీ చిన్నరైతులు ఈ 'అభివృద్ధి' ఆటుపోట్లను తట్టుకోగలరా అన్నది ప్రశ్న. తట్టుకోవడానికి కావలసిన ఏర్పాట్లేవయినా 'విజన్' లో ఉన్నాయా అన్నది ఇంకొక ప్రశ్న.

వ్యవసాయ వ్యాపారీకరణలో పెద్దఎత్తున పాల్గొనాలంటే రైతులకు పెట్టుబడి కావాలి. పెద్ద రైతులు స్వంతంగా సమకూర్చుకోగలరేమో గానీ చిన్న రైతులకు వ్యవస్థిత రుణ సదుపాయం అవసరం. అది లోపించడం ఈ మధ్య జరిగిన పత్తి రైతుల ఆత్మహత్యలకు గల ముఖ్య కారణాలలో ఒకటని చెప్పాను. కానీ వ్యాపారీకరణను సమగ్రంగా పెంచదలచుకున్న 'విజన్'లో దీనికి స్పష్టమైన జవాబేమీ లేదు. గ్రామీణ బ్యాంకుల వ్యాపార నియమాలలో 1990 తర్వాత ప్రవేశపెట్టిన ప్రమాణాలలోనూ, తీసుకుని వచ్చిన మార్పులలోనూ సడలింపు ఉంటుందన్న హామీ ఏదీ లేకుండానే గ్రామీణ బ్యాంకులు ఈ అవసరాన్ని తీరుస్తాయని 'విజన్' హామీ ఇస్తుంది. లేకపోతే 'స్వయం సేవక బృందాలు' ఈ పని చేస్తాయని అంటుంది. అవేమిటో ఎట్లా ఉంటాయో కూడ చెప్పదు.

పండించే పంటకు గిట్టుబాటయ్యే ధర ఉంటుందన్న హామీ కూడ రైతులకు అవసరం. మార్కెట్‌లో సరి అయిన ధర పలకకపోతే 'ప్రభుత్వ కొనుగోలు సంస్థలు' తగిన ధర ఇచ్చి కొంటాయన్న భరోసా కావాలి. అది లేకపోతే వ్యవసాయాన్ని వ్యాపారంగా నిర్వహించడం సాధ్యం కాదు. పెద్ద రైతులు ఒక సంవత్సరం నష్టపోయినా మరొక సంవత్సరం కోలుకోగలరేమోగానీ చిన్న రైతులు కోలుకోలేరు. కోలుకోలేనంతగా అప్పుల పాలవుతారు.

నిన్న మొన్నటి రైతుల ఆత్మహత్యలకు గల కారణాలలో ఇది కూడ ఒకటే. 'విజన్' లో దీనికి జవాబు ఏమీ లేదు కానీ వ్యవసాయ వ్యాపారీకరణను అది నూరు శాతానికి పెంచాలని చూస్తుంది. పైగా రైతుల దగ్గర ప్రస్తుతం కొనుగోళ్ళు చేస్తున్న స్థానిక వ్యాపారస్తుల స్థానాన్ని 'విజన్' లో దేశీయ విదేశీయ కార్పొరేషన్లు ఆక్రమించుకున్నాయి. వాళ్ళ దగ్గర గిట్టుబాటు ధర పొందడం రైతులకు మరీ కష్టం. వారిచేత ఇప్పించడం ప్రభుత్వానికి అసాధ్యం. రైతులు కొంచెం పట్టుదలగా ఉంటే స్థానిక వర్తకులు కొంత అయినా ధర పెంచక తప్పదు. కానీ దేశంలోనూ, దేశ దేశాలలోనూ పలుచోట్ల కొనుగోలు చేసే కార్పొరేషన్‌లకు అటువంటి 'కర్మ' ఏమీ లేదు.

రైతులకూ కార్పొరేషన్‌లకూ మధ్య కొనుగోలు కాంట్రాక్టులు కుదిర్చే చట్టాలు చేస్తామని, ప్రభుత్వం ఆ చట్టాలలో మూడవ వ్యక్తిగా ఉంటుందని 'విజన్' అంటుంది. కానీ ప్రభుత్వం పాత్ర ఆ కాంట్రాక్టును అమలు చేయించే పాత్రే కాగలదు. తప్పనిసరిగా

కొనుగోలు కాంట్రాక్టు చేసుకోవాలని చట్టం చెప్పలేదు. ప్రభుత్వమూ ఒత్తిడి చేయలేదు. ఏ ధరకు కాంట్రాక్టు చేసుకోవాలన్నది కూడ కంపెనీ ఇష్టానికి వదిలేయక తప్పదు. వాళ్ళు ఒకచోట కాకపోతే మరొక చోట కొనగలరు. కాబట్టి వాళ్ళ మీద ఒత్తిడి పెట్టడం అసాధ్యం.

అసలే అస్థిరమైన వ్యవసాయం వ్యాపార కార్పొరేషన్ల ప్రవేశం వల్ల, చిన్న రైతులకు అనుకూలమైన రుణ వ్యవస్థ లోపించడం వల్ల మరింత అస్థిరంగా తయారవుతుంది. కానీ 'విజన్' దీనిని కేవలం ప్రోత్సహించి వదిలేయడం లేదు. ఇది తప్ప వేరే గత్యంతరమేదీ లేని పద్ధతిలో ఒత్తిడి పెడుతుంది. ప్రభుత్వం కల్పించే వసతులు, మార్కెట్ వ్యవస్థ, ప్రభుత్వ వ్యవసాయ అధికారుల విస్తరణ కార్యక్రమాలు అన్నీ దీనికే అనుగుణంగా ఉండబోతాయి. ఇష్టమున్నా లేకపోయినా 'అభివృద్ధి' కావాలంటే రైతులు అత్యంత అస్థిరమైన ఈ 'కార్పొరేషన్ల'తో ముడిపడిన వ్యాపారీకరణలో భాగం కావాలన్న ఒత్తిడి బలంగా పని చేస్తుంది.

తెలంగాణ, రాయలసీమ జిల్లాలు ఈ ఒత్తిడి వల్ల మరింత నష్టపోతాయి. ఎందుకంటే వర్షపాతం తక్కువగా ఉన్న ఈ ప్రాంతాల భూములు తిండి గింజల కన్నా పళ్ళతోటలకూ, పశువుల పెంపకానికి అవసరమైన పచ్చికబీళ్ళకూ, కోళ్ళ పరిశ్రమకు అవసరమైన మొక్కజొన్న సాగుకూ తగినవని 'విజన్' ప్రకటించేసింది. అంటే ఈ రకమైన భూమి వినియోగానికి అవసరమైన వసతులు, విస్తరణ మాత్రమే అందుబాటులో ఉండబోతాయి. కానీ సరైన రుణ వ్యవస్థ లేకుండా గిట్టుబాటు ధరలకు హామీ లేకుండా చిన్న రైతులు సాహసానికి ఒడిగడితే బాగా దెబ్బతినే ప్రమాదం ఉంటుంది.

అప్పుడు ఆత్మహత్య వద్దనుకున్న రైతులు తమ భూముల్ని అవే కార్పొరేషన్లకు అమ్ముకుని లేక కౌలుకిచ్చి కూలివాళ్ళుగా మారిపోవలసి ఉంటుంది. వ్యవసాయ ఉత్పత్తులతో వ్యాపారం చేసే కంపెనీలకు సీలింగ్ చట్టం అడ్డం రాకుండా ఉండేందుకు, వారు భూముల్ని పెద్దయెత్తున కౌలుకు తీసుకుని వ్యాపార పంటల ఉత్పత్తిని భారీగా చేపట్టేందుకు చట్టం ద్వారా సదుపాయం కల్పిస్తామని 'విజన్' హామీ ఇస్తున్నది. కాబట్టి వ్యాపార పంటల విషవలయంలో చిక్కుకున్న చిన్న రైతులు రెండు మూడేళ్ళ తర్వాత కొనుగోలు కంపెనీలకే తమకున్న ఒకటి రెండు ఎకరాలు లీజుకు ఇచ్చి కూలీ చేసుకుని బతికే పరిస్థితి రావచ్చు.

నేను మరీ 'అతి'గా ఊహిస్తున్నానని అనుకోనక్కరలేదు. వరంగల్‌లోనూ, ఇతర జిల్లాలలోనూ గత సంవత్సరం ఆత్మహత్య చేసుకున్న రైతులే దీనికి నిదర్శనం. పత్తి పండించి జీవితాలు బాగుచేసుకుందామని ప్రయత్నం చేసిన వెనుకబడిన ప్రాంతాల రైతులందరూ నష్టపోలేదు. నష్టపోయిన వారందరూ మళ్ళీ కోలుకోలేనంతగా నష్టపోలేదు. అందరూ ఆత్మహత్యలు చేసుకోలేదు. కానీ చాలామంది కోలుకోలేనంతగా నష్టపోయారు. ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో దాదాపు అందరూ చిన్న రైతులే, బి.సి, ఎస్.సి కులాల వారే. అంతేకాక నష్టపోయినవారు మళ్ళీ పత్తిపంటే వేస్తున్నారు. ఇది పెట్టుబడి చిన్న రైతులకు కల్పించే విషవలయం. ఒక మార్గంలో నష్టపోయినవారు బయటపడాలంటే మళ్ళీ ఆ మార్గంలోనే బయటపడాలి. ఎందుకంటే అందులోనే మళ్ళీ లాభం పొంది జీవితాన్ని శాశ్వతంగా బాగుచేసుకునే అవకాశం లేకపోలేదు.

కాబట్టే వేరే ఏ విధంగానూ దారిద్ర్యరేఖ అంచులు దాటి పైకి పోయే అవకాశం కనిపించని సాధారణ రైతులు సైతం వీటి పట్ల ఆకర్షితులవుతారు. కొందరిని 'అదృష్టం వరిస్తుంది'. కొందరు శాశ్వత దారిద్ర్యం నుంచి శాశ్వత అస్థిరతలోకి పోతారు. కొందరు అస్థిరత అంచు నుంచి కిందికి జారి ఆత్మాహుతి తప్ప గత్యంతరం లేదన్న నిర్ణయానికి వస్తారు.

'విజన్' చూపించే దృశ్యంలో ఈ సంక్షోభం మరింత తీవ్ర రూపంలో ఉంటుంది. మన ఆర్థిక వ్యవస్థ 'మొత్తంగా' అభివృద్ధి చెందినా చెందవచ్చు. 'విజన్' ఊహించేటంత పెరుగుదల రేటు సాధించినా, సాధించకున్నా ఆ మార్గంలో కొంత స్థూలమైన అభివృద్ధి సాధిస్తే సాధించవచ్చు. కానీ ఆ 'అభివృద్ధి రైలుబండి' నుంచి అడపాదడపా ఒక శవం కిందికి జారిపడుతూ ఉంటుంది. అది రైలెక్కకుండా ఉండిపోయిన వ్యవసాయ కూలీ శవం కాదు, రైలెక్కిన మామూలు రైతు శవం.

**ఆంధ్రప్రభ దినపత్రిక**

**18 మార్చి 1999**

# ‘విజన్’లో గ్రామీణ పేదలు

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసమని చెప్పి చంద్రబాబునాయుడు తయారు చేసిన ‘విజన్ 2020’లో ఎవరెవరికి ఏముందో ప్రజలు వెతుక్కోవలసిందే. ఆ విధానపత్రంలో విపరీతమైన అతిశయోక్తులతో కూడిన హామీలు ఇచ్చే అధ్యాయాలు కొన్ని ఉన్నాయి. అక్కడ వెతికి ప్రయోజనం లేదు. బైబిలు భాషలో చెప్పాలంటే ఆ హామీల ప్రకారం క్రీ.శ. 2020 నాటికి ఇది పాలూ తేనె ప్రవహించే గడ్డ కాబోతుంది. కానీ ఆ పాలు, తేనె ఎవరెవరికి ఏ విధంగా తెచ్చి ఇయ్యబోతున్నారో చెప్పే వివరాలు ఆ పత్రంలో వేరే చోట్ల ఉన్నాయి. ఆ వివరాలు ఎక్కువ లేవు. హామీల ప్రవాహంలో గులకరాళ్లలాగ అక్కడక్కడ తగులుతాయి. వాటిని జాగ్రత్తగా గ్రహించి వెలికి తీసి చూడాలి.

గ్రామీణ పేదలకు ముఖ్యంగా దళితులకు ప్రతిరోజు పని దొరకడం పెద్ద సమస్య. సంవత్సరంలో సగటున 100 రోజులు కూడ పని దొరకని వాళ్లు గ్రామీణ పేదలలో చాలామంది ఉన్నారు. ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ఒక కొత్త విధాన రచన చేస్తున్నదంటే అందులో తమకు ప్రతి రోజూ పని కల్పించే ఆలోచన ఉందేమోనని గ్రామీణ పేదలు వెతకడం సహజం.

భూమిలేని వాళ్ల చేతిలో కొంత భూమి పెడితే సంవత్సరంలో మూడు నెలలయినా తమ స్వంత భూమిలో పని చేసుకొని ఫలితం పొందగలుగుతారు. మిగిలిన తొమ్మిది నెలలలో సగం రోజులయినా వేరే చోట పని దొరికితే జీవితం ఎట్లాగో గడపవచ్చు.

కానీ ‘విజన్’లో అసలే లేని విషయాలలో ఇదొకటి. భూసంస్కరణల ప్రస్తావన అందులో శూన్యం. కోర్టు వివాదాలలో ఇరుక్కున్న సీలింగ్ భూముల కేసులు వేగంగా

పరిష్కారమయ్యేటట్టు చూస్తామని గానీ, భూస్వాములే బినామీగా లేక దౌర్జన్యంగా అనుభవిస్తున్న సీలింగ్ భూములను స్వాధీనం చేసుకొని హక్కుదారులయిన భూమి లేని ఎస్.సి, ఎస్.టిలకు పంచుతామని గానీ 'విజన్ 2020'లో మొక్కుబడి హామీ సహితం లేదు.

భూస్వాముల సీలింగ్ భూములు ప్రభుత్వం పట్టుదలగా పేదలకు పంచుతుందన్న నమ్మకం పేదలలో ఏనాడూ పెద్దగా లేదు. ప్రభుత్వ బంజర్లు, పోరంబోకుల గురించి పేదలు అనేక చోట్ల పోరాటాలు నిర్వహిస్తున్నారు. ఈ పేదలు అత్యధిక భాగం దళితులు. ఆ భూములు భూమిలేని వారికి, అందులోనూ ప్రధానంగా ఎస్.సి, ఎస్.టిలకు దక్కాలన్నది ప్రభుత్వ విధానమే కాబట్టి కనీసం ఈ కోరికయినా కొంత సులభంగా తీరగలిగి ఉండాలి. కానీ దానికి కూడ ఎన్నో ఆటంకాలు. అప్పటికే భూములున్న రైతులు, లేదా స్థానిక రాజకీయ నాయకుల అండదండలున్నవాళ్లు ఈ బంజర్లను, పోరంబోకులను సైతం ఆక్రమించుకొని నిజమైన అర్హులకు అందనీయకుండా చేసిన ఘటనలు కోకొల్లలు.

ఈ భూముల గురించి 'విజన్' ఏమంటుంది? అన్ని రకాల వనరులతోనూ వ్యాపారం ఎట్లా చేయించాలా అన్నదే 'విజన్' దృక్కోణం. అప్పుడే 'రాష్ట్రం' బాగుపడుతుంది. 'రాష్ట్రం' బాగుపడితే అందరూ బాగుపడినట్టే. ఈ ఆలోచన బంజర్లకూ పోరంబోకులకూ కూడ వర్తిస్తుంది. ఈ భూములు మాంసం వ్యాపారం చేసే గొర్రెల పెంపక కేంద్రాలకు పచ్చిక బయళ్లుగానూ, కోళ్ల ఫారాలకు మొక్కజొన్న వంటి పోషకాహారం పండించే చేలుగాను, పండ్ల వ్యాపారులకు అనువైన పండ్లతోట క్షేత్రాలుగానూ పనికొస్తాయి కాబట్టి ఆ దిశగా వీటి వినియోగాన్ని మార్చాలని 'విజన్' అంటుంది. మాంసం వ్యాపారంలోనూ, పళ్ళ వ్యాపారంలోనూ, కోళ్ళఫారాల్లోనూ భారీగా పెట్టుబడిని ఆకర్షించాలన్నది 'విజన్' ధ్యేయాలలో ఒకటి. ఆ పెట్టుబడి స్వదేశీ పెట్టుబడే కానక్కరలేదు. విదేశీ పెట్టుబడి కూడ కావచ్చు. ఆ వ్యాపారం సహితం దేశీయం కానక్కరలేదు. ఎగుమతి వ్యాపారం కూడ కావచ్చు.

కాబట్టి పోరంబోకులు, బంజర్లలో ఇప్పటికే పేదలకు పట్టాలు ఇచ్చి ఉంటే వారు ఆ భూములను పై రకాల వ్యాపారం చేసే కంపెనీలకూ వ్యాపారస్తులకూ కాంట్రాక్టుకు ఇచ్చే ఏర్పాటు చేస్తామని 'విజన్' అంటుంది. ఆ కంపెనీలు వీరి దగ్గరొక

ఎకరం, వారి దగ్గరొక ఎకరం కాంట్రాక్టు పద్ధతిన తీసుకొని సీలింగ్ చట్టాన్ని తప్పించుకొని పెద్ద కమతాలు  తయారు చేసుకొని తమకు కావలసిన పశుగ్రాసం, లేక కోళ్ల దాణా లేక ఫలపుష్పాలు ఉత్పత్తి చేసుకుంటాయి. పట్టాదారులు తమకుండే వనరులతో వ్యవసాయం చేస్తే ఆ మాత్రం ఆదాయం కూడ పొందలేరు కాబట్టి భూమిని కిరాయికి ఇచ్చి కూలి చేసుకొని బతకవలసి ఉంటుంది. వాళ్ల జీవితాలు ఎదుగుబొదుగు లేకుండా ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉన్నట్టు ఉండిపోతాయి.

ఇది ఇప్పటికే పోరంబోకులలో పట్టాలు పొందిన వారి సంగతి అయితే ఎవరికీ ఇప్పటివరకు పట్టాలు ఇవ్వని పోరంబోకులు, బంజర్లలో ('విజన్ 2020' ప్రణాళిక అమలులోకి వస్తే) ఇక ఎప్పటికీ పేదలు పట్టాలు పొందలేరు. ఆ భూమి మొత్తం కార్పొరేషన్లకు ఇవ్వబడుతుంది. కార్పొరేషన్లు ఆ భూమిపైన పెద్దఎత్తున పెట్టుబడి పెట్టి పైన చెప్పిన విధంగా వినియోగంలోకి తెస్తాయి. మరి పేదలకు ఏమీ దక్కదా అంటే 'విజన్' కొంచెం ఉపశమనం చూపిస్తుంది. ఆ కార్పొరేషన్లలో ప్రైవేటు పెట్టుబడిదార్లతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వాటా కూడ ఉంటుంది. ఆ వాటాను రాష్ట్ర ప్రభుత్వం చాలా ఉదారంగా భూమి లేని కూలీల పేరిట పంచుతుంది. అంటే కార్పొరేషన్ సాగుచేసే భూమి విస్తీర్ణాన్ని బట్టి ఆ ప్రాంతంలో బ్రతికే ఒక్కొక్క భూమిలేని కూలీ కుటుంబం పేరు మీద ప్రభుత్వం వాటా (ఒక పైసాలో నూరవ వంతు కావచ్చు, ఇంకా తక్కువ కావచ్చు) పంచబడుతుంది. కార్పొరేషన్ లాభాలు సంపాదించి డివిడెండ్లు డిక్లేర్ చేసినప్పుడు ఆ కుటుంబాలకు కూడ అంతో ఇంతో వస్తుంది. ఆ లోపల దొరికిన కాడికి కూలి చేసుకొని బతుకుతుండాలి. ప్రభుత్వ భూములు భూమి లేని పేదలకు పంచాలని ఆందోళన చేస్తున్న వారందరికీ 'విజన్' ఇచ్చే సమాధానం ఇది! కూలివాళ్లంతా క్రీ.శ. 2020 నాటికి ఈ విధంగా చంద్రబాబు చలవ వల్ల పెట్టుబడిదార్లవుతారు.

భూమి సంగతి పోనీయండి. దేశంలోని భూమి లేని కూలివాళ్లందరికీ తగు మొత్తంలో భూమి పంచాలంటే ఇప్పుడున్న సీలింగ్ చట్టాలూ చాలవు, ప్రభుత్వ పోరంబోకులూ చాలవు. కనీసం వ్యవసాయేతర ఆర్థిక అభివృద్ధి పథకాలయినా పేద గ్రామీణ నిరుద్యోగులకు పని కల్పించే లక్ష్యంతో సాగుతాయా? అప్పుడు వ్యవసాయరంగంలో పని దొరకని వాళ్లు పారిశ్రామిక రంగంలోనయినా పని సంపాదించుకొని బతకగలుగుతారు.

రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి గురించి 'విజన్ 2020' చాలా చెప్తుంది గానీ అందులో గ్రామీణ పేదల ఉద్యోగ అవకాశాలకున్న స్థానం పరోక్షమైనదే. వాళ్లకు పని కల్పిస్తూ తద్వారా పారిశ్రామిక ప్రగతి సాధించే వ్యూహం 'విజన్'లో లేదు. దేశీయ విదేశీయ పెట్టుబడి పెద్దఎత్తున రాష్ట్రంలోకి ప్రవహించాలనీ, దానికి అవసరమైన రోడ్లు, రైల్వే లైన్లు, ఓడ రేవులు మొదలయిన నిర్మాణాలు ప్రభుత్వం చేపడుతుందనీ (ఇందులో కూడ ప్రైవేటు పెట్టుబడి పెద్దమొత్తంలో ఉండబోతుందనేది వేరే సంగతి), ఆ నిర్మాణం పనులు గ్రామీణ పేదలకు పని కల్పిస్తాయనీ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాయనీ 'విజన్' అంటుంది. పారిశ్రామిక రంగంలో క్రీ.శ. 2020 నాటికి రూ. 11 లక్షల కోట్ల పెట్టుబడి ప్రవేశించబోతుందని ఆశించే 'విజన్' అందులో గ్రామీణ పేదల ఉపాధి అవకాశాలకు కల్పించే స్థానం ఇది. మామూలు భాషలో చెప్పాలంటే వారికి కల్పించేది 'తట్టపని, మట్టిపని' మాత్రమే. దీనితో నిరుద్యోగం, పేదరికం ఎంతమేరకు తీరుతాయి? గ్రామీణ పేదల జీవితాలు ఏ మేరకు బాగవుతాయి? సాంకేతికంగా ఉన్నతమైన ఉత్పత్తి రంగంలో వారికి ప్రవేశం కల్పించే ఆలోచనేమీ 'విజన్'లో లేదు. రోడ్డు పని అందరికీ ఎల్లవేళలా సరిపోయేంత కల్పించగలరా అనే ప్రశ్న అటుంచి అది వారి జీవన ప్రమాణాలను ఒక మెట్టు కూడ పైకి ఎక్కించలేదనేది సత్యం. అది జరగాలంటే వారికి భూమి అయినా దొరకాలి, సాంకేతికంగా పరిణతి చెందిన ఉత్పత్తి రంగంలోకి ప్రవేశమైనా లభించాలి. విద్యార్హత ప్రధానమైన ఉద్యోగరంగమైనా అందుబాట్లోకి రావాలి.

ఈ ఆలోచనలేవీ చేయని విజన్ గ్రామీణ పేదలకేమిస్తుంది?

**ప్రజాతంత్ర వారపత్రిక**
**21 మార్చి 1999**

# 'విజన్'కు ప్రత్యామ్నాయం లేదా?

'విజన్ 2020' కి ప్రత్యామ్నాయం కావాలనడంలో సందేహం లేదు. అది మన రాష్ట్రంలోని సామాన్య ప్రజలకు చాలా నష్టకరం అనడంలో సందేహమసలే లేదు. కాబట్టి ప్రస్తుత పరిస్థితులలో ఆచరించగల ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాన్ని ప్రజలలో చర్చకు పెట్టడం అవసరం.

'ప్రస్తుత పరిస్థితులలో' అనడానికి ఒక కారణం ఉంది. ఒకటేమిటి మూడున్నాయి. సోషలిస్టు ఆర్థిక విధానాన్ని 'విజన్'కు ప్రత్యామ్నాయంగా ప్రతిపాదించ వచ్చు. కానీ చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ గానీ, రాజశేఖరరెడ్డి కాంగ్రెస్ పార్టీ గానీ ఆ సూచనను స్వీకరిస్తాయని నమ్మడానికి ఆస్కారమేమీ లేదు. కాబట్టి వాళ్ళు ఆచరించగల ప్రత్యామ్నాయాన్ని ప్రజలలో చర్చకు పెట్టడం ఫలితాన్ని ఇవ్వగల కృషి. ఇది ఒక కారణం. రెండవ కారణమేమిటంటే సోషలిజం (మనుషులందరూ శ్రమనూ, సంపదనూ సమిష్టిగా పంచుకునే జీవన విధానం) ప్రస్తుత జీవన విధానాల కంటే గొప్పది అనడంలో సందేహం లేదు. దాని సాధన కోసం కృషి చేయడం ఒక ముఖ్యమైన రాజకీయ కృషి అనడంలోనూ సందేహం లేదు. కానీ దాని స్వరూపం ఏ విధంగా ఉంటుందో, అది ఏ విధంగా సాధ్యమవుతుందో ఇప్పుడెవ్వరికీ తెలీదు. ఈ శతాబ్దపు కమ్యూనిస్టు ప్రయోగాల చరిత్ర అనేక విషయాలలో జ్ఞానంతో పాటు ఈ అజ్ఞానాన్ని కూడ మిగిల్చింది. అందువల్ల కూడ పెట్టుబడిదారీ మార్కెట్ ఆర్థిక వ్యవస్థ పరిధిలోనే 'విజన్ 2020' కు ప్రత్యామ్నాయం ఉంటే వెతికి ప్రజలలో చర్చకు పెట్టడం అవసరం. ఏ మేరకైతే అది పెట్టుబడిదారీ వ్యవస్థకు సహజమైన అసమానతలనూ, హింసనూ తగ్గిస్తుందో ఆ మేరకు సోషలిజం సాధన కోసం జరిగే కృషికి కూడ

తోడ్పడుతుంది. మూడవ కారణమేమిటంటే ఏ పెట్టుబడిదారీ మార్కెట్ వ్యవస్థకయితే 'విజన్ 2020' నిర్విచక్షణగా పెద్ద పీట వేస్తుందో, ఆ వ్యవస్థను ప్రజలందరూ ద్వేషించడం లేదు. అది ప్రజలలో అధిక భాగానికి నష్టకరమైనదనీ, స్వాభావికంగా అమానుషమయినదనీ చెప్పవలసిన అవసరం ఇంకా చాలా ఉంది. దానిలోని ఆకర్షణను సవాలు చేయవలసిన అవసరమూ ఉంది. 'ప్రస్తుత పరిస్థితులలో' అన్నప్పుడు ఈ కర్తవ్యాన్ని కూడ దృష్టిలో పెట్టుకోవలసి ఉంటుంది.

'విజన్ 2020' లో ఒక తర్కం ఉంది. అది చాలా సహజమైనదిగానూ చాలా హేతుబద్ధమైనదిగానూ చూపించబడింది. కానీ అది సహజమూ కాదు, హేతుబద్ధమూ కాదు. అది ఒక దృక్కోణం నుండి పుట్టిన తర్కం. కొన్ని పరిమితమైన ప్రయోజనాలు సాధించే తర్కం. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం అంటే రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో వేగవంతమైన పెరుగుదల సాధించడమేనని 'విజన్' భావిస్తుంది. ఇంకా అయిదు శాతం కూడ అందుకోని పెరుగుదల రేటును పది శాతానికి (రెండు దశాబ్దాల కాలంలో) తీసుకుని పోవాలనీ, అదే నిజమైన అభివృద్ధి అనీ నమ్ముతుంది. మనల్ని నమ్మమంటుంది. ఈ అభివృద్ధికి చాలా పెట్టుబడి కావాలి (30 లక్షల కోట్ల రూపాయలని 'విజన్ 2020' అంచనా). కాబట్టి బయటి రాష్ట్రాల నుండి, విదేశాల నుండి కూడ (ప్రైవేట్ పెట్టుబడిదార్ల నుండే కాక ప్రపంచ బ్యాంకు నుండి కూడ) పెట్టుబడిని భారీగా తెచ్చుకోక తప్పదని 'విజన్' భావిస్తుంది. అభివృద్ధి ఈ విధంగా కాక మరొక విధంగా నిర్వచించుకుంటే అందుకు కావలసిన పెట్టుబడి వనరులు చాలా వరకూ మన రాష్ట్రంలోనే సేకరించవచ్చుననీ, ధనవంతుల ఆదాయాలను ముట్టుకోవడానికి ప్రభుత్వం వెనుకాడకపోతే అందులో కష్టమేమీ లేదని భావించడానికి ఆస్కారమే లేదని 'విజన్' మనల్ని నమ్మమంటుంది. పెద్దఎత్తున పెట్టుబడి వనరులు తెచ్చుకోవాలంటే ఆ పెట్టుబడికి అనుబంధంగా వచ్చే సాంకేతిక ప్రక్రియలతోనో, అవి కల్పించే ఒత్తిళ్ళతోనో మనం అడ్జెస్ట్ కాక తప్పదని, ఆ పెట్టుబడికి అవసరమైన నిర్మాణాలన్నీ చవగ్గా, ఆకర్షణీయంగా కల్పించక తప్పదనీ, దానికోసం అయ్యే ఖర్చంతా పెట్టుకోక తప్పదనీ, లేకపోతే ఆ పెట్టుబడి వేరే రాష్ట్రాలకూ, దేశాలకూ వెళ్ళిపోతుందని కూడ 'విజన్' మనల్ని ఒప్పించాలని చూస్తుంది. ఆ పెట్టుబడి ఏ రంగంలో ప్రవేశించాలని ఇష్టపడితే ఆ రంగంలోకి రానివ్వక తప్పదని (అది గొర్రెల పెంపకం కావచ్చు. కోళ్ళ ఫారాలు

కావచ్చు. చేపల వేట కావచ్చు. పూలూ, పండ్ల ఎగుమతి కావచ్చు) చెపుతుంది. ఆ రంగంలో బతికే సామాన్య ప్రజలు ఏమైపోతారని బాధపడడం వెనుకబాటుతనమని కూడ 'విజన్' మనల్ని నమ్మమంటుంది. ఆ పెట్టుబడి కోసం మనబోటి ఇతర రాష్ట్రాలూ, దేశాలూ అనేకం పోటీపడుతున్నాయి కాబట్టి అది కార్మిక చట్టాలను సడలించమంటే సడలించాలనీ, భూగరిష్టపరిమితిని సవరించమంటే సవరించాలనీ, ప్రభుత్వ అజమాయిషీని తొలగించమంటే తొలగించాలనీ, చేతి వృత్తులకూ సన్నకారు చిన్నకారు సంస్థలకూ రిజర్వేషన్లు ఉండకూడదంటే తీసేయాలనీ, లేకపోతే ఘోరంగా నష్టపోతామనీ నమ్మమంటుంది. ఈ పెట్టుబడికి వేగంగా అభివృద్ధి సాధించడంలో చాలా యోగ్యత ఉంది కాబట్టి ఆర్థిక రంగాన్ని దానికి వదిలిపెట్టి, లేనిపోని నియంత్రణ చేయకుండా కేవలం పెట్టుబడికి కావలసిన నిర్మాణ సంబంధమైన సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం పరిమితం కావడమే హేతుబద్ధమైన విధానమని కూడ 'విజన్' మనల్ని నమ్మమంటుంది.

ఈ విధానం వల్ల ఎవరికీ ఏ ప్రయోజనమూ ఉండదని చెప్పలేము. తగు మాత్రం ఆస్తి ఉంటే దీనిని ఉపయోగించుకుని చాలా ప్రయోజనం పొందవచ్చు. మధ్యస్థంగా ఉండే వాళ్ళు కూడ ఆశపడి ప్రయోజనం పొందే ప్రయత్నం చేసే అవకాశం ఉంది. అది ఫలితాన్ని ఇవ్వగలదు కానీ వారి జీవితాలను అస్థిరతలో పడేస్తుంది. వనరులు, సాంఘిక అవకాశాలు లేని వారికి మాత్రం ఈ 'విజన్'లో ఏమీ లేకపోగా అది వారికి చాలా నష్టం చేయగలదు.

పెట్టుబడిని పెద్దఎత్తున ఎలా తీసుకురావాలి అన్న ప్రశ్న దగ్గర మొదలు పెట్టకుండా ఈ ప్రజలకు ఏ విధంగా ఉపాధి కల్పించాలి అన్న ప్రశ్న దగ్గర మొదలుపెట్టి విధాన రచన చేయాలన్న సూచనతో ప్రత్యామ్నాయ ఆలోచన ప్రారంభం కావాలి. పెట్టుబడిదారీ మార్కెట్ వ్యవస్థ పరిధిలోనే ఈ ప్రత్యామ్నాయ తర్కాన్ని ప్రవేశపెట్టి ప్రపంచ ఆర్థిక విధాతలను కుదిపివేసిన వాడు అమర్త్యసేన్. ఆయనను తాము చాలా గౌరవిస్తున్నామని చంద్రబాబునాయుడుతో సహా మన దేశ పాలకులందరూ అంటున్నారు కాబట్టి ఆయన ఆలోచనా రీతిని వాళ్ళు అమలు చేసినా చేయకున్నా దానికి జవాబు చెప్పక తప్పదు.

ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ నియంత్రణ ఎంత, పెట్టుబడికి స్వేచ్ఛ ఎంత, సహకార ఉత్పత్తి ఎంత, వ్యక్తి వ్యాపారం ఎంత అనేవి ముఖ్యమైన ప్రశ్నలు కావని, ఆర్థిక

ప్రక్రియలో పాల్గొని ప్రయోజనం పొందడానికి కావలసిన బలం లేక సామర్థ్యం ప్రజలకు ఏ మేరకు ఉందనే ప్రశ్నే ముఖ్యమని సేన్ అంటాడు. ఈ ఆలోచనా రీతిలో ఉన్న సమస్యలను ఇప్పుడు చర్చించడం అనవసరం. అది ప్రతిపాదించే విధానతర్కాన్ని 'విజన్' కు ప్రత్యామ్నాయంగా వివరించడం అవసరం.

భూమివంటి వనరుల పైన హక్కు, విద్యావకాశాలు, ఆరోగ్యం, సమాన సాంఘిక అవకాశాలు, మార్కెట్ వ్యవస్థలో పాల్గొనే ఆర్థిక స్వేచ్ఛ, ప్రభుత్వపాలనలోనూ విధాన నిర్ణయాలలోనూ భాగస్వామ్యం, రాజకీయ ప్రజాస్వామ్యం ప్రజలకు బలాన్నీ సామర్థ్యాన్నీ కల్పించే విషయాలుగా అమర్త్యసేన్ గుర్తిస్తాడు. ఇవి ప్రజలకు కల్పించడం ప్రధానమనీ, ప్రభుత్వ విధానరచన దీనిని ముఖ్య లక్ష్యంగా తీసుకోవాలనీ అంటాడు. పెట్టుబడి దిగుమతి, పెట్టుబడికి ఇచ్చే సదుపాయాలు మొదలయినవి ఆ తర్వాత వస్తాయి. ఈ రెండు అవసరాల మధ్య వైరుధ్యం ఏర్పడితే మొదటి అవసరమే గెలవాలి. ఎందుకంటే 'ప్రజల సామర్థ్యం తగిన రీతిలో పెరిగినప్పుడే వారు సరళీకరణ వల్ల, ప్రపంచీకరణ వల్ల వచ్చే కొత్త పరిస్థితిలో లాభదాయకంగా పాల్గొనగలుగుతారు. లేకపోతే అందులో పాల్గొనలేకపోగా, లాభం పొందలేకపోగా చాలా తీవ్రంగా దెబ్బతింటారు.

బ్రెజిల్‌ను అమర్త్యసేన్ ఈ సందర్భంగా ఒక ఉదాహరణగా చెప్తాడు. ప్రజల బలాన్నీ, సామర్థ్యాన్నీ పెంచే ప్రయత్నమేదీ చేయకుండా ప్రభుత్వం దేశ ఆర్థిక విధానాలను సరళీకరణ, ప్రపంచీకరణ బాటలపైన పెడితే ఒకవైపు స్థూల జాతీయ ఉత్పత్తి పెరుగుదల రేటు మెరుగవుతూ కూడ ఇంకొక వైపు పేదరికం పెరగగలదు, నిరుద్యోగం పెరగగలదు, అసమానతలు పెరగగలవు, హింస పెరగగలదు అని చెప్తూ బ్రెజిల్‌ను అమర్త్యసేన్ ఒక ఉదాహరణగా చూపిస్తాడు.

చంద్రబాబునాయుడు 'విజన్' ప్రజల బలాన్నీ, సామర్థ్యాన్నీ పెంచేది కాదు. వాటిని ఘోరంగా దెబ్బతీసేది. భూమి, పచ్చికబయళ్ళు, బీళ్ళు, జలవనరులు, అటవీ సంపద ప్రజలకు బలాన్ని ఇచ్చే వనరులుగా కాక పెట్టుబడికి భోజ్యమైన వ్యాపార విషయాలుగా 'విజన్'కు కనిపిస్తాయి. గొర్రెల కాపరులు తమ మందలను మేపుకునే పచ్చిక బయళ్ళను కార్పొరేట్ గొర్రెల పెంపకం కేంద్రాలకు లీజుకు ఇవ్వాలని 'విజన్' ప్రతిపాదిస్తుంది. పేదలు, దళితులు కోరుకునే పోరంబోకు భూములను పళ్ళ తోటల

కంపెనీలకు, కోళ్ళ దాణా కోసం మొక్కజొన్న పండించుకోవడానికి కోళ్ళ పెంపకం కంపెనీలకు ఇవ్వాలని ప్రతిపాదిస్తుంది. ఆదివాసీ ప్రాంతాలలో ఖనిజాన్వేషణ ఇష్టమొచ్చినట్టు సాగనిస్తే ఆదివాసులు జీవనం కోల్పోతారన్న సందేహంతో దానికి పరిమితులు పెట్టిన ప్రస్తుత విధానాలను సవరించి ప్రైవేట్ మైనింగ్‌కు అడవులలో అవకాశం ఇవ్వాలని ప్రతిపాదిస్తుంది. పోనీ ప్రకృతి వనరులను కార్పొరేట్ పెట్టుబడిపరం చేసే ఈ 'విజన్' అందుకు ప్రత్యామ్నాయంగా పేదలకు నిత్యం పని కల్పించే ఆర్థిక విధానాలను ప్రతిపాదిస్తుందా అంటే అదేం లేదు. రాష్ట్రంలోకి భారీగా పెట్టుబడి రావాలన్నా, 'విజన్' నమూనాలో అభివృద్ధి జరగాలన్నా రోడ్లు, రైల్వే లైన్లు, ఓడరేవులు, విద్యుత్ ప్రాజెక్టులు తదితర నిర్మాణపరమైన కార్యక్రమాలు చాలా చేపట్టవలసి ఉంటుందనీ, ఆ కార్యక్రమాలే భూమి లేని, ఇతర వనరులు లేని ప్రజలకు పని కల్పిస్తాయనీ 'విజన్' అంటుంది. కాని దీనితో ప్రజలు పొందే బలం లేక సామర్థ్యం చాలా స్వల్పం.

పోనీ విద్య, ఆరోగ్య విషయాలలో 'విజన్' ప్రతిపాదనలేమైనా మెరుగ్గా ఉన్నాయా అంటే ప్రాథమిక విద్యా వైద్య రంగాలలో ప్రభుత్వ బాధ్యత గణనీయంగా ఉందని అంటూనే ఆ తర్వాత ఆ రెండు రంగాలూ కేవలం ప్రైవేట్ పరం కావడమే కాదు, ప్రైవేట్ వ్యాపార రంగంలో కీలకమైన చోదక పాత్ర నిర్వహిస్తాయని 'విజన్' అంటుంది. అంటే రాబోయే రెండు దశాబ్దాల కాలంలో మన రాష్ట్ర ఆర్థికరంగం పది శాతం పెరుగుదల రేటు అందుకోవడంలో విద్యా వైద్య వ్యాపారాలు ప్రధాన చోదక పాత్ర నిర్వహిస్తాయనేది స్పష్టం. ఇంక అవి సామాన్య ప్రజలకు ఏ మాత్రం అందుబాటులో ఉంటాయో, సరళీకృత ఆర్థిక రంగంలో పాల్గొనడానికి కావలసిన బలం వారికి ఏ మాత్రం ఇస్తాయో ఊహించుకోవచ్చు.

సాంఘిక అవకాశాలలో సమానత్వం గురించి 'విజన్'లో సాధారణ హామీలున్నాయి గానీ నిర్దిష్టమైన విధాన ప్రతిపాదనలేవీ లేవు. కులం, పురుషాధిక్యత సాంఘిక అవకాశాలలో అసమానతకు ముఖ్య మూలాలు. వాటిని అంతం చేయడానికి కాకపోతే కనీసం బలహీనపరచడానికి కావలసిన ఒక్క ప్రతిపాదన సహితం 'విజన్'లో లేదు.

సారాంశంలో అమర్త్యసేన్ ప్రతిపాదించే గీటురాయి ప్రకారం 'విజన్ 2020' ప్రజలను బలహీనులను చేసి సరళీకరణలోకీ, ప్రపంచీకరణలోకీ నెడుతుంది. వాళ్ళ చేతిలో భౌతిక వనరులు లేకుండా చేసి, విద్య, వైద్య సదుపాయాలు అందుబాటులో లేకుండా చేసి, సాంఘిక అసమానతలను ఎదుర్కోవడానికి చేయూత లేకుండా చేసి కార్పొరేట్ పెట్టుబడి రూపొందించే ఆర్థిక వ్యవస్థలో వారిని పారేసి బతకమంటుంది.

దీనికి ప్రత్యామ్నాయం – ప్రస్తుత పరిస్థితులలో – ఈ విమర్శ నుండే రావాలి. 'భారత రత్న' బిరుదిచ్చి గౌరవించిన ఆ నోబెల్ బహుమతి గ్రహీత ప్రతిపాదించిన తర్కం ప్రకారం ప్రజల బలాన్నీ సామర్థ్యాన్నీ పెంచే నిర్దిష్టమైన సాంఘిక ఆర్థిక విధానాలు ప్రభుత్వానికి ఉండాలి. వాటికి ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి. రాష్ట్ర ఆర్థిక విధానాల రూపకల్పనకు ఇది ప్రాతిపదిక కావాలి.

**ఆంధ్రప్రభ దినపత్రిక**
**1 ఏప్రిల్ 1999**

# విజన్ 'చూపు'లో వివక్ష

ప్రాంతీయ అసమానతలు తీవ్రస్థాయిలో ఉన్నాయని రాజ్యాంగమే గుర్తించిన మూడు రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి (మిగిలిన రెండు మహారాష్ట్ర, గుజరాత్). ఆ అసమానతలను కొంత మేరకయినా తగ్గించడానికి ఆర్టికల్ 371-డి లో పార్లమెంట్ కొన్ని ఆదేశాలను చేర్చింది. అవి ప్రధానంగా విద్యా ఉద్యోగ అవకాశాలలో మూడు ప్రాంతాల మధ్య ఉన్న అసమానతలను తొలగించడానికి – ఇంకా నేరుగా చెప్పాలంటే కోస్తా జిల్లాలవాళ్ళే విద్యా, ఉద్యోగ రంగాలను పూర్తిగా ఆక్రమించుకోకుండా చూడడానికి ఉద్దేశించిన ఆదేశాలు.

అవి సక్రమంగా అమలు కావడం లేదన్నది ఒక విషయం కాగా, ప్రాంతీయ అసమానతలు, వివక్ష కేవలం విద్యా ఉద్యోగ రంగాలకే పరిమితం కాలేదన్నది మరింత ముఖ్యమైన విషయం. ఆర్టికల్ 371-డి స్ఫూర్తిని కాపాడుకోవడం ఎంత ముఖ్యమో అందులో ప్రస్తావనకు నోచుకోని ఇతర రూపాల వివక్షను ఎదుర్కొనే పాలనా విధానాలను సాధించుకోవడం కూడ అంతే ముఖ్యం. భాషా సంస్కృతుల నుండి సాగునీటి వరకు అన్ని రంగాలలోనూ వివక్ష, చిన్నచూపు, అసమాన ప్రతిపత్తి కనిపిస్తాయి.

మరొక 20 సంవత్సరాలలోగా మనకు స్వర్ణాంధ్రప్రదేశ్ అందించే వ్యూహం రచించానని చెబుతున్న ముఖ్యమంత్రి ఈ వివక్షనూ, అసమానతలనూ అంతం చేయడానికి ఆ వ్యూహంలో ఏమి చెప్పారో తెలుసుకోవాలన్న కుతూహలం ఉండడం సహజం. స్వర్ణాంధ్రప్రదేశ్‌లో అన్ని రకాల అసమానతలూ పోతాయని 'విజన్ 2020' పదేపదే అంటుంది కాబట్టి, ప్రాంతీయ అసమానతలు పోగొట్టడానికి అందులో ఏ ఆలోచనలు పొందుపరచబడ్డాయో చూడాలనుకోవడం సహజం.

తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల ఉద్యమ ఆకాంక్షలు సాగునీటికి చాలా ప్రాముఖ్యం ఇచ్చాయి. సాగునీటితో అన్ని సమస్యలూ పోవు గానీ తీవ్ర దారిద్ర్యాన్ని తగ్గించవచ్చు. సాగునీటి ప్రాతిపదికన జరిగే అభివృద్ధికి కొంత విస్తృత ప్రాతిపదిక ఉంటుంది. కొద్దిమందికి ఎక్కువ ప్రయోజనం కల్పించడమే కాక ఎక్కువ మందికి కొంత ప్రయోజనం కూడ కల్పిస్తుంది. దానివల్ల ఎక్కువ మంది చేతిలో కొంత మిగులు ఉంటుంది. దానితో ఆ వర్గాలలోని మలితరం కొంతయినా చదువుకొని, సాంకేతికంగా పురోగమించిన జీవిత రంగాలలోకి ప్రవేశించగలదు. లేదా అది వర్తక, పారిశ్రామిక పెట్టుబడిగా మారగలదు.

కోసాంధ్ర జిల్లాల చరిత్ర ఈ వాస్తవాన్ని కళ్ళకు కట్టినట్టు చూపిస్తుంది. అయితే సాగునీరంటే నదీజలాలే కానవసరం లేదు. చెరువులు, బావులు కూడ సాగునీటి సాధనాలే. చెరువుల నిర్మాణానికీ, మరమ్మత్తుకూ, నిర్వహణకూ హేతుబద్ధమైన విధానం ప్రభుత్వం దగ్గర ఉండాలి. ఇప్పటిదాకా అటువంటిది ఏమీ లేకపోవడం తెలంగాణ, రాయలసీమలకు చాలా నష్టం కలిగించింది. ఎప్పుడో కాకతీయులూ కుతుబ్‌షాహీలూ విజయనగర రాజులూ అసఫ్‌జాహీలూ తవ్వించిన చెరువులే తప్ప కొత్తవేవీ లేకపోగా ఆ చెరువుల నిర్వహణ సహితం తీవ్రంగా నిర్లక్ష్యం చేయబడిన విషయాలలో ఒకటి.

స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగానయినా చెరువు నీటివనరుల సంరక్షణ గురించి చంద్రబాబు ప్రభుత్వం ఏమైనా చెబుతుందేమోనని చూసినవారికి 'విజన్' నిరాశే కలిగిస్తుంది. కోట్ల పెట్టుబడి దిగుమతి చేసుకొని సాధించే కార్పొరేట్ అభివృద్ధి మీదే 'విజన్' దృష్టి అంతా.

చెరువుల తర్వాత బావుల కింద వ్యవసాయం తెలంగాణకూ, రాయలసీమకూ అతి ముఖ్యం. ఇందులో ప్రభుత్వం చేసేది ఏమీ లేదు – కరెంటు సరఫరా చేయడం తప్ప. ఇప్పటిదాకా కరెంటు సబ్సిడీ ఉండబట్టి బావుల కింద వ్యవసాయం ఈ రెండు ప్రాంతాలలోనూ బాగానే విస్తరించింది. గ్రామీణ జీవితం రూపురేఖలను కొంతమేరకు అది మార్చగలిగింది. కానీ ఇది ఎక్కువ రోజులు నిలిచేటట్టు లేదని 'విజన్' వైఖరి చూసినా, విద్యుత్ బోర్డు పునర్వ్యవస్థీకరణ చూసినా తెలుస్తుంది. అభివృద్ధికి అవసరమైన రోడ్లు, రైల్వేలైన్లు, ఓడరేవులు, కరెంటు మొదలయిన నిర్మాణపరమైన వ్యవస్థలను పెంపొందించడం మాత్రమే ప్రభుత్వం బాధ్యత అనీ, దాని కోసం పెద్దఎత్తున

పెట్టుబడులు ఆహ్వానించాలని 'విజన్' దృక్పథం ఎంతగా చెబుతుందో, ఈ నిర్మాణాలకయ్యే ఖర్చు, నిర్వహణ వ్యయం వాడకందారుల ముక్కు పిండి వసూలు చేయాలని కూడ అంతే గట్టిగా చెబుతుంది. ప్రభుత్వం విద్యుచ్ఛక్తిని రైతులందరికీ శాశ్వతంగా చవగ్గా సరఫరా చేయాలని నేననడం లేదు. అందరికీ చేయనక్కరలేదు గానీ సాగునీటి విషయంలో తీవ్రమైన లేమి అనుభవిస్తున్న ప్రాంతాలలోని సామాన్య రైతాంగానికి ఇవ్వడం అవసరం. సమంజసం కూడ. దీనికి కూడ తావు లేకుండా చేసే 'విజన్' వైఖరి తెలంగాణ, రాయలసీమలకు చాలా అన్యాయం చేస్తుంది. ఈ ప్రాంతాల అభివృద్ధిని 20 ఏళ్లు వెనక్కి తీసుకుపోతుంది. వీరికి సబ్సిడీ ఇవ్వడం కోసం అభివృద్ధి చెందిన ప్రాంతాల రైతుల నుండి (ఇక్కడి భూస్వాముల నుంచి కూడ) పూర్తి కరెంటు ఛార్జీ వసూలుచేసినా అభ్యంతరం చెప్పనవసరం లేదు. (కాల్దారి రైతాంగ పోరాటం పేరిట గోదావరి డెల్టా రైతులకు సైతం కరెంటు సబ్సిడీ కొనసాగించాలని వాదించిన వారికి ఇది నచ్చకపోవచ్చుగాక. ఆ వైఖరి మొత్తంగానే సబ్సిడీల ఎత్తివేతకు మార్గం సుగమం చేస్తుంది.)

నిజానికి సాగునీటి విషయంలో దేశంలో అతికొద్ది రాష్ట్రాలకున్న సంపద మన రాష్ట్రానికి ఉంది. సాగునీటి వనరులను సక్రమంగా, సమదృష్టితో వాడుకుంటే ప్రతి ఒక్క ఎకరం సాగుభూమికి ఒక పంటకు సాగునీరు అందించవచ్చునని మన రాష్ట్రం గురించి అంచనా. కానీ ఇన్నేళ్ళ అభివృద్ధి ఇచ్చిందేమిటంటే కొన్ని ప్రాంతాలకు రెండు, మూడు పంటలకు నీళ్ళు, కొన్ని ప్రాంతాలకు ఒట్టి వర్షం నీళ్ళు. చెరువుల నిర్వహణ పట్ల ఇప్పటికీ ఏ మాత్రం పట్టింపు చూపించని ప్రభుత్వ భవిష్యదర్శిని వైఖరి, బావినీళ్ళ వాడకానికి అత్యవసరమైన కరెంటు సబ్సిడీ పట్ల ఆ దర్శిని ప్రదర్శించే వ్యతిరేక వైఖరి ఈ అసమానతను తీవ్రంగా పెంచుతాయే తప్ప తగ్గించవు.

పోనీ నదీజలాల వాడకం విషయంలో సమదృష్టి ఏమైనా పెరిగిందని 'విజన్' చూపిస్తుందా? ఇప్పటికే ఈ విషయంలో జరిగిన అన్యాయం గురించి కొత్తగా చెప్పనవసరం లేదు. గోదావరిలో కావలసినన్ని నీళ్ళున్నా మన పాలకులు దానిని సాగునీటి కోసం వాడడంలో పెద్దగా ఆసక్తి చూపలేదు. దీనివల్ల ఉత్తర తెలంగాణ జిల్లాలు తీవ్రంగా నష్టపోయాయి. కృష్ణానదిలో అవసరం కంటే బాగా తక్కువ ఉన్న నీళ్ళను వాడే విషయంలోనూ మన రాష్ట్రంలో చాలా అన్యాయం జరిగింది. వర్షపాతం సాపేక్షంగా సమృద్ధిగా ఉన్న ప్రాంతాలకే కృష్ణానది నీళ్ళు మొదట లభించాయి. సరే, అది బ్రిటిష్ హయాంలోననుకుందాం. కానీ తెలుగువాళ్ళందరి కోసం విశాలాంధ్ర

నినాదంతో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత కృష్ణానదిపైన నిర్మించిన మొదటి ప్రాజెక్టు కూడ ప్రధానంగా ఆ ప్రాంతానికే మళ్ళీ నీళ్ళిచ్చింది. రాయలసీమ, దక్షిణ తెలంగాణ ప్రాంతాలు (కృష్ణానది మీద ఆధారపడక తప్పని ప్రాంతాలు) నీళ్ళడిగేసరికి ఆ నదిలో మిగుల జలాలే తప్ప నికర జలాలు లేవన్నారు.

నదీజలాల ప్రాజెక్టులలో ఇప్పటికే కేంద్రం అనుమతి పొందిన వాటి జాబితా, అనుమతి కోసం ప్రయత్నం చేస్తున్న వాటి జాబితా 'విజన్ 2020'లో ఇచ్చారు. రాయలసీమవాసులు గొంతెండిపోయేలా ఆందోళన చేస్తున్న హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులు ఈ రెండు జాబితాలలోను లేవు. ఎందుకని అడిగితే అవి మిగులు జలాల ప్రాజెక్టులని జవాబు చెబుతారేమో! కానీ కృష్ణాడెల్టా స్థిరీకరణ కోసం ఉద్దేశించిన పులిచింతల కూడ మిగులు జలాల ప్రాజెక్టే. కాని దానిని మిగులు జలాల ప్రాజెక్టుగా కాక, కృష్ణా డెల్టాను ఆధునీకరించడం వల్ల మిగిలే తొమ్మిది టియంసిల నికర జలాలు ఉపయోగించుకునే ప్రాజెక్టుగా చూపించి ఇప్పటికే కేంద్రం అనుమతి కూడ సంపాదించేశారు.

ఈ అబద్ధం ఒకవేళ నిజమే అయితే – అంటే ఆ తొమ్మిది టియంసిల నీరు కృష్ణా డెల్టాను ఆధునీకరించడం వల్ల మిగిలే నికరజలాలే అయితే ఆ నీటిని ఇప్పటికే కృష్ణా జలాలు అత్యధికంగా వాడుకుంటున్న కృష్ణా, గుంటూరు జిల్లాల ఆయకట్టు స్థిరీకరణ అనే లగ్జరీ కోసం వాడకుండా నది పైభాగాన శ్రీశైలం దగ్గరే ఆపేసి నల్లగొండకు నీరిచ్చే శ్రీశైలం ఎడమ కాలువ ప్రాజెక్టులో పారించవచ్చు గదా? ఆ రకంగా శ్రీశైలం ఎడమ కాలువకు కొంతయినా నికర జలం అందించవచ్చు కదా? మిగులు జలాన్ని నికర జలంగా చూపించి అబద్ధం చెప్పి పులిచింతలకు ఆమోదం తేగల వాళ్ళు మరో అబద్ధం చెప్పి (హంద్రీ అనే నదిలో చాలా నీళ్ళున్నాయనీ, గాలేరు అనేది జీవనది అనీ చెప్పి) హంద్రీ-నీవాకు, గాలేరు-నగరికి కూడ కేంద్రం అనుమతి తీసుకురావచ్చు కదా!

ఇవేవీ చేయబోవడం లేదనీ, నదీజలాల వాడకం విషయంలో స్వర్ణాంధ్రప్రదేశ్‌లో కొత్త ఏమీ లేదనీ 'విజన్ 2020' చెబుతుంది. అయినప్పటికీ అది స్వర్ణాంధ్రప్రదేశ్ ఎలా అవుతుందో చంద్రబాబునాయుడుకే తెలియాలి.

సాగునీటి విషయంలో కొత్త ఏమీ లేకపోగా ఇప్పటిదాకా బావులకూ, బోర్లకూ అందించిన కరెంటు సబ్సిడీ సైతం తీసేయబోయేటట్టయితే మరి తెలంగాణ రాయలసీమల వ్యవసాయ అభివృద్ధి గురించి 'విజన్ 2020' ఏం చెబుతుంది?

ఏమీ చెప్పకుండా పోలేదు. కానీ ఏం చెప్పిందో చదివిన తర్వాత ఏమీ చెప్పకుండా ఆ ప్రాంతాల రైతులను వారి పాటికి వారిని వదిలేస్తేనే బాగుండేదేమోనన్న సందేహం రాకమానదు. మెట్ట భూములను మాగాణిగా మార్చే పథకమేదీ లేని 'విజన్' మెట్ట భూములలోకి పెట్టుబడిని భారీగా ఆకర్షించే మార్గాన్ని మాత్రం అన్వేషిస్తుంది. తెలంగాణ మొక్కజొన్న సాగుకు అనువైన ప్రాంతమనీ, రాయలసీమ పళ్ళ తోటలకు అనువైన ప్రాంతమనీ, రెండు ప్రాంతాలూ పశుపోషణకు అనువైన పచ్చికబయళ్ళు విస్తారంగా కలిగి ఉన్నాయనీ 'విజన్' గుర్తించింది. మొక్కజొన్న కోళ్ళ దాణాగా ఉపయోగపడుతుందనీ, పళ్ళ తోటలున్న చోట ఫ్రూట్ జ్యూస్ పరిశ్రమ బాగా అభివృద్ధి చెందగలదనీ, పచ్చిక బీళ్ళున్న చోట పాల ఉత్పత్తుల పరిశ్రమ వర్ధిల్లగలదనీ కూడ 'విజన్' గుర్తించింది. కాబట్టి ఆ మూడు పరిశ్రమలకూ ముడిసరుకు సరఫరా చేసే రంగాలుగా తెలంగాణ, రాయలసీమల వ్యవసాయ క్షేత్రాలను 'విజన్' అర్థం చేసుకుంటుంది.

దీనివల్ల 'అభివృద్ధి' రానే రాదని అనలేం. గ్రామీణ ప్రాంతాల స్థలాల ఆదాయం పెరుగుదల రేటు కొంతకాలం మెరుగుపడవచ్చు. (ఆపైన కోళ్ళ పరిశ్రమ, ఫ్రూట్ జ్యూస్ పరిశ్రమ, పాల ఉత్పత్తుల పరిశ్రమ దేశీయ విదేశీయ మార్కెట్‌లలో ఎదుర్కొనే ప్రతి సంక్షోభానికీ ఈ అభివృద్ధి కూడ గురికాగలదు.) కానీ ఈ అభివృద్ధికి స్థిరత్వం లేకపోవడమే కాదు, విస్తృతి ఉండదు. ఆయా రంగాలలో పెట్టుబడి పెట్టే కంపెనీలతో రైతాంగం అమ్మకం, కొనుగోలు సంబంధాలు పెట్టుకొని వారి కనుసన్నలలో బతకాలి. ఇక మీదట ప్రభుత్వ బ్యాంకులూ, పరపతి సంఘాలూ పెట్టుబడి రుణాలను ఎక్కువగా ఇవ్వవు కాబట్టి రైతాంగం తీర్చలేకపోతే తమ భూములు వారికే లీజుకిచ్చుకొని కూలి చేసుకొని బతకాలి.

మెట్టసాగును పెట్టుబడితో ముడిపెట్టజూసే ఈ 'విజన్ 2020' అభివృద్ధి పథం తెలంగాణ, రాయలసీమల గ్రామీణ జీవితాలకొక వికృత రూపం ఇస్తుంది. కొద్దిమంది విపరీతంగా ప్రయోజనం పొందగలరు. కాని వారంతా స్థానికులే కానవసరం లేదు. కొంతమంది కొంత పొందుతూ కొంత పోగొట్టుకుంటూ అస్థిరంగా కొట్టుమిట్టాడుతూ బతుకుతారు. మెజారిటీకి మాత్రం ఈ వ్యూహం ఏమీ ఇవ్వదు. కనీసం కూలి చేసుకునే అవకాశం కూడ కల్పించదు. మొక్కజొన్న చేలు, పళ్ళతోటలు, పచ్చికబీళ్ళు ఎంతమందికి ఎన్ని దినాలు పని కల్పిస్తాయి?

**ఆంధ్రప్రభ దినపత్రిక**
**15 ఏప్రిల్ 1999**

# విద్యార్థుల నిరసనకు ఆహ్వానం

చంద్రబాబు 'విజన్'కు ప్రతిఘటన ఆలస్యంగానయినా మొదలు కావడం హర్షించదగ్గ విషయం. ఉపాధి అవకాశం పెంపుదలకు నిర్దిష్టమైన హామీలేవీ ఇవ్వకుండా 'జన్మభూమి' ద్వారా 'అభివృద్ధి'లో భాగం కమ్మంటూ విద్యార్థులకిచ్చిన పిలుపు వికటించడం సరయినదే.

చదువుకు దూరంగా ఉంచబడ్డ కొత్తతరం యువకులు ఇవాళ చదువు కుంటున్నారు. ఆధునిక సాంకేతిక విజ్ఞానం ఇవ్వగల ఉత్పాదన శక్తి గురించి తెలుసుకుంటున్నారు. తమ శక్తి కొంతమేరకయినా పెంచుకుంటున్నారు. శరీరంతో చేసే శ్రమే కాక బుద్ధితో చేసే శ్రమ నైపుణ్యాన్ని కూడ అభివృద్ధి చేసుకుంటున్నారు.

కానీ ఆ తరువాత?

ఆ తరువాత గురించి ఆలోచించకుండా ఉండమంటే ఉండలేరు. చంద్రబాబు చెప్పే 'అభివృద్ధి'లో తమకు, తాము చదువుకొని పెంచుకున్న నైపుణ్యానికీ చోటు ఉండాలని కోరుకోకుండా ఉండలేరు. 'అందరికీ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వలేదు' అనే ఉపదేశాన్ని ఈ ఆరాటానికి జవాబుగా చలామణి చేయాలని చంద్రబాబు, ఆయన అభిమానులు ప్రయత్నం చేస్తున్నారు. ఇది విద్యార్థుల ఆకాంక్షనూ విమర్శనూ వక్రీకరించడం తప్ప వేరే ఏమీ కాదు.

అందరికీ ప్రభుత్వమే ఉద్యోగాలు కల్పించాలని ఎవరూ అనరు. కానీ ప్రభుత్వం చేసే విధాన రచనలో ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్ర స్థానం ఉండాలి. ఆ అవకాశాలు ప్రభుత్వ రంగంలో ఉండవచ్చు, ప్రైవేటు రంగంలో ఉండవచ్చు. కానీ

విధాన రచన అనేది ఉపాధి అవకాశాల కొరతను ప్రధాన సమస్యగా స్వీకరించి వాటి పెంపుదలను గీటురాయిగా పెట్టుకొని సాగాలి.

చంద్రబాబు 'విజన్' అందుకు భిన్నంగా సాగుతుంది. ఉపాధి అవకాశాల పెంపుదలను కాక అభివృద్ధి పెరుగుదల రేటును గీటురాయిగా పెట్టుకుంటుంది. 10 శాతం పెరుగుదల రేటు కావాలన్నది ఆయన ప్రధానమైన గీటురాయి. అదే ఎందుకు ప్రమాణం కావాలన్న ప్రశ్నకు 'విజన్'లో జవాబు లేదు. ఇంక ఆ తరువాత విధానరచన యావత్తూ ఈ 10 శాతం పెరుగుదల రేటు సాధన చుట్టూ తిరుగుతుంది.

అభివృద్ధి వస్తే ఉపాధి దానంతటదే దక్కుతుంది కదా అని అమాయకంగా అడిగేవాళ్లు ఇంకా ఉన్నారేమో తెలీదు. 'విజన్' ఆ మాటే అంటుందిగానీ ప్రపంచ అనుభవం అందుకు భిన్నంగా ఉంది. వేగంగా అభివృద్ధి రేటును పెంచడానికి కావలసింది భారీగా పెట్టుబడి, మానవశ్రమ కాదు. అందువల్ల పెరుగుదల రేటే ప్రధాన లక్ష్యమైతే ఉపాధి ఎంత దొరుకుతుందో చెప్పడం కష్టం.

ప్రభుత్వరంగ సంస్థలలో ఈ తేడా ఇప్పటికే స్పష్టంగా కనిపిస్తున్నది. ఎక్కువ లాభాలు చూపించాలి, ఎక్కువ మిగులు చూపించాలి, వేగంగా విస్తరించాలి అనే లక్ష్యాలు ఉద్యోగుల తొలగింపునకు, విదేశీ పెట్టుబడి ప్రవేశానికి, ఆధునీకరణ పేరిట అతి తక్కువ కార్మికులతో ఎక్కువ ఉత్పత్తి చేసే యంత్రాల కొనుగోలుకు దారితీస్తున్నది. తెలంగాణకు ఒక ప్రధాన ఉపాధి కేంద్రమైన సింగరేణి దీనికొక ఉదాహరణ. ఉద్యోగులను తగ్గించి ఉన్న ఉద్యోగులతోనే ఎక్కువ పని చేయిస్తే లాభాలు పెరుగుతాయి, సంస్థ ఆదాయం పెరుగుదల రేటు మెరుగుపడుతుంది. కొత్త గనుల కోసం భారీ పెట్టుబడిని ఆహ్వానించి ఓపెన్‌కాస్ట్ ప్రారంభిస్తే ఉత్పాదకత ఎక్కువ అవుతుంది. ఉత్పత్తి పెరుగుదల రేటు మెరుగవుతుంది. (కాని ఉద్యోగాలు మాత్రం చాలా కొన్నే వస్తాయి.)

కాబట్టి కేవలం అభివృద్ధి రేటు పెరుగుదలనే కేంద్ర లక్ష్యంగా పెట్టుకుంటే ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్న నమ్మకమేం లేదు. విద్యార్థుల ఆందోళన చాలా సహేతుకమైనదే. నిజానికి ఉపాధి అవకాశాల భవితవ్యం ఏ విధంగా ఉండబోతుందో

'విజన్'ను విశ్లేషించి చెప్పవచ్చు. ఈ రోజు ఆందోళన చేస్తున్న విద్యార్థుల వంటి సామాన్య విద్యావంతులకు ఏ రకమైన ఉపాధి అవకాశాలూ కల్పించే దాఖలాలు ఆ విధానపత్రంలో లేవు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో పెద్ద పెద్ద పట్టాలున్న ఘరానా విద్యావంతులకు విపరీతమైన జీతాలిచ్చే ఘరానా ఉద్యోగాలు లభించడం నిజమే కాని వీరంతా బ్రాహ్మణ, రెడ్డి, కమ్మ వంటి కులాలకు చెందిన వారయి ఉంటారు. వీరి సంఖ్యా తక్కువే, రేపు ఈ కోవలో రాబోయే ఉద్యోగాలూ తక్కువే.

ఈ కొన్ని ఉద్యోగాలు కాక 'విజన్' హామీ ఇచ్చే ప్రధాన ఉపాధి అవకాశాలు రోడ్లు, రైల్వేలైన్లు, ఫ్లై ఓవర్లు వంటి నిర్మాణాలలో తట్టపనికి, మట్టిపనికి సంబంధించినవి. అంటే 'పాలమూరు కూలీల' నమూనానే రేపు రాబోయే కాలంలో సగటు కార్మికుల నమూనా అవుతుంది. ఇవికాక మరొక ఉపాధిరంగం రెడీమేడ్ దుస్తులు, తోలు ఉత్పత్తుల రంగం. ఇది అతి తక్కువ సాంకేతిక స్థాయిలో అతి తక్కువ ఉత్పాదక శక్తితో పనిచేసే రంగం. ఇక్కడ వేతనాలు అతి తక్కువ ఉండడమే కాక కాంట్రాక్ట్ పద్ధతే ప్రధానం.

అంటే ఒక పక్క అతికొద్ది మంది 'అదృష్టవంతులకు' (వంశపారంపర్యంగా వచ్చే దానిని అదృష్టం అనగలిగితే) ఖరీదైన ఉద్యోగాలు ఇచ్చే అత్యాధునిక సాంకేతిక రంగం, మరొక పక్క మిగిలిన వారి కోసం సాంకేతిక అభివృద్ధికి తావులేని అతితక్కువ వేతనాలు, అభద్రతలు రాజ్యమేలే రంగాన్ని 'విజన్' చూపిస్తుంది. ఈ రోజు ఆందోళన చేస్తున్న విద్యార్థులకు మొదటిది అందదు, రెండవది ఆకర్షణీయంగా కనిపించదు. వాళ్ళను చంద్రబాబు ప్రభుత్వం తప్పు పట్టడమెందుకు?


ప్రజలకు ఉపాధి కల్పించాలన్నది అభివృద్ధి విధాన రచనకు కేంద్ర బిందువు కావాలి. భూమి వంటి వనరులున్న వారికి వాటిని సమర్థంగా వాడుకొని ఖర్చులు పోను కొంతయినా మిగిలించుకొని అభివృద్ధి చెందే అవకాశం కల్పించాలి. వనరులు లేనివారికి భద్రతతో కూడిన ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. వారి ఉత్పాదన శక్తిని పెంచుతూ ఉత్పత్తి రంగం సాంకేతిక స్థాయిని క్రమంగా పెంచే ఆధునీకరణ అయితే సమాజానికి నష్టం చేయకుండా సాంకేతికంగా అభివృద్ధి చేస్తుంది. ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, వారి ఉత్పాదన శక్తిని పెంచుతూ, వారిని అభివృద్ధి చేస్తూ, వారితో పాటు ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసేది నిజమైన అభివృద్ధి. ప్రజలను

నిరుద్యోగంలో వదిలేసి ఉపాధికి దిక్కులేకుండా చేసి కొద్దిమంది పెత్తందారీ వర్గాల వారి అభివృద్ధిని కేంద్రం చేసుకొని సాగేది అభివృద్ధి కాదు. అది విధ్వంసం. దాని పట్ల నిరసన తెలిపే గొంతులు కొంత కాలంగా వినపడుతున్నాయిగానీ, సంఘటితంగా వ్యతిరేకించడానికి ఇప్పుడు విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ముందుకు రావడం మంచి పరిణామం. బహుశా విద్యార్థులలో ఒక మైనారిటీ మాత్రమే ఈ రోజు ఈ స్పందనలో భాగం అవుతుండవచ్చు. కానీ ఇది ఇక్కడితో ఆగిపోదని ఆశిద్దాం. విద్యార్థులే కాక రైతులు – ముఖ్యంగా రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల రైతులు – కార్మికులు కూడ ముందుకొస్తారని ఆశిద్దాం. ఆ అవసరం మాత్రం చాలా ఉంది.

**ప్రజాతంత్ర వారపత్రిక**
**9 జనవరి 2000**



# కరెంటు ఛార్జీల పెంపుదలను ఎందుకు వ్యతిరేకించాలి ?



కరెంటు ఛార్జీల పెంపుదల వలన రాష్ట్రంలో రెండు వారాలకు పైగా తీవ్రస్థాయిలో ఆందోళన జరుగుతున్నది. వేల సంఖ్యలో ప్రజలు ఈ ఆందోళనలో పాల్గొంటున్నారు. పోలీసు లాఠీల దెబ్బలు తింటున్నారు.

ఛార్జీలు పెరిగాయి కాబట్టి కోపంకొద్దీ పాల్గొంటున్నారు గానీ, సహేతుకమైన వివేచనతో పాల్గొనడం లేదని కొంతమంది ఈ ఆందోళనను విమర్శిస్తున్నారు. మన ముఖ్యమంత్రి ఇంకొంచెం ముందుకు (వెనక్కిపోయి అనాలేమో) పోయి పెరిగిన ఛార్జీల పట్ల ప్రజలలో వున్న అసంతృప్తిని వాడుకొని ప్రతిపక్షాలు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు అహేతుకమైన, అర్థరహితమైన ఆందోళన నడుపుతున్నాయని ఆక్షేపిస్తున్నారు. ఈ పెరుగుదల అనివార్యమనీ, ఒకవేళ అది ప్రజలకు కొంత ఇబ్బందికరమైతే ఆ పార్టీలు ప్రజలకు నచ్చజెప్పాలే తప్ప రెచ్చగొట్టి ఆందోళన చేయించడం మొత్తంగా రాష్ట్ర ప్రయోజనాలకు నష్టకరమనీ అంటున్నాడు. ఆఖరి అస్త్రంగా, 'కాంగ్రెస్‌వారు అధికారంలో వున్న రాష్ట్రాలలో కరెంటు ధర పెంచడం లేదా' అని ఎదురుప్రశ్న వేస్తున్నాడు.

వారు అధికారంలో వున్న రాష్ట్రాలలో పెంచవచ్చు, ఇక్కడ ఆందోళనలో పాల్గొనవచ్చు. తెలుగుదేశం పార్టీ ఒకవేళ ఇతర రాష్ట్రాలలో వుండివుంటే, ఇక్కడ ఛార్జీలు పెంచి అక్కడ ఆందోళనలో పాల్గొనవచ్చు. ఈ సంవాదం మనకు అనవసరం. ఎందుకంటే ఒక ఆర్థిక పునర్నిర్మాణ విధానాన్ని ఉమ్మడిగా ఆమోదించి, దాని వల్ల

ప్రజలలో పెల్లుబికిన అసంతృప్తిని మాత్రం ఎవరికి వారు తమ ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టడానికి వాడుకోవడమనేది ఈ పార్టీల రాజకీయ నీతి. నిజానికి చంద్రబాబు నాయుడు కాంగ్రెస్‌ను అడుగుతున్నది ఆ నీతి గురించే. 'ఇది మనందరం ఉమ్మడిగా ఒప్పుకొన్న ఆర్థిక పునర్నిర్మాణ ప్రక్రియ నుండి పుట్టిన నిర్ణయం. ఆ పునర్నిర్మాణానికి ఇది అనివార్యం. అటువంటప్పుడు మనందరి మేలు కోసం మీరు ప్రజలకు నచ్చజెప్పవలసింది పోయి ప్రజలను రెచ్చగొడతారా?' అని అడుగుతున్నాడు. ఇది నమ్మకద్రోహం కాదా అంటున్నాడు.

ఈ ప్రశ్నలూ జవాబులూ మాకు అనవసరం. మేము ప్రపంచబ్యాంకు కనుసన్నలలో నడుస్తున్న ఆర్థిక పునర్నిర్మాణ ప్రక్రియనే మౌలికంగా వ్యతిరేకిస్తున్నాం. ఆ దృష్టితో చూసినప్పుడు కరెంటు ఛార్జీల పెంపుదలను వ్యతిరేకించడానికి మాకు అనేక సహేతుకమైన కారణాలున్నాయి. అవి ఏమిటి?

## కరెంటు ఒక ప్రజావసరం

**1.** కరెంటు ఒక ప్రజావసరం. ఇంగ్లీష్‌లో పబ్లిక్ యుటిలిటీ (Public Utility) అంటారు. నీళ్లు, రోడ్లు, రవాణా సౌకర్యాలు, వైద్య కేంద్రాలు మొదలయిన వాటిలాగే ఇదీ ఒక ప్రజావసరం. ఇవి ప్రస్తుత నాగరికతలో మానవ జీవితానికి తప్పనిసరి అవసరాలు. ఈ అవసరాలను తీర్చడం ఎవరికైనా లాభదాయకమయినట్టయితేనే ఇవి మనుషులకు అందుతాయి తప్ప లేకపోతే ఇవి లేకుండా బతకవలసిందేనని అనడానికి వీలు లేదు. పట్టణ నీటి సరఫరా వ్యవస్థను నిర్వహించడం లాభదాయకమైతేనే పట్టణంలోని పౌరులకు మంచినీళ్లు దొరుకుతాయనడానికి వీలు లేదు. ప్రభుత్వం తప్పనిసరిగా మంచినీరు సరఫరా చేయవలసిందే. ఖర్చుల నిమిత్తం పన్ను రూపంలో కొంత వసూలు చేసుకోవచ్చును గానీ లాభదాయకంగా అమ్ముడు పోయినట్లయితేనే నీళ్ళిస్తామంటే కుదరదు. రోడ్లయినా, ఆస్పత్రులయినా అంతే.

ఆధునిక నాగరికతలో కరెంటు కూడ ఒక తప్పనిసరి ప్రజావసరమే. ఐస్‌క్రీంలాగ, మారుతి కారులాగ 'కొనుక్కోగలవాళ్ళు కొనుక్కుంటారు, లేనివాళ్ళకది దక్కదు' అనగల వస్తువు కాదు. కరెంటు లేకుండా మనుషులు బతికిన రోజులు లేవా అంటే ఉన్నాయి. ఆమాటకొస్తే గ్రామానికి రోడ్లు లేకుండా, దగ్గరలో ఆస్పత్రులు లేకుండా బతికిన రోజులూ ఉన్నాయి. ఏది తప్పనిసరి అవసరం అనేది నాగకరికత

స్థాయిని బట్టి ఉంటుంది. ప్రస్తుత నాగరికత స్థాయిలో రోడ్లు లేకుండా, అందుబాట్లో ఆస్పత్రి లేకుండా ఒక గ్రామాన్ని బతకమనడం చెల్లనట్టే కరెంటు లేకుండా బతకమనడం కూడ చెల్లదు.

ప్రజావసరాలు (Public Utilities) అంటున్నామంటే వాటిని ప్రభుత్వం నిరంతరాయంగా ఫ్రీగా ఇవ్వాలని కాదు. దాని ఉత్పత్తికి అయ్యే మొత్తం ఖర్చును ఆ రంగంలోనే రాబట్టుకోలేకపోయినట్టయితే వేరే రంగం నుండి ఆ రంగానికి రాయితీ రూపంలో తరలించవచ్చు. అప్పుడయినా ఆ ఖర్చు అందరి దగ్గరా ఒకే రకంగా వసూలు చేయనక్కరలేదు. ఇయ్యగలవాళ్ళ నుండి ఎక్కువ వసూలు చేసి ఇయ్యలేనివాళ్ళకు చవకగా సరఫరా చేయొచ్చు (దీనిని క్రాస్ సబ్సిడీ అంటారు) లేదా మొత్తంగానే కొంత రాయితీ ఇతర ఆర్థిక రంగాల నుండి తరలించి ఇయ్యవచ్చు. అంతే తప్ప ఖర్చు మొత్తం వాడకందారులే భరించాలనీ, అది కూడ అందరూ సమానంగా భరించాలనీ అనడం ప్రజావసరాల విషయంలో తప్పు.

అంతేకాకుండా ప్రజావసరాల కల్పనకయ్యే 'ఖర్చు' ఎంత వుండవచ్చుననే విషయంలో కూడ ఇతర ఉత్పత్తులకు వర్తించే ప్రమాణాలు వర్తించవు. ముడిసరుకు+ కార్మికుల జీతాల ఖర్చు+సహేతుకమైన లాభం=మొత్తం ఖర్చు అనే లెక్క అమాయకమైనది. ఖర్చు నిర్ణయించిన తరువాత దానిని ఈ రకంగా విడగొట్టుకోవచ్చు గానీ ఇదే దానిని నిర్ణయించే సూత్రం కాకూడదు.

మొత్తం ఖర్చు లేక వెల ఏ విధంగా నిర్ణయించడం జరుగుతుందన్న సిద్ధాంత చర్చలోకి మేము పోవడం లేదు గానీ ప్రస్తుత చర్చకు అవసరమయిన ఒక ముఖ్య విషయం చెప్పాలి. ఒక రంగంలోకి పెట్టుబడి పెద్దయెత్తున ప్రవేశించాలని కోరుకున్నట్టయితే ఆ రంగంలో ఉత్పత్తి ఖర్చును ఎక్కువగా చూపించే అవకాశం కల్పించడం అవసరం అవుతుంది. ఆ ఆకర్షణ లేకపోతే పెట్టుబడి ఆ రంగంలోకి ఎందుకు ప్రవేశిస్తుంది? నీరు పల్లమెరుగునన్నట్లే పెట్టుబడి లాభమెరుగును. మొదటిది ఎంత శాస్త్రీయమైన సూత్రీకరణో రెండవది కూడ అంతే.

మన పాలకులు తాము తలపెట్టిన ఆర్థిక పునర్వ్యవస్థీకరణలో భాగంగా రోడ్ల నిర్మాణం, కరెంటు, రవాణా మొదలైన ప్రజావసరాల రంగంలోకి ప్రైవేట్ కంపెనీల

పెట్టుబడి భారీగా ప్రవేశించాలని కోరుకుంటున్నారు. వీళ్ళు కోరుకున్నంత మాత్రాన అది ఎందుకు ప్రవేశిస్తుంది? బీరు వ్యాపారం కన్నా, బట్టల వ్యాపారం కన్నా, కరెంటు వ్యాపారంలో ఎక్కువ లాభాలు పొందే అవకాశం వుంటేనే వస్తుంది. దానికి కావలసినంతగా 'ఖర్చు'ను చూపించుకునే అవకాశం ఇయ్యవలసి ఉంటుంది.

మితమైన ఖర్చును ప్రమాణంగా కలిగి వుండవలసిన ప్రజావసరాల రంగం (ప్రభుత్వమే దానిని నిర్వహించిన రోజులలో ఈ సూత్రాన్ని ఎంతమేరకు పాటించారనేది వేరే సంగతి) ఇవాళ ఖరీదైన ఉత్పత్తిచేసి ఎక్కువ లాభాలు పొందే అవకాశాన్ని పెట్టుబడిదారులకు ఎరగా చూపించి అభివృద్ధిని సాధించుకునే రంగంగా మారింది.

అయితే ఏమవుతుంది? ఇంకొక పది రూపాయలు ఎక్కువ లాభం పొందుతారు. అంతే కదా అనుకోవద్దు. దీనివల్ల ప్రజావసరాల కల్పన రూపురేఖలే మారిపోతాయి. రహదార్లను ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. పూర్తిగా ప్రభుత్వ రంగంలో వున్న రహదార్ల నిర్మాణంలోకి ప్రైవేట్ పెట్టుబడిని పెద్దయెత్తున ఆహ్వానించాలని ప్రభుత్వాలు ఆలోచిస్తున్నాయి. అయితే ఇప్పటిదాకా ఆ పెట్టుబడి యావత్తూ ఎత్తైన, విశాలమైన జాతీయ రహదార్ల నిర్మాణంలోకి ప్రవహించిందే తప్ప గ్రామీణ రహదార్లమీద దాని దృష్టి పడలేదు. ప్రభుత్వమే ఆ ప్రయత్నం చేయలేదన్న సంగతి అటుంచి, ఒకవేళ చేసినా పెట్టుబడి దృష్టి గ్రామీణ రోడ్లపైన లేకపోవడం సహజం కూడ. దీనికి రెండు కారణాలున్నాయి. ఒకటి – జాతీయ రహదారుల నిర్మాణానికి ఉపయోగించే ఖరీదైన టెక్నాలజీ గానీ సాంకేతిక నైపుణ్యం గానీ పల్చటి గ్రామీణ రహదార్ల నిర్మాణానికి అవసరం కాదు. కాబట్టి 'మార్జిన్' ఎక్కువ చూపించుకునే అవకాశం వుండదు. రెండు – నిర్మాణానికి అయ్యే ఖర్చును 'టోల్‌గేట్లు' పెట్టుకొని రహదార్ల వాడకందార్ల నుండి వసూలు చేసుకొమ్మని ప్రభుత్వం రహదారి నిర్మించే కంపెనీలకు చెపుతున్నది. హైవే మీదనయితే 'టోల్' చెల్లించగల వాహనాలకు కరువు వుండదు గానీ గ్రామీణ బాటలలో ఎంత వసూలవుతుంది? ఎప్పటికి వసూలవుతుంది?

అందుకే 1000 కోట్ల ఖర్చుతో 10 వేల గ్రామాలను సమీపంలోని ప్రధాన రహదారికి కలిపే రోడ్లు వేయమని, లేదా 500 కి.మీ.ల ప్రధాన రహదారిని ఎత్తుగా, నున్నగా, విశాలంగా నిర్మించమని ఒకేసారి రెండు టెండర్లు పిలిస్తే, 1000 కోట్లు చేతిలో వున్న వాళ్ళు సైతం రెండవ పాటకే వస్తారు.

విద్యను మరొక ఉదాహరణగా తీసుకోవచ్చు. ఈ మధ్య మన రాష్ట్రంలో కొన్ని విశ్వవిద్యాలయాలు క్యాంపస్ కాలేజీల్లోనే విద్యార్థుల ఫీజుతో పంతుళ్లకు జీతాలిచ్చే 'సెల్ఫ్ ఫైనాన్స్‌డ్' కోర్సులు ప్రారంభించాయి. అభ్యంతరం తెలిపిన వారికి ఆ విద్యాలయాల పెద్దలు చాలా హేతుబద్ధంగా కనిపించే కొన్ని జవాబులు చెప్పారు. 'మేము ఇప్పుడున్న ఏ కోర్సునూ తగ్గించడం లేదు. ఏ కోర్సులోనూ సీట్లు తగ్గించడం లేదు. కొత్తగా కొన్ని కోర్సులకు మాత్రం ప్రభుత్వం పైసలివ్వడం లేదు కాబట్టి ఫీజులు వసూలు చేసుకొని నిర్వహిస్తున్నాం. దీనివల్ల నష్టమేముంది?' అంటున్నారు.

కానీ ఆ తరువాత ఏమవుతుంది? ఫలానా సబ్జెక్టులో తగినన్ని పుస్తకాలు లైబ్రరీలో వుండవు. అవి కొనాలని ప్రతిపాదన పెడితే ప్రభుత్వం పైసలు లేవంటుంది. ఆ సబ్జెక్టులో సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ కోర్సు పెట్టగలిగితే ఆ పైసలతో పుస్తకాలు కొనుక్కోమంటుంది. ఆ 'యోగ్యత' లేని సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలింక కొనరు. కొత్తగా ఇంకొక సెక్షన్ ప్రారంభించాలనో, ఇంకొక కోర్సు ఆవిష్కరించాలనో విశ్వవిద్యాలయానికి కోరిక కలుగుతుంది. ప్రభుత్వం పైసలు లేవంటుంది. 'సెల్ఫ్ ఫైనాన్స్‌డ్' కోర్సు ప్రారంభించలిగితే చేసుకొమ్మంటుంది. ఆ 'యోగ్యత'లేని సబ్జెక్టులు ఎదగవు, అభివృద్ధి చెందవు. అవి మాత్రమే చదువుకోగల పిల్లల గతీ అంతే. ఆపద్ధర్మంగా మొదలయినది రివాజవుతుంది. మునుపు రివాజుగా వున్నది అవశేషం అవుతుంది. సాంఘికంగా బలహీనులైన పిల్లలు ఆ అవశేషంలోకి కుదించబడతారు.

కాబట్టి ప్రభుత్వ నిర్వహణలో వున్న ప్రజావసరాలు ప్రైవేట్ పెట్టుబడి చేతిలోకి పోవడమంటే, ప్రభుత్వం 3 శాతం లాభాలతో సంతృప్తి చెందినచోట వాళ్ళు రేపు 10 శాతం లాభాలు పొందుతారేమో, అంతేకదా అనుకోవడం పొరపాటవుతుంది. సేవల సామాజిక స్వరూపమే మారిపోతుంది.

కరెంటు ఉత్పత్తినీ, సరఫరానూ, పంపిణీనీ కూడ ఇప్పుడు ప్రైవేట్‌పరం చేయబోతున్నారు. దీనివల్ల ఉత్పత్తి ఖర్చు ఏ విధంగా పెరుగుతుందో ఇప్పటికే అర్థం అవుతున్నది. ఆ సంగతి దిగువ చూద్దాం. కానీ పంపిణీ (distribution) రంగంలోకి ప్రైవేట్ కంపెనీలు ప్రవేశిస్తే, బిల్లు సకాలంలో చెల్లించగలవాళ్లకే తప్ప వేరే ఎవరికైనా కరెంటు అందుతుందా? లంబాడి తండాలకు, కోయగూడేలకు, ఎస్‌సి కార్పొరేషన్

సబ్సిడీతో కరెంటు మోటార్ పెట్టుకున్న కమ్యూనిటీ బావులకూ కరెంటు పంపిణీ వుంటుందా?

కరెంటు సరఫరా (transmission) లో కూడ ప్రైవేట్ పెట్టుబడిని ఆహ్వానిస్తామంటున్నారు. ఆదివాసులు మాత్రమే నివసించే ఉట్నూరు ఏజెన్సీకీ, చింతపల్లి కొండల మీదికీ కరెంటును తీసుకొచ్చే హైవోల్టేజి సరఫరా లైన్లు ఏ ప్రైవేట్ కంపెనీ నిర్మిస్తుంది? ఆ లైన్లగుండా సరఫరా అయ్యే కరెంటును తమకు లాభదాయకమైన రేటుకు కొనుక్కొని ఆ అడవులలో పంపిణీ చేసే డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు వుంటేనే కదా అంతటి సాహసం చేయడానికి ఏ సరఫరా (ట్రాన్స్‌మిషన్) కంపెనీ అయినా ముందుకు రాగలుగుతుంది?

ప్రభుత్వరంగం ఈ వ్యవహారాల నుండి పూర్తిగా పక్కకు తప్పుకోవడం లేదనీ, ప్రైవేట్ కంపెనీలు చేయని పని ప్రభుత్వరంగంలో చేస్తామనీ దీనికి జవాబు చెప్పబోతారు. కాని కేవలం నష్టమొచ్చే పనులను ప్రభుత్వరంగం మాత్రం ఎన్ని రోజులు చేస్తుంది? చేసి ఎన్ని రోజులు మనగలుగుతుంది? లాభమొచ్చే పనులూ నష్టం రాగల పనులూ రెండూ కలిపి నిర్వహిస్తేనే కదా మొదటిది రెండవదానిని పూడ్చగలుగుతుంది.

ప్రభుత్వం ఇన్నాళ్ళూ లాభమొచ్చేవీ నష్టమొచ్చేవీ కలిపి చేసింది కదా! చేసినందువల్లే కదా ఇన్ని కోట్ల రూపాయల నష్టాలలో ఒక్కొక్క ప్రభుత్వరంగ సంస్థ కూరుకుపోయింది, ఇంకా దానిని కొనసాగించడం ఎందుకు అని అడగవచ్చు. నిజానికి ఈ అభిప్రాయమే ఆర్థిక పునర్నిర్మాణ ప్రక్రియకు మద్దతు సమకూరుస్తున్నది. దీనిని వివరంగా వేరే చర్చిద్దాం. కానీ ఒక్క విషయం మాత్రం ఇక్కడే చెప్పుకోవాలి. మన పాలకులు ప్రతిపాదిస్తున్న ఆర్థిక పునర్నిర్మాణ ప్రక్రియకు అసలు కారణం ప్రభుత్వరంగ సంస్థల వైఫల్యం కాదు. సాంఘిక సంక్షేమం అనే 'బరువు' ను దించుకోవాలన్న గట్టి నిర్ణయమే ఈ విధానపరమైన మార్పులకు దారితీసింది. ప్రభుత్వరంగ సంస్థల వైఫల్యం దానికొక వాదనను కల్పించింది.

## వ్యవసాయానికి సబ్సిడీ కష్టమేం కాదు

**2.** ప్రభుత్వం దించేసుకోవాలనుకుంటున్న 'బరువుల'లో ఒకటి వ్యవసాయ రంగానికి సరఫరా చేసే విద్యుత్తుకు ఇచ్చే సబ్సిడీ.

ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కాక అనేక రాష్ట్రాలలో వ్యవసాయ రంగానికి (పంప్‌సెట్లకు, బోర్లకు) కరెంటు చవకగా ఇస్తున్నారు. పంజాబులో పూర్తిగా ఉచితంగా ఇస్తున్నారు. దీనివల్లే విద్యుత్ బోర్డులు తీవ్రనష్టాలలో పడ్డాయనీ, విద్యుత్‌రంగంలోని సంక్షోభానికిది ప్రధాన కారణమనీ ప్రపంచబ్యాంకు తీవ్రంగా విమర్శిస్తున్నది.

నష్టం సంగతి, సంక్షోభం సంగతి తరువాత చూద్దాము గానీ వ్యవసాయ రంగానికి కరెంటు చవకగా ఇవ్వడం వల్ల ఒనగూడిన ప్రయోజనాన్ని ముందు చూద్దాం.

వ్యవసాయానికి సాగునీరు బావుల నుండి, చెరువుల నుండి, నదీజలాల ప్రాజెక్టుల నుండి (చిన్న, మధ్యతరహా, భారీ) లభిస్తుంది. మన రాష్ట్రంలో ప్రాజెక్టులు కొత్తగా కట్టడం మానేసారు. పైసలు లేవని, నదులలో నీరు లేదని, కేంద్ర వాటర్ కమిషన్ అనుమతి లేదని అంటున్నారు. చెరువుల మాటకొస్తే, రాష్ట్రంలోని చెరువుల వ్యవస్థ పూర్తిగా ధ్వంసం అయివుంది. దాని ఆయకట్టు కాగితాల మీదే తప్ప నేలమీద లేదు. తెలంగాణనే ఉదాహరణగా తీసుకుంటే 1958లో తెలంగాణలో 11 లక్షల ఎకరాలు చెరువుల కింద సాగవుతుండగా 1998 నాటికి అది 2.6 లక్షలకు పడిపోయిందని అంచనా. ఇక మిగిలినది బావుల వ్యవస్థ. గడిచిన 15-20 సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో పెరిగిన సాగునీటి లభ్యతలో అత్యధిక భాగం బావుల నుండే వచ్చింది. చవక కరెంటు వుండబట్టే అది సాధ్యమయింది. 1975తో పోలిస్తే 2000 నాటికి 45 లక్షల ఎకరాల భూమి బావుల కింద అదనంగా సాగవుతున్నదని ప్రభుత్వ అంచనాలే చెప్తాయి. ఇందులో అధిక భాగం కరెంటు మోటార్లు లేక బోర్ల కింద సాగవుతున్న భూమే. ఈ కాలంలోనే కరెంటు మోటార్లు, కరెంటు బోర్ల సంఖ్య 19.27 లక్షలకు చేరుకుంది. ఇందులో 75 శాతం తెలంగాణ, రాయలసీమలలో ఉన్నాయి.

ఈ భారాన్ని దించేసుకోవడానికి ప్రపంచబ్యాంకుతో మొదలుపెట్టి ఎ.పి.ఎస్.ఇ.బి దాకా అన్ని సంస్థలూ వ్యవసాయ సబ్సిడీ వల్ల ఎంత భారం పడిందో చెప్పడానికి పెద్దఎత్తునే అంకెలగారడీకి పాల్పడ్డాయి. 1997లో మన రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలపైన ప్రపంచబ్యాంకు విడుదల చేసిన నివేదిక ఎ.పి.ఎస్.ఇ.బి సరఫరా చేసే కరెంటులో 43 శాతం వ్యవసాయ రంగానికేనని అంచనా వేసింది. కరెంటును ఇంత భారీగా కారుచౌకగా ఇవ్వడం వల్లనే విద్యుత్ బోర్డు నష్టాలలో కూరుకుపోయిందని

చెప్పింది. 1995-96 సంవత్సరం నాటికే విద్యుత్‌బోర్డుకు ఈ సబ్సిడీ కారణంగా 150 కోట్ల రూపాయల నష్టం వచ్చిందని అంచనా వేసింది.

వ్యవసాయదారులు చెల్లించే విద్యుత్ ఛార్జీలను పెంచడానికి వారికి ఈ గణాంకాలు బాగా పనికొచ్చాయి. ఈ లెక్కలను నమ్మి కొందరు గందరగోళపడ్డారు. 'వంద యూనిట్లలో 43 యూనిట్ల కరెంటును మనమే తీసుకుంటూ ఇంత సబ్సిడీ పొందుతున్నట్టయితే విద్యుత్ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా సబ్సిడీ ఇచ్చుకోవాలి కదా, ఎన్ని రోజులిస్తుంది? అని అనుకునేట్టు ప్రభుత్వం భ్రమింపజేసింది.

కానీ ఆ అవసరం తీరిపోగానే అంటే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఇచ్చే కరెంటు ధర పెంచక తప్పదనే అభిప్రాయానికి అందరూ అలవాటుపడగానే గణాంకాలు మారిపోయాయి. ఇప్పుడేమంటున్నారంటే రాష్ట్రంలో విద్యుత్‌బోర్డు వారసురాలయిన ఎ.పి.ట్రాన్స్‌కో సరఫరా చేసే కరెంటులో 21 శాతం మాత్రమే వ్యవసాయరంగానికి పోతుందంటున్నారు. 43 ఎక్కడ? 21 ఎక్కడ? ఇంత తేడా అకస్మాత్తుగా ఎక్కడనుండి వచ్చింది? ఇదే నిజమైతే నాలుగయిదేళ్ళ కింద చెప్పిన సబ్సిడీలో సగం మాత్రమే ప్రభుత్వం ఇస్తున్నట్టు కదా! మరి అప్పట్లో ప్రజలను - ముఖ్యంగా రైతులను అంతగా గాభరాపెట్టి ధరలు పెంచక తప్పదని ఎందుకు ఊదరగొట్టినట్టు?

వాస్తవమేమిటంటే వ్యవసాయ రంగానికి ఎంత కరెంటు సరఫరా అవుతున్నదీ ఎవరికీ తెలీదు. విద్యుత్ బోర్డుకయినా, ఇప్పటి ఎ.పి.ట్రాన్స్‌కోకయినా తెలిసిందేమిటంటే తాను మొత్తంమీద ఎంత విద్యుత్తు సరఫరా చేస్తున్నదన్నది మాత్రమే. అందులో ఎంత ఏ రంగానికి పోతుందనే అంచనా కచ్చితంగా వుండాలంటే అన్ని రంగాలలోని విద్యుత్ వాడకం మీటర్లలో నమోదు కావాలి. కానీ వ్యవసాయ రంగంలోని పంపుసెట్లకు, బోరులకు మీటర్లు లేవు.

మొత్తంగా రాష్ట్రంలో సరఫరా అవుతున్న కరెంటులో 41 శాతానికి మాత్రమే మీటర్లలో లెక్క తేలుతుందని ఇప్పుడు ఎ.పి. ట్రాన్స్‌కోయే ఒప్పుకుంటున్నది. మిగిలిన 59 శాతం కరెంటులో వ్యవసాయరంగం వాడుకునే కరెంటూ వుంది. వ్యవసాయేతర రంగాలలో మీటర్లు లేకుండా వాడుకునే దొంగ కరెంటూ వుంది. మీటర్ వుండి

కూడ దానికి అందకుండా పారించుకునే దొంగ కరెంటూ ఉంది. సరఫరా అయ్యే క్రమంలో 'గాలిలో కలిసిపోయే కరెంటూ' (రిజర్వాయర్‌లో నీళ్లు ఆవిరి అయినట్టు) వుంది. ఇందులో ఏది ఎంత అనే కచ్చితమైన అంచనా ప్రభుత్వం దగ్గరగానీ ఎ.పి. ట్రాన్స్‌కో దగ్గరగానీ లేదు. అప్పటి అవసరాన్ని బట్టి అంకెలు సృష్టించి ప్రజలను దబాయించారంతే.

అంటే మీటర్లకు అందని 59 శాతంలో 43 శాతం వ్యవసాయదార్ల వాడకమేనని దబాయించారు. వ్యవసాయ కరెంటు అవసరాలకిచ్చే సబ్సిడీ మీద పెద్దెత్తున దాడి చేయడానికి అది పనికొచ్చింది. ఇప్పుడది 43 కాదు, 21 వుంటుందని అంటున్నారు. అంచనాలో ఇంత తేడా ఎట్లా వచ్చిందంటే దానికొక కారణం చెప్తున్నారు. వ్యవసాయరంగం ఎంత కరెంటు వాడుకుంటున్నదో తెలియదుగానీ వ్యవసాయ రంగంలో ఎన్ని మోటార్లున్నాయో తెలుసును కాబట్టి సగటున 1 హెచ్.పి మోటార్ ద్వారా ఒక రైతు ఎన్ని యూనిట్ల కరెంటు వాడుకుంటాడో అంచనా వేస్తే, మొత్తంగా వ్యవసాయరంగం ఎన్ని లక్షల యూనిట్లు వాడుకుంటున్నదో లెక్కగట్టవచ్చునని చెప్పారు. ఈ అంచనా కోసమైనా కొంతమంది రైతుల కరెంటు వాడకాన్ని మీటర్లు పెట్టి కొలవాలి. ఆ పని చేశారు కాని ఎలా చేశారు? కేవలం అభివృద్ధి చెందిన ప్రాంతాలలోని కొందరు పెద్దరైతులు మాత్రమే ప్రభుత్వం ఉద్దేశ్యాన్ని అనుమానించకుండా మీటర్లు తాత్కాలికంగా నెలకొల్పనిచ్చారనీ, వారి వాడకాన్నే సగటు వాడకంగా మొదట్లో తీసుకున్నామనీ, అందువల్ల కొంచెం ఎక్కువగా అంచనా వేయడం జరిగిందనీ ఇప్పుడు వివరణ ఇస్తున్నారు. అయినప్పటికీ 43 శాతం 21 శాతమెట్లయింది?

అయితే 21 శాతం కాదు కదా వ్యవసాయరంగం వాడుకునే కరెంటు 10 శాతం కంటే ఎక్కువ వుండదని విద్యుత్ బోర్డులో బాధ్యతాయుతమైన పదవులు నిర్వహించిన ఇంజనీర్ల సంఘం బాధ్యులు అంటున్నారు. 10 కాకపోతే 15 అనుకుందాం. ఇంతమాత్రానికి వ్యవసాయ రంగానికిచ్చే కరెంటు సబ్సిడీయే విద్యుత్ బోర్డును ముంచిందంటూ అంత అల్లరి ఎందుకు చేసినట్టు? ఆ అల్లరే కదా విద్యుత్ రంగ సంస్కరణలకు మూలం? దాని పేరు చెప్పే కదా విద్యుత్‌రంగ పునర్నిర్మాణాన్ని మొదలుపెట్టారు! మరి ఇప్పుడు దానిని ఏ విధంగా అర్థం చేసుకోవాలి?

ఇదంతా కాదనుకున్నా, విద్యుత్తు వంటి ప్రజావసరం విషయంలో లాభనష్టాలంటే కేవలం కోమటి పద్దుల జమాఖర్చుల లెక్కలే కాదు. అకౌంట్ పుస్తకాలలో

కనిపించని సామాజిక ప్రయోజనాలు, నష్టాలు కూడ వుంటాయి. చవక కరెంటు వెనుకబడిన ప్రాంతాలలో లక్షలాదిగా రైతుల వర్షాధార భూమిని తరి పొలంగా (కనీసం ఆరుతడి పొలంగా) మార్చి ఆ కుటుంబాల జీవితాలను మెరుగుపరిచింది. ఇప్పుడు ప్రజావసరాల విషయంలో కూడ ఖర్చు మొత్తం వినియోగదారులు భరించవలసిందేనన్న ప్రపంచ బ్యాంకు సూత్రాన్ని అమలుచేయడం మొదలుపెడితే ఈ అభివృద్ధి నిలిచి పోవడమే కాదు, వెనకడుగు వేయకతప్పదు. అప్పుడు బావుల కింద వున్న లక్షల ఎకరాల భూమి తిరిగి వర్షాధార భూమిగా మారే తిరోగామి ప్రక్రియను త్వరలో చూస్తాం. అదంతా 'అభివృద్ధిలో' భాగమేనా? నిజానికి వ్యవసాయ రంగానికి ఎంత సబ్సిడీ ఇచ్చారన్న విషయం అటుంచి, ఈ సబ్సిడీ అంతా ప్రభుత్వం ఇవ్వలేదు. కొంతభాగం పరిశ్రమల నుండి క్రాస్‌సబ్సిడీ రూపంలో వ్యవసాయానికి వచ్చింది. అంటే పరిశ్రమల నుండి కరెంటుకు ఎక్కువ వసూలు చేసి వ్యవసాయానికి తక్కువకు ఇచ్చారు. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 39(సి) లోని ఆదేశిక సూత్రానికి అనుగుణ్యమైన ఏర్పాటు. దేశాభివృద్ధి ఫలితంగా వనరులు కొద్దిమంది చేతిలో కేంద్రీకృతమై సమాజం ఉమ్మడి ప్రయోజనాలు దెబ్బతినకుండా చూడాలని ఆర్టికల్ 39(సి) అంటుంది. కరెంటు అనేది ఒక వనరు. దానిని లాభదాయకమైన రేటుకే అందరూ కొనాలంటే ఆ వనరు కొద్దిమందికే అందుబాట్లో వుంటుంది. మారుమూల గూడేలలో కూడ కరెంటు వుండడం వల్ల చదువెరుగని ప్రజలలో ఒక కొత్తతరం స్కూలుకుపోయి చదువుకోగలగడం ఏ జమాఖర్చుల లెక్కలకు అందే 'లాభం'? ఆ గూడేలకు కరెంటు పంపిణీ చేయడం ఏ డిస్ట్రిబ్యూషన్ కంపెనీకీ లాభదాయకం కాకపోవడం వల్ల ఆ బల్బులన్నీ ఆరిపోయినట్టయితే ఆ నష్టాన్ని ఏ లెక్కలు చూపగలవు? చెల్లించగలవాళ్ళ దగ్గర ఎక్కువ వసూలు చేసి, చెల్లించలేనివారికి చవగ్గా సరఫరా చేసే క్రాస్‌సబ్సిడీ అభివృద్ధిదాయకం కాకుండా ఎందుకు పోయింది?

అయినా క్రాస్‌సబ్సిడీలు మొత్తం తీసేయాలని ప్రపంచబ్యాంకు ఆదేశం. వారి ఆదేశాలను మనమెందుకు పాటించాలన్న ప్రశ్నను కొంతసేపు పక్కనబెట్టి, వారి 'ఆదేశం' పాటిస్తూ కూడ బయటి సబ్సిడీ లేకుండా క్రాస్‌సబ్సిడీ ద్వారానే వ్యవసాయానికి చవగ్గా కరెంటు సరఫరా చేసే మార్గమొకటి వుంది.

కరెంటు ఎట్లా ఉత్పత్తి చేసినా కరెంటేగానీ, ఉత్పత్తి ఖర్చులో తేడా చాలా వుంటుంది. జలవిద్యుత్ ఉత్పత్తికి అయ్యే ఖర్చు థర్మల్ విద్యుత్తుతో పోలిస్తే చాలా

చాలా తక్కువ. ఉదాహరణకు ఉత్పత్తి రంగంలో ఎ.పి.ఎస్.ఇ.బికి వారసురాలైన ఎ.పి.జెన్‌కో చేసే ఉత్పత్తిలో జలవిద్యుత్తు ఖర్చు యూనిట్‌కు కేవలం 18 పైసలు కాగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ఖర్చు యూనిట్‌కు రూ. 1.60 దాకా వుంది. ఈ రెండు రకాల విద్యుత్తును భౌతికంగా వేరువేరుగా వుంచడం కష్టం, అనవసరం కూడ. కానీ లెక్కల కోసం వాటిని వేరుగా వుంచి జలవిద్యుత్తును మొత్తం వ్యవసాయానికీ, థర్మల్ విద్యుత్తును గృహ, వాణిజ్య, పారిశ్రామిక అవసరాలకు ఎందుకు సరఫరా చేయకూడదు? వ్యవసాయానికిచ్చే కరెంటు మొత్తం కరెంటు ఉత్పత్తిలో 21 శాతం వుందనుకున్నా, జలవిద్యుత్తు మొత్తం విద్యుత్తులో అంతకంటే ఎక్కువే వుంది కాబట్టి విద్యుదుత్పత్తికయ్యే ఖర్చు ఎక్కడికక్కడ వసూలు చేసుకున్నా వ్యవసాయానికి కరెంటు చవగ్గానే ఇయ్యొచ్చు.

## ఈ సంస్కరణలు ఎందుకోసం?

**3.** ప్రపంచబ్యాంకు ఆదేశాల ప్రకారం విద్యుత్‌రంగాన్ని పునర్వ్యవస్థీకరించక తప్పదన్న చర్చ ఎక్కడ మొదలయిందో, ఎందుకు మొదలయిందో ఒకసారి జ్ఞాపకం చేసుకుందాం.

1996 మార్చి 31 నాటికి రాష్ట్రంలోని విద్యుదుత్పత్తి సామర్థ్యం 6110 మెగావాట్లు ఉండింది. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం వేసిన అంచనా ప్రకారం 2002 నాటికి ఇంకొక 8500 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం సమకూర్చుకోవలసి ఉంటుంది. ఇది చాలా పెద్ద మొత్తం. దీనికి పెట్టుబడి 35 వేల కోట్ల రూపాయలు కావలసి వుంటుందని 1997లో అంచనా వేసారు. ఇందులో 73 శాతం ప్రైవేట్ కంపెనీల నుండి, 20 శాతం విద్యుత్‌బోర్డు నుండి (అప్పటికింకా ట్రాన్స్‌కో, జెన్‌కోలు పుట్టలేదు), మిగిలినది (7 శాతం) కేంద్ర విద్యుత్ ఉత్పాదన సంస్థ అయిన ఎన్.టి.పి.సి నుండి రావాలని అంచనా వేసారు.

అంత పెట్టుబడిగానీ, అంతటి ప్రైవేట్ పెట్టుబడిని ఆకర్షించే శక్తిగానీ రాష్ట్ర ప్రభుత్వానికి లేని కారణంగా ప్రపంచబ్యాంకు సహాయం కోరుతున్నామని చెప్పారు. ప్రపంచబ్యాంకు పెట్టిన షరతులన్నిటికీ ఆ కారణంగానే ఒప్పుకుంటున్నామన్నారు. అప్పటికి సంవత్సరానికి కేవలం 5 శాతం చొప్పున అభివృద్ధి చెందుతున్న విద్యుత్ రంగం 1997-2002ల మధ్య సంవత్సరానికి 16 శాతం పెరగవలసి ఉంటుంది కాబట్టి ఆ అభివృద్ధి కోసం ఇదంతా తప్పదన్నారు.

ఇప్పుడు మనం 2002 సంవత్సరానికి ఎంతో దూరం లేము. మరి 2002 నాటికి 8500 మెగావాట్ల అదనపు ఉత్పాదన సామర్థ్యం నెలకొనే సూచనలేమైనా ఉన్నాయా? లేదు. అసలు అంత అవసరం లేదని ఎ.పి.ట్రాన్స్‌కో ఇప్పుడు ఒప్పుకుంటున్నది. 2002 నాటికి 1500 మెగావాట్ల అదనపు సామర్థ్యమే తమ టార్గెట్ అంటున్నది. నిజానికి 6110 మెగావాట్ల విద్యుదుత్పాదన సామర్థ్యానికి ఐదేళ్లలో (1996–2002) మరొక 8500 మెగావాట్ల సామర్థ్యం చేర్చవలసి వుంటుందంటే అర్థం రాష్ట్ర ఆర్థికాభివృద్ధి ఆ కాలంలో చాలా వేగం పుంజుకుంటుందని. అది అప్పటి ఊహ. ఆ ఊహతో విద్యుదుత్పాదన అవసరాల గురించి వేసిన అంచనాలకు విద్యుత్ విధానాన్నే బలిపెట్టారు. ఇప్పుడేమంటున్నారంటే 2002 నాటికి విద్యుదుత్పాదన సామర్థ్యం 1500 మెగావాట్లు పెరిగితే చాలని. ఇదేం పెద్ద సంఖ్య కాదు. దీని కోసం ప్రపంచబ్యాంకును ఆశ్రయించవలసిన అవసరం గానీ, వారి ఆదేశాల ప్రకారం విద్యుత్ రంగ సంస్కరణలు ప్రవేశపెట్టవలసిన అవసరం గానీ అంత లేదు. సరైన అంచనాలు లేకుండా ఇదంతా ఎందుకు చేసినట్టు? ఆ 'అవసరమే' ఇప్పుడు లేదంటున్నారు. మరైతే 'సంస్కరణలు' ఎందుకోసం మొదలు పెట్టినట్టు?

## తప్పుడు అంచనాలతో ప్రైవేట్‌కు ఆహ్వానం

**4.** ప్రపంచబ్యాంకు షరతులలో ప్రధానమైనదేమిటంటే విద్యుత్ బోర్డును పునర్వ్యవస్థీకరించాలి. బోర్డు ఇప్పటిదాకా నిర్వహిస్తున్న కార్యకలాపాలలోకి ప్రైవేటు రంగాన్ని ఆహ్వానించాలి.

ఈ కార్యకలాపాలు మూడు రకాలు. ఒకటి – విద్యుత్ ఉత్పత్తి, రెండు – సరఫరా, మూడు – పంపిణీ. ఇప్పటిదాకా మూడు పనులూ ఎ.పి.ఎస్.ఇ.బియే నిర్వహించేది (ఉత్పత్తి మాత్రం ఎన్.టి.పి.సి వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు కూడ చేపట్టేవి). ప్రపంచబ్యాంకు ఆదేశాలననుసరించి మొదట ఎ.పి.ఎస్.ఇ.బిని రెండుగా విడగొట్టారు. ఉత్పత్తి చేసేది ఎ.పి.జెన్‌కో, సరఫరా పంపిణీలు చేపట్టేది ఎ.పి.ట్రాన్స్‌కో. ఆ తరువాత ఎ.పి.ట్రాన్స్‌కో నుండి పంపిణీని తీసేసి, పంపిణీచేసే కార్పొరేషన్లు ప్రాంతానికొకటి నెలకొల్పుతున్నారు.

ఈ మూడు రంగాలలోకీ ప్రైవేట్ పెట్టుబడిదార్లను ఆహ్వానించాలనేది ప్రపంచ బ్యాంకు ఆదేశాలలో రెండవది. ఈ ఆదేశానికి ప్రపంచబ్యాంకు చూపించిన కారణాన్ని

పైన చెప్పుకున్నాం. శరవేగంగా ఎదగబోతున్న రాష్ట్ర ఆర్థికవ్యవస్థ 2002 నాటికి ఇంకొక 8500 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని సమకూర్చుకోవలసి ఉంటుంది కాబట్టి, అంత పెట్టుబడి రాష్ట్ర ప్రభుత్వం దగ్గర గానీ ఎ.పి.జెన్‌కో దగ్గర గానీ లేదు కాబట్టి ప్రైవేట్ పెట్టుబడిని ఆహ్వానించక తప్పదని ప్రపంచబ్యాంకు అనింది. కానీ ఆ తరువాత పునస్సమీక్షించుకున్న అంచనాల ప్రకారం 2002 నాటికి 1500 మెగావాట్ల కంటే ఎక్కువ అవసరముండదని ప్రభుత్వమే తేల్చేసింది. ఆ మాత్రం పెంపుదలకు కావలసిన పెట్టుబడి కూడ రాష్ట్ర ప్రభుత్వం దగ్గర లేదా?

ఆ విషయం పక్కనపెడితే పునస్సమీక్ష జరిగేనాటికే ఎ.పి. ట్రాన్స్‌కో 7000 మెగావాట్ల ఉత్పత్తిమేరకు ప్రైవేట్ విద్యుదుత్పత్తి కంపెనీలకు లైసెన్సులు ఇచ్చేసి కొనుగోలు ఒప్పందాలు కూడ చేసేసుకుంది. ఒప్పందాల ప్రకారం ఆ కంపెనీలన్నీ ఉత్పత్తి మొదలుపెట్టేసి ఉంటే, 1500 మెగావాట్లను మించి అక్కరలేని ఎ.పి.ట్రాన్స్‌కో ఆ విద్యుత్తునంతా ఏం చేసుకునేది? వారినుండి తప్పనిసరిగా ఫలానా మొత్తం కొనుగోలు చేస్తామన్న హామీ ఒప్పందంలో భాగమే కాబట్టి, మాకు అక్కరలేదనడానికి వీలు లేదు. అప్పుడేం చేద్దురు? ఎ.పి.జెన్‌కో చేసే ఉత్పత్తిని ఆపేసి ప్రైవేట్‌వాళ్ళ నుండే అంతా కొనుక్కుందురేమో!

ఒప్పందాలు చేసుకున్న ఏ ఒక్క కంపెనీ సకాలంలో ఉత్పత్తి మొదలుపెట్టలేదు కాబట్టి ప్రస్తుతానికి ఈ సమస్య రాలేదు గానీ రేపోమాపో తప్పకుండా వస్తుంది. ఆ ఒప్పందాల నైజమే అంత. కొన్ని కంపెనీలతోనయితే 'మీరు ఎంత ఉత్పత్తి చేస్తే అంతా కొంటాం' అని చాలా 'ఉదారంగా' రాసుకున్నారు. అట్లా కాకున్నా, తప్పనిసరిగా ఫలానా మొత్తం కొంటామని రాసుకున్నారు. ఏ సంవత్సరమైనా అంత డిమాండు లేకపోతే కొనుక్కున్న కరెంటంతా ఎ.పి.ట్రాన్స్‌కో ఏం చేసుకుంటుంది? కరెంటును గోడౌన్లలో దాచుకోలేము కాబట్టి ఎ.పి.జెన్‌కో తన ఉత్పత్తిని (అంటే శ్రీశైలం, నాగార్జునసాగర్, కొత్తగూడెం, విజయవాడ వగైరా హైడెల్, థర్మల్ స్టేషన్ల ఉత్పత్తిని) తగ్గించేయాలి. అయితే ఎంత ఉత్పత్తి చేస్తుందో తెలియని స్థితిలో ఎ.పి.జెన్‌కో ఎక్కువ కాలం ఉంటే దాని నిర్వహణ మరింత అసమర్థంగా తయారవుతుంది కాబట్టి ఏదో ఒక రోజు ఎ.పి.జెన్‌కోను మొత్తంగా మూసేసి విద్యుదుత్పత్తిని పూర్తిగా ప్రైవేట్‌పరం చేసేయక తప్పదు.

ప్రైవేట్ విద్యుత్ కంపెనీలతో ఎ.పి.ట్రాన్స్‌కో చేసుకున్న ఒప్పందాలను విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పవర్ పర్చేజ్ అగ్రిమెంట్-పి.పి.ఎ.) అంటారు. డిమాండ్ ఎంత వుండబోతుందనే విషయంలో కచ్చితమైన అంచనాలేవీ లేకుండా తప్పనిసరిగా ఒక్కొక్కరి నుండి ఇంతింత కొనుగోలు చేస్తామని ఒప్పందాలు చేసుకోవడం ఏ రకమైన విజ్ఞతో ఆ ఒప్పందాలు చేసుకున్న పెద్దమనుషులకే తెలియాలి. అయితే ఈ ఒప్పందాల దుష్ఫలితం మాత్రం పెరిగిన విద్యుత్ ఛార్జీల రూపంలో ప్రజల మీద పడుతుంది.

## ఈ ఒప్పందాల మతలబేమిటి?

**5.** నిజానికి కొనుగోలు ఒప్పందాలలోని తక్కిన షరతుల సంగతి అటుంచి, కొనుగోలు ధరే ఇప్పటిదాకా ప్రభుత్వరంగ సంస్థల నుండి కొనుగోలు చేస్తున్న ధర కంటే బాగా ఎక్కువ.

ఎ.పి.ట్రాన్స్‌కో ఖర్చులలో కరెంటు కొనుగోలు ఖర్చే 83 శాతం అని ఆ సంస్థే అంటుంది కాబట్టి కొనుగోలు ధరలోని అవకవతకలు ఎ.పి. ట్రాన్స్‌కో ఆర్థికస్థితి పైన తీవ్ర ప్రభావం వేస్తాయి. దాని ఫలితాన్ని ఎ.పి.ట్రాన్స్‌కో నుండి కరెంటు పొందే వినియోగదారులే భరించాలి.

2000-01 సంవత్సరంలో కొనుగోలు చేయబోయే కరెంటు కోసం ఏయే ఉత్పత్తిదారుకు ఎంత రేటు చెల్లించేదీ తెలిపే పట్టికను ఎ.పి.ట్రాన్స్‌కోయే విడుదల చేసింది. ప్రభుత్వరంగ సంస్థల కంటే ప్రైవేట్‌రంగ సంస్థలకు దాదాపు 50 నుండి 75 శాతం ఎక్కువ చెల్లిస్తున్నట్టు (ఒకటి రెండు కంపెనీలకు 150 శాతం పైగా ఎక్కువ చెల్లిస్తున్నట్టు) వారి గణాంకాలే తెలియజేస్తాయి.

కొనుగోలు రేట్లలోని తేడా స్పష్టంగానే కనిపిస్తుంది కదూ! అవసరం కాబోయే విద్యుత్ డిమాండును అతిగా ఊహించడం ఎందుకు? అందులో అయిదవవంతు కూడ వుండబోదని ఆ తరువాత సవరించుకోవడం ఎందుకు? ఆ లోపలే పెద్దయెత్తున ప్రైవేట్ విద్యుత్ ఉత్పత్తి కంపెనీలకు 7000 మెగావాట్ల పైచిలుకు ఉత్పత్తి సామర్థ్యం మేరకు లైసెన్సులిచ్చి కొనుగోలు ఒప్పందాలు చేసుకోవడమెందుకు? చాలా 'అసమర్థంగా' నడుస్తున్నాయని పేరు పడ్డ ప్రభుత్వ కంపెనీల కంటే అంతంత ఎక్కువ ధర పెట్టి 'సమర్థతకు' మారుపేరని చెప్పుకుంటున్న ప్రైవేట్ కంపెనీల నుండి కరెంటు

| సంస్థ | కొనుగోలు రేటు (1 యూనిట్‌కు రూ॥లలో) |
|---|---|
| **ప్రభుత్వరంగ సంస్థలు** | |
| ఎ.పి.జెన్‌కో (హైడల్) | 0.48 |
| ఎ.పి.జెన్‌కో (థర్మల్) | 1.93 |
| ఎ.పి.జెన్‌కో (మొత్తం) | 1.47 |
| కేంద్ర ప్రభుత్వ సంస్థలు | 1.64 |
| ఇతర రాష్ట్రాల విద్యుత్‌బోర్డులు | 2.05 |
| **ప్రైవేట్‌రంగ సంస్థలు** | |
| జివికె | 2.52 |
| స్పెక్ట్రమ్ | 2.50 |
| కొండపల్లి (ఓపెన్ సైకిల్) | 5.20 |
| కొండపల్లి (కంబైన్డ్ సైకిల్) | 3.72 |
| మొత్తం ప్రైవేట్ సంస్థలు | 3.05 |

కొంటామని, పైగా ఎంత ఉత్పత్తి చేస్తే అంత కొంటామని ఒప్పందాలు చేసేసుకోవడం ఎందుకు? ఆ బరువంతా ఛార్జీల పెంపుదల పేరిట ప్రజలపైన రుద్దడం ఎందుకు?

## అంకెల గారడీ

**6.** నిర్మొహమాటంగా చెప్పుకున్నట్టయితే, ధరల పెంపుదలకు ప్రధాన కారణం ప్రైవేట్ విద్యుదుత్పత్తి కంపెనీలకు ఇక్కడ పైసలు చేసుకోవడానికి మంచి అవకాశం ఉందంటూ తాయిలం అందియ్యడమే. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించబోతామని ప్రభుత్వం ప్రకటించినంత మాత్రాన పెట్టుబడి ఆ రంగంలోకి ప్రవహించడానికి ఉవ్విళ్లూరుతుందనుకుంటే పొరబాటు. ప్రైవేటీకరిస్తే చాలదు. ఆకర్షణీయమైన అవకాశాలు కూడ కల్పించాలి. ప్రజల నుండి వచ్చే డిమాండుతో నిమిత్తం లేకుండా, ప్రజల నుండి వసూలు చేయగల చార్జీలతో నిమిత్తం లేకుండా, ఫలానా మొత్తం ఫలానా ధరకు కొంటామని, పైగా ఎన్.టి.పి.సి, జెన్‌కో వంటి ప్రభుత్వరంగ సంస్థలు అమ్మే ధర కంటే బాగా ఎక్కువ ధర నిర్దేశించి హామీ ఇవ్వాలి.

ఒప్పందాలు చేసుకున్న కంపెనీలు చెప్పిన గడువు లోపల కరెంటు ఉత్పత్తి మొదలుపెట్టకున్నా, కనీసం దానికి కావల్సిన ఆర్థిక వనరులు సమకూర్చుకోకున్నా సరే వారు కోరిన వాయిదాలిచ్చి కొత్త గడువులు నిర్ణయిస్తారన్న హామీ ఇవ్వాలి. దీనివల్ల ఉత్పత్తి ఖర్చు పెరిగితే ఆ పెరుగుదలకు తగినట్టు వారి నుండి కొనుగోలు చేసే కరెంటు ధరను పెంచుతామన్న హామీ కూడ ఇవ్వాలి.

ఎ.పి. ట్రాన్స్‌కో పేరుమీద రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకున్న ప్రైవేట్ విద్యుదుత్పత్తి కంపెనీలలో ఏ ఒక్కటీ ఒప్పందంలోని గడువు లోపల ఉత్పత్తి మొదలు పెట్టలేదు. ఉత్పత్తి సంగతి దేవుడెరుగు, కనీసం పెట్టుబడులు సమకూర్చుకోలేదు. అందరికీ ప్రభుత్వం గడువులు పొడిగించింది. దీనివల్ల పెరిగిన ఖర్చంతా కొనుగోలు ధరలో భాగమయింది.

అయితే ప్రైవేట్ పెట్టుబడికి ఇంతకంటే పెద్ద ఆకర్షణని ప్రపంచబ్యాంకు, మన పాలకులు కలిసి చూపించారు. అదేమిటంటే విద్యుత్ సరఫరాలోను, పంపిణీలోను నష్టాలు (సరఫరా మరియు పంపిణీ నష్టాలు) చాలా ఎక్కువ వున్నాయని చూపించి ఎక్కువ ధర కోరే అవకాశం కల్పించడం ద్వారా కేవలం ఉత్పత్తి రంగాన్నే కాక సరఫరా, పంపిణీ రంగాలను కూడ ప్రైవేట్ పెట్టుబడికి ఆకర్షణీయంగా తయారు చేయడం.

వ్యవసాయరంగానికి ఎంత కరెంటు సరఫరా చేస్తున్నారన్న విషయంలో జరిగిన అంకెల గారడీని పైన ప్రస్తావించాము. సరఫరా, పంపిణీలలో నష్టాలు ఎంత పరిమాణంలో వున్నాయన్న విషయంలో కూడ అదే రకమైన అంకెల గారడీ కనిపిస్తుంది. నిజానికి ఈ రెండూ బొమ్మా-బొరుసు లాంటివి. ఎ.పి.ట్రాన్స్‌కో సరఫరా చేసే కరెంటులో 41 శాతం మాత్రమే మీటర్లలో నమోదవుతున్నదని పైన చెప్పాము. వ్యవసాయరంగ వినియోగం, విద్యుత్ సరఫరా మరియు పంపిణీలో కలిగే నష్టాలు కలిస్తే మిగిలిన 59 శాతం అవుతుంది. ఇందులో మొదటిదెంత, రెండవది ఎంత అనే అంచనా ఎవరి దగ్గరా లేదు. అయితే ప్రపంచబ్యాంకు మన విద్యుత్‌రంగ సంక్షోభం గురించి, పరిష్కారం గురించి ప్రచారం చేయదలచుకున్న అభిప్రాయాలకు అనుగుణంగా ఈ అంకెల అంచనాలు తయారుచేసి గాలిలోకి వదులుతున్నారు.

1995-96 దాకా ఈ 59లో 43 శాతం వ్యవసాయరంగం వినియోగమేనన్నారు. వ్యవసాయానికి ఇచ్చే కరెంటు సబ్సిడీని ఒక భూతంగా చూపించడానికి ఇది పనికొచ్చింది. ఆ అవసరం తీరిపోయిన తరువాత ప్లేటు ఫిరాయించారు. 59లో అధికభాగం (38 శాతం దాకా) సరఫరా మరియు పంపిణీ నష్టాలే అనసాగారు. ఈ అంకెను ఎక్కువచేసి చూపించమని ప్రపంచబ్యాంకు బాగా ఒత్తిడి పెట్టిన సంగతి ఎ.పి.ట్రాన్స్‌కో అధికారులే ఒప్పుకుంటున్నారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు, ప్రపంచబ్యాంకు ప్రణాళికను అనుసరించి విద్యుత్‌రంగ సంస్కరణలు చేపట్టిన అన్ని రాష్ట్రాలలోనూ ఇదే జరిగింది.

విద్యుత్ సరఫరాలో సరఫరా మరియు పంపిణీ నష్టాల వాటాను ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల అధికారులు ఏ విధంగా చూపించారో తెలిపే ఈ కింది పట్టిక చూస్తే విద్యుత్ సంస్కరణల పేరిట జరుగుతున్న నాటకం అర్థం అవుతుంది.

**సరఫరా మరియు పంపిణీ నష్టాల వాటా (శాతం)**

| | **91-92** | **92-93** | **93-94** | **94-95** | **95-96** | **96-97** | **97-98** |
|---|---|---|---|---|---|---|---|
| ఆం.ప్ర | 19.3 | 19.16 | 19.05 | 18.94 | 18.9 | 32.04 | 33.06 |
| ఒరిస్సా | 24.0 | 25.25 | 22.43 | 22.00 | 46.4 | 45.01 | 39.00 |

ఒరిస్సా మన కంటే కొంచెం ముందే ప్రపంచబ్యాంకు నమూనా విద్యుత్ సంస్కరణలు మొదలుపెట్టింది. అందువల్ల ఆ రాష్ట్రంలో ఒక సంవత్సరం ముందు నుండే (1995-96 నుండే) సరఫరా మరియు పంపిణీ నష్టాలను ఎక్కువచేసి చూపించడం మొదలుపెట్టారు. మన దగ్గర అది 1996-97 నుండి మొదలయింది. అప్పటికే వ్యవసాయ బావులకిచ్చే కరెంటు సబ్సిడీ మీద దాడి చేయడం, దానిని తగ్గించకపోతే విద్యుత్‌రంగం సంక్షోభం నుండి బయట పడబోదన్న అభిప్రాయం బాగా ప్రచారం అయిపోయింది. ఆ అవసరం తీరిపోయాక ఇప్పుడు దానిని తగ్గించి సరఫరా మరియు పంపిణీ నష్టాల వాటాను పెంచి చూపించడం మొదలుపెట్టారు. అది 1996-97లో 32.04 శాతం అనీ, 1997-98 లో 33.06 శాతం అనీ అన్నారు. అయినా చాలక 1998-99లో 38 శాతం అన్నారు.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే గడిచిన మూడు సంవత్సరాలలో సరఫరా మరియు పంపిణీ నష్టాలను తగ్గించడానికి తాము అనేకరకాల కృషి చేసామనీ, 2400 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టామనీ ఎ.పి.ట్రాన్స్‌కో అంటుంది. అయినప్పటికీ ఆ నష్టాల వాటా మొత్తం కరెంటులో 32.04 శాతం నుండి 38.0 శాతానికి పెరిగింది!

ఈ అంకెల గారడీ వల్ల వాళ్ళు ఏం సాధించదలచుకున్నారని మీరు అడగవచ్చు. విద్యుత్ పరిశ్రమలో ఉత్పత్తి, సరఫరా, పంపిణీ అనే మూడు ప్రక్రియలున్నాయని చెప్పుకున్నాం. అందులో ఒక్క ఉత్పత్తి ప్రక్రియలోకి మాత్రమే ప్రైవేట్ పెట్టుబడి ఇప్పటిదాకా ప్రవేశించింది. తక్కిన రెండు ప్రక్రియలలోకి కూడ ప్రవేశించాలంటే అప్రకటిత లాభాలకు అవకాశం కల్పించాలని ప్రపంచబ్యాంకు భావించినట్టుంది. సరఫరా మరియు పంపిణీ నష్టాలు పెద్దమొత్తంలో వున్నాయని చూపించినట్టయితే వినియోగదారులకు అందించే కరెంటుకు ఎక్కువ ధర కోరవచ్చును. ప్రైవేట్‌రంగాన్ని ఆకర్షించడానికి ఇదొక తాయిలం. అందుకే సరఫరా మరియు పంపిణీ నష్టాలు ఎక్కువ చూపించమని ప్రపంచబ్యాంకు ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల విద్యుత్ శాఖలపైన చాలా ఒత్తిడి పెట్టింది. దీని వల్ల వచ్చే అప్రకటిత లాభం సాలీనా 2660 కోట్ల రూపాయలుంటుందని ఎ.పి.ట్రాన్స్‌కో ఇంజనీర్ల అంచనా!

విద్యుత్‌రంగ పునర్వ్యవస్థీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నది ఎంత మాత్రం పారదర్శకత లేని పని. సంస్కరణలకు అసలు కారణం ఒకటి, చెప్తున్నది ఒకటి. నిర్ణయాలు చేస్తున్నది ఒకరు, 'ఇది నా నిర్ణయమే' నంటున్నది వేరొకరు. ఒక నిర్ణయానికి కొన్ని రోజులు ఒక కారణం చెప్తుంది. ఆ తరువాత ఏ వివరణ లేకుండా దానిని మార్చేసి వేరే కారణం చూపిస్తుంది.

1997లో ప్రపంచబ్యాంకు మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపైన ప్రచురించిన నివేదికలోనే ఇప్పుడు మన పాలకులు అనుసరిస్తున్న అన్ని విధాన నిర్ణయాలూ ఉన్నాయి. విద్యుత్‌రంగంపైన ప్రభుత్వానికి ఉన్న గుత్తాధిపత్యాన్ని వదులుకోవాలి. విద్యుత్‌రంగంలోని అన్ని ప్రక్రియలలోకీ ప్రైవేట్ పెట్టుబడిని ఆహ్వానించాలి. దానికి మొదటిమెట్టుగా రాష్ట్ర విద్యుత్‌బోర్డును మూడుగా విడగొట్టి ఉత్పత్తి, సరఫరా, పంపిణీలకు మూడు వేరువేరు బోర్డులు నెలకొల్పాలి. అయితే ఇది కూడ మొదటి మెట్టు మాత్రమే. ఉత్పత్తిలోకి ప్రైవేట్ పెట్టుబడిని విశేషంగా ఆహ్వానించాలి. పంపిణీ

యావత్తూ ఒక సంవత్సరం తిరిగే లోపల ప్రైవేటుపరం చేయాలి. సరఫరా మాత్రమే (ఇది లాభాలొచ్చే వ్యవహారం కాదు కాబట్టి) ఎక్కువ మోతాదులో ప్రభుత్వం లేక ప్రభుత్వరంగ సంస్థల చేతిలో ఉండాలి.

వినియోగదారుల దగ్గర వసూలు చేసే ధరను ఒక్కొక్క సంవత్సరం 15 శాతం చొప్పున పెంచుకుంటూ పోవాలి. 2007 నాటికి సబ్సిడీ అనేది ఉండకూడదు. 'క్రాస్ సబ్సిడీలు' (చెల్లించగల వాళ్ల దగ్గర ఎక్కువ వసూలు చేసి, చెల్లించలేని వారికి సబ్సిడీ ఇచ్చే ఏర్పాటు) క్రమంగా తగ్గించి 2007 నాటికి పూర్తిగా తొలగించాలి. వ్యవసాయానికిచ్చే కరెంటు ధర కూడ మూడు సంవత్సరాలలోగా సరఫరా ఖర్చులో సగానికి చేరుకోవాలి. ఆ తరువాత ఖర్చుతో పూర్తిగా సమానం కావాలి. వినియోగదారులెవరైనా కానివ్వండి, వారికి కరెంటు సరఫరా చేయడానికయ్యే మొత్తం ఖర్చు చెల్లించవలసిందే.

ప్రపంచబ్యాంకు 1997లో ప్రచురించిన నివేదికతో మొదలుపెట్టి, 1999 జనవరి 25న రూపొందించిన 'విద్యుత్‌రంగ పునర్వ్యవస్థీకరణ ప్రణాళిక'లో తుది రూపం ఇచ్చిన సూచనలే ఇవన్నీ. వీటన్నిటినీ మన రాష్ట్ర ప్రభుత్వం తుచ తప్పకుండా అమలుచేస్తున్నది. దీనికి ప్రతిఫలంగా ప్రపంచబ్యాంకు ఏమిస్తున్నదంటే ఈ పునర్‌వ్యవస్థీకరణ ప్రాజెక్టుకు 4300 కోట్ల రూపాయలు (కరెక్టుగా చెప్పాలంటే 1 బిలియన్ డాలర్లు) అప్పు (8 సంవత్సరాలలో, 5 వాయిదాలలో) ఇస్తుంది. ఆ అప్పుకు షరతే పైన ఏకరువు పెట్టిన కీలకమైన విధాన నిర్ణయాల అమలు.

అంత అప్పెందుకు, అందుకోసం ఈ షరతులు ఒప్పుకోవడం ఎందుకు అని ప్రశ్నిస్తే ప్రభుత్వం ఇచ్చే జవాబేమిటో ఇదివరకే చెప్పాము. 1997-2002 మధ్య కాలంలో వినియోగదారుల నుండి విద్యుత్ డిమాండు విపరీతంగా పెరగబోతుందనీ, దానిని తీర్చడానికి 8500 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం నెలకొల్పవలసి వస్తుందనీ, అందుకోసం ఈ అప్పు అవసరమనీ, మరి అప్పుతోపాటు వచ్చే షరతులను ఒప్పుకోక తప్పదు కదా అనీ ప్రభుత్వం అంటుంది.

ఈ 8500 మెగావాట్ల అంచనా ఎవరి బుర్రలో పుట్టిందో తెలీదు. అది మరి పాలకుల అంచనా అనుకోవాలా లేక ప్రపంచబ్యాంకు అంచనా అనుకోవాలా? అసలు దానికి గల ఆధారం ఏమిటి? ఏ లెక్కల ప్రకారం ఆ సంఖ్య ఉనికిలోకి వచ్చింది?

దీనికి జవాబు ఎవరికీ తెలియదు. సంస్కరణలలో 'పారదర్శకత' లేమికి ఇదొక నిదర్శనం మాత్రమే.

ఈ అంచనాను ఆ తరువాత 1500 మెగావాట్లకు తగ్గించారనీ, అయినప్పటికీ అప్పు పాటికి అప్పు, షరతుల పాటికి షరతులు, సంస్కరణల పాటికి సంస్కరణలేనని కూడ చూసాం. అంచనాను ఎందుకు తగ్గించారు? అయిదుశాతం, పదిశాతం తగ్గిస్తే పెద్దగా ప్రశ్నించనక్కరలేదు. కానీ 8500 ను 1500కు తగ్గిస్తే అడగాల్సిందే. అయినా ఆ ప్రశ్నకు జవాబు లేదు. 8500 అంచనా పేరు చెప్పి మొదలుపెట్టిన సంస్కరణలను వాస్తవ అంచనా అందులో 19 శాతానికి పడిపోయిన తరువాత కూడ ఎందుకు అదే రూపంలో కొనసాగిస్తున్నారంటే సమాధానం లేదు. అది ప్రపంచబ్యాంకు దగ్గరా లేదు, చంద్రబాబు దగ్గరా లేదు. అయినప్పటికీ ఇద్దరూ సాంకేతికంగా అత్యాధునికమైన విశ్లేషణా విధానాలు, పనిముట్లు తమదగ్గర ఉన్నాయని, తమను విమర్శించేవాళ్లు మధ్య యుగాల సాంకేతిక స్థాయిలో ఉన్నారని ఈసడించడం మాత్రం మానుకోరు.

## కమిషన్ ఏర్పాటు చెవిలో పువ్వే

**8.** కరెంటు ఉత్పత్తి, సరఫరా, పంపిణీ రంగాలలో దిగబోయే, దిగుతున్న కంపెనీల మధ్య రాబోయే పేచీలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఒక కమిషన్‌ను నియమిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రిఫార్మ్స్ చట్టం (విద్యుత్ సంస్కరణల చట్టం) ప్రకారం విద్యుత్‌రంగం మొత్తంగా ప్రైవేట్ పెట్టుబడిదార్ల చేతిలోకి పోయినప్పటికీ, దాని నియంత్రణ మాత్రం రాష్ట్ర ప్రభుత్వం నియమించే విద్యుత్ నియంత్రణ కమిషన్ చేతిలోనే ఉంటుంది.

ఈ కమిషన్ ఏం చేస్తుంది? ఉత్పత్తిదారుల దగ్గర విద్యుత్తు కొనుగోలు చేసే దశ నుండి వాడకందార్లకు పంపిణీ చేసే దశ దాకా మొత్తంగా విద్యుత్‌రంగాన్ని ఈ కమిషనే నియంత్రిస్తుంది. ఈ కమిషన్ తన నిర్ణయాలను బహిరంగంగా తీసుకుంటుంది. ప్రతిపాదనలకు అభ్యంతరాలు ఆహ్వానిస్తుంది. బహిరంగ విచారణ జరుపుతుంది. విచారణ జరిపేందుకు ఈ కమిషన్‌కు సివిల్‌కోర్టుకుండే అధికారాలుంటాయి.

కమిషన్ ఏమేం నిర్ణయాలు చేస్తుంది? కరెంటు సరఫరా చేసే కంపెనీలకూ, పంపిణీ చేసే కంపెనీలకూ లైసెన్సులు ఇస్తుంది. వారు అనుసరించవలసిన నియమాలను లైసెన్స్‌లోనే సూచిస్తుంది. కరెంటు ఉత్పత్తి చేసే కంపెనీలతో ఎ.పి.ట్రాన్స్‌కో గానీ ఇతర సరఫరా కంపెనీలు గానీ చేసుకునే కొనుగోలు ఒప్పందాలను కూడ నియంత్రిస్తుంది. అంటే ఎంతకు కొంటారు? ఏ షరతుల ప్రకారం కొంటారు? అనే విషయాలు నిర్ణయిస్తుంది. చివరిగా, వినియోగదారులకు విక్రయించే ధరను నిర్ణయిస్తుంది. వినియోగదారులు, ఉత్పత్తిదారులు, సరఫరా చేసే కంపెనీలు, పంపిణీ చేసే కంపెనీలు అన్నీ, అందరూ కమిషన్ ఎదుటికి వచ్చి తమ అవసరాలేమిటో, కష్టాలేమిటో చెప్పుకోవాలి. కమిషన్ అందరి మాటలూ విని నిర్ణయాలు చేస్తుంది.

ఏ లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని కమీషన్ తన నిర్ణయాలు చేస్తుంది? ఏ ప్రమాణాలను అనుసరించి చేస్తుంది? చట్టం మూడు ప్రమాణాలను నిర్దేశించింది. విద్యుత్ రంగంలో పొదుపును, సమర్థతను, భద్రతను పెంపొందించడం; వినియోగదారుల ప్రయోజనాలు కాపాడడం; విద్యుత్‌రంగంలో పోటీని పెంచి ప్రైవేట్ వ్యాపారస్తులకు క్రమంగా అందులో చోటు కల్పించడం – ఇవీ కమిషన్ పాటించవలసిన ప్రధాన ప్రమాణాలు.

వినడానికి బాగుంది కదూ! కాని ఇవన్నీ పాటిస్తూ కూడ ప్రపంచబ్యాంకు ఆదేశాలను కమిషన్ ఎట్లా అమలు చేయగలదు? విద్యుత్‌రంగ పునర్వ్యవస్థీకరణకు ప్రపంచబ్యాంకు సవివరమైన ప్రక్రియను రూపొందించిందని పైన చెప్పుకున్నాం. అది 4300 కోట్ల రూపాయల అప్పుకు షరతు అని కూడ చెప్పుకున్నాం. ఆ షరతును రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా అమలు చేయడానికి సంకల్పించిందని కూడ చెప్పుకున్నాం. మరి ఇప్పుడు ఈ కమిషన్‌ను నెలకొల్పి, అందరి మాటలూ విని ఒక న్యాయస్థానం పద్ధతిలో అది విద్యుత్‌రంగానికి సంబంధించిన అన్ని నిర్ణయాలూ చేయాలని ప్రభుత్వం తీర్మానించింది కదా! కమిషన్ రెండు పనులూ ఎట్లా చేస్తుంది? ఒక పక్క విధాన నిర్ణయాలు చేస్తూ మరొకపక్క ప్రపంచబ్యాంకు ముందే ప్రకటించిన నిర్ణయాలను ఎట్లా అమలు చేస్తుంది? చేస్తుందంతే.

అందుకే దీనిని 'చెవిలో పువ్వు కమిషన్' అనవచ్చును.

## ఛార్జీలను నిర్ణయిస్తున్నదెవరు?

**9.** ఈ కమిషన్ మొన్న కొత్త విద్యుత్ ఛార్జీలు నిర్ణయించింది.

చట్టం (పైన పేర్కొన్న ఆం.ప్ర. విద్యుత్ సంస్కరణల చట్టం) ప్రకారమైతే ఈ కమిషన్‌కు వినియోగదారులు చెల్లించే ధరను నిర్ణయించే అధికారమూ ఉంది, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను నియంత్రించే అధికారమూ ఉంది. అంటే ఎ.పి. ట్రాన్స్‌కో కొనుగోలు చేసే కరెంటుకు సంబంధించిన కొనుగోలు ఒప్పందాల నియంత్రణ, ఎ.పి.ట్రాన్స్‌కో సరఫరా చేయగా పంపిణీ కంపెనీల ద్వారా ప్రజలు కొనుక్కునే కరెంటు ఛార్జీల నిర్ణయం అనే రెండు అధికారాలూ కమిషన్‌కు ఉన్నాయట. ప్రైవేటీకరణ తతంగమంతా చూస్తూనే ఉన్నాము కదా! ఉత్పత్తి ధరను ప్రభుత్వమూ కంపెనీలూ గూడుపుఠాణీగా నిర్ణయిస్తాయి. దానిపై కమిషన్‌కు ఎటువంటి అదుపు లేదు. ఇక కరెంటు ఛార్జీలను నియంత్రించే అధికారం కమిషన్‌కెలా ఉంటుంది?

మొన్నటి ఛార్జీల నిర్ణయంలో జరిగిందిదే. 7000 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం మేరకు అనేక ప్రైవేట్ కంపెనీలతో ఎ.పి. ట్రాన్స్‌కో కొనుగోలు ఒప్పందాలు అప్పటికే (అంటే ఈ కమిషన్ పుట్టకముందే) చేసేసుకుంది. ఇది సమీప భవిష్యత్తులో ఎ.పి.ట్రాన్స్‌కోకు రాగల డిమాండు కంటే చాలా ఎక్కువ కాబట్టి ఈ కొనుగోలు ఒప్పందాలు ఇంకా చాలా కాలంపాటు ఎ.పి. ట్రాన్స్‌కో చేయబోయే విద్యుత్ కొనుగోలు ఖర్చును నిర్ణయం చేసినట్టే. కొనుగోలు ఖర్చు మొత్తం కమిషన్ పుట్టకముందే నిర్ణయం చేసి అమ్మకం ధరని మాత్రం నిర్ణయించమని ప్రభుత్వం కమిషన్‌ను నెలకొల్పింది.

ముందుగా చేసేసుకున్న కొనుగోలు ఒప్పందాలు కమిషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయా అంటే అదేమీ లేదు. పొదుపు, సామర్థ్యం, వినియోగదారుల ప్రయోజనాలు అనేవన్నీ పక్కకుపోయి ప్రైవేట్ పెట్టుబడిదార్లకు ఆకర్షణీయమైన అవకాశాలు కల్పించడం ఏకైక లక్ష్యంగా పెట్టుకొని ఆ కొనుగోలు ఒప్పందాలను రూపొందించారని పైన చూసాము.

అటువంటి ఒప్పందాలను కమిషన్ చేతిలో పెట్టి 'ఇంక నువ్వు ధర నిర్ణయించు' అని ప్రభుత్వం అనింది. కమిషన్ ఎ.పి. ట్రాన్స్‌కోకు నోటీస్ ఇచ్చి 'ఎంతకు అమ్మితే నీకు గిట్టుబాటవుతుందో చెప్పు' అని అడిగింది. ఎ.పి. ట్రాన్స్‌కో సమర్పించిన లెక్కలపైన

అభ్యంతరాలుంటే తెలియజేయమని కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చి బహిరంగ విచారణ జరిపింది. కానీ చివరికి ప్రపంచబ్యాంకు అమ్మకం ధరను ఎంత పెంచమంటే అంత పెంచింది. సబ్సిడీలు ఎంత తగ్గించమంటే అంత తగ్గించింది.

అంతా పారదర్శకమేగానీ ఆదిలోనూ అంతంలోనూ మాత్రం పారదర్శకం కాదు కమిషన్ వ్యవహారం. దీనిని చెవిలో పువ్వు కమిషన్ అని ఊరికే అనలేదు.

కమిషన్ ఇచ్చిన అవకాశాన్ని పురస్కరించుకొని ఆ విచారణలో పాల్గొన్నవారు పైన చెప్పిన వాస్తవాలనే కాక, ఎ.పి.ట్రాన్స్‌కో చూపిన లెక్కలలోని అనేక అసంబద్ధమైన విషయాలను కూడ కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. భారత కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) కూడ ఎ.పి.ట్రాన్స్‌కో చేసుకున్న రెండు కొనుగోలు ఒప్పందాలను వివరంగా సమీక్షించి అవి చాలా నష్టకరమైన ఒప్పందాలని విమర్శించింది. ఈ విమర్శ కొంతమేరకు సాంకేతికం కాబట్టి దాని వివరాలలోకి మేము పోవడం లేదు గానీ అది తీవ్రమైన విమర్శ అని చెప్పకతప్పదు. కానీ విద్యుత్ నియంత్రణ కమిషన్ దానికి ఏ జవాబూ చెప్పకుండానే ప్రజలు చెల్లించవలసిన ఛార్జీలు నిర్ణయించింది. ఆ విధంగా పెరిగిన ఛార్జీల గురించే ఇప్పుడు ఆందోళన జరుగుతున్నది.

వాస్తవంలో విద్యుత్ ఛార్జీల పెంపుదల ప్రజలపై మోయలేని ఆర్థికభారాన్ని మోపడం అన్నదానికే పరిమితమైన విషయం కాదు. అది రంగాలవారీగా, రాష్ట్రాలవారీగా ప్రపంచబ్యాంకు నిర్దేశిస్తున్న సంస్కరణల అమలు అనే రాజకీయ నిర్ణయంలో భాగం. ఇందులో ప్రపంచబ్యాంకు, ప్రభుత్వం కాకిలెక్కలు, తలకిందుల తర్కం అన్నీ ఉపయోగపడ్డాయి. అవి ప్రజలని ఒప్పించలేకపోతే, ప్రభుత్వం దగ్గర ఎలాగూ లాఠీలున్నాయి. వాటినే యిప్పుడు మనం చూస్తున్నాం.

**ఎ.ఐ.ఎఫ్.టి.యు బుక్‌లెట్‌గా వచ్చింది, జూలై 2000**

*ఇది రాసిన మూడు నెలల తర్వాత విద్యుత్ ఛార్జీలను పెంచుతూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (Electricity Regulatory Commission) ఏప్రిల్ 27, 2000 నాడు జారీ చేసిన ఆర్డర్ చెల్లదంటూ వివిధ సంస్థలూ వ్యక్తులూ హైకోర్టులో వేసిన రిట్ పిటిషన్లను జస్టిస్ వెంకట్రామిరెడ్డి, ఎస్.ఆర్. నాయక్‌ల బెంచి అక్టోబర్ 16న*

కొట్టేసింది. ఆ తీర్పును పరిశీలిస్తూ బాలగోపాల్ 'విద్యుత్ ఛార్జీల తీర్పు : కోర్టు పరిధికి సంకుచిత వ్యాఖ్య' పేరుతో మానవహక్కుల వేదిక 3వ బులెటిన్ (మార్చి 2001)లో మరో వ్యాసం రాశారు. ఇందులోని చాలా విషయాలు అందులో కూడ ఉండడం వల్ల దాన్ని ఈ పుస్తకంలో చేర్చలేదు. అది 'కోర్టు తీర్పులు – అప్రజాస్వామిక ధోరణులు' అనే పుస్తకంలో వస్తుంది.



సరళీకరణ విధ్వంసం

ప్రభుత్వం అనుమతి లేకుండా కార్మికులను తొలగించడానికి వీలులేదని చట్టం అంటుంది. కాని అనుమతి లేకుండానే తొలగిస్తారు. తొలగించిన కార్మికులకు నష్టపరిహారం ఇవ్వాలని చట్టం అంటుంది. ఇవ్వరు. కాంట్రాక్టు కార్మికులను నియమించడానికి లైసెన్సు పొందాలని, లైసెన్సు లేకుండా నియమించడానికి వీలులేదని చట్టం అంటుంది. లైసెన్సు లేకుండానే నియమిస్తారు. ఫలానా పనికి ఫలానా మొత్తం కనీస వేతనం ఇవ్వాలనీ, అంతకంటే తక్కువ ఇస్తే నేరమనీ చట్టం అంటుంది. తక్కువే ఇస్తారు.

ఈ చట్ట విరుద్ధమైన ప్రవర్తనను కార్మిక శాఖ నిరోధించాలి. కానీ నిరోధించలేక పోతున్నది. నిరోధించడానికి కావలసిన అన్ని అధికారాలూ వారికి లేవు. ఉన్న అధికారాలు ఉపయోగించాలన్న ఆసక్తి వారికి తరచుగా ఉండదు. అనేక ఇతర జీవిత రంగాలలో నేరాలనూ, నేరస్థులనూ అరికట్టడానికి అట్టహాసంగా శ్రమించే రాజ్యాంగ యంత్రాంగం ఈ రంగంలో మాత్రం తనకు కావలసిన అధికారాలు సమకూర్చుకోలేదు. సమకూర్చుకున్నవి కూడ వినియోగించదు.

దీనిని సవరించకపోతే ఇన్ని చట్టాలుండీ కార్మికులకు దక్కగల భద్రత, హక్కులు స్వల్పమే.

**కె. బాలగోపాల్**

**Rs. 120/-**

మానవహక్కుల వేదిక ప్రచురణ